# వావిలాల సోమయాజులు

# సాహిత్యం-2

## నాటకాలు

ఎమెస్కో

**Vavilala Somayajulu Saahityam- 2**

**NAATAKAALU**

**వావిలాల సోమయాజులు సాహిత్యం – 2**

**నాటకాలు**

సంపాదకులు: **డా. డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ: **మార్చి, 2018**

మూల్యం: రూ. **350/–**

ISBN: 978-93-86763-67-9

ముఖచిత్రం: **స్టార్ మీడియా సర్వీసెస్,** హైదరాబాద్

టైటిల్ డిజైన్: **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ

**ఎమెస్కో బుక్స్**

1–2–7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్–500029, తెలంగాణ.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు

**ఎమెస్కో బుక్స్**

33–22–2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ–520004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866–2436643
e-mail : emescovja@gmail.com

# ముందుమాట

శ్రీ వావిలాల సోమయాజులు (19.1.1918 - 9.1.1992) గుంటూరు జిల్లా విప్రులపల్లె అగ్రహారంలో జన్మించారు. తండ్రి సింగరావధానులుగారు, తల్లి మాణిక్యాంబ గారు. నరసరావుపేట, గుంటూరులో వారి విద్యాభ్యాసం జరిగింది. భార్య కైకమ్మగారు.

సోమయాజులుగారు 1940-46 మధ్య గుంటూరులోని శ్రీ శారదానికేతన ప్రాచ్య కళాశాలలో ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆ తర్వాత 1976లో పదవీవిరమణ పొందేవరకు గుంటూరు హిందూ కళాశాలలో ఆంధ్రభాషోపన్యాసకులుగా పనిచేశారు.

సోమయాజులుగారి జీవితం పూర్తిగా సాహిత్య రచనకు, సాహిత్య ప్రచారానికే అంకితమై పోయింది. తనకు ఇరవయ్యేళ్లు నిండీ నిండకముందే సాహిత్య సంస్థలలో సభ్యుడిగా సాహిత్య సేవ ప్రారంభించారు. 1939 నుండి సాహితీ సమితి సభ్యులు. ఈ సమితికి సహాయ కార్యదర్శిగా, కార్యదర్శిగా వ్యవహరించారు. నవ్యసాహిత్య పరిషత్తుకు సహాయ కార్యదర్శి. 'ప్రతిభ' పత్రికకు రచనలను ఎంపిక చేసే నిర్ణాయక సంఘంలో సభ్యుడు. 1963-73 మధ్య ఒక దశాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులు.

సోమయాజులుగారు సంస్కృతాంధ్రాంగ్లాలలోను, హిందీలోను గొప్ప పండితులు. ఈ నాలుగు భాషల్లోనూ ఏ భాష నుండి మరే భాషలోనికయినా అనువాదం చేయగలిగిన సమర్థత కలిగినవారు. వచనాన్నే కాదు పద్యాన్ని పద్యరూపంలోనే అనువదించడంలో సిద్ధహస్తులు. ఆయన సహజంగానే కవి కావడంవల్ల అనువాదంలోనూ మూలకావ్యం లోని కవిత్వాంశను సంపూర్ణంగా ప్రదర్శించగలిగిన కవితా హృదయాన్ని సొంతం చేసుకున్నారు.

సోమయాజులుగారి సాహిత్య సృజనా జీవితం బహువిపులమైంది. ఇరవై ఏళ్ల వయస్సులోనే ప్రారంభమైన వారి సాహిత్య సేవ జీవితాంతం కొనసాగింది. ఇంత బహుళంగా రచనలు చేసిన వారి సంఖ్య చాలా తక్కువ. అందులోనూ ఇన్ని ప్రక్రియలలో రచనలు చేసినవారు మరీ అరుదు. ఆయన కవిత్వం రాశారు. అందులో పద్యరచనలూ ఉన్నాయి, గేయ రచనలూ ఉన్నాయి. అతిసాధారణ వచనాన్ని కూడా అటు పద్యంలోనూ, ఇటు గేయంలోనూ ఇమిడ్చి మనోహరంగా రచింపగలిగిన శక్తి వారిది. నాటకాలు రాశారు, నాటికలు రాశారు. పద్య నాటికలు రాశారు, గేయనాటికలు రాశారు, సంగీత రూపకాలు రచించారు. శ్రవ్య నాటికలు రాశారు. నవలలు రాశారు. ఆంగ్లం నుండి నాటకాలూ, నవలలూ అనువదించారు. వీటిలో షేక్స్పియర్ నాటకానువాదాలు తెలుగులో వావిలాల వారివే బహుజనాదరణ పొందాయి. హిందీ నుండి మహాకవి జయశంకర ప్రసాద్ కావ్యాలు 'కామాయని', 'ఆంసూ' లను అతిమధురంగా పద్యకావ్య రూపంలో అనువదించారు.

ప్రౌఢ కవి అయిఉండీ పిల్లలకోసం సరళవచనంలో నవలలూ, దేశనాయకుల, దేశభక్తుల, చారిత్రక వ్యక్తుల, కవుల జీవిత గాథలూ రచించారు.

ఆయన పద్యరచన ఎంత విపులమో గద్యరచనకూడా అంతే విపులం. కథలు, జీవితగాథలు, నాటకాలు, నవలలను పక్కన బెడితే ఆయన సృష్టించిన వ్యాస సాహిత్యం అపారం. పరిశోధనాత్మక వ్యాసాలెన్నో రచించిన సోమయాజులుగారు సృజనాత్మక వ్యాసాలూ విస్తృతంగా రాశారు. ఆయన ఎంపిక చేసుకున్న విషయాలే మనల్ని విస్మయ పరుస్తాయి. డజనుకు పైగా వ్యాసాలు వివాహం పైనే అంటే ఆయనకు ప్రజల సాంఘిక జీవనం మీద, ఆచార వ్యవహారాల మీద ఉన్న పట్టును, అవగాహనను మనం అర్థం చేసుకోవచ్చు, మూడుపదుల వయస్సులో ఆయన వాత్స్యాయన కామసూత్రాలపై సాతవాహన సంచికలో రాసిన బృహద్వ్యాసం నేటికీ పరిశోధన వ్యాసానికి ఉదాహరణ ప్రాయంగా నిలుస్తుంది. ఆయన ఏమి రాసినా అది ప్రామాణికమే. తాను చెప్పే ప్రతి విషయానికీ ఆయన ఆధారం చూపుతారు.

సోమయాజులు గారి రచనలకు మరోపార్శ్వం కూడా ఉంది. ఆధ్యాత్మికంగా భారతీయ దార్శనికతా ప్రియుడైన ఆయన బహాయీ సాహిత్యాన్ని అనువదించారు. క్రైస్తవ రచనలను అనువదించారు.

సోమయాజులుగారు ఇంగ్లీషులో కూడా కొన్ని వ్యాసాలు రచించారు.

సాహిత్యాచార్య, సాహిత్యరత్న, సాహిత్య బంధు, మధురకవి, కవి భూషణ, కుమార ధూర్జటి, పద్యవిద్యాధర వంటి అనేక బిరుదాలతో ఆంధ్ర సాహిత్యలోకం వావిలాల సోమయాజులు గారిని సమ్మానించింది. ఈ బిరుదులు ఆయన రచయితగా ఒకవైపు, సాహిత్య సేవకుడుగా మరోవైపు చేసిన కృషికి అద్దం పడతాయి.

ఐదు దశాబ్దాలకు పైబడిన సాహిత్య జీవితంలో సోమయాజులుగారు చేసిన అసంఖ్యాక రచనల్లో ఎన్నో అలభ్యంగా ఉండిపోయాయి. కొన్ని అముద్రితాలుగా ఉండిపోయాయి. లభించిన రచనల్లో ముద్రితాముద్రితాలన్నింటిని కలిపి ఇప్పుడు ఆయన లభ్యరచనల సమగ్ర సంపుటాలను ప్రచురించే ప్రయత్నం చేస్తున్నాం.

ఈ సంపుటులలో ఇది రెండవది.

నాటకం సమాహారకళ. సాహిత్యం, సంగీతం, నృత్యం ఈ మూడింటి సమ్మేళనమిది. వాస్తవానికి ఈ దృశ్యకావ్య ప్రక్రియకు శిల్ప చిత్రకళలతోనూ సంబంధం ఉంది. ఆ విధంగా లలితకళా సమాహారం అది. అందువల్లే 'కావ్యేషు నాటకం రమ్యం' అనే సూక్తి ఏర్పడింది. శ్రవ్యకావ్యరచన కంటే దృశ్యకావ్య రచనకు కావలసిన సామర్థ్యాలెక్కువ. సోమయాజులుగారు చేయి తిరిగిన నాటక కర్త. విశ్వవిఖ్యాత నాటక కర్త షేక్స్పియర్ నాటకాలను అనువదించడమేకాకు స్వయంగా అనేక నాటక రచనలు చేశారు. వీటిలో మూడు వసంతసేన, నాయకురాలు, డాక్టరు చైతన్యం బృహన్నాటికలు. ఆయన దృశ్యాలుగా విభజించుకొని చేసిన ఈ రూపకాలను నాటికా విభాగంలోకి చేర్చవచ్చు. 'వసంతసేన' మూలం భాసుడి దరిద్ర చారుదత్తం, శూద్రకుడి మృచ్ఛకటికం. 'నాయకురాలు' చారిత్రక నాటిక. 'డాక్టరు చైతన్యం' సాంఘిక నాటిక.

చారిత్రిక, సాంఘికేతి వృత్తాలు రెండూ సోమయాజులు గారికిష్టమైనవే. దేశభక్తి వంటి విలువలను, నైతిక సందేశాలను అందిస్తాయి వీరి నాటికలు. ఈ సంపుటంలో ఈ మూడు పెద్దనాటికలతో పాటు మరో పదమూడు చిన్న నాటికలు చోటుచేసుకున్నాయి.

ఈ సంపుటంలోనే సోమయాజులుగారి ఎనిమిది గేయ నాటికలు కూడా ఉన్నాయి. గేయాన్ని దృశ్యరూపక ప్రక్రియకు ఆయన చక్కగా మలిచారు.

జయదేవ మహాకవి రచించిన 'పీయూషలహరి' గోష్ఠీ రూపకాన్ని సోమయాజులు గారు అనువదించారు. భావ, శబ్ద సౌందర్య సంపన్నమైన జయదేవుని రచన సామాన్యకవులకు లొంగేది కాదు. సోమయాజులు గారు మూల కావ్య సౌందర్యాన్ని అనువాదంలోనూ నిక్షేపిస్తూ తమ కవితా ప్రతిభను చాటుకున్నారు. మూలంతో పోల్చుకోవడానికీ, అనువాదంతో పాటు మూలాన్నీ ఆస్వాదించడానికీ మూలకృతిని కూడా దీనితో పొందుపరచడం వారి సహృదయానికి నిదర్శనం.

**డి. చంద్రశేఖర రెడ్డి**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | నాయకురాలు | 9-100 |
| 2. | వసంతసేన | 101-212 |
| 3. | డాక్టరు చైతన్యం | 213-302 |
| 4. | ఏకాంకికలు | 303-510 |
| 5. | పీయూషలహరి | 511-562 |
| 6. | గేయనాటికలు | 563-647 |

# నాయకురాలు

**(ఐతిహాసిక నాటకము)**

సాహితీ సమితి 1944

# ప్రవేశిక

క్రీ.శ. 12వ శతాబ్ది మధ్యభాగం. హైహయ వంశస్థుడైన అలుగురాజు పలనాటి రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవాడు. చందవోలు రాజధానిగా ఆంధ్రదేశాన్ని ఏలుతూ ఉన్న వెలనాటి చోళరాజు పుత్రిక, మైలమ మహాదేవి, అతని దేవేరి. పలనాటి రాజ్యాన్ని తండ్రి ఆమెకు అరణంగా ఇచ్చాడు. భర్త దానికి పాలకుడైనాడు. విజ్జలదేవీ, భూరమాదేవీ అలుగురాజుకు ఇతర భార్యలు.

ముగ్గురిని వివాహమాడినా అలుగు రాజుకు చాలాకాలం సంతానం కలుగలేదు. మంత్రి దొడ్డయ జ్యేష్ఠ పుత్రుడు, బాదన్నను పెంచుకున్నాడు. దైవ వైపరీత్యం వల్ల దత్తస్వీకారానంతరం రాజుకు ముగ్గురు భార్యల వల్లా సంతానం కలిగింది. మైలమ దేవికి నలగామరాజూ, భూరమాదేవికి నరసింగరాజూ, విజ్జలదేవికి మలిదేవాదులూ జన్మించారు.

నలగామరాజు బాల్యంలో అలుగురాజు రాజ్యాన్ని రెండుగా విభజించి ఒకభాగం పెంచుకున్న బాదన్నకూ, మరో భాగం నలగామరాజుకూ చెందేటట్లు చూడవలసిందని ఆనాడు మంత్రిత్వం నెరపుతూ ఉన్న దొడ్డయ మంత్రి ద్వితీయ పుత్రుడు బ్రహ్మనాయునితో చెప్పి స్వర్గస్థుడైనాడు. తరువాత కొలది కాలానికే తన రాజ్యభాగాన్ని మలిదేవాదులకిచ్చి బాదన్న మరణించాడు.

అలుగురాజు కుమాళ్ళనందరినీ సమానాదరంతో సాకుతూ బ్రహ్మనాయుడు కొంతకాలం రాజ్యచక్రం త్రిప్పి 'పలనాటి కిష్టయ్య' అనే ప్రఖ్యాతి గడించాడు. ఇంతలో నలగాముడికి యౌవనోదయమైంది. ఒకనాడు వేటకు పోయి ఎత్తిపోతల అడవుల్లో నాగమ్మ (నాయకురాలు)ను చూచి రాజధానికి ఆహ్వానించాడు.

నాగమ్మ ఒక రెడ్డి రైతు కుమార్తె. బ్రహ్మనాయుడు, నలగామరాజూ, పూర్వమే నాగమ్మ తండ్రిని ఏదో రాజనేరం కారణంగా ఉరికంబాని కెక్కించారు. ప్రతీకార వాంఛతో ఆమె రాజు ఆహ్వానాన్ని అంగీకరించి రాజధాని చేరింది. క్రమక్రమంగా ప్రాపకం అభివృద్ధి చేసుకొని మహామంత్రిణిగా మారిపోయింది. అన్నదమ్ముల్లో

అంతఃకలహాలు పెంచింది. మాచర్లను మరొక రాజధానిగా చేయించి మలిదేవాదులను, బ్రహ్మనాయని, గురిజాలలో లేకుండా పంపించింది. ఏటేటా వారు గురిజాలకు వచ్చి నలగామరాజు ఆధిపత్యాన్ని అంగీకరించి కప్పం కట్టేటట్టు నిర్ణయించింది.

మలిదేవాదులకు రక్షకుడుగా బ్రహ్మన్న కొంతకాలం మాచర్ల రాజ్యాన్ని పాలిస్తూ ఉండగా – ఏ పక్షం ఓడిపోయినా ఏడేండ్లు రాజ్యం వదిలిపెట్టి అరణ్యవాసం చేసేటట్లు – పణం పెట్టి అతనిచేత కోడిపందాలకు ఒప్పించి మోసంచేసి నాగమ్మ గెలిచింది.

అష్టకష్టాలు పడి అరణ్యవాసం పూర్తిచేసుకొని వచ్చిన మలిదేవాదులకు తిరిగి మాచర్ల రాజ్యమివ్వమన్న బ్రహ్మన్న కోరికను ఆమె నిరాకరించింది. రాయబారాలమీద రాయబారాలు నడిచినవి. ప్రయోజనం లేకపోయింది. ఉభయ పక్షాలూ యుద్ధమేనని నిశ్చయించుకున్నవి. కారెంపూడి కదనరంగమే! ఆంధ్ర కురుక్షేత్రం!! అదే ఆంధ్ర వీరభారత యుద్ధం!!

# పాత్రలు

**పురుషులు**

**బ్రహ్మనాయుడు:** మలిదేవుని మహామంత్రి

**కొమ్మరాజు:** సేనాపతి, నలగాముని వియ్యంకుడు

**అలరాజు:** కొమ్మరాజు కుమారుడు

**కన్నమదాసు:** బ్రహ్మనాయని పెంపుడు కొడుకు

**బాలచంద్రుడు:** బ్రహ్మనాయని పుత్రుడు

**మలిదేవుడు:** విజ్జలదేవి ప్రథమ పుత్రుడు, మాచర్ల రాజ్యాధిపతి

**నలగామరాజు:** మైలమదేవి పుత్రుడు

**నరసింగరాజు:** రమాదేవి పుత్రుడు

**కేతరాజు:** ధరణికోట యువరాజు

**రణభట్టు:** బ్రహ్మనాయుని సైనికుడు

**కొండుభట్టు :** నలగామరాజు రాయబారి

**స్త్రీలు**

**నాగమ్మ:** నాయకురాలు, నలగామరాజు మహామంత్రిణి

**మాంచాల:** బాలచంద్రుని భార్య

**పేరిందేవి :** అలరాజు భార్య

జంగిలీ, సేవకులూ సైనికులూ

# ఒకటో దృశ్యం

(ఉషస్సు విరిసిపోయి అరుణోదయం అవుతూవున్న సమయం. వీర మేడపిలో బ్రహ్మనాయని కార్యాలోచనా మందిరము. ఒకవైపు నాయకురాలి చిత్రపటము. రెండో ప్రక్క చెన్నకేశవ స్వామి అలంకృతమైన దారు విగ్రహము, సభ్యులకోసం అమర్చిన ప్రత్యేక మృత్తికా వేదికలూ)

**బ్రహ్మన్న :** (దీర్ఘంగా నిశ్వాసం చేసి సాలోచనతో) కొమ్మన్న బావా! నా మనసిప్పుడు ప్రళయానంతరం పునఃసృష్టికి పూనుకొన్న బ్రహ్మదేవుడి మనస్సులా ఉంది. కట్టటం మొదలు పెట్టిన ఆశాసౌధాలల్లో పోనీ ఒక్కటైనా నిలవ కూడదూ? అయినా, మళ్ళీ మళ్ళీ కొత్తవి ప్రారంభిస్తూనే ఉన్నాను. (నిశ్చయ సూచకంగా) ఇది చిట్టచివర ప్రయత్నం. ఈ బ్రహ్మన్న భావి జీవితం దీనిమీదనే ఆధారపడి ఉంటుంది బావా!

**కొమ్మన్న :** (సాభిప్రాయంగా) బ్రహ్మన్న భావి జీవితమే కాదు, పలనాటి భావి భాగ్యోదయమంతా దీనిమీదనే.

**బ్రహ్మన్న :** మన అలరాజు రాయబారంతో అన్నీ తేలిపోవాలి. లేకపోతే ఇక –

(చెన్న కేశవ ఆలయం దిగుడు బావిలో స్నానం చేసి స్వామిదర్శనార్థం వచ్చిన మొదటి భక్తుడు మ్రోగించిన ఘంటికా నినాదం వినిపిస్తుంది)

**కొమ్మన్న :** అదిగో! చెన్నకేశవాలయ ఘంటిక చెప్పి వేస్తున్నది. సర్వమూ కుదుట బడుతుంది. తప్పదు. (వాతాయనం వైపుకు నడిచి) ఉషఃకాంతులు విరిసిపోయినవి. అలరాజు ప్రయాణ సన్నాహం పూర్తిచేసుకొని బయలుదేరుతుంటాడు.

**బ్రహ్మన్న :** (మంద మందంగా) సుముహూర్తం సమీపిస్తున్నకొద్దీ హృదయంలో కలత ప్రబలిపోతున్నది. ఆలోచనా వ్యగ్రతలో రాత్రంతా నిద్రపట్టింది కాదు. నిద్ర! ఇంతలో నాకెక్కడి నిద్ర! కళ్ళు కమ్మని నిద్రపోయి ఏడు ఏండ్లకు పైబడ్డది.

**ఇమ్మహి వల్లభుండు మనుజేశ్వరుడై పలనాటి సీమర**
**మ్యమ్ముగ నేలుకొంచు ప్రజలందరు సర్వసుఖాల మున్గి రా**

**జ్యమ్ము సుభిక్షమై వెలియిబాలిన వేళల జూచినప్పుడే**
**కమ్మని నిద్రకు గలవు కన్నులు – అట్టి దినమ్ములున్నవా?**

మలిదేవరాజు మాచర్ల అర్ధసింహాసనం అధిష్ఠించి 'అన్నా! బ్రహ్మాన్నమంత్రీ!' అని పిలుస్తుంటే ఈ అంజలి హర్షాశ్రువులతో నిండే దినాలు ఉన్నవా (రెండు చేతులతో తలనొక్కుకుంటూ, ఉష్, ఎందుకో అప్రయత్నంగా బుద్ధి వినోదం మీదికి పోతున్నది.

**(ఒకదానివెంట మరొక కోడికూత వినిపిస్తుంది)**

**కొమ్మన్న :** (వేగంతో) ఎవరురా అక్కడ?

(ఒక సేవకుడు ప్రవేశించి బ్రహ్మన్న కొమ్మన్నలకు ప్రణామం చేసి నిలబడుతాడు)

ఆ కూసిన కోళ్లలో ఒకటి పుంజు, రెండోది పెట్ట. పిలిపించనా, వినోదం చూద్దురుగాని?

**బ్రహ్మన్న :** (తిక్తస్మితంతో) ఒకటి పుంజు, రెండోది పెట్ట. పుంజు బ్రహ్మన్న. పెట్ట నాయకురాలు, నాగమ్మ. చూడవలసినదేముంది? ఇంతవరకూ పెట్టే గెలిచింది. ముందేమి జరుగుబోతుందో ఇప్పుడే నిర్ణయం చేయదలచు కున్నారా? గౌతమ మహర్షిని మోసగించి ధర్మరాజ్యం పోగొట్టింది కుక్కుటము!

బ్రహ్మన్న చేతిలో సమస్త సంపదలతో తులతూగే అర్ధరాజ్యాన్ని పోగొట్టింది కుక్కుటము!!

కోళ్ళ సంగతితో వెనుకటిసంగతులన్నీ జ్ఞప్తికి తెచ్చారు బావా! కుటిల తంత్రజ్ఞురాలు మాంత్రికురాలు, నాయకురాలు మోసగించి ఒప్పించిన కోళ్ళపందానికే ఒప్పుకోక పోతే –

**కొమ్మన్న :** (అందుకొంటూ) మాచర్ల అర్ధరాజ్య సింహాసనం మీద మలిదేవ మహారాజు కాంతులు ప్రసరిస్తుండేవి. అర్ధరాజ్యానికి మంత్రులైనా అనంత మహదాంధ్రరాజ్యాన్ని స్థాపించేవారు. అయితే, కుక్కుటయుద్ధం –

**బ్రహ్మన్న :** (నిష్కర్షగా) చూడను. ఒకవేళ ఇప్పుడూ పెట్టే గెలిస్తే పుంజు బ్రహ్మన్నలో ఊపిరి పోసుకుంటూ ఉన్న ఆశ పుటుక్కుమంటుంది.

**కొమ్మన్న :** బావా! ప్రతి విషయాన్నీ తామింత బ్రహ్మాండంగా యోచిస్తారని ఈనాడు తెలిసింది. క్షమించండి, వెనుకటి కష్టకాలం స్మృతికి తెచ్చాను. (ముందుకు వచ్చి చేతులు జోడించబోతే)

**బ్రహ్మన్న :** (వారిస్తూ) సకల సేనాపతివి, సరిసాటి వాడివి. క్షమాపణా! (ముక్కుమీద వేలు వేసుకుంటాడు)

(భిక్షాటనకు బయలుదేరబోతూ ఒక పాములవాడు నాగస్వరం పట్టి వెళ్ళుతుంటాడు. బ్రహ్మన్న రిక్కించి ఆ సంగీతాన్ని వింటూ)

**బ్రహ్మన్న :** వింటున్నారా?

**కొమ్మన్న :** పిలిపించమంటారా?

**బ్రహ్మన్న :** ఈ సమయంలో నా మనస్సు దానిమీదనే లగ్నమౌతున్నది.

**కొమ్మన్న :** (ఆలోచనలో పడుతాడు)

**బ్రహ్మన్న :** ఆలస్యమెందుకు? శుభసమయానికి ముందు సర్పదర్శనమని సందేహమా?

**కొమ్మన్న :** మహామంత్రీ! నా మనస్సును చక్కగా గ్రహించారు.

**బ్రహ్మన్న :** ఆ అవ్యక్త కలస్వనంలో ఏదో ప్రబోధగీతం ఉన్నది. అంతరాత్మ వినమని ప్రేరేపిస్తున్నది. మీకు ఇష్టం లేకపోతే నేనే –

**కొమ్మన్న :** (సగౌరవముగా) అంతటి అపచారమా! లేదు లేదు. నేనే పిలిపిస్తాను. (సేవకుడితో) అబ్బీ! బ్రహ్మన్న దొర పిలుస్తున్నాడని వాణ్ణి (తీసుకోరమ్మని అంగుళీసంజ్ఞ చేస్తాడు)

**సేవకుడు :** చిత్తము

**(నిష్క్రమిస్తాడు)**

**కొమ్మన్న :** బావా! మీ ఆత్మబలం అందుకో లేనిది.

**బ్రహ్మన్న :** అదే శ్రేష్ఠమైనది. ఎన్నిటినైనా ఎదుర్కొనే శక్తినిచ్చి నడిపిస్తున్నది.

(సేవకుడు పాములవాడితో ప్రవేశించి తానూ వాడూ ఇద్దరికీ నమస్కరించిన తరువాత ప్రక్కకు తప్పుకుంటాడు. చేతులు జోడించి గడగడ వణికి పోతూ ఉన్న పాములవాడితో)

**కొమ్మన్న :** (మృదువుగా) అబ్బీ! భయము లేదురా, కూర్చో.

**పాములవాడు :** (గద్గదకంఠంతో) సి...సి...సి...త్తము

(బూర నేలమీదపెట్టి నెత్తిమీద బుట్టదించి నింపాదిగా మోకాటి తండా వేసి కూర్చున్న తరువాత)

**బ్రహ్మన్న :** అబ్బీ!

**కొమ్మన్న :** అటు తిరుగు – బ్రహ్మన్న దొర పిలుస్తున్నారు.

**పాములవాడు :** (అమాయకంగా) ఏంది దొరా! పలనాటి కిట్టయ్య ఆయెనేనా దొరా! ఓ కిట్టయ్య దొరో, దణ్ణము సామో! ఓ బెమ్మయ్య దొరో, దణ్ణము సామో!!

**బ్రహ్మన్న :** (ప్రతిగా నమస్కరించి) అబ్బీ, పాము నువ్వు చెప్పినట్టు వింటుందా?

**పాములవాడు :** (చెముడు వల్ల వినపడక పెద్దగొంతుకతో) నాది బురదమట్ట కాదు దొరా!

**బ్రహ్మన్న :** అయితే మరేమిటి?

**పాములవాడు :** నాగమదొరా... నాగమ

**బ్రహ్మన్న :** (సాలోచనుడై) ఉఁ.... నీ పేరు?

**పాములవాడు :** (చెవి రిక్కించి) నాగమదొరా... నాగమ

**కొమ్మన్న :** దొర నీ పేరే మంటున్నారురా!

**పాములవాడు :** నా పేరా? కాముడు దొరా!

**బ్రహ్మన్న :** (పామును చూపిస్తూ) ఇది నీకెక్కడ దొరికింది?

**పాములవాడు :** వనమూలికలకు పోతే ఎత్తిపోతల అడవుల్లో దొరికింది దొరా!

**బ్రహ్మన్న :** (సాభిప్రాయంగా తల పంకిస్తూ) ఓహో, అయితే దాన్ని కాసేపు ఆడించు.

**పాములవాడు :** అదే నన్నాడిత్తది దొరా!... సెప్పినట్టిందు.

**బ్రహ్మన్న :** చెప్పినట్టు కూడా విందూ?

**కొమ్మన్న :** అది నీ మాట విని ఆడకపోతే ఊళ్లో నీకు ముష్టి ఎవరు పెడతారురా?

**పాములవాడు :** ఒకొప్పుడు అదే నన్నాడిత్తది. తను ఆడుద్ది. మా ఆట అప్పుడు సూసిన్నోళ్ళు ఊరికే డబ్బు కురిపిత్తరు దొరా!

**బ్రహ్మన్న :** (మెడలో చిన్న హారం తీసి సేవకుడితో) ఇది వాడికిచ్చి పంపించు. (సేవకుడు ముందుకు వచ్చి హారం కళ్ళ కద్దుకొని వాడికిచ్చి) అబ్బీ, లే.

**పాములవాడు :** (బ్రహ్మానందంతో) దణ్ణం దొరా! (ముమ్మారు బ్రహ్మన్నకూ కొమ్మన్నకూ నమస్కారం చేస్తూ నిష్క్రమిస్తూ ఉండగా)

**కొమ్మన్న :** అబ్బీ, (పాములవాడు వెనక్కు తిరిగితే)

బాగా ఆడేదినం దొర ముందుకు తీసుకోవచ్చి ఆడించి చూపరా!

**పాములవాడు :** సిత్తము, సిత్తము దొరా (నిష్క్రమిస్తాడు)

**బ్రహ్మన్న :** (దీర్ఘనిశ్వాసం చేసి) చెన్నకేశవా! చెన్నకేశవా!! నీ లీలలు అతిమానుషాలు తండ్రీ. అర్థంకావు సామాన్యులకు. కాముడు చెప్పింది అంతా సత్యమే.

**కొమ్మన్న :** సత్యమేమిటి?

**బ్రహ్మన్న :** తెలియలేదా?

**కొమ్మన్న :** (తెలియదన్నట్లు తల త్రిప్పుతాడు)

**బ్రహ్మన్న :** కాముడు... నలగాముడు! నాగము... నాగాంబ నాయకురాలు... ఎత్తిపోతల అడవుల్లో దొరికిందన్నాడు.

**కొమ్మన్న :** ఔను. అతగాడు ఆమెను చూచింది కూడా ఆ అడవుల్లోనే.

**బ్రహ్మన్న :** నా అంతరాత్మ అందుకనే వినమన్నది.

**కొమ్మన్న :** అదే నన్నాడిత్తదన్నాడు. ఇంకా నాగమ్మ ప్రభావం? నాగమ్మ చేతిలో – మీ బుద్ధిబల పారావారానికి అడుగు ఎక్కడ బావగారూ!

**బ్రహ్మన్న :** (చేదుగా నవ్వుతూ) అది వట్టి పొరపాటు. నా బుద్ధి బలమా! నాయకురాలి ముందు నేనూ నా బుద్ధిబలమూ ఎంత బావా! మా ఇద్దరికీ హస్తిమశకాంతరము!

**కొమ్మన్న :** కాదు, కాదు.

**బ్రహ్మన్న :** ఎంత శక్తి, ఎంత ధైర్యము, ఎంత సాహసము, ఎంత చాకచక్యము!... నాగాంబ వంటి ప్రజ్ఞామూర్తి స్త్రీ జాతిలోనే కాదు, పురుష జాతిలో కూడా పూర్వము పుట్టలేదు, ఇకముందు పుట్టబోదు.

చాణక్య మేధావిని సృష్టించి ఛాందసుడన్న అసంతృప్తితో సుకుమారమైన స్త్రీ మూర్తిలో అతని ప్రజ్ఞ ఎలా తాండవిస్తుందో చూచి ఆనందించదలచుకున్న బ్రహ్మ తన పేరు పెట్టుకున్నానని ఆమెను ఈ బ్రహ్మన్నమీద ప్రయోగిస్తున్నాడు.

నాగమ్మ! నాగమ్మ శక్తి లోకోత్తరమైంది. అన్నదమ్ముల మధ్య అంతఃకలహాలు పెంచి అడవుల పాలు చేసింది. ఇంత బ్రహ్మన్ననూ కోడిపందెములో తిమ్మన్నను చేసింది. మలి దేవాదుల అర్ధరాజ్యాన్ని మంట కలిపింది! మహాసామ్రాజ్యానికి ఏకైక మంత్రిత్వం వహించింది.

**కొమ్మన్న :** దైవ మనుకూలించలేదు గాని బ్రహ్మన్న మాత్రము సామాన్యుడా? కాలం కలిసి వస్తే ఆయన మేధా రథచక్రాలక్రింద ఎంతమంది నాయకురాళ్ళు నలిగిపోయేవాళ్ళో! బ్రహ్మన్న ప్రజ్ఞ! అధర్మానికి లొంగదు గాని – జాతి మత వైషమ్యాలకు స్వస్తి చెప్పి పలనాటిలో పులి మేకలను, రెంటినీ ఒక్క పడియ నీరు తాగేటట్టు చేసింది బ్రహ్మన్న! పలనాటి రక్తనాళ పటిమను యావదాంధ్ర లోకానికి పునః ప్రదర్శించింది బ్రహ్మన్న! ప్రజా చైతన్యాన్ని జాగృతం చేసి పాషండ ప్రభుత్వాన్ని అహింసా తత్వంతో ఎదుర్కొనే శక్తి నిచ్చింది బ్రహ్మన్న!!

**బ్రహ్మన్న:** ఏమైతే ఏం ప్రయోజనం? నా ప్రయత్నాలన్నీ అడవిలో కాచిన వెన్నెలలైపోతున్నవి. ఒకవంక ప్రజల అష్టకష్టాలు మరొకవంక మలిదేవుల మహాపదలు. ఎదుర్కోవలసిన శత్రువో మేధాపరిపూర్ణ మృగేంద్రము. సాధనము అహింస! అహింస!!

**కొమ్మన్న :** వీటన్నిటినీ మించిన మీ మేధాబల మున్నదని మా నమ్మకము.

**బ్రహ్మన్న :** మీ ఒక్కరి నమ్మకమేనా? లేక –

**కొమ్మన్న :** నా నమ్మకమే దేశమంతటి నమ్మకము.

**బ్రహ్మన్న :** నన్ను దేశం అంతగా నమ్మిందా? ఎప్పుడూ నా శక్తిమీద నాకంతటి నమ్మకం కలుగలేదు.

**కొమ్మన్న :** ఇది నా ముందు నాటకమా? లేక మహామంత్రుల వారి బేలతనమా!

(భైరవ గదతో, కాలిగండ పెండేరంతో, పలకలు తిరిగిన కండరాలతో కన్నమదాసు ప్రవేశించి)

**కన్నమ :** ఏమిటి? నా తండ్రి బ్రహ్మన్నకే బేలతనమా?

> **ఎన్నడు సోకనట్టి పలు కీచెవి బడ్డది వ్రయ్యదేల బ్ర**
> **హ్మన్నకె కల్గె బేలతనమన్నది – సత్యమె? కాదు, కాదు ధ**

**రోన్నతమూర్తి అతనికి యున్నదె బేలతనమ్ము! పుత్రు డీ**
**కన్నమదాసు మేన నుదు కారని నెత్తుటి కాల్వ లుండగన్ –**

(బ్రహ్మన్నతో) తండ్రీ! నమస్కారము (కొమ్మన్నతో) మామా! దీవించు.

**కొమ్మన్న :** (కన్నమను చేరి బుజం మీద చరుస్తూ) సంతోషము, కన్నమా! సంతోషము. తండ్రి బ్రహ్మన్నకు బేలతనమన్నమాట. సహించ లేక ఎంత ఆటోపం చేశావోయ్! (బ్రహ్మన్నతో) మహామంత్రీ! దేశం నిన్ను ఎలా గౌరవించి మీ అడుగు జాడల్లో నడవటానికి సంసిద్ధమైందో గమనించారా? ఈగను వాలనివ్వదు మీమీద.

**కన్నమ :** (వినయ పూర్వకంగా) క్షమించు మామా! ఎవరో తండ్రికి అపచారం చేస్తున్నా రనుకున్నాను.

**కొమ్మన్న :** తండ్రీ కన్నమా! కూర్చో...

(కొమ్మన్న తన వేదిక మీద కూర్చున్న తరువాత కన్నమదాసు తానూ వేదిక మీద కూర్చుంటాడు)

**బ్రహ్మన్న :** (శాంత గంభీర కంఠంతో) కన్నమా!

**కన్నమ :** (గౌరవ పురస్సరంగా) తండ్రీ!

**బ్రహ్మన్న :** నీవు అభ్యసిస్తూ వున్న అహింసా మార్గం ఇంత వరకూ వచ్చిందా? ఇలా ఆ దేవతను ఉపాసించటం ఎంతో కష్టం.

**కన్నమ :** (సిగ్గుతో తల వంచుకొని) సమస్త విషయాలల్లో దాన్ని పాటించ గలను. కాని, మీమీద అపచార విషయంలో నాకు ఒళ్ళు తెలియదు తండ్రీ!

**బ్రహ్మన్న :** (నింపాదిగా) మంచిది, మంచిది.

**కొమ్మన్న :** (వాతాయనం వైపు చూచి) అలరాజు రథం వచ్చేస్తున్నది., అదుగో కారుబొల్లడి డెక్కల చప్పుడు. మహారాజుకు మళ్ళా పిలుపు వెళ్ళాలా?

**బ్రహ్మన్న :** ఆయన సమయానికి వస్తామన్నారు.

(రథ మాగిన ధ్వని. కొమ్మన్న బ్రహ్మన్న లిద్దరూ లేచి ద్వార దేశం సమీపిస్తారు. రథం దిగి ద్వారం దగ్గరికివచ్చిన అలరాజు బ్రహ్మన్న కొమ్మన్నలు ఎదురువస్తే)

**అలరాజు :** మామా! ఈ ఆచారమేమిటి? మహామంత్రులు మీరు నాకు ఎదురు నడవటమా! తండ్రీ! క్షంతవ్యుణ్ణి.

**బ్రహ్మన్న :** కాదు నాయనా! నీవు నిత్యమున్న అలరాజువు కావు. మహా సామ్రాజ్య భారాన్ని నెత్తిమీది కెత్తుకొని మోయబోతున్న రాయబారివి .తండ్రి ఐనా ఎదురు నడవ వలసిందే.

**ఎదురుకు నేగుదెంచి యిటు లేటికి గౌరవమిచ్చుటంచునీ**
**మదికి కుమార! బాధ యొక మాత్రము కల్గెనె రాచకార్యమున్**
**పదిల మొనర్చి నీపయిని పంపుచు నుంటిమి రాయబారివౌ**
**దెదురుగ వచ్చినా మెటిగియే - అలరాజువె నేడు అల్లుడా!**

(బ్రహ్మన్న అలరాజు చెయ్యి అందుకొని తీసుకోవచ్చి కూర్చోబెడతాడు. మలిదేవరాజు గండ భేరుండం బోయీల ఓహోం, బీహోం కేకలు వినిపిస్తవి)

**అలరాజు :** మహారాజులవారు మలిదేవులూ వస్తున్నారు. అందరమూ ఆయనను -

(బోయీల కేకలు ఆగిపోతవి. ద్వారం దగ్గరకు మలిదేవుడు వచ్చి బ్రహ్మన్నకు నమస్కారం చేసి, కొమ్మన్నకు మందస్మితం ఇచ్చి, సస్నేహంగా అలరాజు చేయి పట్టుకొని వస్తాడు. ఎవరెవరి స్థానాలను వారు ఆక్రమించుకుంటారు).

**బ్రహ్మన్న :** ముహూర్తం సమీపిస్తున్నది. ఉపక్రమిద్దామా?

(అందరు అంగీకారాన్ని తెలియపరుస్తారు)

**బ్రహ్మన్న :** ప్రభూ మలిదేవా! ప్రారంభించండి.

మలి దేవుడు : మహామంత్రులు మీరే ఉపక్రమించండి. చివరకు నాకు తోచినవి రెండు ముక్కలు చెప్పుకుంటాను.

**బ్రహ్మన్న :** నాయనా అలరాజూ! వేరే క్రొత్తగా చెప్పవలసినది ఏమీ లేదు. శుభ సమాలోచనమంతా రాత్రే విన్నావు కదా? అయినా -

నీకు నలగామరాజులుంగారు ఎంత ఆప్తులో మలిదేవరాజులూ అంత ఆప్తులే.

**అలరాజు :** (ఛలోక్తిగా) మలిదేవరాజులుంగారి కంటే నలగాములు కొంత ఎక్కువ కదూ, పిల్లనిచ్చినవాడు. ఆమెను ఇంట్లో పెట్టుకొని నన్ను వెళ్ళగొట్టినవాడు.

**బ్రహ్మన్న :** అదుగో దుర్మార్గంలో చరిస్తున్నాడని ముందే తీర్మానించు కోవద్దు. మొదటే అలా అయితే సాధువచనాలతో సంధి పొసగించలేవు తండ్రీ! సమయాన్ని అవగతం చేసుకొని ప్రవర్తించటం మనకు అత్యవసరము.

**అలరాజు :** ఛలోక్తికన్నాను. అత్యవసరము.

**బ్రహ్మన్న :** (మందమందంగా) సౌమ్యంగానే సమయం వారు చెల్లించారు. అర్ధరాజ్యం పంచిఇమ్మని చెప్పు. అన్నదమ్ముల్లో అంతః కలహాలు దేశానికీ ప్రజకూ అపాయమని చెప్పు. నలగామ రాజులుంగారి మీద మలిదేవ రాజు గారికి ఉండుకున్న ప్రేమను ఉద్ఘాటించు. నా రాజభక్తిని విశదీకరించు.

సంధి సానుకూల పడనట్లు తోచిందా – ఈ మధ్య సభలో నాగమ్మ నలగామ రాజులుంగారి ముందే నరసింహ రాజులుంగారిని విశేషంగా పొగడిందట. అది అతణ్ణి ఉలికించనో, మనను మోసగించనో కనిపెట్టి వీలునుబట్టి భేదోపాయము ప్రయోగించు. నాయకురాలన్న ప్రతి ముక్కా జాగ్రత్తగా ఆలోచించి సమాధానం చెప్పు. అదనంగా పుచ్చుకొన్న ఆరునెలల పుల్లరీ నీవెంట తీసుకొని రా. గోవులను విడిపించమను.

**ఇంతగ చెప్పనేమిటికి? ఈవొక వేత్తవు రాజనీతి, వృ**
**త్తాంతము సర్వమున్ దెలియు, ధర్మమునం దనురక్తి నీకు, అ**
**త్యంత కృపాభరమ్ము హృదయమ్ములపై గల ఈ ప్రజాళిపై**
**స్వాంతము చల్లనై చెలగ సర్వము దిద్దుము బాంధవంబునన్.**

సమర్థుడివి. విశేషించి చెప్పవలసిన పని లేదు. చెన్నకేశవ కృపవల్ల నీ పని నెరవేరుతుంది. (దీవిస్తాడు).

**అలరాజు :** (కొమ్మన్న ముఖంగా తిరిగి) తండ్రీ!

**కొమ్మన్న :** సర్వసమర్థులు మహామంత్రులు చెప్పిన తరువాత నేను చెప్పవలసినది ఏమీ ఉండదు. అయితే మన వైషమ్యాలను మనస్సులో పెట్టుకొని మాత్రం తొందర పడవద్దు. వాళ్ల దౌర్గత్యాలను ఖండించ వలసి వస్తే వెనుదీయనూ వద్దు. వీరకొమ్మన్న కొడుకువనిపించుకో. మంచనశర్మ చెప్పాడు. నీ జన్మనక్షత్రం పుష్యమిట–ఇవాళ రోహిణి. తారాబల చంద్రబలాలు కుదిరినవట. కోడలు పేరిందేవికి నా ఆశీస్సులు.

**అలరాజు :** (మలిదేవుడి ముఖంగా తిరిగి) మహారాజా!

**మలిదేవుడు :** అలరాజూ! నాయకురాలు సంధి పొసగనిస్తుందా? పురుష ప్రయత్నం చేయక తప్పదు. ఒంటరిగా నలగామడితో అర్ధరాజ్యం సమానంగా అనుభవిస్తూ రాజ్యభోగాలల్లో తేలిపోతూ ఉండవలసిన మీ తమ్ములు అడవుల్లో అష్టకష్టాలూ

పడుతున్నారను. అయినా మీకు సాష్టాంగ దండ ప్రణామం చేస్తున్నారని చెప్పు. ప్రేమ పూర్వకంగా కౌగిలించుకొని నరసింహుని యోగక్షేమాలు తెలుసుకొనిరా.

మరో విషయం! నాయకురాలు ఘాతుకురాలు! అల్లుడివి. ఆహార విహారాల విషయములో అశ్రద్ధ చెయ్యవద్దు.

**అరుగుచు నుంటి వీ వటకు, అల్లుడ వైనను, కూర్మిలేని ఆ**
**ధరణిపతుల్ సభాసదులు ధర్మము తప్పెడు దుష్టబుద్ధు లీ**
**వెరుగుదు వేగతిన్ పలుక నే మగునో యట, కాని నీ ఋణం**
**బెరుగను ఎన్ని జన్మలకు నేనియు తీర్తుమొ లేదొ మిత్రమా!**

**(నమస్కరిస్తాడు)**

**అలరాజు :** (వారిస్తూ) ఇక బయలుదేరనా? (ఆసనం మీదినుంచి లేవబోతుంటే)

**కన్నమ :** (హస్త సంజ్ఞతో ఆపుతూ) అలరాజా! నావి రెండు మాటలు.

**అలరాజు :** (బ్రహ్మన్నతో) మామా! ఇతడెవరు?

**కొమ్మన్న :** నాయనా, వీరకన్నమ. పేరు వినలేదా? బ్రహ్మన్న మామగారి ధర్మపుత్రుడు.

**అలరాజు :** (లేచి కన్నమ దగ్గిరికి వచ్చి) అయితే మా బావగారన్న మాట. ఏవీ ఆ రెండు మాటలు బావా!

**కన్నమ :** అలరాజా, సంధి కుదిరిన పక్షంలో నా మాటలతో ప్రయోజనం లేదు.

ఏడు సంవత్సరాల గడువు దాటిపోయింది. పుల్లరి మీకివ్వము అని మాచర్ల సీమ ప్రజలు నలగాములుంగారికి తెలియపరచుకుంటే నాగమ్మ గుర్రపు దళాన్ని పంపించి ప్రజను తొక్కించిందట. ఆ సీమ అట్టుడికి పోతున్నది. ఇప్పటికైనా ఆమె బ్రహ్మన్న తండ్రి పాదం పట్టుకొని క్షమాభిక్ష వేడుకోకపోతే ప్రజల హృదయ గోళంలో జ్వలించే విప్లవ ప్రళయాగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లి ప్రభుత్వ వనాలను దహించి వేయక మానవని చెప్పు.

ఇవి బ్రహ్మన్న ధర్మపుత్రుడు కడజాతి కన్నమదాసు చెప్పిన మాటలని చెప్పు.

**ధర్మస్థాపన కాని పక్షమున నిద్రం చెంద దీ ప్రాణి హృ**
**న్మర్మస్థానములన్ శయించి ఆట సింహస్వామినై నిల్తు, మీ**

**దుర్మార్గం బిక చెల్లదంచు, పెడ బుద్ధుల్ మానుకొమ్మంచు మా**
**చర్మాజీవి హసించి చెప్పెనని రాజా ఔలుకావింపుమా!**

**అలరాజు :** నీ మాటలే చెప్పక తప్పదేమో! సెలవా?

(అందరూ హస్తసంజ్ఞ చేస్తారు. 'మీరంతా నిలవండి' అంటూ అలరాజు ద్వారం వైపు నడుస్తుంటాడు).

**బ్రహ్మన్న :** ద్వారసీమ వరకూ అనుసరించటం మా విధి నాయనా.

**అలరాజు :** (కొంత దూరం వెళ్ళి తరువాత) ఇక మీరంతా నిలవండి.

(సంధ్యా వందనం చేసుకుంటూ అర్ఘ్య ప్రదానం చేస్తూ ఉన్న బ్రాహ్మణవరుల అరుణ మంత్రం)

**"భద్రం కర్ణేభి శ్శృణుయామ దేవాః**
**భద్రం పశ్యేమా క్షభి ర్యజత్రాః**
**స్థిరై రంగైస్తుష్టు వాగ్ంస స్తనూభిః**
**వ్యశేమహి దేవహితం యదాయుః"**

అని వినిపిస్తుంది.

**బ్రహ్మన్న :** నాయనా! బ్రాహ్మణ వాక్కులు 'భద్ర'మని పలుకుతున్నవి. రథము ఎక్కు తండ్రీ!

**(అలరాజు వెళ్ళి రథం ఎక్కుతాడు. రథనేమి శబ్దమూ, కారు బొల్లడి డెక్కల చప్పుడూ).**

# రెండో దృశ్యం

(గురిజాలలో నాగమ్మ కార్యాలోచనా మందిరము. ఒక వేదిక మీద బ్రహ్మనాయుని చిత్రపటమూ, మరొక వేదిక మీద ఎడమ వయిపు ప్రళయతాండవం చేస్తూ వున్న నటరాజస్వామి విగ్రహమూ. మోకరిల్లి భక్తి భావముతో తదేక నిష్ఠతో అంజలి పట్టి)

**నాగమ్మ :** (ఉచ్చ కంఠంతో)

**జయ మృత్యుంజయ దేవ మహేశా!**
**ప్రమథాధిప భూతేశ పరేశా!!**
**త్రియంబక, త్రిపురాంతక,**
**అంధకరిపు, గంగాధర – జయ...**
**జయ పినాకి జయ కృశాను**
**హే మహేశ, వ్యోమకేశ –**
**జయ మృత్యుంజయ దేవ మహేశా!**
**ప్రమథాధిప భూతేశ పరేశా!!**

(నెమ్మదిగా లేచి ఠీవితో బ్రహ్మన్న చిత్రపటాన్ని పరికించి వికటంగా నవ్వుతూ)

బ్రహ్మన్నా! బ్రహ్మన్నా!! నీకీ నాయకురాలితోనా పగ. కాలకూట విషంతో నా చెర్లాటము. ఏనాడు నీవూ, ఈ నలగామరాజూ నా తండ్రిని ఉరికంబాని కెక్కించారో ఆనాడే కంకణం కట్టుకున్నాను.

**(ముంజేతి కంకణం వైపు జూస్తుంది).**

గొల్లగుంపులను పోగుచేసి దేశాన్ని కొల్లగొట్టి అరాజకం చేద్దామను కున్నాను. కాని మృత్యుంజయ కృప నామీద ప్రసరించింది. నలగాముడి కంటబడ్డాను. ఇక ఆట ఆడించంది మానను.

అయినా! బ్రహ్మన్నా, నీవూ అసామాన్యుడివి. అరణ్యవాస సమయంలో హత్య చేయించటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను. తప్పించుకున్నావు. మలిదేవుల అర్థ

రాజ్యాధికారం చేత పట్టావు. ప్రజల్లో విప్లవ బీజాలు మొలకలెత్తించావు. చాపకూడు, వైష్ణవ మత బోధతో వివిధ కులాలనూ ఆకర్షించావు. ఒకవేళ జయం నీకే కలిగితే కలుగవచ్చునేమో! – తుది దాకా వేధించంది మాత్రం వదలను. నిన్నూ నీ రాజకులాన్నీ రక్తపు నదులల్లో తేలాడించందే ఊరుకోను. నా తండ్రికి రక్త తర్పణం చెయ్యంది నా హృదయం శాంతించదు.

**(నటరాజ విగ్రహాన్ని ఉద్దేశించి).**

మహాదేవా! నాకు నీవే దిక్కు తండ్రీ! నా ఆశయాలను సఫలీ కృతాలు చెయ్యి తండ్రీ!

**ఆశల్ పెల్లు కలంచు నాయెద మహేశా! రక్త దాహంబటం.**
**చాశన్ చాచెడు నాల్క తండ్రి, హృదయాహ్లాదంబు రాబోదు భూ**
**మీశున్ చేత నటింప చేసినను  నాకీ కోర్కె చల్లార దే**
**కాశన్ గట్టి రణోర్వి వ్రాలి నను దీక్షాక్లుప్తి కావింపకన్ –**

(దీర్ఘంగా ఒక వేదికమీద ఉన్న ఉత్త ఒరనూ, రెండు కత్తులనూ పరిశీలిస్తూ ఉంటుంది. నరసింహరాజు ప్రవేశిస్తాడు)

**నరసింహరాజు :** మహా మంత్రిణీ! నమస్కారము.

**నాగమ్మ :** యువరాజా! ఆ ఆసన మలంకరించు.

**(నరసింహుడు ఒక వేదిక మీద కూర్చుంటాడు)**

**నరసింహ :** ఏమిటో దీర్ఘాలోచన చేస్తున్నారు.

**నాగమ్మ :** ఏమీలేదు, నాకొక సందేహం కలిగింది. తీరటం లేదు.

**(ఉత్త ఒరనూ రెండు కత్తులనూ తీసుకోవచ్చి అతనికిచ్చి)**

రెంటినీ ఒక్కమాటుగా ఉంచండి.

**నరసింహ :** (ఒరను అటూ ఇటూ త్రిప్పి పరిశీలించి) నాకర్థం కావటం లేదు.

**నాగమ్మ :** ఉంచలేరా!

**నరసింహ :** ఎలా సంభవము?

**నాగమ్మ :** నాకూ అదే సందేహం. అయితే ఏం చెయ్యాలి?

**నరసింహ :** ఒక కత్తినే ఉంచాలి. ఏ కత్తిని –

**నాగమ్మ :** ఈ కత్తినే (ఒక దానిని చూపిస్తుంది) ఈ ఒర రాజ్యం. ఈ కత్తి నరసింహ రాజులుంగారు. ఆ కత్తి నలగామరాజులుంగారు.

**నరసింహ :** (సంతోషంతో) ధన్యుణ్ణి. మహామంత్రిణీ! మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి.

> **తెలిసెను కొంత కొంతగ మదింగల మీ కృప ఎల్లవేళలన్**
> **తలుపుడు చిత్తమందు నను, దాసుడు మీకెపుడెట్టి కార్యముల్**
> **కలిగిన తీర్పగాగలడు, గర్వమెదింకను మిమ్ము కొల్చుటల్**
> **కలుగుటె యెంచ భాగ్యమది, కాడు కృతఘ్నుడు వీడు మీయెడన్**

(రెండు ఆబోతుల రంకెలూ జనకోలాహలమూ వినిపిస్తుంటవి)

**నాగమ్మ :** ఏమిటా రంకెలూ, కోలాహలమూ?

**నరసింహ :** (లేచి వాతాయనం వైపు నడిచి చూస్తూ)

రెండు ఆబోతులు హోరాహోరీగా కాట్లాడుతున్నవి.

**నాగమ్మ :** ఎవ్వరూ ఆపటానికి ప్రయత్నించటం లేదా?

**నరసింహ :** బలవంతుడు మధ్యకు –

**నాగమ్మ :** వాడు అయిపోయినాడా? లేదా?

(ఆబోతులు పెద్ద పెట్టుగా రంకెలు వేస్తుంటవి. ఒక వ్యక్తి మరణ వేదనతో 'హో' అని ధ్వని చేస్తాడు.)

**నరసింహ :** మీరు సెలవిచ్చినట్లే జరిగింది.

**నాగమ్మ :** జరక్క తప్పదు. జరగ వలసినదీ అంతే. ఇది నా మాట కాదు, మహాదేవుడి మాట.

**నరసింహ :** ఏమని?

**నాగమ్మ :** బలం గల రెండు పక్షాలు వివాదానికి దిగినప్పుడు అనవసరంగా జోక్యం కలిగించుకున్న వాళ్ళకు ప్రాణహరణము తప్పదని.

**నరసింహ :** (ఆశ్చర్యంతో) మరి అలరాజు సంధికని వచ్చాడు (క్షణకాలం ఆలోచించి) అతనికీ అంతేనా?

**అల(బ్రహ్మన్నకు నన్నకున్ కలిగె గాదా దొడ్డవాదంబు ఈ**
**యిలకై, సంధిపొసంగ వచ్చానని తానే పూని అల్లుండు మా**
**అలరాజీయెడ కేగుదెంచె, యెదలో నాకొక్క సందేహమౌ**
**అలరాజైనను తప్పిదమొ, సెలవీయంగోరెదన్ మం(త్రిణీ !**

**నాగమ్మ :** అల్లుడని మొమాటమా?

**నరసింహ :** అవసరమైతే ఆ పని (తానే చేస్తానన్నట్లు హస్తసంజ్ఞ)

**నాగమ్మ :** అత్యవసరము.

**నరసింహ :** ఎందువల్ల?

**నాగమ్మ :** యువరాజ నరసింహరాజులుంగారు మహారాజులుంగారయ్యేటందుకు.

**నరసింహ :** అది ఇందు మూలంగా ఎలా సంభవం?

**నాగమ్మ :** అలరాజు అయిపోతేగాని బ్రహ్మన్న యుద్ధానికి దిగడు. యుద్ధం సంభవిస్తేనేగాని నలగామరాజులుంగారు నలిగిపోడు. నలగామ రాజులుంగారు నలిగిపోతేగాని నరసింహ రాజులుంగారు మహారాజులుంగారు కారు. నాగమ్మ ఈ కంకణం అప్పటికి గాని విప్పటానికి వీల్లేదు. సమయాన్ని బట్టి జాగ్రత్తగా కార్యం సానుకూలం చెయ్యాలి.

**నరసింహ :** స్వవిషయంలో అశ్రద్ధ వహిస్తానా? అది అసంభవము.

(నలగామ రాజూ అలరాజూ మాట్లాడుకుంటూ ప్రవేశిస్తారు. నాగమ్మ, నరసింహరాజూ సగౌరవంగా లేచి నిలబడుతారు. మహారాజు ఆసన మలంకరించిన తరువాత అందరూ వారి వారి స్థానాల్లో కూర్చుంటారు)

**నలగామరాజు :** అది అసంభవము. అయినా మహామంత్రిణి అందుకు అంగీకరించాలి. వారి ఇష్టాన్ని అతిక్రమించడానికి వీలు లేదు.

**నాగమ్మ:** (దగ్గిరకు వస్తున్న రాజుకు ఎదురు పోయి వెనక్కు నడుస్తూ) ప్రభూ! ఈ సేవకురాలి మీద ఇంత మన్నన చూపిస్తున్నందుకు కృతజ్ఞురాలు.

**నలగామ :** నరసింహా!

**నరసింహ :** (శిరస్సు వంచి) ప్రభూ!

నలగామ  (సాభిప్రాయంగా) అలరాజు వచ్చాడు.

**నరసింహ :** ఏమండీ అల్లుడుగారూ జ్ఞప్తికున్నామా! మా మీద పూర్తిగా శీతకన్ను వేశారు.

**అలరాజు :** (నాయకురాలిని చూస్తూ) మావి ఎప్పుడూ చల్లటి కళ్ళే కాబట్టి.

**నలగామ :** బ్రహ్మన్న మహామంత్రులవారు కుశలమా?

**అలరాజు :** ప్రభువు వారిని ఎప్పుడూ స్మరిస్తూ ఉంటారు.

**నాగమ్మ :** ఇన్ని ఆపదలు ప్రభువు వారికి తెచ్చిపెట్టవలసి ఉంటే స్మరించక ఎలా తప్పుతుంది?

**నరసింహ :** తమ్ములు మలిదేవులుంగారూ, వారి తమ్ములుంగార్లూ కుశలమా?

**అలరాజు :** (నమస్కరిస్తూ) తమకుగా మీకు నన్ను నమస్కారం చేసి యోగ క్షేమాలు విచారించమన్నారు.

**నరసింహ :** (వికటంగా) ఆఁ బ్రహ్మన్న పెంచే ఆ పులి పిల్లలకు ఇంత వినయం ఎక్కడినుండి వచ్చిందోయ్ రాజూ!

**అలరాజు :** (నెమ్మదిగా ప్రశాంత చిత్తంతో) బ్రహ్మన్న మంత్రికి పులి మేకలనూ రెంటినీ ఒక పడియనీరు త్రాగించే ప్రజ్ఞ ఉంది కదూ, మరి అహింసే ఆయనకు పంచప్రాణాలు.

**నాగమ్మ :** శక్తి లేనప్పుడు అది చాలా మంచి సాధనము.

**అలరాజు :** (దెబ్బ కొడుతున్నట్లు) శక్తి ఉన్నదీ లేనిదీ పరీక్ష వస్తేనే గాని తెలియదు గదా!

**నరసింహ :** ఎవరి విషయంలోనైనా అంతే. ఎవరి హృదయాలల్లో ఏముందీ బయట పడదు.

**అలరాజు :** స్వతస్సిద్ధంగా అన్ని హృదయాలూ మంచివే, కాని అందులో అప్పుడప్పుడూ మహానాగాలు కొన్ని విషం కక్కి కలిచేస్తుంటవి.

**నలగామ :** అలరాజా! వచ్చిన పని ఇక బయట పెట్టడం మంచిది.

**అలరాజు :** తమకంతా ఇది వరకే నివేదించాను. తమరే ప్రారంభించటం సమంజసం.

**నలగామ :** (సిద్ధపడి) మహామంత్రిణీ! అలరాజు ఇప్పుడు అల్లుడు కాదు, రాయబారి.

**నాగమ్మ :** సంతోషము ప్రభూ, తమ అల్లుడుగారు ఇంతవారయినారు. తమ మీదికే–

**నలగామ :** వాళ్ళ అర్ధరాజ్యం వాళ్ళకివ్వమని –

**నరసింహ :** (అదిరిపడి) అర్ధరాజ్యమా! అడుగైనా ఇవ్వటానికి వీలు లేదు.

**నాగమ్మ :** మొదట్లో మోసం చేసి అర్ధరాజ్యం పుచ్చుకున్నారు. కోడి పందెంలో మోసానికి ప్రతిమోసం చేసి పుచ్చుకున్నాము. ఆ మాటకు వస్తే అర్ధరాజ్యానికి వాళ్ళకు అధికారమే–

**నలగామ :** మా తండ్రి కడుపున పుట్టడమే అధికారము.

**నాగమ్మ :** ఈ రాజ్యం అలుగు రాజులుంగారికి ఎలా సంక్రమించిందో కొంచెం ఆలోచించండి.

**నలగామ :** మా తల్లి మైలమమహాదేవులుంగారికి మా మాతామహులు అరణంగా ఇచ్చారు.

**నాగమ్మ :** అయితే వాళ్ళకు అధికారం లేదన్నమాటలో తప్పు లేదుగదా!

**నలగామ :** రాజ్యమంతా తల్లి గారి మూలంగా మా తండ్రి గారికి సంక్రమించింది. తండ్రి ఆస్తిని కొడుకులు సమానంగా పంచుకోవటం రాజనీతి కాదేమోగాని అసమంజసం కాదు గదా!

**నాగమ్మ :** అవును. మంచిదే.

**అలరాజు :** సంతోషము – సంతోషము.

**నాగమ్మ :** అయితే నరసింహరాజులుంగారికి కూడా మూడో వంతు పంచి పెట్టవలసి వస్తుంది.

**నరసింహ :** ప్రభువులవారు అలా చేయని అధర్మపరులా మరి.

**నలగామ :** (సందేహంలో పడ్డట్లు) అలరాజూ! దీనికి ఆ బ్రహ్మన్న ఏం సమాధానం చెపుతాడు?

**అలరాజు :** బ్రహ్మన్నమంత్రుల వారికి సమాధానం లేకపోలేదు.

**నాగమ్మ :** (కటుగ్గా) ఏమిటది?

**అలరాజు :** (ప్రశాంతముగా) మలిదేవాదులకు అర్ధరాజ్యం బ్రహ్మన్న మంత్రులవారు అడగటంలో వారు అలుగురాజులుంగారి కుమాళ్ళని కాదు. మీరు పుట్టకపూర్వమే అలుగు రాజులుంగారు బాదన్నను పెంచుకొని ఇచ్చిన అర్ధరాజ్యం ఆయన స్వర్గానికి వెళ్ళేటప్పుడు మమకారం చేత మలిదేవాదులకు ఇచ్చి పోవటంవల్ల.

**నలగామ :** ఆ బాదన్నగారికి నేను సజీవుడనై ఉండగా అటువంటి అధికారం ఉండదు.

**నాగమ్మ :** అవును ప్రభూ! ఈ సమస్త దేశానికీ రాజ్యాధికారం మీదే. ఈనాటికైనా మీరు గ్రహించారు నా మాట.

**అలరాజు :** ఆ పక్షంలో ఈ సమస్త రాజ్యం మీదా మీకు ఏ విధమైన అధికారమూ లేదని బ్రహ్మన్న మంత్రులవారి ఆక్షేపణ.

**నాగమ్మ :** (నిష్కర్షగా) ఎట్లా?

**అలరాజు :** మైలమమహా దేవులుంగారు వెలనాటి వారి ఆడబడుచు. వారికి ఈ రాజ్యం అరణంగా వచ్చింది. వెలనాటివారు కళ్యాణీ చాళుక్య వీర సోమేశ్వరుల వారికి సామంతులన్న సంగతి మరిచిపోవద్దు. బ్రహ్మన్న మంత్రులవారు సోమేశ్వరులవారి కుమార్తెను మలిదేవుల కిప్పించి వివాహం చేయించారు. ఆ సమయంలో ఈ సమస్త రాజ్యమూ చక్రవర్తులే కుమార్తెకు అరణమిచ్చారు. అయినా బ్రహ్మన్నమహామంత్రుల వారు రాజ్యాన్నంతా మలిదేవులవారి కిమ్మని మిమ్మల్నికోరటం లేదు. అర్ధరాజ్యాన్ని ఇస్తే అంతటితోటే వారిని తృప్తి పరుస్తామంటున్నారు. వారి మాటలకు మలిదేవరాజులుంగారూ ఎగర్తించరు.

**నాగమ్మ :** (చల్లగా) ఒకవేళ ఇవ్వకపోతే?

**అలరాజు :** ఏం జరుగుతుందో మీరే నిర్ణయించుకోండి.

**నరసింహ :** యుద్ధంతప్ప జరిగేది ఏముంది? ఆ క్రింద భూమీ, పైన ఆకాశమూను.

**నలగామ :** అర్ధరాజ్య మివ్వట మనేది పొసగదు.

**అలరాజు :** అంత అక్రమానికే వస్తే ఆవహం తప్పదన్న మాటే. ఒకమాట. అధికారం లేని రాజ్యాన్ని అంతా కబళిద్దామనుకోవటం దురాశ కదూ!

**నాగమ్మ :** న్యాయమూర్తి ప్రభువువారిదే దురాశా! ఇది ఎన్నడూ వినని మాట.

**నలగామ :** నేను సర్వతంత్ర స్వతంత్రుణ్ణి! రాజనీతి విశారదుణ్ణి! చాళుక్య వీర సోమేశ్వరుడి సామంతుడివని అవమానం చేసిన తరువాత అర్థరాజ్యమివ్వట మనేదే అసంభవము. కూతురికి అతడు ఈ రాజ్యాన్ని అంతా అరణంగా ఇచ్చినా నేను వదిలిపెట్టను. యుద్ధరంగంలో అతడే ఎదురు నిల్చినా నిలిచి నిలుపుకుంటాను.

**నాగమ్మ :** (కాకఎక్కించే కంఠంతో) ప్రభూ! మీలో క్షాత్రం చచ్చిపోయిందని వాళ్ళ అభిప్రాయం.

**అలరాజు :** అయితే కక్ష ఈ విధంగా పెంచుకోవలసిందేనా?

**నాగమ్మ :** ప్రభువు వారికి ఇష్టమైతే అన్నదమ్ములు అయిదుగురికీ అయిదు ఊళ్ళు ఇస్తే బాగుంటుంది.

**అలరాజు :** బ్రహ్మన్న మంత్రులవారు నన్నిక్కడికి తిరిపెమెత్తటానికి పంపలేదు.

**నరసింహ :** అయిదు ఊళ్ళుమటుకెందుకు? అడుగైనా......

**అలరాజు :** ఇవ్వరా? అంతేనా?

**నలగామ :** ఆ మాటకు వస్తే అంతే.

**అలరాజు :** ఇక మీ కక్షలు కదనరంగం తీర్చవలసిందేనా?

**నాగమ్మ :** ప్రభూ! ఈ బెదిరింపులు ఇంకా ఎంతకాలం సాగిస్తారు తెగవేసి చెప్పక?

**నలగామ :** రాజూ! వాళ్ళకు అడుగైనాఇవ్వము. ఇష్టం వచ్చింది చేసుకొమ్మను.

**అలరాజు :** పోనియ్యండి. అదనంగా మీరు తీసుకున్న ఆరు నెలల పుల్లరైనా ఇస్తారా?

**నాగమ్మ :** ఇది అడగటంలో బ్రహ్మన్న ఎత్తు ఊహించారా ప్రభూ! దీనితో అధికారం ఉన్నదీ లేనిదీ బయట పడుతుందని పైగా ఆహవరంగాన్ని నడిపించటానికి కొంతగా అది అక్కరకు వస్తుందని కూడాను.

**నలగామ :** 'పుల్లరి' ఇవ్వటానికి వీల్లేదు.

**అలరాజు :** పోనీ మా గోవులు మాకు ఇచ్చేస్తారా?

**నరసింహ :** ఆ గోవులు మీ వెందు కౌతవి? కాజేసుకోపోయిన చంద్రాయుధం అమ్మి కొన్నారు. అది మా తండ్రిగారిది. అందువల్ల ఆవులు మావే.

**అలరాజు :** (నలగామరాజు వైపు చూస్తూ) అంతేనా?

**నలగామ :** (పెడమొగంగా) ఔను.

**అలరాజు :** (ఆసనం మీది నుంచి లేచి) ఇక శాంతి వహించలేను. మీ అక్రమం మించి పోతున్నది. నేనే మీమీద యుద్ధం ప్రకటిస్తున్నాను. మామా! నీ రాజ్యం ఇక నిలవదు. నీవీ నాగమ్మ చేతిలో ఇంకా ఎన్నాళ్ళు ఆటబొమ్మవైపోతావు? ఎన్నెన్ని ఘోరకృత్యాలు చేస్తావు? పుల్లరి మీ కివ్వమని మాచర్ల సీమ ప్రజలు తెలియపరచుకుంటే నాగమ్మ గుర్రపు దళాన్ని పంపించి ప్రజను తొక్కించిందట! మాచర్ల సీమ అట్టుడికి పోతున్నది. ఆమె ఇప్పటికైనా బ్రహ్మన్న మంత్రులవారి పాదం పట్టుకొని క్షమాభిక్ష వేడుకోకపోతే విప్లవాగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లి ప్రభుత్వ వనాలను దహించి వేయక మానవు. ఇవి నా మాటలు కావు. బ్రహ్మన్నమంత్రులవారి ధర్మ పుత్రుడు కడజాతి కన్నమ దాసు చెప్పమని చెప్పిన మాటలు. మీ దురాగతాలను దేశం ఇక భరించలేదు.

**నాగమ్మ :** (కోపంతో) ప్రభూ! ఇది దౌష్ట్యం.

**అలరాజు :** దౌష్ట్యం నాదా? దుష్టంగా ప్రజాపాలన చేయించే నీది దౌష్ట్యం  చేసే రాజుది దౌష్ట్యం.

**నలగామ :** (కొద్ది కోపంతో రూక్షంగా చూస్తూ) అలరాజూ! మితిమీరవద్దు.

**అలరాజు :** మితిమీరక తప్పదు. కడుపు కలచేసే భయంకర కృత్యాలు తలపుకు వస్తుంటే మితిమీరక ఉండటం ఎట్లా?

**నలగామ :** అయితే నీ ఇష్టం వచ్చినట్లు పేలు. యుద్ధానికే నేను సిద్ధ పడ్డాడని వారితో చెప్పు.

**బెదరెడు వాడె వీడు వెరపింపగ బాలుని సంధి పేరిటన్**
**పదరగ పంపినారు నిను భ్రాతలె బంధువులే తలంప నా**
**మదిగల ప్రేమ తీరినది  మాటలతో పనిలేదు చెప్పు మా**
**కదనమె నిశ్చయమ్ము – నలగామ నృపాలుడు జోదుకాదుకో**

**(అతివేగంగా నిష్క్రమిస్తాడు)**

**అలరాజు :** నాగమ్మా! సమస్త సంపదలతో తులతూగే సారవంతమైన వసుమతిని నా జన్మదేశాన్ని ఎందుకు నీ కడుపున పెట్టుకొని పాడు చేస్తావు. అన్ని విధాల అందె వేసినదనిపించుకున్న పలనాటి సీమకు నీవు అమ్మశక్తివై అవతరించావు. నిన్ను హత మారిస్తే కాని దేశం బాగుపడదు.

**నరసింహ :** (నవ్వుతూ) అలరాజూ! కొంచెం శాంతించవోయ్.

**నాగమ్మ :** ఉఁ నేను కదూ దేశాన్ని పాడు చేస్తున్నది. వర్ణాశ్రమాలకు స్వస్తి చెప్పించి వర్ణ సంకరం చేస్తున్న బ్రహ్మన్న దేశ క్షేమం కోరేవాడూ, నేను మాత్రం దేశ విద్రోహినా?

**అలరాజు :** అందులో రవ్వంత అబద్ధం లేదు. నీవే దేశాభిమానివైతే 'హరీహరీ!' మేము దేశభక్తులమే కాదు. ముమ్మాటికీ నీవు దేశాభిమానివి కాదు. దేశద్రోహివి! దేశ విద్రోహివి! నీ బ్రతుకు దేశానికి అరిష్టదాయకము. నీ కాలినీడలు ఈ పుణ్యభూమికి కళంకం. నిన్ను కాల్చి మసి చేసి రక్తంలో కలుపుకొని త్రాగేటంత వరకూ నిద్ర పొయ్యే వ్యక్తి బ్రహ్మన్న మంత్రులవారి బలంలో ఒక్కడూ లేదు. ఆనాడు గాని మా కడుపులో చితి మంటలు చల్లారవు. నీకు మృత్యువు తప్పదు.

**(కోపంతో వేగంగా నిష్క్రమించబోతే)**

**నరసింహ :** (అడ్డుపడి నవ్వుతూ) అల్లుడూ! మామీద ఇంత కోపమైతే ఎలాగోయ్! ఇవాళ మా ఇంట విందు చేస్తేగాని పోనివ్వను.

**అలరాజు :** (వికట హాసంతో) మామా! మీరు ఎంత కైనా సమర్థులు. ఏ విషమైనా కలిపి ఇచ్చి ప్రాణాలు తియ్యవచ్చు.

**నరసింహ :** (నవ్వుతూ) శాంతించవోయ్ అల్లుడూ! కాస్త చిన్నా పెద్దను కనిపెట్టి మాట్లాడుతుండు, మరి – మేము బంధువులమని మరిచిపోకు. వ్యవహారం వ్యవహారమే. బంధుత్వం బంధుత్వమే.

**(చేతిలో చెయ్యి పుచ్చుకొని నడిపించుకుంటూ నిష్క్రమిస్తాడు)**

**నాగమ్మ :** (నటరాజస్వామి విగ్రహంతో) తండ్రీ! సమస్తమూ సక్రమంగానే సాగింది. సంధి నేను పడగొట్టించాననే అనుమానం లేకుండా నలగాముడి చేతనే ఆ పని చేయించాను. నరసింహుడు నా మాట మరిచిపోడు. అయితే అలరాజు అయిపోవటం వల్ల గొప్పలోటే. మేడ పైకి పోయి ఈ వార్తలన్నీ చెప్పి యుద్ధానికి సిద్ధపడేటట్లు

(యోచించి) ఊఁ (చిటికెలో) మంచి ఊహ తోచింది. కొందు భట్టారకులచేత బ్రహ్మన్నకు లేఖ పంపించటం ఉత్తమము. దానితో అన్ని సంగతులూ –

**నీలోతుల్ పరికింప బుద్ధి జలధీ! నీరౌను నా గుండెనా**
**లోలో సంతసమౌ నటించు భయమున్ క్రూరాతి ఘోరమ్ము నీ**
**లోలోర్మిధ్వని సర్వలోకములు కల్లోలంబులై నిల్వగన్**
**నాలో కోర్కె జనించె ఘోషలిడు మన్నా? ముక్త కంఠంబులన్!**

మహాదేవా! మహాదేవా!!

# మూడో దృశ్యం

(గురిజాల నాగమ్మ కార్యాలోచనా మందిరము. మధ్యాహ్న సమయము)

**నాగమ్మ :** (ఏకాంతముగా) మహాదేవా! అలరాజు హత్య అవసరమా? అత్యవసరము. శవాన్ని కంటిముందు చూస్తేగాని శత్రువులు తామే యుద్ధాన్ని ప్రకటించరు. నరసింహుడి చేత ఆ పని చేయించటంలో అభిప్రాయమో! సక్రమంగానే ఉంది. అన్నదమ్ములిద్దరి మధ్యా అంతః కలహాలు ఏర్పడితేనేగాని నాగాంబ ప్రాపకం వృద్ధి పొందదు. రాజ్యాన్ని ఎర చూపించాను. కాబట్టి నరసింహుడే ముందుగా ఈ విషయం నలగాముడికి చెప్పడు. ఈ సమయానికి నరసింహుడు ఆ పని పూర్తిచేసి ఉంటాడు.

**పేరిందేవి :** (విరబోసుకొన్న తలకట్టుతో ఆవేశంగా ప్రవేశించి) ఏ పని? పాతకి, హంతకి!

**నాగమ్మ :** (ప్రశాంతంగా) అమ్మాయీ! పేరిందేవి ఈ ఆక్రోశం ఎవరిమీద? ఎక్కడికో బయలుదేరి దారితప్పి ఇటు వచ్చావా?

**పేరిందేవి :** నరహంతకి నాగమ్మ ఇంటికే బయలుదేరి దారి తప్పానా?

**నాగమ్మ :** (కొంచెం కోపంతో) జాగ్రత్తగా మాట్లాడు. రాజకుమార్తెనని ఇష్టం వచ్చినట్లు – మాట్లాడుతున్నది మహామంత్రిణితో సుమా!

**పేరిందేవి :** (అసహనంతో) మహామంత్రిణితో కాదు మహమ్మారితో.

**నాగమ్మ :** ఛీ! నోరుముయ్యి. గెంటించేస్తాను.

**పేరిందేవి :** చితి మంటలలో చెర్లాట మాడబోతున్న పేరిందేవి నా గెంటింపులకు –

**నాగమ్మ :** (లాలనగా) అమ్మాయీ! సంగతేమిటో చెప్పకుండా నన్నిట్లా దూషించటం నీకు న్యాయమేనా?

**పేరిందేవి :** నా భర్తను హత్య చేయించింది నీవు కాదా?

**నాగమ్మ :** (ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ) నేనే!

**పేరిందేవి :** (వెక్కిరింపుగా) నేనే!

**జంగిలి:** (వేగంగా ప్రవేశించి) అమ్మా!

(పేరిందేవిని చూచి సంగతేమిటో బయట పెట్టటానికి జంకుతాడు)

**నాగమ్మ:** చెప్పు - నీకేమీ భయం లేదు.

**జంగిలి :** (బెదురు చూపులతో) అలరాజులుంగారిని...

**నాగమ్మ :** ఊఁ. త్వరగా (కత్తిలాగి డొక్కకు మోటిస్తుంది)

**పేరిందేవి :** (మొలలో పిడి కత్తిలాగి) ఊఁ త్వరగా -

**నలగామ :** (ఒరలో నుంచి లాగిన కత్తితో ప్రవేశించి) ఊఁ త్వరగా, అలరాజును హత్య చేసింది -

**నాగమ్మ :** (కన్నుగీటి) చెప్పు.

**నలగామ :** ఊఁ (డొక్కలో గుచ్చుతాడు)

**జంగిలి :** (నత్తిగా) న... న... న... న...

**నలగామ :** నాగమ్మా?

**జంగిలి :** (కాదన్నట్లు తల త్రిప్పుతాడు)

**నాగమ్మ :** (దీనంగా) ప్రభూ! నామీదనా మీ అనుమానం?

**నలగామ :** క్షమించు. మహామంత్రిణీ! (జంగిలితో) ఇక నిమిషం ఆలశ్యం చేస్తే చంపేస్తాను.

**జంగిలి :** న...న... నరసింగరాజులుంగారు.

**నలగామ :** (చేతిలో కత్తి ఆశ్చర్యపడుతూ జారవిడిచి) ఇదేమిటి? మహామంత్రిణీ! (పేరిందేవి చేతిలో కత్తి లాగుకొని) అమ్మా! వీడిని బలిచేసి నెత్తురు చూపిస్తాను. చూచి ఆనందిద్దువుగాని ఇక్కడనే ఉండు తల్లీ!

**(వేగంగా బయలుదేరుతాడు)**

**నాగమ్మ :** మహారాజా! కొంచెం శాంతించండి! ఇది సమయం కాదు!

**పేరిందేవి :** ఈ నాగమ్మ చెయ్యి లేకపోతే ఇలా అవదు తండ్రీ. బాబయ్య స్వయంగా-

**నాగమ్మ :** (పితూరిగా) ప్రభూ!

**పేరిందేవి :** ఈ కాల సర్పాన్ని కడుపులో పెట్టుకున్నారు. విషాగ్నుల క్రక్కి దహించిగాని ఇది బయట పడదు.

**నాగమ్మ :** లేనిపోని అనుమానాలతో ప్రభూ! నన్నిలా రాకుమార్తె ఇందాకటినుంచీ తిట్టి పోస్తున్నది. నేను ఈ రాజ్య భారాన్ని మోస్తున్నది అపనిందలకేనా? నా మనసు విసిగిపోతున్నది. ఈ మంత్రి పదవి నాకు వద్దు.

(కత్తీ, మంత్రిత్వ చిహ్నాన్ని క్రింద పెట్టబోతుంది)

**నలగామ :** (ఆశ్చర్యంతో, జంకుతో) మహామంత్రిణీ!

**పేరిందేవి :** ఈ అపరశక్తి మిమ్మల్ని ఇలాగే బెదిరించి ఆడిస్తున్నది. చివరకు ఈ శక్తి జాతరలో చింబోతు కాబోకండి.

**నాగమ్మ :** ప్రభూ ఇది భరించరాని అవమానం. నాకు సెలవు దయ చేయించండి. నేను ఎక్కడికైనా వెళ్ళిపోతాను. (కత్తీ, చిహ్నామూ అందిస్తూ) ఇంతటి అవమానమా!

**పేరిందేవి:** నిత్యమూ హత్యలు చేయించే అదయ హృదయకు నీకూ అవమానమా?

**నాగమ్మ:** ప్రభూ! మీ అలుసే దీనికి కారణం. ఎదుట పెట్టుకొని కూతురి చేత తిట్టించకపోతే క్రూరదండన మరేదైనా విధించకపోయినారా దీన్ని శిక్షించటానికి?

**పేరిందేవి:** (పట్టరాని ఉద్వేగంతో) అమ్మ గయ్యాళీ! నీవు ఎంతకైనా సాహసివే తంత్రిణీ!

**నలగామ:** (కోపంతో) అమ్మాయీ!

**పేరిందేవి :** నిన్ను ముక్కలు ముక్కలుగా ఖండించి కాకులకూ, గద్దలకూ పారేసి వినోదం చూచి సంతోషించినా నీవు చేయించిన పనికి శిక్ష చాలదే పిశాచీ!

**నాగమ్మ :** ప్రభూ! నన్ను ఎందుకిట్లా బాధపెడతారు? (కత్తీ, చిహ్నామూ మరొకమారు అందిస్తూ) అందుకోకపోతే –

**నలగామ :** (కోపంతో) అమ్మాయీ! ఇక మీరినచో సహించను.

**పేరిందేవి :** జరగవలసిందేమో ఇదివరకే జరిగింది. ఈ అపరశక్తి ఇక చేసేదేముంది?

**నలగామ :** మహా మంత్రిణీ! దానికేమీ తెలియదు. మొరకుతనం. క్షమించండి.

**పేరిందేవి :** ఏమిటీ! నన్ను క్షమించటమా! పరుల కార్యార్థం ప్రాణత్యాగం చేసిన పతితో చితిశయ్య మీద సరస సల్లాపాలాడుకోబోతున్న నన్ను ఈ అపవిత్రురాలు క్షమించటమా!

**నాగమ్మ :** వింటున్నారా ప్రభూ!

**నలగామ :** అమ్మాయీ! నీ పెడసరపు మాటలు ఇక కట్టిపెట్టు. నీకేమన్నా వెర్రి ఎత్తిందా?

**పేరిందేవి :** బుర్రలు బ్రద్దలయ్యే దినం వస్తే ఎవరికి వెర్రి ఎత్తిందీ తెలుస్తుంది. మీ రాజ్యపాలనాకాంక్ష మిమ్మల్ని పశువును చేస్తున్నది.

**నాగమ్మ :** ప్రభూ! ఇక సహించలేను. నన్ను అవమానించినా లెక్కలేదు. మీ అవమానాన్ని నా మనస్సు భరించలేదు. ఇదిగో అందుకోండి. లేదా క్రిందపెట్టి వెళ్ళిపోతాను.

**నలగామ :** (దీనంగా) మహామంత్రిణీ! మీ పదవిని పరిత్యజించటానికి సమయం ఇదేనా? మీ నలగాముణ్ణి నట్టేటిలో ముంచిపోతారా?

**నాగమ్మ :** ప్రభూ! నా కాళ్ళకు మాటలతో పాశాలు తగిలించవద్దు.

**నలగామ :** పాశాలా – పాదాక్రాంతుడై మీ రాజు వేడుకొంటున్నాడు.

**పేరిందేవి :** అబ్బ! మీరు ఇంకా ఈ నాగమ్మ నల్ల మసి పూసి ఆడించి నట్లల్లా ఆడండి. నిజం నిలకడ మీద గానీ తేలదు. నా భర్త పవిత్ర మూర్తి. నేను పవిత్రను. మా ఇద్దరికీ స్వర్గంలో స్థానమున్నది. కాని, ఈ నడమంత్రపు నాగమ్మ మీకోసం రౌరవాది నరకాలల్లో రాజ్య భవనాలు కట్టిస్తున్నది. మరిచిపోవద్దు.

**(వేగంగా నిష్క్రమిస్తుంది)**

**నలగామ:** అమ్మాయి! (వెంట వెళ్లబోతుంటే)

**నాగమ్మ:** (ఆగమన్నట్లుగా) ప్రభూ!

**నలగామ :** (వెనకకు వచ్చి) మహాదేవా! మహాదేవా!! ఈ స్థితిగతులు నాకేమీ అర్థం కావటం లేదు తండ్రీ! మహామంత్రిణీ!

**నాగమ్మ :** నాకే సంగతీ తేల్చకుండా వెళ్ళిపోతారేం?

**నలగామ :** ఏమి తేల్చమంటారు?

**నాగమ్మ :** నా రాజభక్తినే మీరు శంకించిన తరువాత ఈ మంత్రిపదవి నాకెందుకు?

**నలగామ :** నా బుద్ధిగడ్డి తిన్నది. నన్ను నట్టేటిలో ముంచవద్దు. ఇవి చేతులు కావు. మీ ఇష్టప్రకారం అడుగు దాటను.

**(వంగి చేతులు పట్టుకోబోతాడు)**

**నాగమ్మ :** (సవినయంగా) అమ్మమ్మ! అంత అపచారమా? పాపం పేరిందేవి పిచ్చిపిల్ల. ఆమె మాటలు పట్టించుకోను. మిమ్మల్ని మాత్రం అనలేదు. మీ పిల్ల నా పిల్ల కాదూ?

**నలగామ :** (చిరునవ్వుతో) మహామంత్రిణీ! సంతోషము. అయితే, నరసింహుణ్ణి చంపి ప్రతీకారం చెయ్యవద్దనటంలో... విశేషాభిప్రాయమేమిటో అర్థం –

**నాగమ్మ :** అయితే మీ శత్రువులను సంపూర్ణంగా జయించ తలచుకోలేదా?

**నలగామ :** ఏమిటి?

**నాగమ్మ :** (మంత్రాలోచనగా) ప్రధాన సైన్యాలను నడిపించేది అతడు.

**నలగామ :** అవును. అయితే?

**నాగమ్మ :** అతని మీద కసి తీర్చుకోవటానికి ఇది సమయంకాదు. శత్రు సంహారం పూర్తి అయిన తరువాత.

**నలగామ :** (అర్థమైనట్లు తల త్రిప్పుతాడు)

**నాగమ్మ :** 'అల్లుణ్ణి చంపావా' అని ఎన్నడూ సంభాషణలోనైనా హెచ్చరించవద్దు. ఏదో అవకాశం చూచుకొని అభినందిస్తే పొంగిపోయి మీరు చెప్పినట్లల్లా నడుచుకుంటాడు. (చేయి జాపుతుంది)

**(నలగామరాజు కొద్దిసేపు ఆలోచించి అంగీకార సూచకంగా చేతిలో చేయి వేస్తాడు)**

**నాగమ్మ :** కోపాన్ని ప్రస్తుతం మరిచిపోలేరా?

**నలగామ :** ప్రయత్నం విశేషం అనవసరం.

**నాగమ్మ :** (దైన్యం నటిస్తూ) ప్రభూ! నా రాజభక్తిని ఎంత శంకించారు?

**నలగామ :** మహామంత్రిణీ! నా బుద్ధి గడ్డి తిన్నదని మళ్ళీ ఒకమాటు అనిపించ తలచుకున్నారా? ఇక మీరది మరిచిపోవాలి.

**నాగమ్మ :** మీ మనస్సు నేను ఎరుగనిదా? తీవ్రోద్వేగంలో ఆ మాట తొందరమీద వచ్చేసింది. పాపం! పేరిందేవి పుట్టెడు దుఃఖంలో ఉంది. మీరు వెళ్ళి కొంచెం ఓదార్చండి. నేనూ వెంటనే బయలుదేరి వస్తాను.

(నలగామరాజు లేచి నాయకురాలు దారి చూపుతుంటే నిష్క్రమిస్తాడు. రాజు వెళ్ళిపోయే టంత వరకూ చూచి విజయ గర్వంతో తిరిగి వచ్చి)

**నాగమ్మ:** తంత్రం బాగానే పారింది. నలగాముడు నరసింహుడితో మాట్లాడడు. జంగిలే నరసింహుడితో జరిగినదంతా చెప్పివేస్తే? అతడు పట్టణానికి రాకముందే జంగిలిని దేవికి కానుకిస్తే?

తల్లీ – పేరిందేవీ! రాజ్యంతంత్రాలలో నీబోటి అమాయకులకూ, అనవసరమైన కష్టాలు వస్తుంటవి. అయ్యో నీకెంత ఆపద వచ్చింది.

> **కందును నీ శరీరము సుగాత్రిన వాతపరేఖ సోక నీ**
> **అందము చంద మిట్టులతివా, చితి మంటలకయ్యె నోసి నా**
> **డెందము కుందు  నీకిది ఘటిల్లినదే గురు ఘోర మృత్యు సం**
> **స్పందిత మామకీన మతి సర్పిత కోప విషాగ్ను లార్పగన్!**

మహాదేవా! మహాదేవా!! ఇది నా తప్పిదము

కాదుగదా తండ్రీ! ఇందుకు నీవే సాక్షివి ప్రభూ!

**(మహాదేవ విగ్రహం ముందు మోకరిల్లుతుంది)**

# నాలుగో దృశ్యం

(మేడపిలో బ్రహ్మనాయని కార్యాలోచనా మందిరం ఉదయవేళ సభాసదులందరూ వారివారిస్థానాలలో కూర్చొని అలరాజు రాకకు ఎదురు చూస్తూ ఉంటారు)

**బ్రహ్మన్న :** (ఆలోచనా నిమగ్నుడై నేలమీద చూస్తుంటాడు).

**మలిదేవుడు :** అన్నా! బ్రహ్మన్న మంత్రీ! అలరాజు ఇంకా రాలేదు.

**కొమ్మన్న :** చెప్పిన గడువు దాటిపోయింది. దారిలో ఏమన్నా ఆలశ్యం–

**కన్నమ్మ :** నాగమ్మ సామాన్యురాలు కాదట. అపాయమేమన్నా–

**మలిదేవుడు :** సంభవించి ఉంటుందనా? (బ్రహ్మన్నను  చూస్తూ (అన్నా!) మాటాడరు?

**కొమ్మన్న :** మహామంత్రీ! మీరు మాటాడకపోతే మనస్సు పరిపరి విధాల పోతున్నది.

**బ్రహ్మన్న :** (తాపీగా) వేదఘోషతో అలరాజు బయలుదేరాడని ఆనందపడ్డాము.

**కన్నమ :** అయితే మీ అనుమానం?

**బ్రహ్మన్న :** అనుమానమో! అపోహో!!

**మలిదేవుడు :** మీ ఊహ అపోహ ఎలా అవుతుంది?

**కొమ్మన్న :** మీ అనుమానమేమిటితో త్వరగా –

**బ్రహ్మన్న :** ఏమీలేదు. అలరాజు బయలుదేరేటప్పుడు అరుణమంత్రం వినిపించింది. ఏమని?

**కొమ్మన్న :** (ఆతురతతో) ఔను. 'భద్రమ్ కర్ణేభిః' అని ప్రారంభం.

**బ్రహ్మన్న :** (మలిదేవుడితో) భద్రమంటే?

**మలిదేవుడు :** శుభమని కదా అన్నా!

**బ్రహ్మన్న :** లౌకికార్థం అది కాదేమో!

**కొమ్మన్న :** జాగ్రత్త అని కదా తండ్రీ!

**బ్రహ్మన్న :** అదే నా అనుమానం.

**కొమ్మన్న :** (ఆవేగంతో) అశుభము వినబోతున్నామా?

**బ్రహ్మన్న :** తొందరెందుకు?

(అలరాజు రాయబార వార్తను వినటానికి కార్యాలోచనా మందిరము చుట్టూ మూగిన జనసమూహం చేసే కోలాహం వినిపిస్తుంటుంది)

**మలిదేవుడు :** (కన్నమ వైపు చూచి) ఏమిటా కలకలం?

**కన్నమ :** కార్యాలోచనా మందిరం చుట్టూ కట్టకడపటి మాటలు వినటానికి జనం మూగి ఉన్నారు ప్రభూ!

('తప్పుకో' 'తప్పుకో' అని కేకలతో సేవకుని ప్రవేశం. సభా నమస్కారం చేసి పక్కకు తొలిగి)

**సేవకుడు :** గురిజాలనుంచి ఎవరో రాయబారిట ప్రభూ!

**బ్రహ్మన్న :** ప్రవేశపెట్టు (సేవకుడు నిష్క్రమిస్తాడు)

**బ్రహ్మన్న :** (సాభిప్రాయంగా) అలరాజు రాలేదు. ఎవరో రాయబారి!

**మలిదేవుడు :** అల్లుడు కదూ, వెళ్ళింది అత్తవారింటికి విందు మందులు పూర్తి చేసుకొని వెనక వస్తాడేమో!

**బ్రహ్మన్న :** (మందస్మితం చేస్తాడు)

(సేవకుడు దారి చూపిస్తుంటే కొండుభట్టు ప్రవేశిస్తాడు. వెనక ఇద్దరు సేవకులు బరువైన వెదురుపేళ్ళ బుట్ట నెత్తిన పెట్టుకొని వచ్చి సభ ముందు దించి సభా మర్యాద ననుసరించి పక్కకు తొలిగి నిలబడతారు)

**కొండుభట్టు :** (ప్రవేశిస్తూ) రాజాధిరాజ, రాయవేశ్యాభుజంగ, గండర గండాంక, ధైర్య నిర్జితసుమేరు శ్రీశ్రీ మలిదేవ మహారాజులవారికి కొండుభట్టు శతాధిక నతులు, ధిషణా వినిర్జిత చండప్రచండ చాణక్యులవారికి బ్రహ్మన్న మహామంత్రులవారికి నమస్కారాలు.

**బ్రహ్మన్న :** (చేదుగా నవ్వి) కొండుభట్టూ! ప్రజ్ఞావంతుడివి. ప్రణామాలతోనే పరిహాసం ప్రారంభించావు.

**మలిదేవుడు :** రాజ్యభ్రష్టుని రాజాధిరాజు, గండర గండాంకుడు అని సంబోధించటం పరిహాసం కాక మరేమిటి?

**బ్రహ్మన్న :** (మందంగా శిరః కంపనం చేస్తూ) తప్పు నీది కాదు. నాగాంబ నీతివిశారద. అదిగో ఆసనమలంకరించు.

**కొండుభట్టు :** (నమ్రభావంతో కూర్చుంటాడు).

**మలిదేవుడు :** మా అన్నలు నలగామ నరసింహులు కుశలమా?

**బ్రహ్మన్న :** మహారాజులుంగారు నాగాంబను సగౌరవంగా చూస్తున్నారా?

**కొమ్మన్న :** అలరాజు అత్తవారింటికి క్షేమంగా చేరాడా?

**కన్నమ :** నా మాటలు చెప్పాడా?

**కొండుభట్టు :** మా ప్రభువుల వారికి క్షేమం. వారిమీద పరమేశ్వర కృపాకటాక్షం ప్రసరిస్తూ ఉన్నది. మహామంత్రిణి నాగాంబవారి మీద మహారాజులుంగారి మన్నన దిన దిన ప్రవర్ధమాన మౌతున్నది. అలరాజులుంగారు క్షేమంగా అత్తవారింటికి చేరారు. కన్నమా నీ మాటలు వీర పురుషోచితంగా విప్పి నొక్కి చెప్పాడు.

**కన్నమ :** (ఉద్వేగంతో) చెప్పక తప్పింది కాదా?

**కొండుభట్టు :** (బ్రహ్మన్నతో) ఈ ఫలకం మీది శ్రీముఖం చిత్తగించండి.

**కొమ్మన్న :** (ఆతురతతో అందుకొని) మహామంత్రీ!

**(అనుజ్ఞకోసం వేచి ఉంటాడు)**

**బ్రహ్మన్న :** ఆలస్యమెందుకు? కానివ్వండి బావా?

**కొమ్మన్న :** (ఫలక మందుకొని సభ నుద్దేశించి) సర్వలోకాశ్రయ, సమస్త భువనాశ్రయ, మహారాజాధిరాజ, సమస్త సామంత మణిగణ కోటీర పాటలీకృత పదాంభోజ శ్రీశ్రీ మలిదేవ మహారాజుల వారి సన్నిధికి తమ పాద పద్మారాధకుడు అనుంగు నలగామ నరాధముడు వ్రాయించుకున్న విన్నపం.

**బ్రహ్మన్న :** (పట్టరాని ఉద్వేగంతో) ఏదో ప్రళయ వార్త వినబోతున్నాము. చెన్నకేశవా! చెన్న కేశవా!!

**మలిదేవుడు :** అవమానం! అవమానం!!

**కన్నమ :** (కోపంతో కళ్ళెర్ర చేసి) ఇంతకంటే అవమానమా?

**బ్రహ్మన్న :** (ప్రశాంత గంభీరంగా) శాంతించండి. చదవండి బావా!

**కొమ్మన్న :** (లేఖ చూస్తూ) తమ ఆజ్ఞానుసారంగా ఆరు నెలల పుల్లరీ ఈ సేవకుడు భక్తిపూర్వకంగా పంపుకుంటున్నాడు.

**బ్రహ్మన్న :** (ఉద్ఘాటిస్తూ) 'సేవకుడు' 'భక్తి పూర్వకంగా – (సోద్వేగంగా కొమ్మన్నతో) కానివ్వండి.

**కొమ్మన్న :** (లేఖనుంచి) అర్ధరాజ్య విషయంతో తమ ఆదేశం కోసం ఈ సేవకాధముడు నిరీక్షిస్తున్నాడు. నిద్రాసమయ సమయాంతర వినిర్మల భవదీయ పాదపం కేరుహారాధనోత్సుక మత్తబంభరము – నలగామ నరపతి

**(నిట్టూర్పు విడుస్తాడు)**

**బ్రహ్మన్న :** ఇక సందేహం తీరిపోయింది.

(బ్రహ్మన్న చూపు వెదురు వేళ్ళ పెట్టెమీద నిలుస్తుంది. అందరూ అటు చూస్తారు)

కన్నమా! (తెరవమన్నట్లు హస్త సంజ్ఞ)

**కన్నమ :** (ముందుకు వచ్చి వణికిపోయే చేతులతో మూత పైకెత్తి వెంటనే వదలివేసి) ఘోరము! ఘోరము తండ్రీ, అలరాజు శవం!

**కొమ్మన్న :** (పేటికను సమీపించి) నాయనా! నా ఆశలన్నీ మంట కలిపావా?

**మలిదేవుడు :** (నమస్కరిస్తూ) అలరాజూ, నీకు నమస్కారం. నీ ఋణం పది జన్మలెత్తినా తీర్చుకోలేను.

**బ్రహ్మన్న :** ప్రభుసేవకూ, దేశసేవకూ నీ దేహాన్ని అర్పించావు అలరాజూ ధన్యుడవు.

**కన్నమ :** (క్రోధోద్వేగంతో) ప్రతీకారం చెయ్యలేని మన బ్రతుకులెందుకు? ఎన్నివేల శత్రు ప్రాణాలను అలరాజుకు రక్తతర్పణం చేస్తే ఈ కోపం చల్లారుతుంది. ఎక్కడో మటుమాయం చెయ్యవలచిన చిచ్చును మహావాయువై మేల్కొల్పుతున్నది నాగమ్మ, హంతకి.

**మలిదేవుడు :** కన్నమా! నాగమ్మనని ప్రయోజన మేమున్నది?

**తారణ భూములందు పరదర్పము సర్వము త్రావిగాని రా**
**నేరని క్షాత్రవంశమున నిర్మలకీర్తి హరింప బుట్టె నీ**
**భీరువు రాచకార్యముల పేడిగతిన్ యొక ఆడుదాని దు**
**ర్వార విషాక్త హస్తమున వర్తిలి నాట్యమొనర్ప పూనెడిన్**

**కొమ్మన :** (తెప్పరిల్లి వాలుతూ శవపేటిక దగ్గరకు వచ్చి)

అలరాజూ! నీ తల్లి పోయిన దుఃఖం తలపుకు వచ్చినప్పుడల్లా ధైర్యం చెప్పి కాపాడుకో వచ్చావు. నీ చేతి మీదుగా దాటి పోదామనుకున్నాను. ఇక నా బ్రతుకు ఎవరికోసం తండ్రీ! (కంట తడి బెడతాడు)

**కన్నమ్మ :** (కొమ్మన్న దగ్గరకు చేరి) మామా! నీ కన్నీరు చూడలేను. ఈ కసి పట్టలేను అనుజ్ఞ! మామా! అనుజ్ఞ!!

**బ్రహ్మన్న :** కన్నమా! శాంతించు – కొండుభట్టూ!

ఇంతేనా సంధివచనాలు. రాయబారికి రాక్షసమైన మరణదండన. ఈ పాపకృత్యానికి పూనుకున్నదెవరు?

**కొండుభట్టు :** నరసింగరాజులవారు తామని చెప్పమన్నారు.

**మలిదేవుడు :** నరసింగడు అంత గర్వపోతైనాడా?

**కన్నమ :** (వక్షస్థలం విరిచి) తండ్రీ! యుద్ధమిక తప్పదు.

**బ్రహ్మన్న:** (సాలోచనుడై) యుద్ధము తప్పదా? అహింస లోకంలో ఇంత అడుగంటి పోయిందా? నా జీవితకాలంలోనే నేనే హింసాకాండకు పూనుకోవలసి వచ్చిందా? (తల పంకించి) యుద్ధం తప్పనట్టే వున్నది. పరిస్థితులు ఎన్నడో చేయి జారిపోయినవి.

**రసములలోన నుత్తమము రాజని చెప్పగ జెల్లు నా కృపా**
**రసము జగాన ఇంకినది రక్తవిదాహము పెల్లు రేగెనే!**
**విసమిడినట్టి వానికిని విజ్ఞత ప్రాణము లీయనేర్పెనా**
**యసమగురుండు, బుద్ధుడు, మహాత్ముని బోధలు మాసిపోయెనే!**

**కొమ్మన్న :** పెద్దవాడనైనాను. నాకు ఏదారీ తెన్నూ తెలియటం లేదు.

**మలిదేవుడు :** నరసింగడి తల తరగటం నిశ్చయించుకుంటే అన్ని దారులూ బయట పడతవి.

**పగయడ గించుటెంతయు శుభంబని యాపితి నింతదాకమి**
**మ్మగణిత యుద్ధవీరుల, మహాద్భుత విక్రమ శౌర్యసారులన్**
**పగతురు చీరికిన్ గొనరు, భ్రాంతి వహించిరి, పాపబుద్ధులై**
**తగవు తలంప కీగతి నధర్మము చేసిరి – సంధి యొప్పునే**

**బ్రహ్మన్న :** (ఏదో ఆలోచన చేసి కాదన్నట్లు తల త్రిప్పుతూ) బ్రహ్మన్న హృదయ కుహరంలో చిర నిద్రపోతూ ఉన్న శార్దూలాన్ని మేల్కొల్పి కాటు చవి చూడదలచుకున్నారా మీరు? ఈ కొమ్మన్న కుపితారుణ నేత్ర రుచుల ముందు కుమ్మరపురుగులు కాతలచుచున్నారా మంచిది. (కన్నమ వైపుగా తిరిగి) రణగండ్ల యుద్ధం తరువాత అస్త్ర సన్యాసం చేశాను. మళ్లీ కత్తి పట్టక తప్పదా?

**కన్నమ :** తండ్రీ! ఎంత మాట!

**నీవై ఖడ్గము తాల్పగా వలెనె తండ్రీ! శత్రుపక్షంబులో**
**నీవాల్లభ్యము నోపగా గలుగు నువ్వీ లెవ్వ రున్నారు నా**
**పై విశ్వాసము నుంచి పంపుడట కస్మద్బాహు దర్పోద్ధతిన్**
**ఆ వీరావళి మస్తకంబులతొ మీకై క్రీడకావింపనే –**

**కొమ్మన్న :** కన్నమా! నీవు నిజంగా అంతకు తగినవాడివి. నా గుండె మంటలను అనేక గుండె మంటలతో చల్లార్చగల వీరుడివి నీవొక్కడివే నాయనా! ఏకైక పుత్రుడు. రూపసి. రాజ్యతంత్రజ్ఞుడు ముద్దుబిడ్డ, అలరాజు. అబ్బా! ఎన్నాళ్లు ఎంత యత్నంమీద మరిచిపోతే మరపునకు వస్తాడు, నా తండ్రి. దారుణ మృత్యువు. హృదయంలో ప్రచండ ప్రతీకార జంఝూమారుత రోదనం భరింప శక్యమా? కన్నమా!

**కన్నమ :** (ఉచ్ఛ కంఠంతో) మామా!

**కొమ్మన్న :** నురుమాడి అరివీర సస్యాన్ని అస్తిరాసులు తూరుపార పట్టవోయ్ తండ్రీ! వీరాధివీరుడవై, సకల సేనాపతివై, శత్రువుల పునుకల దండలతో ప్రేతపతికి కానుక లర్పించు. ఈ కసి అప్పటికైనా చల్లారుతుందేమో!

(సకల సేనాపతిత్వ చిహ్నామైన కరవాలాన్ని అందిస్తూ) ఈ కరవాలం ఇక నీది. కదన రంగాలను నడిపించవలసింది నీవు.

**కన్నమ :** (కత్తిని అందుకోటానికి చేయి జాపుతూ అంగీకారం కోసం ఎదురుచూస్తూ) తండ్రీ! మహారాజా!

**బ్రహ్మన్న :** తప్పనిసరి అందుకో నాయనా!

**మలిదేవుడు :** సంతోషము కన్నమా!

**కన్నమ :** (చేతులు ముందుకు జాపి ఇవ్వమని కోరుతూ) మామా!

**కొమ్మన్న :** (సగౌరవంగా ఖడ్గాన్ని కన్నమకు ప్రసాదిస్తాడు)

**కన్నమ :** (వీరముష్టితో అందుకొని)

> **ఓ కరవాలమా! బహుళ యుద్ధములన్ క్షతజంబు త్రావి నీ**
> **వీ కదనాగ్ని చల్లవడ నీ గతి నిద్దుర చెందినావు లే**
> **వే కదనంబు వచ్చె అరివీరుల గుండెలు తల్లడిల్ల ధా**
> **రాకృపణంబుతో రణ పరంపరలన్ లయకేళి సల్పవే**

**(అని కొండుభట్టు వంక ఉరిమి చూస్తాడు)**

**కొండుభట్టు :** మహారాజా! నాకు సెలవా?

**బ్రహ్మన్న :** కొండుభట్టూ! మీ రాజుతో సంతోషమని చెప్పు. బ్రహ్మన్న జరిగింది మరచిపోడని చెప్పు.

**(కొండుభట్టు సభ అంగీకారం పొంది నిష్క్రమిస్తాడు)**

**కొమ్మన్న :** కన్నమా! దేశమంతటా విప్లవాగ్ని నివురు కప్పుకొని ఉన్నదని నీకు తెలుసు. కనిపెట్టి ఒక్కమాటుగా అన్నిచోట్లా ప్రజ్వరిల్లేటట్లు ఊదిరా. పో

**కన్నమ :** మామా! కార్యరంగంలో ప్రవేశించిన కన్నమకు–

**(ఒక సేవకుడు ఆతురతతో ప్రవేశించి కొమ్మన్నతో)**

**సేవకుడు :** ప్రభూ! నేను పేరిందేవి అమ్మవారి అనుచరుణ్ణి. చితిమంట లెక్కటానికి సిద్ధపడి అమ్మవారు మీ అనుజ్ఞ వేడి రమ్మని పంపింది.

**కొమ్మన్న :** పతివ్రతా శిరోమణివి తల్లీ! నీ కోరిక కాదనను.

**(సేవకుడు నమస్కరించి వెళ్ళిపోతాడు)**

గొడ్డుబోతు కావలసిన నలగాముడి కడుపున ఎంత కమ్మని పండు పుట్టింది? నా కొడుకును మించిన కోడలు.

(బాధతో) అబ్బా (ఒరగబోతే కన్నమ వెళ్లి పట్టుకుంటాడు)

**బ్రహ్మన్న :** (దగ్గిరకు వచ్చి) బావా! ధైర్యం పోగొట్టుకోకు. కాఠిన్యం తెచ్చి పెట్టుకో, కాని దినాలు వచ్చినవి.

**కొమ్మన్న :** చేసేదేముంది బావా!

**కన్నమ :** మామా! పగ సాధించటమే.

**బ్రహ్మన్న :** కన్నమా! ఆలస్యం చెయ్యకు. సైన్యాన్ని చేకూర్చుకో.

**కన్నమ :** (వీరోచితంగా) మీ అనుజ్ఞ అయితే సానికొంపల్లో సమర వీరులను మొలక లెత్తిస్తాను. గండ శిలల చేత ప్రచండ యుద్ధం చేయిస్తాను. పౌరుష ప్రలాపాలతో పల్నాటి నంతటినీ ఉడుకెత్తించి మీ వెనక నడిపిస్తాను. వీరుల గుండెల్లో ఉష్ణగుండాలను సృజిస్తాను. వేడి నెత్తురు పొంగి పొంగి కరుళ్ళు కట్టేటట్లు ముక్తకంఠంతో తాండవోద్రేక ప్రసంగం చేస్తాను. కావలసిన సైన్యాన్నంతా కట్టుబడి చేసుకుంటేనేగాని ఈ కన్నమ ఇక మీ కంటి ముందు కనబడడు. దీవించి పంపండి.

**(వీరముష్టితో ప్రణామం చేస్తే అందరూ హస్తవిన్యాసంతో దీవిస్తారు)**

# అయిదో దృశ్యం

(మాచర్ల రాచబాట. నాలుగు దారుల కూడలి. పట్టణంలో ప్రజలందరూ యుద్ధోపన్యాసాలు వినటానికి మూగి ఉంటారు)

**నరసింహరాజు :** (రాజసంతో) ఓ మహాజనులారా! మీలో ప్రతి అణువూ రాజభక్తి పరాయణమని వింటూ ఉన్నందుకు సంతోషము. ఎన్నాళ్ళనుంచో తహతహ పడుతుంటే ఈ నాటికి మీ దర్శన భాగ్యం లభించింది. మహాప్రభువు తామే మీకోసం స్వయముగా బయలుదేరుదామనుకున్నారు. కానీ శరీర స్వస్థత లేకపోవటం వల్ల తమకు బదులుగా నన్ను పంపించామని మీతో చెప్పమన్నారు.

ఇప్పుడు నేను యువరాజును కాను  ఒక సామాన్య వ్యక్తిని. నా మాటలు రెండు ఆలకించండి.

మహారాజంతటివాడు మనలను ఎప్పుడు అర్థిస్తాడు? ఈనాడు అర్థించాడు. ఇంతకంటే మహోన్నత గౌరవం మన జీవితాల్లో రాదు. ముమ్మాటికీ రాదు.

మనమందరమూ ఆయనకు శాయశక్తులా సహాయము చేసి ఆయన్ను గెలిపించాలి. కుల విభేదాలు లేవట! వర్ణ సంకరం చేసేస్తున్నాడు బ్రహ్మన్న. మీ తాత తండ్రుల మతాన్ని త్యజించి అపాత్రులవటానికి ఇష్టపడుతారో మీరు, ధర్మ యుద్ధం చేసి వర్ణాశ్రమ ధర్మాలను నిలువ బెట్టుకుంటారో! ఆలోచించుకోండి.

నలగామ నరపతి రాజ్యం ప్రజారాజ్యం! ఆయన సింహాసనం మీద కూర్చున్నది మీకోసమే. అధర్మం దేశంలో ప్రబలిపోయినా వర్ణ సంకరం ప్రబలినా మాకిష్టమేనని మీలో ఒక్కరన్నా సరే మహారాజు తక్షణమే రాజ్యాన్ని పరిత్యజించటానికి సిద్ధంగా ఉన్నాడు. ఏదీ? – ఎవరన్నా ఉన్నారా? (సభలో లేరు లేరని కేకలు) ఒక్కరూ లేరు. అబ్బా! మీ రాజభక్తికి అమితానందం వేస్తున్నది. (పట్టరాని సంతోషంతో) అహహః నేను భరించలేను. సెలవు.

**(నమస్కరిస్తూ నిష్క్రమిస్తాడు)**

**కన్నమదాసు :** (క్షణకాలం గడచిన తర్వాత ప్రవేశించి) ఓ పలనాటి వీరులారా! యుద్ధం ఎందుకు వచ్చిందో మీకు చెప్పటం అనవసరమూ, అప్రస్తుతమూ, మీకు సమస్తమూ తెలుసును. అందుకోసం రాలేదీ కన్నమ! పల్నాటి ప్రజా హృదయంలో ప్రజ్వలితం కాలేక నిద్రపోతూ ఉన్న విప్లవ ప్రళయాగ్ని జ్వాలలను మేల్కొల్పటానికి వచ్చాడు.

మహాపదలకు పాలౌతున్న రాక్షస ప్రభుత్వానికి తలలొగ్గుతారో, లేక ధర్మ సంస్థాపనాచార్యుడు బ్రహ్మన్న భావి ప్రభుత్వంలో అనంత మహదానందాన్ని అనుభవిస్తారో తేల్చుకోండి! దాస్య శృంఖలాలకు చేతులందించి తట్టాడుతారా! కాటకాలల్లో కీటకాలౌతారా!! కారు  కారు. మహాయోధులై మహదాశయాలను సాధిస్తారు. స్వాతంత్ర్యాభిలాషులై పారతంత్ర్యాన్ని పరుగెట్టిస్తారు.

వర్ణాశ్రమ కులాచార రక్షణమని పేరు. రక్తపాతాలతో రాక్షసరాజ్యం! రాక్షస ప్రభుత్వం!! భరించలేము! భరించలేము...!

మన రాజ్యంలో 'రాజుకూ రడ్డికీ' భేదం ఉండకూడదు. సర్వమానవ సౌభ్రాతత్వం, సంఘజీవనం అభివృద్ధి పొందాలి. ఉపన్యాసాలతో ప్రయోజనం లేదు. హృదయం పరివర్తనం కావాలి.

నేను ఎవరినో తెలుసునా? అస్పృశ్యుణ్ణి. అంత్య జాతిని. చండాలుణ్ణి. బ్రహ్మన్న తండ్రి నాకు ఇచ్చిన పదవి తెలుసునా సర్వసేనాధిపత్యం. ఆయననైనా నడపించవలసింది నేనే! ఇటువంటి సౌభ్రాతృత్వం మీకు ఏ ప్రభుత్వంలో దొరుకుతుంది? దొరకదు ముమ్మాటికీ దొరకదు!!! ఇది అధర్మ ప్రభుత్వం! అక్రమ ప్రభుత్వం!! బ్రహ్మన్న ప్రభుత్వం ధర్మ ప్రభుత్వం! ప్రజా ప్రభుత్వం!!

**(ప్రజలలో హర్షధ్వనులు, కోలాహలమూ)**

పలనాటి కిష్టయ్య పలుకులు మీరు ఎన్నో విన్నారు. ఇప్పుడు మమ్మలిని స్వాతంత్ర్య యుద్ధానికి సిద్ధం కమ్మని శంఖారావం చేస్తున్నాడు.

**పాదఘట్టన చేయ బద్ధలై ఈ ధాత్రి**
**పాతాళవివరముల్ బయట పడగ,**
**భాసింప శస్త్రాళి ప్రళయ శంపాలతల్**
**కులశైల గహ్వరకోటి నొదుగ,**

**రణపరాక్రమ హేతి రగిలి ముల్లోకాలు**
**స్రుక్కి పోవగ మించి సుడిసి పడగ**
**సింహనాదము సోక చెలగి స్వర్లోకాన**
**కంచు తలుపులు ధ్వనించి విడగ,**
**ఏడు సంద్రాల నిదె పుక్కిలించి ఉమియ**
**వచ్చెనన భీతి నాషాఢవారి వాహ**
**పంక్తులట్లుగ రణభూమి పరుల నొంప**
**నస్త్ర వర్షాంబు ధారల నలుమ రండు.**

జై బ్రహ్మన్న తండ్రికీ జై! జై బ్రహ్మన్న తండ్రికీ జై

**(ప్రజలు అందుకొని జై బ్రహ్మన్న తండ్రికీ జై! జై వీర కన్నమకూ జై, జై, వీర కన్నమకూ జై!! అని సంతోష ధ్వానాలు చేస్తారు. కన్నమ నిష్క్రమిస్తాడు)**

**నరసింహరాజు :** (ఫలకము మీద వ్రాసుకొని వచ్చిన ఉపన్యాసాన్ని మధ్య మధ్య ఆగుతూ తడబాటు పడుతూ, వణికిపోతూ చదువుతాడు)

మహాజనులారా! సైన్యంలో త్వరగా చేరండి. అనుకొన్న సంఖ్య పూర్తి అయిన తరువాత మీరు ఆశాభంగం చెందుతారు. ఆలోచిస్తూ ఆలస్యం చేసి తరతరాలూ నిలిచే భటవర్తులు పోగొట్టుకోవద్దు. రొక్క భృత్యం అదనం. పంక్తులలో అన్నాలు తినేవాళ్ళు పాలెగాళ్ళు అవుతారు. మన్నెవారికి మొదటి సేనాధిపత్యం. సైన్యంలో చేరిన ప్రతి సేద్యగానికీ రాబొయ్యే పదేండ్లకూ పుల్లరి ఉండదు.

యుద్ధం పూర్తి అయిపోయిన తరువాత రొక్కజీతాలూ పదవులూ తగ్గిపోవు... రండి వచ్చి జేరండి... సుఖాలు అనుభవించండి. ఎన్నో తరాలనుంచీ మహారాజు డబ్బుతిని ఆయనకు మీరు రుణపడి ఉన్నారు. (ప్రజలలో టుర్రో టుర్రో) (వణుకుతూ) అది... తీర్చుకోటానికి సమయం వచ్చింది. రాజ భక్తులను మిమ్మల్ని పదే పదే వేడ నవసరం లేదు.(ఎహై... ఎహై)... మీ ధర్మం కోసం, మీ విశ్వాసం కోసం, (బుర్...బుర్) మీ ప్రభువు కోసం సైన్యంలో చేరండి. పోరాడండి... రాజును గెలిపించండి.

**(దిగో! దిగో! వెళ్ళు! వెళ్ళు! ఆపు! ఆపు! అని సభలో కేకలు. నరసింహరాజు వణుకుతూ నిష్క్రమిస్తాడు)**

**కన్నమదాసు :** (ఎదురుగా ఆవేశంతో ప్రవేశించి) ఓ ధర్మయోధులారా! మీ పలనాటి కిష్టయ్య మిమ్మల్ని పిలుస్తున్నాడు. ఆ పిలుపు మీద మీకు నమ్మకముంటే బయలు

దేరండి. ఆయన మీకు ఏమీ ఇవ్వలేదు. ఆశ పెట్టలేదు  పెట్టి కొట్టేయలేదు... ఎప్పటికైనా ధర్మానికే జయమన్న సంగతి మీరెరిగిందే కదా! బ్రహ్మన్న ధర్మం!! ధర్మం పిలుస్తున్నది. ముందుకు నడుస్తారా! పిరికిపందలై వెనుకంజ వేస్తారా! త్వరపడండి! రేపే కారంపూడి కదనరంగానికి బయలు దేరుతున్నాము... త్వరపడండి! రణగండ్ల యుద్ధంలో బ్రహ్మన్న రణపరాక్రమం విన్న మీరు ఇంకో పక్షానికి ఎట్లా వెళ్ళగలరు... వెళ్ళలేరు...భజన కూటాలల్లో భండన వీరులు తయారు కండి. కల్లుకొట్లు కదనవీరులకు జన్మభూములు చెయ్యండి. చాకి బండలను సమరయోధులకు రచ్చబండలు కావించండి. యుద్ధం మీరే నడిపించేది  జ్ఞప్తికి ఉంచుకోండి జయం మీదే. ఆనందించండి...

వీర ఘంటలు కట్టుకోండి! వీరపూజలు చెయ్యండి! వీరగంధం అలముకోండి!! బయలు దేరండి! రండి రంగానికి రండి –

**రాక్ష సేశ్వరు గర్వ రక్తంబు దిగ ద్రావి**
**సీత చెరకు స్వస్తి చెప్పినాము,**
**ధర్మ సూనుని వైరి దావాగ్ని చల్లార్చి**
**కీర్తి హేమలత ప్రాకించినాము,**
**యవన వాహిని పొర్లి అరుదేర పొలిమేర**
**కడలనే సేతువుల్ కట్టినాము,**
**సాగర ధ్వని వచ్చు శత్రుపాథోధులకు**
**చెలియలి కట్టలై చెలగినాము,**
**ఆంధ్రులము దయా వీర రసాంబుధులము,**
**ఆంధ్రులము దాన వీర రసాంబుధులము,**
**ఆంధ్రులము కర్మ వీర రసాంబుధులము,**
**ఆంధ్రులము యుద్ధ వీర రసాంబుధులము**

**(కన్నమ నిష్క్రమించగానే ప్రజలు జై బ్రహ్మన్నకూ జై, జై వీర కన్నమకూ జై అని కేకలు వేస్తారు)**

# ఆరవ దృశ్యం

(మాచర్లలో గండు వారి సంస్థానము. సావడి ముందు ఆరుబయట నిలవబడి నిశ్చల నేత్రాలతో మాంచాల ఆకాశం వంక చూస్తూ దీనంగా మబ్బు వెనక దాగి ఉన్న చంద్రుణ్ణి ఉద్దేశించి)

**మొగిలు మాటున దాగి**
**మగిడి రావేమోయి**
**ఓ రాజ! రేరాజ!!**
**రేరాజ! రాజా!!!**
**మగువ తారతో వలపు**
**తగదోయి, తగదోయి,**
**తరలి రావోయి మా**
**సరసి నీడల నాడ...**
**మొగిలు మాటున దాగి**
**మగిడి రావేమోయి,**
**ఓ రాజ! రే రాజ!!**
**రే రాజ! రాజా!!!**

సంస్థానం మొదటి గుమ్మం దాటి లోపల ప్రవేశించిన ఒక బుడబుక్కల వాడు భావస్ఫూర్తితో డమరు మోగించుతూ తాళ లయాన్వితంగా

**అంబా పలుకు, జగదంబా పలుకు,**
**అంబా పలుకు, జగదంబా పలుకు !!**
**గండు వారి సంస్థానంలో**
**పండుగ తల్లి ఈ దినమూ**
**పరువపు వెన్నెల కాస్తుందీ,**
**పరువపు వెన్నెల కాస్తుందీ.**
**అంబా పలుకు, జగదంబా పలుకు,**
**అంబా పలుకు, జగదంబా పలుకు!!**

అని వెళ్ళిపోతాడు. (ఆలోచనా నిమగ్నురాలైన మాంచాల సాభిప్రాయంగా వెలికి వస్తూ ఉన్న భావాలను హృదయగతం చేసుకోలేక)

**మాంచాల :** పరువపు వెన్నెల! పరువపు వెన్నెలే!! చంద్రుడు రానిదే వెన్నెలా?... కల్ల. ఎన్నాళ్ళనుంచో నిరీక్షిస్తున్నాను. కంటిముందు శూన్యం తప్ప ఆ కువలయ మనోహరుడు, నా చంద్రుడు కనిపించటం లేదు. నా బ్రతుకుకీ కృష్ణపక్షం (నిష్కర్షగా) తప్పదు. చంద్రుడి ముఖ చంద్రిక కళ్లార తాగి మత్తెక్కి మైమరచే దినాలు ఈ మాంచాల జీవితంలో ఉన్నాయా! (నిరాశతో కూడిన నిట్టూర్పుతో) పరువపు వెన్నెల కాస్తుందా?

**ఎన్నటికైన చంద్రునకు ఈయెడ మోహము కలి రాకపో**
**డన్న మహాభిమానమున నాత్మకు వ్రేగగు జీవనంబుతో**
**నున్నది ఈచకోరిక – మహోజ్వలుడాతడు నేడు వచ్చునా,**
**వెన్నెల కాయునా, అమృత వీచికలన్ తనివార నిచ్చునా?**

(బుడబుక్కల వాణ్ణి ఉద్దేశించి) వీడు పలికే మాట సత్యమౌతున్నదని ప్రతీతి. ఇది కూడా అంతే అయితేనా, నా బ్రతుకు ధన్యమౌతుంది.

(బాలచంద్రుని చిత్రపటం వైపు నిర్నిమేష వీక్షణం చేస్తుండగా లోపలనుంచి మాదచి గొంతుక "మాంచాలా, మాంచాలా" అని వినిపిస్తుంది. "మాదచీ! మాదచీ!!" అని తిరిగి పిలుస్తూ నెమ్మదిగా మాంచాల నిష్క్రమిస్తుంది. క్షణకాలం నిశ్శబ్దం. నేల చూచుకుంటూ నెమ్మదిగా బాలచంద్రుడు చేతిలో ఉన్న బొంగరంతో ఏమేమో మాట్లాడుకుంటూ ప్రవేశిస్తాడు)

**బాలచంద్రుడు :** ఒకటి ఒదిలిపోయింది. శ్యామాంగి మీది మోహం. నా రెండో వ్యసనం నీవు. ఇదిగో చివరసారి నిన్ను (బుజం మీద వ్రేలాడుతున్న తాడు చుట్టి నేలమీద త్రిప్పి చేతిలో పట్టుకొని) ఇలా చిన్న నాటినుంచీ నీవు నా చేతిలో తిరిగి, తిరిగి ఈనాటికి నన్నే తిప్పేశావు. కానీ నీకూ నాకూ నేస్తం మాత్రం ఈనాటితో సరి.

('మాదచీ! మాదచీ' పంజరములోనుంచి గిజిగాడు తప్పించుకొని వచ్చాడా, 'ఏడీ ఏడీ' – అంటూ మాంచాల వెతుకుతూ ప్రవేశిస్తుంది. బాలచంద్రుణ్ణి చూసి నిర్ఘాంతపోయి నిలువబడుతుంది)

**బాలచంద్రుడు :** (నెమ్మదిగా మందస్మితంతో మాంచాల దగ్గరకు వెళ్ళి) అవును. మాంచాలా? పంజరంలో నుంచి తప్పించుకొనే వచ్చాను.

**మాంచాల :** (తెప్పరిల్లి) మీరా?

**బాలచంద్రుడు :** (గాద్గద్యముతో) 'నేనే'

(క్షణకాలం నిశ్శబ్దం. ఒకరినొకరు ప్రేమార్ద్రలోచనాలతో చూచుకుంటారు)

**బాలుడు :** ఇలారా... (దగ్గరకు పోయి చేయి పట్టుకొని నెమ్మదిగా అలంకరించిన వేదిక మీద కూర్చోబెట్టి) మాంచాల సుఖంగా ఉంటున్నావా? (నేలమీద చూస్తూ ఉన్న మాంచాలతో) ఏమిటా సిగ్గు? నీ ముఖం ఇంతగా వాడి పోయిందేమిటి? (చేతితో ముఖం పైకి ఎత్తుతూ) ఎంతసేపు  ఈ సిగ్గు వదిలిపెట్టదా ఏమిటి?

**కనులు కనుల గలపి కాటు కలవి నీటు**
**నీలిమల గుండె వనముల నిలిపి తమము**
**చిరుత నవ్వుల చేమంతి సరుల నరుత**
**నతివ! పుష్పోపహారమ్ము లమర నిమ్ము**

**మాంచాల :** అప్పుడే ప్రభూ, మీకు నేను అంత సన్నిహితురాలనైతే –

**బాలుడు:** మన అనుబంధం ఈనాటిది కాదుగా దేవీ!

**మాంచాల:** మీరు నన్ను అలా సంబోధిస్తే బాధపడటానికి నాకు మాత్రం మనస్సు లేదనుకున్నారా?

**బాలుడు:** (ప్రేమ పూర్వకంగా) మాంచాలా! ఒక్కమాటు 'బావా!' అని పిలు. హృదయభారం కొంత తగ్గుతుంది.

**మాంచాల :** (ముగ్ధ మనోహరంగా) బావా!

**బాలచంద్రుడు :** (ఆర్ద్రంగా) మాంచాలా! (హస్త కంకణాలను సవరిస్తూ) ఈ ఆభరణాలు నీ కోమల హస్తాలకు ఎంతో అనుయోగ్యంగా ఉన్నవి. మాంచాలా (చేయి గుండె కద్దుకుంటూ)

**కన నొక మారు నిన్మరల, కట్టితి మంగళ సూత్ర మెన్నడో**
**కనికర మింతలేని నను కాంతునిగా నెద నమ్మి తన్వరో!**
**అనయము పూజ చేతు వధికంబగు భక్తి  పతివ్రతామణిన్**
**నినుగన వచ్చినాడ, నవినీతుని ఏ గతిగా క్షమింతువో?**

**మాంచాల :** మనసార ప్రేమించి చేస్తాను.

**బాలుడు:** (దైన్యంతో) మాంచాలా!

**మాంచాల :** (ఆర్ద్రంగా) బావా!

**బాలుడు:** ఈ జగత్తులో సత్యమేదో అసత్యమేదో! అంతా మాయ, మోసము – నటన. నిజమబద్ధమనీ, అసత్యము సత్యమనీ భ్రమపడుతుంటాము.

**(దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తాడు)**

**మాంచాల :** ఎందుకో దీర్ఘంగా నిశ్వాసిస్తున్నారు?

**బాలుడు:** (మందమందగా) ఇన్నాళ్ళబట్టీ మోసపోయినానని ఈనాడు గ్రహించాను మాంచాలా?

**మాంచాల:** మిమ్మల్ని ఎవరు మోసగించారు?

**బాలుడు:** కపట ప్రేమ నటించి నా అర్థ ప్రాణాలు కాజేసిన శ్యామాంగి!... దాన్నని ఏమి ప్రయోజనం? సాని సాంగత్యం, నాదే దోషం. పోనీ పాపిష్ఠి ముండ. దాని సంగతెందుకు. నీ మనోహర సౌందర్యాన్ని ఆరాధించే అదృష్టం నాకు లేకపోయింది. మణిదీపికను మరిచిపోయి గాజుపూసతో కాలం గడిపాను. మాంచాలా! నీవు నా వెనుకటి జీవితాన్ని సంపూర్ణముగా మరిచిపోవాలి. మనసార నన్ను ప్రేమించాలి.

**మాంచాల:** ఏమిటి మీ అర్థం లేని మాటలు?

**బాలుడు:** మాంచాలా? ఇది మన ఇద్దరి నూతన జీవితాలకూ వసంతాగమ సమయం. (దృష్టి వీణమీద నిలిపి) నీవు వీణావాదనం చేస్తుంటే నేను గొంతు కలిపి ఒక పాట పాడుతాను.

**మాంచాల:** అందుకో మన్నారా?

**బాలుడు:** (అవశ్యమన్నట్లు) ఉఁ

(మాంచాల వీణ సవరించి బాలుని ఎత్తుగడ కోసం చూస్తూ ఉంటుంది)

**బాలుడు:** (గొంతు సవరించి)

> **ఓహో వసంతా! ఆహా వసంతా!!**
>
> **సుఖదా వసంత!! శుభదా వసంతా!!**

**నందన వన సుమ సుందర**
**తుందిల మృదు మంద పవన, – ఓహో వసంత**

**చందన కురువింద మంద**
**గంధానిల వసన హసన, – ఓహో వసంత**

**సురభిసమయ కింశుక నవ**
**తరుణారుణ కిరణ చరణ, – ఓహో వసంత**

**చరణ రణిత చతుర రవణ**
**చలిత విహగ చికుర కిరణ, – ఓహో వసంత**

**ఓహో వసంత!! ఆహా వసంత!!**
**సుఖదా వసంత!! శుభదా వసంత!!!**

(నెమ్మదిగా పాట పూర్తిచేసి నిమీలిత నేత్రాలతో పారవశ్యం పొందుతూ ఉన్న మాంచాల దగ్గరకు చేరి చేతిలో వీణ అందుకొని యథాక్రమంలో ఉంచి, ఆమెకు శైత్యోపచారం చేస్తుంటాడు)

**మాంచాల :** (తెప్పరిల్లి) బావా! అటు జూడండి. ఆ పూవు మీద వ్రాలిన భ్రమర బాలుడు ఏం చేస్తున్నాడో!

**బాలుడు:** (మందస్మితంతో కోమలంగా) ఏం చేస్తున్నాడు. మనసార ముద్దు పెట్టుకొని మకరందం తాగేస్తున్నాడు.

(సిగ్గుతో తలవంచుకున్న మాంచాల చిబుకాన్ని చేతులలో పుచ్చుకొని) అయితే ఈ బాలుణ్ణి కూడా... అలాగే... గులాబీ పెదవులమీద... మకరందాన్ని తాగమని అభిప్రాయమా? గండువారి ఉద్యానంలో ఇంత కమ్మని పూవున్నదని ఎరగను మాంచాలా?

**మాంచాల :** (దీనంగా) బావా!

**ఇది యొక కన్నెపూవు, హృదయేశ! మధూదయవేళ, ఏరికిన్**
**ముదము దలిర్పగా మనసు మ్రుచ్చిల నీయగ లేదు మున్ను నీ**
**కొదమతనమ్ముపై, వలపు గుప్త మొనర్చి విరాళి నుంటి కో**
**విద మధులిట్ప్రభూ! అనుభవింపుము నేడు రసప్రలోభివై.**

(బాలుడు పెదవికి పెదవి చేరుస్తుండగా తుమ్మెదల ఝుంకారం వినిపిస్తుంది. పూవు మీద వాలిన తుమ్మెద వెళ్ళిపోతుంది. మాంచాల మరొకవైపు లగ్నమౌతుంది. బాలచంద్రుని పెదవి మందంగా వెనక్కు వస్తుంది.)

**మాంచాల:** బావా! భ్రమర బాలుడు తిరిగి వెళ్ళిపోతున్నాడు. ఆ ఝుంకారం కులపెద్దల పిలుపులా ఉన్నది. వాళ్ళ కులంలో యుద్ధం బయలు దేరిందేమో! అతడు వీరుడిలా ఉన్నాడు.

**బాలుడు:** మాంచాలా! నీ బాలుడు వీరాగ్రేసరుడు మన కులంలోనూ యుద్ధం వచ్చింది. దేశమంతా మారుమోగుతూ ఉన్న అన్న వీరకన్నమ పిలుపు వినలేదా నేనూ సిద్ధపడి యుద్ధానికి బయలు దేరుతున్నాను. నీ అనుజ్ఞకోసమే ఇక్కడికి వచ్చాను.

**మాంచాల :** వీరపత్నిని చేస్తానంటే వద్దంటుందా మాంచాల.

**బాలుడు:** మాంచాలా! గండు వారి ఇంటి బిడ్డవనిపించావు. నీబోటి వీర నారీమణులు ఎంతమంది జన్మిస్తే మన దేశానికి ఈ దాస్య విముక్తి కలుగుతుందో (శరీరాన్ని స్పృశిస్తూ) బయలు దేరనా?

**మాంచాల :** (లేచి చిత్రపటం దగ్గిర ఉన్న చంద్రాయుధాన్ని తెచ్చి చేతి కందించి) బావా! శాత్రవ రుధిర ధారలతో జలకమాడండి. ధర్మ దాస్య విముక్తి కోసం తనువు నర్పించండి. అవక్ర పరాక్రమంతో ఆహవభూమిలో వీరవిహారం చేసి ఆశాశలా మీయశోగానామృతం వెదజల్లండి.

**బాలుడు:** (పొంగిపోయి) ధన్యోస్మి! మాంచాలా! ధన్యోస్మి.

> **చిర విరహాగ్ని తప్త మతసీ కుసుమోజ్వల గాత్రవల్లి నా**
> **కరజల జార్ద్రలాలనల కాంతి వహింపక మన్నె యోధవై**
> **అరిరుధిరాపగన్ జలకమాడుము పొమ్మని శత్రుయోధ సం**
> **భరిత రణోర్వికిన్ పనుచు ప్రౌఢిమ నీకడ కాక కల్గెనే**

మాంచాలా! ఇక క్షణం నిలువలేను. నా బొంగరం కోమటి అన్నమ్మ తలకు తగలగానే ఏమన్నదో తెలుసునా? అద్దంకి ఆబోతల్లే పొతరించానట! శత్రువుల మధ్య చంద్రాయుధాన్ని ప్రయోగించి రంకులరాటంలా గిరగిరా త్రిప్పేటంతవరకూ ఇక నాకు శాంతిలేదు. మాంచాలా! త్వరగా సిద్ధపడు.

**మాంచాల:** ఇక్కడున్నట్లుగా వచ్చేస్తాను.

(లోపలికి వెళ్ళుతుండగా చూచి)

**బాలుడు:** మాంచాలా! నీ శీలం, నీ రూపం, నీ త్యాగం- రణరంగ మధ్యంలోనైనా నా మనస్సును వదిలేటట్లు లేవు. నీవు నాకు ధర్మ పత్నివి కావటం వల్ల నా జన్మ పరమ పవిత్రమైనదని భావించుకుంటున్నాను.

**ఎందరొ రాచకన్నెలు జనించిరి భారత ధాత్రిలోన – ఈ**
**చందముగాగ వీరగుణ సంపద కల్గెనె మున్ను దేవి! నీ**
**వందరకున్ శిరోమణివిగా  భవదీయ చరిత్ర క్రాలదే**
**సుందరగాత్రి భావియుగ శుభ్రచరిత్రల స్వర్ణపత్రమై**

**మాంచాల:** (ప్రవేశించి బాలుని పూలమాలతో అలంకరించి విల్లనంబు చేతికందుకొని) బావా!

**సమర క్షోణిని బాహు దర్ప మెసగన్ సంధించి చాపంబు న**
**దమలంబైన గుణంబు టంకృతులు సేయన్ కల్పవేళాగత**
**భ్రమితాంబోధ నినాదముల్ చెలగ గర్వస్ఫూర్తి మారొద్దగా**
**సమరోర్వీపతి కైన గుండియలు డిల్లైవోవగా పోరుమా!**

(మాంచాల అందించే విల్లును గౌరవపురస్సరంగా అందుకొని వీర ముష్టితో కళ్ళ కద్దుకుంటాడు)

# ఏడవ దృశ్యం

(గురజాలలో నాగమ్మకార్యాలోచనా మందిరము. యుద్ధ విషయిక సంభాషణ నడుస్తూ ఉంటుంది)

**నాగమ్మ:** (నివేదనా పూర్వకముగా) ప్రభూ! బాసపత్రికలు అందుకున్న మిత్రరాజులందరూ సమయం తప్పకుండా సైన్యాన్ని పంపిస్తున్నారు. వీర భల్లాణుడు లక్ష కాల్బలం, గజబలం నూరూ పంపించాడు. కామభూపతి పంపిన వేయి గుర్రపు దళం చేరింది. కాకతి ప్రతాపరుద్రుడు కాలర్లను కానుక లంపించాడు. సామంత రాజులే సైన్యానికి కావలసిన ఆహార పదార్థాలన్నీ అందజేస్తున్నారు. ఎవరుబట్టినా అవసరమైతే ఇంకా బలాన్ని పంపిస్తామనే వాళ్ళే–

**నరసింహరాజు:** (ఔత్సుక్యంతో) మన్నెరాజు ఏమన్నాడు మహామంత్రిణీ! గుండమ దేవుడి కోటలో గుర్రాలు మందలు మందలుగా ఉన్నవట కదూ? అతడేమన్నా–

**నాగమ్మ:** అతడి దేముంది మనకు ఆప్తుల్లోవాడు. తానే బలాన్ని వెంట నడిపించుకొని వస్తుంటాడు.

**నలగామరాజు:** దేశంలో ప్రజలో?

**నాగమ్మ:** (ఏహ్యాభావంతో) ప్రజలా! పశువులు. వాళ్ళు ఏమంటే మనకేం? ఎర చూపిస్తే ఎన్ని చేపలైనా వాలుతవి. అందులో యువరాజులుం గారు తానై ప్రచారం చేసిన తరువాత గుంపులు గుంపులుగా వచ్చి చేరరా?

**నరసింహరాజు:** (స్వాభిమానంతో) ప్రజల విషయం నేను ఘంటాపథంగా చెపుతాను. బ్రహ్మన్న పక్షంలో ఒక్క పురుగు చేరదు.

**చివరకు యుద్ధభూమిపయి చిక్కిన చిత్రవధల్ తొలంగవం**
**చవల కుటుంబ నాశనము లంచును నే బెదరించి వచ్చితిన్**
**ఎవియెవియో శుభం బనియ యెన్నియొ యాశను బెట్టి వచ్చితిన్**
**అవసరమైన బొక్కసము నంతయు వారికి క్రుమ్మిరించెదన్.**

అవసరమైతే బొక్కస మంతా కుమ్మరించి వేస్తానని చెప్పాను. ఆశమీద ఆశ ప్రేరేపించాను.

ఎర్రని రాగినాణెం కనబడని ఈ దినాలల్లో బంగారపు మాడలు ఎవరికి చేదు? – అంతేకాదు బ్రహ్మన్న వెర్రి వైష్ణవ బోధతో ప్రజ విసిగిపోయింది. చాపకూటితో సర్వం జగన్నాథం చేశాడని ఎంతో వ్యతిరేకభావం ప్రబలిపోయింది. బ్రహ్మన్న పేరు చెబితే దోవన బండి తోలుకునేవాడు కూడా మండిపడుతున్నాడు. ఊరూరా తిరిగి నేను ప్రచారం చేసిన తరువాత మన పక్షంలో చేరకుండా ఎలా ఉంటుంది ప్రజ? నేను నమ్మను. మత విషయాలు వాళ్ళకు చాలా వ్యతిరేకంగా ఉన్నాయి.

**నాగమ్మ:** (నిశ్చింతగా) అసలు ప్రధాన విషయమే అది, మన యుద్ధం కూడా అందుకోసమే. మహా దేవుడి కృపవల్ల అంత్యంలో జయం కూడా మనదే. గొడ్లుతోలుకుండే కుర్ర కుంకలను గుంపుచేసి మనమీద యుద్ధానికి ..... అమ్మ, బ్రహ్మన్నా! నిన్ను ఏ విష్ణు చక్రం వచ్చిఅడ్డుకుంటుందో

**నలగామరాజు:**

> **బాగురె బాగురే! తమిని చక్రము నంపునె బ్రహ్మనాయుడా**
> **భోగము జూడగా దగును పోరులలో మన పక్షమందు ను**
> **ద్వేగము మీఱ నిల్చి హరు నుజ్వల నేత్రమహాగ్ని పుంజముల్**
> **రేగి దహింప చక్రము హరీ హరి యంచును మొఱ్ఱవెట్టదో!**

మన ముక్కంటి త్రినేత్రం ముందు ముక్కముక్కలై పోదూ ఆ విష్ణుచక్రం!

**నరసింహరాజు:** (ఉత్సాహంతో లేచి నిలవబడి) మన సైన్యం గట్టిగా ఊపిరి విడుస్తే 'ఉఫ్' మని ఎగిరిపోయే వెధవలు వీళ్ళను గురించి ఇంత ఆలోచనా? మహామంత్రిణీ! వాళ్ళలో మొగకాశకట్టి మొగమీసం మెలె వేసిన మల్లు పేరు ఒకటి చెప్పు. మన శంకరరెడ్డి జగదేకమల్లు! త్రిలోచన మల్లు త్రిలోక మల్లు!! త్రిపురాంతక మల్లు దివ్యమల్లు!!! ముమ్మడిరెడ్డి, ముత్యాలు రెడ్డి, అయ్యపురెడ్డి – అఖండ యోధులు! వీరాధి వీరులు!! వెధవలు, వెధవలు!!! వీరులట! యుద్ధమట, నల్లిలా నలిపెయ్యక.

**(కోపం చల్లార్చుకుంటూ ఉంటాడు)**

**నాగమ్మ:** (పెద్దపెట్టుగా నవ్వి) యువరాజా! అంత చులకనగా మాటాడవద్దు. వాళ్ళల్లో ఎంతమంది మల్లులున్నారో తెలుసునా? సాలెమల్లు, చాకలి మల్లు, కంసాలి మల్లు, కమ్మర మల్లు, మంగల మల్లూ, మాదిగ మల్లూ.

**నలగామ:** (ఒక్క తడవగా) సరీ పోయింది, సంచు నేయనూ, ఉతకనూ, సాలెమల్లు, చాకలి మల్లు, నోరు కుట్టెయ్యనూ, తలమీద పెట్టు వెయ్యనూ కంసాలి మల్లూ, కుమ్మరమల్లూ, బుర్రగొరగనూ, పూడ్చి పెట్టనూ మంగల మల్లూ, మాదిగ మల్లూ.

(అందరూ విరగబడి నవ్వుతారు. ఇంతలో ఒక సేవకుడు ప్రవేశించి నమస్కారం చేసి)

**సేవకుడు:** ప్రభూ! ఎవరో రాయబారిట!!

**నలగామ:** వేళ్ళ బేరం కాళ్ళ కొస్తున్నట్టుంది.

**నాగమ్మ:** రాకేం చేస్తుంది. అందితే జుట్టూ, అందకపోతే కాళ్ళు.

**నలగామ:** మాట్లాడటమేనా?

**నరసింహరాజు:** రానివ్వండి. రభస చేసి పంపించేద్దాము. ఏ బాబుతో చెప్పుకుంటాడో, ఇచ్చిన చేరెడూ పుచ్చుకొని చెప్పుకింద తేలులా పడి ఉండక నిమిషానికొక రాయబారిట! రాయబారి!! ఇష్టం వచ్చినట్లు వాగి పోతారు. ఈ మాటు మితిమీరితే ఉప్పుపాతట్లో పాతేయిస్తాను.

**నలగామ:** మహామంత్రిణీ! తమ్ముడూ, నరసింహా! తప్పకుండా చెయ్యాలి. తైతక్కలాడిన అలరాజు హతమైనాడు.

**నరసింహ:** లేకపోతే (మీసం మెలివేస్తూ) అన్నగారిని అడ్డం వచ్చినట్లు అల్లుణ్ణి మాట్లాడటమా?

**నాగమ్మ:** ఇక అతణ్ణి ప్రవేశపెడదామా?

**నలగామ:** (సేవకుడితో) అతణ్ణి లోపలికి

**(సేవకుడు చిత్తమని నిష్క్రమిస్తాడు)**

**నాగమ్మ:** ఈ తడవ ఎవరిని పంపించి ఉంటారు?

**నరసింహ:** కొమ్మన్ననా?

**నలగామ:** అతడు నా గుమ్మం తొక్కనన్నాడు.

**నరసింహ:** (అవహేళనగా) అబ్బో! చాలా తక్కువైంది. ఆ పక్షి రాకపోతే మనమేమన్నా బతగ్గలమా?

(సేవకుని వెంట బ్రహ్మన్న పంపిన రాయబారి రణభట్టు ప్రవేశించి కొంచె పరచే కంఠంతో)

**మహారాజరాజా, మార్తాండతేజా!**
**విక్రమ బిడౌజా, వనితా మనోజా!!**
**పండిత సమాజా, సురలోక భూజా!**
**మైలమ తనూజా, నలగామరాజా!!**

**(వికటంగా నృత్యం చేస్తాడు)**

**నలగామ:** ఓరీ నీ పేరు?

**రణభట్టు:** నా పేరా? రణభట్టు.

**నలగామ:** ఏం రణమోయ్ తోరణం – (బిగ్గరగా) నీకీ వెధవ కవిత్వం ఎట్లా అబ్బింది?

**రణభట్టు:** తమబోటి కవిభోజులు దయవల్ల.

**నరసింహ:** వీడు గుండులా బాగున్నాడు, మహా మంత్రిణీ మన కాల్బలంలో చేరిస్తే – అబ్బీ చేరుతావా?

**రణభట్టు:** (కత్తిపైకెత్తి) ఆc కోపం ఉన్నవాళ్ళను తుత్తునియలు చేస్తాను.

**నరసింహ:** బ్రతకటానికేనా?

**రణభట్టు:** చచ్చినా, "చంపినవాళ్ళను" చంపటానికి

**నాగమ్మ:** భట్టూ! నీ వెందుకు వచ్చావు?

**రణభట్టు:** మీరంతా ఎట్లా ఉన్నారో చూచిపోవటానికి?

**నాగమ్మ:** చూచావుగా ఉc, కదులు.

**రణభట్టు:** కేవలం కళ్ళతోనే చూచాను.

**నాగమ్మ:** ఓహో! నీవు చెవులతో కూడా చూస్తావన్నమాట?

**రణభట్టు:** (దెబ్బకొట్టినట్టుగా) మాటల్తో చూచి ఆ చెవులకు వినిపిస్తాను.

**నలగామ:** ఏమిటా ధోరణి? ఎక్కడినుంచి వచ్చావు?

**రణభట్టు:** (స్థిరంగా) తండ్రి బ్రహ్మన్న దగ్గరినుంచి.

**నరసింహ:** ఓహో! తిమ్మన్న దగ్గిరినుంచా, అలా చెప్పు.

**నాగమ్మ:** అందుకే వీడికీ ఇంత తలతిక్క.

**రణభట్టు:** (కళ్ళెర్రచేసి) అన్ని తలతిక్కలూ ఆహవరంగంలో తీరుతాయి.

**నలగామ:** ఆహవరంగమా, ఎట్లా భట్టూ! భయమేస్తున్నదే.

**రణభట్టు:** (వెకిలిగా) మీకేం ప్రభూ! (నాయకురాలిని చూస్తూ) 'నాగం' ఉందిగా. పడగ అడ్డుపెట్టి గుండెలో గుచ్చుకునే బాణాలు ఆపుతుంది లెండి.

**నరసింహ:** అయితే భట్టూ! మీ సేనాపతెవరు?

**రణభట్టు:** కాలసర్పాలకు (నాగమ్మను చూచి) వెరవని కడజాతి కన్నమ.

**నరసింహ:** (ఆశ్చర్యం నటిస్తూ) అరెరె! చెప్పులన్నీ పూర్తి అయినవా?

**రణభట్టు:** (కనుగుడ్లు చిత్రంగా మిటకరించి) ఇక చెంప మీదికి ఎక్కటానికే తరువాయి.

**నాగమ్మ:** (కోపంతో) జాగ్రత్తగా మాట్లాడు, ఏనుగు చేత తొక్కిస్తాను.

**రణభట్టు:** రణరంగానికి తరలివస్తే ఆపని ఈ రణభట్టే తీరుస్తాడు దెబ్బకు దెబ్బ.

**నలగామ:** నీవు ఎవరి సభలో మాట్లాడుతున్నావో తెలుసునా?

**రణభట్టు:** తెలియకేం? బాగా తెలుసు. కీలుబొమ్మ సభలో.

**నాగమ్మ:** (కోపంతో కత్తి వరనుండి లాగి) ఇక నీ తోలు ఒలిచి రణభేరి చేయిస్తాను. (అని పైకి దూకబోతుంది).

**నలగామ:** మహామంత్రిణీ! శాంతించు. వీడు రాయబారిట.

**రణభట్టు:** ఇప్పుడు జ్ఞప్తికి వచ్చిందా. అల్లుడే రాయబారైనా, హత్య చేయటానికి వెనుకాడని మీకు రాజభటుడు లెక్కా. యువరాజా! అందుకు సిద్ధపడే వచ్చాను. నీ కత్తికి పదునుంటే చూచుకో.

**(అని గట్టిగా వూపిరి పీల్చి రొమ్ము విరుస్తాడు)**

**నరసింహ:** ఇక అధిక ప్రసంగం చాలించు. నీ కండలు కాకులకు వేయించుకోకు.

**నలగామ:** నరసింహా... భట్టూ! నీవు చెప్పదల్చుకున్నదేదో త్వరగా కానీ.

**రణభట్టు:** నా మాటలు ఏమీ లేవు ప్రభూ! అన్నీ బ్రహ్మన్న తండ్రివి.

**నాగమ్మ:** విసిగించక త్వరగా చెప్పు.

**రణభట్టు:** నీ కిందులో ప్రసక్తి ఏమీ లేదు.

**నలగామ:** (కోపంతో) భట్టూ! త్వరగా కానీ.

**రణభట్టు:** (నింపాదిగా) తండ్రి బ్రహ్మన్న మాటలివిగో... ప్రభూ! పగవృద్ధి పొందించే భ్రష్టులే కాని, ప్రక్కచేరి దానిని అడిగించే నేర్పరులు అరుదు. నరజన్మ దుర్లభం. అవ్యక్తకీటకమై అసాధువృత్తిలో చరించటం సులభం. పోరు మంచిది కాదు. యుద్ధం అశాంతికి మూలం. కాటకానికి కారణము. ప్రజలకు వినాశం. ధనవ్యయం. నీతికి దూరం. యశస్సుకు కళంకం. ధర్మ వినాశం. మీ అన్నదమ్ములను ఏకం చేసి మిమ్మల్ని అరివీరభయంకరులను చేయటం నా అభీష్టం. నరసింహరాజును పంపించి క్షమా భిక్ష వేడుకోటం ఇందుకు అత్యవసరం. మలిదేవ మహారాజు మనస్సు రక్తపాతానికి ఒప్పుకోటం లేదు. నా మనస్సు అంతకంటే వెనుకాడుతున్నది. అందుకు మీరు అంగీకరించని పక్షంలో రక్తపాతానికైనా, రాజు వెనుతీయటం లేదు. మళ్ళీ రాయబారిని పంపించటం మా అల్పత్వం కాదు. చివరకు ధర్మానికే జయ మన్న సంగతి మరువవద్దు.

**నరసింహ:** అబ్బా! ఉపన్యాసం అప్పుడే అయిపోయిందా? వినటానికి చాలా కమ్మగా ఉంది.

**నలగామ:** మహామంత్రిణీ! విన్నారా? – (వికటంగా)

> **రాజ భక్త్యుత్సాహ రాజ్యాంగ వేత్తలౌ**
> **పారి పార్శ్వకు లెల్ల భ్రష్టులంట,**
> **సాధు సంపత్తీల సౌభాగ్యములు లేని**
> **అవ్యక్త కీటకం బైతినంట,**
> **నరసింహు దర్థింప నాకై క్షమాభిక్ష**
> **అరివీరభయదుడ నౌదు నంట,**
> **రక్తపాతము చేయ 'రాజాధి మహారాజు'**
> **మలిదేవునకు బుద్ధి మసల దంట,**
> **వింటివా, మహామంత్రిణీ! వీనులొగ్గి**
> **పెంపుతో మన మంగీకరింపకున్న**
> **రక్తపాతంబె కానిమ్ము రాక మనసు**
> **తట్టుకోనిమ్ము సమరంబు తప్పదంట.**

**నాగమ్మ:** ప్రభూ! ఇది ఒక ఎత్తు. మళ్ళీ ఒక తడవ బెదిరిస్తే మహా రాజేమన్నా లొంగుతాడేమోనని, మాటలతో మసిపూసి మారేడు కాయ చేయదల్చుకున్నాడు బ్రహ్మన్న.

**నలగామ:** భట్టూ! మీ రాజు యుద్ధానికి సిద్ధపడ్డాడా?

**రణభట్టు:** సిద్ధపడటమేమిటి కారెంపూడి కదనరంగం. సైన్యాలు బారులు తీర్చినవి. నాగులేరు దాహంతో రక్తం తాగటానికి నాలుక జాపు తున్నది. మీకిష్టమైతే మేము అందీయటమే ఆలస్యం.

**నరసింహ:** మహామంత్రిణీ! కదనరంగం కారెంపూడిట,

**నాగమ్మ:** మనకు కారెంపూడి అయినా ఒకటే, కైలాసమైనా ఒకటే. వచ్చే శివరాత్రి నాటికి కదనరంగానికి చేరుకుంటామని వార్త పంపండి.

**నలగామ:** మహామంత్రిణీ! శుభదినం.

**ఎంతేనిన్ శుభమైనదా దినము భూతేశుండు స్వాంతంబునన్**
**పంతంబూని సమస్త లోకముల దీవ్యచ్ఛక్తి పోకార్చున**
**త్యంతంబున్, నటియించు తాండవము నుద్యద్దివ్య దర్పోద్ధతిన్**
**సంతోషంబుగ, నెంతయున్ శుభదినం బానాడు, పోరాడగన్**

భూతేశుడు ప్రళయకాల నృత్యం ప్రారంభించే దినం. భట్టూ! వెళ్ళి చెప్పు, బ్రహ్మన్నను సిద్ధపడమను.

**నరసింహ:** భట్టూ! ప్రాణాలు దక్కవను. మా బల్లెపు పోట్లు భరించలేరని చెప్పు. నరసింగరాజు సర్వసేనాధిపతియని చెప్పు. ఈ సమస్తాన్ని నడిపించేది నేనని చెప్పు.

**నాగమ్మ:** నాగమ్మ ఒక సేనని నడిపిస్తుందని చెప్పు.

**రణభట్టు:** నాగమ్మ నడిపించినా, నరసింహుడు నడిపించినా నా తండ్రి బ్రహ్మన్న భయపడడు. ప్రళయ కాల రుద్రుడు మీ వైపు రణరంగంలో త్రినయనం తెరిచినా బ్రహ్మన్న తండ్రి భయపడడు. బ్రహ్మన్న భటుడు ఒక్కడైనా ఉలకడు. మరుమాట పలుకడు. శత్రురక్తంతో అలరాజుకు తర్పణం విడిస్తే కాని శాంతి వహించడు. ఆచార రక్షణం అనే పేరుతో జరిగే దురాచారాలను అంతమొందిస్తే కాని నిద్రపోడు. ఆహవరంగంలో అపజయమన్నది ఎరుగడు ఆ బ్రహ్మన్న. మీ పాపకృత్యాలకు ప్రతిఫలం మరుసటి జన్మల్లో కూడా అనుభవిస్తారు.

**(నిష్క్రమణ)**

**నాగమ్మ:** ప్రభూ! మన సేవలనూ రేపే కదిలించడం ఉత్తమం. గడువు త్వరలోనే పెట్టుకున్నాము.

**నరసింహ:** మళ్ళీ ఆలస్యమైనకొద్దీ, ఆవేశం చల్లారిపోతుంది. ఈ పీడ త్వరగా వదిలించుకోటం మంచిది. తరువాత సుఖంగా గుండె మీద చెయ్యివేసుకొని నిద్రపోవచ్చు.

**నలగామ:** అవును. శత్రువంత గొప్పవాడు కాకపోయినా చమిరి వేసేదాకా ఉత్తమ క్షత్రియుడు నిద్రపోలేడు.

**నాగమ్మ:** కాని, ప్రభూ! రేపే బయలుదేరటానికి వీలు లేనట్లున్నది.

**నరసింహ:** ఆలస్యమెందుకు?

**నాగమ్మ:** మన కేతరాజు రాలేదు.

**నలగామ:** తాను వచ్చేటంత వరకూ సైన్యాలను కదిలించవద్దని పత్రిక పంపించాడు కూడా.

**నరసింహ:** అంతగా అతను వస్తే దారిలో కలుసుకుంటాడు.

**నాగమ్మ:** అతడికి కోపం వస్తుందేమో!

**నలగామ:** అతని మనఃప్రవృత్తి అటువంటిదే.

**నాగమ్మ:** అరుగో కేతరాజులుంగారు రానే వచ్చాడు.

**కేతరాజు:** (ప్రవేశించి) మహారాజా! నమస్కారము. (సౌహార్ద్ర పూర్వ కముగా) మహామంత్రిణీ కుశలమా? నరసింహా...

**నలగామ:** తండ్రీ! కేతరాజూ! కోటలో అంతా క్షేమమా? భీమరాజులవారి అస్వస్తత ఏమైనా నెమ్మళించిందా?

**నరసింహ:** అందరూ క్షేమమేనా, రాజూ!

**కేతరాజు:** అమరేశ్వర స్వామి కృపవల్ల అంతా కుశలమే.

సైన్యాన్ని వెంటపెట్టుకొని రమ్మని వార్త పంపారు. యుద్ధానికి నిశ్చ యించుకున్నారా ఏమిటి?

**నలగామ:** నిశ్చయించుకోవటమేమిటి? కదనరంగం కారెంపూడిట. బ్రహ్మన్న, అన్న, యుద్ధం చేసేదాకా వదిలేటట్టు లేరు.

**నాగమ్మ:** రాయబారిమీద రాయబారిని పంపించి ఇష్టం వచ్చినట్లు పేలిస్తున్నారు.

**నరసింహ:** యుద్ధం చెయ్యక తప్పదులే రాజూ!

**కేతరాజు:** అన్నదమ్ముల మధ్య అంతఃకలహం నాకేమీ నచ్చటం లేదు.

**నాగమ్మ:** యుద్ధాన్ని ఆపటానికి ఎంత ప్రయత్నిస్తున్నా రెచ్చకొడుతుంటే ఎట్లా తప్పుతుంది?

**కేతరాజు:** రాబొయ్యే అంతఃకలహంలో, ఉభయ పక్షాలకు బంధువులం అయిన మాకు చాలా దెబ్బ. అయినా యుద్దానికి దిగవలసినంత అగత్యం ఏమి వచ్చింది. ఏదోవిధంగా పరిష్కారం చేసుకోటం మంచిది కదా? ఆ పని యుద్ధం ప్రారంభం కాకముందే చూచుకోటం మంచిది. దీపముండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి కదా.

**నలగామ:** ఎంత తప్పించుకుందామని ప్రయత్నించినా పైన బడుతుంటే ఏం చేసేది రాజూ!

**కేతరాజు:** వీళ్ళ కోరిక ఏమిటిట?

**నరసింహ:** నన్ను అవమానించటం.

**కేతరాజు:** దేనికి ఏం కడుపు నిండుతుందని?

**నరసింహ:** అలరాజును నేను చంపించానని దేశంలో అల్లరి పుట్టింది. అందుకు వాళ్ళ కాళ్ళమీద పడాలట.

**కేతరాజు:** రెండువైపులా కసి బాగా పెరిగిపోయినట్లుంది. మహామంత్రిణీ! ఏవిధంగానైనా, యుద్ధాన్ని ఆపుచేయిస్తే మంచిది. దేశానికి క్షేమం, మీకు క్షేమం. మాకు క్షేమం.

**నలగామ:** ఇవన్నీ ఆలోచించే, ఆ పనికి వేము ఎంత ప్రయత్నించినా మితిమీరిపోయింది.

**నరసింహ:** రేపే సైన్యాలు యుద్ధరంగానికి బయలుదేరటం?

**కేతరాజు:** తొందరపడవద్దు.

**నలగామ:** మహా శివరాత్రి నాడే యుద్ధమని వార్త పంపించాము.

**కేతరాజు:** మహామంత్రిణీ! మళ్ళీ ఒక్క తడవ ప్రయత్నించటం క్షేమకరం.

**నాగమ్మ:** మీ ఇష్టానుసారంగా నడుస్తాము. (నలగాముడితో) ప్రభూ! మళ్ళీ ఒక తడవ చూద్దాము.

**నలగామ:**

ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఫలితం అంతకంటే వేరుగా ఉండదు మహామంత్రిణీ!

> **అన్ని ప్రయత్నముల్ విఫలమైనవి మాయెడ ప్రేమలేదు బ్ర**
> **హ్మన్నకు, నిన్న మొన్న మన మాతురతన్ వహియించి సంధికై**
> **ఎన్నగ రాని యత్నమొనరించిన కల్గిన దేమి? నోచకే**
> **దెన్నటికైన సంధి కలనౌనియు కల్గుట కౌను మంత్రిణీ!**

**కేతరాజు:** స్వయంగా వెళ్ళి బ్రహ్మన్న మంత్రిని ఒప్పించి వస్తాను.

**నాగమ్మ:** ఆ పక్షంలో తప్పకుండా బయలు దేరటం మంచిది. వెళ్ళి రావలసిందే. వాళ్ళు మటుకు సంధి కంగీకరించరు. ఇది రూఢిమాట... ప్రభూ! మరొక పని చెయ్యటం మంచిదేమో?

**నలగామ:** ఏమిటది మహామంత్రిణీ!

**నాగమ్మ:** సైన్యాలన్నీ వాళ్ళు కదనరంగంలో బారులు తీర్చి నిలవబెట్టారు. మనం కూడా మొదట అనుకున్నట్లే రేపు బయలుదేర తీసి యుద్ధభూమికి చేర్చి కేతభూపతిని సంధికి పంపిద్దాము. యుద్ధం మానుకొమ్మని చెప్పించి చూద్దాము.

**కేతరాజు:** ఆ పని బాగుంది. అంతగా తలకు మించితే అప్పుడే యుద్ధం చెయ్యవచ్చు.

**నరసింహ:** (కొద్దిసేపు ఆలోచించి) మహామంత్రిణీ! చాలా బాగున్నది.

**(నలగామరాజు ఆలోచనా నిమగ్నుడై వుంటాడు)**

**నాగమ్మ:** ప్రభూ! దీనికి ఆలోచన అనవసరం. చింతించి ప్రయోజనం లేదు మీరేం చేస్తారు. యుద్ధం మాన్పించటానికి విశ్వప్రయత్నం చేశారు. విఫలమైనారు. వెధవల చేతుల్లో వెర్రి మొర్రి మాటలన్నీ పడ్డారు.

**నలగామ:** ఏదో ఒకటి మధ్యాహ్నము నిశ్చయిద్దాము.

**నాగమ్మ:** కార్యాలోచన మధ్యాహ్నమే ప్రారంభిద్దాము.

**నలగామ:** కేతరాజూ బయలుదేరుదామా?

**(నిలవబడి నిష్క్రమణ ప్రారంభిస్తాడు)**

**కేతరాజు:** (లేచి రాజు ననుసరిస్తూ) ఎలాగైనా సంధి పొసగితే ఎంత బాగుంటుంది.

**నలగామ:** నా కోరిక కూడా అదేనోయ్ రాజూ. చివరకు నష్టమెవరికి? ప్రజకు. ప్రజలెవరు? నా బిడ్డలు కారూ.

**(కేతరాజు, నలగామరాజు నిష్క్రమిస్తారు)**

**నరసింహ:** మహామంత్రిణీ! కేతరాజు సంధి జరిగించేస్తాడేమో! అప్పుడు మన కోరికలన్నీ భగ్నమౌతవి. అన్నను యుద్ధంలోకి తరమటానికి అవకాశముండదు. (బిక్కమొగం పెట్టి)

**నా సంతోషము సన్నగిల్లినది యన్నన్ జూడఁగా కేతరా**
**జున్ వచ్చెను, మాట నేర్పరి, యతం డాప్తుండు  ఏ మాడునో**
**ఈ సన్నాహము సర్వమున్ జెడును, సంధేయైన నో మంత్రిణీ!**
**ఆ సింహాసన మెక్కు గీత విధి వ్రాయన్ లేదె నా మోమునన్.**

రాజ్య సింహాసనం ఎక్కే గీత నా మొగాన వ్రాయనట్లున్నదే! మహామంత్రిణీ!

**నాగమ్మ:** సంధి జరగటమూ, కల్ల. ఎదుట పరసైన్యాన్ని చూస్తూ ఏ వీరులు సంధి కంగీకరిస్తారు? రణభట్టు పడ్డ అవమానాన్ని, బ్రహ్మన్నకు చెప్పక ఊరుకోడు. అలరాజు మృతి, పేరిందేవి సహగమనాలు, కొమ్మరాజును సంధికి ఒప్పుకోనిస్తాయా?

**నరసింహ:** (యోచించి) ఒప్పుకో నివ్వవు.

**నాగమ్మ:** ఈ తడవ అర్ధరాజ్యం, గోవులు, పుల్లరేకాకుండా మరచిపోయింది మరొకటడుగుతారు. దానితో సంధి కుదరదు. యుద్ధం తప్పదు.

**నరసింహ:** తమ బుద్ధి బలానికి నేనెప్పుడు వందన సహస్రాలు అర్పిస్తున్నాను. నా మీద కనికరం తప్పకూడదు.

**నాగమ్మ:** (పేచీగా ఓరచూపుతో) మీ మీదనా! అదంతా నా హృదయానికే తెలుసు.

**నరసింహ:** మరచిపోయినాను. మరిచిపోయింది మరొక్కటి వాళ్ళు కోరుతారన్నారు. అదేమిటి?

**నాగమ్మ:** మంత్రిత్వ విషయం. నన్ను తొలగించమని తప్పకుండా కోరుతారు.

**నరసింహ:** అన్న అంగీకరిస్తాడేమో !

**నాగమ్మ:** దానికి తగ్గ నాటకం నేను ఆడలేకపోతేనా? సంధి పడనివ్వ కుండా చేసే భారం నాది.

**నరసింహ:** చేతిలో చెయ్యి వెయ్యండి.

**(చేయి జాపితే నాగమ్మ చెయ్యి వేస్తుంది)**

ఈ నరసింహుడి కోరికలన్నీ ఫలిస్తే నాగమ్మ... మహా మంత్రిణికి బ్రహ్మరథం పట్టించడూ.

**నాగమ్మ:** ఆ పని చెయ్యవనే అనుమానం ఏ కోశానా లేదు. ఇక లేద్దామా? (నరసింహరాజు లేస్తాడు)

**నాగమ్మ:** బయలు దేరండి. వెంటనే సైన్యాలకు రేపే బయలుదేరాలని చెప్పండి. (నరసింహుడు నడుస్తుంటాడు) శివరాత్రి నాడు యుద్ధ ప్రారంభమని కూడా.

**(నరసింహరాజు తల ఊపి నిష్క్రమిస్తాడు)**

(నాగమ్మ ఏకాంతముగా ఆలోచనా నిమ్మగ్నురాలై ఎదుట ఉన్న కాత్యాయనీ విగ్రహాన్ని ఉద్దేశించి ఉచ్చకంఠంతో దేవీ, కాత్యాయనీ! అని సంబోధించి)

**నమో నమో రణచండిక!**
**యమ జిహ్వాక నమో నమో!!**
**కాళరాత్రి గాయత్రీ**
**లంకేశ్వరి హుంకారీ**
**నమో నమో రణ చండిక**
**యమ జిహ్వాక నమో నమో!**
**కదన ప్రియ అభయప్రద!!**
**దుర్జయినీ హే! జననీ**
**నమో నమో రణ చండిక!**
**యమ జిహ్వాక నమో నమో!!**

**(అని ప్రార్థించి కత్తి సారించి నిష్క్రమిస్తుంది)**

# ఎనిమిదో దృశ్యం

(కారెంపూడి యుద్ధరంగము. బ్రహ్మనాయుని శిబిరములో ఆయన పూర్వ సేనాపతి కొమ్మరాజుతో చదరంగ క్రీడ జరుపుతుంటాడు. సేనాధిపతి కన్నమదాసు సేనలను పర్యవేక్షణ చేస్తూ వుంటాడు)

**బ్రహ్మన్న:** బావా! నీ రెండు శెకట్లూ చచ్చిపోయినయ్.

**కొమ్మన్న:** అయితే మంత్రిని నడిపిస్తాను – ఇదిగో రాజు.

**బ్రహ్మన్న:** సరిగ్గా చేతికి చిక్కావు... నీ మంత్రి (పాచికను నడిపించి) ఈ గుర్రంతో సరి... రాజును తప్పుకో. జంట యెత్తులో నీ మంత్రి మసి.

**కొమ్మన్న:** నీ గుర్రాన్ని తీసేస్తున్నాను.

**బ్రహ్మన్న:** నా బంటుతో రాజు... తప్పుకో నా బంటు మంత్రి అవుతాడు. తోసిరాజని ఆట కట్టిస్తాను. ఇదిగో ఆటకట్టు.

**కొమ్మరాజు:** నీవెంత కైనా చాత నైనవాడివి... మహా మంత్రీ... ఈ రాజునే కాదు నలగామ రాజునైనా నీ బంటుతోనే కట్టిస్తావు. తలనొప్పిగా వున్నది... ఇక ఆట...

**కన్నమ:** (హడావుడిగా ప్రవేశించి) తండ్రీ! ఇక ఎంత కాలము? ఈ వీరులను ఇక ఆపలేను. త్వరగా సెలవియ్యండి.

**బ్రహ్మన్న:** తొందరపడితే ఎలా నాయనా! ఇప్పటికైనా వాళ్ళ మనస్సు తిరుగుతుందేమో

**కన్నమ:** ఇంకా తిరగటమా తండ్రీ... అనుజ్ఞ!! కొంత బలాన్ని ముందుగా నది దాటిస్తాను.

**(వీరముష్టితో నమస్కరిస్తాడు)**

**బ్రహ్మన్న:** తొందర పడకు తండ్రీ! యుద్ధమంటే, నీకేమీ అర్థం కానట్లున్నది. తీరా దిగినతరువాత సగంలో వెనక్కు రాము. అందులో ఈపలనాటి వీరులకు ఒళ్ళు తెలియని పౌరుషం వచ్చేస్తుంది. కొంచెం శాంతించు నాయనా!

**కన్నమ:** నేను సైన్యాలను ఆపలేకుండా ఉన్నాను తండ్రీ! (తెరలో కలకలం) ఓ యోధులారా! కొంచెం శాంతించండి.

**బ్రహ్మన్న:** (పానీయ పాత్ర లోపలికి తీక్షణంగా చూస్తూ ఉన్న కొమ్మరాజుతో) ఏమిటి బావా, తీక్షణంగా పరిశీలిస్తున్నారు?

**కొమ్మరాజు:** (చూపిస్తూ) ఈ ఈగను చూడండి మహామంత్రీ!

**బ్రహ్మన్న:** (వంగి చూస్తున్నట్లు మెడ సారించి) ఇప్పపువ్వు సారాయిలో పడ్డ ఇది భయంకర రణరంగంలో పడిపోయిన బ్రహ్మన్న మాదిరిగానే తప్పించుకోటానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నది. రణభట్టు రాయబారమైనా విఫలం కాకుండా ఉంటే ఎంత బాగుండేది.

**సేవకుడు:** (ప్రవేశించి) ప్రభూ! రాయబారిట.

**బ్రహ్మన్న:** (ఆశ్చర్యంతో ముఖం పైకెత్తి) ప్రవేశపెట్టు.

**(సేవకుడు నిష్క్రమిస్తాడు)**

(కొమ్మన్నతో) ఈ రాయబారి ఎక్కడినుంచి?

**కొమ్మరాజు:** నాగమ్మ మతి ఏమైనా తిరిగి ఉంటుందా?

**కన్నమ:** ఇంకా మీకెక్కడి వెర్రి. దిక్కులు తారుమారైనా ఆ మనిషి గుండె తిరగటం కల్ల. త్వరగా అనుజ్ఞ ఇవ్వక ఇంకా ఎందుకీ ఆలస్యం?

(ఒక సైనికుడు త్రోవ చూపిస్తుంటే కోటకేత రాజు ప్రవేశిస్తాడు)

**బ్రహ్మన్న:** ఎవరూ? ధరణికోట యువరాజు! కోటకేతూ!! రా! నాయనా, (కూర్చోమని హస్తసంజ్ఞ) భీమరాజుల వారికి కుశలమా?

**కేతరాజు:** (ఆసనమలంకరిస్తూ) అమరేశ్వర స్వామి కృప వల్ల, రణగండ్ల యుద్ధంలో మీరు చూపించిన అవక్ర పరాక్రమాన్ని నాకు కథలుగా వినిపించి ఎప్పుడూ మీ ప్రశంస చేస్తుంటారు బాబూ!

**బ్రహ్మన్న:** వారికి నానతులని చెప్పునాయనా! గడిచి బ్రతికితే వచ్చే కార్తిక పౌర్ణమికి అమరేశ్వర దర్శనం, భీమరాజులవారికి ప్రీతిపూర్వక నమస్కారం.

**కేతరాజు:** గడచి బ్రతుకవలసినంత అగత్యం ఏమున్నది బాబూ? అంతా మీ ఇష్టప్రకారమే కానివ్వండి.

**కొమ్మరాజు:** యువరాజా! నాగమ్మ మిమ్మల్ని పంపించిందా?

**కేతరాజు:** అవును రాజూ! ఏవిధంగానైనా సంధి పొసగించుకొని రమ్మన్నది. రాజు అంగీకరించాడు.

**బ్రహ్మన్న:** మలిదేవ మహారాజుకు అర్ధరాజ్యం ఇవ్వటం అంగీకారమేనా?

**కేతరాజు:** అవును బాబూ!

**కొమ్మరాజు:** ఆరునెలల పుల్లరీ పంపిస్తుందా?

**కేతరాజు:** ఇదిగో నా వెంటనే పంపించింది.

**కన్నమ:** మా గోవులను వదిలి పెడతారా ప్రభూ?

**కేతరాజు:** (తీక్షణంగా చూచి) వెంటనే వదిలి పెట్టేటట్టు చేయిస్తాను.

**బ్రహ్మన్న:** అయితే...

**కేతరాజు:** సంధి పొసగినదన్నమాటే.

**బ్రహ్మన్న:** సంతోషం!

**కేతరాజు:** బ్రహ్మప్రయత్నం చేశాను. అన్నదమ్ములు మీరు పోరుకు దిగితే పునీతమైన పల్నాటిసీమ పొలికలనై పోతుందని చెప్పాను. విశ్వ ప్రయత్నం మీద అంగీకరించారు. ఉఁ అయితే..

(బ్రహ్మన్న కొమ్మరాజు కన్నమ చెవులు రిక్కించి వినటం అభినయిస్తారు)

అన్నదమ్ములందరూ ఏకమై రాజ్యాన్నంతా ఏకచ్ఛత్రాధిపత్యం కింద పరిపాలించుకుంటే ఎలా ఉంటుంది?

**బ్రహ్మన్న:** (పరమానందంతో) అది నాకు మరీ సంతోషం.

**కన్నమ:** (అసంతృప్తితో గద్గదకంఠుడై) తండ్రీ!

**బ్రహ్మన్న:** కన్నమా... అడ్డు రావద్దు.

**కేతరాజు:** సంధి పత్రిక ఇప్పిస్తారా?

**బ్రహ్మన్న:** (తలమీద చేయి పెట్టుకుని ఆలోచిస్తున్న కొమ్మరాజుతో)

బావా! మీకు అంగీకారమేనా?

**కొమ్మరాజు:** అలరాజు మరణించిన తరువాతనైనా అన్నదమ్ములు తిరిగీ ఆత్మబంధువులవుతున్నారు. తాత్కాలికంగా పౌరుషవాక్యాలు పలికినా దేశాన్ని యుద్ధప్రళయంలో దింపమనడీ కొమ్మరాజు.

**కేతరాజు:** (త్వరగా తీసి తాళపత్రం అందిస్తూ బ్రహ్మన్నతో) ఇక సంధి పద్ధతి వ్రాయించండి. మలిదేవ మహారాజెక్కడ?

**బ్రహ్మన్న:** అవతల గొల్లెనలో నిద్రపోతున్నారు. వారి అంగీకారం నేను ఇప్పిస్తాను బావా! పత్రం తీసుకోండి అదిగో ఘంటం.

**కొమ్మరాజు:** (కేతరాజు చేతిలో పత్రం అందుకొని బ్రహ్మన్న చూపిస్తున్న ఘంటం తీసుకొని వ్రాయటాని కుద్యుక్తుడై) ప్రారంభించండి.

**బ్రహ్మన్న:** రాజాధిరాజ

**కొమ్మరాజు:** ఉ!

**బ్రహ్మన్న:** రాయవేశ్యాభుజంగ

**కొమ్మరాజు:** ఆఁ!

**బ్రహ్మన్న:** విభవ దేవేంద్ర వీరకామ నరేంద్ర రాజేంద్రులవారికి

**కొమ్మరాజు:** ఉఁ!

**బ్రహ్మన్న:** హై హయ వంశ పారావార విజ్జలదేవీ గర్భశుక్తి ముక్తా ఫలం శ్రీమలిదేవమహారాజు వ్రాయించి ఇచ్చిన... (పెద్ద గొంతుతో) సంధి పత్రం...

**బాలచంద్రుడు:** (వీరాకృతితో సాటోపంగా ప్రవేశించి వీరముద్రికతో నమస్కరిస్తూ) సంధిపత్రం... ఎవరితో సంధి, ఎందుకు సంధి.... ఎలా సంధి?

**(కోటకేతు, కన్నమ, బ్రహ్మన్న బిత్తరపోయి చూస్తుంటారు)**

**కొమ్మరాజు:** బాలుడూ ఏమిటిది?

**బ్రహ్మన్న:** నాయనా! నీవేమన్నా చెప్పదలచుకున్నావా? లే!

**బాలచంద్రుడు:** (లేస్తూ) అవును సంధి పనికిరాదని చెప్పదలుచుకున్నాను.

**బ్రహ్మన్న:** కారణం నాయనా?

**బాలచంద్రుడు:** అర్ధరాజ్యం ఇస్తారటనా?

**బ్రహ్మన్న:** ఆఁ!

**బాలచంద్రుడు:** గోవులు వదిలి పెడతారా?

**కొమ్మరాజు:** ఆఁ!

**బాలచంద్రుడు:** పుల్లరి చెల్లిస్తారా?

**బ్రహ్మన్న:** ఆఁ!

**బాలచంద్రుడు:** (జ్ఞప్తికి తెచ్చుకుంటూ) ఇంకా!

**బ్రహ్మన్న:** అన్నదమ్ములు అందరూ ఏకమై గురిజాల నుంచి పరిపాలించు కుండేటట్లు సంధి.

**బాలచంద్రుడు:** అదీ, కావలసిన సంగతి. రాజ్యచక్రం త్రిప్పించేది మహామంత్రిణి నాగమ్మేనా?

**(కోటకేతరాజు తెల్లబోయి ముఖం తేలవేస్తాడు)**

**బ్రహ్మన్న:** అయితే ఏం నాయనా?

**బాలచంద్రుడు:** అది పనికిరాదు. యుద్ధం జరిగి తీరవలసిందే రాబొయ్యే ఈ ఆహవజనమేజయ సర్పయాగాగ్నిజ్వాలల్లో కాలకూట విషం కక్కుతూ నాగమ్మ, మహానాగం, మండి మారణహోమం కావలసిందే. ఆమె ఉన్నంత వరకూ దేశంలో అంతఃకలహాలు తప్పవు.

**బ్రహ్మన్న:** (ప్రశాంతముగా) సంధి పడగొట్టకు తండ్రీ! అంతటి నాగమ్మ ఇంతవరకూ వచ్చిందంటే ఏదో మార్పుంటుంది.

**బాలచంద్రుడు:** మార్పా? మళ్ళీ కోడిపందాలాడించటం.

**కొమ్మరాజు:** యుద్ధం దేశానికి ఉపద్రవం తండ్రీ!

**బ్రహ్మన్న:** కలుషాలకు నిలయం. కాటకానికి కారణం... పుంస్త్వానికి వేరుపురుగు.

**బాలచంద్రుడు:** యుద్ధం వీరక్రీడ. స్వర్గప్రస్థానానికి ప్రథమ సోపానం. వీటన్నిటికీ కారణం యుద్ధం కాదు. ఉవిద నాగమ్మ,. పెద్దవాళ్ళి యుద్ధం చెయ్యలేక మీరు పిరికి పడిపోతున్నారు. ధర్మయుద్ధానికి తరలి రాలేని మీ బిరుదులు తరవాత తగలెయ్యనా? మగకాశకట్టి సంధికి ప్రాకులాడటం...

**కన్నమ:** ఆc! ఆc! తండ్రికపనింద. మామకమర్యాద. వారి దండిమగటిమి నీకేం తెలుసు బాలుడూ. నీవు నిజంగా బాలుడివి. మరొకమాట రానియ్యకు. (కత్తి జళిపిస్తాడు)

**బాలచంద్రుడు:** పోతులా చియ్యబట్టినా పోరు పనికిరాదన్న ఈ పెద్దవాళ్ళ పక్షం పలికే యీ బాహుబల సంపన్నుడెవరు?

**కన్నమ:** ఇక సహించను, బాలుడూ!

**బ్రహ్మన్న:** శాంతించండి నాయనా! శాంతించండి. అన్నదమ్ముల మధ్య అంతఃకలహం పనికిరాదు.

**బాలచంద్రుడు:** ఇతడు నాకు అన్నా?

**కొమ్మరాజు:** అవును తండ్రీ... ఇతడు కన్నమ. వీర కన్నమ. సర్వసేనాధిపతి కన్నమ... బ్రహ్మన్న మహామంత్రి జ్యేష్ఠపుత్రుడు.

**బాలచంద్రుడు:** (ముందుకు నడిచి వీరముష్టితో నమస్కరించి) అన్నా క్షమించు... నీవు వీరకన్నమవని తెలియక తప్పిదం చేశాను.

**కన్నమ:** (బాహువులు చాచి) ఆర్ద్రంగా తమ్ముడూ! (ఇద్దరూ కౌగిలించుకుంటారు)

**బ్రహ్మన్న:** (కేతరాజు వైపు తిరిగి) బాలుడన్నది విచారింపవలసిన విషయమే. ఆ నాగమ్మ మంత్రిణిగా వుంటే భవిష్యత్తులో విపత్తు మళ్ళీ సంభవించకుండా ఉంటుందా అనే సందేహం కూడా సమంజసమైనదే.

**కొమ్మరాజు:** ఈ బ్రహ్మన్న కాబట్టి ఇంతవరకైనా యీ తడవ నెగ్గగలిగాడు.

**బ్రహ్మన్న:** కేతరాజూ... ఈ మాటకు నాగమ్మ ఏమంటుందో!

**కేతరాజు:** మంత్రిత్వాన్ని త్యజించటానికి అంగీకరించదు.

**కన్నమ:** ఆ పక్షంలో యుద్ధం సాగవలసిందే.

**బాలచంద్రుడు:** అన్నా! మనం యువకులం. భావి రాజ్య భారం మన బాహువుల మీద పడుతుంది. మేలుకోవలసింది మనం. ఈ బాలుడిక ఆగలేడు. బలంతో ముందు దూకబోతున్నాడు.

**బ్రహ్మన్న:** యువక జనోత్సాహానికి అడ్డు చెప్పటం అంత మంచిది కాదేమో కేతరాజూ!

**కన్నమ:** (త్వరగా ప్రక్కకు నడచి) వీరాగ్రేసరులారా! ఇక వీరవసంతం చల్లుకోండి. వీరపూజలు చెయ్యండి. కడుపు నిండా కల్లుకుండలు నింపండి. శక్తి జాతరలు చేసుకోండి.

**(ముందుకు నడుస్తూ నిష్క్రమిస్తాడు)**

**బ్రహ్మన్న:** తండ్రీ, కేతరాజూ! ఇక నిష్ప్రయోజనం! కల్లుకట్టలు తెగిపోతున్నవి. ఈ కడలిని బ్రహ్మన్న బాహువు లొడ్డి ఆపలేడు. సుపవిత్రమైన యీ పలనాటిసీమ... రక్తపు వరదకు గురికావలసిందే... కొన్ని వత్సరాలు పిశాచాలు పండవలసిందే.

**కేతరాజు:** అయితే ఇక బయలుదేరుతాను... సెలవా?

**బ్రహ్మన్న:** అవశ్యము నాయనా... భగవదనుగ్రహం ఎలా వుందో!

**(దారి చూపిస్తాడు. కోటకేతరాజు నిష్క్రమిస్తాడు)**

**బాలచంద్రుడు:** తండ్రీ! నాకు సెలవా?

**బ్రహ్మన్న:** నాయనా! యుద్ధరంగంలో దూకబోతున్నావు. నేను మటుకు కత్తి పట్టను.

> **భ్రమతో నేగుచునుంటివో రణమునన్ పాండిత్యమే యున్నదో,**
> **సమరోదగ్రులు శాత్రవుల్ కరుణకున్ స్థానమ్ము శూన్యమ్ము, స**
> **ర్వము కాలానల భైరవ ప్రళయ మోర్వంజాలినన్ పొమ్మునే**
> **నమరుల్ సాక్షిగ కత్తిపట్టను, విజయైకాంక్ష నో బాలుడా**

**బాలచంద్రుడు:** పేరు బాలుడే కాని బిరుదు మగణ్ణితండ్రీ! మీరు కత్తి పట్టడం ఎందుకు భవిష్యద్భారాన్ని మోయవలసిన మీ యువక లోకాన్నే పరదళాల మీదికి పంతం తీర్చటానికి పంపండి. ఈ బాలుడు చిల్లర దళాల మీద చెయ్యి చేసుకోడు.

**బ్రహ్మన్న:** (బుజం తడుతూ) అనేక యుద్ధాలల్లో ఎదురు నిలవలేక చిక్కి చెప్పినట్లు శిరసాడించిన రాజులందరూ పగర పక్షంలో బారులు తీర్చారు. జాగ్రత్త!

**బాలచంద్రుడు:** మామా! సెలవు.

**కొమ్మరాజు:** నాయనా! నాగమ్మ వ్యూహాలు పన్నటంలో భూనభోంతరాలు చాపచుట్ట చేసే ప్రజ్ఞ కలిగింది. కనిపెట్టి కదనరంగంలో కత్తి జళిపించు.

**బాలచంద్రుడు:** (బ్రహ్మనాయునివైపు సాభిప్రాయంగా చూస్తాడు)

**బ్రహ్మన్న:** సవ్యసాచివై, శరపరంపరలతో శత్రుసైన్యాల మీద చాంపేయాన్ని సృజించు తండ్రీ! పద్మవ్యూహాలను పటాపంచలు చెయ్యి.

**బాలచంద్రుడు:** (వీరావేశంతో)

**ఏ ఘోరంబుగ వైరి వాహినులపై నింకింప బాణాసనా**
**మోఘాస్త్రంబుల భీష్మగ్రీష్మ కుతపంబుల్ తృప్తికాయింపగా**
**నాఘోషించెడు భుగ్భుగ ధ్వనుల కన్నా! మిన్ను మన్నేక మై**
**నన్ ఘూర్ణిల్లవె సప్తసాగరములున్ నర్తించి కల్లోలమై.**

(వీరముష్టితో కూర్చుంటాడు–బ్రహ్మన్న దీవిస్తాడు. లోపల నుంచి జై బ్రహ్మన్న తండ్రికీ జై, జై చెన్నకేశవా జై అని హర్షధ్వానాలు వినిపిస్తవి)

# తొమ్మిదో దృశ్యం

(యుద్ధభూమి, బాలచంద్రుడు తన బలాన్ని ఉద్దేశించి)

**బాలుడు:** అన్నా! దోర్నీడూ! ఆ గజబలానికి అధిపతివి నీవు. తమ్ముడూ చందూ! అశ్వబలాన్ని నీవు నడిపించు. మల్లూ! దక్షిణ ముఖంగా ఆవృతం కొట్టి ఆ విలుకాండ్రను నీవు నడిపించుకోరా. గజ్జల బొల్లణ్ణి కదనుత్రొక్కించు కుంటూ నీ వీపులమీద వస్తాను. వెన్నిచ్చి పారిపోవటం వెలమ వీరుల లక్షణం కాదు. పల్లరగండ గాయగోవాళ బ్రహ్మన్నపట్టి నవ్యవీరాభిమన్యుడై, మిమ్మల్ని నడిపిస్తుంటే ప్రళయ భైరవమూర్తి ప్రత్యక్ష తాండవం కూడా మిమ్మల్ని ఆపలేదు. మీ సింహనాదం శత్రుగజబలానికి గర్జానినాదమై గుండెలవిసి నేల వ్రాలాలి. క్రూర నారాచ, పరంపరలతో మహాప్రళయ కాల ఝంఝా మారుతాలు చెలరేగించి శాత్రవారణ్యాలను చెల్లాచెదరు చెయ్యాలి. అజానేయ పాద పరిన్యస్త మంజు మంజీర ఘళ ఘళంఘళార్భటులతో శాత్రవ శిరఃకందుక క్రీడావినోదులై వీర పల్నాటి విజయగాథలు భవిష్య ద్వీరయువకోద్రేక గాథాపరంపరలు కావించండి. ఆశ్రితరక్షా పరగండ భైరవుడు అరివీర మృగరాజ భయంకరుడూ, శత్రు శార్దూల శరభేంద్రుడూ సర్వసేనాధిపతి మా అన్న కన్నమ. అతడే సమస్తాన్ని అనువర్తింపచేస్తాడు. అందరినీ అంచెలంచెలుగా కనిపెట్టి చూస్తుంటాడు. పదండి! ముందుకు సాగండి!!

**పిరికి తనమ్ము శాత్రవుల వీపుల కెత్తుదు, పోటు బంటులై**
**కరుకు తనమ్ముతో పరుల కండలచీల్చి కవోష్ణరక్తమున్**
**చరచర త్రావి కత్తులను చాదుదు వారి కపాలపాళి, ఈ**
**తరుణము తప్పెనా మనకు తప్పదు దాస్యము జన్మజన్మలన్.**

(జై బ్రహ్మన్న తండ్రికీ జై, జై బాలచంద్రుడికీ జై అని సైన్యకోలాహల ధ్వనులు వినిపిస్తవి. బాలచంద్రుడు వెనుకకు తిరిగి అప్పటికే ప్రవేశించి నిలిచిన కన్నమదాసుతో)

అన్నా! నీ అనుజ్ఞకోసమే.

**(వీరముష్టితో నమస్కరిస్తాడు)**

**కన్నమదాసు:** (చేయి అందించి లేవదీసి) తండ్రీ! నీ వీరోద్రేక ప్రసంగం విని నిలువలేక నీతో నాలుగు మాటలు చెప్పటానికని వచ్చాను... ఉడుకు రక్తాన్ని ఊరికే పొంగనీయకు, ఉన్మత్తుడవైపోతావు., ముందు వెనుకలు చూచుకోలేవు.

నాగమ్మ విషయం జాగ్రత్త! జ్ఞప్తికుంచుకో!! నాలుగు కళ్ళ కనిపెట్టు.

**బాలుడు:** (స్వోత్కర్షగా) అన్నా! నీ తమ్ముడు గారుడాస్త్ర ప్రయోగంలో గట్టివాడు తెలుసునా? ఈ కొనగోటి గీటుకు ఎన్ని మాహానాగాలైనా చరచరా చుట్టుకొని గిలగిలా కొట్టుకొని భుగభుగలతో విషవహ్నులు క్రక్కి విరిసి పోవలసిందే!

**కన్నమ:** (బుజం తడుతూ) నీ పౌరుష పరాక్రమాలు ఎంతటి బాహుబల సంపన్నులనైనా పిరికి పందలను చేస్తాయని తెలుసును. అయినా, నాగమ్మ కుటిలనీతి విశారదురాలే కాదు. కుటిల యుద్ధవిశారద కూడాను. అందువల్లనే ఇంతగా చెప్పవలసి వస్తున్నది. అలరాజు ప్రజ్ఞావంతుడూ, పరాక్రమ వంతుడూ కాడూ? ఆ తంత్రజ్ఞురాలి చేతిలో ఏమైనాడో జ్ఞప్తి లేదూ?

**బాలుడు:** అన్నా! ఇక నిమిషం ఆగలేను. అలరాజు హత్యకు తగ్గ ప్రతీకారం... అబ్బా! వట్టి మాటలెందుకు? చేసినప్పుడు కాని, తెలియదన్నా! ఆ నరసింహుడి తల తరిగి మామకు కానుకిచ్చి ఆయన దానిని మట్టిలో పొర్లించి చటులాట్టహాసం చేస్తుంటే కాని ఆగలేను. అన్నా! అనుజ్ఞ!!!

**కన్నమ:** (దీవిస్తూ) విజయవంతుడివి కా నాయనా!

**బాలుడు:** సెలవు.

**(నిష్క్రమిస్తాడు)**

**కన్నమ:** (వ్యూహాలను పరీక్షిస్తూ) నాగమ్మ, దక్షిణ బలాన్ని కదిలిస్తే నేను నా ఉత్తర బలాన్ని ముందుకు నడిపించాలి. వాటికి ప్రస్తుతం ప్రబోధం అవసరం. బాలుడు చిచ్చర పిడుగు. వెయ్యికళ్ళతో కనిపెట్టి ఉండాలి. ప్రస్తుతం చూస్తూ ఉండమని మామతోనూ తండ్రితోనూ చెప్పి వెళ్ళుతాను... మామా! మామా!!

**(శిబిరములోకి నిష్క్రమిస్తాడు)**

# పదో దృశ్యం

(కారెంపూడి యుద్ధభూమి బ్రహ్మనాయుడూ కొమ్మరాజూ తమ శిబిరాలముందున్న ఉన్నత ప్రదేశం మీద నిలవబడి యుద్ధరంగాన్ని పరిశీలిస్తూ ఉంటారు)

**బ్రహ్మన్న:** బావా! ఆ గుర్రపుదళం ఎలా దూకుతూ వెడుతున్నదో చూస్తున్నారా?

**కొమ్మరాజు:** ప్రళయ కాలంలో సముద్రపు కెరటాలల్లే కేరింతలు కొడుతున్నది.

**బ్రహ్మన్న:** కాల్బలంలో ఒక్కొక్క శ్రేణికి ఒక విధమైన దుస్తులతో చూడటానికి ఎంతో ఇంపుగా యుద్ధదేవత మగ్గాలశాలలా ఉన్నది కదూ?

**కొమ్మరాజు:** ఉభయ సైన్యాల మధ్యా నాగులేరు నాగమ్మ బుద్ధిలా కుటిలంగా ఎలా ప్రవహిస్తున్నదో గమనించారా? .... ఏమిటా కోలాహలం? బాలుడు రంగ మధ్యంలో ప్రవేశించాడు.

**బ్రహ్మన్న:** (సంతోషంగా) ఎప్పుడూ బొంగరాలాడుకునే వాడు వీడు ఇంతగా యుద్ధం చేయటం ఎప్పుడు నేర్చుకున్నాడయ్యా?

**కొమ్మరాజు:** (సాభిప్రాయంగా) సింహపు పిల్లకు వేటాడటం ఎవరు నేర్పితే వచ్చిందంటారు?

**బ్రహ్మన్న:** (వినిపించుకోనట్లుగా) బావా! అటుచూడండి రెప్పపాటులో మెరపు మెరసినట్లుగా దక్షిణ మండల ప్రచారం చేశాడు. అవతల వీరుడూ, ఎవరో గట్టివాడు సవ్యప్రచారం చేసి తప్పించుకున్నాడు.

**కొమ్మరాజు:** చంద్రుడి యుద్ధ ప్రారంభం రణగండ్లలో తమ వీరవిహారాన్ని జ్ఞప్తికి తెస్తున్నది..

**బ్రహ్మన్న:** శత్రుపక్షంలో వీరులు బాలుడి ధాటికి ఆగలేక పారిపోతున్నారు... బావా! ఎందుకో ఇప్పుడు బాలుడు చేసే యుద్ధం నేను చేస్తున్నట్లున్నది.

**కొమ్మరాజు:** బాలుడు సరిగా మీ యౌవనరూపమే. అచ్చుగుద్దినట్లుంటాడు.

**బ్రహ్మన్న:** (బిగ్గరగా, మైమరచి) యశస్విని కా నాయనా, బాలుడూ! తండ్రి పేరు నిలువబెట్టు. హృదయానికి పట్టరాని సంతోషం కలుగుతున్నదోయ్ తండ్రీ.... బావా! బాలుడి యుద్ధం నా చేత కూడా కత్తి పట్టించే టట్లున్నది.

**కొమ్మరాజు:** తమకు బాలచంద్రుడి వల్ల కూడా సత్కీర్తి.

**బ్రహ్మన్న:** బావా! అలరాజు త్యాగాన్ని ఆంధ్రలోకం మరచిపోలేదు. అతని మూలకంగా మీకు లోకోత్తరతమైన కీర్తి ఏనాడో ప్రాప్తించింది.

**(కొమ్మరాజు పుత్రదుఃఖంతో శిరస్సు వంచుకుంటాడు)**

**బ్రహ్మన్న:** (ఉద్వేగంతో) ఉన్నట్లుండి బావా, బాలుడెందుకో ఆవైపు వెళ్లుతున్నాడు.

**కొమ్మరాజు:** (పరికించి) నరసింహరాజు మీదికి తలపడ్డట్లున్నాడు.

**బ్రహ్మన్న:** నిజమే. ఆ మూల తుములయుద్ధం ప్రారంభమైంది. బాలుడి మిత్రులందరూ ఆ వైపు చేరుతున్నారు.

**బాలచంద్రుడి గొంతుక:** పిరికి పందల్లా పారిపోవద్దు.

**ఒక యోధుడి గొంతు:** నీ మొగతనానికేనా?

**బాలచంద్రుని గొంతుక:** కాచుకోండి. యముడి వంటింటికి చేరుకోవాలి.

**(కత్తుల కణకణలూ, హాహాకారాలు వినిపిస్తవి)**

**కొమ్మరాజు:** అదీ దెబ్బ! కుమ్ముడు తగరు త్రిప్పు. ధాక కొట్టు.

**బ్రహ్మన్న:** (సోద్వేగంగా) బాలుడేడి బావా?

**కొమ్మరాజు:** అదుగో. అటువైపు. బల్లెపుయుద్ధం ప్రారంభిస్తూ

**బ్రహ్మన్న:** (వికసిత ముఖంతో) అవును బావా! శత్రుసైన్యానికి సుడిగాలై ఎండుటాకులలా గిరగిరా...

(జయ్ బాలచంద్రుడికి జై, జై బ్రహ్మన్న మంత్రికీ జై, జయ్ చెన్నకేశవా జై అనే హర్షధ్వానాలు వినిపిస్తవి)

**బ్రహ్మన్న:** బావా! ఏమిటా కోలాహలం?

**కొమ్మరాజు:** నాకూ ఏమీ అర్థం కావటం లేదు.

(నరసింహుడు కాదు, నరసింహుడు కాదు. తిరగండి. పట్టుకోండి. జై చెన్నకేశవా, జై చెన్నకేశవా అని కేకలు వినిపిస్తవి)

**బ్రహ్మన్న:** బావా! ఎవరా పారిపోయేది?

**కొమ్మరాజు:** నరసింగరాజు

**బ్రహ్మన్న:** నరసింగరాజా!

**కొమ్మరాజు:** బాలుడు అతనితో ద్వంద్వ యుద్ధానికి తల పడ్డాడు.

**బాలచంద్రుని గొంతుక:** ఏం నరసింహా వెనుదీస్తున్నావు?

**నరసింహరాజు గొంతుక:** ఆదిగొని నీ ప్రాణాలు హరించటానికి

**బాలచంద్రుని గొంతుక:** అబ్బా! (భీకర కంఠంతో)

**ఆడునె చేయి యుద్ధములు ఆడిన దయ్యలరాజు చంప ని**
**నాన్నడగ జేయ నయ్యతివ నాగమ సిగ్గు శరంబు మాని నీ**
**వాడెదు కీలు బొమ్మవిటు లాహవ భూమిని నిల్వనేల పో**
**రాడగ వేశ్య లింఢ్లను సరాగములాడగ పొమ్ము ధీరుడా!**

ఇదుగో ఈ తోరహత్తాన్ని తప్పుకో.

**(ఆయుధముల కణకణలు వినిపిస్తవి)**

**కొమ్మరాజు:** (ఆనందంతో) బలే, బాలుడు తోరహత్తాన్ని కొట్టాడు మహామంత్రీ !

**బ్రహ్మన్న:** నరసింహుడు ధట్టనతో తప్పుకుంటున్నాడు.

**కొమ్మరాజు:** అయ్యో! బల్లెం డొక్కకు మోటించాడు, త్రిప్పు, నొక్కు, లొంగిపోతాడు.

నరసింహుడి గొంతుక: వెనుకడుగా, ఈ దెబ్బతో సబ్బాయి గుబ్బలమీద పడతావు. బొంగరాలాటట్రా?

**బాలచంద్రుడి గొంతుక:** ఆటే. నీ తలే బొంగరం. కాచుకో.

**నరసింహరాజు గొంతుక:** హాఁ (మరణ సూచక ధ్వనిగా వినిపిస్తుంది)

**బ్రహ్మన్న :** బాలుడూ అక్రమం, అన్యాయం, అధర్మం.

**కొమ్మరాజు:** అడుగో బాలుడు విజయ ఘోషతో నరసింహుడి తల బల్లెపు కొనకు గుచ్చుకొని వచ్చేస్తున్నాడు.

(జై బాలచంద్రుడికీ జై, జై బ్రహ్మన్న తండ్రికీ జై అనే హర్షధ్వానాలు దగ్గరికి వస్తూ బిగ్గర బిగ్గరగా వినిపిస్తవి. బాలచంద్రుడు బల్లెపు కొనకు గుచ్చిన నరసింహరాజు తలతో నురుగులు కక్కుతూ ప్రవేశిస్తాడు)

**బాలచంద్రుడు:** మామా! ఇదిగో అలరాజును హత్య చేసిన దుర్మార్గుడి తల, కళ్ళతో చూచి కాళ్ళతో తన్ని శాంతించు.

**బ్రహ్మన్న:** చంద్రుడూ!...

**శిరమిటు త్రుంచి తెచ్చితివి, చిత్తము నొచ్చెడి, పెంచినారమీ**
**నరపతి తమ్మునిన్ మనసు నన్ గల ప్రేమరసమ్ము వాసి, నీ**
**పరుసదనంపు వాదరకు పాల్పడె! జేసితె, నేను మామయున్**
**పరమసుఖానమెత్తు మను భావన ద్రోహమొనర్చినావురా!!**

మామా, నేనూ మహోత్కృష్టకార్యం చేశావని మెచ్చుకుంటామను కున్నావా? ఇది మహాద్రోహం!

**బాలుడు:** (నిర్ఘాంతపడి) ద్రోహమా?

**బ్రహ్మన్న:** (బిగ్గరగా) మహాద్రోహం! మహా పాపం!! బందీగా తేవలసిన వాడిని బల్లెపు కొనకుగుచ్చుకొని వచ్చావు. అతడెవరనుకున్నావు, పాపీ?

**బాలుడు:** పగ సాధించానని బ్రహ్మానందంలో వచ్చాను, పాపినా?

**బ్రహ్మన్న:** (నిష్కర్షగా) ముమ్మాటికీ.

**బాలుడు:** (కొమ్మరాజువైపు తిరిగి) నిజమేనా మామా!

**కొమ్మరాజు:** (నింపాదిగా) పాపమే నాయనా?

**బాలుడు:** (నిరుత్సాహంతో) పాపిని చంపటమూ మహా పాపమా!

**పాపమె, పాపమే, పగరపైకొని ప్రాణము లాహరింపగా**
**పాపమె! చంప పాపి నిటు పాపమె! ఒక్కట తారుమారుగా**

**పాపము పుణ్యమిట్లు ఇక ప్రాణములన్ పనియేమి. ఇట్టి నా**
**పాపపు రూపుమాప నరిపైబడి నే నిక మాసి పోయెదన్.**

**(నిముషం నిలువలేకుండా వేగంగా నిష్క్రమిస్తాడు)**

**బ్రహ్మన్న:** బాలుడూ!... బాలుడూ!!.... (బాలచంద్రుడు నేలమీద దొర్లించిన నరసింహుడి తల దగ్గిరకు చేరి) నరసింహా! నాయనా!! నీ చేతలే నిన్నింతకు తెచ్చినవి. అన్ని దినాలూ చెప్పినట్లు రావు. క్రోధాలు పెరిగిపోయినవి. కొట్లాట బలిసింది. (శిరస్సు చేతిలోకి తీసుకొని) నరసింహా ఒకనాడు తూగుటుయ్యాలలో సుఖనిద్ర పోయిన శిరస్సుకు ఈనాడు దుమ్ములో దొర్లాడవలసిన దుస్థితి వచ్చింది? చిన్ననాడు నీ బంగారపుటుయ్యాలను ఊపిన ఈ చేతులు చివరిసారి నీకు చిచ్చికొట్ట తలచుకున్నవి. పద, చిరనిద్ర పోదువుగాని తండ్రీ! (నడుస్తూ) చెన్నకేశవా! చెన్నకేశవా!! మహాప్రభూ!!!

**(నిష్క్రమించే బ్రహ్మనాయని కొమ్మరాజు అనుసరిస్తాడు)**

# పదకొండో దృశ్యం

(కారెంపూడి యుద్ధరంగం. శిబిరంలో మనస్థిమితం లేని నలగామరాజు ఏకాంతముగా)

**నలగామరాజు:** అయ్యో! అయ్యో!! అన్యాయము. అత్యాచారము. మోసము. ద్రోహము. (వెకిలిగా) నరసింహా! నరసింహా!! నీ దురాశకు తగ్గ శాస్తి ఈనాటికి జరిగింది. నేను రణరంగంలో చచ్చిపోయే వాడినీ, నీవు శిలకొట్టుకొని నిల్చి రాజ్యమేలేవాడివీనా? అమ్మ నీ ఆశ కొరికెయ్య! ద్రోహీ! సంతోషించు. ఇప్పుడు సంతోషించు. బాలచంద్రుడు నిన్ను బల్లెపు కొన సింహాసనం ఎక్కించాడుగా. విశాల సామ్రాజ్యం వచ్చింది. విశ్వమంతా నీదే ఉః.... (వికట హాసంతో) ఇక ఏలుకోవటమే తరువాయి. ఓహో అక్కడ కూడా నాగమ్మ మహామంత్రిణి నీచేత రాజ్యచక్రం త్రిప్పిస్తుంది కాబోలు!

నన్ను హత్య చేయటానికి నీవు పంపించిన కింకరులు ఏమైనారో తెలుసునా? వారిని నా కరవాలం కాళీకైంకర్యం చేసింది. నీకంటే ముందు వీరస్వర్గం, కాదు వీర నరకం చేరుకున్నారు. నీకు ఆహ్వాన పత్రికలు పంచి పెట్టటానికి. తండ్రీ! అలరాజూ! నీబోటి ధర్మవీరుడు పదిజన్మలెత్తినా నాబోటి నరాధముడికి అల్లుడు కాడు. అమ్మా పేరిందేవీ, నీవన్నట్లే నా రాజ్యకాంక్ష నాకీ విపత్తు తెచ్చి పెట్టింది.

దేశంలో ప్రజలందరూ నా పక్షమట! నట్టేటిలో ముంచారు. ప్రజ ఎవరి పక్షమో ఒకమాటు బ్రహ్మన్న అన్న బలాన్ని చూస్తే తెలుస్తుంది. లెక్కకు నాకూ ఉన్నది సైన్యం ఎందుకు? తినటానికి, త్రాగటానికి, తాగితందనాలు వెయ్యటానికి. పౌరుషంతో పరబలాన్ని ఎదుర్కొనే వెధవ ఒక్కడూ లేడు. ప్రతివాడి హృదయం నీవు అధర్మంవైపు పోరాడుతున్నావని ఉద్బోధిస్తుంటే ఎందుకు ఎదుర్కొంటాడు. బ్రహ్మన్న అన్న బలంలో ప్రతి ఒక్కడూ చిచ్చుల పిడుగు. చండప్రచండుడు. ధర్మవీరంతో తాండవించే యోధుడు.

**వికట మహాట్టహాసముల వెల్లువలైనవి రక్త వాహినుల్**
**ఒక పెనుభూతమై చెలగుచున్నది క్షామము మృత్యుమూర్తియై**
**అకటకటా మహాత్మ్మ డతడాడిన మాటలు లెక్కసేయవౌ**
**యకుటిల చిత్తవృత్తి నిను నంతగ నమ్మితి మోసపోయితిన్**

బ్రహ్మన్న మహామంత్రి రాజ్యమేలించాలి. ప్రజ సుఖించాలి ఇదే నా ఆశయం...

(కత్తివైపు వెర్రిగా చూచి ఆత్మహత్యకోసం మెడమీద సారించి జయ్ మహాదేవా మళ్లీ వెనుకకు లాగుకొని)

**పాప మొనర్చితిన్, పరమబంధుల కానల పాలు చేసి పరి**
**తాపము నిచ్చితిన్, రుధిరధారల ముంచితి పుణ్యభూమి నే**
**నోపగ రాని దుఃఖముల నొంచితి భూప్రజ - వెర్రికీ**
**పాపికి తావు లేదిల కృపాణమ జాలి వహింప నేటికే**

నాగమ్మా (ఏహ్యాకంఠంతో) మహామంత్రిణీ! నీవు ఆ కడజాతి కన్నమదాసు కత్తికి ఆహారమైతే చూచి ఆనందించి గాని ఆత్మహత్య చేసుకోను. హంతకీ! ద్రోహీ!! నాగమ్మా! పాపినీ! చండాలినీ.

**(ఒరనుండి లాగిన కత్తితో నాగమ్మ ప్రవేశిస్తుంది)**

**నాగమ్మ:** ప్రభూ ఏమిటీ ఉన్మాదం?

**నలగామ:** (కోపంతో) ఆఁ. ఉన్మాదమా! జాగ్రత్తగా మాట్లాడు.

**నాగమ్మ:** మీలో ఈ మార్పుకు కారణం?

**నలగామ:** (నిష్కర్షగా) నీ ద్రోహము.

**నాగమ్మ:** (వికటంగా నవ్వి) నా ద్రోహమా! 'పాపినీ' 'చండాలినీ' ఇన్నాళ్ళు మీ సేవ చేసినందుకు మంచి బిరుదులు ప్రసాదించారు. పోనీయండి. పైన పరమశివుడే ఉన్నాడు. కనిపెట్టటానికి.

**నలగామ:** (వికృత కంఠంతో) కనిపెట్టడూ? ఇప్పటికే చాలా బాగా కనిపెట్టాడు. నాకు నీవు సేవ చేశావు కదూ. రాక్షసీ! నీ చెప్పుచేతల్లో పెట్టుకొని సేవ చేయించు కున్నావు. నా రాజ్యపాలనా కాంక్షను వృద్ధిచేసి దేశానికి తీరని ఉపద్రవం తెచ్చిపెట్టావు.

నీ కోరికలన్నీ ఫలించినవి. నన్ను చంపించావు. నరసింహుణ్ణి పలనాటి రాజ్య సింహాసన మెక్కించావు. ఇక నువ్వు మర్యాదగా మరణించవచ్చు. దేశ మికనైనా బాగుపడుతుంది.

**(సైన్యాలు పారిపోతూ ఉన్న కలకలం వినిపిస్తుంది)**

**నాగమ్మ:** ద్రోహం విషయం తరువాత ఆలోచించి తగిన శిక్ష విధింతురు గాని మన సేనలన్నీ పారిపోతున్నవి. ఆపితే గాని పరువు దక్కదు. బాల చంద్రుడు వెంటపడి తరిమేస్తున్నాడు.

**నలగామ:** పోయి అడ్డంపడి ఆపు.

**నాగమ్మ:** అయితే మీకు జయం అవసరం లేదా?

**నలగామ:** (నిశ్చయంతో) దేశ క్షేమం కోసం, ప్రజా క్షేమం కోసం నాకు అపజయమే కావాలి.

**నాగమ్మ:** (బెదిరింపుగా) సైన్యాన్ని ఆపరా?

**నలగామ:** (కత్తి ఒరనుంచి బయటికి లాగుతూ) నీ బెదిరింపులకు ఉలకను. విస్తారంగా మాట్లాడితే కరవాలానికి బలైపోతావు.

**నాగమ్మ:** (ప్రశాంతాన్ని నటిస్తూ) నాకు అంతకంటే ఏమి కావాలి. తమ మేలు కోరినందుకు చివరకు తమ చేతిలోనే మృత్యువు పొందటం ఎంత మంచి విషయం. కానివ్వండి. (కత్తికి క్రిందుగా తలవంచి నిలుపుతుంది)

**నలగామ:** (నెమ్మదిగా కత్తిదించి) నిన్ను నా కత్తికి బలి ఇచ్చి ఆ కడజాతి కన్నమదాసు కత్తికి అన్యాయం చెయ్యను. అది నిన్ను కడుపులో వేసుకొని ఆకలి తీర్చుకుందామని ఆశపడుతున్నది.

**నాగమ్మ:** ప్రభూ! అయితే తమ ఉద్దేశం?

**నలగామ:** నా ఉద్దేశమా? నీవు పాపివి. ద్రోహివి. హంతకివి. నరసింహుడు అమాయకుడు. రాజ్యాన్ని ఆశపెట్టి ఆడించావు. మోసగించావు. రుధిరధారల్లో ముంచెత్తి దేశానికి క్షామం తెచ్చిపెట్టావు. ఈ నలగాముడు ఇక నీకు దాసుడు కాడు. సర్వతంత్ర స్వతంత్రుడు. బ్రహ్మన్న అన్న పాదాలమీద పడి పవిత్రమైన వాటిని నా కన్నీటితో పంకిలం చేయటము తప్ప మరొక పని చేయలేను. నీ ఇష్టం. (ఆవేగంతో నిష్క్రమిస్తాడు)

**నాగమ్మ:** (ఏకాంతంగా శివ ప్రతిమను ఉద్దేశించి)

(మహాదేవా! మహాదేవా!! కథంతా అడ్డంగా తిరగటం మొదలు పెట్టింది. తిరగవలసిందే. లేకపోతే దీనికి అంతెక్కడ? నా ఆశాలతలు ఫలించినవి. స్త్రీ బుద్ధిబలాన్ని లోకానికి ప్రదర్శించాను. కానీ, నేను పాపినీ, హంతకినీ ఐనాను. కాక తప్పలేదు. భవిష్యత్తులో

లోకం నన్ను మహాపాపి అని చరిత్రల్లో వ్రాసుకొని చదువుకుంటుంది కాబోలు! అబ్బా! ఆ వ్రాతలు నా ఆత్మ ఎలా వినగలుగుతుంది తండ్రీ! భరించలేను. నా హృదయ సౌశీల్యం నీ వొక్కడికి తప్ప మరెవ్వరికీ తెలియదు కదా!

**ప్రసవము నాయెడంద, మధుపాత్రల కోర్కెలు తీర్చలేదు, ఈ**
**కుసుమ సుగంధ చాలనలకున్ జగమెంత ప్రతీక్ష చేసెనో**
**పసదన మిచ్చి తృప్తి పరుపన్ తరిగాదు ఉమామహేశ! ఈ**
**ప్రసవము కాంక్షచేసి విషవాసనలన్ ప్రసవింప పూనుటన్**

లోకానికి బహిర్గతం కాకపోతే విచారించను. ఇది నీ హృదయంలో హత్తుకుంటే చాలు జగద్రక్షకా! జగచ్చక్షూ!! విశ్వవ్యాపీ!! మహా దేవా!!!

తండ్రీ! నీ రక్త దాహం చల్లారిందా? చల్లారకపోతే మిగిలినది తీరుస్తాను. పారిపోయే సైన్యాలను ఆపి బ్రహ్మన్న మీద పడతాను. అతడినీ అతడి రాజకులాన్నీ అంత మొందించిగాని మరీ మృత్యువు వాతపడను. రౌరవాది నరకాలల్లో అనేక జన్మలు ఆవాసం చెయ్యవలసి వచ్చినా వెనుదీయను. ఇది తథ్యం. తండ్రీ!

**స్ఫాయద్ఘీరక మంద్రగర్జ విపులాశా గర్భ నిర్భేదమై**
**మ్రోయన్, శాతశిలీముఖ ప్రకర సంబుద్ధేధ్మ విద్యుద్యుతుల్**
**కాయన్ సంగర వీథిరక్త జలదాకారమ్ముతో శత్రురా**
**ట్కాయంబుల్ రుధిరాప్లుతంబులుగ రక్తాంబోధి వర్షించెదన్.**

(నాగులేరు పొంగులు వారుతూ ప్రవహిస్తూ ఉంటుంది. చెల్లాచెదరై పారిపోతూ ఉన్న సైన్యాన్ని ఆపుచేసి నాగమ్మ ఉద్బోధ గీతం పాడుతుంది)

**పొంగవే, పొంగవే ఓ నాగులేరా!**
**ఉప్పొంగి పొంగించు మా వీరహృదయాల**
**రుధిరారుణ ప్రభల**
**లోకాల ముంచెత్తి**
**ప్రళయకాల మహోగ్ర**
**భయద హేషార్భటుల - పొంగవే**
**పాతాళ లోకాల**
**పగిలించి పెకిలించి**
**గగనముల చుంబించి**

**కడలిలో బింబించి – పొంగవే**
**ఉత్తుంగ భంగాల**
**క్రొత్త నడకలు నడచి**
**శత్రువీరుల గుండె**
**నెత్తురులతో నిండి**
**పొంగవే! పొంగవే ఓ నాగులేరా!**
**ఉప్పొంగి పొంగించు మా వీరహృదయాల!!**

**(ఆమె కంఠంతో శ్రుతి కలిపి అందరు సైనికులూ వంత పాడతారు)**

# పన్నెండో దృశ్యం

(యుద్ధరంగము, బ్రహ్మనాయుడు, కొమ్మరాజూ శిబిరము లోపల విశ్రమించి ఉంటారు. బయట కన్నమదాసూ, మలిదేవమహారాజూ రణరంగాన్ని పర్యవేక్షిస్తుంటారు)

**కన్నమదాసు:** ప్రభూ! అడుగో, బాలచంద్రుడు ప్రళయాగ్ని గోళాలను పగిలిస్తున్నాడు. అతని అగ్నిబాణ ప్రయోగానికి శత్రుసైన్యాలు ఎలా చెల్లాచెదరై పోతున్నవో చూస్తున్నారా?

**మలిదేవుడు:** అతని భీకర సింహనాదాలకు మహాసముద్ర మధ్యంలో ఉన్న కొండలూ ఏనుగులు ఘీంకారం చేసి ఎలా నేలవాలి మునిగిపోతున్నవో కన్నమా అటుచూడు.

**కన్నమ:** కాల్బలం మొలబంటి రక్తప్రవాహంలో ముందుకు వచ్చేస్తున్నది. (వెనుకకు తిరిగి శిబిరంలో ఉన్న కొమ్మరాజుతో) మామా! బాలచంద్రుడు మళ్ళీ పుట్టిన సవ్యసాచి ననిపిస్తున్నాడు.

**మలిదేవుడు:** భారతయుద్ధంలో పద్మవ్యూహాన్ని పటాపంచలు చేయలేక పోయినానన్న పౌరుషంతో బ్రద్ధలు కొట్టడానికి (బ్రహ్మనాయునితో) అన్నా! నీ కడుపున పుట్టిన వీరాభిమన్యుడే ననిపిస్తున్నాడు.

**బాలచంద్రుడి గొంతుక:** నాగమ్మా! పిరికి పందా!!

**నాగమ్మ గొంతుక:** ఈ నాగమ్మ నరసింహుడు కాదురా!

**బాలచంద్రుడి గొంతుక:** వాడి మొగతనం సహజం. నీది తెచ్చిపెట్టుకున్నది.

**నాగమ్మ:** బాలచంద్రా!

> **అరుదర నన్ను బోలు మహిషాసుర మర్దని ముజ్జగంబులన్**
> **పురుషుడ నంచు పొంగెదవు పోరుకు వచ్చిన ఆడుదానికిన్**
> **సరియగు పౌరుషంబు కనజాలను నీకడ గొప్పకోసమై**
> **కరమున దాల్చి కైదువులు కయ్యమున్ నిలువంగ జోదువే.**

**బాలచంద్రుడి గొంతుక:** (భీభత్సంగా) చెన్నకేశవ వరప్రసాదిత ఆభీల భుజాదండాస్ఫాలనాస్ఫోటమాన నిర్వక్ర నిశిత బాణాఘాత ప్రవిభిన్న మస్తకా! కాచుకో! (బాణ వర్షము కురిసిన శబ్దం వినిపిస్తుంది)

**(బహ్మనాయుడూ కొమ్మరాజూ ప్రవేశిస్తారు)**

**కొమ్మరాజు:** కన్నమా! అవతలి పక్షంనుంచి కొత్తబలం ఏదో కదిలి వస్తున్నది.

**కన్నమ:** అవును మామా! నాయకురాలు దక్షిణ బలంతో చంద్రుడి మీదికి వచ్చింది.

**మలిదేవుడు:** అన్నా! నేను వెళ్ళి ఆమెను అడ్డగిస్తాను.

బ్రహ్మన్న (వద్దన్నట్లుగా) నాయనా మీరా!!

**మలిదేవుడు:** లేదన్నా.

**బాలుని యుద్ధ దర్ప విభవంబు ముదావహమై గభీరమై**
**ఆలము చేయగా పిలచు, ఆతురతన్ కరమేగి పట్టె నా**
**భీల కృపాణముష్టి, పరభీకర కాంతిరసప్రవాహ ధా**
**రాలవనంబునన్ మెరసి - రక్త సరిత్పతులన్ సృజించనే.**

ఆపకన్నా అనుజ్ఞ!!

**బ్రహ్మన్న:** (సవినయంగా) ఇది మీరు యుద్ధరంగంలో ప్రవేశింప తగిన సమయం కాదు... నీవు ఉత్తర బలాన్ని కదిలించు... ఊఁ (అనుజ్ఞా సూచకంగా హస్తసంజ్ఞ చేస్తాడు)

**కన్నమ:** (రెండడుగులు ముందుకు నడిచి తన సైన్యంతో) మంజినీడూ! గుర్రపు దళాన్ని నీవు నడిపించు. కేతయ్యా! నీవు కాల్బలాన్ని, నాగమ్మ బాలుని చుట్టుముట్టింది జాగ్రత్త!

(జై బ్రహ్మన్న తండ్రికీ జై అనే ఘోషలు కొద్దిసేపు సైన్యంలోనుంచి వినిపిస్తవి. కన్నమదాసు నిష్క్రమిస్తాడు)

**కొమ్మరాజు:** (యోచనా పూర్వకంగా) సైన్యాల నడిపించవలసిన భారం ముదిజోదులమైన మనదాకా వచ్చేట్లుంది.

**బ్రహ్మన్న:** కన్నమ రణరంగములో ప్రవేశించిన తరువాత మనం కత్తి పట్టవలసిన అవసరం ఉండదనుకుంటాను.

**కొమ్మరాజు:** బాలచంద్రుడు ఇంకా ప్రచండ యుద్ధం సాగిస్తున్నాడు.

**బ్రహ్మన్న:** (ఆనని చూపుతో) బావా! నాగమ్మ బాలుని తప్పించుకొని వెనుకకు వచ్చినట్లున్నది.

**మలిదేవుడు:** అధర్మ యుద్ధానికి దిగుతుందేమో రాక్షసి! అన్నా! నాకేదో చెప్పరాని భయం వేస్తున్నది.

**బ్రహ్మన్న:** (తీక్షణంగా చూస్తూ) బావా! ఎటువైపునుంచో కొత్తదళాలు వచ్చి బాలుణ్ణి కమ్మేస్తున్నట్లున్నవి.

**కొమ్మరాజు:** కన్నమ ఇంకా అక్కడికి చేరుకోలేదు. మధ్యలోనే ఏదో చిల్లర దళానికి అడ్డుపడ్డాడు.

**బ్రహ్మన్న:** బావా! బాలుడు అలిసిపోతున్నట్లున్నాడు?

**మలిదేవుడు:** అవును అన్నా! అలిసిపోతున్నాడు.

**కొమ్మరాజు:** అదిగో నాగమ్మ వెనుకనుంచి బాలుడి మీద బాణప్రయోగం చేస్తున్నది.

(సైన్యాల ఆక్రందనధ్వనీ, పారిపోతూ ఉన్న సైన్యకోలాహలం వినిపిస్తుంది)

**బ్రహ్మన్న:** బావా! ఎందుకో సైన్యాలన్నీ చెల్లాచెదరైపోతున్నవి? ఏమిటా ఆక్రందన ధ్వనులు?

**మలిదేవుడు:** బాలుడేమైనాడు? ఏమిటబ్బా, ఈ కారుచీకట్లు. మూడమంచు కమ్మేస్తున్నట్లు కమ్మేస్తున్నవి. ఏడీ మన చంద్రుడు... అన్నా... ఏడీ...

**కొమ్మరాజు:** కళ్లెంత గుచ్చుకొని చూచినా కనపడడం లేదు. ఏడీ? ఏడీ?

(వీపుమీద గుచ్చుకొన్న బాణంతో రక్తసిక్తమైన తనుత్రాణంతో బాలచంద్రుడు ప్రవేశిస్తాడు)

**బాలచంద్రుడు:** (స్మృతి తప్పిపోతూ) అబ్బ... అధర్మ యుద్ధం... అన్యాయం... వీపుమీద బాణం... బాధ... బాధ (బ్రహ్మన్న కాళ్ళదగ్గరికి వ్రాలుతూ) తండ్రీ! మామా! సెలవు. (తుది నమస్కారం చేసి ప్రాణం విడుస్తాడు)

**బ్రహ్మన్న:** నాయనా, బాలచంద్రా! (అపరాని దుఃఖంతో బాలుని ముందుకు వచ్చి కూర్చుంటాడు)

**కొమ్మరాజు:** జగదేక వీరుడు రాలిపోయినాడు. (బాలచంద్రుని చెవిలో బిగ్గరగా) నాయనా! అలరాజుతో నీ ప్రతీకార విషయం చెప్పు మరిచిపోకు.

**మలిదేవుడు:** (బాలచంద్రుని శరీరాన్ని చూస్తూ) నీ సుందర రూపాన్ని అధర్మంగా దెబ్బకొట్టటానికి ఆ పిశాచికి చేతులెలా వచ్చినవి తండ్రీ! ఉఁ పిశాచి కాబట్టే – నీ రణ నైపుణ్యం దూరం నుంచి చూచి జగదేకవీరుడ వౌతావనీ ఆశపడ్డాను. ఇంతలోనే నీకు మృత్యువా?

**బ్రహ్మన్న:** (ఎంత ఆపుకున్నా ఆగక పొర్లివస్తూ ఉన్న దుఃఖంతో) నాయనా! బాలచంద్రా!! నీమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నానోయ్, తండ్రీ! అన్నీ భగ్నం చేశావు. నా బహిఃప్రాణం అహింసా ధర్మం. దానికి నా జీవితంలో విజయం కలదని నిశ్చయించుకున్నాను. లోకంలో దాన్ని ప్రచారం చేసి ఈ మహదాంధ్రదేశంలో ఆనందభవనాలకు పునాదులు వేస్తావనుకున్నాను. కానీ, నాకంటే ముందు నీకే పిలుపు వచ్చిందా?...

నీ చిన్ననాటి చేష్టలు ఒక్కొక్కటే తలుపుకువస్తున్నవి. ఒకనాడు ఏదో తీక్షణంగా ఆలోచించుకుంటున్నాను. నీవూ నీ మిత్రులూ బొంగరాలాట ప్రారంభించి గోల చేశారు. నేను గుడ్లురిమి నిన్ను బెదిరించాను. క్షోణీపాతంగా కంటి తడిపెట్టావు.

బ్రతకని బిడ్డ బారెడు. ఎంత అందగాడివైతే ఏం ప్రయోజనం? నీ అందాన్నంతా ఈ ఆహవరంగానికి అర్పణ చేశావా? కాదు, కాదు. అహింసా ధర్మోన్నత్యాన్ని నీ ఆత్మబలితో అర్థం చేసుకోమని ఉద్బోధించావు. లోకానికి అది ఇక అర్థం కాక తప్పదు. లోకం అర్థం చేసుకోక తప్పదు. చంద్రుడూ! వెన్నెల తప్ప కాయలే వనుకున్న నీవు పగవారి సైన్యంమీద ప్రచండాతపాలు కాయిస్తున్నప్పుడు నా హృదయాని కెంత ఆహ్లాదం కలిగింది, తండ్రీ! భరించలేని సంతోషంతో ఈ పాడు కళ్లు ఒక్క పెట్టున నిన్ను చూచినవి. దృష్టిదోషం తగిలింది కాబోలు! ఆ చంద్రుడు సూర్యుడై రక్తారుణ కాంతులతో అస్తమించాడు. జయం కలుగుతుంది. రాజ్యం వస్తుంది. కాని నాబోటి అదృష్టహీనుడికి రాజువంటి రత్నాలబిడ్డ ఎలా వస్తాడు. రాడు... ఉహుఁ... రాడు (విచిత్రంగా, ఉన్మాదిగా కళ్ళు త్రిప్పి) ఏమిటి నాకీ పాడు మాటలు? పండులా తండ్రి కిలకిలా నవ్వుతుంటే ఏమిటి నా కీ పాడు మాటలు.

(నిద్ర లేపుతూ) నాయనా చంద్రుడూ! కొమ్మన్న మామ వచ్చాడు లే! ఇవాళ మన ఇంట్లో పండుగరా ఊరి పెద్దలంతా వచ్చేస్తున్నారు. ఆహ్వానించక అలా పడుకోటం ధర్మమా?

ఏమన్నా తలనొప్పిగా ఉందా? అదిగో భయపడి నీకోసం మాంచాల వచ్చింది. లే నాయనా! అది చక్కని చుక్కరా తండ్రీ. ఇంత వరకూ ఒక్క తడవయినా దాన్ని కన్నెత్తి చూచావు కావు. అది నీబోటి ధర్మవీరుడికి తీరని కళంకంరా తండ్రీ! అయ్యో! పాపము! అటు చూడు దాని కళ్లలో నిరాశా జ్యోతులు ఎలా తాండవిస్తున్నవో నా గుండె భరించలేదురా తండ్రీ! ఇది నాకెంత కడుపుకోత. ఒక్క తడవ కన్నెత్తి దానిని చూస్తే నాకు కనకాభిషేకం చేయించినంత ఆనందం కలుగుతుందిరా నా జన్మ తరిస్తుందిరా!!

**కొమ్మరాజు:** (నెమ్మదిగా బుజం తడుతూ) మహాయుద్ధమధ్యంలో మహామంత్రులు తమరే ఇలా మతిని భ్రంశం చేసుకుంటే...

**బ్రహ్మన్న:** (తెప్పరిల్లి పాలభాగం గట్టిగా తుడుచుకుంటూ) నొసట వ్రాసిన వ్రాలు తప్పించను ఎవరి తరం? చెన్నకేశవ కృప చివరకు నామీద ఇలా ప్రసరించింది. ఇక చేసేదేముంది.

**మలిదేవుడు:** అన్నా! ఆ కటిక కసాయిని బందీచేసి పట్టుకో వస్తాను. అనుజ్ఞ.

**బ్రహ్మన్న:** ఎంత మాట! మీ శరీర రక్షణమే నేటి కర్తవ్యం పరమేశ్వర కృప అన్యథా పరిణమిస్తే ఈ రక్తపాతాలు ఎవరికోసం తండ్రీ?

**మలిదేవుడు:** నా పంచప్రాణాలలో ప్రముఖమైన రెండూ పోయిన తరువాత నాకీ బ్రతుకెందుకు?

**(నలగామరాజు సోద్వేగంతో ప్రవేశించి బ్రహ్మన్న పాదాలమీద పడబోతాడు)**

**కొమ్మరాజు:** (ఆశ్చర్యంతో) మహారాజులుంగారు!

**(బ్రహ్మన్న నలగామరాజును వారిస్తుంటే)**

**నలగామ:** అన్నా! ఈ మహా పాపిని ఒక్కమాటు నీ అమలిన పాదపద్మాల మీద వ్రాలి కన్నీటితో పంకిలం చెయ్యనీ. నా హృదయానికి శాంతి లభిస్తుంది.

**బ్రహ్మన్న:** జయాపజయాలు..

**నలగామ:** వాటితో నాకేం ప్రయోజనం. అవిగో నా సైన్యాలన్నీ నీవి. ఆ నీచురాలు కొద్దిబలంతో కన్నమదాసుకు చిక్కిపోబోతున్నది.

**బ్రహ్మన్న:** ఈ విచిత్ర సన్నివేశం నాకేమీ అర్థం కావడం లేదు ప్రభూ!

**నలగామ:** 'ప్రభూ!' ప్రభు వెవరన్నా? మలిదేవుడు ప్రభువు. బ్రహ్మన్న మంత్రి మహా మంత్రి. రాజ్యానికి నాకు అర్హత ఉన్నదో లేదో. నేను దాని నాశించను. పరిత్యజిస్తున్నాను.

అన్నా! కన్నమతో నేను అతనిని కలకాలం జీవించమని దీవించునట్లు చెప్పండి.

మలిదేవా! (దగ్గరికి వస్తే) తమ్ముడూ! నా ద్రోహాలన్నీ మరిచిపో! అన్న ఆజ్ఞాపించినట్లు రాజ్యపాలన చేసి మన తండ్రి తాతల పేరు నిలవబెట్టు. నీ రాజ్యం రామరాజ్య మనిపించు. నేను తపోవనాలల్లో ప్రశాంతి నాశిస్తున్నాను.

**మలిదేవుడు:** (ఆశ్చర్యంతో, ప్రేమపూర్వకంగా) అన్నా! ఈ దారుణ మేమిటి?

**లేడిత దేగినాడు సుఖలీలకునై సురలోక భూమికిన్**
**నీడగ నిల్వ కిట్లు అవనీభర మెల్ల వహింపు మంచు క్రొ**
**వ్వాడి తపంబొనర్ప చన పాడియె మీరలు లేకయున్న నా**
**పోడిమి చెల్లు నేగతిగ భూప్రజపాలన చేయనేర్తునో.**

**నలగామ:** (ఉదాత్తముఖ విన్యాసంతో) తండ్రీ!

**లేరని వారు వీరు మదిలేశము చింతయొనర్ప కయ్య నీ**
**వారిల నున్నవారు కన వాస్తవ బుద్ధి కసత్యమేను నీ**
**వీ రణభూమి మంటి మను టేనియు, సర్వము మిధ్య దేహి ఇ**
**ట్లూరక భ్రాంతి నొందు సమయోచిత మోహరస ప్రలుబ్ధతన్**

(బ్రహ్మన్నతో) అన్నా నాకు సెలవు. (కొమ్మరాజుతో) బావా! అనుజ్ఞ!!!

**బ్రహ్మన్న:** నన్ను గూడా తపోవనాలకు నిన్ననుసరించనీ నాయనా!

**నలగామ:** గురిజాలలో మలిదేవుడికి పట్టాభిషేకం చేయించి అతడు సుఖంగా రాజ్యపాలనం చేస్తున్న తరువాత మీరు వనాలకు రావచ్చును. ఇది నా ఆజ్ఞ. ఇప్పుడు నేను ప్రభువును.

**(ఠీవితో నిష్క్రమిస్తాడు)**

**బ్రహ్మన్న:** ప్రభూ!

**(తెరలో కత్తుల కణకణలూ, సింహనాదాలు వినిపిస్తవి)**

**నాగమ్మ గొంతు:** (పౌరుషోద్రేకంతో)

**ఓరీ కన్నమ! పొంగెదింతటికె ఓహో, జోదువైనావె, ఈ**
**పోరాటమ్మున గెల్వలేవు ఆడిదంబున్ పట్టుటేలాగొ నీ**
**కేరా వచ్చునె? త్రిప్పుకొమ్మిదిగొ ఏదీ? పారిపొమ్మింక లే**
**దా రక్తాంజలి నిల్పి నీ శరముతో నర్చింతు కాత్యాయనిన్**

**కన్నమదాసు గొంతు:** (ప్రళయ భీకరంగా)

**ఓసి పిశాచి, ప్రేలకికఊరక మాటలతోడ ఖడ్గవి**
**న్యాసము చేసెదేల? కదనంబున నిన్ హతమార్పలేక కా**
**దే సమయింతు తండ్రి కడ ఈ కరవాలము నాపలేక ఆ**
**యాసమె కల్గుచున్న దెటు లైనను నీ బ్రతుకింక చెల్లనే.**

ఈ ధాక అందుకో!

**నాగమ్మ:** (ప్రవేశిస్తూ) ఇదిగో ఎదురుదెబ్బ – నాతోనా నీకు తులువా?

**కన్నమ:** (కత్తిమీద దెబ్బకొడుతూ ప్రవేశించి) నడు.

(గట్టిగా దెబ్బ కొడితే నాగమ్మ చేతిలో కత్తి కింది పడుతుంది. కన్నమ నాగమ్మ డొక్కకు కత్తి మోటించి నొక్కుతూ బ్రహ్మన్న పాదాల దగ్గరికి నడిపిస్తూ ఉంటాడు)

**నాగమ్మ:** (బాధతో) అబ్బా!

**బ్రహ్మన్న:** (బాధించటము మానమనే అభిప్రాయంతో) కన్నమా!

**కన్నమ:** తండ్రీ! ఈ పిశాచి కనికరించ దగ్గది కాదు.

**బ్రహ్మన్న:** మహా మేధావి! అనుపమ ప్రజ్ఞావంతురాలు!!

(కన్నమ కడుపులోకి కత్తి నొక్కుతాడు. రక్తము చిమ్మికొడుతుంది)

**నాగమ్మ:** (బ్రహ్మనాయుని పాదాల దగ్గిరకు వ్రాలి పొర్లాడుతూ) అబ్బా! క్షమించు బ్రహ్మన్న మంత్రీ! అపకారాలు ఎన్నో చేశాను... క్షమించు... అయ్యో..... రక్తం.... దాహం... నా తండ్రికి... మృత్యు....దండన.... జ్ఞప్తికుందా... (సోలి ప్రాణం విడుస్తూ) ఇది, ఇది ప్రతీ.... కా.... ర...ము.

# వసంతసేన

సాహిత్యలత 1953

# అంకితము

## శ్రీ వల్లభజోస్యుల సుబ్బరాయలకు

భాసకవితాలయమున సంభవము నొంది
శూద్రకుని యింట మోహనస్ఫూర్తిఁ బెఱిఁగి
నాహృదయరంగమున నిల్చి నాట్యమాడి
తమకమున వచ్చె నేఁ డిది మిము వరించి

బహుళ సాహిత్య వనలతా ప్రసవ విసర
బంధు రామోద పరిపూర్ణ పథ విహారి!
మన్మనోనంద నోద్భూత మహిత కుసుమ
మిది గ్రహింపుము సంప్రీతి నెద వహించి

మానవోత్తమ! కారుణ్యమధురమూర్తి!!
సకలవిద్యా రసామృతాస్వాదనమున
జిరతరంబైన మీ యశస్స్నేహమంది
వెలయుఁగావుత నీకృతి తెలుఁగు నాఁట!

# తొలి పలుకు

సంస్కృతదృశ్య కావ్యప్రపంచంలో ఆదికవి భాసుడు జానపద కథా సాహిత్యమునుంచో లేక గుణాఢ్యమహాకవి 'బృహత్కథ' నుంచో ఈ రమణీయమైన కథను స్వీకరించి స్వాయత్తం చేసికొని 'దరిద్రచారుదత్త' రూపకాన్ని సృజించినాడు. మహాకవి శూద్రకుడు మరికొన్ని కథా సన్నివేశాలనూ సంభాషణలనూ కల్పించి కథలో వివిధ ప్రణయవిభేదాలు విస్పష్టంగా గోచరించేటట్లు "మృచ్ఛకటిక"ను కల్పించి సంస్కృతదృశ్యకావ్యసుందరికి ఒక విశిష్టమూ, అమూల్యమూ అయిన అలంకారాన్ని చేకూర్చి విశ్వవిఖ్యాతి గడించినాడు.

ఈ రూపకంలోని గుణాలన్నీ భాస శూద్రక మహాకవులవి దోషములు నావి. 'వసంతసేన' వ్రాసి దరిదాపు ఎనిమిది సంవత్సరాలు కావచ్చింది. నేటివరకూ దీనిని నాటక ప్రియులకు సమర్పించలేక పోయినాను.

ఈ 'వసంతసేన'కు శూద్రకుని కథ కేవల మాధారము. శూద్రకుని కథలో చారుదత్తుడికి ధూతాదేవి పత్నిగా ఉన్నది. ఇట్టి స్థితిలో వసంతసేనపై అనురాగ మనుచితమని యామె మరణానంతర మాతడు వసంతసేనపై అభిమానమును గొన్నట్లు, నేను మార్పొనర్చినాను. మైత్రేయుని పాత్రకు వ్యక్తిత్వం ఉన్నట్లు మూలంలోని కథలో గోచరించదు. వైదికుల ఆ కేకరాలను పరిభాషలను దేవాదేవేషు, అయంవై, వికిరపిండం, బ్రహ్మిష్యోబ్రహ్మిష్ఠి, ఇత్యాదులను అతనిచేత పలికించి ఒక ప్రత్యేకత నాపాదించటానికి ప్రయత్నించాను. శకార పాత్రకు 'వెర్రిపాటలను' పెట్టటంలో వినూత్నతను ఉద్దేశించాను. ఇతని విషయంలో వసంతసేన ఇంటిముందు తిరుగాడటం, వీథిభాగవతం ఆడటానికి యత్నించటం నూతన కల్పనలు. మదనికాశర్విలకుల యన్యోన్యానురాగాన్ని వసంతసేన గ్రహించి వారికి వివాహం చేయటం కూడా స్వతంత్ర కల్పన.

ప్రదర్శనానుకూల్యతకోసం ఇందులో ఒక దృశ్యం దీర్ఘంగాను, మరొక దృశ్యం స్వల్పంగాను కల్పించడమైంది. ఇందలి అల్పదృశ్యాలన్నీ ప్రథమయవనికలు (Curtain Risers) ప్రాచీన నాటకాలల్లోని విష్కంభాలను పోలినవి. విశ్రాంతికోసం

పదోదృశ్యంముందు అల్పదృశ్యాన్ని కల్పించలేదు. అక్కడనుంచి ఉత్తరార్ధం ప్రారంభ మౌతుంది.

రచన, ప్రదర్శన, ముద్రణలలో నాకు తోడ్పడిన నా మిత్రులందరికీ కృతజ్ఞుణ్ణి. ఆదరపూర్వకంగా ఈ కృతిని అంకితం తీసుకోటానికి అంగీకరించిన సాహిత్య ప్రియంభావుకులు, కవులు, నాటకకర్తలు, పండితులు, మానవోత్తములు ఐన ప్రధానాచార్యులు శ్రీ వల్లభజోస్యుల సుబ్బారావు గారికి నా నమోవాకములు. శ్రీ గుర్రం మల్లయ్యగారి చిత్రాలతో ఈ నాటకాన్ని అలంకరించే అవకాశాన్ని చేకూర్చిన ఆప్తమిత్రులు శ్రీ ఊట్ల కొండయ్యగారికి నా ప్రణయ పూర్వక నమస్కారములు.

ఉమాసదనం: **సాహిత్య కళోపాసి**
బ్రాడీపేట, గుంటూరు:మే 5, 1953 **వావిలాల సోమయాజులు**

# పాత్రలు

**పురుషులు**

**చారుదత్తుడు :** కథానాయకుడు

**మైత్రేయుడు :** చారుదత్తుని మిత్రుడు

**శర్విలకుడు :** మదనిక భర్త, దొంగ

**శకారుడు :** రాజశ్యాలకుడు

**కుంభీలకుడు :** విటుడు, శకారుని మిత్రుడు

**సంవాహకుడు :** జూదరి, బౌద్ధసన్యాసి

**అధికరణకుడు :** న్యాయోద్యోగి

**శోధనకుడు :** న్యాయస్థాన కరణికుడు

**గోహ :** న్యాయస్థాన సేవకుడు

**రోహసేనుడు :** చారుదత్తుని కుమారుడు

**స్త్రీలు :**

**వసంతసేన :** గణిక, చారుదత్తుని ప్రియపత్ని

**మదనిక :** వసంతసేనకు సేవిక, చెలికత్తె

**రదనిక :** చారుదత్తుని గృహసేవిక

# ఒకటో దృశ్యం

(ఉజ్జయినీ నగరం, సమయం దీపాలవేళ. కామదేవాలయ ప్రాంగణంలో కుడివైపు చిన్న వేదికమీద మదనదేవ విగ్రహం. ఎడమవైపు ఒక వేదిక అలికిముగ్గులు పెట్టి ఉంటుంది. ప్రవేశము రాజశ్యాలకుడు శకారుడు, అతని మిత్రుడు ఒక విటుడు, కుంభీలకుడు)

**శకారుడు :** (రాజసంతో నాలుగు దిక్కులూ పరికిస్తూ) బావా! ఇటువంటి బ్రహ్మాండమైన ఆలయాన్ని మనవాళ్లు ఎందుకు కట్టించారో ఎన్నడైనా ఆలోచించావా?

**కుంభీలకుడు :** (చమత్కారంగా) మహాప్రభువులు, తమబోటివారి కొలువులో పడ్డ తరువాత తీరుబడి ఎక్కడేడ్చింది?

**శకారుడు :** అయితే నాకొక మంచి ఊహ తోచింది.

**కుంభీలకుడు :** (వెటకారంగా) ఓహోఁ (ఏదీ అన్నట్లు చిటిక వేస్తాడు)

**శకారకుడు :** (స్వాతిశయంతో నిలిచి) బావా! నేను మహాపండితుణ్ణి, రామాయణ, భారత, భాగవతాలూ, ఇంకా అనేక గ్రంథాలు ఉఫ్‌మని ఊదేశాను. నాలుగు వేదాలల్లో నాకు తెలియని సంగతులు వేరే ఏమున్నవోయ్. ఆలోచించకుండా ఈ మంచి మనస్సు అరనిమిషం ఊరుకోదు.

**కుంభీలకుడు :** ఇంతకూ ఇటువంటి దేవాలయాలు....

**శకారుడు :** ఆఁ, పూర్వులు ఇవి కట్టించటంలో పరమ రహస్యం ఒక్కటే. ఊళ్ళో మగవాళ్ళనూ, ఆడవాళ్ళనూ ఉదయం సాయంకాలం ఒక్కచోట చేర్చటానికి.

**కుంభీలకుడు :** చేరిస్తే –

**శకారుడు :** ఇంతేనా మరి? పెళ్ళిళ్ళు కానివాళ్ళకు పెళ్ళిసంబంధాలూ, అవీ లేనివాళ్ళకు ప్రేమ సంబంధాలూ కష్టం లేకుండా కుదిరిపోతవని.

**కుంభీలకుడు :** బావా! నీవు ఇక్కడెక్కడా పుట్టదగ్గ పురుషుడివే కావు, భూలోక బృహస్పతివి.

**శకారుడు :** హిఁ, హిఁ, హిఁ, హిఁ... (జ్ఞప్తికి తెచ్చుకున్నట్లు) ప్రొద్దు పోయిందంటే వినకుండా ఆలయంలో అతివలుంటారు రమ్మని ఇంతదూరం నడిపించుకో వచ్చావు. ఏరీ? ఇంతసేపు ఇంతులను చూడకుండా ఈ శ్యాలకమహారాజు ఎలా ఉంటాడనుకున్నావు?

**కుంభీలకుడు :** తొందరపడితే ఎట్లా?

**శకారుడు :** కానీ, బావా ఇదుగో మనం చిన్ననాడు చెప్పుకున్న తత్వం ఒకటి పాడుకుంటాను (చిందువేస్తాడు)

**గు, గ్గు, గూటి చిలకేది రన్నా!**

**చిన, చిన్న గూడుచినబోయె రన్నా!** (చిందు వేస్తాడు)

(క్షణంలో స్ఫురించినట్లు) బావా! వసంతసేన !!

**కుంభీలకుడు :** ఆమె ఇంకా ఇంటిదగ్గర బయలుదేరే వేళే అయి ఉండదు.

**శకారుడు :** దీపాలు పెట్టిన తరువాత ఇంకేం వస్తుంది?

**కుంభీలకుడు :** నేను ఆమెను రమ్మని చెప్పిందే అప్పుడు.

**శకారుడు :** అయితే మన మంత్రం పారిందన్నమాట! పిట్ట పట్టుకు చిక్కిందన్నమాట!!

**కుంభీలకుడు :** చిక్కటమేమిటి! కాసేపట్లో ప్రభువుగారి చేతుల్లో చిమిడిపోబోతుంటే.

**శకారుడు :** (పెద్దపెట్టున) హిఁ, హిఁ, హిఁ బావా! (మెడలో హారం తీసి అతనికి ఇవ్వబోయి మళ్ళీ మెళ్ళో వేసుకొంటూ) నా కోసం వసంతసేన వస్తుందా?

**కుంభీలకుడు :** ఆఁ

**శకారుడు :** తప్పకుండా?

**కుంభీలకుడు :** తప్పకుండా!

**శకారుడు :** నా మీద ఒట్టే? (చెయ్యి జాపుతాడు)

**కుంభీలకుడు :** (చేతిలో చేయి వేస్తూ) నీ మీద ఒట్టే.

**శకారుడు :** హిఁ హిఁ హి – వసంతసేనే! నాకోసమే!! ఇక్కడికే!!! బావ కూడా తోడు ఉన్నప్పుడే! హిఁ హిఁ హిఁ (చిందువేస్తూ వెకిలిగా)

**దశ్శరభ! శరభా!! దమ్మక్క పిల్ల!!**
**నీరంటి పిల్ల! నిమ్మంటి పిల్ల!!**
**పొన్నంగి కళ్ళు**
**మున్నంగి వొళ్లు,**
**పిల్లంటె పిల్లా!**
**కల్లంటి పిల్ల!!**
**దశ్శరభ! శరభా!! దమ్మక్క పిల్లా!!**
**నీరంటి పిల్ల! నిమ్మంటి పిల్ల!!**

**కుంభీలకుడు :** ఏం బావా! నీవిప్పుడే నిలిచేటట్లు లేదు. ఈ నాట్యం అంతా ప్రభువువారు ఎక్కడ నేర్చుకున్నారో!

**శకారుడు :** అక్కతోపాటు అయ్యావార్లంగారివద్ద చెప్పుకున్నాం రణభరతం! రావణభరతం!! నేను గొప్ప ఆటగాణ్ణి.

**కుంభీలకుడు :** ఆటగాడి వేమిటి? గొప్ప పాటగాడివి కూడా.

**శకారుడు :** (కుంభీలకుడి చేతిలో ఉన్న పానపాత్రవైపు వేలు చూపిస్తూ) ఏది బావా! ఒక గుక్కెడు ఇలాతే– కళ్ళకు కాస్త కళొస్తుంది.

**కుంభీలకుడు :** (వరుసగా శకారుడి చేతికిచ్చిన చిన్న పాత్రలో ముమ్మారు పానీయం పోస్తాడు)

**శకారుడు :** (అర్చుకుంటూ తాగి) బావా! నేనెవరిని?

**కుంభీలకుడు :** (ముఖం వైపు తీక్షణంగా చూస్తూ) శ్యాలకమహారాజులుం గారు.

**శకారుడు :** నీవో!

**కుంభీలకుడు :** తమ సేవకుణ్ణి

**శకారుడు :** (ఆధిక్యస్ఫోరకంగా) ఛీ! సేవకాధముడివి!!

**కుంభీలకుడు :** (గొంతుమార్చి) బావా! అయితే నీకోసం వసంతసేన రాదు కోపం వస్తున్నది.

**శకారుడు :** వసంతసేన రాదూ? కోపం వస్తున్నదా? సహించను. దాన్ని చంపేస్తాను (చిన్న మొండికత్తి మొలలో నుండి లాగి ఎక్కిళ్ళు పెడుతూ)

> **భళి, భళీ, ప్రభువులది**
> **బంగారుబాట!**
> **తనమాట వినకుంటె**
> **తప్పనిది వేట!!**

**కుంభీలకుడు :** (ఒళ్ళు తెలియటం లేదన్నట్లుగా అభినయించి దగ్గిరకు పోయి తడుతూ) బావా! వసంతసేన వచ్చేస్తున్నది!

**శకారుడు :** ఆc!. రంభలా రమ్మను – (కత్తి మొలలో దోపి) అది వొచ్చేటప్పటికి నేను రమ్యంగా రాభణాసురుడిలా కనిపించాలి. ఇదుగో, బావా! ఈ హారం నీ మెళ్ళో వేసుకో. (హారం ఇస్తాడు)

**కుంభీలకుడు :** (అందుకొని మెళ్ళో వేసుకుంటాడు)

**శకారుడు :** (చొక్కాకు కుట్టిన అద్దం చూచుకుంటూ హారాలు సవరించుకుంటుంటే కుంభీలకుడు సహాయం చేస్తాడు) నేను ఇప్పుడు ఎట్లా వున్నాను బావా!

**కుంభీలకుడు :** మహారాజులుంగారిలా ఉన్నావు మన్మథ దేవుడి మరిదిలా ఉన్నావు.

**శకారుడు :** వసంతసేన వచ్చేటప్పటికి ముచ్చటగా ఆ అరుగుమీద కూర్చొని అసురగానం పాడుకుంటుంటాను.

**కుంభీలకుడు :** (చిరునవ్వుతో) బావా! నీ పాట వినిపిస్తే గుళ్ళు కూలిపోతాయి. వసంతసేన వచ్చినదోవనే వెనక్కు వెళ్ళిపోతుంది.

**శకారుడు :** అయితే ముద్దులు మూట కట్టేటట్లు పొలిమేరలో పోలేరమ్మలాగా గంభీరంగా కూర్చుంటాను. దాని చేతనే ఆడించు, పాడించు. (పోయి వేదికమీద సగర్వంగా కూర్చుంటాడు)

**కుంభీలకుడు :** (దూరం నడచి) అదుగో ప్రాకారం దాకా వచ్చేసింది. (ఒక పద్ధతిలో కూర్చోపెట్టి) ఇలా కూర్చో – గుమ్మం దాకా వచ్చింది.

**శకారుడు :** (బిర్రబిగిసి దగ్గుతాడు)

**కుంభీలకుడు :** వెంట మదనిక కూడా వస్తున్నది. వె(్రిచేష్టలు చెయ్యకు. వసంతసేన అందరివంటిది కాదు గణిక!

**శకారుడు :** ఆఁ! కణికా! మదనిక కూడా వెంట వస్తున్నదా? మరీమంచిది మనకోసం ఇద్దరినీ మాట్లాడుదాం.

**కుంభీలకుడు :** (నిశ్శబ్దమన్నట్లు) ఇస్! (దగ్గరకు వచ్చారని హస్తసంజ్ఞ)

**శకారుడు :** (మళ్ళీ దగ్గుతాడు)

**కుంభీలకుడు :** (దగ్గరకు వచ్చి) మదనారాధన కాగానే మదనికను పంపించివేస్తుంది. అందాకా మనం అవతలి స్తంభం చాటున నిలబడి కనిపెడుతుందాం. లే.

**శకారుడు :** ఊఁ ఊఁ (అయిష్టాన్ని ప్రకటిస్తాడు)

**కుంభీలకుడు :** (తాను బయలుదేరుతాడు. శకారుడు తప్పనిసరి ఐతే అనుసరిస్తాడు)

(ముందు మదనిక పూజాపాత్రికతో నడుస్తుంటే వెనక వసంతసేన వస్తుంటుంది. పూజాద్రవ్యాలు క్రిందపెట్టి మదనిక ప్రక్కకు తప్పుకుంటుంది. వసంతసేన మదనవిగ్రహానికి ముందుగానిల్చి నమస్కరించి నాట్యభంగిమలో సాభినయంగా అంజలించి పాట పాడుతుంది)

**జయ, జయ, మధుమయ, మదనా!**
**జయ, జయ, యువజన, సదనా!!**
**ఓ జైవాతృక!**
**రససాంయాత్రిక!!**
**సుషమాసుందర!**
**మానసమందిర!!  జయ, జయ**
**త్రిభువనపావన!**
**నవయుగజీవన!!**
**ఓ సుమసాయక!**
**ఉజ్జ్వల నాయక!!**
**జయ, జయ, మధుమయ మదనా!**
**జయ, జయ, యువజన సదనా!!**

(కామదేవునిముందు సకరుణంగా మోకరిల్లి!) ప్రభూ! నాబ్రతుకును ఎన్నాళ్ళు ఈ అడవిలో కాచిన వెన్నెలను చేయదలచుకున్నావు. నా పవిత్ర ప్రేమలతకు ప్రపంచములో ఆలంబనమే లేదా? అనుగ్రహించి నీవిచ్చిన ఈ అందచందాలు ఆటపాటలూ అర్థోన్మత్తులైన ఈ పామరపల్లవుల పాలు చేయవలసిందేనా? రసిక దాంపత్య ప్రణయానికి ఈ దాసి నోచుకోలేదా? – ఊహాగానాలతో ఉజ్వలానంద రసపిపాస తీర్చుకోలేను స్వామీ! నా స్వప్నసౌఖ్యాలకు వాస్తవిక స్థితి రాదా? కనికరించి నా కామితమీడేర్చు ప్రభూ! నీ దయ రానిది ఇక నీ పాదదాసి జీవించలేదు నీకు ఆటలుండవు! – పాటలుండవు!! మదనికా!

**(నిస్త్రాణతో లేచి వేదికను సమీపిస్తుంది)**

**మదనిక :** (దగ్గరకు వస్తూ) అక్కా!

**వసంతసేన :** అమ్మాయీ! ఆర్యచారుదత్తులు ఇందాకనే ఆలయానికి బయలుదేరారంటివే?

**మదనిక :** అవును. అబద్ధ మేముంది!

**వసంతసేన :** మరి ఏరీ?

**మదనిక :** (ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లు నటించి) మైత్రేయులూ ఆర్యులూ రాచబాటలో ఆలయానికి పయనమౌదా మనుకుంటుంటే విని ఆఘమేఘాల మీద వచ్చి నిన్ను పిలుచుకోవచ్చానక్కా!

**వసంతసేన :** ఈ పాటికి వారు వచ్చి వెళ్ళిపోయి ఉండరు గదా!

**మదనిక :** ఇంతలోనేనా? మనం అడ్డదారిని కూడా వస్తిమి.

**వసంతసేన :** ఇంకా వారు వస్తారంటావా?

**మదనిక :** వస్తారనే నా నమ్మకం. (వసంతసేన ప్రక్కకు చేరి కూర్చుంటూ) అక్కా! ఈ దినం అప్పుడే ఆటచాలించావు.

**వసంతసేన :** ఎందుకో నాట్యం చేయాలని ఆసక్తే లేదు. ఇదని చెప్పలేకుండా ఉన్నాను. కాసేపు గజ్జె కట్టానో లేదో ఎంత అలసిపోయినానో చూడు. (వేదనపడుతుంటే మదనిక ఉత్తరీయపు కొంగుతో విసురుతుంటుంది) అమ్మాయీ! ఏమైనా సరే, వారు ఏమనుకుంటున్నా సరే, ఈ దినం ఆర్య చారుదత్తులు వస్తే ఆ సంగతి అడిగివేస్తాను. లేకపోతే మనస్సును కలతపెట్టే కోరికను ఎన్నాళ్ళని దాచిపెట్టేది?

**మదనిక :** (సాలోచనగా) ముందు నీవే బయటపడితే చులకనైపోతావేమో!

**వసంతసేన :** అల్పుల విషయంలో అంతే కావచ్చును. కానీ ఆర్యుల విషయంలో సంకోచించ నవసరంలేదనుకుంటున్నా.

**మదనిక :** అయినా, అక్కా! నీ పవిత్రప్రేమకు ఈ ప్రక్కదారులెందుకు? వారు వస్తున్నారేమో!

**వసంతసేన :** అమ్మాయీ! ఆయనకు విధ్యుక్తంగా నిలవబడి ప్రణామం చేయగలుగుతానా?

**మదనిక :** (సకరుణంగా) అక్కా! నీ వింత బేల వనుకోలేదు. (కొంతదూరం ముందుకు నడిచి) అరుగో! ఆర్యులూ మైత్రేయులూ!!

**వసంతసేన :** అమ్మాయీ! నాకేమిటో అర్థంగాని భయమేస్తున్నది.

**మదనిక :** భయమెందుకు? రాగానే నిలవబడి నమస్కారం చెయ్యి! చిరునవ్వుతో చిత్తాన్ని ఆకర్షించు.

**వసంతసేన :** ఆ పని నాకు సాధ్యమౌతుందా?

**మదనిక :** అక్కా! ఆయనమటుకు అన్నీ ఉడిగిపోయిన అద్వైతికాదుగా! నీవు కాకలు తీరిన కళోపాసివీ – దగ్గిరికి వచ్చేస్తున్నారు. సిద్ధపడు! నేను వెనుక ప్రక్కగా నిలవబడతాను.

**(బయలుదేరబోతుంది)**

**వసంతసేన :** నేను ఒంటరిగా ఉండలేను. అయినా వారి ఆరాధనకు అడ్డువస్తానేమో! నేనూ ఆ విగ్రహం వెనకనుంచీ వారి సౌందర్యాన్ని కళ్లార చూచి ఆనందించి తరువాత వచ్చి నమస్కరిస్తాను. (పూజాపాత్రిక వేదికమీదనే ఉంచి ఇద్దరూ విగ్రహాలవెనుకకు వెళ్ళిపోతారు)

**(ప్రవేశము – మైత్రేయుడు, చారుదత్తుడు)**

**చారుదత్తుడు :** మైత్రేయా! ఎంత చల్లనిస్వామి!! ఒక నమస్కారం చేసివద్దామా!

**మైత్రేయుడు :** (క్రోధముతో) పంచబాణాలు మనమీద పడేయటానికేనా? చాలు చాల్లే – మొక్కటానికి కోటాన కోట్ల దేవతలుంటే దొరక్క దొరక్క నీకు బలే దేవుడు దొరికాడులేవోయ్!! తార్పుగత్తెలదొర!! (వేదికమీద చతికిల పడుతూ) నేనిక్కడ కూర్చుని

జంధ్యానికి బ్రహ్మముడి పూర్తి చేసుకుంటుంటాను. నీవు వెళ్ళి పూజించి ఆయన వేసే పుట్టెడు బాణాలు నీమీదనే వేయించుకో.

**చారుదత్తుడు :** (విగ్రహం చేరువకు నడిచి, సాష్టాంగపడి లేచి మోకరిల్లి ప్రార్థిస్తాడు)

> **శంభు స్వయంభు హరయో హరిణేక్షణానాం**
>
> **ఏనా క్రియంత సతతం గృహకుంభదాసాః**
>
> **వాచామగోచర చరిత్రవిచిత్రితాయ**
>
> **తస్మై నమో భగవతే కుసుమాయుధాయ**

(ఒక పాత్రలో ఉన్న పుప్పొడి చేతికందుకొని కళ్ళ కద్దుకొని శిరస్సుమీద ఉంచుకుంటాడు. మరికొంత చేత్తో పుచ్చుకొని) మైత్రేయా! ఈ పుప్పొడి నీ శిరస్సున ధరించు, నీ సమస్త దోషాలూ హరిస్తవి (వేయబోతాడు).

**మైత్రేయుడు :** (చనువుతో కూడిన పెడసరంతో) నీ శిరస్సుమీద ఉంచుకున్నావుగా! చాల్లే. దోషాలు సమస్తమూ దగ్ధం చేయటానికి భూతేశుడిచ్చిన విభూతి ఉండగా (సంచిలోనుంచి బయటకు తీసి విభూతి మళ్ళీ పెట్టుకుంటూ) నా కెందుకీ ముష్టి పుప్పొడి, కంపుకొడుతూ, పైగా నేనేమన్నా వెనుక దోషాలు చేశానా? ఇంకముందు చేయబోతున్నానా? ఘోటక బ్రహ్మచారిని!

**చారుదత్తుడు :** (దానిని కూడా తన శిరస్సుమీద ఉంచుకుంటూ) మైత్రేయా! దేవతలమీద కూడా నీకెందుకోయ్ ఇంత ఉక్రోషం.

**మైత్రేయుడు :** ఊరికే వస్తుందా. గోపురకలశాలకనీ, గోడగడ్డలకనీ, ఈ దొంగదేవుడి గుడిమొఘాన ఇంత డబ్బు తగలేశావు గదా, తిండికి చాలక నానా గడ్డీ కరుస్తుంటే నా చేత తిట్టైనా తింటానికి ఒప్పుకున్నాడు గాని ఒక్క చిల్లి గవ్వైనా ఇచ్చాడా మనకీ దేవుడు?

**చారుదత్తుడు :** (వేదికమీద కూర్చుంటూ) నీవు ఎంత వెర్రిబాగులవాడివి! మన బ్రతుకే ఆ భగవంతుడి కృపకాదుటోయ్.

**మైత్రేయుడు :** నా బ్రతుకు కూడానా నా ఖర్మం కాలితే! ఓం శాంతిః శాంతిః –

**చారుదత్తుడు :** మనం ఆయన ఋణం తీర్చుకోలేని ఈ దరిద్రస్థితికి వచ్చామని నాకెంతో చింత వేస్తున్నది.

**మైత్రేయుడు :** (వెటకారంగా) పాపము!

**చారుదత్తుడు :** (ఆలయంవైపు చూస్తూ) ఈమధ్య కొంతకాలంనుంచీ ఆలయంవైపునకు రావటానికే కాళ్ళాడటం లేదు సిగ్గేస్తున్నది.

(*) శ్రీదేవి నామీద దయ ఉంచిన దినాలల్లో నా ధనంతో చిత్తజదేవుని మహోత్సవాలు ప్రతివత్సరం జరిపించాను.

ఒకనాటి కైంకర్యానికి కూడా ఈనాడు నా దగ్గిర ఏమీ లేదు.

**మైత్రేయుడు :** చాలు. చాల్లే! పెట్టిందంతా చాలదూ! ఇక్కడుంటే ఇంకా నీకేవో ఇటువంటి ఊహలే కలుగుతుంటవి. లే!

**చారుదత్తుడు :** (దృష్టి వసంతసేన, మదనికలు వదలిపోయిన పూజాపాత్రికమీద పడుతుంది) పాపం! ఎవరో ఇది మరచి ఇంటికి వెళ్ళిపోయినట్లున్నారు.

**మైత్రేయుడు :** ఆ ఏదీ – మా అక్కగారు తులసీమందిరం ముందు పెట్టుకొని పూజ చేసుకోటానికి ఎంతో బాగుంది.

**చారుదత్తుడు :** (పూజాపాత్రలో ఉన్న ఒక పూవు చేతికి తీసుకుని వాసన చూస్తూ) ఎవరైనా ఆలయవనంలో పూలకోసం తిరుగుతున్నారేమో!!

**మైత్రేయుడు :** (లేచి నాలుగుదిక్కులూ కలయచూస్తూ ఉండగా ఒకవైపునుంచి మదనిక వసంతసేన వచ్చి చారుదత్తుని ముందు నిలబడతారు)

**చారుదత్తుడు :** (వెనుకగా వసంతసేన నిలుస్తుంది. మదనిక చారుదత్తునివైపూ, పూజాపాత్రికవైపూ ఒక మాటు దృష్టిని నడిపిస్తుంది) అమ్మా, ఇది మీదేనా? తీసుకువెళ్ళండి – (అని అందిస్తాడు)

**మదనిక :** (వసంతసేనను ఉద్దేశించి) ఇది మా అక్కగారిది.

**వసంతసేన :** (ముందుకువచ్చి నమస్కరించి లజ్జతో నేలబొటనవ్రేలితో వ్రాస్తూ నిలుచుంటుంది)

**చారుదత్తుడు :** జయోస్తు – శుభమస్తు – అమ్మా! నీ పేరు?

**మదనిక :** వసంతసేన!

**చారుదత్తుడు :** (చకితుడై) వీణావాదనంలో విశేషప్రజ్ఞావంతురాలని విఖ్యాతిగన్న వసంతసేనవు...

**మదనిక :** అవును... ఆమె మా అక్కగారే!

**చారుదత్తుడు :** ఆలయానికి చాలా ప్రొద్దుబోయి బయలుదేరారు?

**మదనిక :** (ఛలోక్తిగా) మా అక్కగారు కోరినపూవు ఈ తోటలో ఇప్పుడే వికసించింది.

**చారుదత్తుడు :** పూలే వెతుక్కుంటూ వచ్చి మీ వాడలో అమ్ముడుపోవలసిందిగా!

**వసంతసేన :** ఆర్యా! అమ్మకానికి రాని పూవుమీద ఆశపెట్టుకొన్నప్పుడు అక్కడికే వెళ్ళక తప్పుతుందా!

**చారుదత్తుడు :** అమ్మా! నీ ఛలోక్తికీ, రసికతకూ సంతోషము.

**వసంతసేన :** ధన్యోస్మి.

**చారుదత్తుడు :** మీ వీణావాదనం వినటానికి ఎప్పుడైనా అవకాశ మిప్పిస్తారా?

**వసంతసేన :** తమ కభ్యంతరమా? (అంజలితో ప్రేమావలోకనం చేస్తుంది)

**చారుదత్తుడు :** మనఃస్వస్థత చూచుకొని ఒకమాటు మీ ఇంటికి ఏకాంతంగా వస్తాను.

**మైత్రేయుడు :** చారుదత్తా! ప్రొద్దు పోతున్నది. ఇంక బయలుదేరుదామా, ఆలస్యమైతే అక్కయ్యగారు ఆదుర్దాపడుతుంటారు.

**చారుదత్తుడు :** (బయలుదేరుదామన్నట్లుగా లేస్తూ) అమ్మా!

**వసంతసేన :** (నమస్కరిస్తుంది)

**చారుదత్తుడు :** మైత్రేయా! (బయలుదేరమని దారి చూపిస్తాడు)

**(ఇరువురూ నిష్క్రమిస్తారు)**

**మదనిక :** అక్కా! మొదట్లో అంత సిగ్గుపడ్డావేం? ఇంతకేనా ఏమిటో అడిగివేస్తానన్నావు?

**వసంతసేన :** ఆ రెండుముక్కలైనా ఎలా అనగలిగానో ఇప్పుడు నాకే అర్థం కావటం లేదు. ఏమిటో వారితో మాట్లాడటమంటే భయం వేసింది మదనికా! – అయితే వారు నా మనస్సు గ్రహించి ఉంటారా?

**మదనిక :** (చిరునవ్వుతో) ఏమో! అంజలిపట్టి ఆర్పకుండా కాటుకకళ్ళతో సంభాషించిన రసికురాలివి. నీకే అర్థం కావాలి.

**వసంతసేన :** (బుగ్గమీద తట్టి) చాల్లేవే పరిహాసం, మదనికా! మనఃస్వస్థత చూచుకొని ఏకాంతంగా మీ ఇంటికే వస్తాననటంలో...

**(శకారుడూ, కుంభీలకుడూ ప్రవేశించిన తరువాత)**

**శకారుడు :** (రాజసంతో) ఒరేయ్! మనం దానికిచ్చిన హారాలు లెక్కవేస్తే ఎన్నైనై.

**కుంభీలకుడు :** (నమ్రభావంతో లెక్కిస్తూ) దరిదాపు మూడు వందలు?

**శకారుడు :** (దగ్గుతూ) మనతో అది సరిగాఉంటే ఇంకా ముట్టేవి కావట్రా!

**కుంభీలకుడు :** మహాప్రభువులు ముట్టకపోవటమేమిటి తమ దగ్గిర!

**శకారుడు :** (వేదికమీద కూర్చున్న వసంతసేన, మదనికల నుద్దేశించి) ఒరేయ్! వాళ్ళెవరో కనుక్కో!

**కుంభీలకుడు :** (మదనికతో) అమ్మాయీ! మీరెవరు? ప్రభువుగారు...

**మదనిక :** అయ్యా! వారెవరు?

**కుంభీలకుడు :** శ్యాలక మహారాజులుంగారు!

**మదనిక :** (వెళ్ళిపోదామన్నట్లు కనుసంజ్ఞ చేస్తూ) అక్కా! శ్యాలక మహారాజులుంగారు! శ్యాలకమహారాజులుంగారు! (లేచి పూజాపాత్రికతో మదనిక శకారుడు దగ్గరకు వచ్చి వంగి నమస్కరించి జారుకుంటుంది. ముందే వసంతసేన వెళ్ళిపోతుంది)

**కుంభీలకుడు :** ఏదో గుసగుసలాడి ఆ పిల్లపోరి మళ్ళా వస్తుందనుకున్నాను. పరిగపిట్టల్లా ఇద్దరూ పారిపోతున్నారు. బావా! నీవు వేసిన పన్నాగం పారలేదు.

**శకారుడు :** (గతుకుతూ ఉన్న గొంతుకతో) ఆఁ, రెండు పిట్టలూ మన మన్మథబాణాల గురి తప్పించుకుని పారిపోయినయ్! ఉఁ (కోపంతో) ముందుగా నీవు వాళ్ళతో మాట్లాడిరాలేదన్నమాట!

**కుంభీలకుడు :** అయితే మటుకు మాట్లాడినట్లు కనిపిస్తారా నీవే చొరవ చేసుకోవాలి గాని.

**శకారుడు :** (ఆలోచించి ఉద్వేగంతో) ఆ దరిద్ర చారుదత్తుడితో అంతసేపు గౌరవమిచ్చి మాట్లాడిందే – మహాప్రభువు అని నీవు చెప్పినా అది మాటైనా మాట్లాడకుండా దుక్కిపిట్టలా తుర్రుమంటుందా బావా! (*) ఇది

**దాటదీపరి! కసుమాల! దాట్లగుట్ట! దుక్కిపిట్ట! పిశాచంబు!! దొంగతొౄ్రు!!**
**(యక్షగాన ఫక్కికలో)**
**ఔర! రాజును నేను మాటాడకిట్లు**
**పారిపోతాదె బావ ఈ పదుపుకత్తె!!**

(రొప్పుతూ) అవమానం సహించను. వెంటపడి జుట్టుపట్టి వెనక్కు లాక్కోవస్తాను. (పోబోతుంటే కుంభీలకుడు వారిస్తాడు)

**శకారుడు :** ఇప్పుడు ఎంతకోపం వచ్చిందో తెలుసునా–

**కుంభీలకుడు :** ఔనౌను! – ప్రభువువారికి కుంభకర్ణుడి నిద్రంత కోపం వచ్చింది!

**శకారుడు :** బావా! నీకు నాతోపాటు వేటాడటమంటే ఇష్టమేనా?

**కుంభీలకుడు :** ఆఁ.

**శకారుడు :** కరుకుట్లు తినటమంటే ఇష్టమేనా?

**కుంభీలకుడు :** ఆఁ.

**శకారుడు :** అయితే నే చెప్పినట్లు విను – దీన్ని సాధించాలి.

**కుంభీలకుడు :** ఔను సాధించాలి. (ఇద్దరూ చేతిలో చేయి వేసుకొని ఊపుకుంటూ)

**అరె పులీ! భళిరె. భళీ!!**
**నేను కలీ, నీవు బలీ**
**సంతకాడ సాని దాని**
**వంతపాట బంతి ఆట! .... ఆరె పులీ!!**

**మొన్న రేతిరి వెన్నెలలోన**
**నన్ను చూచి కన్నుగీటిన,**
**అన్నులమిన్న చిన్నదాని**
**కోలాటమె కోలాటము... .... ఆరె పులీ!**

**(నిష్క్రమిస్తారు)**

## రెండో దృశ్యం

(పూజాపాత్రిక ఊపుకుంటూ అత్యుత్సాహంతో ఏకాంతంగా వసంతసేన మదనాలయం నుంచి ఇంటికిపోతూ పాడుకుంటుంది)

**నావ నైనానోయి సఖుడా!**
**నడుపవోయీ, నావికుడవై!!**
**కారు మొగిలులు లేనె లేని**
**గాలిగుంపులు రానె రాని**
**ప్రణయసాగరతీరభూముల**
**పాడుకోరా! ఆడుకోరా!!          నావనైనా...**

**వెండి వెలుగుల నిండి వెలిగే**
**వింత లోకములోన సఖుడా!**
**నాకు నీవై నీకు నేనై**
**ఏకమౌదామోయి సఖుడా!!          నావనైనా...**

**కుంభీలకుడు :** వసంతసేనా!... నిలు!... నిలు!!

**శకారుడు :** (తెరలో నిష్కర్షగా) వసంతసేనా! వసంతసేనా!!

**వసంతసేన :** (వెనుదిరిగి చూచి) అయ్యో! అయ్యో!!

**శకారుడు :** (కుంభీలకుడితో ప్రవేశించి) మేము... మేము వసంతసేనా!

**వసంతసేన :** (భయకంపితస్వరంతో) పల్లవికా. పరభృతికా! మదనికా! మధుకరికా!... అయ్యో! అయ్యో!

**శకారుడు :** బావా! ఎవరో మనుష్యులను పిలుస్తున్నది.

**కుంభీలకుడు :** పరిజనాన్ని బావా!

**శకారుడు :** ఆడవాళ్ళనేనా?

**కుంభీలకుడు :** ఊc.

**శకారుడు :** (ధైర్యంతో) రానీ, వందలకొద్ది రానీ – చూడు, మరి మన ప్రతాపం! (మీసం మీదికి చేయిపోనిచ్చి గొంతు సవరించుకొంటూ అడుగు ముందుకు వేస్తాడు)

**వసంతసేన :** (భయకంపంతో) మధూ! మధుకరికా!!

**శకారుడు :** బావా! బావా!!

**వసంతసేన :** (వెనుకకు నడుస్తుంటుంది)

**శకారుడు :** (ముందుకు నడిచి) (*) నీ వెంటపడి నేను తరుముతుంటే ఆపటానికి కుంతికొడుకైన ఆ శంతనుడికీ, రంభ కొడుకైన ఆ రావణాసురుడికీ ఇద్దరికీ చేతకాదు. మరింకెవ్వరికి శక్యం? నీ పల్లవిక, నీ పరభృతిక, మధు, మధుకరిక నన్నేమి చేస్తారు? (చెయ్యి పట్టుకోబోతాడు).

**వసంతసేన :** (యుక్తిగా) అయ్యా! నేను అబలను.

**కుంభీలకుడు :** అమ్మాయీ! నీకేమీ భయంలేదు.

**శకారుడు :** బావ చెప్పినట్లు, ఆc, నీకేమీ భయంలేదు.

**వసంతసేన :** (గౌరవాన్ని నటిస్తూ) మీరు మహాత్ములు! తెలుసుకోలేక పోయాను. (నగలు తీసి యివ్వబోతుంది)

**కుంభీలకుడు :** (శకారుడివైపు చూస్తూ) మా ప్రభువుగారు నీ అలంకారాలకు ఆశపడేవారు కాదమ్మాయీ!

**శకారుడు :** (సదర్పంగా) మనమే ఇటువంటి అలంకారాలు అనేకమంది అమ్మాయిలకు అడిగించుకోకుండా ఇచ్చామని చెప్పవోయ్!

**వసంతసేన :** అయితే మరి నన్ను నాదారిని–

**శకారుడు :** ఎక్కడికి?

**వసంతసేన :** నా ఇంటికి?

**శకారుడు :** (ఠీవిగా) పిల్లా! నేను దేవపురుష మనుష్యుణ్ణి!

**వసంతసేన :** (అతివినయంగా) దేవపురుష మనుష్యులేమిటి? దేవ దానవ పురుష మనుష్యులు – మహాత్ములు!

**కుంభీలకుడు :** మా అమ్మాయికి మీ గొప్పదనం ఇప్పటికర్థమైంది!

**శకారుడు :** (కుంభీలకుణ్ణి దూరంగా పొమ్మని హస్తసంజ్ఞ చేస్తూ) వసంతసేనా! మీ అన్నమీద ఒట్టు నిన్ను వెన్నాడటంలో నేను ఎంతో అలిసిపోయినాను, సొలసి పోయినాను! దేవీ! కేతకీదళకఠోరవల్లీ! (ముఖం తేలవేస్తూ ప్రేమకుమారం చేస్తాడు).

**వసంతసేన :** ఏమిటా వెకిలిచేష్టలు! ఎవరనుకున్నావో! – నడు అవతలికి – (గద్దిస్తూ) ఊఁ.

**శకారుడు :** (కోపంతో) బావా! ఏమిటి మీ చెల్లెలి బెదిరింపు? నేనేమి వాడొదిలిపెట్టినానా, కాడొదిలిపెట్టినానా? ఎక్కడికి పొమ్మంటుంది? – చూడ బోతే చేయి చేసుకుండేదాకా మాట వినేటట్టు లేదు.

**కుంభీలకుడు :** (వసంతసేన దగ్గరికి వచ్చి) అమ్మాయీ! మా ప్రభువుగారి కంటే నీకు మంచి రసికులు ఎక్కడ దొరుకుతారని.

**వసంతసేన :** అయ్యా! అనురాగానికి యోగ్యత అవసరం.

**శకారుడు :** అఁ– ఆ దరిద్రచారుదత్తుడి కున్నంత యోగ్యత వరపురుషుణ్ణి వాసుదేవుణ్ణి నాకు లేదన్నమాట! బావా! ఇది క్షమింపరాని అవమానం అని చెప్పు.

**కుంభీలకుడు :** (నిష్కర్షగా) అమ్మాయీ ఇది క్షమింపరాని అవమానం!

**వసంతసేన :** రాచబాటలో బలాత్కారం చేయటం భరింపరాని అవమానం.

**శకారుడు :** బావా! ఇక ఇది మనమాట వినదు. (దగ్గరకు పోయి చేయి పట్టుకుంటాడు)

**వసంతసేన :** (విదలించి పెద్దగొంతుకతో) పల్లవికా! పరభృతికా! మధురికా! (దూరంగా రదనిక మైత్రేయుడు బల్యన్నంతో ప్రవేశిస్తారు)

**శకారుడు :** బావా, ఎవరో మనుష్యులు!

**కుంభీలకుడు :** (జారుకుంటాడు)

**శకారుడు :** బావా! బావా!

**వసంతసేన :** (గొంతు పెద్దదిచేసి) పల్లవికా! పరభృతికా!!

**శకారుడు :** (రదనిక మైత్రేయులను చూచి కుంభీలకుడితో పాటు వెళ్ళిపోతాడు).

**మైత్రేయుడు :** బల్యన్నం క్రిందపెట్టి చేయి అడ్డం పెట్టుకొని చూస్తూ) ఎవరక్కడ? రదనికా?

**వసంతసేన :** (ముందుకు వచ్చి వెనక పరిచయమున్నట్లు).

అయ్యా! ఈ ఇల్లు తమదేనా?

**మైత్రేయుడు :** ఎవరు? వసంతసేనా! ఇది చారుదత్తుడి ఇల్లు.

**వసంతసేన :** (స్నేహంగా) ఆలయం నుంచి వస్తూ ఒంటరిగా ఇంటికి వెళ్ళటానికి భయపడుతూ ఉన్నాను. మదనిక వచ్చేటంతవరకు నేను మీ ఇంట్లో – (రదనిక చేతిలో దీపం ఆరిపోతుంది).

**మైత్రేయుడు :** రదనికా! ఇలాతే, ఈమెను ఇంట్లోదించి దీపం వెలిగించుకో వస్తాను. బల్యన్నాన్ని కుక్కలు ముట్టుకోకుండా కాపాడాలి.

**మదనిక :** బాబయ్యా! త్వరగా రావాలి.

**మైత్రేయుడు :** ఇక్కడున్నట్లు వస్తాను – (వసంతసేన నుద్దేశించి) అమ్మాయీ! (దారిచూపిస్తూ వెళ్ళిపోతాడు).

**(శకారుడు కుంభీలకుడు నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ వస్తుంటారు)**

**శకారుడు :** బావా! బావా!

**కుంభీలకుడు :** బయలుదేరు.

**శకారుడు :** ఇంకా అక్కడ ఎవరో మనుష్యులు!

**రదనిక :** (ఛీ, ఛీ – కుక్కను విదలించినట్లు) బాబయ్యా! బాబయ్యా!!

**శకారుడు :** బావా, మనను వంచించటానికి గొంతుమార్చేసింది! (పోయి రదనిక చేయి పట్టుకుంటాడు).

**రదనిక :** మైత్రేయయ్యా! బాబయ్యా!! పరాభవము! పరాభవము!!

**మైత్రేయుడు :** (ఒక చేతితో దీపము రెండో చేతిలో కర్రతో ప్రవేశిస్తూ) ఆఁయ్! ఎవడ్రా అది? (దగ్గరకువచ్చి శకారుణ్ణి చూపిస్తూ) అమ్మాయీ! వీడేనా? – మాట్లాడవేంరా బెల్లంకొట్టినరాయిలా? ఏం చేశావు?

**శకారుడు :** (మాట్లాడడు).

**మైత్రేయుడు :** అమ్మాయీ! ఈ వెధవ ఏం చేశాడు?

**రదనిక :** చేయి పట్టుకొని –

**మైత్రేయుడు :** ఆఁ (దుడ్డుకర్ర పైకెత్తుతాడు)

**కుంభీలకుడు :** (అడ్డం వచ్చి) శాంతించమంటావా? అమ్మాయీ నీవు ఇంట్లోకి వెళ్ళు. ఇదంతా చారుదత్తుడికి తెలియనీయకు.

**రదనిక :** (సరేనన్నట్లు తలపంకించి నిష్క్రమిస్తుంది)

**మైత్రేయుడు :** ఒరేయ్! ఎవర్రా మీరు?

**కుంభీలకుడు :** అయ్యా! ఆప్తజన మనుకొని మా మిత్రుడు భ్రాంతిపడ్డాడు క్షమించండి!

**మైత్రేయుడు :** ఓరి చిత్తకార్తె వెధవల్లారా! సిగ్గుబొగ్గు లేకుండా రాచబాటల్లో పరిహాసాలు ఆడుతున్నారా?

ఇది చారుదత్తుడి గృహవీథి అని మీకు తెలియదూ– కదలరేం? – ఉఁ– 'ఎత్తేఅగ్నే' చెపుతారా లేదా? లేకపోతే 'ఛిదంతాం' చేసి పంపుతాను.

**కుంభీలకుడు :** బాబయ్యా! తక్షణం వెళ్ళిపోతాం.

**మైత్రేయుడు :** ఉఁ!

**శకారుడు :** లొట్టిపిట్ట మోకాలిలా బట్టతలా వీడూ వీణ్ణి క్షమాపణ అడుగుతావేం బావా! ఈ బాపనయ్య ఏమో మహామండిపడుతున్నాడు? మన సంగతి కొంచెంచెప్పు–

**కుంభీలకుడు :** సమస్త సద్గుణాలున్న చారుదత్తుడి మిత్రుడు ఆయన. ఎంతైనా మండిపడవచ్చు. నీవూరుకో!

**శకారుడు :** గుణాలన్నీ మనబొక్కసంలో ఉంటే దరిద్ర చారుదత్తుడికి ఇంకా గుణాలెక్కడివోయ్!

**కుంభీలకుడు :** అధిక ప్రసంగం కట్టిపెట్టి మనం వెళ్ళిపోదాం పద.

**శకారుడు :** వసంతసేనను విడిచిపెట్టే!

**కుంభీలకుడు :** నీకింక వసంతసేన... ఆమె నీది కాదు. ఆమె చారుదత్తుడి ఇంట్లో చేరింది.

**శకారుడు :** బావా! నేను దాని సంగతి తేల్చుకోంది రాను.

**కుంభీలకుడు :** నీ మంచికి చెపుతున్నాను. విను వసంతసేనకు నీమీద ప్రేమలేదు.

**శకారుడు :** నీకెవరు చెప్పారు?

**కుంభీలకుడు :** ఆమె చేసే పనులవల్లే తెలుస్తున్నది – నామాట విని రా పోదాం.

**శకారుడు :** (రానని తల త్రిప్పుతున్నాడు)

**కుంభీలకుడు :** (నిష్క్రమిస్తాడు)

**మైత్రేయుడు :** ఓరిత్వాష్టమా! ఇంకా ఇక్కడనే నిలబడ్డావేం!! వికిరపిండం (కర్ర ఎత్తుతాడు).

**శకారుడు :** (కొన్ని అడుగులు వేసి వెనక్కు తిరిగి) జాగ్రత్త! మా పిల్ల ఒంటినిండా నగలతో మీఇంట్లో ప్రవేశించింది. వ్యవహారం అధికారుల చేతుల్లో పడకముందే మా పిల్లను మాకు తెచ్చి ఒప్పచెప్పమను చారుదత్తుణ్ణి. లేకపోతే (కత్తి చూపిస్తూ) జాగ్రత్త!

**(బెదిరిస్తూ నిష్క్రమిస్తాడు).**

**మైత్రేయుడు :** ఏడ్చావులేవోయ్ యంబ్రహ్మ!.

## మూడో దృశ్యం

(చారుదత్తుని గృహము – ఏకాంతంగా వసంతసేన)

**నీకు నీవే సాటి.**
**నాకు నేనే సాటి.**
**ఓ మనోహరతేజ!**
**ఓ మధువ్రతరాజ!!** ॥ నీకు నీవే... ॥

**పాలింపగా రమ్ము**
**ప్రణయసుమ మిది రాజ!**
**ఈతావి నీకొరకె.**
**ఈతనువు నీ కొరకె.** ॥ నీకు నీవే... ॥

**చారుదత్తుడు :** (సాలోచనగా వసంతసేన వెనుకనుంచి ప్రవేశించి ఉత్తరీయం అందిస్తూ) రదనికా! చిట్టితండ్రి ఆరుబైట నిద్రపోతున్నాడు. – పాపం! చలి వేస్తుంటుంది. ఇది తీసుకోపోయి కప్పిరాపో.

**వసంతసేన :** (అందుకుంటూ తావి మూర్కొంటుంది)

**చారుదత్తుడు :** అమ్మాయీ! పోనీ రోహసేనుణ్ణి లోపలికి తీసుకోపోయి మండువాలో నిద్రపుచ్చు – రదనికా!

**మైత్రేయుడు :** (రదనికతో ప్రవేశించి) ఉహు హూ! చారుదత్తా! ఆమె ఎవరనుకున్నావో! మన రదనిక కాదు వసంతసేన! ఇదిగో రదనిక – అమ్మాయీ! రోహసేనుణ్ణి మండువాలో నిద్రపుచ్చు–

**రదనిక :** (వసంతసేన ఇస్తూ ఉన్న ఉత్తరీయం అందుకుంటూ నిష్క్రమిస్తుంది)

**చారుదత్తుడు:** వసంతసేనా! రదనికని భ్రాంతిపడి నిన్ను ఆజ్ఞాపించాను ఉత్తరీయ మందించి నీ శరీరాన్ని దూషితం చేశాను.

**వసంతసేన :** మహాభాగా! జాజితావులు కుమ్మరించే మీ ఉత్తరీయం వల్ల నా శరీరం భూషితమే అయింది.

**చారుదత్తుడు :** అమ్మాయీ! నీ సరసహృదయం...

**మైత్రేయుడు :** రాజశ్యాలకుడు ప్రదోష సమయంలో ఆలయం నుంచి వస్తున్న ఈమెను బలాత్కరిస్తుంటే భయపడి మన ఇంటికి వచ్చింది.

**చారుదత్తుడు :** ఈ దరిద్రచారుదత్తుడు భంగ్యంతరంగా భాగ్యవంతుడైనా దన్నమాట!.... వసంతసేనా! పరిచారికను నియోగించవలసిన పని చెప్పి పూజ్యురాలవైన నిన్ను పరాభవించాను. క్షమించాలి.

**వసంతసేన :** అనుచితమైన సమయంలో ఆర్యులకు శ్రమ కల్పించి నందుకు మీరే నన్ను క్షమించాలి.

**మైత్రేయుడు :** బాగుంది వంగిన వరిచేలలా మీరు ఒకరికొకరు నమస్కరించుకోవటం.

**చారుదత్తుడు :** (పరిహాసం వద్దన్నట్లు) మైత్రేయా!

**వసంతసేన :** (నగలు ఒక పాత్రికలో ఉంచుతూ) ఆర్యా! దయ ఉంచి దీనిని మీ ఇంట్లో దాచి ఉంచండి. వీటికోసం ఎవరైనా పాపాత్ములు వెంట పడవచ్చును.

**చారుదత్తుడు :** (గ్రహించమన్నట్లుగా) మైత్రేయా! (ఛలోక్తిగా) నగలను దాచటానికి ఈ పేదవాడి ఇల్లు –

**వసంతసేన :** దానికి నమ్మకం ప్రధానంగాని, ఇంటి గట్టి కాదుగా!

**చారుదత్తుడు :** మైత్రేయా! ఈ పాత్రను జాగ్రత్తచేసి పగలు వర్ధమానుడూ రాత్రిళ్ళు నీవూ కాపాడుతూ ఉండాలి.

**మైత్రేయుడు :** అయితే దాచిపెట్టను ఇచ్చిన ఈ నగలను మనం –

**చారుదత్తుడు :** తిరిగీ అడిగినప్పుడు ఇచ్చివేయాలి.

**వసంతసేన :** మరి నాకు సెలవా? తల్లిగారు నాకోసం దిగులు పడు తుంటారు. మదనిక వెళ్ళి చాలాసేపైంది.

**చారుదత్తుడు :** మైత్రేయా! అమ్మాయిని వీథిమూల తిరుగుడు దాకా తీసుకోపోయి దిగవిడిచి వస్తావా?

**మైత్రేయుడు :** నేనా! (కొద్ది గొంతుకతో) ఛాందస చక్రవర్తిని! (చిన్న నవ్వుతో) మీరిద్దరూ రాచబాటలో నడుస్తుంటే మానససరోవరంలో విహారం చేసే హంసీహంసల్లా ఉంటారు. దీపం తీసుకోరానా?

**చారుదత్తుడు :** (వసంతసేనవైపు చూచి నవ్వుతాడు. ఆమె కూడా అభిప్రాయాన్ని గ్రహించినట్లు నవ్వుతుంది).

**మైత్రేయుడు :** దీపం ముట్టించి ఉన్నదో లేదో! – (లేవబోతాడు)

**చారుదత్తుడు :** మైత్రేయా! దీపంతో ప్రయోజనం లేదు.

(*) ప్రియమైన కాంతులతో ఆకాశానికి వెల్లవేసి కుముదినీ ప్రణయినుల వంతలు తీర్చటానికి చంద్రభగవానుడు వచ్చాడు. ఈ వెన్నెలలో నగరవీథుల్లో భయమేమాత్రమూ ఉండదు. నీవు దీపంకోసం శ్రమపడ నవసరం లేదు. పూజ్యురాలా! వసంతసేనా! (దారి చూపిస్తుంటే వసంతసేన ముందుకు నడుస్తుంది. చారుదత్తుడు వెనుక అనుసరిస్తాడు)

**మైత్రేయుడు :** (చతురోక్తిగా) వసంతసేన వెంట నన్ను నడవమంటా డేమిటి? నేనెందుకు, “దంపత్యో ర్మధ్య ఏవచ” – చిలుకా గోరువంకల్లా ఎంత బాగున్నారు – వసంతసేన కొంత డబ్బు పెట్టుబడి పెడితే చారుదత్తుడు మళ్లా వ్యాపారం సాగిస్తే మైత్రేయుడు.......

## నాలుగో దృశ్యం

(ఒకవైపునుంచి రదనిక బుట్టతోటీ – మైత్రేయుడు మజ్జిగ తప్పేలతోటీ ప్రవేశిస్తారు)

**మైత్రేయుడు :** (గుర్తుపట్టుతున్నట్టు నటిస్తూ) అమ్మాయీ!

**రదనిక :** బియ్యం నిండుకుంటే అక్కగారికి తెలియకుండా అప్పుకని బయలుదేరాను.

**మైత్రేయుడు :** ఇంట్లో తండులాలు నసంతేనా?

**రదనిక :** (ఆకాశంవైపు చూస్తూ) చాలా ఎండబడ్డది (నిట్టూరుస్తుంది).

**మైత్రేయుడు :** (ఆలోచనా పూర్వకంగా) నేను మొన్న షోడశమహాదానాలల్లో తెచ్చినవీ, నాకు మహన్యాసాలకు వచ్చినవీ మంత్ర పుష్పపు డబ్బులు పెట్టి కొన్నవీ – అన్నీ అప్పుడే అయిపోయినై – ఇంతవరకూ పొయ్యిలో పిల్లి లేవలేదన్నమాట!

**రదనిక :** ఈ పూటకు అయ్యా కానట్లుగా ఉంటే అక్కయ్య గారు మడికట్టుకున్నారు బాబయ్యా!

**మైత్రేయుడు :** (దీనభావాన్ని ప్రకటిస్తూ) ప్ఛ్ – పాపం! పదిమంది వంటవాళ్ళను పెట్టుకొని వండించి పంక్తికి వడ్డించే మా అక్కయ్యగారికి చివరకు చేతులుకాల్చుకోటం తప్పించాడు కాడు బ్రహ్మ. వాడి ముండమొయ్య. అయితే పచ్చి బంగారం తినవలసిన పండులాంటి సంసారానికి ఇంతటి పరమ దౌర్భాగ్య స్థితి రావలసిన అగత్యమే ముందట? చెపితే విన్నాడా? బ్రాహ్మడి కేం వ్యాపారం? మొదట్లో లాభాలు వచ్చినట్లే కనిపించి కొత్తనీరుతో పాతనీరు కొట్టుకోపోయింది. ఒళ్లు తెలియకుండా సమారాధనలకనీ, సంతర్పణలకనీ, సప్తాహాలకనీ, సహస్రాలకనీ ఒకటే దానాలైపోతే కుబేరుడు కూడా కొల్లబోక ఏమౌతాడు?

**రదనిక :** బాబయ్యా! మహాత్ముడు, ఆయనననని ఏం ప్రయోజనం? తిని కుడిచే భాగ్యానికి మనం నోచుకోకపోతే – అడిగినవాళ్ళకల్లా లేదనకుండా పెట్టిన ఆయనకు పెట్టవలసి వచ్చేటప్పటికి లోకం విశ్వాసం మాలినదై పోయింది. కాలికి బలపం కట్టుకొని ఇల్లిల్లు

తిరిగినా సాయంత్రానికి తవ్వెడు గింజలు అప్పు పుట్టటం లేదు. నాకేమిటో బెంగగా ఉంది. అక్కయ్యగారు తలెత్తి మాట్లాడుతుంటే చూడలేకుండా ఉన్నాను.

**మైత్రేయుడు :** అమ్మాయీ! మనకేం భయంలేదు. నాతంటాలు నేను పడి పట్టించుకో వస్తానుగా! నీవు ఎవరెవరి ఇళ్లకు పోయివస్తున్నావో చెప్పు.

**రదనిక :** పిరాట్లవారింటికీ,

**మైత్రేయుడు :** లేవన్నారా?

**రదనిక :** ఇంట్లో పిల్లలెవరూ లేరట, ఆమె మడి కట్టుకున్నదట!

**మైత్రేయుడు :** కూర్చొని నెత్తిన గుడి కట్టుకోకపోయిందీ?

**రదనిక :** పురుషోత్తంవారింటికి పోతే పురుడొచ్చింది అప్పుసొప్పులు లేవన్నారు. గోరంట్లవారింటికి పోతే ఈ పూటకు సోలెడైతే పెట్టానన్నది కామమ్మ.

**మైత్రేయుడు :** (ఆశ్చర్యంగా) ఆఁ ఆఁ (నోటిమీద చెయ్యి వేసుకొని ) నిన్న అచ్చాశాస్త్రుల్లు గాడిదమోత బియ్యం మూట నెత్తిన వేసుకొని ఇంటికి వస్తుంటే నేను కళ్లారా చూచాను. చారుదత్తుడి ఇంట్లో ఎవరి బాబు సొమ్మున్నదని వెనక ఏళ్ళ తరబడి మేశారో! తవ్వెడు గింజలు అప్పివ్వటానికి దడిచారూ! ఓరి వీళ్లతాడు తంగెళ్ళలో తెగ!

**రదనిక :** బాబయ్యా! తిట్టు తిమ్మె తగులుతుంది. ఏం ప్రయోజనం? భగవంతుడు వాళ్ళనోట అలా పలికిస్తున్నాడు.

**మైత్రేయుడు :** (దైన్యంతో) అమ్మాయీ! చారుదత్తుణ్ణి, అతని ఆప్తులమైన మననూ పరమాత్మ పరీక్షిస్తున్నాడు. కానీ కలకాలం కాని దినాలుండవు. ఆనాడు వీళ్ళంతా మన ఇంటికి అప్పుకు రారా? ఎవళ్ళసొమ్మో ఇక్కడ పాతిపెట్టలేదని మొఘాన పట్టుకొని ఎత్తిపొడవనా! ఏదీ (బుట్టను ఉద్దేశించి) ఇలాతే. ఎలా పుట్టవో, ఎందుకు పుట్టవో, ఎన్నాళ్ళు పుట్టవో చూస్తాను. ఇది ఇంటికి పట్టుకోపో. (మజ్జిగ తప్పేలా అందిస్తాడు)

**రదనిక :** (అందుకొని పరీక్షిస్తూ) ఇవేనా ఊళ్ళో దొరికిన మజ్జిగన్నీ?

**మైత్రేయుడు :** ఇవేనా? ఇంకానయం ఇవన్నా దొరికినై. ఇందుకు సంతోషించు. నా మొఘం చూచేటప్పటికి గేదె తన్నిందనీ, ఎండిపోయినదనీ, పాలు కాటుకపోయినవనీ, పిల్లి తాగిపోయిందనీ, పొంగుపోయినవనీ – వెనక 'చంద్రికాధౌతం దధి' అయితే గాని నాకు ముద్ద దిగేది కాదు గొంతు. ఇప్పుడో మంచినీళ్ళలో ఉప్పు వేసుకొని

పోసుకుంటాను. అదీ పుట్టదనుకో, ఉప్పునీళ్ళే పోసుకుంటాను. సరే, నీవు పద. నేను ఇక్కడున్నట్లుగా వస్తాను.

**రదనిక :** బాగా ఎండపడ్డది. ఇప్పుడెందుకు వృథా ప్రయాస.

**మైత్రేయుడు :** దొరకవూ? ఎందుకు దొరకవూ? ఏ కొంపకైనా కన్నంవేసి తీసుకోవస్తాను గాని వట్టిచేతులతో చారుదత్తుడి గుమ్మం తొక్కుతానా! అక్కయ్యగారడిగితే ఇప్పుడే వస్తున్నాని చెప్పు – ఉఁ

**రదనిక :** (నిష్క్రమిస్తుంది)

**మైత్రేయుడు :** (క్రింది వేదపన్నం చెప్పుకుంటూ)

**"భృగుర్వై వారుణిః వరుణం పితర ముపససార, అధీహి భగవో బ్రహ్మేతి, తస్మా ఏతత్ ప్రోవాచ, అన్నం ప్రాణం, శ్రోత్రం మనో వాచా మితి"**

**(నిష్క్రమిస్తాడు)**

# అయిదో దృశ్యం

(నిద్రాసమయం – చారుదత్తుని ఇల్లు – అతడు వీణ వాయించుకుంటుంటాడు. ఆ తరవాత చిరిచాపమీద మైత్రేయుడు, మంచంమీద చారుదత్తుడు నిద్రకాయత్త పడుతారు)

**చారుదత్తుడు :** అనేక వాద్యాలు విన్నాం గాని, మైత్రేయా! వీణ మాత్రం సాగరంలో పుట్టని జాతిరత్నమోయ్!... ఓహో! రేభిలుడు ఎంత చక్కగా వీణ వాయించాడు.

**మైత్రేయుడు :** (చాపమీద కాళ్ళు చాచుకొని మోకాళ్ళవరకూ ముసుగుపెట్టి కూర్చొని) చాలు, చాల్లే. మొగవాడికి సంగీతం ఆడదానికి సంస్కృతమూ! ఆడది సంస్కృతం చదువుతుంటే ముక్కుకు తాడుబోసిన ఆబెయ్య అరిచినట్లు బ్యా, బ్యా, అంభా అన్నట్లు వినిపిస్తుంది. మొగవాడు సంగీతం పాడుతుంటే శుద్ధ శ్రోత్రియుడు బోసినోటితో 'సహనా వవతు, సహనౌ భునక్తు' అన్నట్లు వినిపిస్తుంది.

**చారుదత్తుడు :** (నవ్వుతూ) మైత్రేయా! జాగ్రత్త. నీవు అనవసరంగా ఆడవాళ్ళ జోలికిపోబోకు. వెనుకటి దినాలు కావు సుమా!

**మైత్రేయుడు :** అయితే నాకేం భయం ఆంజనేయులవారి వంటి అనాది బ్రహ్మచారిని.

**చారుదత్తుడు :** మైత్రేయా! నీవు తప్ప నిన్నటిసభలో రేభిలుడి పాట మెచ్చుకోనివాళ్లు ఎవరూ ఉండరు.

**మైత్రేయుడు :** నాకేం లోపం కాదులే, వజ్రశుంఠ వాడి ముష్టిపాట మెచ్చుకోకపోతే! (చాపమీద వెన్ను వాల్చి ముసుగు పెట్టబోతూ) తన్నులు తిన్న గాడిదలా చాపమీద ఎంతసేపు పొర్లాడినా నిద్రపట్టేది కాదు. ఈ దినం ఎందుకో ముంచుకోవస్తున్నది. (ఆవలిస్తూ చిటికలు వేస్తూ!) ఇదిగో! మరిచిపోయినా, దాని నగల పాత్ర! వర్ధమానకుడి కిచ్చి జాగ్రత్త చేయించు. ఇవాళ నాకు ఒళ్లు తెలియని నిద్ర వచ్చేస్తున్నది.

**చారుదత్తుడు :** మైత్రేయా! దానిని రాత్రిళ్ళు భద్రపరచవలసింది నీవే.

**మైత్రేయుడు :** ప్రతిరాత్రీ ఇది పక్కలో ఉంటుంటే నాబోటి ఘోటక బ్రహ్మాచారికే వేశ్యలకు సంబంధించిన విచిత్రపుపీడ కలలు వస్తున్నవోయ్! ఏ తొత్తుకొడుకైనా దీన్ని దొంగిలిస్తే ఎంత బాగుంటుంది! ఇంత ఉజ్జయినీ పట్టణంలో అంత మొగవాడే లేకపోయినాడా! – ఈ దిక్కు మాలింది నా నిద్ర పాడుచేస్తున్నది. అయినా తప్పదు. "శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం!" (అసంతృప్తితో గునుస్తూ ముసుగు పెట్టుకొంటాడు)

**చారుదత్తుడు :** ఆహా! రేభిలుడు ఎంత చక్కగా రాగాలాపన చేశాడు. ఎంత స్ఫుటంగా, లలితంగా, మనోహరంగా, భావాన్వితంగా ఉంది అతని పాట యువనిక చాటున ఉండి పాడినట్లయితే నిజంగా నేనే ఎవరో యువతి పాడుతున్నదని భ్రాంతి పడేవాణ్ణి. మనోహరమైన గాత్రం! గొంతులో ఎంత చక్కని జీర!!

**మైత్రేయుడు :** జీరకాదు, బూర! బీరపాదుదగ్గిర ఎవడ్రా ఆ వాజమ్మ!

**చారుదత్తుడు :** మైత్రేయా! నీకింకా నిద్రపట్టలేదా?

**మైత్రేయుడు :** (మొగంమీద ముసుగు తొలిగించి) ఆఁ కలవరిస్తున్నానా? ఏనుగులను కట్టించి లాగినా ఈతడవ కంటిరెప్పలు విడిపడవు. (గుర్... గుర్... గుర్...)

**చారుదత్తుడు :** (నిశ్చలకంఠంతో) ఈశుష్కమైన జగత్తులో రేభిలుడి గానమాధుర్యానికి (వసంతసేన చిత్రపటం చూస్తూ) పోల్పదగ్గ వస్తువేమున్నది, ఒక్క మా వసంతసేన సౌందర్యం తప్ప? రేభిలా!

(*) మనసుకైనా అందుకోలేని సుకుమార విపంచీ కలస్వనాన్ని పంచ భూతాలుగా గ్రహించి మా కళ్ళకు కట్టేటట్లు ఒక మనోహరస్వర్గాన్ని సృజించావు. అపురూపమైన నీ అమృతశక్తికి ఇవే మా ప్రమాణాలు.

మైత్రేయా! (వాతాయనంవైపు నడిచి) కుముదినీ ప్రియల కుపితారుణ నేత్రరక్తిమలకు వెరచి చంద్ర భగవానుడు ఆకాశసౌధం మీదికి దిగివస్తున్నాడు. ప్రియా వసంతసేనా! నా జీవితాకాశంమీద నిలిచి లాస్యం చేసి నీవు చిరు వెన్నెలలు కురిసే దెప్పుడో కదా! (మందయానంతో నిమీలితనేత్రాలతో నిద్రను సూచిస్తూ పర్యంకాన్ని చేరుకొని దీపం తగ్గించి మంచం మీద మేనువాలుస్తాడు)

**మైత్రేయుడు :** (గట్టిగా గుర్రు పెడుతుంటాడు)

**శర్విలకుడు :** (మందగమనంతో ప్రవేశించి దీపం పెద్దది చేసి) కార్తికేయా! కనకశక్తీ!! (రెండడుగులు ముందుకు వచ్చి) మంచి నిద్రలో ఉన్నారు. (మద్దెలమీద చిన్న దెబ్బకొట్టి) నాట్యాచార్యుడి ఇల్లా ఇది! (వీణ పిల్లనగ్రోవి సవరిస్తాడు) ఇంటి గొప్ప చూచి ఎంత మోసపోయినాను. ధనమేమైనా భూస్థాపితం చేసి ఉంటాడా? (తోలుతిత్తిలో ఉన్న నీళ్లు చల్లి నల్లటిగింజలు ఎగురవేస్తూ) పిల్లల్లారా! గంతులు వేస్తూ ధనం ఎక్కడ దాచాడో వచ్చి చెప్పండి. (నిరాశతో) చేతులకు తడి కావటం తప్ప (లాభంలేదని మూకాభినయం చేసి)

**మైత్రేయుడు :** చారుదత్తా! ఎవడో దొంగ!

**శర్విలకుడు :** (వెనుకడుగు వేసి) ఆఁ.

**మైత్రేయుడు :** కన్నం త్రవ్వుతున్నాడు. నగలపాత్ర నీవు పుచ్చుకో (గుర్... గుర్... గుర్...)

**శర్విలకుడు :** నగలపాత్ర! పరమ దరిద్రులయింట ఏమి బాముకుందా మని వచ్చాడో వీడు అని నన్ను పరిహసిస్తున్నాడా? (దగ్గిరకుపోయి) లేదు, కేవలం పలవరింత!

**మైత్రేయుడు :** (పాత్రిక అందిస్తూ) గంగ ఒడ్డున కపిలగోవును చంపినంత పుచ్చుకోకపోతే. పుచ్చుకో!

**శర్విలకుడు :** (అందుకోబోయి) అయ్యో! నా బ్రాహ్మణ కులానికి ఎంత తీరని కళంకం!

**మైత్రేయుడు :** మిత్రమా! ఇంకా అందుకోవేం? కామదేవుని గోపురకలశాన్ని తన్నినంత ఒట్టు – (అందిస్తాడు).

**శర్విలకుడు :** (అందుకుంటాడు).

**మైత్రేయుడు :** మిత్రమా! నీ చేతులింత చల్లగా ఉన్నవేం?

**శర్విలకుడు :** ఆఁ– ఒట్టు పెట్టావని పుచ్చుకున్నాను.

**మైత్రేయుడు :** ఇక గుండెమీద చేయి వేసుకొని శుభ్రంగా నిద్రపోతాను.

**శర్విలకుడు :** నూరేండ్లు! – (ముందుకు వచ్చి చురకత్తిలాగి జాగరూకతతో నిష్క్రమిస్తాడు. ఒక కొద్దికాలం నిశ్శబ్దం).

**రదనిక :** (ఉద్వేగంతో ప్రవేశించి) అమ్మయ్యో! దొంగ! దొంగ!! – బాబయ్యా కన్నం వేసి పారిపోతున్నాడు!

**మైత్రేయుడు :** (అస్తావిస్తంగా లేచి) ఆఁ – దొంగను తవ్వి కన్నం పారిపోతున్నదా? పట్టుకో, పట్టుకో! అయితే కన్నం మొన్న మనం పులుసు కాచుకున్న గుమ్మడికాయంత ఉందా!

**రదనిక :** బాబయ్యా! కొంప గుణ్ణం వేసుకోపోతుంటే ఏమిటా పరిహాసం! అదుగో!

**మైత్రేయుడు :** (గుమ్మంవైపు చూస్తూ) చారుదత్తా! దొంగ! దొంగ!!

**రదనిక :** అమ్మా! అమ్మా!! (నిష్క్రమిస్తుంది).

**చారుదత్తుడు :** (నెమ్మదిగా లేస్తూ) ఏమిటీ హడావుడి, మైత్రేయా?

**మైత్రేయుడు :** ఏమిటేమిటి? – అటు చూడు. దొంగ కన్నం తవ్వాడు (నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొని) అవ్వ! వీడి ముండమొయ్యా! వీడి ముండమొయ్యా!! ఎంత కన్నం తవ్వాడు! ఎంత కన్నం తవ్వాడు!! తన కొంపకు తవ్వుకోలేకపోయినాడు.

**చారుదత్తుడు :** (కన్నంవైపు చూచి తాపీగా) మైత్రేయా! దొంగ ఎవరో కాని మంచి నేర్పరి!

**మైత్రేయుడు :** నేర్పరా! వాడిపాడా! ఎవడో కొత్త క్షేప! మన ఇంటికి కన్నం వేసి వాడేమి బాముకుందామని.

**చారుదత్తుడు :** నేర్పరి కాడనటానికి వీలులేదు. చోరకర్మకు శాస్త్ర కర్తలు కనకశక్తీ, కార్తికేయులూ చెప్పినలక్షణాలన్నీ తెలుసుకొని తవ్వాడీ కన్నం!

**మైత్రేయుడు :** బాగుంది, మన చదువు సంధ్యలు ఇందుకైనా ఉపయోగించినవి – అయితే చోరకర్మకూ ఒక శాస్త్రముందా? – మన ఋషులు దానికీ ఒక శాస్త్రమేడిచారూ? క్షురకర్మకూ ఒక శాస్త్రము ఏడవలేకపోయినారూ, గాలి మేసి గడ్డాలు పెంచుకొని పనిలేకపోతే సరి.

**చారుదత్తుడు :** (మందస్మితంతో) ఆ పనికి నీవు బ్రహ్మర్షి వైన తరువాత పూనుకో.

**మైత్రేయుడు :** (ఉద్రేకంతో) మొదట వాళ్ళ గడ్డాలు చెక్కించి మడ్డి వదిలిస్తాను.

**చారుదత్తుడు :** (కన్నంవైపు చూస్తూ) దొంగ పాపం! ఎవరో పొరుగూరివాడై ఉంటాడు. ఉన్నవాళ్ళమని ఉర్రట్లూగుతూ వచ్చి ఉన్న సత్తువంతా గోడలు త్రవ్వటానికి పెట్టి ఉత్తచేతులతో ఉదయం ఇంటికి చేరుకుంటాడు గామాలి. తెల్లవారిన తరువాత

స్నేహితులు రాత్రి ఏమి దొరికిందిరా అని ప్రశ్నిస్తే ఆ దీనుడు అయ్యో, ఎంత బాధపడుతాడో!

**మైత్రేయుడు :** (వెగటుగా) అయ్యో పాపం! వాడి బాధ ఎలా ఉన్నా నీ బాధ చూస్తే నాకు మహాబాధ వేస్తున్నది. ఇల్లు చూడబోతే ఎంతో పెద్దదిగా ఉన్నది, అధమం ఏ కనక భాండమో దొరకక పోతుందా అని మన యింటికి కన్నం వేశాడు ఆ దొంగ పీనుగ! ఇంకా పాపం తలుస్తావేం? దొరికితే పాతేయించి పుఠం వేయించనూ?

**చారుదత్తుడు :** ఓరి తెలివితక్కువవాడా?

**మైత్రేయుడు :** ఎప్పుడూ ఆ మాట అంటావనే ఇందాక నగలపాత్ర నీకిచ్చి చాలా తెలివిగలవాడినైనాను. లేకపోతేనా, నీవా దొంగ వెధవను గురించి ఇంత చింతా పడకుండానే 'గుటకాయస్వాహా' చేసేవాడే.

**చారుదత్తుడు :** మైత్రేయా! నీవేమంటున్నావో నా కర్థం కావటం లేదు. వేళాకోళం చాలించు.

**మైత్రేయుడు :** నీవన్నట్లు నేను ఎంత తెలివితక్కువ వాడినైనా, మీరంతా ఎంత మహామహావిద్వాంసులైనా వేళాకోళానికి సమయం ఎరగని సన్యాసిని మాత్రం కాను.

**చారుదత్తుడు :** అయితే నగలపాత్ర ఇందాక నా చేతికి ఇచ్చావన్నమాట!

**మైత్రేయుడు :** ఔను. ఆ సందేహం ఎందుకు రావలసి వచ్చింది?

**చారుదత్తుడు :** ఎప్పుడు ఇచ్చావు?

**మైత్రేయుడు :** నీ చేతులు చల్లగా ఉన్నవే మంటినే, అప్పుడు.

**చారుదత్తుడు :** (యోజించి) అయితే నేను నీకొక మంచి మాట చెప్పనా?

**మైత్రేయుడు :** వాడది కాజేసుకోపోయినాడని కాదుగదా?

**చారుదత్తుడు :** కాదు, కాదు. వాడు చేసిన శాస్త్ర పరిశ్రమకు తగ్గ ప్రతిఫలం దొరికిందని కృతార్థుడైనాడని.

**మైత్రేయుడు :** వాడు కృతార్థుడౌటం ఎట్లా ఉన్నా నేను మాత్రం ప్రస్తుతం హతాత్ముడ నౌతున్నాను.

**చారుదత్తుడు :** ఎందుకని?

**మైత్రేయుడు :** ఆ నగలపాత్ర మనది కాదని, చారుదత్తుడే తాతతండ్రులు లంకెబిందెలు వేసిన పాతరలు త్రవ్వి అంత ధనం వసంతసేనకు అచ్చి యిస్తాడని. వ్యాపారంలో మొన్నటి దెబ్బతో మనకు మిగిలింది 'అశ్మాచమే మృత్తి కాచమే' కదా!

**చారుదత్తుడు :** విధీ! నన్ను ఎంతకు తీసుకోవచ్చావు? సృష్టిలో లేని నూతన దారిద్ర్యాన్ని సృజించి నామీద ప్రయోగించావు. తన నీడను తానే నమ్మలేని వారవనితల వంశంలో పుట్టిన వ్యక్తికి నామీద నమ్మకం కలిగించావు. ఆమె హృదయంలో ప్రఖ్యాతదరిద్రుడనైన నామీద అనురాగబీజాలు విత్తి మొలకలెత్తిస్తున్నావు. ఈనాటి గాథతో నన్ను జీవచ్ఛవాన్ని చేయటానికి స్థిర సంకల్పుడవైనావా?

**మైత్రేయుడు :** చారుదత్తా! ఎందుకు నీకీ లేనిపోని పిరికితనం. నేను ఒక మంచి ఎత్తు ఎత్తుతాను. వసంతసేన వస్తే నువ్వు మెదలకుండా కడుపులో చల్ల కదలకుండా కూర్చో! – ఆమె నగలపాత్రను గురించి ప్రశ్నిస్తూ, ఆపైన ఒక నాటకమాడతాను. చూడుమరి నా సత్తా.

**చారుదత్తుడు :** ఏమిటా నాటకం?

**మైత్రేయుడు :** ఏముంది – అడగంగానే ఇచ్చినవాళ్ళెవరు? పుచ్చుకున్న వాళ్ళెవరు? చూచిందెవరు? అని గుక్క తిప్పుకోకుండా ఘనా, జటా చెప్పి గల్లంతు చేసి పంపించేస్తాను.

**చారుదత్తుడు :** అనుభవిస్తున్నది చాలక అబద్ధం కూడా ఆడమన్నావా?

**మైత్రేయుడు :** నీవు అబద్ధమాడినట్లెలా ఔతుంది? మాట్లాడకుండా బెట్టుగా కవిరాజులా కలం పట్టుకొని ఆకాశంలోకి చూస్తూ ఆలోచించుకుంటూ కూర్చో.

**చారుదత్తుడు :** మైత్రేయా! మౌనం అర్ధాంగీకారం. అబద్ధం ఆడలేను. నగలకు తగ్గ విలువైనా వసంతసేనకు ఇచ్చివేయవలసిందే –

**మైత్రేయుడు :** ఎక్కడినుంచి తెచ్చి?

**చారుదత్తుడు :** (స్థిరకంఠంతో) క్షేత్రాలు చేసి, పది పట్టణాలు ముష్టెత్తి.

**మైత్రేయుడు :** 'అగ్నేయంతి ద్రవిణం భిక్షమాణాః' అని శ్రుతి. దాని కలవాటు పడితే దారిద్ర్య మెక్కడుంది? బ్రాహ్మణజాతికి వేదాలు విధించిన జీవనమే అది. దాన్ని సక్రమంగా సాగించుకున్నన్నాళ్ళూ ఎంతెంత మహారాజులూ వచ్చి మన పాదాలమీద పడి సాష్టాంగదండ ప్రణామాలు చేశారు. ఇప్పుడో కాలమే మారిపోయింది.

**చారుదత్తుడు :** నేను ఋణవిముక్తుణ్ణి కావటానికి భిక్షాటనం తప్ప వేరేమార్గం లేదంటావా?

**మైత్రేయుడు :** మహాబ్రాహ్మణుణ్ణి ఉపనయనం నాటిమాట కంటే ఇంకో మంచిమార్గం ఉన్నదంటానా? – పద, బయలుదేరు. ఏ దేవతాప్రతిష్ఠ పేరో పెట్టుకొని పెద్దవాళ్ళ లోగిళ్ళన్నీ నువ్వు చూడు. ఎఱ్రని రాగి చెంబు నున్నగా తోమి ఎక్కిన గడప ఎక్కకుండా ఏడాదిపాటు యాయవారం నేను చేస్తాను. దాని నగలెంత చేసు అదెంత చేసు. ముష్టికి నష్టి లేదన్నారు పెద్దలు – దేవుడు మేలు చేస్తే మళ్ళీ వెనుకటి వ్యాపారం సాగించముటోయ్.

**చారుదత్తుడు :** విధీ! విధీ!!

(*) ఎందుకీ బ్రాహ్మణవంశంలో జన్మించమని విధించావో! ఎందుకు ధనమిచ్చావో!! ఎందుకు వర్తకుని చేశావో!! తుదకు దరిద్రుణ్ణి చేసి బిక్షాటన చేయమని ఎందుకు కల్పించబోతున్నావో!!

**రదనిక :** (హారముతో ప్రవేశిస్తూ) బాబయ్యా! అక్కయ్యగారు మీకిది ఇచ్చి రమ్మన్నారు. (చెవిలో ఏదో చెపుతుంది)

**మైత్రేయుడు :** (చారుదత్తునితో) మొన్న రత్నషష్టివ్రతోద్యాపన చేయించానులే. దక్షిణగామాలి. (చారుదత్తుని దగ్గరకుపోయి) – నేను నిన్న ఒక సంగతి జరిగితే ఒక బ్రాహ్మడికి కొంత చేతులలో పెడదామనుకున్నాను. ఇది వచ్చింది వచ్చినట్లు నీవు పుచ్చుకో –

**చారుదత్తుడు :** ఆ రహస్యమేమిటో ఈ దానమేమిటో!

**మైత్రేయుడు :** (బలవంతం చేస్తూ) ముందు ఇది పుచ్చుకో!

**చారుదత్తుడు :** (పుచ్చుకుంటూ) ఏమిటిది మైత్రేయా!

**మైత్రేయుడు :** ధూతాదేవివంటి మహాసాధ్విని పెళ్ళాడినందుకు ఫలం! మీ కష్ట సమయంలో ఇవ్వవలసిందని అక్కగారికి వదినెగారు వారి మరణ సమయంలో దీన్ని ఇచ్చినారట! ఆ కన్నం పూడ్పించను కాస్తా కూస్తా అవుతుందా.

**చారుదత్తుడు :** చిట్టచివరకు నాకు స్త్రీ ధనం దిక్కుకావలసి వచ్చిందా! కానీ దురదృష్టంవల్ల నేను దరిద్రుణ్ణే అయినాను – కష్టసుఖాలల్లో పాలు పంచుకునే నా ఆత్మబంధువులు మిత్రులున్నప్పుడు నేను దరిద్రుణ్ణే కాను. (కొంచెమాలోచించి) మైత్రేయా! వసంతసేన

యింటికి ఉదయమే పోయి నేను మిత్రులతో జూదమాడి నగలు ఒడ్డి ఓడిపోయినాననీ దానికి ప్రతిగా ఈ రత్నావళిని స్వీకరించమని కోరుతున్నానని చెప్పి ఇచ్చిరాపో!

**మైత్రేయుడు :** అయ్యో! నీకేమైనా మతిపోయిందా, పిచ్చెక్కిందా? తిన్నామా? కుడిచామా? నగలపాత్ర దొంగ లెత్తుకోపోయినారు. దానికోసం వెలలేని రత్నహారం ఇచ్చుకుంటామా?

**చారుదత్తుడు :** నగలపాత్రకు ప్రతిగా రత్నహారం మనమివ్వటం లేదు. వసంతసేన నామీదుంచిన విశ్వాసానికి బహూకృతి ఇది.

**మైత్రేయుడు :** బాగుంది – వెర్రి తీరింది. రోకలి తల చుట్టమన్నాట్ట నీబోటివాడు.

**చారుదత్తుడు :** (దీనంగా) మైత్రేయా! ఎలాగైనా సరే ఆమె అంగీకరించేటట్లు చేయక తప్పదు.

**మైత్రేయుడు :** (స్నేహావలోకనంతో అంగీకరించి రత్నావళి గ్రహించి) అయితే మరి –

**చారుదత్తుడు :** రత్నహారం మీద ఏవిధమైన మమకారమూ మనకున్నట్లు కనిపించకూడదు సుమా!

**మైత్రేయుడు :** చస్తే కనిపిస్తానా?

**(నిష్క్రమిస్తాడు)**

# ఆరో దృశ్యం

(వసంతసేన ఇంటిముందు) శకారుడు అలంకరించుకొని వచ్చి అటూ ఇటూ తిరుగుతూ ఈ క్రిందిపదం పాడుతుంటాడు)

**పప్పు, పప్పా, పప్పా, పప్పు!**
**పల్లేవోణ్ణి, పప్పా, పప్పు!**
**పడవా నడిపే పల్లేవోణ్ణి**
**దడవాబోకే పల్లెపడుచా!**
**దాటేస్తానే పల్లెపడుచా!!**
**పప్పు, పప్పా, పప్పా, పప్పు!**

**(లోపలికే వేగంగా పోబోతుంటే)**

**మదనిక :** (ఆపుతూ) ఎవరండోయ్! ఆగండక్కడ!!

**శకారుడు :** (మంచి చేసుకొనే గొంతుకతో) ఓహో! నీవా పిల్లా! ఇక్కడున్నావేం, రా లోపలికి పోదాం.

**మదనిక :** ఎవరు మీరు? ఏమిటీ చనువు?

**శకారుడు :** నీవెవరో చెప్పు చూతాం.

**మదనిక :** వసంతసేన మా అక్కగారు!

**శకారుడు :** అయితే నీకు నేను బావగారిని, మరదలూ! నేను మా అక్కగారి తమ్ముణ్ణి. మా అక్కగారే రాజుగారిని ఉంచుకున్నారు. ఓస్ చిన్నదానివే. నీకింకా ప్రపంచజ్ఞానం లేనట్లుంది. – నే నెవరినో ఎరగనట్లున్నావు. శకారమహారాజులుంగారని వినలేదూ? (మనిషి ప్రక్కగా లోపలికి తోసుకోపోబోతాడు)

**మదనిక :** అయ్యా! ఎక్కడికా తోసుకోపోవటం?

**శకారుడు :** నా ఇంటికి నేను వెళ్లుతుంటే ఓసి గడుగ్గాయ. కసికందువు నీవెవరే ఆపటానికి?

**మదనిక :** మీ ఇల్లు!

**శకారుడు :** (మొలలోనుంచి హారం బయటకు తీసి) మరదలూ ఇదిగో ఇటు చూడు, మొన్న మీ అక్కయ్య నీకొక మంచిహారం చేయించమంటే చేయించాను. ఇలారా, నీ మెళ్లో వేస్తాను.

**మదనిక :** (తానే చేతితో అందుకొని మెళ్ళో వేసుకుంటుంది)

**శకారుడు :** అమ్మాయీ! ఇక ఎంతసేపు మనం ఈ వాకిటి ముందు, లోపలికి పోదాం పద.

**మదనిక :** ఏమండోయ్! ఇప్పుడే మా అక్కయ్య ఎక్కడికో వెళ్ళింది.

**శకారుడు :** (ఆశ్చర్యంతో – ఉద్వేగంతో) వెళ్ళిందా? ఎప్పుడు? ఎలా? ఎక్కడికి? – ఆమెను పిల్చుకురా! పోనీ నన్నే అక్కడికి ఈడ్చుకోపో.

**మదనిక :** (బిక్కమొగంతో) మా అక్కయ్యకు గొప్ప జ్వరం వచ్చింది.

**శకారుడు :** (త్వరలో) అయ్యో! ప్రియా! సమపీనస్తనీ ఆస్తి నాస్తీ!! నేను గొప్ప వైద్యుణ్ణి మరదలూ! నాడీ పరీక్షలో నరికినా దొరకను. మదన జ్వరమైతే మనం వెళ్లుతున్నాం కాబట్టి మందే అవసరం లేదు. జాతి జ్వరమతై నా కుప్పెకట్టు పని చేసినట్లు పని చేయటానికి మరోవైద్యుని సంచికట్టులోనే కుప్పెకట్టు దొరకదు. పాపం, త్వరగా పోదాం పద. ఎంత బాధ పడుతుందో!

**మదనిక :** అ హఁ హఁ! ఇది నిన్నటి ఉదయం సంగతి. ఆమె ఇప్పుడు దేవతా మందిరంలో పూజ చేసుకుంటుంది.

**శకారుడు :** అమ్మాయీ! కావలసినంత డబ్బు తెచ్చి యిచ్చే దేవుణ్ణి నేనుంటే మీ అక్క మరొక దేవుణ్ణి పూజించటమా! మంచి పని కాదన్నానని చెప్పు. డబ్బుకు దానికేం కొదవ దేశంలో. డబ్బంతా బొక్కసంది. బొక్కసం రాజుగారిది. రాజు మా అక్కది. మా అక్క నాది. నాది మీ అక్కది. లోపలికి పోదాం పద.

**మదనిక :** పోయినా – మాట్లాడదుగా ఎవరితోటీ?

**శకారుడు :** ఎవరితోనూ మాట్లాడదు గాని నాతో మాట్లాడుతుంది.

**మదనిక :** ముందు మీరు వస్తున్నారని నేను లోపలికి పోయి అక్కకు చెప్పి వస్తాను. మీరు ఇక్కడనే ఉండండి. (లోపలికి పోబోతుంది)

**శకారుడు :** అ హఁ హఁ, వద్దు వద్దు, నా మాట విను. తరువాత మీ అక్క చేతిలో నన్ను వెంట తీసుకోరాలేదేమని దెబ్బతింటావు. నీ మంచికి చెబుతున్నాను. పోదాం పద.

**మదనిక :** (దూరంగా శర్విలకుడు వెతుకుతుంటాడు. ఆమె చప్పట్లు చరిచి శర్విలకుని పిలుస్తుంది) శర్విలకా! శర్విలకా!! ఇక్కడిక్కడ!

**శకారుడు :** అమ్మాయీ! ఎవరో మొగవాళ్ళను పిలుస్తున్నావే. సరేలే. నేనూ, బావా, సాయంత్రం వస్తామని మీ అక్కతో చెప్పు. ఆఁ– అయితే ఆ హారము – పోనీలే, నీ మెడలోనే ఉంచుకో.

(నెమ్మదిగా జంకుతూ అడుగులో అడుగు వేసుకుంటూ నిష్క్రమిస్తాడు)

**శర్విలకుడు :** (ప్రవేశిస్తూ శకారుడు తప్పుకొని పోతుంటే ఓర కంటితో చూస్తూ ఉంటాడు. దగ్గిరకు వచ్చి మదనిక చేయి చేత్తో పుచ్చుకొని) ప్రియా!

**మదనిక :** శర్విలకా! ఎందుకో తెల తెలపోతున్నావు? ఏమిటాదిక్కులు చూడటం?

**శర్విలకుడు :** (దీర్ఘంగా నిశ్వాసించి) తెల తెలపో కేంచేస్తాను?

**మదనిక :** ఏం చేశావు కాబట్టి

**శర్విలకుడు :** ఎవరి పాపం వాళ్లను కలత పెడుతుంది. ఎవరూ మన మాటలు వినరు కదా! – ఎందుకో మనస్సులో దిగులుగా ఉంది.

**మదనిక :** సంగతేమిటి? – ఎందుకలా ఉన్నావు?

**శర్విలకుడు :** ఏమీ లేదు.

**మదనిక :** చెప్పటానికేమో సందేహిస్తున్నావు.

**శర్విలకుడు :** సందేహమెందుకు. నీ దగ్గిర నాకు రహస్యమేమిటి?

**మదనిక :** మరి విషయమేమిటో చంపక బయటపెట్టు.

**శర్విలకుడు :** మనం ఆమె కొన్నంత ద్రవ్యమూ ఇచ్చేస్తే నిన్ను విడిచి పెడుతుందా?

**మదనిక :** ఆమెవరు?

**శర్విలకుడు :** మీ అక్క వసంతసేన.

**మదనిక :** ఇంట్లో పెత్తనమంతా ఆమె తల్లిది. మా అక్కమాటే సాగితేనా, పరిచారకుల నందరినీ ఊరికే విడిపిస్తుంది – కానీ నన్ను విడిపించేటంత ధనం నీకు ఎక్కడినుంచి వచ్చింది.

**శర్విలకుడు :** మదనికా! నీమీద ప్రేమ నా చేత ఒక సాహసకృత్యం చేయించింది.

**మదనిక :** ఆఁ! సాహసమా!!

**శర్విలకుడు :** అది కేవలం సాహసకృత్యమే కాదు పాపకృత్యం కూడాను – రాత్రికి అప్రతిష్ఠ తెచ్చిపెట్టాను. కాని శ్రమకు ఫలితం మాత్రం దొరికింది – ఇదిగో హారము! – (రొండిన దోపినమూట సంచినుంచి బయటికి తీస్తాడు)

**మదనిక :** (ఆశ్చర్యంతోనూ అన్వేషణగా) ఆఁ, శర్విలకా!

**శర్విలకుడు :** (హారంవైపు తదేకదృష్టితో) ఉస్ – వసంతసేన కిచ్చి ఆమెతో అప్పుడప్పుడూ ఉపయోగించమని చెప్పి నిన్ను విడిపించుకో. మనమిద్దరమూ వివాహం చేసుకొని సంతోషంగా కాలం గడుపుదాము.

**మదనిక :** (హారంమీదనే కళ్లు నిలిపి చూస్తూ) ఏదీ హారం?

**శర్విలకుడు :** (చేతికందిస్తాడు)

**మదనిక :** (పరీక్షిస్తూ) ఎక్కడో చూచినట్లుంది, నీకిది ఎలా దొరికింది?

**శర్విలకుడు :** అదంతా నీకెందుకు? ఇది తీసుకోవెళ్ళి ఆమెకిచ్చి నిన్ను విడిపించుకో!

**మదనిక :** ఈమాత్రం రహస్యం చెప్పటానికే నమ్మలేకపోతే ఇక మనమేమి వివాహం చేసుకుంటాము. మనస్సులో మనస్సు కలిపి సుఖపడతాము.

**శర్విలకుడు :** చారుదత్తుడి ఇంటికి ఎవరో దొంగలు కన్నం వేశారని జనం చెప్పుకోటం వినలేదూ?

**మదనిక :** (ఆవేగంతో) ఆ పని చేసింది నీవేనా? – ఆ యింట్లో ఎవరినీ కత్తితో పొడవలేదు కదా?

**శర్విలకుడు :** (దీనాననంతో తల త్రిప్పుతాడు)

**మదనిక :** గాయపరచలేదు గద?

**శర్విలకుడు :** (తల త్రిప్పుతాడు, లేదన్నట్లు)

**మదనిక :** ఈ హారం మా అక్కగారిదే – ప్రదోషసమయంలో ఆమె మదనాలయం నుంచి వస్తూ ఆర్యచారుదత్తులకు దాచి పెట్టమని యిచ్చింది, కొన్ని అలంకారాలు.

**శర్విలకుడు :** (ఆశ్చర్యంతో) ఏమిటీ! –

**మదనిక :** ఇలారా! (దగ్గిరకు వచ్చిన శర్విలకునితో చారుదత్త – వసంతసేనల ప్రణయగాథను గురించి చెప్పుతుంది)

**శర్విలకుడు :** ఎండ వేడి సహించలేక ఏ కొమ్మను ఆశ్రయించుకొన్నానో దాని ఆకులే రాల్చానన్నమాట! (క్రింద చూస్తూ) అయితే ముందు కర్తవ్యమేమిటి?

**మదనిక :** తీసుకోపోయి ఏదోవిధంగా ఆర్యచారుదత్తులకే చేర్చటం మంచిది.

**శర్విలకుడు :** న్యాయాధిపతులకు చెప్పి శిక్ష విధిస్తే?

**మదనిక :** పిచ్చివాడా! చంద్రుడు ఎండకాస్తాడా! ఆర్యచారుదత్తులను ఎరగనట్లు మాట్లాడుతున్నావు.

**శర్విలకుడు :** (అది ఇష్టము కానట్లు ప్రవర్తిస్తాడు)

**మదనిక :** అయితే మరొకపని చేయటం మంచిది.

**శర్విలకుడు :** ఏమిటది?

**మదనిక :** ఆర్యచారుదత్తులే పంపినట్లుగా హారాన్ని అక్కకు చేర్చు. అప్పుడు ఆయన ఋణవిముక్తుడౌతాడు. నీవు దొంగవూ కావు – ప్రేమ ఉంటే పరిణయం మాట పరమేశ్వరుని కృప – ఇది మన విషయం.

**శర్విలకుడు :** మదనికా! ఇది నీ సౌశీల్యానికి తగ్గ ఊహ. నీ ప్రేమ నాలో పశువును మానవుడిగా పరిణమించిటట్లు చేస్తున్నది. మన వివాహానంతరం నాకే దివ్యత్వం తెచ్చి పెడతావో!

**మదనిక :** (అతని చేయి అందుకొని ముద్దు పెట్టుకుంటుంది) అదిగో, ఆ మావిగున్న చాటున కూర్చో – నేను లోపలకు వెళ్లిన పది నిముషాలలో తలుపు తడితే మా అక్కతో సమయానికి నిన్ను గురించి చెప్పవలసినమాట చెప్పి లోపలికి తీసుకోవెళ్లుతాను.

**శర్విలకుడు :** (మావిగున్నవైపు బయలుదేరుతాడు. అతనికి మదనిక పాట వినిపిస్తుంది)

**మదనిక :** నీదే, నీదే, మధుకరుడా!

> **నీ ప్రియసుమ మిది మధుకరుడా!!**
> **రసికుల లోపల రాజువురా!**
> **ప్రసవకులమ్మున రాణినిరా!** నీదే, నీదే....
>
> **మధువుల నిండిన బేల ఇదీ,**
> **మనసున నిన్నే వలచినదీ,**
> **తలపున నేయెడ నీవె సదా,**
> **వలపే జీవననావ గదా!** నీదే, నీదే.....

**(నిష్క్రమించును)**

# ఏడో దృశ్యం

(వసంతసేన గృహంలో అంతర్భాగం. ఆమె చారుదత్తుని చిత్రాన్ని కూనిరాగాలు తీసుకొంటూ చిత్రిస్తూ పూర్తి చేస్తూ ఉంటుంది. ఇంతలో మదనిక ఏదో పని ఉన్నట్లు ప్రవేశిస్తుంది)

**వసంతసేన :** (కుంచెతో చిత్రపటాన్ని చిత్రిస్తూనే) మదనికా!

**మదనిక :** (మాట్లాడదు)

**వసంతసేన :** ఇదుగో? ఇటు చూడు!

**మదనిక :** (చూడదు)

**వసంతసేన :** చూడవా?

**మదనిక :** (ముద్దుగా అతిపరిచయ కంఠంతో) ఉఁః

**వసంతసేన :** పోనీలే చూడకపోతే మానిలే – (భావాన్ని మార్చి) ఈ చిత్రపటం ఎవరిదో చెప్పవే చూదాం?

**మదనిక :** (వసంతసేన దగ్గరికివచ్చి వేలితో మందలిస్తూ) చెప్పనా?

**వసంతసేన :** (చిరునవ్వుతో చెప్పమన్నట్లు తల ఊపుతుంది)

**మదనిక :** (నెమ్మదిగా నొక్కి ఒకమాట తరువాత ఒక మాటగా) నీవు కన్నార్పకుండా... ముగ్ధమోహనంగా... పరమాభిలాషతో... బహుళాసక్తితో –

**వసంతసేన :** ఎంతసేపు ఈ స్వస్తి కానీ

**మదనిక :** (వేగంగా) ఎవరిని చూడటానికి ఇష్టపడతావో

**మదనిక : వసంతసేన :** వాళ్ళది

**వసంతసేన :** ఈ వక్రోక్తులు కట్టిపెట్టి ఏడిపించక త్వరగా చెప్పు.

**మదనిక :** ఇంకా ఏం చెప్పమంటావు, చెపితినిగా.

**వసంతసేన :** ఏం చెప్పావు? – పోనీ ఈ చిత్రం ఎలా ఉందో చెప్పు–

**మదనిక :** (పూర్వవిధంగా) నీకోరిక తీర్చటానికి... నిశ్చల ప్రేమతో... నిర్మల హృదయంతో – పురివిప్పి నిలచిన నెమలిలా – పురుష పుంగవుడు అలంకరించుకొని ఆర్యచారుదత్తులు వచ్చి కూర్చున్నట్లున్నది. (నవ్వుపుట్టించే టట్లుగా) అక్కా ఆ భంగిమలో ఆర్యుల కన్నులనుంచి అమృతవృష్టి కురుస్తున్నట్లున్నది.

**వసంతసేన :** ఆర్యుల కరుణారసప్రదనేత్రాలను కమనీయంగా చిత్రించానా?

**మదనిక :** నీకు అనుమాన మెందుకు, నేను చెప్పటమెందుకు? నీ కుంచె ఆవిశాలశతపత్రనేత్రాల మీదికి పోకపోవటమే చెప్తుతున్నది.

**వసంతసేన :** (నవ్వి) వారి విశాలవక్షఃప్రదేశానికి లోపం –

**మదనిక :** ఊఁః – అణుమాత్రం రాలేదు – అయితే నీ గాఢాలింగన కౌతూహలం నీచేత మరింత కర్కశంగా చిత్రించేటట్లు చేయించిందేమోనని అనిపిస్తున్నది.

**వసంతసేన :** (కుంచెతో ఒక చుక్కపెట్టి) ఇప్పుడో!

**మదనిక :** ఆఁ. ఆయన సహజరూపం. చక్కగా సరిపోయిందక్కా! ఒక మాటు లోపలికివెళ్లిరా, నీవే వారనుకోని పలకరిస్తావో లేదో!

**వసంతసేన :** ఇచ్చకాలాడకు, మదనికా! చిత్రం నీకు ఎక్కడ నచ్చక పోయినా చెప్పు.

**మదనిక :** (పరిహాసం మాని నిశ్చలంగా) మనస్ఫూర్తితో చెప్తుతున్నాను. ఇందాక నీవు చేసిన మార్పుతో –

**వసంతసేన :** (అనునయిస్తూ) మార్పుతో,

**మదనిక :** నేను చెప్పటమెందుకులే!

**వసంతసేన :** పోనీలే –

**మదనిక :** అక్కా! నీ కర్థమైందో లేదోగాని నీ హృదయం కూడా లగ్నమైంది.

**వసంతసేన :** (పటాన్ని చూచి మురిసిపోతూ) చిత్రాలు గీయటం ప్రారంభించి చివరకు ఏడాది కూడా కాలేదు గదా! అప్పుడే ఇంత సజీవ చిత్రాన్ని సృజించగలిగానా?

**మదనిక :** ఆర్యచారుదత్తుల పరిచయం నీలో కళామూర్తిని జాగృతం చేసిందక్కా! పవిత్రప్రణయం వల్ల ప్రపంచంలో కళాస్రష్టలు ఎంతోమంది జన్మిస్తారనటానికి నీవు...

**వసంతసేన :** నిదర్శనమా! బాగుంది - చారుదత్తుల రూపాన్ని చిత్రించటంమంటే సామాన్యం కాదే!

(చిత్రపటాన్ని చూస్తూ) మహాభాగా!

(*) ఓ కమనీయరూపా! మీ శరీరవిలాసాన్ని ఏ శిల్పైనా ఎలా చిత్రించగలడు? ఒకవేళ చిత్రించినా మీ కరుణాన్విత హృదయాన్ని భావనకూడా చేయలేడు. మదనికా! నా కేమిటీ ఆనందం - అనుభవించలేకుండా ఉన్నాను... ఏమిటో తెలియటం లేదు వివశనై పోతున్నాను. ఏది ఆ కుంచె (చేతికి తీసుకొని)

(లోపల మదనికా! మదనికా!!)

**మదనిక :** అక్కా, నన్ను అమ్మగారు పిలుస్తున్నారు.

**వసంతసేన :** (పొమ్మన్నట్లు సంజ్ఞ)

**మదనిక :** (వెళ్ళిపోతుంది)

**వసంతసేన :** (కూనిరాగం తీసుకుంటూ చిత్రాన్ని చూచి మురిసిపోతూ మధ్యమధ్య గీతానికి అనుగుణమైన నృత్యం చేస్తూ)

**ప్రేమమయా! ప్రణయసఖా!!**
**ప్రణయపతీ! ప్రాణపతీ!!**
**చపలనురా, జలధరుడా!**
**చంద్రుడవు, చంద్రికను**
**రసికుడవు, రాగిణినీ!**
**నర్తకిని, నాయకుడా!**
**మధువునురా, మధుకరుడా!**
**నౌకనురా, నావికుడా!!**
**ప్రేమమయా! ప్రణయసఖా!!**
**ప్రణయపతీ! ప్రాణపతీ!!**

(చిత్రాన్ని ముద్దు పెట్టుకోబోతుంది. తలుపు చప్పుడు)

**మదనిక :** వస్తున్నానక్కా!

**వసంతసేన :** (మదనిక రాగానే) ఎవరిదా గొంతు – ఎక్కడనో విన్నట్లున్నాను.

**మదనిక :** అది మన చారుదత్తులవారి మిత్రుడు శర్విలకులది కదూ!

**వసంతసేన :** (ఎరగనట్లు నటిస్తూ) శర్విలకులు!

**మదనిక :** అదేమిటక్కా! – అప్పుడే మరచిపోయినావా? ఆయనను ఆ దినం చారుదత్తులవారి ఇంట్లో... నీవు నాట్యం చేస్తుంటే –

**వసంతసేన :** (మళ్ళీ తలుపుచప్పుడు విని) పోనీలే – మరిచిపోయినానేమో – ఎందుకువచ్చారో – త్వరగా తీసుకోరా!

**మదనిక :** (శర్విలకుడిని తీసుకోరావటం కోసం నిష్క్రమిస్తుంది)

**వసంతసేన :** (ఆతురతతో వెళ్లుతున్న మదనికను చూచి చిరునవ్వు నవ్వి) జాణవంటే నీవేనే మదనికా! పాపం! మావిగున్ననీడలో మీరిద్దరూ చేసిన సంభాషణంతా నేను గమనించలేదనుకున్నావు గామాలి. స్నిగ్ధనేత్రాలతో కడుపార అతని సౌందర్యాన్ని త్రాగిన ఆ కళ్ళలోని ప్రేమప్రసన్నతంతా మటుమాయం చేసి ఎంతలో ఎంత చిత్రంగా నటించావే! శర్విలకుడు చారుదత్తుల మిత్రులా! నీవు నిజంగా నర్తకివే!

**మదనిక :** (ఆదరం నటిస్తూ) ఆర్య శర్విలక! ఇటు, ఇటు

**శర్విలకుడు :** (ప్రవేశిస్తూ) అమ్మాయీ! శుభము!

**వసంతసేన :** (సగౌరవంగా లేచి) ఆ ఆసన మలంకరించండి –

**శర్విలకుడు :** నన్నప్పుడే మరిచిపోయినట్లున్నారు.

**వసంతసేన :** (జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లు నటించి) మరిచిపోవటమేమిటి? మీరు చారుదత్తులవారి –

**శర్విలకుడు :** ఔను, అతని మిత్రుణ్ణి.

**వసంతసేన :** ఏదో పెద్దపని పెట్టుకొని వచ్చినట్లున్నారు. (నగల పాత్రిక వైపు చూస్తుంది)

**శర్విలకుడు :** (లోపలినుంచి బయటకువస్తూ) మిత్రుడు చారుదత్తుడు మీకు ఇది భద్రంగా చేర్చి రమ్మన్నాడు. వాళ్ల ఇల్లు చాలా పాతదైపోయింది. అందులో పట్టణంలో దొంగలు ఈమధ్య ప్రబలిపోయినారు – ఎన్నాళ్లకూ మీరు మళ్ళీ అడిగి పుచ్చుకోలేదట.

**వసంతసేన :** వారింట్లో ఉంటేనేం నా ఇంట్లో ఉంటేనేం?

**శర్విలకుడు :** మీ భావంలో అంతే కావచ్చు. కాని మావాడు ఏ అపకీర్తి నెత్తిమీద పడుతుందోనని చాలా భయపడుతున్నాడు. దాచిపెట్టటం కష్టంగా కూడా ఉందట. మీరే పుచ్చుకొని కాపాడుకోవలసిందని చెప్పి ఇచ్చిరమ్మని పంపించాడు.

**వసంతసేన :** పాపం! వారిని చాలా శ్రమపెట్టాను – క్షమించమని చెప్పండి.

**శర్విలకుడు :** అయితే మావాడు మీ క్షమాపణ అందుకుండేటంత అవ్యక్తుడు కాదులేండి. (నవ్వుతూ అందించబోతాడు)

**వసంతసేన :** మదనికా! (అందుకొమ్మన్నట్లు సంజ్ఞ)

**మదనిక :** (అందుకుంటుంది)

**వసంతసేన :** (ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు) మీ పేరు శర్విలకులే కదూ!

**శర్విలకుడు :** (నవ్వుతూ) అయితే – నేనేం ప్రమాదం చెయ్యలేదుగదా, కొంపతీసి – దీర్ఘంగా జ్ఞప్తికి చేసుకుంటున్నారు.

**వసంతసేన :** (నవ్వుతూ) మీలో ఇంత చమత్కారం ఉండబట్టే చారుదత్తులవారు నన్ను ఒక కోరిక కోరారు.

**శర్విలకుడు :** కోరికా? ఏమని?

**వసంతసేన :** పూర్వం నీ నగలపాత్ర తెచ్చిన మా మిత్రుడెవరైనా బహూకరించమని.

**శర్విలకుడు :** ఏదో 'హాస్యకేసరి' అని ఒక బిరుదు పారేయకండి భరించలేను.

**వసంతసేన :** అంతకంటే గొప్పబిరుదే – మీబోటి యువకులు మోయ లేకపోతే –

**శర్విలకుడు :** (బుజాలు బలం మోయటానికి సిద్ధపడుతూ ఉన్నట్లు పెట్టి) కానీయండి! ఎత్తండి!!

**వసంతసేన :** ఆటే బరువుకాదు లెండి – మా మదనిక ఏమంత బరువుంటుంది.

**శర్విలకుడు : మదనిక :** (నివ్వెర పోతారు)

**శర్విలకుడు :** మీరు దేనికైనా సమర్థులు – ఏదో నాటకమాడుతున్నారు.

**వసంతసేన :** నాటకాలు ఆడేవాళ్ల దగ్గిర నాటకాలాడకపోతే ఎలా గనక–

**శర్విలకుడు :** (మదనికవైపు చూస్తాడు)

**మదనిక :** (నిశ్చలంగా నిలుచుంటుంది)

**వసంతసేన :** మదనికా! ఇలారా!

**మదనిక :** (వసంతసేన దగ్గిరకు వస్తుంది)

**వసంతసేన :** (చిత్రపటం దగ్గిర ఉన్న – పూలహారాలు రెండు తెచ్చి ఒకటి మదనికకు మరొకటి శర్విలకుడి చేతికిస్తుంది)

**శర్విలకుడు :** మీరు ఏమి చేయబోతున్నారో మాకేమీ బోధపడటం లేదు. ఇప్పుడు మనం ఉన్నది నాటకశాలలో కాదుగద – (గుటక వేసి) అమ్మయ్య! ప్రేక్షకులు ఎవరూ లేరు. బ్రతికాము – (ఇద్దరినీ ఎదురుమళ్ళ నిలువ బెడితే మదనిక హాస్యము మాని వేయమన్నట్లు సంజ్ఞ చేస్తుంది)

**వసంతసేన :** (ఇరువురి మధ్యా నిలబడి శర్విలకుడితో) మీరు వేళాకోళం మానేయాలి. ఆమె నర్తకి, నీవు నటుడవు. శర్విలకా! అమ్మాయీ మదనికా! – మీ ఇందాకటి సంభాషణమంతా నేను సౌధం మీదినుంచి వింటున్నాను. (మదనిక, శర్విలకుడు ఒకరి మొగం ఒకరు చూచుకుంటారు – శర్విలకుడు దొంగతనం పట్టుబడ్డట్లు బిక్కమొగం పెడతాడు) శర్విలకా! మా మదనిక నీ హృదయ సౌశీల్యానికి తగ్గ బహూకృతి. ప్రణయినీదాస్య విముక్తికోసం పరమ సాహసానికి పూనుకున్న ప్రియుడవు నీవు. ప్రియుని పాప పంకిలనుంచి బయటపడవేద్దామన్న పవిత్రాశయం గల ప్రణయిని మా మదనిక! – మీ అవ్యాజానురాగానికి సేతువుగా నేను నిలవదలచుకోలేదు. ఈనాటినుంచి మా మదనిక స్వేచ్ఛాజీవి, నా సహోదరి, నీ ప్రేయసి! – అమ్మాయీ! నీవు అదృష్టవతివి, అనుకూలుడైన భర్త అతివలకు పూర్వజన్మ సుకృతం వల్ల కాని లభించదు. – శర్విలకా! ఇదిగో, నీ ప్రియ! – మీ ఇరువురూ మాలాలంకరణం చేసుకో మని –

**శర్విలకుడు :** తల్లీ! నీ ఆజ్ఞ అనుల్లంఘనీయం (మదనిక మెడలో పుష్పహారం వేస్తాడు)

**మదనిక :** (శర్విలకుడి మెళ్ళో హారం వేస్తుంది)

**శర్విలకుడు :** (మధురంగా) మదనికా!

**మదనిక :** శర్విలకా!

**శర్విలకుడు :** (బుజాలమీద చేయి వేసి మదనికను ముందుకు తెస్తే ఇరువురూ వసంతసేనకు నమస్కరిస్తారు)

**వసంతసేన :** అమ్మాయీ! నేను లోపలికి వెళ్ళి శర్విలకులు మన ఇంట్లోనే విందు చేస్తారని చెప్పి వస్తాను.

**మదనిక :** (ముగ్ధంగా ఊరుకుంటుంది).

**శర్విలకుడు :** మదనికా! ఏదీ ఆనాటి వెన్నెలరాత్రి – ఉద్యానవనంలో నీవు నన్ను ప్రశ్నించినపాట!

**మదనిక :** (ఆనందంతో)

> **ఎన్నటికో! ఎన్నటికో!!**
> **స్వేచ్ఛా విహరణ**
> **మిథున విహంగమ**
> **జీవన మధురిమ      ॥ ఎన్నటికో... ॥**
>
> **ఎన్నటికో – ఎన్నటికో**
> **విరులతోట విపణివీథి**
> **వెన్నెలలో వేసగిలో,**
> **ఎన్నటికో! ఎన్నటికో!!**

**శర్విలకుడు :** (ఆమె కంఠస్థాయిని మించి)

> **ఈనాటికి నేటి కహో!**
> **నీ నా బ్రతుకొక టైనది**
> **పదముననే పదమిడుమా**
> **పదవే పద పదవే –      ॥ ఈనాటికి... ॥**
>
> **నీ యెదయే నా యెదగా**
> **నా యెదయే నీ యెదగా**
> **అవధిలేని ప్రణయావని**
> **ఆవలిదెస చేరుదమే –      ॥ ఈనాటికి... ॥**

**(ఇరువురూ పాటతో నిష్క్రమిస్తారు)**

# ఎనిమిదో దృశ్యం

[శకారుడు ఏకాంతంగా యక్షగాన నాటకంలో వేషం వేయటానికి శబ్దం చేసుకుంటుంటాడు.]

**తరి తరి ధిమి తరి తత్తరి కిట తక**
**తధీం ధిమ్తరీ తక ధిమి ధిమి ధిమి**
**పొన్న మ్రాకుపై వెన్నదొంగనై**
**కన్నె గోపికల వన్నె చీరెలను**
**తకధిక తధిగిణ తోం**
**విడిచి నీటిలో పడినవేళలో**
**ముడిచిచేతిలో నడతు నీడలో**
**త్రిజమ్త కిట - దివ్యసుందరీ**
**ధాకిట్త కిట - భవ్యదేహముల**
**మునిజనపాలా! మురళీలోలా!!**
**అగధర కిట్తకిట - అమరవందితా**
**తక్కిట ధరి తక, ధరి కిట్త కిట్త ధిమి**
**త్రిజమ్త ధకి తక తరుంధ ధిమి కిట్త**

(ప్రవేశము విటుడు - ఒళ్ళు తెలియకుండా శకారుడు శబ్దబ్రహ్మలో లీనమై పోతుంటాడు)

**కుంభీలకుడు :** (నవ్వుతూ) బావా! ఏమిటీ కొలుపు?

**శకారుడు :** ఆఁయ్ - జాగ్రత్తగా మాట్లాడు! కొలుపూ?

**కుంభీలకుడు :** పోనీ కొలుపు కాకపోతే భాగోతం!

**శకారుడు :** ఉఁ- అలారా దారికి

**కుంభీలకుడు :** బావా! వాలకం చూడబోతే మహారాజువు. ఏదో చేసివచ్చినట్లున్నావే!

**శకారుడు :** (ఏదో గొప్ప రహస్యం దాచిపెడుతున్నట్లుగా) ఓస్, ఇదివరకు చెప్పేశాం, ఇప్పుడు చేస్తున్నాం, ఇక చేస్తాం.

**కుంభీలకుడు :** అహాఁహాఁ! మీకేమండీ, రసికాగ్రేసర చక్రవర్తులు మహాప్రభో! – అయితే నాకుకూడా–

**శకారుడు :** ఉష్ – నీకూ లేదు, నిన్ను పుట్టించినవాడికీ లేదు.

**కుంభీలకుడు :** పోనీలే, చెప్పవన్నమాట! (నడుస్తూ) మన స్నేహితం చెల్లు – (వెళ్ళబోతాడు)

**శకారుడు :** (పిలుస్తూ) బావా! గమ్మత్తుచేస్తుంటే అప్పుడే కోపమా!

**కుంభీలకుడు :** (దగ్గిరకు వచ్చి) అయితే చెప్పు.

**శకారుడు :** చెపితే?

**కుంభీలకుడు :** మన యిద్దరం మళ్లీ బావా, బావా!

**శకారుడు :** అయితే నీవన్నదే బావా!

**కుంభీలకుడు :** నీవన్నదే అంటే?

**శకారుడు :** మళ్ళీ భాగోతం?

**కుంభీలకుడు :** భాగోతమే! – ఎప్పుడు?

**శకారుడు :** ఈ రాత్రికి.

**కుంభీలకుడు :** ఎక్కడ?

**శకారుడు :** ఎక్కడో ఎందుకు బావా! మనకేం భయం, మనకోటలోనే.

**కుంభీలకుడు :** మనకోటలోనే! అదా ఇందాకటి ఊసంతా? – అదే జట్టా!

**శకారుడు :** ఆఁ మనజట్టే! – గోపికా వస్త్రాపహరణం.

**కుంభీలకుడు :** వస్త్రాపహరణమే! – తరువాతో, మహారాజుగారికి రాత్రికి నిండా పని తగిలింది – అదృష్టవంతుడివి బావా! – కలిసివస్తే ఇలా రావాలి, లేకపోతే –

**శకారుడు :** బావా! పోయినరాత్రి ఎంత ఎత్తెత్తా ననుకున్నావేం?

**కుంభీలకుడు :** (కొంటెగా) ఆఁ ఎక్కడ?

**శకారుడు :** ఎక్కడేమిటి? దాని దగ్గరనే –

**కుంభీలకుడు :** దాని దగ్గరనే – ఓసి ముండా! – అంత ఎత్తు ఎత్తితేగాని ఒప్పుకోలేదేం?

**శకారుడు :** నేను కృష్ణయ్యైతే అది ఆగలేదట! –

**కుంభీలకుడు :** (ఛలోక్తిగా) లేకపోతే మరి నువ్వు సామాన్యుడివా? నీ ధాటీలకు అది ఆగవద్దు – మరి చివరకు ఒప్పుకుందా?

**శకారుడు :** చచ్చినట్టు.

**కుంభీలకుడు :** (నెమ్మది నెమ్మదిగా) అయితే, రేపు భామ వేషం వేసేది...

**శకారుడు :** వసంతసేనే?

**కుంభీలకుడు :** (నిర్ఘాంతపోయినట్లు) వసంతసేన!

**శకారుడు :** మరి మనదెబ్బంటే ఏమనుకున్నావు?

**కుంభీలకుడు :** నేను నీ మాట నమ్మను – నిజం చెప్పు.

**శకారుడు :** నువ్వూ నేనూ బతికి ఉన్నంత నిజం బావా? మరి నిన్న నా మెళ్లో ఉన్న హారమేమైందనుకున్నావ్?

**కుంభీలకుడు :** (ఆలోచిస్తూ) నీవు స్వయంగా ఆమెతో...

**శకారుడు :** ఆ లోతులన్నీ నీకెందుకోయ్! ఏదో మేము చేసుకున్నాం. రేపు భామ వేషానికి వసంతసేన గజ్జకట్టకపోతే అప్పుడడుగు!

**కుంభీలకుడు :** ఇంతకూ నీవు మాట్లాడలేదన్నమాట! – అయితే నిన్ను ఎవరో మోసగించారు.

**శకారుడు :** (తానూ ఆలోచనలోపడి) ఆఁ – మోసమే!

**కుంభీలకుడు :** హారం ఎవరికిచ్చావో చెప్పు – ఏం జరిగేది నే చెపుతాను.

**శకారుడు :** మాధురుడు మన్నే మోసగిస్తాడా?

**కుంభీలకుడు :** బలే, ప్రబుద్ధుడివి! చాలా గొప్పవాడికిచ్చావు. అయ్యా! – తూర్పు తిరిగి దణ్ణం పెట్టు.

**శకారుడు :** (తల వంచుకొని నేలచూస్తూ) పోయి వాడిని పట్టుకుందాం?

**కుంభీలకుడు :** చిక్కుతాడనేవాడు నీకు. మంచి ఘనమైన 'శఠగోపురం' పెట్టాడు – బావా! ఆ జూదగాడి చేతిలో పెట్టిన హారం జువ్విచెట్టుక్రింద ఈపాటికే అయిపోయి ఉంటుంది.

**శకారుడు :** (బిక్కమొగంతో) అంగడికి పోతే దొరుకుతాడేమో!

**కుంభీలకుడు :** వాడు అంత అథమస్థు డనుకున్నావా? – ఇవాళ ఇంతకూ నిద్రలేచిన ముహూర్తం మంచిది కాదు. ఒక్కపూట ఊళ్లో లేకపోతే ఎంత ఉప్పెన తెచ్చుకున్నావు – (ఆలోచించి) – అయినా మొన్న మనం ఆట ఆడిన చోట వాడు ఇప్పుడు ఉంటే ఉండవచ్చు – పద!

**శకారుడు :** అయితే, మరి రాత్రి నాటకమో!

**కుంభీలకుడు :** ఇంకా ఏం నాటకం? బూటకం. ఉఁ పద. వెతుకుదాం.

**(ఇద్దరూ నిష్క్రమిస్తారు)**

# తొమ్మిదో దృశ్యం

[వసంతసేన ఇల్లు – చారుదత్తుని చిత్రపటంవైపు చూస్తూ– మధ్య మధ్య – వాతాయనం (కిటికి) వైపు నడుస్తూ]

**వసంతసేన :**

**నవవసంత మధుపా!**
**అధిపా. హృదయాధిప!!**
**ఎలదోటకు రాణి ఇది**
**లేబ్రాయపు సుమకన్యక**
**త్రపవీడిన నాపై నీ**
**కృపగల్గునో లేదో, ఓ          నవవసంత...**

**ఎదతీవియ కదలించిన**
**పదమల్లెను, వినవొల్లవొ?**
**యుగయుగాల కిది నీదే**
**వలపో, మరి, వగపో          నవవసంత...**

(లోపలనుంచి)

**శర్విలకుని గొంతు :**

**మరల మరల నోహో! ఈ**
**మధువసంత మరుదెంచునె?**

**మదనిక గొంతు :**

**యౌవ్వనసుఖ మనుభవింప**
**కేలబేల లయ్యేదరు?**

**శర్విలకుడు :** పూలతావి తరిగినదా

**మదనిక :** పూలబ్రతుకె అరిగినదా

**శర్విలకుడు :** నాకమైన ఈ లోకము

**మదనిక :** నరకముగా మారు నోహో!

**శర్విలకుడు : మదనిక :**

**మరల మరల నోహో! ఈ**
**మధువసంత మరుదెంచునె?**
**యౌవ్వనసుఖ మనుభవింప**
**కేల బేల లయ్యెదరు?**

(శర్విలకుడు, మదనిక ప్రవేశిస్తారు. ఇద్దరూ వసంతసేనకు నమస్కరిస్తూ)

**వసంతసేన :** సుపుత్రప్రాప్తిరస్తు.

**శర్విలకుడు :** అమ్మా! మరి నాకు సెలవిప్పిస్తారా?

**వసంతసేన :** మా చెల్లెలూ మీరూ ఈ ఊళ్ళోనే ఉండటానికి నిశ్చయించుకున్నారా? కొన్నాళ్ళపాటు మా మదనిక నా దగ్గరనే ఉండాలని నాకు కోరికగా ఉంది.

**శర్విలకుడు :** ప్రస్తుతం మీ కోరికకే అనుకూలపరిస్థితి కూడా తోడైవచ్చింది.

**వసంతసేన :** అదేమిటి? (ఇద్దరి మొగాలూ చూస్తుంది)

**శర్విలకుడు :** మా ఆర్యకుడి సంగతి మీరు విన్నారా?

**వసంతసేన :** మా ఆర్యకుడంటే...

**శర్విలకుడు :** పోనీ ఏ ఆర్యకుని గురించైనా విన్నారా?

**వసంతసేన :** ఆఁ, విన్నాను. ఎవరో యాదవ యువకుడు ఉన్నాడనీ, ఒక సిద్ధుడు అతని చేయి చూచి ఈ దేశానికి రాజౌతాడని జోస్యం చెప్పాడనీ విన్నాను.

**శర్విలకుడు :** అవును. అతడే మా ఆర్యకుడు, నాకు చిరకాల మిత్రుడు, మన రాజుగారు ఆ సిద్ధుడిమాట విని వాణ్ణి పట్టి తెప్పించి చెరలో పెట్టాడు.

**వసంతసేన :** కారణం?

**శర్విలకుడు :** పిరికితనం – అయినా నియంతల రాజ్యాలల్లో బందీని చేయటానికి కారణాలేం కావాలి? అనుమానం క్రింద అరవై ఏళ్ళదాకా శిక్షించవచ్చు. అతణ్ణి కారాగారంనుంచి తప్పించటం నా ధర్మం.

**వసంతసేన :** అతణ్ణి విడిపించే ప్రయత్నం చేసినవాళ్ళకు ఉరిశిక్ష వేయిస్తామని ఉజ్జయినీ అంతా చాటించారటగా?

**శర్విలకుడు :** అందుకని భయపడతానా? ఆత్మసఖుడు – అనవసరంగా కారాగారంలో కష్టాలు పడుతుంటే నా ఆత్మ ప్రశాంతి వహించలేదు. మిత్రులందరినీ కలుసుకొని రేపోమాపో వాణ్ణి బయట పడేసే ప్రయత్నం చేయాలి.

**వసంతసేన :** (మదనికను చూపిస్తూ) మా అమ్మాయి అభిప్రాయం అడిగారా?

**శర్విలకుడు :** (మదనిక వంక చూచి నవ్వుతాడు).

**వసంతసేన :** మదనికా! మరి మరిదిగారికి నీ అభిప్రాయమేమిటో చెప్పు.

**మదనిక :** (సిగ్గుతో మౌనం వహిస్తుంది).

**వసంతసేన :** (శర్విలకుడితో) మౌనం అర్ధాంగీకారం.

**శర్విలకుడు :** (నవ్వుతో) పరిపూర్ణాంగీకారమే –

**వసంతసేన :** (నవ్వులో నవ్వు కలుపుతూ) ఇప్పుడు సగమూ, పూర్వము సగమూనా?

**శర్విలకుడు, వసంతసేన :** (నవ్వుకుంటారు)

**శర్విలకుడు :** మీ చెల్లెలు నేను తిరిగివచ్చేదాకా మీ యింట్లోనే ఉంటుంది – (శర్విలకుడు చేతి ఉంగరం తీసి దగ్గరికి వచ్చిన మదనిక చేతివేలికి పెట్టి చేయి ముద్దాడి వెళ్ళిపోతాడు. వసంతసేన వారి అనురాగవీక్షణాలను పరికిస్తూ మురిసిపోతూ ముఖవిన్యాసాలతో ఆనందం వెల్లడిస్తుంటుంది. అతడు వెళ్ళిపోయేదాకా ఇద్దరూ వెంటవెళ్ళి తిరిగివస్తారు)

**వసంతసేన :** అమ్మాయీ! మా మరిది ఎంత సాహసి అయినా తగు జాగ్రత్త ఉన్నవాడు.

**మదనిక :** (దిగులుతో దూరంగా నిలుచుంటుంది).

**వసంతసేన :** అమ్మాయీ! మదనికా!! (దగ్గిరవున్న పీఠంమీద కూర్చోబెట్టుకొని) నా జీవితంలో ఇంత ఆనందప్రదమైన దినం వెనుక రాలేదు. మదనికా! నీవు ఒక ఇంటిదానివైనావు.

**మదనిక :** అక్కా! ఈ జన్మలో నిన్ను మరచిపోలేను. ఎప్పుడూ కృతజ్ఞురాలినిగా ఉంటాను. అక్కా! అటు చూడు – మైత్రేయులు.

**వసంతసేన :** అమ్మాయీ! లేచివెళ్ళి వారిని తీసుకోరా వెంటఉండి –

**మదనిక :** (ఎదురుపోయి తీసుకోవస్తుంది. వసంతసేన వారు వచ్చేవరకూ అటే చూస్తూ ఉంటుంది.)

**వసంతసేన :** (లేచి సగౌరవంగా నిలవబడి) ఆర్యా! ఆ ఆసనమలంకరించండి.

**మైత్రేయుడు :** (ఎబ్బెట్టుగా కూర్చుని) అమ్మాయీ! నీ ఇల్లు కాదుగాని నా ఒళ్లు గుల్లయిపోయింది. ఎక్కే గడప, దిగే గడప, కూర్చుంటే గడప, లేస్తే గడప, అసలే ఐరావతం లాంటి మనిషినా! అడుగులో అడుగు పెట్టుకుంటూ అరటిపండు తొక్కమీద కాలుపడ్డట్టు జర్రున జారుకుంటూ, పడుతూ లేస్తూ పైకి వచ్చేటప్పటికల్లా ప్రాతఃసంధ్య వార్చుకొని బయలుదేరితే, మాధ్యాహ్నిక సంధ్యకు వేళ తప్పుతూ ఉన్నది. ఇంట్లో ఉంటే ఈ పాటికల్లా తవ్వెడు నువ్వులు తిలోదకాలకు పూర్తి చేసేవాణ్ణి. డబ్బుంటే ఇలా గోడలకూ, గొబ్బెలకూ పెట్టకపోతే...

**(సర్దుకొని కూర్చుంటాడు).**

**వసంతసేన :** ఇంత లోగిలి కట్టుకొని తమబోటి పెద్దవారికి మిక్కిలి శ్రమ ఇచ్చాను.

**మైత్రేయుడు :** (సర్దుకొంటూ) పరిహాసాలకేం గాని అమ్మాయీ! నీ యిల్లు చూచిన తరువాత ముల్లోకాలూ ఇందుమూర్తీభవించినవా అనిపిస్తున్నది. కుబేరభవనం దీని ముందు గుడ్డిగవ్వకు పనికిరాదు.

**వసంతసేన :** ధన్యురాలిని.

**మైత్రేయుడు :** కూర్చో అమ్మాయీ! నిలబడ్డావు?

**వసంతసేన :** (కూర్చొని) ఆర్యా! మీ మిత్రులు కుశలమేనా?

**మైత్రేయుడు :** మా చారుదత్తుడికి కుశలమే కాని, అతని నామసార్థక్యానికి ఈ మధ్య కొన్ని అవాంతరాలు వచ్చినవి.

**వసంతసేన :** ఆ సజ్జన మహావృక్షాన్ని ఎవరూ నీడకోసం ఆశ్రయించటం లేదా?

**మైత్రేయుడు :** (దైన్యాన్ని సూచిస్తూ తలవంచుకుంటాడు),

**వసంతసేన :** ఆర్యా! ఏదో పనిబడి వచ్చినట్లున్నారు లేకపోతే ఎన్నడూ మా గడపలే తొక్కనివారు...

**మైత్రేయుడు :** (అటూ ఇటూ చూచి) ఈ అమ్మాయి, మీ చెల్లెలు మదనిక కదూ!

**వసంతసేన :** మీరు స్వేచ్ఛగా మాట్లాడవచ్చు.

**మైత్రేయుడు :** అమ్మాయీ! ఆనాడు కామాలయం నుంచీ తిరిగి వచ్చేటప్పుడు చారుదత్తుడి ఇంట్లో దాచిపెట్టమని నగల పాత్ర ఒకటి ఉంచిపోయినావు.

**వసంతసేన :** అవును! జ్ఞాపకమున్నది. మీరు 'మన ఇంట్లో దాచనిచ్చిన దీన్ని' అని చమత్కరించారు, దానికి మీ మిత్రులు – 'వెంటనే ఆమె కోరినప్పుడు తిరిగి ఇచ్చివేయా'లని సమాధానం కూడా చెప్పారు – అదేనా?

**మైత్రేయుడు :** అదే! అది తనదేననే భ్రాంతితో.

**మదనిక :** (దగ్గరకు వస్తూ) ఆఁ.

**మైత్రేయుడు :** మిత్రబృందంతో జూదమాడి మా చారుదత్తుడు ఓడి పోయినాడు.

**మదనిక :** వసంతసేన (ఒకరిమొగం ఒకరు చూచి నవ్వుకుంటారు).

**మైత్రేయుడు :** (మొగాలు చూస్తూ రత్నావళి బయటికి తీస్తూ) దానికి మారుగా ఈ రత్నహారం గ్రహిస్తావేమో అడిగి రమ్మని నన్ను పంపించాడు.

**వసంతసేన :** వారి ఔదార్యం లోకంలో పూర్వమెన్నడూ విన్నదేకాదు!

**మైత్రేయుడు :** రత్నహారం తీసుకోవటం నీకేమీ ఇష్టంలేనట్లున్న దమ్మాయీ!

**వసంతసేన :** అనురాగపూర్వకంగా మీ మిత్రులు పంపించిన హారాన్ని స్వీకరించకపోవటం మహాపచారం.

**మైత్రేయుడు :** ఆఁ, ఇందులో అపచారానికేమున్నదీ, విచారానికేమున్నది.

**వసంతసేన :** మదనికా! – (ఆ హారాన్ని అందుకోమన్నట్లు సంజ్ఞ చేస్తున్నది).

**మదనిక :** (చేయి చాపుతుంది).

**మైత్రేయుడు :** (ఇవ్వలేక ఇవ్వలేక ఇస్తూ) ఇది స్వర్గీయులైన మా అక్క ధూతాదేవిగారికి పుట్టింటివారు సూడిదగా ఇచ్చింది.

**వసంతసేన :** అంత ప్రియమైన హారాన్ని మా నగల పాత్రకు ప్రతిగా ఇవ్వటము మా మహాభాగ్యము.

**మైత్రేయుడు :** (మదనికకు హారాన్ని ఇవ్వలేక ఇచ్చి లేచి కొల్లాయిగుడ్డ విదిలించుకొని పనైపోయిందన్నట్లుగా) అమ్మాయీ! వచ్చినపని పూర్తి అయింది. ఇక లేవనా, దేవతార్చనకు ప్రొద్దుపోతున్నది.

**వసంతసేన :** ఆర్యా! నేను ప్రదోషసమయంలో మీ మిత్రుల దర్శనానికి వస్తున్నానని నాకై సెలవీయండి.

**మైత్రేయుడు :** ఆc. (కానీ రానీ అన్నట్లు) అలాగా.

**(నిష్క్రమిస్తాడు)**

**మదనిక :** (హారం వసంతసేన చేతిలో పెడుతూ) చాలా ఆనందంగా ఉంది అక్కా! ఒక్కమాటు మెళ్లో వేసుకో చూస్తాను.

**వసంతసేన :** అమ్మాయీ! మైత్రేయులవారిని అందాకా పంపించిరా?

**మదనిక :** (మాట్లాడకుండా వెళ్లుతుంది).

**వసంతసేన :** హారాన్ని పరిశీలిస్తూ – చారుదత్తుని చిత్రపటం వైపు చూస్తూ)

(*) ప్రభూ! ఈ పాద సేవకురాలిమీద, నీ శీతలామలస్నిగ్ధ దృష్టి పడిందా, ఈ నీరసశుష్కజీవితం ప్రణయప్రమదావన మౌతుంది.

**సంవాహకుడు :** (ఆవేగంతో ప్రవేశించి) అమ్మా! రక్షించండి! రక్షించండి!! (కాళ్ళమీద పడతాడు)

**వసంతసేన :** ఎవరు నీవు? ఎలా వచ్చావిక్కడికి? – దొడ్డి దారినా?

**సంవాహకుడు :** (ఔనన్నట్లు తల ఊపి) అమ్మా! ప్రధాన జూదరి మాధురుడికి పదిసువర్ణాలు ఆటలో అప్పు పడ్డాను. (తెరలో) ఓరి – బయటికిరా! వస్తే బ్రతకవు, పది సువర్ణాలూ కక్కిస్తా – (తలుపుకొడ్తూ) అమ్మా! తలుపు బ్రద్దలు కొట్టి వస్తాడేమో! రక్షించు తల్లీ! నీ ఋణం తీర్చుకుంటాను.

**వసంతసేన :** ఎవరు నువ్వు? –

**సంవాహకుడు :** నాది పాటలి. ఒక సంసారి బిడ్డను. సంవాహకవృత్తితో జీవిస్తాను.

**వసంతసేన :** చాలా సుకుమారమైన విద్య!

**సంవాహకుడు :** అమ్మా! పాడుజూదం, అప్పులో పడ్డాను తల్లీ! ఉజ్జయినీపురంలో మా ఏలిక దానకర్ణుడు. ఆయన ఇచ్చిన అధిక వేతనాలతో దుర్వ్యసనాలపాలై ఇప్పుడు బయటపడలేకపోతున్నాను.

**వసంతసేన :** ఆయననే ఇప్పుడూ అడగరాదూ?

**సంవాహకుడు :** నాబోటి దీనులను కరుణించి దాతృత్వంలో ఇప్పుడాయన–

**వసంతసేన :** దరిద్రుడైనాడా?

**సంవాహకుడు :** (సిగ్గుతో తలవంచుకుంటాడు).

**వసంతసేన :** మీ యజమాని పేరు అడగవచ్చునా?

**సంవాహకుడు :** మహాభాగ చారుదత్తులు.

**వసంతసేన :** (సంతోషంతో) ఇదిగో – ఈ కంకణం వారికిచ్చి ముందు నీ ఋణం తీర్చుకోరా – పది సువర్ణాలా?

**సంవాహకుడు :** (వసంతసేన చేతికిచ్చిన కంకణాన్ని తీసుకోపోయి మాధురుడికిచ్చి వెంటనే తిరిగివస్తాడు) అమ్మా! ఈ నిరుపేద మీ ఋణం ఎలా తీర్చుకుంటాడో! – మీ బోటి దయగలవాళ్లు ఈ లోకంలో కనుపించటమే అరుదు. ఈ సేవకుడు నేర్చుకొన్న విద్యతో మీ ఋణం తీర్చుకుంటాడు.

**వసంతసేన :** ఇన్నాళ్ళనుంచి ఎవరి శుశ్రూష చేసి ధన్యుడవైనావో వారి దగ్గిరనే నీ విద్యకు సార్థకత లభించనీ.

**సంవాహకుడు :** తల్లీ! నేనా మహాభాగుణ్ణి చూడలేను. ఆయన ప్రియవాది. ప్రియదర్శనుడు. పరమ దయాళువు. మమ్మల్ని చూచినపుడల్లా మా దీనస్థితికీ, తన అశక్తతకూ చింతపడతాడు.

**వసంతసేన :** మహాత్ముల లక్షణమే అది. ఇతరుల బాధను తమ బాధగా పరిగణిస్తారు.

**సంవాహకుడు :** అమ్మా! నేను ఒక నిశ్చయం చేశాను. నా జీవితంలో ఎన్నడూ జూదంమొగం చూడను. బౌద్ధసన్యాసినై సంఘారామాలల్లో సాధువృత్తితో జీవితం వెళ్ళబుచ్చుతాను.

**వసంతసేన :** అంత సాహసం చెయ్యకు.

**సంవాహకుడు :** అమ్మా! నా కోరికకు అడ్డుపెట్టకు. సంఘసేవ చేయటానికి నాకు మరో సదవకాశం లేదు.

**(నిష్క్రమిస్తాడు)**

**మదనిక :** (ఒక్క ఉత్తరీయంతో ప్రవేశించి) అక్కా! అక్కా!! ఘంటమోదకంవల్ల ఇవాళ అన్యాయంగా మనం అధికారుల చేతుల్లో పడేవాళ్ళమే!

**వసంతసేన :** తప్పించుకోపోయిందా ఏమిటి?

**మదనిక :** కట్టుగొలుసు తెంపుకొని రాచబాటలో ఒకరిని తొండంతో పట్టుకొని నేలకేసి కొట్టబోయింది.

**వసంతసేన :** (ఆశ్చర్యంతో) ఆఁ!

**మదనిక :** జనం చచ్చె చచ్చె అని కేకలు వేశారు. మన కర్ణపూరకుడు అంకుశంతో లొంగగొట్టి –

**వసంతసేన :** అమ్మా! పరువు కాపాడాడు – ఆ ఉత్తరీయ మెక్కడిది?

**మదనిక :** మరి తొందరపడకు. విను. జనంలోనుంచి ఒక మహానుభావుడు ఉత్తరీయాన్ని బహుమానంగా కర్ణపూరకుడి కిచ్చాడట!

**వసంతసేన :** అది జాజిపూల వాసనే వేస్తున్నదా?

**మదనిక :** (జాగు చేస్తూ) ఈ మధ్య చేమంతిపూలే పెట్టుకోటంవల్ల జాజిపూల వాసనే మరిచిపోయినాను అక్కా!

**వసంతసేన :** చివర నామధేయం ఉందో లేదో చూడు.

**మదనిక :** (పరిశీలించి) చా... రు

**వసంతసేన :** ద....త్త – అవునా? మహాభాగుడిదేనా! ఏదీ ఆ మదనిక దగ్గరినుంచి ఒడిచి తీసుకొని కప్పుకొని సంతోషంతో దీర్ఘంగా నిట్టూర్చి (*) నా ప్రియుని కీర్తిస్ఫూర్తితో దిక్కులన్నిటికీ జాజితావులు వెదజల్లే మహత్తరోత్తరీయమా ఇదిగో ఈ అంసభాగము వక్షస్థలము నీవి. నీ ఆనంద నాట్యాని కివి రంగస్థలాలు. నిరుపమానమైన నీ కళాకేళి నక్కడనుంచి నిరూపించు.

**మదనిక :** అక్కా! నీ ఒంటిమీద కెక్కి ఈ ఉత్తరీయం అందం తెచ్చుకున్నది.

**వసంతసేన :** పొరబాటు. చారుదత్త మహాభాగుల ఉత్తరీయాంశుకంవల్ల నా శరీరానికి నూతనోత్తేజం కలిగింది. మదనికా! వారి సేవకుడికి కంకణమిచ్చి మానం నేను కాపాడినందుకు నా సేవకుణ్ణి ఈవిధంగా ఆర్యుడు తెలియ కుండానే గౌరవించాడు.

**మదనిక :** అదేమిటి?

**వసంతసేన :** ఇప్పుడే అప్పుపడ్డ ఆర్యులసేవకుడికి పది సువర్ణాల కంకణమిచ్చి ఋణవిముక్తుణ్ణి చేశాను.

**మదనిక :** (నవ్వుతూ వసంతసేన కప్పుకున్న ఉత్తరీయం సవరిస్తూ) అక్కా! ఇది నీవు వ్యయం చేసిన పదిసువర్ణాల కంకణం విలువా వుంటుందా?

**వసంతసేన :** నీ మొగుడు వారింట్లో దొంగిలించిన భూషణ పాత్రకంటే ఎన్నో రెట్లు విలువ చేస్తుంది. (అని అంజలి ముడిచి వాసన చూస్తూ ఉంటుంది) అమ్మాయీ! మనం త్వరగా అలంకరణ పూర్తి చేసుకొని ఆర్యచారుదత్తుల ఇంటికి బయలుదేరాలి – రత్నహారం వెంటతీసుకోవెళ్ళాలి. మరిచిపోవద్దు. జ్ఞప్తి ఉంచుకో (ఉరుములు – మెరుపులు)

**మదనిక :** అక్కా! అటుచూడు! అకాలదుర్దినము. కారుమేఘాలు బాగా క్రమ్ముకోవస్తున్నవి–

(వాతాయనంవైపు నడిచి) కుంభవృష్టి తప్పదు.

**వసంతసేన :** (*) మదనికా! ఈ శ్రావణపయోదాలు లోకాలకు ప్రళ యంగా కుంభవృష్టి కురియనీ. నేల బీటలు వారేటట్లు పిడుగులు పడనీ, ఏమైనా రమణీయాకృతితో నేను నా ప్రియుని ఇంటికి వెళ్ళి తీరవలసిందే!

**మదనిక :** అక్కా! ప్రవాసంనుంచి తిరిగివచ్చే ప్రియులకు వాసకసజ్జికలు స్వాగతమిచ్చినట్లు, అదుగో, అటుచూడు! ఆ గిరిశృంగాలమీద మయూరాంగనలు పురులు విప్పి మధుర క్రేంకారాలతో అంబుదస్వామికి ఎలా స్వాగతమిస్తున్నవో!

**వసంతసేన :** అయ్యో! దిక్కులన్నీ పట్టపగలే కారుచీకట్లలో కలిసి పోతున్నవి. జగత్తుకు ఇక ఈ దినం భయంకర కాళరాత్రేనా? ప్రళయం రానీ! నా ప్రయత్నం మానను!!

**మదనిక :** అక్కా, అటుచూడు! (మేఘగర్జ) మేఘగర్జ విన్న తరువాత కూడా నీకు ధైర్యం సడలటం లేదా?

**వసంతసేన :** (ఆకాశంవైపు దృష్టి నిల్పి) (*) ప్రభూ! పర్జన్యా!! నేను ప్రౌఢోజ్వల వేషంతో నా ప్రియుని ఇంటికి బయలుదేరుతుంటే ఈ ప్రావృట్కాల ఘనఘోషలతో, ద్రోణవృష్టులు కురియ తలపెట్టావు. ఈ దౌష్ట్యం నీబోటివాని కర్హమైందేనా?

**మదనిక :** అక్కా! అతడేమి చేస్తాడు? మేఘాధిపతి ఇంద్రమహారాజుకు నీమీద దయ తప్పింది.

**వసంతసేన :** ఇంద్ర మహారాజుకు దయతప్పనీ, చంద్రమహారాజుకు దయ తప్పనీ – ముల్లోకాలూ ప్రళయకల్లోలాబ్ధిలో మునిగిపోనీ – అదుగో! ఆ మెరపుకన్నె అలా దారి చూపుతూ వెలిగితే చాలు!! (ఔత్సుక్యంతో)

(*) అమ్మా, సౌదామినీ!! ఆ మేఘరాజును అలాగే ఉరమనీ. అతడు మగవాడు. హృదయేశ్వరునికోసం విరహార్తనైన నేను అభిసారికనౌతున్నాను. నన్ను ఏవిధంగా ప్రియుని ఇంటికి చేరుస్తావో!

**(నిష్క్రమిస్తుంది)**

# పదో దృశ్యం

[చారుదత్తుని ఇల్లు – ఆషాఢ మేఘగర్జనలూ మెరపులూ – సాయం సమయం – మధ్య మధ్యన ఆలోచించుకుంటూ అతడు కవితాగానం చేస్తూ మధ్య మధ్య తాళపత్ర గ్రంథం మీద లిఖిస్తూ ఉంటాడు]

**చారుదత్తుడు :**

> **"సకియ యేతెంచు నేమొ, ఆషాఢజలద!**
> **బిట్టు గర్జించి యిటు భయపెట్టకయ్య:**
> **తిమిరముల జీల్చి భవదీయ దేహకాంతి**
> **తోడుపడ గదె, తల్లి, విద్యుల్లతాంగి!**
> **ఆగు మొక్కింత జలదుడా! ఆగవోయి :**
> **రామగిర్యాశ్రమోపాంత రమ్యభూమి**
> **సకియ నెడబాసి నాడు వేసారు యక్షు**
> **దూతవే నీవు చెప్పుమా తొలుత సఖుడ?**
> **ఇతని నీ గతి ఘోషింపనిమ్ము శంప!**
> **అటులె కాయించి వెన్నెల నమృతరూపి**
> **దెసల వెలిగింప హృదయాధిదేవి వచ్చు**
> **వచ్చు దుర్దినమైన నే ప్రళయమైన"**

**మైత్రేయుడు :** (ప్రవేశిస్తూ విసిగిపోయినట్లుగా) ఛీ, ఛీ, ఛీ! బులిబుచ్చి కాలబూచి గాయత్రిసాక్షిగా దానిమొఖం మళ్ళీ చూడకు. చదువుకున్న బ్రాహ్మణ్ణని చాప వేసిందా? పోనీ వట్టినేలమీదైనా గట్టిగా కూర్చోమందా? సుడి పడిపోయి దాని కొంపకు చేరుకుంటే కాస్త శుద్ధి చేసి గుక్కెడు మంచినీళ్ళిచ్చిందా? పచ్చి పుండాకోర్!! అరెరె! వెళ్ళింది మొదలు రెండో ప్రసంగమే లేదాయె! కాకులకు కోకిలలెలా పుడతాయి – ఉఁ హుఁ హు. – 'విత్తమాత్రోపాధే సకల పురుషాభిలాషిణీ సామాన్యా!!

**చారుదత్తుడు :** మైత్రేయా! ఏం జరిగిందేమిటి? – వెళ్లిన పని ఏమైంది?

**మైత్రేయుడు :** ఏమైంది? 'అయంవై'

**చారుదత్తుడు :** వసంతసేన రత్నావళి తీసుకోలేదా?

**మైత్రేయుడు :** తీసుకోకపోవటమేం? – చేదా? తేనెలొలికే కుసుమకోమల హస్తాలతో దివ్యంగా తీసుకున్నది.

**చారుదత్తుడు :** అయితే 'అయంవై' అంటావేం? చెడిపోవటమేముంది?

**మైత్రేయుడు :** మనమేం తిన్నామా? కుడిచామా? భూషణ పాత్రిక దొంగలెత్తుకో పోయినారు. దానికోసం మన – మా స్వర్గీయులైన అక్కగారి జ్ఞాపకచిహ్నమైన అమూల్య హారం పోయింది.

**చారుదత్తుడు :** భూషణపాత్రకు ప్రతిగా రత్నహారాన్ని మనం ఇచ్చా మటోయ్! అయితే మైత్రేయా! ఆమె దాన్ని సంతోషంగా గ్రహించిందా?

**మైత్రేయుడు :** ఆс, ఆс – ఆగ్రహించింది ఆగ్రహించింది, అయ్యా! గుళ్ళో గంటపోతే నంబి కేంలోటు?

**చారుదత్తుడు :** మైత్రేయా ఏమిటి నీకీ కోపం? పరమ దరిద్రుణ్ణన్న ప్రతీతి ఎరిగి కూడా నగలపాత్ర మనయింట్లో దాచి పెట్టటానికని ఆమె ఇచ్చింది గమనించావా? ఆ నమ్మకానికి మనం పంపించిన హారం తగ్గ బహుమానమా?

**మైత్రేయుడు :** (వికటంగా) లేదు! లేదు!! ఇదిగో! నీవింత వెర్రి బాగులవాడి వని కనిపెట్టి అది నీ చేతికిచ్చింది దొంగను పంపించి దోయించింది. హారాన్ని హరించింది చారుదత్తా!

**చారుదత్తుడు :** (పొరబాటన్నట్లు) మైత్రేయా!

**మైత్రేయుడు :** (వినిపించుకోకుండా) అమ్మో! కనుసైగ చేసి చెలికత్తెలతో కలిసి పైటకొంగు చాటుగా నన్ను పరిహసిస్తుందీ. వాళ్లూ దీనికి తోడుబోయిన వాళ్లే. 'ఇంద్రాణి' ముండలు. ఆс పరమబ్రాహ్మణుణ్ణి పట్టుకొని పరాచకాలాడటమా! నీకు కోపం వస్తుందని ఊరుకున్నాను. లేకపోతేనా పెట్టవలసిన నాలుగు 'వషట్కారాలూ' పెట్టి 'దేవాదేవేషు' చేసి వచ్చేవాణ్ణే. (జాలిగా) చారుదత్తా! నీకెందుకీ సానిసాంగత్యం? నా మాట విను.

**చారుదత్తుడు :** మైత్రేయా! వసంతసేన హృదయం నీకు అణుమాత్రమైనా అర్థం కాలేదు. ఆమె నీవనుకుంటూ ఉన్నట్లు సామాన్య కాదోయ్! సద్గుణోపేత. ఆమె హృదయం అమృతమయం.

**మైత్రేయుడు :** సరే! మంచిది, కానియ్! ఆ అమృతమంతా తాగి అమాంతంగా దేవతవై కూచో, మా నెత్తిమీద. ఏముంది? అగడ్తలో పడ్డపిల్లికి అదే వైకుంఠం. ఏదో 'కంచిమేక'వు. కమ్మటి బ్రాహ్మడవు. దొరికావు. అదంతా నాకెందుకు, శ్రుతిమించి రాగానపడ్డ తరువాత. నిన్ను చూడటానికని ఆమెగారు ప్రదోష సమయంలో మన ఇంటికి వస్తుందట! చెప్పమన్నది. మేలిమి బంగారంలాంటి నీ మెత్తదనం బాగా తెలుసుకుంది. రత్నావళి చాలలేదు కామాలి. మొరపెట్టి మరేదైనా కొంత గిలుబాడుకోపోదామని వస్తున్నట్లుంది.

**(లేస్తాడు)**

**చారుదత్తుడు :** రానీ – సంతోషపెట్టి పంపటానికి ప్రయత్నిస్తాను.

**మైత్రేయుడు :** (కోపంతో గట్టి గొంతుకతో) ఏమిచ్చి – నన్నిచ్చి –

**చారుదత్తుడు :** మైత్రేయా! కొంచెం శాంతించు. చాలా శ్రమపడి వెళ్ళివచ్చావు. కాసేపు అలా విశ్రమించు.

**మైత్రేయుడు :** 'అమ్మగారి' ఇంటినుంచి వచ్చి 'సచేలస్నానం' చేసి చాలాసేపు విశ్రమించే వచ్చాను.

**చారుదత్తుడు :** మైత్రేయా! ప్రణయదాంపత్యం నీబోటి పరమ ఛాందసుడికి ఏమి తలకెక్కుతుంది? ఒక మహాకవి తన ప్రేమమూర్తితో ఏమంటున్నాడో విను.

> **"కోరను స్వర్గ మిచ్చినను**
> **కోరను బ్రహ్మపదమ్మె కల్గినన్**
> **సారెకు సారెకున్ మధుర**
> **సప్రసవాసవమిచ్చి ప్రేమతో**
> **మారశిలీముఖాంగుళుల**
> **మంజులదివ్యవిపంచి మీటి నా**
> **నీరసజీవితమ్మునకు**
> **నిత్యము ప్రాణము పోసినన్ సఖీ!'**

**మైత్రేయుడు :** (ఆవేగంతో – నోటిమీద చేయివేసుకొని) అవ్వ! బ్రహ్మపదం కూడా ఒదులుకుంటాడుగా! ఓరి త్వాష్టం! అందంగా చెప్పగలుగుదుము గదా అని ఈ 'బ్రహ్మర్షోబ్రహ్మిర్షి' గాళ్ళందరూ అవాకులు చెవాకులు వ్రాస్తే సరా! ఇలాంటి కుకవులే పుట్టకపోతే లోకం ఇంత అల్లకల్లోలమయ్యేదే కాదు. అందుకనే 'నానృషిః కురుతే కావ్య' మన్నారు పెద్దలు – అంతా కవులే! అంతా మహాకవులే. పుట్టగొడుగుల్లాగా ఇంతమంది మహాకవులు పుట్టుకొచ్చారేమోయ్, ఈ కాలంలో–

**చారుదత్తుడు :** మైత్రేయా : ఈనాటి మహాకవుల ప్రణయకవిత్వం నీ బోటి వాళ్ళకు ఆగమ్యగోచరంగా ఉంటుంది –

**మైత్రేయుడు :** ప్రణయాన్ని అనుభవించి వ్రాసిందేనా? ఈ ప్రళయ కవిత్వమంతా! ఒకవైపు పెళ్ళాడిన వాళ్ళ వీపులు విరుగుతూ ఉంటవిట! ఇంకోవైపు నుంచి ప్రేమతత్వం మీద ప్రణయగీతాలు ఘంటం కక్కుతూ ఉంటుందిట! – అంతేనా? – అయితే, తమరు జెప్పే 'ప్రళయకవిత్వం' కూడా ఇషువంటిదేనా స్వామీ? (తలుపు చప్పుడు) చారుదత్తా! మీ ధనికుడు వచ్చినట్లున్నారు–

**చారుదత్తుడు :** (నవ్వుతూ భావం గ్రహించినట్లు) మా ధనికుడెవరు?

**మైత్రేయుడు :** నీవు ఋణపడి రత్నహారమిచ్చుకున్న వారు?

**చారుదత్తుడు :** నీవు ఎంత పరిహాసం చేసినా నాబోటి జూదరులకు ధనికులతో స్నేహం తప్పనిసరిగదా! (వచ్చిన మదనికను చూసి) అమ్మాయీ! మీఅక్కగారు వచ్చారా! (ఔనని తలూపి మదనిక నిష్క్రమిస్తుంది).

**మైత్రేయుడు :** ఓహో! లజ్జాభినయం ఇంకా అయిపోలేదు కామాలి. ఇదే కొంప తీసేది – తెలివితేటలంటే అలా వెలిగిపోవాలి (కోపంతో వసంతసేన వచ్చేవైపుకు వెన్ను తిప్పి కూర్చుంటాడు).

**వసంతసేన :** (మదనికతో ప్రవేశించి యిద్దరికీ నమస్కరిస్తుంది).

**చారుదత్తుడు :** (ఆసనం చూపిస్తూ) వసంతసేనా? ఈ ఆషాఢారంభం నీకు సుఖప్రదంగానే ఉందా?

**వసంతసేన :** (కూర్చొని స్మితం చేస్తుంది).

**మైత్రేయుడు :** (వసంతసేనవైపు తిరిగి) అమ్మాయీ! అవతల అట్లా మేఘాలు కమ్ముకొస్తుంటే ఏదో ముంచుకోబోయినట్లు ఆత్రంతో పరుగెత్తుకోవచ్చావు.

**మదనిక :** బాబయ్యగారూ! మీరు ఇచ్చిన రత్నావళి విలువ ఎంతో కనుక్కోబోదామని వచ్చింది మా అక్కయ్య!

**మైత్రేయుడు :** (చారుదత్తునివైపు సాభిప్రాయంగా చూస్తాడు).

**మదనిక :** ఆమె అది తనదేననే భ్రాంతిలో ఒక చెలికత్తెతో జూదమాడి ఓడిపోయింది.

**వసంతసేన :** ఆ గెలుచుకున్న మా 'శాద్వల' మొగుడు ఒక రాజచారుడు. దానిని తీసుకొని గతరాత్రి ఎక్కడికో వెళ్ళిపోయినాడు.

**మదనిక :** (కనుసైగ చేసి చెప్పవే అన్నట్లు) ఉఁ. చెప్పు.

**వసంతసేన :** (నీవే నన్నట్లుగా) కానీ.

**మదనిక :** అతడు తిరిగివస్తేగాని మీ హారం మీకు రాదు. అందాకా ఈ భూషణపాత్ర మీ యింట్లో పూటగా ఉంచుకోవలసిందని మా అక్కయ్య అభిప్రాయం.

**వసంతసేన :** (భూషణపాత్ర ఉత్తరీయం నుంచి బయటికి తీస్తుంది)

**మైత్రేయుడు :** (కూర్చున్నచోటినుంచి లేచి పాత్రికను పరీక్షిస్తూ) మామాటలే మాకు ఒప్పచెపుతున్నారా? ఆఁ! చారుదత్తా! నేను చెప్పలేదు. మన ఇంట్లో దొంగతనం ఎవరు చేయించారో! ఇది, అదే, ఆ భూషణపాత్రే! ఏం సందేహం లేదు. ఇంకా అనుమానమెందుకు?

**మదనిక :** (లేని కాఠిన్యంతో) బాగుంది వ్యవహారం! జాగ్రత్తగా చూచి మాట్లాడండి!

**మైత్రేయుడు :** నా బ్రాహ్మణ్యం తోడు. ఇది అక్షరాలా ఆ సువర్ణపాత్రే! చారుదత్తా!

**చారుదత్తుడు :** (నవ్వుతూ) నాకేమనటానికీ తోచడం లేదు. దాని విషయం నీవే తేల్చు.

**వసంతసేన :** (నవ్వుతూ) నిజం చెప్పవే మదనికా! మీ ఆయన 'ప్రతిభ' ఆర్యులు కూడా వింటారు.

**మదనిక :** నీవే కానీ అక్కా!

**వసంతసేన :** నీ నోటిమీదిగా వస్తే మీవారి ప్రతాపం బాగా అర్థమౌతుంది.

**మదనిక :** (కోపం చూపిస్తుంది).

**వసంతసేన :** పోనీలే ! (మైత్రేయుడితో) ఆర్యా! నేను మీ ఇంట్లో దాచిపెట్టమని ఇచ్చిన భూషణపాత్రను కన్నం వేసి దొంగిలించాడు మా మదనిక మొగుడు.

**చారుదత్తుడు :** మదనికకు పెళ్ళైందా ఏమిటి?

**వసంతసేన :** దానికీ మీరే కారకులు – మొన్న రాత్రే పాణిగ్రహణం!

**చారుదత్తుడు :** సంతోషం!

**మైత్రేయుడు :** (ఆలోచించి) మదనిక దొంగపెళ్ళామన్న మాట!

**చారుదత్తుడు :** (నవ్వుతూ) దొంగ పెళ్ళాం కాదోయ్ – దొంగకు పెళ్ళాం.

**మైత్రేయుడు :** ఏమైతేనేం? మన సువర్ణపాత్ర దొరికింది. దొంగ చిక్కాడు. నేను చెప్పలేదుటోయ్ ప్రశ్న – సరిగా అన్నట్లే నాలుగోదినానికి దొంగ దొరికాడు.

**చారుదత్తుడు :** వసంతసేనా! నీవు కూడా జూదరివైనావా?

**వసంతసేన :** మీరు జూదరులైతే నేనుమాత్రం జూదరిని కాకుండా ఉండగలనా?

**మదనిక :** బాబయ్యా! మీరింకా కొంతసేపు ఇక్కడే ఉంటారా?

**మైత్రేయుడు :** మీరెవ్వరూ లెమ్మనకుండానే ఈ చలిగాలి రయ్యిమని విసరికొడుతూ నన్ను లేచిపొమ్మంటున్నది – అమ్మాయీ, ఒకమాట. (ఇద్దరూ నిష్క్రమిస్తారు).

**చారుదత్తుడు : వసంతసేన :** (ఒకరిని చూచి ఒకరు నవ్వుకుంటారు)

**చారుదత్తుడు :** ప్రియా! నేను జూదరిని ఎందుకైనానో తెలుసునా? ఈ జగత్తు నాబోటి నిరుపేదను నమ్మదని. సత్యం ఎవరికి బోధపడుతుంది. కేవలం ప్రచారంమీద ప్రపంచము నడుస్తున్నది. తనలోపాన్ని ఒకరిమీదికి నెట్టటం కన్నా ఒకరి లోపాన్ని తనమీదికి తీసుకోవటం మంచిదని నా నమ్మకం.

**వసంతసేన :** మీబోటివారి కది చెల్లుతుంది.

**చారుదత్తుడు :** (మందస్మితంతో) నీవు మాత్రం ఏమి తక్కువ తిన్నట్టు –

**వసంతసేన :** అందుకనే మదనుడు మన ఇద్దరినీ –

**చారుదత్తుడు :** వసంతసేనా! అటుచూడు, ఆ కొండకొమ్ముస మేఘగర్జ విని మయూరాంగనలు కదుపులు కట్టి ఎలా నాట్యమాడుతున్నవో!

**వసంతసేన :** అవి తమ వియోగగాథలను మధుర క్రేంకార మిషతో అంబుదప్రభువుకు విన్నవించుకుంటూ ఉన్నవి.

**చారుదత్తుడు :** (మరొకవైపు చూపిస్తూ) అదుగో, ఆ ఆషాఢ వలాహకస్వామి శితికంఠుని కంఠకాళిమ కంటే నీలాతినీలమైన శరీరంతో మందగమనం చేస్తున్నాడు – ఆయన సప్త సముద్రాలల్లో తాగిన నీటినన్నిటినీ ఒక్కమాటుగా పుక్కిలిస్తేనా?

**వసంతసేన :** సాగరాధిపతి పంట పండుతుంది. వధూసంగమం!

**చారుదత్తుడు :** మహాకవులకు వసంతకాలం నచ్చినట్లు ఈ ఆషాఢం నచ్చలేదు. నాకు మాత్రం ప్రావృట్కాలమంటే పరమప్రీతి. ఈ ఋతువు తలపుకువస్తేనే ఎన్నెన్నో మనోహరభావాలు, ప్రవాసరాధికలు, వాసవసజ్జికలు, అభిసారికలు – ఒక వంక సాగర మేఘనాథులు, మరొకవంక నదీనద మయూరాంగనలు. ఉత్తేజకరమైన కవితాసామగ్రికీ ఋతువు ఉజ్జ్వలమైంది.

**వసంతసేన :** ఆర్యా! అభిసారికనై వచ్చిన నాకు మాత్రం మరొక ఋతువుమీద అభిమానమెలా కలుగుతుంది?

**చారుదత్తుడు :** (వసంతసేన దగ్గిరికి వస్తూ) ప్రియా!

**వసంతసేన :** (అతని బుజాన్ని ఆలంబంగా గ్రహించి నిలుస్తూ) ప్రభూ!

**చారుదత్తుడు :** మన ద్వితీయ పరిచయం నాడు నీవు వినిపించిన గీతం ఏదీ, మరొక్కమారు వినిపించు –

**వసంతసేన :** మీ వీణావాదనం తోడుగా ఉంటేగాని ఈ దినం పలకలేను, క్షమించాలి.

**చారుదత్తుడు :** (వీణవైపు నడచి వసంతసేనను పాడమని సంజ్ఞ చేస్తాడు).

**వసంతసేన :** (పాడుటకు ఉద్యుక్తమౌతుంది)

> **నెమ్మదికి రావె ఈ**
> **తుమ్మెదకు ఓ పూవ!**
> **అమ్ముకోబోకె నీ**
> **నెమ్మనము ఓ పూవ!!**        **నెమ్మదికి....**

**పొలతి! బేలవె నీవు**
**ప్రౌఢతన మెరుగవే!**
**ననకులమ్మున కెంత**
**నగుబాటె, నగుబాటె! నెమ్మదికి....**

**ఈ కోన నీకంటె**
**తావిగల పూవేది!**
**ఆతురత యేగాని**
**ఆతడెరుగడె మనసు నెమ్మదికి....**

**చారుదత్తుడు :** (ఒక చేతిలో వీణను నిలిపి వెళ్ళి వసంతసేనను మరొక చేతిలోకి తీసుకొని) ప్రియా!

**వసంతసేన :** ప్రభూ!

**చారుదత్తుడు :** (సేదతీర్చిన తరువాత) జాజిపూలను ఆఘ్రాణించటానికి ఈ కాలమంత మంచిదిలేదు. ఈ ఋతువులో ఉద్యానవనాలు సామాన్యమైనవే నందనవనాన్ని పరిహసిస్తవని ప్రతీతి. నిజమేనా?

**వసంతసేన :** అసత్యం అనుభవపూర్వకంగానే గ్రహిద్దాం.

వర్షం కూడా కొంచెం వెనకబడినట్లుంది. తోటకు....

**చారుదత్తుడు :** (చూచి) దుర్దినలక్షణాలు దూరమైపోయినవి.

నేను మన ప్రయాణ సన్నాహం చేయమని పూర్వమే వర్ధమానకుడిచేత బండి సిద్ధం చేయించాను. అతడు రాగానే నీవు బయలుదేరు.

**వసంతసేన :** (అంగీకారాన్ని సంజ్ఞామూలకంగా తెలియజేస్తుంది).

**చారుదత్తుడు :** (నిష్క్రమిస్తాడు).

**వసంతసేన :** (చారుదత్తుడి తాళపత్రగ్రంథంలో పద్యాలు చదివి హృదయానికి హత్తుకుంటుండగా మదనిక ప్రవేశిస్తుంది. వసంతసేన ఉలికిపడి మదనికను చూసి శాంతించి) అమ్మాయీ! ఈ హారం స్వర్గీయులైన మా అక్క ధూతాదేవిగారిది. ఈ హారాన్ని ప్రణామాలతో లోపల ఒదినెగారికి సమర్పించు.

**మదనిక :** అదేమిటక్కా! చారుదత్తులవారికి కోపం రాదూ!

**వసంతసేన :** వారిని నేను సమాధానపరుస్తాగా, నీవు వెళ్ళిరా! ఆలస్యం చెయ్యకు.

**మదనిక :** ('ఆ స్థితికి వచ్చావుగదా' అని నవ్వుతూ నిష్క్రమణ మారంభించి తిరిగి సంతోషంతో వెనుకకు వచ్చి) అక్కా! అక్కా!! అదుగో, వర్ధమానకుడి చేత చారుదత్తుల వారు బండి పంపించారు. పక్షద్వారం దగ్గర నిలుచున్నది – ఊс. బయలుదేరు.

**వసంతసేన :** అమ్మాయీ! నీవు ఇంటికి పద. నేను కొద్దిసేపట్లో ఈ బండిమీదనే ఇంటికి చేరుతాను.

**మదనిక :** అక్కా! నీ ప్రణయగ్రంథాన్ని ద్రాక్షాపాకంలోనే నడవనీ –

**వసంతసేన :** (వెనక్కు తిరిగి, నవ్వి ముక్కుమీద చెయ్యివేసి వారిస్తూ వెళ్ళిపోతుంటే)

**మదనిక :**

> **అక్కా! ఓ అక్కా!!**
> **పదవే, పద, పదవే**
> **లోకాన, నీలోన**
> **లేదే కాదారి**
> **ఈ దారే నీ దారి**
> **అక్కా! ఓ అక్కా!!**
> **మనసులలో మాటలలో**
> **తలుపులలో వలపులతో**
> **ఒకటై మీరొకటై**
> **అక్కా! ఓ అక్కా!!**

**(వసంతసేన ఒకవైపు మదనిక మరొకవైపు నిష్క్రమిస్తారు).**

# పదకొండో దృశ్యం

[శకారుడి జీర్ణోద్యానవనం – సంవాహకుడు బౌద్ధభిక్షువై సంఘారామంలో జీవిస్తూ ముసురుపట్టి గుడ్డలు మురికిపట్టడం వల్ల పుష్కకరండానికి వచ్చి స్నానంచేసి కాషాయశాటీ విదలించుకుంటూ నేలమీద ఏ పురుగును త్రొక్కి పాపం చేస్తానో అన్నట్లు భయపడుతూ అడుగులో అడుగు వేసుకుంటూ]

**భిక్షుకుడు :** 'నశ్యామి అహంభూ నశ్యతిలోకే, శ్రూయతాం ధర్మ' – అయ్యో! అయ్యో!! రాజశ్యాలకుడు, సంస్థానకుడు. భగవన్ బుద్ధదేవా?

**శకారుడు :** (వెనుక నుంచి వచ్చి పట్టుకొని) ఓరి దొంగసన్యాసీ! నిలు, అక్కడ! లేకపోతే కల్లంగడిలో ముల్లంగిదుంపలా నీ తల చితుక కొడతాను.

**భిక్షుకుడు :** స్వాగతము ఉపాసకా!

**శకారుడు :** ఏమిటీ?... పాసకా! సంస్థానకుణ్ణి, రాజశ్యాలకుణ్ణి, శకారమహా రాజును, పాసకా అంటానికి నీకెంత ఒళ్లు చియ్యబట్టిందిరా?

**భిక్షుకుడు :** 'బుద్ధోపాసకా' అని నిన్ను నుతిస్తున్నాను. నిందించటం లేదు.

**శకారుడు :** (సగర్వంగా) అయితే నుతించు, నుతించు.

**భిక్షుకుడు :** నీవు పుణ్యుడవు, ధన్యుడవు.

**శకారుడు :** నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావు?

**భిక్షుకుడు :** ఈ కాషాయాంబరం కడుక్కోటానికి.

**శకారుడు :** ఆఁ ఏమి ధైర్యం! ఈ పుష్పకరండం నాది. దీన్ని మా బావగారు నాకిచ్చారు. ఉత్తమ భూలోకనిత్యకళ్యాణ మానవుణ్ణి నేనే ఈ మడుగులో స్నానం చెయ్యను. మురిగిన ముల్లంగి దుంపవాసన కొట్టే నీ మురికిగుడ్డ ఇందులో ముంచావా, ఒక్క తాపు తన్నేవాళ్ళు లేక?

**భిక్షుకుడు :** అయ్యా! నేను కొత్త సన్యాసిని.

**శకారుడు :** అలా చెప్పు. పుట్టినప్పటినుంచీ నీవు సన్యాసివి కావా?

**భిక్షుకుడు :** (భయంతో) అహఁ

**శకారుడు :** ఎందుకు కాలేదో చెప్పు – లేకపోతే –

**భిక్షుకుడు :** తథాగతా! తథాగతా!!

**శకారుడు :** నిన్ను బయటికి వెళ్ళనీయను. ఇక్కడ నీ పంచప్రాణాలూ అన్నుపట్టి పోవలసిందే.

**భిక్షుకుడు :** తథాగతా! బుద్ధభగవాన్!–

**శకారుడు :** కానీ – ఒక పనిచేస్తే నిన్ను కనికరించి ఒదిలిపెడతాను. ఇదిగో ఆ సరస్సులో నీళ్ళను నీవు నీ చిల్లుల శాటీలో మూటకట్టి అందులో పిండిన బురదలో దానిని ఉతికితే –

**భిక్షుకుడు :** (ఆలోచించి) అలాగే – మూర్ఖమహేంద్రా!

**శకారుడు :** మూర్ఖమహేంద్రా!!

**కుంభీలకుడి గొంతు :** (తెరలో) బావా! బావా!!

**శకారుడు :** ఆఁ. బావ బండితో అప్పుడే వచ్చేశాడా?

**కుంభీలకుడు :** (దగ్గిరకు వచ్చి బెట్టుగా చేతులు కట్టుకొని నిలబడతాడు)

**శకారుడు :** బావా! సన్యాసి దీవించిన దానిలో (మూర్ఖ శబ్దాన్ని వదిలేసి) మహేంద్రా అంటే ఏమిటి?

**కుంభీలకుడు :** 'దేవేంద్రా' అని.

**శకారుడు :** (భిక్షుకుడి దగ్గరికి వచ్చి) ప్రభో! – అలా మళ్ళీ ఒకమాటు దీవించండి. నా పుష్కరిణికి వచ్చి నిత్యమూ మీ గుడ్డ తడుపుకొండి. నేను మీ శిష్యుణ్ణి. మీ దీవెనవల్ల నేనే దేవేంద్రుడనైతే (చంకలు కొడుతూ) ఆర్యకుడు సిద్ధుల దీవనలవల్ల రాజౌతాడని భయపడుతూ ఉన్న మా బావగారు నన్ను చూచి ఇంకా భయపడతాడు. భయపడాలి! హిఁ హిఁ హిఁ ప్రభో! హిఁ హిఁ హిఁ.

**భిక్షుకుడు :** (సవినయంగా శకారుడు దారిచూపిస్తుంటే నిష్క్రమిస్తాడు).

**శకారుడు :** బావా! బండి తీసుకో రమ్మంటినే – బండి ఏదీ? నాగరకుణ్ణి నడిచిపోలేను.

**కుంభీలకుడు :** అదుగో! దూరంగా!! అటుచూడు!!

**శకారుడు :** (అతి సంతోషంతో) బలే! బలే!! (ఇంతలో ఎద్దుల మెళ్లో గంటల చప్పుడు వినిపిస్తుంది. అది వినంగానే శకారుడు)

**బండిరాయ్, మనా బండిరా!**
**బండిరా, మనాయ్ బండిరా!!**
**ఉక్కు ఇనుమూ బండిరా**
**చక్కదనముల బండిరా**
**దిక్కులన్నీ ఏలుకొచ్చే**
**అక్కగల మా బండిరా, బండిరాయ్...**

**వానగాలికి వెరవదు,**
**పరసపిడుగుల సెదరదు,**
**పోతుమల్లే పోతు ఉంటే**
**కోతులన్నీ బెదరురా**
**బండిరాయ్, మనా బండిరా!!**
**బండిరా, మనాయ్ బండిరా!!**

**కుంభీలకుడు :** (మూడుసార్లు ఆపి ఆపి దీర్ఘమైన ఈలలు వేస్తాడు).

**శకారుడు :** (ఏదో రహస్యమున్నట్లుగా నటిస్తూ ఉన్న కుంభీలకుడితో) ఏదీ రహస్యం! పోనీలే – చెప్పవుకదూ?

**కుంభీలకుడు :** స్వస్థచిత్తుడిని కా బావా! తరువాత నీకొక మంచి రహస్యం చెప్తూతాను.

**శకారుడు :** ఆc – రహస్యమే – మంచి రాహస్యమే – (చిందులేస్తూ)

**రాహస్య మన ఆస్యమన**
**రాజులకు మెప్పూ!**
**రణ మన్న గుణ మన్న**
**రమణులకు ముప్పు రాహస్యమన...**

**సీతమ్మ చెవిలోన**
**చెప్పె రాభణుడూ**
**రామయ్య ఒడలెల్ల**
**రంగు రంగైపోయె!** **రాహస్యమన...**

(పెదిమలు విరుస్తూ యక్షగాన పద్ధతిలోకి దిగుతాడు) నేను గంధర్వుణ్ణి.

**కుంభీలకుడు :** గంధర్వుడ వేమిటోయ్! – వట్టి తెలివి తక్కువనబడటం, వాడి అమ్మ మొగుడివి.

**శకారుడు :** బావా! బండి ఇంకా దగ్గరికి రాలేదు. గిత్తలు తెగినవా! స్థావరకుడు విరిగెనా? తాళ్లు చచ్చెనా?

**కుంభీలకుడు :** (నవ్వుతూ కాదన్నట్లు తల ఊపబోతుంటే).

**శకారుడు :** మరి ఏమిటి?

**కుంభీలకుడు :** అదుగో మనబండి. ఒరే అక్కడ త్రిప్పి ఆపు –

**శకారుడు :** బావా! పుణ్యుడవు, గణ్యుడవు, ఆత్మసఖుడవు, ఆంతరంగిక మిత్రుడవు – కానీ నీవుపోయి ముందు బండి ఎక్కు.

**కుంభీలకుడు :** అలాగే (ఎక్కబోతాడు).

**శకారుడు :** (పోతూ ఉన్న వాడిని బుజంమీద చెయివేసి వెనకకు లాగి) నీ అబ్బసొమ్మా! మీ తాతసొమ్మా! బండి ఎవరిదనుకున్నావు? నేను సర్వజ్ఞుణ్ణి, సంస్థానకుణ్ణి, రాజశ్యాలకుణ్ణి. ఆగు, ఆగు – ఈ బండి నాది. నన్ను ముందెక్కనీ – కాదు, కాదులే. నీవే ఎక్కు. (మంచి చేసుకుంటూ) బావా! ఇందాక ఏదో రహస్యం చెపుతానన్నావు. ఏమిటది బావా?

**కుంభీలకుడు :** చెప్పటానికేమీ లేదు. కళ్ళార చూపిస్తాను.

**శకారుడు :** కళ్ళార చూపించటమే! హిఁ హిఁ హిఁ – ఈ కళ్ళారే – హిఁ హిఁ హిఁ. బావా! గొంతులోనా గుండెకొట్టాడుతాది. కొంచెం చెప్పుదూ, – ఇదిగో నేను నీ బావను కదూ?

**కుంభీలకుడు :** (చెవిలో బిగ్గరగా) వసంతసేన!

**శకారుడు :** వసంతసేనే! – ఏదీ?

**కుంభీలకుడు :** మన ఉద్యానవనంలో

**శకారుడు :** నాకోసమే –

**కుంభీలకుడు :** (నీకోసమే అన్నట్లు కన్నుముడుస్తూ సంజ్ఞ).

**శకారుడు :** త్వరగా రా బావా? వెళ్ళిపోయిందేమో – బావా! (మోడినడకలు నడుస్తూ).

**తుర్రుమన్నా పిట్ట**
**దోటికెక్కిందీ –**
**దోటిలోపల తానె**
**గూడు కట్టిందీ! తుర్రు...**

**బుర్రుమన్నా పిట్ట**
**బార కందిందీ**
**చిటికలోనే రాజు**
**గుటుకవేస్తాడు – తుర్రు...**

(రాజసంతో ఆజ్ఞాపిస్తూ) బావా! మన వర్ధమానుణ్ణి బండి ఆ కూలిపోయిన ప్రాకారం మీదుగా పోనిమ్మను.

నడు –

**కుంభీలకుడు :** బావా! కైపు బాగా తగ్గించుకోవాలి! (శకారుడు ముందు, వెనక కుంభీలకుడూ నిష్క్రమిస్తారు)

**(తెర)**

# పన్నెండో దృశ్యం

[శకారుని జీర్ణోద్యానం - వసంతసేన ఏకాంతంగా ఒకపూలమొక్క మీద వాలిన తుమ్మెదను నిశ్చలంగా చూస్తూ సాభిప్రాయంగా]

**తుమ్మెదవా!, తుమ్మెదవా!!**
**నమ్మరాని తుమ్మెదవా!**
**మనసిచ్చిన పాటలతో**
**మరులు కొల్పి మా కన్నెల**
**మధువానిన వెనుక నీవు**
**మరల మోము చూపింపవు - తుమ్మెదవా?**

**విలపింపకు లేయెదదల**
**విలపించెడు వేదనతో**
**విరహభార మెరుగక ఈ**
**విరుల మనసు దొరుకదు పో-**

**తుమ్మెదవా! తుమ్మెదవా!!**
**నమ్మరాని తుమ్మెదవా!**

(ఉద్విగ్న హృదయంతో) ఆర్య చారుదత్తా! ఏ ఉద్యానంలో కూర్చొని మీరూ కలలు కంటున్నారో! బండి తారుమారైంది, నా అదృష్టంతోపాటు, ఈ జీర్ణోద్యానం చేరుకున్నాను. మరుక్షణంలో ఏమి రాబోతున్నదో ఎరుగను. అయ్యో! ఆషాఢమేఘరాజు గర్జించి ఎంత చెప్పినా వినకుండా మూర్ఖం చేసి, ఆ మహాత్ముణ్ణి తిట్టిపోసి బయలుదేరివచ్చాను. ఈ అనుభవంకోసమే నేమో! (మరొకదిక్కుచూచి) తనకుసుమామోదాన్ని గ్రహించి ఆనందించి అనుభవింప జేసే మధుకర ప్రియుడు రాలేదు కాబోలు పాపం! ఈ జాజిపూవు తేనెకన్నీటి బొట్లు నేలరాల్చేస్తూ ఉన్నది. ప్రభూ! నీ ప్రియసుమము కూడా ఈ దురదృష్టానికే నోచుకున్నదా? (బిగ్గరగా) మహాభాగా! మహాభాగా!! ఇక్కడ నాకు దిక్కెవ్వరు?

**శకారుడు :** (వేగంగా ప్రవేశించి) ఆc ఆc. ఆగు, ఆగు నాకు దిక్కెవరు? వరపురుషుణ్ణి, వాసవుణ్ణి, మానవ వాసుదేవుణ్ణి నేనుండగా నీకీదుర్భర దురంతచింత ఏలనే తక్కోల తమాలనీలవేణీ!

**కుంభీలకుడు :** (వెనకనుంచి ప్రవేశిస్తూ) మహారాజా! తాము ఇంకా రాలేదనే మా చెల్లెలు భయపడుతున్నది. మీకోసమే మా చెల్లెలు వచ్చింది.

**శకారుడు :** బావా! నీ వల్లనే మా అదృష్టం పండి రాలిపోతున్నది. వెనక మీ చెల్లెలికి కోపం వచ్చేటట్లు ప్రవర్తించాను – కాదే ప్రసవశరసుమ కొదమకోమలవల్లీ! (విటుడితో) నీవు కొంచెం దూరంగా వెళ్లు – నేను కాస్త కాళ్ళమీద పడి ఆమెకు కనికరం కలిగేటట్లు కామతంత్రం జరపాలి. పక్కన పరపురుషుడుంటే పడుచువయసుది – ఉపపతి అంటే భర్త చెప్పిన మాట వినదు. ఉc. (వెళ్ళమని సంజ్ఞ చేస్తాడు)

**కుంభీలకుడు :** (వెళ్ళబోతుంటే)

**వసంతసేన :** (వినలేక చెవులు మూసుకొని సంభాషణ ఐనతరువాత గద్గద స్వరంతో) అన్నా! శరణు – నేను చిక్కులో పడ్డాను.

**కుంభీలకుడు :** అమ్మాయీ! నీకేమీ భయంలేదు. (అని వెళ్ళిపోయి ప్రక్కన నిలుచుంటాడు)

**శకారుడు :** (కాళ్ళమీద వాలుతూ) వసంతసేనా! మనోహారిణీ!! నీవు చిక్కులో పడ్డావు నేను నా సమస్తసామంతమణిగణకోటీరమైన నా శిరస్సుతో నీ పాదాబ్జాలమీద పడుతున్నాను. సమస్త దుర్నయాలూ క్షమించి నన్నేలుకోవే గోరోజనాతిలక పాటల ఫాలదేశా! అర్చితరతీశా!!

**వసంతసేన :** (వారిస్తూ) ఛీ! మూర్ఖుడా!! – నేను నీకోసం రాలేదు.

**శకారుడు :** మూర్ఖుడా! (అతికోపంతో) 'మూర్ఖీ'! – బావా! (కుంభీలకుడు నెమ్మదిగా ప్రవేశిస్తాడు) బావా! నిన్ను చూచి మీ చెల్లెలిని సహించాను. చూస్తున్నావా, నాకు ఎంతలో ఎంతెంత కోపం తెప్పిస్తున్నదో! – నా ఉద్యాన వనానికి వచ్చి నాకింత కోపం తెప్పిస్తుందా? ఒప్పించు మీ కోసమే వచ్చానని చెప్పించు. (దగ్గిరకు పోతాడు)

**వసంతసేన :** (కోపంతో) నడు. అవతలికి.

**శకారుడు :** బావా! ఇక దీన్ని ఊరుకోను. జడపట్టి జటాయువు, వాలి పెళ్లాన్ని పెళ్ళాడినట్లు...

**కుంభీలకుడు :** (కఠినంగా) మీకోసం రాని స్త్రీని బలాత్కరించటం ప్రభువులైన మీబోటివారికి పద్ధతి కాదు.

**శకారుడు :** (వికటంగా నవ్వి) పడతుల విషయంలో ప్రభువేమిటోయ్! ఒక తడవ వాత్స్యాయనంలో పారదారాధికరణం చదువు.

**కుంభీలకుడు :** (మైత్రిగా దగ్గిరకుపోయి) మనం ఈ వెన్నెట్లో అసలైన కథలు చెప్పుకుంటూ కాలినడకన పట్టణంలోకి వెళ్ళిపోదాము.

**శకారుడు :** అయితే స్థావరకుణ్ణి బండి తోలుకోరమ్మని చెప్పు. – స్థావరకా! నీ గుండెలు తోడుతాను. తోలుకోరావద్దు. (మతిమార్చి) నేను దేవతల ముందరా, బ్రాహ్మణుల ముందరా బండి ఎక్కకుండా రాను. రథమెక్కిపోతుంటే రాజశ్యాలకులని జనం చెప్పుకోవాలి సుమా!

**కుంభీలకుడు :** పోనీ బండిలోనే వెళ్ళిపోదాం.

**శకారుడు :** (వసంతసేనను చూచి) నేను ఇప్పుడు రాను. నీవు బండి ఎక్కి వెళ్లు.

**కుంభీలకుడు :** అయితే మీతో సావాసం చెల్లు.

**శకారుడు :** ఊఁ

**కుంభీలకుడు :** (ప్రక్కకు తొలిగి ఆలోచిస్తుంటాడు)

**శకారుడు :** ప్రియా! ఇంతీ, వాసంతీ, ఓ వసంతకర సరోజ సేమంతీ!

(బాగా దగ్గరకు వచ్చేస్తాడు).

**వసంతసేన :** అన్నా! అన్నా!! (అని భయంతో కుంభీలకుడి వైపు చూస్తుంది) నీకేమైనా దెయ్యం పట్టిందా. నీకు నేను అక్కను గదరా?

**శకారుడు :** (కోపంతో) మహారాణి మా అక్కగారితో నా, నీకు ఒంతు. చూడు నిన్నేం చేస్తానో.

**కుంభీలకుడు :** బావా! బండి సిద్ధం చేయించాను.

**శకారుడు :** బావా! నీకు కుచ్చుల జరీ అంచు ఉత్తరీయం కావాలా? నాతోపాటు వేడి వేడి ఐణమాంసం తినటమంటే ఇష్టమేనా?

**కుంభీలకుడు :** అయితే!

**శకారుడు :** (కత్తి అందిస్తూ) దీన్ని చంపు.

**కుంభీలకుడు :** (చెవులు మూసుకుంటాడు).

**శకారుడు :** ఈ ఉద్యానవనంలో చంపితే నిన్నెవరూ చూడరు.

**కుంభీలకుడు :** చంద్రుడూ, నక్షత్రాలూ, వనదేవతా చూస్తూనే ఉన్నారు.

**శకారుడు :** (పై ఉత్తరీయం అందిస్తూ) ఇదిగో దీన్ని చాటుచేసి చంపు. బంగారు కడియాలు బహూమానమిస్తాను – చంపవా?

**కుంభీలకుడు :** ఉఁః

**శకారుడు :** నిన్ను కూడా (పైకి దూకపోతే).

**కుంభీలకుడు :** ఓయి, బాబో! (పారిపోతాడు).

**శకారుడు :** వసంతసేనా! నీకు కావలసినన్ని నగలు చేయిస్తాను మేడలు కట్టిస్తాను.

**వసంతసేన :** పూర్వమే బుద్ధి ఒక సహకారాన్ని ఆశ్రయించింది. ఇక పలాశాల మీదికి పోదు.

**శకారుడు :** ఆ దరిద్రచారుదత్తుడు నీకు సహకారమా! నేను పలాశమా! – వాడినే స్మరించు.

**వసంతసేన :** సర్వదా ఆ మహానుభావుడు నా హృదయంలోనే ఉన్నాడు.

**శకారుడు :** అయితే నన్ను ప్రేమించవా?

**వసంతసేన :** ప్రేమించలేను!

**శకారుడు :** ఒకటి – రెండు – మూడు.

**వసంతసేన :** (మౌనంగా ఊరుకుంటుంది).

**శకారుడు :** (వెళ్ళి పీక పట్టుకుంటాడు)

**వసంతసేన :** మహానుభావా! చారుదత్తా!!

**శకారుడు :** ఇప్పటికైనా నన్ను ప్రేమించు.

**వసంతసేన :** చారుదత్తా! –

**శకారుడు :** (పీక నులుముతాడు)

**వసంతసేన :** చారు... దత్తా (మూర్ఛపోతుంది)

**శకారుడు :** (చేతులతో ఎండుటాకులదాకా తీసుకోపోయి కప్పి గుటకలు వేస్తూ చేతులు దులుపుకుంటూ) ఉడతను మింగిన పిల్లిలాగా ఉప్పిడిచప్పిడి లేకుండా బావ మళ్ళీ వచ్చేటప్పటికి వెళ్ళిపోతాను. (కూనిరాగంతో).

> **"రాధమ్మ మాటవిని**
> **రంభ చెడిపోయింది**
> **రామయ్య కైపోయె**
> **లంకకాపురము"      రాధమ్మ....**

**కుంభీలకుడు :** (ప్రవేశించి) బావా! వసంతసేన ఏదీ?

**శకారుడు :** ఏదీ? తప్పించుకోపోయింది.

**కుంభీలకుడు :** (అనుమానంతో) నిజం చెప్పు.

**శకారుడు :** (నవ్వుతూ) చంపేశాను బావా! (చూపిస్తాడు).

**కుంభీలకుడు :** (నిర్ఘాంతపోతాడు).

**శకారుడు :** నాకేం భయం! ఇది చారుదత్తుడి ఇంట్లో నగలు దాచిపెట్టింది. అవి కాజెయ్యటానికి అతడే ఈమెను చంపాడని అపవాదు కల్పిస్తాను.

**కుంభీలకుడు :** ఒక పాపానికి మరొక పాపమా! – అంతా నేను వెళ్ళి అధికరణకులకు చెపుతాను.

**శకారుడు :** నాకేం భయం. చెప్పుకో. తాడూ బొంగరం లేని నీ మాటలు ఎవరు వింటారు. చెప్పుకో – అంతగా అవసరమైతే అక్కగారితో చెప్పి, బావగారితో చెప్పించి, వాళ్ళ ఉద్యోగాలే ఊడబెరికిస్తాను. తెలిసిందా? జాగ్రత్త!

**కుంభీలకుడు :** ఏముంది – రెండు ఒదులుకుంటే సరి ప్రపంచంలో, మానం, అభిమానం – రాజ్యాలు జయించవచ్చు రాజులు కావచ్చు.

**శకారుడు :** (కోపంతో) ఛీ! అధిక ప్రసంగం చాలించు – (వసంతసేనవైపు చూచి సంతోషంతో) హఁ హఁ హఁ

**ఇద్దరు ఇల్లాండ్ర**
**ఏలేటి మగవాని**
**ఇబ్బంది చూడండయా : హఁ హఁ**
**ఇబ్బంది చూడండయా!**
**ముద్దుల గోపాల**
**బాలుని చిత్రమే**
**ప్రొద్దున పొల్పుగ**
**చూడండయా! ఇద్దరు....**

**పెద్దాలితో పోరు**
**వద్దు నా కంటాడు**
**రద్ది కిదే నాకు**
**పెద్ద యనుకొంటాడు ఇద్దరు....**

**ముద్దుల చిన్నది**
**బుద్ధిగల దంటాడు**
**ఇద్దరికి కాకుండ**
**ఇడిగానె ఉంటాడు ఇద్దరు....**

**(వెళ్ళిపోతుంటే)**

**కుంభీలకుడు :** (సకరుణంగా వసంతసేనను చూస్తూ దీనంగా నిలువబడతాడు).

**(ఇద్దరూ నిష్క్రమిస్తారు)**

# పదమూడో దృశ్యం

(న్యాయశాస్త్రానికి వెళ్ళే రాచబాట కూడలి)

**మైత్రేయుడు :** అమ్మాయీ! ఎక్కడనుంచి?

**రదనిక :** (చేతిలో పూలబుట్ట చూపిస్తూ) అక్కగారి పూజకు పూలు తీసుకొని వస్తున్నాను.

**మైత్రేయుడు :** చారుదత్తుడు ఇంటికి వచ్చాడా?

**రదనిక :** నేను బయలుదేరే వరకూ రాలేదు.

**మైత్రేయుడు :** నేనూ ఉదయం నుంచీ ఈ వీథినే కాచుకొని కూర్చున్నాను. దాని ఇంటికి కూడా చేరలేదు. రాత్రి రాలేదు. ఉదయం రాలేదు ఎక్కడికి పోయి ఉంటాడబ్బా? పోనీ, వర్ధమానకుడైనా వచ్చాడా?

**రదనిక :** రాలేదు.

**మైత్రేయుడు :** (యోచించి పెదిమె కొరికి) ఆ బులిబుచ్చి కాలబూచి అందంగా దొండపండులా ఉన్నాడని ఏ మందో పెట్టి ఇతగాణ్ణి ఏ ఊరో లేవదీసుకోపోలేదు కదా?

**రదనిక :** వసంతసేనేనా?

**మైత్రేయుడు :** (కోపంతో) ఆc, ఆ వసంతసేనే!

**రదనిక :** ఈ ఊళ్లో ఉంటేమటుకు ఆమె అనురాగానికి ఎవరు అడ్డువస్తారని. అయినా ఆమె చారుదత్తులవారిని ప్రేమించిన విషయం లోకవిఖ్యాతం అయిపోయింది కూడాను. అందుకనే మన రోహసేనుడికి బంగారుబండి చేయించుకోమని హారాలు కూడా ఇచ్చింది.

**మైత్రేయుడు :** ఇచ్చింది. చారుదత్తుడు ఎలాగూ ఉంచుకోడని తెలిసి యిచ్చింది. అతగాణ్ణి మనకు లేకుండా చేయటానికి లంచం పోసింది. లేకపోతే చారుదత్తుడేమైనట్లు? వర్ధమానకు డేమైనట్లు? బండేమైనట్లు? ఎడ్లేమైనట్లు?

**రదనిక :** బాబయ్యా! ఇందాక నేను పూలకు వెళ్ళుతుండగా బండి ఎక్కి ఆర్యకుడు తప్పించుకోపోయినాడనీ అతణ్ణి పట్టి యిచ్చినవాళ్లకి నాల్గువందల వరహాలు బహుమానమనీ దండోరా వినిపించింది.

**మైత్రేయుడు :** అయితే –

**రదనిక :** మన వర్ధమానుడే ఆర్యకుణ్ణి బండిలో ఎక్కించుకొని ఒప్పించటానికి వెళ్ళి ఉంటాడు.

**మైత్రేయుడు :** ఓసి వెర్రిదానా! అయితే మన చారుదత్తుడేడి మరి?

**రదనిక :** వారూ ఆర్యకుడికి సాయం చెయ్యటానికి వెళ్ళి ఉంటారు.

**మైత్రేయుడు :** ఆ నెత్తిమీది కులదేవత వసంతసేనతో కూడానేనా?

**రదనిక :** ఆమె ఇంటికి వచ్చి ఉంటుంది.

**మైత్రేయుడు :** ఇందాకటివరకూ అది కొంపకు చేరుకోలేదు. ఇదుగో మళ్ళీ వెళ్ళుతున్నాను. ఇందాక నీవన్న నగలు – రోహసేనుడికి బంగారుబండి చేయించుకోమని ఇచ్చినవి – దానికి వెంటనే చేర్చమని వెళ్లేటప్పుడు నాకో పని కూడా పెట్టి వెళ్ళాడు. ఎన్ని తడవలని పోయేది, ఆ పాడుకొంపకు. ఇందాకనే దాని తల్లి మండిపడ్డది.

**రదనిక :** ఎందుకని?

**మైత్రేయుడు :** ఎందుకనేమిటి? మన ఖర్మం బాగుండలేదని. చారుదత్తుడే దాని పిల్లను చెడగొట్టాడట, చెప్పుచ్చుకొని నాలుగుపళ్లూ రాలగొట్టేవాళ్లు లేక – నాలుగు డబ్బులు సంపాదించుకోకుండా నలుగురు బంధువుల నోట్లో దాన్ని నగుబాట్లు చేస్తున్నాడట! వసంతసేనకు శకారయ్యంటే గిట్టకుండా చేసిందా చారుదత్తుడేనట!

**రదనిక :** చాలు! చాలు!!

**మైత్రేయుడు :** ఒక మాటా! ఒక పలుకా! అప్రాచ్యపు ముండ – ఇంతకూ మన బంగారం మంచిదయితే కంసాలి ఏమి చేస్తాడు?

**రదనిక :** (వ్రేలితో చూపిస్తూ) అదుగో – బాబయ్యా! ఆ మనుష్యుల మధ్య నడిచేది చారుదత్తయ్యగారే – ఆ! పెద్దబాబయ్యగారే!

**మైత్రేయుడు :** అవును నిజమే. (చత్వారమున్నట్లుగా పరిశీలించి) ఆc. అతగాడే – అటూ ఇటూ ఉన్నది రక్షాధికారులే! – ఆc అధికరణమంటపానికే.

**రదనిక :** అధికరణమంటపానికా?

**మైత్రేయుడు :** అమ్మాయీ! నీవేమీ భయపడకు – ఏదో నెత్తిమీదికి తెచ్చిపెట్టుకున్నాడు. అతడేం చేస్తాడు. గ్రహచారం పెద్దమ్మ నెత్తిమీద ఎక్కి పాతచెప్పుతో పకాళించి తంతుంటే. నీవు ఇంటికి వెళ్లు. నేను సంగతేమిటో విచారించి వస్తాను. అక్కగారికి ఈ సంగతేమీ తెలియనీయకు.

**(నిష్క్రమిస్తాడు).**

**రదనిక :** (మైత్రేయుడు వెళ్ళిపోయిన దాకా చూచి నిష్క్రమిస్తుంది).

**(తెర)**

# పదునాల్గో దృశ్యం

(న్యాయస్థానము అధికరణకుడు, శోధనకుడూ, వారి వారి స్థానాలల్లో కూర్చోని ఉంటారు)

**అధికరణకుడు :** శకారయ్య! మదనిక!!

**శోధనకుడు :** శకారయ్య! శకారయ్య!! – మదనిక! మదనిక!!

(మదనిక ప్రవేశించి అటూ ఇటూ చూచి ఒకమూల నిలవబడుతుంది. శకారుడు న్యాయస్థానాన్ని నాలుగుదిక్కులూ వెర్రిగా పరిశీలిస్తుంటాడు).

**అధికరణకుడు :** శోధనకా! ఆయన ఎవరో కనుక్కో.

**శోధనకుడు :** ఎవరు మీరు?

**శకారుడు :** "ఎవరు మీరు" – అప్పుడే కళ్ళింత నెత్తికెక్కాయా? ఓరి మీ తస్సలుదియ్యా! (బింకంగా) శకారమహారాజును!

**అధికరణకుడు :** కోపించకండి మహారాజా! అలా అడగటం మా సంప్రదాయం. శోధనకా! మహారాజులుంగారికి ఆసనమిచ్చి మర్యాదచేయవోయ్!

**శకారుడు :** (శోధనకు డిచ్చిన ఆసనంమీద కూర్చొనబోతూ) అధికరణకా! మా వ్యవహారం చక్కగా చూడకపోతే మాఅక్కతో చెప్పి మా బావతో చెప్పించి మీ ఉద్యోగాలు ఊడబెరికిస్తాను, జాగ్రత్త!

**శోధనకుడు :** చిత్తం – చిత్తం – దయచేయండి.

**శకారుడు :** (కైపువల్ల త్రేణుస్తూ) ఈ నేలంతా నాదే. నా ఇష్టం వచ్చినచోట కూర్చుంటాను. ఇక్కడ కూర్చోనా? అక్కడ కూర్చోనా? (అధికరణకుడి దగ్గిరికిపోయి) నీవు లే ఇక్కడ కూర్చుంటాను. కాదులే. ఇక్కడే కూర్చుంటాను.

**అధికరణకుడు :** (శకారకుడి కోసం వేసిన ఆసనంమీద కూర్చుంటూ) శోధనకా! కార్యార్థిని చెప్పుకో మను.

**శోధనకుడు :** (శకారుడితో) అయ్యా! మీరు చేసే నింద ఏమిటో చెప్పుకోండి.

**శకారుడు :** మా బావగారు నాకు క్రీడించటానికి ఉద్యానవనాల్లో కల్లా శిరోభూషణ మీ పుష్పకరందోద్యానమిచ్చారు. నేను ప్రతిదినం అక్కడ చెట్టు ఎండబెడుతాను. చివుళ్ళు తెంచుతాను.

**అధికరణకుడు :** అయితే ముఖ్యాంశ మేమిటో త్వరగా బయటపెట్టండి.

**శకారుడు :** నాకు అక్కడ ఈ దినం... ఒక స్త్రీ... శవం... ఒకటి... కనిపించింది. అఁ హఁ హఁ... కనిపించలేదు.

**అధికరణకుడు :** ఆ స్త్రీ ఎవరో మీకు తెలుసా?

**శకారుడు :** హఁ హఁ హఁ (వెర్రిగానవ్వి) నాకు తెలియకపోవటమేమిటి? ఒళ్ళంతా బంగారంతో ఒయ్యారపు నడకలు నడిచే నా స్త్రీని నేనెరగనా? బలే ప్రశ్న వేశావు మొత్తానికి?

**అధికరణకుడు :** అయితే ఆమె మీకేమౌతుంది?

**శకారుడు :** ఏమౌతుందేమిటి? నా స్త్రీ.

**అధికరణకుడు :** అయితే మీ స్త్రీని ఎవరు చంపారని మీ అనుమానం?

**శకారుడు :** దుర్మార్గుడు చారుదత్తుడి ఇంట్లో ఆమె పూర్వం కొన్ని నగలు దాచమన్నది. వాటిని అపహరించటానికి ఆమెను చంపాడు. ఆ పాపం మెడకు చుట్టటానికిని నా జీర్ణోద్యానంలో పారేశాడు.

**అధికరణకుడు :** అయితే ఎవరు చంపారని మీ అనుమానం?

**శకారుడు :** "నేను కాదు"

**అధికరణకుడు :** "నేనుకాదు" (అని ఉచ్చరిస్తూ తాళపత్రం మీద వ్రాసుకుంటాడు)

**శకారుడు :** అధికరణకా! దీనికే ఇంత (ఎక్కిళ్ళు) అల్లట తల్లటైపోతున్నావేం? ఎవరో చంపితే చూచానని వ్రాసుకో.

**అధికరణకుడు :** చారుదత్తుడు చంపాడని మీకు ఎలా తెలిసింది?

**శకారుడు :** మెడ వాచింది. ఆభరణాలు లేవు.

**అధికరణకుడు :** అంతమాత్రాన చారుదత్తయ్య దోషియని నిశ్చయించటానికి వీలులేదు.

**శకారుడు :** నిన్నటి సాయంత్రం నా ప్రియురాలు, మదనికతో చారుదత్తుని ఇంటికెళ్ళింది. తరువాత దానికీ స్థితి పట్టింది.

**అధికరణకుడు :** మీ ప్రియురాలు వారి ఇంటికి ఎందుకు వెళ్ళిందని మీ అభిప్రాయం?

**శకారుడు :** సంగీతం నేర్చుకోటానికి – అది మీకు అనవసరమైన ప్రశ్న.

**అధికరణకుడు :** శోధనకా! – మదనిక.

**శోధనకుడు :** మదనికా?... కొంచెం ముందుకు.

**మదనిక :** (కొంచెం ముందుకు వచ్చి నిలబడుతుంది).

**అధికరణకుడు :** అమ్మాయీ! శకారయ్యగారు చెప్పేమాటలన్నీ నిజమేనా?

**మదనిక :** ఆర్యచారుదత్తులు పిలుచుకోరమ్మన్నారని ఉద్యానవనానికి మా అక్కను వర్ధమానకుడు బండి ఎక్కించుకోవెళ్ళాడు.

**అధికరణకుడు :** మీ అక్కను చారుదత్తయ్య హత్య చేశాడని నీవు నమ్ముతావా?

**మదనిక :** ఆమెమీద అంతటి అనురాగం ఉన్నవాళ్ళు ఈ ఉజ్జయనీ పట్టణంలో మరెవ్వరూ లేరు.

**అధికరణకుడు :** శకారయ్యా! వింటున్నావా? దీనికి నీవేమంటావు?

**శకారుడు :** అది చిన్నపిల్ల. దానికేం తెలుసు, దాని మొఘం. ఆ మాటలు నమ్మవద్దు. చారుదత్తుడే చంపాడు.

**అధికరణకుడు :** శోధనకా! చారుదత్తయ్య.

**శోధనకుడు :** చారుదత్తయ్యా! చారుదత్తయ్యా!!

(ఇద్దరు రక్షకభటులు తీసుకోవచ్చి నిలవబెడితే చారుదత్తుడు వచ్చి తలవంచుకొని నిలవబడతాడు)

**శకారుడు :** (కోపంతో) ఓరి స్త్రీఘాతుకా! నీ మొఘం చూడకూడదు. పంచమహాపాతకాలూ చుట్టుకుంటవి.

**అధికరణకుడు:** చారుదత్తయ్య వారికి ఒక ఆసనమీయరా!

**శోధనకుడు :** ఇటు దయచెయ్యండి.

**చారుదత్తుడు :** (అధికరణకునికి నమస్కరిస్తూ కూర్చుంటాడు)

**శకారుడు :** స్త్రీ ఘాతుకులకూడా ఆసనమిచ్చి గౌరవిస్తారా? కానియ్యండి, కానియ్యండి. మా బావగారికి తెలియకుండానే దేశంలో అధర్మం, అక్రమం, అన్యాయం నడుస్తూ ఉన్నది.

**అధికరణకుడు :** (శకారునితో) న్యాయస్థానంలో మీరు చాలా శాంతంగా ప్రవర్తించాలి. (చారుదత్తునితో) అయ్యా! మీకీ పట్టణంలో ఎవరైనా స్త్రీ స్నేహితులున్నారా?

**చారుదత్తుడు :** (సిగ్గుతో తలవంచుకుంటాడు)

**శకారుడు :** (అధికరణకునితో) సిగ్గు నటిస్తూ చేసిన పని కప్పి పుచ్చు తున్నాడు, జాగ్రత్తగా కనిపెట్టు.

**అధికరణకుడు :** ఆర్యా! ఇది వ్యవహారము. సిగ్గుతో ప్రయోజనం లేదు.

**శకారుడు :** (గర్విపోతుగా) అందులో వ్యవహారం నాతో రాజశ్యాలకులతో – జాగ్రత్త!

**చారుదత్తుడు :** మీతో వ్యవహారం దుస్సాహసమే.

**శకారుడు :** రత్నహారాలకు ఆశపడి రాణిలాంటి నా ప్రియను గొంతు పిసికి జీర్ణోద్యానంలో పారేస్తావుట్రా!

**చారుదత్తుడు :** అసంబద్ధాలాడకు.

**అధికరణకుడు :** అయితే, ఇప్పుడు ఆమె ఎక్కడ యున్నది?

**చారుదత్తుడు :** నా కేమీ తెలియదు.

**శకారుడు :** అదీ సంగతి, అలా బయటపడు.

**మదనిక :** అయ్యా! నాదొక మనవి. చారుదత్తులవారు రత్నహారాలకు ఆశపడేవారనటం అసంబద్ధం. ఒకప్పుడు వారింట్లో దాచిపెట్టిన హారం దొంగలెత్తుకుపోతే దానికి బదులుగా మా అక్కకు రత్నహారమిచ్చారు.

**అధికరణకుడు :** ఇష్! (చారుదత్తునితో) అయ్యా నిన్న సాయంత్రం వసంతసేన మీ ఇంటినుంచి నడిచివెళ్ళిందా? లేక బండిలో వెళ్ళిందా?

**చారుదత్తుడు :** నేను ఇంట్లో ఉన్నంతవరకు ఎక్కడికీ వెళ్ళలేదు. తరువాత ఏమి జరిగిందో నాకు తెలియదు.

**అధికరణకుడు :** ఆమెను ఎవరో హత్యచేసి జీర్ణోద్యానంలో పారేశారన్న సంగతైనా తెలుసునా?

**చారుదత్తుడు :** ప్రియా! వసంతసేనా!

(*) లేత వెన్నెలలకు సొగసీయ నేర్చిన దంతకాంతితో, మావిచిగుళ్ల విలాసాలతో ఒప్పే కావిమోవితో ఇంపెసలారిన నీ ముఖకాంతిని త్రాగి నేడేరీతిగా ఈ అపకీర్తి విషాన్ని క్రోలగలనో కదా!

**శకారుడు :** ఇంత రభసెందుకు? – హత్య చేశానని అంగీకరించు.

(అధికరణకునితో) ఇంకా అనుమాన మేమిటయ్యా!

**చారుదత్తుడు :** నా దారిద్ర్యలక్షణాలల్లో ఇదీ ఒకటి? తేనెలో మాగిపోతూ ఉన్న పూలమీదికి తుమ్మెదపిండ్లు బారులు కట్టి వచ్చేటట్లు ఆపత్కాలంలో లోపాలు అనంతంగా నన్నావరిస్తున్నవి.

**అధికరణకుడు :** చారుదత్తయ్యా! సత్యమేమిటో త్వరగా బయటపెట్టండి.

**శకారుడు :** వ్యవహార విషయంలో మీకింత పక్షపాతం పనికిరాదు. ఒకవంక హత్య చేశాడని స్వచ్ఛంగా నిరూపితమౌతుంటే ఇంకా ఏమిటా గ్రుచ్చి గ్రుచ్చి అడగటం – ఉఁ. తీర్పు చెప్పండి – ఇంకా ఆ స్త్రీ ఘాతుకుడికి ఆసనమిచ్చి గౌరవించటమెందుకు? లెమ్మన రేం?

**చారుదత్తుడు :** (ఆసనం మీదనుంచి లేచి నిలువబడతాడు).

**శకారుడు :** హిఁ హిఁ హిఁ – (అతను వదిలిన చోటు ఆక్రమించి) చారుదత్తా! నేనే చంపానని నీ నోటిమీదుగా ఒకమాటు –

**మైత్రేయుడు :** (హఠాత్తుగా ప్రవేశించి) చారుదత్తా! చారుదత్తా!! నిన్నిక్కడికి రప్పించినదెవరు? కారణం?

**చారుదత్తుడు :** నా విధి! (శకారుణ్ణి చూపిస్తూ) ఇతడు ఉపాదానకారణం. మైత్రేయా (చెవిలో ఏదో చెపుతాడు).

**మైత్రేయుడు :** ఓరి బ్రహ్మిష్ఠో బ్రహ్మిష్ఠి! చారుదత్తుడిమీద నిందారోపణ చేసి న్యాయస్థానానికి రప్పించావట్రా? ఎన్నడైనా అతడు ఇలా వచ్చాడా? కులట లిచ్చిన సొమ్ములు పెట్టుకొని కులికే కోతీ! ఏమన్నావో నాముందు చెప్పు – నీ బుద్ధిలా కుటిలంగా ఉన్న ఇదిగో (చూపిస్తూ) ఈ కర్రతో –

**శకారుడు :** ఆయ్! – వ్యవహారం నాకూ చారుదత్తయ్యకూ మధ్య నీవెవడివిరా, బ్రాహ్మణార్థాలు చేసి బ్రతికే బడుగా! పిండాలు పీక్కోతినే పీనుగా!!

**మైత్రేయుడు :** ఏదీ ఆ మాట మళ్ళీ అను. పాదరక్షాప్రహారాలు – (చెయ్యి ఎత్తగానే చంకలో నగలు నేలమీద పడతవి)

**శకారుడు :** అవిగో – మా వసంతసేన నగలు. ఈ పాపిష్ఠిసొమ్ము కోసమే (చారుదత్తుణ్ణి చూపిస్తూ) ఈ పాతకి దాని గొంతు పిసికి పారేశాడు!

**మైత్రేయుడు :** ఆc – ఆc అన్యాయం. చారుదత్తా, సత్యమేమిటో ఎందుకు బయటపెట్టవు?

**చారుదత్తుడు :** మైత్రేయా! సత్యాసత్యలు ఈ అధికరణకులూ, ఈ రాజులూ పరిశీలించలేరు నా జీవితసర్వస్వం అయిన వసంతసేన లేని తరువాత నేను మాత్రం జీవించటమెందుకు?

**మైత్రేయుడు :** అదేమి మాట! రోహసేనుణ్ణి ఏం చేశావు.

**అధికరణకుడు :** (మదనికతో మైత్రేయుడి ఒంటినుండి జారిన నగలు చూపిస్తూ) అమ్మాయీ! ఈ నగలు మీ అక్కవౌనో కాదో పరిశీలించి చెప్పు.

**మదనిక :** ఆ నగలవంటివే కాని, అవి కావు.

**మైత్రేయుడు :** రెంటినీ చేసిన వాడు ఒకడై ఉంటాడు.

**అధికరణకుడు :** చారుదత్తయ్య దోషి అని నిశ్చయించటానికి ప్రబల నిదర్శనం కనబడుతున్నది.

**చారుదత్తుడు :** దోషమేమిటో ఎరుగని వంశంలో పుట్టాను. మీరు నిశ్చయించుకున్న తరువాత పరమాత్ముని దృష్టిలో నేను దోషిని కాకపోయినా లోకదృష్ట్యా దోషినే ఇన్ని మాటలెందుకు కాని –

(*) పరము ఒకటున్నదనే భయభావం లేకుండా పాపబుద్ధినై తరుణిని, దర్పకుని జన్మభూమిని, రతికైనా వందనం చేయదగినదాన్ని... నేను... అబ్బా... ఏవిధంగా చెప్పగలను?

**శకారుడు :** ఏమున్నది చెప్పటానికి – "చంపాను" – ఈమాట నీవు కూడా ఒక్కమాటు నీ నోటితో చెప్పు.

**చారుదత్తుడు :** (మాట్లాడడు).

**అధికరణకుడు :** చారుదత్తయ్య దోషి అని నిరూపిత మౌతున్నది కాబట్టి–

**శకారుడు :** కొరత వేయటమే శాస్త్రసమ్మతమైన శిక్ష.

అధికరణకులు : రాష్ట్రీయులు చెప్పినదే శిక్ష.

**శకారుడు :** ఓరి గోహా! (ప్రవేశించిన తరువాత) వధ్యస్థానానికి నడిపించాలి.

(ఒక భటుడు ప్రవేశించి నమస్కారం చేస్తాడు. చారుదత్తుని చేతికి గొలుసులు బిగించి నడిపిస్తారు).

**(తెర)**

# పదిహేనో దృశ్యం

**చారుదత్తుడు :** ఏ అన్నెపున్నె మెరుగని నావంటివానికిదేనా నీవు విధించవలసిన శిక్ష! విధీ! నీకు హృదయం లేదు. నీది గుండెకాదు. కఠిన కర్కశ గండోపలము. ఆగర్భ శ్రీమంతుని ఇంట అనన్యభోగాలనుభవించిన ఓ శరీరమా, నీకెంత దుస్థితి సంప్రాప్తమైంది! ఈ రక్తగంధానులేపనంతో ధరాపరాగధూసరితమై...

**శోధనకుడు :** ఓరి గోహిగా! అటు చూడసే. ఆ జనాన్ని చూడు. అయ్యగారిని ఎలా శూలం మీదికి ఎక్కిస్తావో!

**గోహ :** ఏమో దొర. ఈ మందిలో గగ్గోలు చూస్తే నాకు చేతులు వొడికిపోతున్నవి దొరా!

**శోధనకుడు :** ఒరేయ్! ఒకమారు తలపైకెత్తి చూడు. మేడలమీద ఆడంగులు అయ్యగారిని ఎలా చూస్తున్నారో చూడు.

**చారుదత్తుడు :** (తలపైకెత్తి) కనిపడేసిన నాలుగోనాడే నా కన్నతల్లి కాటికిచేరినా కన్నబిడ్డల్లా నన్ను చూచుకున్న ఓ ఉజ్జయినీ జనకుల్లారా! మీ ముద్దుబిడ్డ ఇక మీకుండడు. మీ చారుదత్తుడు మీకు లేదు. చింతించి ప్రయోజనం లేదు. మీ కన్నీరు కడళ్ళై కెరటాల బరువులతో పరువెత్తినా, లోకాలు ముంచెత్తినా మీ బిడ్డను బ్రతికించుకోలేరు.

> **యంయం వాపి స్మరన్ భావం త్యజ**
> **త్యంతే కళేబరమ్**
> **తంతమేవైతి కౌంతేయా!**
> **సదా తద్భావ భావితః**

**శోధనకుడు :** గోహిగా, చారుదత్తయ్యను అక్కడ ఆగమను. ఇది ఘోషణస్థానం. ప్రజలందరికి ఒకమాటు అపచారమూ, శిక్షా రెంటిని గురించి చెప్పు.

**గోహ :** (తప్పెట మోగిస్తూ) ఓ అయ్యోయ్! ఇనండి. ఇనండి! ఈ చారుదత్తయ్య ఇనయదత్తయ్య మనుమడు, సాగరదత్తయ్య కొడుకు – ఇనండి. సాని ఇసంతశేనను

శకారయ్య ఇద్దానవనంలో దుడ్డుకాసపడి పీక నులిమేసి సంపిండు. సొమ్ముతో దొరికిండు. నేరం ఒప్పుకుండాడు. దొరగోరు చాత్రపెకా రంగా ఈయన గోరికి సూలమెక్కించమని సెలవిచ్చిండు. ఈ తప్పుకు వోర్రికైనా యిదే చాత్తి. తెలుసుకోండొహో, తెలుసుకోండి.

**చారుదత్తుడు :** చారుదత్తా! చారుదత్తా!! నీవెంత పరమ దౌర్భాగ్యుడివి. వేదఘోషలతో వివిధ పవిత్ర క్రతువులతో వన్నెకెక్కిన నీపరిపూతవంశానికి తీరనికళంకం తెచ్చి పెట్టావు. ప్రపితామహా, వినయదత్తా! – పితామహా, యజనదత్తా! – ఈ బ్రాహ్మణ బ్రువుడివల్ల మీ పుణ్యనామావళి ఈ ఘోషణ స్థానంలో ఈ రీతిగా వీరినోట పడవలసి వచ్చింది. మీమీ లోకాలల్లో మీ దీర్ఘతపస్సులకు ఈ నికృష్ట దుర్ఘటనలతో ఈ నీచుడు ఎంత అంతరాయం కల్పించాడు. శపించండి! మీ శాపోదకం వల్లనైనా వీడికి ఏ జన్మలోనో శాంతి కలుగుతుంది. శపించండి!!

**శోధనకుడు :** ఓరే గోహిగా! ఇంకా ఈ జనాన్ని ఎంతదూరం రానిస్తావురా? పంపించెయ్! అయ్యా మీరంతా ఇక యెంటరాకూడదు. వెళ్ళిపొండి.

**గోహ :** ఓ దొరల్లారో! (నమస్కరిస్తూ) పొండి. పొండి. కదలరేం.

**శోధనకుడు :** ఆఁ. కదలరేం (గోహాతో) ఎంతచెప్పినా కదలరేంరా? గోహిగా రక్షకభటులను రప్పిద్దామా ఏం?

**గోహ :** ఏం చేసేది దొరా? సావమన్నావా, ఏమిటి? పీక సినిగేట్లు ఎంత కొట్టుకున్నా పోకపోతే – మన ఎంటనే మంది శూలందాకా ఒచ్చారో (చారుదత్తుణ్ణి చూపిస్తూ) ఆ అయ్య సావెట్లున్నా మన సావు మూడిందే శకారయ్య సేతుల్లో.

**శోధనకుడు :** ఆలస్యమైతే మన కొంపమీదికి వస్తుంది.

**గోహ :** (చారుదత్తుణ్ణి చూపిస్తూ) అయ్యగారు చెప్పే ముక్కలు రెండూ సెపితే మంది ఎనక్కు పోతుంది దొరా? ఆయన్ను బతిమాలుకుందాం (చారుదత్తుడి దగ్గరకు పోయి) పెబో! మా పాణాలు దక్కించు. మా పెళ్ళాల తాడు తెగుద్ది. మందిని పంపించెయ్ దొరా! (చారుదత్తుడు రెండడుగులు వెనక్కు వేయగానే) దండాలు దొరా? దయగల అయ్యదొరా!

**చారుదత్తుడు :** (ప్రజలతో) అన్నలారా! నా దురదృష్టానికి మీరేం చేస్తారు? ఇది ఈ జన్మలో చేసుకొన్న పాపం కాదు. పురాకృతం. నా జీవితనావతో సౌఖ్యసముద్రాలలో

వ్యాపారం సాగించాను. అది నడిసముద్రములో అనుకోని కొండరాయికి కొట్టుకొని బ్రద్దలైపోతున్నది. అందులో మునిగిపోతూ ఉన్న నన్ను కనికరించి మటుకు మహానావికులు కాని మీరేం చేస్తారు? చింతించకండి. "యదన్వాత్ కురుతేపాపం తదన్వాత్ ప్రతిముచ్యతే" నామీది ప్రేమ నాచిట్టితండ్రి రోహసేనుడిమీద చూపించండి. మీ జీవితాలల్లో పవిత్రప్రేమకు భంగం కలిగించకండి (నమస్కరిస్తూ) ఇక తాము నాకు సెలవిప్పించండి. (జనం కదలరు) వెళ్ళరా! రాజాజ్ఞను వ్యతిక్రమించి అరాజకం చెయ్యటానికి పూనుకోకండి. ఆ అపకీర్తి నా కంట గట్టకండి. సెలవు. (జనం కదిలి మూకలు మూకలుగా వెళ్ళిపోయే కోలాహలం వినిపిస్తుంది)

**గోహ :** (శోధనకుడితో) దొరా! చారుదత్తయ్య బలే దొడ్డ అయ్యగదూ! ఆయన మాటంటే సూసినవ్ దొరా! మంది గొర్రెల మందలాగా టుర్రో అంటే టుర్రో.

**శోధనకుడు :** శకారయ్య వస్తాడేమోరా! – త్వరగా నడిపించు. కొంచెం తొందరపెట్టు.

**గోహ :** ఆయన ఇట్ట మెచ్చినంతసేపు నడవనీ దొరా! అయ్య పోదామంటే పోదాం, ఆగమంటే ఆగుదాం. బంగారమంటి అయ్య మళ్ళీ సూద్దామంటే మనకంటికి మాత్రం కనబడతాడా!

**చారుదత్తుడు :** (భ్రాంతితో) మదనికా! మదనికా! మరణసమయంలో మా వసంతసేన చారుదత్తుడి మనస్సులో ఉందో లేదో అని పరీక్ష చేయటానికి వచ్చావా? మనస్సులోనే కాదు. నాలోవున్న ప్రత్యణువులో మనసిజశిల్పి చిత్రించిన ద్వంద్వాతీత మనోజ్ఞమూర్తి, ఆ అమృతమూర్తి స్థిరంగా ఉంది సుస్థిరంగా ఉంది. మదనికా! నేను మాత్రం నిర్భాగ్యుణ్ణి, ప్రియా, వసంతసేనా!

(*) లేకపోతే ఆనంద రసకుంభవృష్టులు కురిసి నా హృదయక్షేత్రాన్ని సంతోషపెట్టటానికని నీవు రానే వచ్చినప్పుడు ఈ నూతనాకృతితో నన్ను భస్మీభూతుణ్ణి చేయటానికి ఈ మహాప్రళయం వస్తుందా!

(ఒక్కమాటు దీర్ఘ నిశ్వాసం చేసి గోహా, శోధనకులను చూచి) నాయన లారా! ఏదో భ్రాంతిలో పడ్డాను. మీ ఉద్యోగ ధర్మాలకు ఆలశ్యం చేశాను. క్షమించండి. ఇక నడవండి.

**గోహ :** చిత్తం దొరా?

(రెండడుగులు వేయగానే నాన్నా, చారుదత్తా, నాన్నా, చారుదత్తా అని మైత్రేయ, రోహసేనుల రోదన కంఠాలు వినిపిస్తవి).

**చారుదత్తుడు :** (వెనకకు తిరి) మైత్రేయా... రోహసేనా!! (మైత్రేయుడు రోహసేనుడు ప్రవేశిస్తారు)

**మైత్రేయుడు :** (కన్నీళ్ళతో) చారుదత్తా!

**చారుదత్తుడు :** మైత్రేయా! మైత్రేయా!! దుఃఖించి ప్రయోజనం? మనం దరిద్రులం. దరిద్రుల కిది కాని కాలం. ధనవంతుడెంత అభాజనుడైనా తల ఒగ్గిపోవటమే మనధర్మం. లేకపోతే – ధనంతో ఎంతపనైనా చేయగలుగుతాడు. నాయనా! రోహసేనా! (దగ్గరకు తీసుకొని) మైత్రేయుడు మామయ్యే నీకు సమస్తమూ. అమ్మ చెప్పినట్లు విను పెరిగి పెద్దవాడవై నీ తాతముత్తాతల పేరు నిలవబెట్టు నాయనా. ఇదిగో! (మెడలో జందెము తీసి)

తండ్రీ! (*) ఇది తుదకీ నీకీయటానికి దక్కింది. సంతోషించు. బ్రాహ్మణ బిడ్డవైన నీకిదే నగ. ఇది స్వర్ణహారం కాదు ముప్పేటలు ముత్తెపుసరం అంతకంటే కాదు. కానీ నీ తాతలు, తండ్రులు, దేవతలు దీనివల్లనే తృప్తు లౌతారు.

**రోహసేనుడు :** నీవు ఎక్కడికి నాన్నా!

**చారుదత్తుడు :** ఒక అభం శుభం ఎరుగవుగదా తండ్రీ! ఎక్కడికి వెళుతున్నానో చెప్పమన్నావా? తండ్రీ!

(*) మాసిన కీర్తితో, దయమాలిన శూలంతో, కంఠాన ఈ భాసుర రక్తమాలికతో,

దుఃఖాగ్నితో, పరేత భస్మసింహాసనాన్ని అధిష్ఠించి, ఆ యముడు ఏలుకునే యజ్ఞవాటికకు.

**గోహ :** ఓ సిన్నదొర! రాజుగారి ఆజ్ఞ స్మొశానానికి.

**శోధనకుడు :** మీ నాన్నగారిని చంపటానికి తీసుకొనిపోతున్నాము.

**రోహసేనుడు :** అబ్బీ – మా నాన్నగారిని ఒదిలిపెట్టి నన్ను తీసుకోపోండి. నేను వస్తాను.

**చారుదత్తుడు :** నాయనా! రోహసేనా!! ఇటురా తండ్రీ! (దగ్గిరికి తీసుకొని) ప్రేమామృతనిష్యందివంటి నీ మాటలు నా హృదయసాగర గర్భాన్ని కలిచేస్తున్నవి తండ్రీ!– (*) నీకు వేయేండ్ల ఆయువు కలుగుగాక! ఏది నాన్నా! ఇలారా! (కౌగిలించుకొని) ఈ దరిద్ర దేహానికి నీ కౌగిలి చందనలేప మైందోయ్. తండ్రీ! దీనికి ఏ ఔశీనరచర్చ కూడా తుల్యం కాలేదు.

(ముద్దు పెట్టుకోనాయనా అని ముద్దు పెట్టించుకుంటాడు) మైత్రేయా! నాయనా! నీవు మామ వెంట ఇంటికి వెళ్లు. అత్త మీకోసం దిగులు పడుతుంది. (గోహ శోధనకులతో) ఇక మీదే ఆలస్యం.

**శకారుడు :** (ప్రవేశించి) ఒరే ఏమిటిరా ఈ ఆలస్యము. అడుగులో అడుగు వేసుకుంటూ మీ అబ్బ చచ్చినట్లు (రోహసేనుణ్ణి తోసివేస్తూ) పద, అవతలికి.

**మైత్రేయుడు :** (ఎత్తుకొని) నాన్నగారికి నమస్కారం చెయ్యి నాయనా!

**చారుదత్తుడు :** (రోహసేనుడు నమస్కరిస్తే దీవిస్తాడు).

**శకారుడు :** ఒరేయ్, నేను వచ్చేటప్పటికల్లా అంతా పూర్తి చేయించండి. నా కంటిముందు పని జరగాలి. ఆఁ జాగ్రత్త.

**(నిష్క్రమిస్తాడు).**

**శోధనకుడు :** నడు, బాబూ! నడు. ఈ దుర్మార్గుడు ఏమైనా మా ప్రాణాలకు ముప్పు తెస్తాడు.

**గోహ :** ఓ దొరా! ఈ అయ్య దుండగం బలేమోపైంది.

**చారుదత్తుడు :** (నిట్టూర్పుతో) రామప్రభూ! రామప్రభో!!

(శోధనకుడూ, గోహాలు నడిపిస్తుంటే చారుదత్తుడు వెంట నడుస్తాడు.).

**(తెర)**

# పదహారో దృశ్యం

[శ్మశానభూమిలో ఉరికొయ్య అమర్చి ఉంటుంది. చారుదత్తుని శిరచ్ఛేదనానికి బలిపీఠం ఎక్కించుతారు.]

**శోధనకుడు :** అయ్యా! చారుదత్తయ్యా నీ కులదైవాన్ని స్మరించుకో.

**చారుదత్తుడు :** (స్మితం చేసి) కులదైవమా! దైవమంటూ ఒకడుంటే కదా కులదైవము దైవం మీద ఈ లోకానికి నమ్మకం లేదు. అయినా అనుక్షణం దైవాన్ని మరచిపోనూలేదు. దైవమొకడు లేదు – ఇదియథార్థము (*) ఆ దైవమే ఉంటే నీవు వధ్యుడవని ఈ కఠోరశిక్ష నా మీద విధించగలరా? దారుణమైన అపకీర్తి పంకిలం నన్ను ఆలమింది, విబుధాలయం నుంచి దిగివచ్చి నా ప్రియ దీన్ని క్షాళన చేయుగాక!

**శకారుడు :** (ఆతురతతో ప్రవేశించి) ఇంకా చూస్తారేం రా! డిండిమం మ్రోగించండి. ఒరేయ్ చారుదత్తా! తాటిపట్టి వంటి నీ నాలుకతో ఇప్పటికైనా సరే దేవుని ఎదుట ఒక్కమాటు వసంతసేనను చంపానని ఒప్పుకో. నీకు శిక్ష తగ్గే మార్గం ఆలోచిస్తాను.

**చారుదత్తుడు :** శిక్ష తగ్గుతుందని చేయని పని చేశానని ఎలా అంగీకరించేది?

**శకారుడు :** నీమీద కనికరం కలిగింది. శిక్ష తగ్గిద్దామని ఉద్దేశిస్తున్నా, లేకపోతే శూలారోహణమే రాజాజ్ఞ.

**చారుదత్తుడు :** దావానలంవంటి ఆపదలో దహనమై పోతున్నానని భయంలేదు. కానీ – లోకంలో నన్నంతగా ప్రేమించిన వసంతసేనను ప్రణయినిని ధనలోభంతో చంపాననే అపకీర్తి వ్యాపిస్తుంది కాబోలు. శరీరం కంపిస్తున్నది. కంపించి ఏం ప్రయోజనం? కర్తవ్యం?

**శకారుడు :** (నిష్కర్షగా) చంపానని ఒప్పుకోటం?

**చారుదత్తుడు :** అవును. నిజమే చంపానని ఒప్పుకోవటమే. లోకం దృష్టిలో చంపినట్లు స్థిరమైపోవటం నిశ్చయమైపోతున్న తరువాత అంగీకరించటానికి నాకు అభ్యంతరమెందుకు?

**శకారుడు :** ఒక్కమాటు నోటితో చంపానని అంటే...

**చారుదత్తుడు :** చంపాను. ఆపైన...

**శకారుడు :** క్రింద ఆకాశం పైన భూమి. శూలంక్రింద నువ్వు శూలంపైన నేను. హిఁ హిఁ హిఁ – చూస్తారేంరా, ఒప్పుకొన్న తర్వాత శూలమెక్కించక, చూస్తారేం రా?

**కుంభీలకుడు :** (నురగలు గక్కుతూ ప్రవేశించి) అయ్యా! ఆగండి. ఆగండి, ఆర్యచారుదత్తుడు నిర్దోషి – ఇదుగో రాజశాసనం!

**శకారుడు :** బావా! బాబూ! ఎవరు ఎవరిని చంపితేనేం? మనం ఇంటికిపోయి మంచి – కల్లు.

**కుంభీలకుడు :** ఛీ – వసంతసేనను చంపింది చాలక చారుదత్తుని వంటి పవిత్రమూర్తిని అన్యాయంగా శూలమెక్కిస్తావా?

ఇదిగో! రాజాజ్ఞ. శోధనకా! గోహా! శకారుణ్ణి శూలమెక్కించండి.

**శోధనకుడు :** (శాసనం చూస్తాడు)

**గోహ :** రా. అయ్యా రా. పెద్దమనిషివి.

**శకారుడు :** (ఆశ్చర్యంతో) నా ప్రియురాలిని నేను చంపానా! వీడు పచ్చి దొంగ – శోధనకా ఇది దొంగముద్ర! – దొంగపత్రం!! (తెరలో కుంభీలకుడు రాజముద్ర చిక్కించుకొన్నాడు. అతడు దొరికితే పట్టుకోవలసిందని రాజాజ్ఞ).

**శకారుడు :** చూస్తారేంరా, పట్టుకోండి.

**కుంభీలకుడు :** (చారుదత్తుడి కాళ్ళమీద పడి) తండ్రీ, నిన్ను రక్షించటానికి రాజముద్ర గూడా దొంగిలించాను. కానీ (కాళ్ళమీద పడతాడు).

**చారుదత్తుడు :** (శిరస్సు మీద చేయి ఉంచి).

(*) లే. కృపాళూ, లేవయ్యా! నేనీ రీతిగా మృత్యుముఖాన్ని చేరబోతుంటే నీ ప్రాణాలొడ్డి నన్నెందుకు రక్షింపబూనుకుంటావు. నీవే నాకు ఆప్తబంధుడివి. అయినా నీవు తలపెట్టిన ఈ ప్రాణరక్షాక్రియకు విధాత అడ్డుపడ్డాడు.

నాయనా, చింతించకు, నీకు శుభమగుగాక! (కుంభీలకుని లేవదీసి గోహ శోధనకులు పట్టుకుంటారు)

**శకారుడు :** ఒరేయ్! చావబొయ్యే సన్యాసి వాడి పాదాలు పట్టుకుంటే ఏముందిరా. ఇవిగో బంగారు పాదాలు పట్టుకో. క్షమిస్తాను. నీకు ఇప్పటికైనా చెప్పి రాజపౌరోహిత్యమిప్పిస్తాను.

**కుంభీలకుడు :** ఆర్యకుడే రాజైతే మీ బావగారి కొకటుంటే గదా! తా దూరను లేదుగాని మెళ్ళో ఒక డోలుట!

**శకారుడు :** ఆఁ. ఒరేయ్ఁ – నేను చారుదత్తుడి చావుచూచి గాని వెళ్ళను. వీడిని వెంట తీసుకోపోయి నా కత్తితో ముక్కలు ముక్కలు చేసి నేను తినేటట్టుగా రాజశాసనం పుట్టించాలి. త్వరగా కానివ్వండి.

**శోధనకుడు :** (చారుదత్తునితో) ఆర్యా! శూలానికి నమస్కారం చెయ్యి.

**చారుదత్తుడు :** (శూలానికి నమస్కరిస్తాడు).

**గోహ :** అయ్యా! భయపడుచున్నారా?.

**చారుదత్తుడు :** భయమా! భయమెందుకు? మృత్యుదేవతా దర్శనం లోకంలో జన్మమెత్తిన తర్వాత దేవతలైనా సూర్యచంద్రాదులకే తప్పలేదు. నా ప్రియురాలిని ఒక్కమాటు స్మరించుకోనీయండి.

తరువాత ఈ తుచ్ఛశరీరాన్ని మీ ఇష్టం వచ్చినట్లు – హా ప్రియా! వసంతసేనా–

**వసంతసేన :** (ప్రవేశించి) ప్రభూ! చారుదత్తా!!

**గోహ :** (శూలాన్ని దగ్గిరకు తేబోతుంటాడు).

**శకారుడు :** (ఒకవైపు చూచి) వసంతసేన! – చచ్చాామురా, బాబూ దశ్శరభ, శరభో! – (పరుగెత్తబోతాడు).

**చారుదత్తుడు:** (వసంతసేనను చూచి) ఎవరీమె? మృత్యు మహాబిలములో ప్రవేశించిన నన్ను తిరిగి బ్రతికించటానికి వచ్చిన కాటిదేవతా! కాదు. వసంతసేన!

(*) ఏమిటి? వసంతసేనా! కాదు. ప్రతిరూపము. పొరబాటు. ఆమే! నన్ను కాపాడటానికి స్వర్గభూమిని విడిచి వచ్చింది. నిజమా ఇది భ్రాంతా? ఆమని పూలతోటలా ఉన్న ఈమె వసంతసేనే! పూర్వ మున్న స్వర్గానికే వెళ్ళలేదు. ఆమే!

**వసంతసేన :** ఆర్యా! ఔను, మీ వసంతసేననే!

**వసంతసేన :** జీర్ణోద్యానంలో శకారుడు నన్ను పీకనులిమి వెళ్ళిపోయిన తర్వాత రక్షించిన మహాత్ముడు.

**చారుదత్తుడు :** భదంతా! మీకు మేమేమి ప్రత్యుపకారం చేయగలమో!

**సన్యాసి :** ప్రత్యుపకారమా! నాదే మీకు ప్రత్యుపకారం. వీడు పూర్వా శ్రమంలో మీ పాద సంవాహకుడు (వసంతసేనతో) తల్లీ నీకు వెనక ఎన్నడూ చెప్పలేదు. నీవు పది సువర్ణాలిచ్చి జూదరి చేతుల్లో ప్రాణాలు దక్కించిన వాడు వీడే – (వసంతసేన ఆశ్చర్యంతో చూస్తుంది) (విటుడూ, శర్విలకుడూ! నడు, పద, కొట్టు. (శకారుణ్ణి నడిపించుకో వస్తాడు).

**కుంభీలకుడు :** నిన్ను ఏం చేస్తానో చూడు.

**శకారుడు :** నా కొలువులో బతికి నా కొంప తీయిస్తావుట్రా.

**శర్విలకుడు :** ఆర్యా! ఇడుగో మీ శత్రువు. వీడికి ఏమి శిక్ష విధించాలో మీరే నిర్ణయించాలి. ఆర్యక మహారాజులు మిమ్మలినే న్యాయాధిపతులుగా ఎన్నుకున్నారు.

**కుంభీలకుడు :** (వధ్యమాలిక శకారుడి మెడలో వేస్తాడు).

**శకారుడు :** (చారుదత్తుడి కాళ్ళమీద పడుతూ) మహాత్మా! శరణు! శరణు!

**చారుదత్తుడు :** శరణాగతుణ్ణి వదలివేయటము ఆర్యధర్మమూ, ఉత్తమ ధర్మమూ!

**శకారుడు :** (నమస్కారం చేస్తూ) అమ్మయ్య! బ్రతికానురా బాబూ! దశ్శరభ శరభా!

**మైత్రేయుడు :** (ప్రవేశించి) మిత్రమా! ఆర్యకుడు రాజైనాడు (ఆశ్చర్యంతో) వసంతసేనతో (శర్విలకుని చూచి) ఇతగాడిని కలలో చూచినట్లుంది.

**శర్విలకుడు :** అయ్యా నేను మీ ఇంట భూషణపాత్ర అపహరించిన గజదొంగను. ఆర్యకమహారాజ స్నేహితుణ్ణి.

**వసంతసేన :** మా మదనిక ప్రియసఖుడు! శర్విలకుడు!

**మైత్రేయుడు :** అందుకనే కలలో చూచినట్లున్నా నన్నది.

**శర్విలకుడు :** ఆర్యకమహారాజు తల్లిగారికి వధూ! బిరుదమిచ్చారు.

**చారుదత్తుడు :** ప్రియా! ప్రియవధూ! వసంతసేనా! ఈ రక్తగంధానులేపనం నాకు వివాహోచితాలంకారమే! ఈ వధ్యశిలే మన పాణిగ్రహణవేదిక!

(క్రైదండలతో చారుదత్త వసంతసేనలు, మదనికా శర్విలకులు పాడుతారు. మైత్రేయుడు, రోహసేనుడు సంతోషంతో చూస్తుంటారు).

**అందరు** : **జీవనది నీ వొంటి**
**చేర విక హంసా!**

**పురుషులు** : **పడతి నీ నీడగా**
**నడచునే హంసా!!**

**అందరు** : **జీవనది నీ వొంటి**
**చేర విక హంసా!!**

**స్త్రీలు** : **పతిని నీ జోడుగా**
**పడసితివె హంసా!**

**అందరు** : **జీవనది నీ వొంటి**
**చేర విక హంసా!**

**(తెర)**

# అనుబంధం

(మూలములో (*) గుర్తు ఉన్నచోట్ల వచనం వ్రాసి పద్యాలతో ఆడదలచిన వారి ఉపయోగం కోసం వాటిని ఇక్కడ వరుసగా ముద్రించడమైనది).

**పుట 117 – సిగ్గేస్తున్నది తరువాత**

సిరి దయఁ జూచునాఁడు ననుఁ జిత్తజదేవమహోత్సవంబు లే
జరిపితి నాధనంబుననె సర్వజనుల్ వినుతింప, నేఁడు నన్
సిరి నిరుపేదఁ జేసె, మది సిగ్గిలుచున్నది చేతులారఁగా
మరునకుఁ గాన్కనీయ నొకమాడయు మాకడలేదు మిత్రమా!

**పుట 119 – తుర్రుమంటుందా బావా!**

దుడ్డు దొబ్బెడు దొడ్డ దొమ్మర గెడపోరి,
దండుగుల్ పెట్టించు మిండకోరి,
తంపటల్ తలకెత్తు తాపికత్తెలదు త్త
రడ్డిమడ్డిజనాల రంకుతొత్తు
నిక్కమాడని బైసి కొక్కెర జలజంత,
రొక్కాల వలపుల చక్కిజంత,
కోలాట మాడేటి కైలాట నెఱదొడ్డి,
గోవాళ్ళ హరియించు గొప్పదిడ్డి,
దాటదీపరి, కసుమాల, దాట్లగుట్ట,
దుక్కిపిట్ట, పిశాచంబు, దొంగతొఱ్ఱు
ఔర, రాజును నాతొ మాటాడకిట్లు
పారిపోవునె బావ! ఈ పడుపుకత్తె!

**పుట 122 – శకారుదు (ముందుకు నడచి)**

ఆప నెవరికీ శక్యమే అతివ! నిన్నుఁ
దరుముచుండఁగ నొంటి నాదరికిఁ జేరి

కుంతికొడు కైన యాదుష్టశంతనునక!
ఇంతిరో! రంభసుతుఁ డైన రాభణునక !!

**పుట 129 – దీపంతో ప్రయోజనం లేదు....**

వలపుల కాంతులన్ గగనవాటిక వెన్నెలవెల్ల వేసి యా!
కలువల రేఁ డిదే కుముదకాంతల వంతలఁ దీర్పవచ్చె – నీ
వెలుఁగుల వెన్నెలన్ నగరవీథులఁ గల్గదు భీతి సుంతయున్ !
నిలుము శ్రమింపగా వలయునే నిను దీపికనై సుహృద్వరా!

**పుట 134 – సౌందర్య తప్ప రేఖిలా!**

మనసున కందరాని సుకుమార మనోజ్ఞ విపంచికాకల
క్వణనమె పంచభూతతతిగా గ్రహించి సృజించినావు మా
కనులకుఁ గట్టునట్టు లవగాఢత మంజులస్వర్గలోక మో
యనిమిషగాయకా! ప్రణతు లియ్యవె నీకమనీయ విద్యకున్.

**పుట 139 – చారుదత్తుడు విధీ! విధీ!!**

ఏటికి నెంచితో జగతి నెత్తఁగ జన్మము బ్రాహ్మవంశమం?
దేటికి యర్థ మిచ్చితివా? ఏటికి వర్తకుగా నొనర్చితో?
ఏటికి నన్ దరిద్రునిగ నీగతిగా నొనరించి తంద్రి, భి
క్షాటనఁ జేయఁగా దగినఁ కల్పనఁ జేసితివో కదా విధీ!

**పుట 149 – (చిత్రపటాన్ని చూస్తూ) మహాభాగా!**

ఓ కమనీయరూపమహిమోజ్జ్వల! సద్గుణదివ్యరత్న ర
త్నాకర! మీవిలాసముల ధన్యుఁడు శిల్పి యొకండు చిత్రమం
దేకరణిన్ రచింపనగు – నేగతి నేని నొనర్చె నేని యా
ప్రాకటమానసాబ్జమును భావనసేయు సమర్థుఁడే ప్రభూ!

**పుట 163 – (చారుదత్తుని చిత్రపటంవైపు చూస్తూ)**

పాదసేవకురాలిపైఁ బడియె నేని
శీతలామల భవదీయ స్నిగ్ధనేత్ర
రాగర క్తిమ శుష్కనీరస జగంబు
ప్రణయప్రమదావనంబు నా బ్రతుకు కింక

**పుట 165 – (సంతోషంతో దీర్ఘంగా నిట్టూర్చి)**

దెసలన్ జాజులతావి నా ప్రభుని కీర్తిస్ఫూర్తితో నిల్పు నో
వసనమ్మా! నిలు మంసభాగములపై వక్షస్థలం బోసి నీ
లసదానందమనోజ్ఞలాస్యములకున్ రంగస్థలం బీయెడన్
అసమానమ్మగు నీ కళావిభవ మత్యంతంబు రూపింపవే!

**పుట 166 – (కుంభవృష్టి తప్పదు)**

ఉరుమఁగ నిమ్ము శ్రావణపయోదములన్ ఘనగర్జలొప్పఁగాఁ
గురియఁగ నిమ్ము, లోకములకున్ బ్రళయంబగు కుంభవృష్టి, తా
మురలఁగ నిమ్ము, ప్రోదినుల నుర్వర బీటలు వార, బ్రీతిమై
నరిగెద నేఁడు నా ప్రియునకై యభిసారికనై రయంబునన్.

**పుట 167 – వసంతసేన : (ఆకాశంవైపు దృష్టి నిల్పి)**

ఏ ప్రౌఢోజ్జ్వలవేషధారిణిగఁదంద్రీ, నా ప్రియుం జేరఁబో
నీ ప్రావృడ్ఘనఘోరవర్షములతో నీ మేఘ నిర్ఘోషలా?
ఓ పర్జన్య! పయోదరాజ!! దయలేదో, గుండె రాయయ్యెనో,
ఈ పాపమ్మది యేమి? నీకుఁ దగునే యీదాష్ట్యమోహోప్రభో!

**పుట 167 చూపుతూ వెలిగితే చాలు**

ఆమెయి మేఘరాజు కఠినాత్ముడు నన్నెరపింప నోసి సౌ
దామని! గర్జసేయు భయదంబగు దారుణద్రోణవృష్టి – కా
నీ మగవాఁ డతండు, హృదయేశునకై విరహార్తనైన న
న్నే మెయిఁ జేర్చెదో ప్రియుని యింటికి నమ్మితినే తలోదరీ!

**పుట 195 – చారుదత్తుడు : ప్రియా! వసంతసేనా**

క్రొన్నెల లేఁత వెన్నెలలకున్ సొగసిచ్చెడు దంతకాంతితో
ప్రన్ననిచూతపల్లవవిలాసము లొప్పెడు కావిమోవితో,
వన్నెలఁ జిన్నెలన్ గలుఁగువారెడి, నీ ముఖకాంతిఁ ద్రావి ఓ
యన్నువ! దుర్యశోవిషమయాసవ మేగతిఁ గ్రోల నేర్తునే?

**పుట 197 – ఇన్నిమాట లెందుకు గాని**

పర మొకటున్న దన్న భయభావము లే కిటు పాపబుద్ధినై
తరుణిని రూపసంపదల దర్పకమోహనజన్మభూమి నో
హరిహరి! ఓ విధాత!! రతి కైనను వందనమాచరింపఁగా
నొరలెడు దాని – నేగతిగ నోడెద నే వచియింప నాపయిన్.

**పుట 200 – నేను మాత్రం నిర్భాగ్యుణ్ణి**

ఏనిర్భాగ్యుఁడ – కానిచో నిటులనౌనే – నీవు ప్రేమామృత
శ్రీనిష్యందినివై మదీయ హృదయోర్విన్ దృప్త 'గావింపఁగా
రానేవచ్చినవేళ వచ్చె నిటు దుర్వారాగ్ని కీలాళితో,
నీనవ్యాకృతితో మహాప్రళయ మం దే దగ్ధమైపోవగన్.

**పుట 201 – (మెడలో జందెము తీసి)**

తుది నీకీయఁగ నాకు దక్కినది, సంతోషింపు మో తండ్రి! నీ
కిదియే బ్రాహ్మణబిడ్డకున్ నగ – ఇదేమీ స్వర్ణహారంబు కా
దిది ముప్పేటల ముత్తెపున్ సరము కానేకాదు – ఇద్దాననే
తుది నీ తాతలు తండ్రులున్ సురలు సంతోషింతురో పుత్రకా!

**పుట 201 – ఎక్కడికి వెళ్ళుతున్నారో చెప్పమన్నావా!**

మాసినకీర్తితోడ, దయమాలిన శూలముతో, గళంబునన్
భాసుర రక్తమాలికల బంధుర దుఃఖకఠోరవహ్నితో
నోసుత! యేఁగుచుంటి యముఁడుజ్జ్వలుఁడౌచు ప రేత భస్మసిం
హాసన మెక్కి చేసిడి మహాధ్వరభూమికి నే హవిస్సునై.

**పుట 201 – కలిచేస్తున్నవి తండ్రీ!**

వేయేండ్లాయువు కల్గుఁగాక భువి నా ప్రేమోదధీ, తండ్రీ! రా
రా, యాహ్లాదముతోడ ముద్దిడుము, నీయాశ్లేషసౌఖ్యంబునం
దీయత్యంతదరిద్రదేహమున కయ్యెన్ జందనాలేపముల్ –
ఏయౌశీనర చర్చ తుల్యమగు నోయీ, తండ్రి కిద్దానితోన్.

**పుట 203 – దైవమొకడు లేడు. ఇది యదార్థము**

దైవమొకండు లేఁ, డిది యథార్థము, దోష మొకింత లేని నా
పై వచియింతురే యిటుల వధ్యుఁడ వన్న కఠోరశిక్షయా
దైవమె యున్నచో – నలమె దారుణనీలకళంకపంక మ
న్నా! విబుధాలయంబు డిగి నాప్రియ క్షాళన చేయుఁ గావుతన్

**పుట 204 – (శిరస్సు మీద చేయి ఉంచి)**

లే లే లెమ్ము కృపాళు, ఓ కరుణశీలీ! లెమ్ము, లేవయ్య నే
నీలీలన్ జొర మృత్యుగహ్వరము తండ్రీ! యొడ్డి నీ ప్రాణముల్
యేలా రక్షణసేయఁ బూనెదవు – నీవే యాప్తబంధుండ వో
యీ! లే లెమ్ము విధాత యడ్డుపడియెన్ ఈ ప్రాణరక్షాక్రియన్

**పుట 205 – కాదు. వసంతసేన**

ఏమి? వసంతసేన యగునే, ప్రతిరూపమె! కాదు, ఆమెయే–
యీామెయె స్వర్గభూమిడిగినే నను గావఁగ, సర్వమీయెడన్
ఏమిది? భ్రాంతి యౌనె? హృదయేశ్వరి స్వర్గము చేరలేదెమున్
ఆమనిపూలతోఁట కెనయై యిటువచ్చె వసంతసేనయే.

# డాక్టరు చైతన్యం

**(సాంఘిక రూపకము)**

సాహితీ లత 1953

# తర్పణము

(స్వర్గలోకవాసులు పితామహులకు, మాతామహునికి,
శ్రీ వావిలాల కాశీనాథ సోమయాజి,
కృష్ణ సోమయాజి, రామేశ్వర శర్మ,
శ్రీ చతుర్వేదుల వేంకట నరసింహయ్యలకు)

**"ఎపుడున్ వైదికకర్మనిష్ఠితులు మా**
**హేశుల్ మనోజ్ఞుల్ మహ**
**ద్విపులామ్నాయ రహస్యకోవిదులు ను**
**ర్వీదేవు లస్మన్మహుల్**
**కృపతో నీ కృతి స్వీకరింప దివి – వి**
**క్రీతుండ దాసుండ నా**
**యపరాధంబుల సైచి – చాచెద రిదే**
**హస్తాబ్జముల్ తృప్తులై"**

# ఆముఖము

నా ప్రథమ రూపక రచన 'నాయకురాలు' మీద ఆంధ్రంలోని వివిధ నగరాలల్లో ప్రేక్షకలోకం, విమర్శక మహాశయులూ చూపించిన ఆదరాభిమాన దోహదం వల్ల విజ్ఞులిచ్చిన వాత్సల్యపూర్వకమైన సలహాలను పురస్కరించుకొని రూపక వ్యవసాయం సాగించాను. తత్ఫలితంలో కొంతభాగాన్ని 'వసంతసేన', 'డాక్టరు చైతన్యం' రూపంగా నేడు ప్రదర్శిస్తున్నాను.

డాక్టరు చైతన్యాన్ని సృష్టించి నాలుగు సంవత్సరాలకు పైబడ్డది. అయినా ఇంతకంటె ముందుగా దీనిని ఆంధ్రనాటకరంగప్రియులకు నేను అందించలేక పోయినందుకు చింతిస్తున్నాను.

సేవాభినిరతులుగా పైకి కనిపిస్తూ స్వార్థంకోసం అన్ని అన్యాయాలతో బాటు ఎట్టి సాహసకృత్యాలకైనా వెనుదీయక ప్రవర్తించే 'భుజంగం' వంటి వ్యక్తులు సంఘం బలహీనంగా ఉన్న దినాలల్లో విరివిగా కనిపిస్తారు. వారి బాహ్యజీవితానికీ, ఆంతరంగిక జీవితానికీ సమన్వయం ఎక్కడా గోచరించదు. అటువంటివారిని స్వప్రయోజనాలకోసం మణెమ్మ, చంద్రశేఖరం, పుణ్యకోటి వంటి వ్యక్తులు అండ చేసుకొని ఉపజీవించటం సహజం. ప్రయోజనాలు నెరవేరిన తరువాతనో లేక ప్రమాదం సంభవిస్తుందన్న భయం కలగటం పొడకట్టిన మరుక్షణంలోనో దయ్యాలకొంపను వదిలేసినట్లుగా వారు తామాశ్రయించిన వారిని వదలివేస్తుంటారు. మణెమ్మను పోలిన ఏ ఒక స్వేచ్ఛా సంచారిణినో చూచి నవనాగరక స్త్రీ లోకం ఇలా ఉందని భ్రమపడటానికి అవకాశం లేదు.

డా. చైతన్యం వంటి మహాపురుషులు లోకంలో అరుదుగా కనిపిస్తారు. వారిని లోకం క్రమంగాగాని అర్థం చేసుకోలేదు. సత్యమూ, సత్పురుషులూ దాగదు, దాగరు. సత్యప్రియులు రేణు, జయమ్మలవంటి స్వచ్ఛహృదయాలను ఆకర్షించి చైతన్యంవలె మహత్తర కార్యసాధకులౌతారు. అటువంటి వారివల్లనే సంఘానికీ, దేశానికీ శక్తి, ముక్తి.

ఈ సాంఘిక నాటకంలోని పాత్రలూ, సన్నివేశాలూ కేవల కల్పితాలు. వ్యక్తులను గాని, సమాజాలను గాని ఉద్దేశించినవి కావు. ప్రదర్శనానుకూల్యతకు కొన్ని 'ప్రథమయవనిక'లను (Curtain Risers) ప్రవేశపెట్టాను. ఇవి ప్రాచీన సంస్కృతనాటకాలల్లోని విష్కంభాల వంటివి. గురజాడవారి కన్యాశుల్కంలో గూడా పద్యాలను ప్రవేశపెట్టి ప్రదర్శించాలన్న కుతూహలంగల నటకులూ, నాట్యసమాజాలూ నేటికీ విరివిగా దేశంలో కన్పిస్తున్నప్పటికీ అనుచితమనే గాఢనమ్మకంతో ఈ సాంఘిక రూపంలో పద్యాలకు స్థానం కల్పించలేదు.

'బుడే' ప్రసంగాలలోని అసంబద్ధము, వ్యాకరణవిరుద్ధము ఐన భాష వల్ల రసస్ఫూర్తి కలుగుతుందని ఆశించాను. నేనెంతవరకు కృతకృత్యుడనైనానో రసజ్ఞులు నిర్ణయించెదరుగాక!

ఈ నాటక రచనలోను, ముద్రణలోను నాకెంతయు తోడ్పడిన నా మిత్రులకు నమోవాకములు.

ఉమాసదనము: బ్రాడీపేట
గుంటూరు: 5 మే, 1953

వాఙ్మయ కళోపాసి
**వావిలాల సోమయాజులు**

# పాత్రలు

**పురుషులు**

**భుజంగం :** సంఘసేవానిరతిని ప్రకటించే స్వార్థపరుడు

**చంద్రశేఖరం :** భుజంగానికి సహాయకుడు

**పుణ్యకోటి :** భుజంగానికి కాదలచుకున్న అల్లుడు

**రావు :** పత్రికా విలేఖరి

**బుడే :** భుజంగం సేవకుడు

**డా. చైతన్యం :** ఆడంబరము లేని సంఘసేవకుడు

**ముసలయ్య :** చైతన్యం ఆరోగ్యశిబిరంలో సహచరుడు

**రంగడు :** డా. చైతన్యం శిక్షణవల్ల మార్పు పొందిన త్రాగుబోతు

**స్త్రీలు**

**రేణు :** డా. చైతన్యం సహచరి

**జయ :** భుజంగం కుమార్తె, సహజహృదయ

**మణెమ్మ :** భుజంగం స్నేహితురాలు

# ప్రథమ దృశ్యం

(భుజంగం ఇంటి ముందుభాగంలో అతిథి గృహం – సాయంత్రం 5 గంటలవేళ – భిక్షుకుడు ఒకడు)

**మానవసేవ!**
**మన ప్రభుసేవ!!**

**స్వర్గసీమ కదె,**
**చాలినబాట –**
**పుట్టెదు, గిట్టెదు**
**పూవువు నీవు**
**దినమో సగమో**
**తెరువెదొ కనుమా**
**మానవసేవ!**
**మన ప్రభుసేవ!!**

**భోగభాగ్యములు**
**బుద్బుదములురా,**
**ధనమదాంధులకు**
**తలుపు విడదురా!**
**మానవసేవ!**
**మన ప్రభుసేవ!!**

అని పాడుతుంటే వినిపిస్తుంది)

**బుడే :** (ఒకవైపు నుంచి ప్రవేశించి) అరె! మీకీ తమాషా హుందీ. హింటిలోకి హెక్కడ్కీరా... జా యాహాసే, జాన్వర్ (గుడ్డతో బల్లలు తుడుస్తూ మధ్యమధ్య) హరె హల్లా! హరె హల్లా!! (మరపు నటిస్తూ) మైనే క్యా కరూఁ!! బూజుహంగంసాబ్ కా ఘర్మే ధర్మం ఘిర్మంనహి హంటే నాకీ పాణం తీస్తార్.

**(అయిదు గంటలు వినిపిస్తవి)**

ఏక్, దో, తీన్, చార్, పాంచ్ – హరె హప్డె హైందీ హైదూ, హోయ్ ఖుదా!

**(నిష్క్రమిస్తాడు)**

**జయమ్మ :** (తెరచివున్న ద్వారంగుండా ప్రవేశించి చేతిలో ఉన్న పూలదండను మహాత్మాగాంధీ విగ్రహం మెళ్లో వేసి నమస్కారం చేసిన తరువాత)

**జయ జయ జయ జాతిపితా!**
**జయ భారత హృదయనేత!**
**జగమంతా కాళరాత్రి**
**పగలే ఇక లేనిదిగా**
**ఆరని ఓ జ్యోతి! నీ**
**అమరకాంతి మా కిమ్మా జయ జయ**
**కరదీపికల స్జగమే**
**పరిణమింప పున్నమిగా**
**వెలిగింతుము వెడలెదము**
**దీవింపుము దివ్యఋషీ! జయ జయ**
**జయ జయ జయ జాతిపితా!**
**జయ భారత హృదయనేత!**

**బుడే :** (దగ్గిరకు వచ్చి జంకుతూ) హమ్మాయిగార్!

**జయ :** బుడే! ఇల్లు ఎగిరిపోయేటట్లు ఏమిటా అరుపులూ నువ్వూ.

**బుడే :** హర్ఫుల్ కావ్ హమ్మాయిగారు! హోళ్ళ పీకల్ కోషి హాకాశాన్కి హెగ్రేషేవాణ్ణి, నాకీ మాట తక్వాషేస్తే హూరుకోటం హుందీ లేదు.

**జయ :** బిచ్చగాళ్ళమీద ప్రతిదినం నీ గొడవేం బాగాలేదు.

**బుడే :** ఘొడ్వా!! బల్ షెప్పారండీ! హమ్మాయిగార్! నాకీ నాన్నగారి మాట్కీ హంగుళంకీ హోక్టీ తప్పేద్లేద్. హం నమ్మఖరామ్ నై హమ్మాయిగార్... హుజూర్కు మాకీ బుర్రల్ తీసి యిస్తాం (సంతోషంతో) హమ్మాయి గార్! మీకీ ఏదో కాగజ్ హొచ్చింది హేమీట్వాండీ!

**జయ :** (ఆలోచించి) ఏదీ?

**బుడే :** జరూర్ సద్వుకోని నజర్ షేసి నాకీ మంచి హీనాం హివ్వాలమ్మాయి గార్.

**(డ్రాయర్లో పెట్టి ఉన్న 'ఇండస్ట్రీ' పత్రిక తీసియిస్తాడు)**

**జయ :** (చూడకుండానే అవతల పారేస్తుంటే బుడే తనకు బహుమానం రాదన్నట్టు నటించిన తరువాత) ఆఁ, ఇదేనా? మర్చిపోయినాను.

**బుడే :** హెప్డూ మర్సిపోతూ హుంటార్... నాకీ బీబీ హుందే హల్లాబీ దాన్కి మస్తాన్ సాహెబ్ హుర్సుకు మళ్ళీ ముప్పై హేల్యూ హెళ్ళిపోతుండాయ్ హోక్టీ మాటూ మర్యూ గిర్యూ జాన్తీనై. మీకీ షూస్తే హిర్వైహేళ్ళూ భీ నై హై మళ్ళీ షేస్తే హెంతా మర్యూ హండీ!

**జయ :** అధిక ప్రసంగం చెయ్యగూడదని ఎన్నిమాట్లు చెప్పాను.

**బుడే :** (భయాన్ని ప్రకటిస్తూ) మళ్ళీ రోజ్ రోజ్ హోక్టీ రెండూ సార్లు షెప్పారుగా.

**జయ :** ఇందాక పోష్టువాడు మస్తాను నీ చేతికేదో పాకెట్ యిచ్చినట్లున్నాడు.

**బుడే :** పైకట్ కతో! (తెలిసినట్లు) హాయ్ పై కట్. అది నాన్నగార్కి షెన్నపట్నం నుంచి వచ్చిందట్గ హమ్మాయి గార్.

**జయ :** నోరుమూసుకొని తక్షణం పట్టుకురా!

**బుడే :** తచ్ఛనం! (నోరు మూసుకొని వెళ్ళుతుంటాడు)

**జయ :** బుడే!

**బుడే :** (మూసుకొన్న నోటితో వెనక్కు తిరుగుతాడు)

**జయ :** ఛీ! చెయ్యి తియ్యి

**బుడే :** హరె హల్లా! మూస్కోమంటార్, మల్లి తియ్యమంటార్, మల్లి మూస్కోమంటార్. హన్నీ మీరే షెప్తార్ హేమ్టి హండీ!

**జయ :** నీతో ఏమన్నా చావుగానే ఉంది. హోటల్ వాడితో అన్ని సిద్ధంగా ఉంచమని చెప్పావా?

**బుడే :** ఆఁ బల్‌మాట షెప్పారండీ హమ్మాయిగార్. నాకీ దివానాకాను హుండీ. హైనా హాడ్కీ షేషేదీ మళ్ళీ హొక్టేగా

**జయ :** బజారునుంచి తెమ్మన్న వస్తువులు తెచ్చావా?

**బుడే :** మేఘాల్మే హెగ్రిపోయి హోక్టీ గంటాకే హన్నీ తెచ్చాన్గా మల్లీ!

**జయ :** తెచ్చావ్?

**బుడే :** ష్వయంహెళ్ళీ. హాయ్ హేష్టీ హదీ (జ్ఞప్తిచేసుకుంటూ) బిచ్చికోత్ హోక్టీడబ్బా. మళ్ళీ షెక్కర్ కేళీ హోక్టీగేలా, డి(్రింగు హోక్టీ దజన్, తెచ్చానుగా హమ్మాయ్‌గార్!

**జయ :** ఉఁ – పుస్తకం తెచ్చి యిచ్చి విందుకని వచ్చినవాళ్ళందరినీ మర్యాద చెయ్యి.

**బుడే :** పుస్తకం (తెలిసినట్లు) పేకట్ హమ్మాయిగార్!

**జయ :** ఆఁ (బుడే అక్కడేవున్న పాకెట్ ఇస్తాడు. అది చైతన్య వ్రాసిన 'సేవాగీతికలు)' "కవి : చైతన్యం" – సేవాగీతికలు! బుడే! ఇదిగో నీకు నజరానా? వెళ్ళు.

**బుడే :** (సంతోషంతో తీసుకొని సలాం చేసి వెళ్ళిపోతాడు)

**జయ :** (పుస్తకం తిరగవేస్తూ) అన్నీ విన్న పాటలేనే! (హార్మోనియం దగ్గరకు వెళ్ళి) ఇది కూడా చైతన్యందేనా?

> **ఆపకం డీరథము**
> **స్వాతంత్ర్య రథమూ**
> **జహ్వారే సారథై**
> **సాగించు నీ రథము** **ఆపకం డీరథము....**
>
> **వెలుగుకాగడ తోడ**
> **వెడలుచున్నాడడుగొ!**
> **పొడుపుమలదెస కింక**
> **పొలచు నూతనజ్యోతి** **ఆపకండీరథము....**

**పుణ్యకోటి :** (ప్రవేశిస్తూ) హల్లో మీ ఆనందానికి అడ్డు వస్తున్నందుకు క్షమించాలి.

(చేతిలో ఉన్న 'సేవాగీతికలు – చైతన్యం' మీద దృష్టి ఉంచి) పాటలా ఏమిటి? ఈ పాట ఎవరిది చెప్మా! ఎక్కడో విన్నట్లుంది?

**జయ :** చైతన్యంగారివి.

**పుణ్యకోటి :** అతడు మంచి కవే! కానీ

**జయ :** (అనుమానంతో) కానీ....

**పుణ్యకోటి :** వేపకాయంత కొసవెర్రివాడు.

**జయ :** ఆలోచిస్తే వెర్రిలేనిదెవరికి? – మీకు లేదా – నాకు లేదా?

**పుణ్యకోటి :** అవునవును. అందుకనే కదండీ! షేక్స్పియర్ అన్నాడు 'కవి, ఉన్మత్తుడు, ప్రియుడు ఏకశ్రేణివా'రని. ఔనా.... మీ నాన్నగారు లేనట్లున్నారు. పుట్టినరోజైనా తీరుబడి లేదు.

**జయ :** తిమ్మాపురంలో ఏదో సభ ఉందట. వెళ్ళారు. పన్నెండు గంటలకే వస్తామన్నారు. రాలేదు.

**పుణ్యకోటి :** స్వంతకారు కనక వచ్చేస్తుంటారు. అక్కడ భోజనం చేస్తే గాని వెళ్ళనివ్వలేదేమో!

**జయ :** పుట్టినరోజుకని చిన్న పార్టీ ఏర్పాటు చెయ్యమన్నారు. ఏదో 'ఇండియన్ పంక్చువాలిటీ' కాబట్టి సరిపోయింది. లేకపోతే అందరూ వచ్చి సిద్ధంగా ఉండేవారు.

**పుణ్యకోటి :** (నవ్వుతూ) పెళ్ళికొడుకులేని పెళ్ళి అయ్యేది...

**జయ :** ఏమిటండీ విశేషాలు. మా ఆహ్వానం వచ్చేటప్పటికి ఊళ్ళో లేరటగా బుడే అన్నాడు.

**పుణ్యకోటి :** ఈ మధ్య 'మట్టిగుంటలో' మహావైభవంగా నాలుగు దినాలు 'గాంధీజయంతి' చేశాము. ప్రతిదినం ఉదయం 21/2 గంటలూ, సాయంత్రం 2 1/2 గంటలూ బ్రహ్మాండంగా సూత్రయజ్ఞం సాగించాము. ఇదే ప్రత్యేకాకర్షణ.

**జయ :** పత్రికల్లో రిపోర్టు బహుజాగ్రత్తగా అనుసరించాను. ఇటువంటి కార్యక్రమం మన రాష్ట్రంలోనే ఎన్నడూ జరగలేదని ఏదో పత్రిక సంపాదకీయం వ్రాసినట్లుంది. దానికి ప్రచారం బాగా ఉందా ఏం?

**పుణ్యకోటి :** చచ్చుబొక్కుగా అమ్మినా అయిదువేల కాపీలు పోతున్నవి. పుట్టి పురుడైనా వెళ్ళలేదు. దానిమాటకేం గాని మొన్న నేను జరిపించిన కార్యక్రమాలను గురించి యు.పి,సి.పి రాష్ట్రాలనుంచి నాకు ప్రత్యేకంగా అభినందన లేఖలు వచ్చినవి. పోయిన సంవత్సరం మన సభలకు అధ్యక్షుడుగా వచ్చాడు ఆ సేవాసమితి సభాపతి...

**జయ :** (జ్ఞప్తి చేసుకుని) తార్కుండే...

**పుణ్యకోటి :** ఔను తార్కుండే... మిమ్మల్ని మరచిపోలేదు. ప్రత్యేకంగా అడిగానని చెప్పమని వ్రాశాడు.

**జయ :** సమాధానం వ్రాసేటప్పుడు 'నా కృతజ్ఞత' వ్రాయండి.

**పుణ్యకోటి :** తప్పకుండా మట్టిగుంటలో మహాసభలు జరిగిన తరువాత మన నగరంలో పెద్ద ఎత్తున ఒక సప్తాహం తలపెట్టి తలకాయ ఉన్న పెద్దవాడినల్లా పట్టుకువచ్చి గద్దె ఎక్కించాలని నాకుంది. మీరేమంటారు?

**జయ :** తప్పకుండా అటువంటి సమ్మోహనాస్త్రాలు చాలా బాగా పనిచేస్తవి... కానివ్వండి.

**పుణ్యకోటి :** 'కానివ్వండని' ఏమిటాతప్పుకోటం. స్వాతంత్ర్యం వచ్చిందన్న మాటే గాని, స్వాతంత్ర్యనేత బాపూజీ తత్వం దేశానికి జీర్ణం కాలేదు. నిర్మాణ కార్యక్రమ ప్రణాళికలతో కాగితాలు నిండిపోతున్నవి. కాని ఒక్క పనీ కార్యరూపం దాల్చటం లేదు. "దేశంలో నాలుగుమూలలా ప్రజానాయకుల జీవితచరిత్రలు, కట్టుకథలుగానూ, హరికథలుగానూ, బుర్రకథలుగాను చెప్పించి, ప్రజల్లోకి చొచ్చుకోపోయి చైతన్యం రేకెత్తించి"...

**జయ :** (నవ్వుతూ) క్షమించాలి ఉపన్యాసధోరణిలో పడిపోతున్నారు.

**పుణ్యకోటి :** ఒహ్ ఎక్స్యూజ్ మి... మరి మీరు నాకు ఈ సందర్భంలో ఏమి సాయం చేస్తారు?

**జయ :** ఎదురు చెప్పకుండా చెప్పింది విని ఊరుకుంటాను.

**పుణ్యకోటి :** అలాగేం పాపం!! తప్పించుకుందామనుకుంటున్నారుగామాలి. టౌన్ హాల్లో ఒక సంగీతసభ ఇవ్వాలి. కార్యక్రమం అచ్చు వేయించడానికి కూడా మనదగ్గిర 'చేతన్ లేదొక చిల్లిగవ్వయును'

**జయ :** (ఆలోచించి) పాటకచ్చేరీ అని అన్నిటికీ మాటిమాటికీ నేనే తయారైతే ఏం బాగుంటుంది?

**పుణ్యకోటి :** ఎన్నోమాట్లు ప్రజలు మిమ్మల్ని వినటమూ (చిరునవ్వుతో), అంతకంటె అధికంగా చూడటమూ వల్ల మాకు టిక్కెట్లు అమ్ముకోటానికి అంత తికమక లేదు. కాలేజీలు అన్నీ రీ ఓపెన్ అయినవి. స్టూడెంట్సు దగ్గిర డబ్బు పుస్తకాలకనీ బుగ్గికనీ తెచ్చుకున్నది పుష్కలంగా ఉంటుంది. మంచివి రెండు మూడు పులుముడు భావగీతాలు అభ్యుదయపంథాలో విసిరిపారేశారంటే అంతా డబ్బే!... మరి అచ్చు గుద్దిస్తాను.

**జయ :** ఆలోచించిగాని వాగ్దానం చెయ్యలేను.

**పుణ్యకోటి :** (ఉపన్యాసధోరణిలో) జయమ్మగారూ! మీరు గమనించటం లేదు. మన సంఘం సమస్తవిధాలా అధోగతి పాలైపోతున్నది. 'స్త్రీజాతి' అభ్యుదయం

విషయమాలోచిస్తే ఆపాదమస్తకం కంపిస్తున్నది. దీనహరిజన సోదరుల ఆక్రందనాలూ, అన్యాయకథనాలు ఇంకా చెవులల్లో మార్మోగు తున్నవి. యోధాన యోధులైన స్వాతంత్ర్య భారతయుద్ధ కురువృద్ధు లందరూ అలసిపోయినారు. యువకలోకం మేల్కొంటేగాని విముక్తి లేదు.

**జయ :** ఔను...

**పుణ్యకోటి :** ఔనంటే చాలదు. సామాన్య ప్రజలకూ, శ్రామికవర్గాలకూ ధనికవర్గాలతో బాటు సమాన ప్రతిపత్తి కల్పించి గౌరవించే విప్లవం, సాంఘికవిప్లవం, నిరాయుధ విప్లవం, అహింసాత్మక విప్లవం నడిపించే నాయకమణులు అనేకమంది కావాలి. మీది స్త్రీ హృదయం, సోదరీ హృదయం, మాతృహృదయం. రండి! లేవండి!! ఈ రథాన్ని నడిపించటానికి నడుం కట్టుకోండి. మీవల్ల మాకు శక్తి మీకు ముక్తి ప్రజకు భుక్తి జయమ్మగారూ.

**జయ :** మహానుభావా! ఇది ఉపన్యాస వేదిక కాదు. మాటి మాటికీ మరచిపోతున్నారు.

**పుణ్యకోటి :** నాలో నిద్రితశక్తి ఎలా మేల్కొంటున్నదో మీరు గమనించాలి. పతితప్రజాసేవకు, పీడిత జనోద్ధరణకు బద్ధకంకణులు కావలెనని మిమ్మల్ని అర్థిస్తున్నాను. (వంగి నమస్కరింపబోతాడు)

**జయ :** (వారిస్తూ చిరునవ్వుతో) ఇంతకూ టౌన్‌హాల్లో నన్ను ఒక పాటకచ్చేరీ చేయమంటారు, అంతేనా?

**పుణ్యకోటి :** నిశ్చయంగా! మాట ఇవ్వక తప్పదు.

**జయ :** సరే కానివ్వండి. (తప్పనిసరిగా అంటుంది)

**పుణ్యకోటి :** జయ్, జయమ్మగారికీ జై... ఇలా రేపు కోటి కంఠాలు మిమ్మల్ని జయవెట్టుతూ ఉంటే మీ మనస్సుకు ఎంత ఆనందం కలుగుతుందో...

**బుడే :** (గాభరాగా ప్రవేశించి) హమ్మాయిగార్! హన్నీ నాకీ షిద్ధం షేస్తే పిల్లీ మీద బల్లాఎక్కి... మల్లీ హెగ్రీ మల్లీ హెగ్రీ మల్లీ మల్లీ హెగ్రీ హెగ్రీ...

**జయ :** ఏమన్నా పగలగొట్టిందా, త్వరగా ఏడు?

**బుడే :** హాయ్ హమ్మాయిగార్ (ఏడుస్తాడు)

**జయ :** పోనీలే. త్వరగా మరొకటి పట్టుకురా.

**ఋడే :** (నవ్వుమొగంతో) మేఘాల్మే హెగ్రీపోయి తెస్తా...

(కొంతదూరం నడిచి) నాకీ దిమాగీమే దెయ్యం హెక్కింది. ఓ క్యా హదిహేమ్టీ హమ్మాయిగార్! (నిష్క్రమిస్తాడు)

**జయ :** ప్రతినిమిషమూ వీడు నా ప్రాణాలు తోడేస్తున్నాడు. నాన్నగారితో చెప్పి మరొకణ్ణి కుదుర్చుకోకపోతే బ్రతికేటట్లు లేదు.

**పుణ్యకోటి :** ఓ, నొ, నో! వీడికి నౌకరీ ఇచ్చి భుజంగంగారు గొప్ప రాజకీయవేత్త అనిపించుకున్నారు. జాతీయ ముస్లింలల్లో పలుకుబడి వీడివల్ల బ్రహ్మాండంగా వృద్ధౌతుంది.

**జయ :** (నవ్వుతుంది – పుణ్యకోటి ప్రతిగా నవ్వుతాడు)

**చంద్రశేఖరం :** (మరొకవైపు నుంచి ఒక కట్ట వార్తాపత్రికలతో ప్రవేశిస్తూ భజనసరణిలో) 'ఎన్నాళ్ళకెన్నాళ్లకూ రామయ్య రామా, సీతమ్మతల్లీ'

**జయ :** ఏం మామయ్యా! ఏదో కొంపమునగబోతున్నట్లుంది?

**చంద్రశేఖరం :** మునగబోవటమేమిటి – మునిగింది బ్రహ్మాండంగా పైకి తేలింది.

**పుణ్యకోటి :** ఏం భాయీసాబ్! మీ తరహా చూడబోతే బజారుల్లో ఇంకా పేపర్లు మిగిల్చినట్లు లేదే!

**చంద్రశేఖరం :** పట్టుకోటం తెలియని ప్రతిగాడిదా పేపరు కొని ప్రయోజనమేముందోయ్, దుష్ప్రచారం చెయ్యటం తప్ప! ఇవాళ పేపర్లో అత్యద్భుతకరమైంది ఒకటి పడ్డది.

**పుణ్యకోటి :** (ఆశ్చర్యంతో) ఆఁ!

**చంద్రశేఖరం :** ఇక అంతా ఐకమత్యం అభ్యుదయం చైతన్యం...

**జయ :** ఇంతకూ సంగతేమిటో బయటపెట్టండి.

**చంద్రశేఖరం :** తెలుగు ప్రతి చదువుతున్నాను... న్యూఢిల్లీ 24 జులై, ప్రతి పట్టణంలోనూ ఏర్పడ్డ సేవాసమితుల మూలధనానికి పదిరెట్లు అఖిల ఇండియా సేవాసమితి వారు ఇచ్చి గ్రామోద్ధరణ జరిపించటానికి తీర్మానించిరి. అప్లికేషనులు వారముదినాల్లో ధన్యం భాయీకి చేరవలెను.

**జయ :** ఉస్... ఇంతకేనా, ఇంత హంగామా చేశారు?

**చంద్రశేఖరం :** అర్థంకానివాళ్ళకు మరి హంగామా.

**పుణ్యకోటి :** భాయీసాబ్ – కోపం తగ్గించి కాస్త వ్యాఖ్యానిస్తే గాని బోధపడేటట్లు లేదు.

**చంద్రశేఖరం :** (ప్రవచనముద్రతో) మీబోటి సామాన్యులకు అర్థం కాక పోవటంలో ఆశ్చర్యమేముంది? బ్రహ్మాండం బ్రద్దలయ్యేటట్లు విమానాలమీద విదేశాలన్నీ తిరిగి వచ్చి ఏ బి సి డీలు మూరెడు పొడుగు ఘనాజటా వేసినన్ని డిగ్రీలు పెట్టుకున్న ముత్తైదుసంపాదక మహాశయులకే అర్థంకాలేదు. ఒక విషయం జరిగితే దాన్ని భూతభవిష్యద్వర్తమానాలకు అనుసంధించి వ్యాఖ్యానించటం. 'తెల్వొకరి సొమ్మా తొండపి సుబ్బమ్మా'!

**పుణ్యకోటి :** వ్యాఖ్యానం కానివ్వండి తీర్మానం మీద.

**చంద్రశేఖరం :** సంఘం ఓ రాతిరథం. ఈ ప్రకటనవల్ల కదలని ఆ హంపీ రాతిరథం కదులుతుంది. స్లోగన్ దొరక్క తన్నుకొంటున్న రాజకీయవేత్తలకు మళ్ళీ కొంత ప్రాణం పోసింది. గాంధీయిజాన్ని గ్రామగ్రామాన ప్రజాహృదయానికి హత్తుకొపోయేటట్లు ప్రచారం చేసి సోదరులారా! మీరు...

**జయ :** మామయ్యా! నీవు కూడా ఉపన్యాసధోరణిలో పడి పోతున్నావు. లోపల ఆ బుడేగాడు ఎంతవరకు వచ్చాడో చూసివస్తాను. (నిష్క్రమిస్తుంది)

**చంద్రశేఖరం :** (తాపీగా) నగరంలో 'సేవాసమితి' అంటూ ఒకటి స్థాపిస్తే సమస్తమూ మనము నడిపించవచ్చు.

**పుణ్యకోటి :** భేష్! బాగుంది. ప్రస్తుతం మనకొక ఆర్గనైజరు కావాలన్నమాట!

**చంద్రశేఖరం :** ఇంత శాస్త్రోక్తంగా నడిపిస్తే ప్రమాదసీమలో పడతాం. సమస్తమూ, డైరెక్టరు అయినా అందరూ మనవాళ్ళే...

**పుణ్యకోటి :** అయితే మరి.

**చంద్రశేఖరం :** ప్రసిడెంటు పలుకుబడి ఉన్నట్లు నటిస్తూ కొంత స్వార్థం కోసమో పరార్థంకోసమో పెట్టుబడి పెట్టగల పెద్ద మనిషి ఉండాలి.

**పుణ్యకోటి :** తప్పదు  భుజంగం ఇందుకు తగ్గ వ్యక్తి.

**చంద్రశేఖరం :** యు ఆర్ రైట్. ఒక్క షేక్‌హేండు ఇలా పారెయ్యి. ఇద్దరు కార్యదర్శులు. ఒకరు ప్రధాన రెండవవారు సహాయ.

**పుణ్యకోటి :** నీవు ప్రధాన

**చంద్రశేఖరం :** ఉః నీవు ప్రధాన – మరి చెప్పినట్లు వినాలి. సహాయ కార్యదర్శిని ఎన్నుకోటంలో ఒక్క మాట మరచి పోకూడదు సంఘం కాస్త పచ్చపచ్చగా ఉండాలి. అర్థమైందనుకుంటాను.

**పుణ్యకోటి :** పడతి అని తమ భావమా గురుదేవా?

**చంద్రశేఖరం :** (విచిత్రకంఠంతో) ఔను శిష్యశేఖరా?

**పుణ్యకోటి :** (రెండు వేళ్ళు చూపించి) మీ ఇష్టం వచ్చినది కోరండి.

**చంద్రశేఖరం :** (ఒకవేలు కోరుతాడు) ఉఁ సహాయ కార్యదర్శి జయా! మణెమ్మా!

**పుణ్యకోటి :** జయను ఎన్నుకుంటే మణెమ్మకు కోపంరాదూ?

**చంద్రశేఖరం :** ఆమె మాట ఎలా ఉన్నా భుజంగానికే రావచ్చు. అయినా ఉపాధ్యక్షపదవి ఉందిగా అది పారేద్దాం.

**పుణ్యకోటి :** మరి నీవో?

**చంద్రశేఖరం :** (నవ్వి) మనను అలా దూరంగా ఉణ్ణీ. బాపూజీ కాంగ్రెస్‌లో పావలా మెంబరైనా కానట్లు. ముహూర్తం ఈ క్షణానే. భుజంగం రాగానే ఆయన వెంట పత్రికా విలేఖరి తప్పనిసరిగా ఉంటాడు గనుక సమితి స్థాపనను గురించి గట్టిగా పత్రికల్లో గుద్దిచ్చామంటే దేశంలో కావలసినంత కళవళం బయలు దేరుతుంది.

**పుణ్యకోటి :** జయమ్మ అంగీకరిస్తుందా, నాతో కార్యదర్శిగా ఉండటానికి?

**చంద్రశేఖరం :** అనుమానం ఎందుకు రావలసి వచ్చింది? మహ చక్కగ అంగీకరిస్తుంది. ఆ భారం నామీద పారెయ్యి. లోపలికి వెళ్ళి జయతో మాట్లాడి చిన్న పార్టీ ఇక్కడికి సిద్ధం చేయించు. భుజంగంగారి విందుకు ముందే సమితి స్థాపన జరిగిపోవాలి. జయతో మాట్లాడి ప్రస్తుతం అక్కడున్నవి తినటానికి పట్టించుకోరా?

**చంద్రశేఖరం :** (కాసేపు పేపరు తిప్పి పారేసి – చెష్టుమీద ఉన్న 'గీత' తీసి ఒక శ్లోకం చదువుతాడు)

**'ఆపూర్య మాణ మచల ప్రతిష్ఠం**
**సముద్రమాపః ప్రవిశంతి యద్వత్**
**తద్వత్కామాయం ప్రవిశంతి సర్వే**
**సశాంతి మాప్నోతి నకామకామీ'**

తస్సదియ్యా మంచి మాటన్నావయ్యా మహాప్రభూ! అన్నీ నిన్ను చేరితీరవలసిందే? లేకపోతే మాకు ముక్తేముంది? (భుజంగం కారుచప్పుడు) వచ్చినట్లున్నారే! (లేచి తన సీటులో కూర్చుంటాడు)

**భుజంగం :** (మణెమ్మతో) మణీ! మహాగొప్పగా నడిపించాము. మన సంగతి ఇప్పటికి బాగా గ్రామంలో అర్థమై పోయి ఉంటుంది. లేకపోతే...

**మణెమ్మ :** వండర్‌ఫుల్‌గా నడిచింది బండి. ఏమంటారు! రావుగారూ!

(వాళ్ళ వాళ్ళ స్థానాలల్లో కూర్చుంటారు)

**మణెమ్మ :** ఏమండీ, చంద్రశేఖరంగారూ!

**చంద్రశేఖరం :** క్షణమాగండి. అంతా అర్థమౌతుంది. సేవాసమితి అంటూ ఒకటి స్థాపిస్తున్నాం నగరంలో.

**భుజంగం :** మణీ! ఇటువంటి సంస్థ అత్యవసరం కూడానేమో.

**మణెమ్మ :** నిజం! అద్భుతంగా ఉంది. అప్పటికి అన్ని భూములు మన వౌతవి.

**పుణ్యకోటి :** (ప్రవేశిస్తూ) మీరు వచ్చేశారే! సభలు బాగా జరిగినట్లేనా?

**భుజంగం :** అద్భుతంగా – మీరు ఏదో సమితి స్థాపిస్తున్నారు?

(జయ టీపార్టీ సన్నాహంతో బుడేను తీసుకొని వస్తుంది. బుడే అన్నీ అమరుస్తూ ఉంటాడు)

**పుణ్యకోటి :** అయిదునిమిషాలు మీరు నేను చెప్పినట్లు నడుచుకోవాలి.

**చంద్రశేఖరం :** ఇటువంటి సందర్భంలో మనకు రావుగారుండటం గొప్ప అదృష్టం!

**రావు :** భుజంగంగారితో ఉండటమంటే మాకు షీర్ ప్లెషర్ అప్పా!

**పుణ్యకోటి :** వర్గమతవిభేదాలూ వర్ణవ్యవస్థలూ లేవుగనుక బుడేసాహెబును కూడా సభ్యుణ్ణిగా స్వీకరిద్దాం.

**చంద్రశేఖరం :** జాతీయ ముస్లిం ప్రాతినిధ్యం.

**మణెమ్మ :** మా మహిళాలోకం సంగతి మరిచిపోవద్దని మనవి.

**పుణ్యకోటి :** అందుకనే సగానికి సగం. ఒక కార్యదర్శి, ఉపాధ్యక్షపదవులు రెండూ మీ స్త్రీ లోకానికిచ్చాం.

**రావు :** మా రిపోర్టులో ఈ విషయం ప్రత్యేకంగా మెన్షన్ చేస్తామప్పా!

**భుజంగం :** ఈ సంగతంతా ఏమిటో నాకు ఇంతవరకూ అర్థం కాలేదు.

**పుణ్యకోటి :** నగర సేవాసమితికి అధ్యక్షులుగా ఉంటున్నారని తెలిస్తే చాలును. (రిపోర్టు చూపిస్తే ఇద్దరూ చూస్తారు)

**చంద్రశేఖరం :** (పుణ్యకోటివంక చూస్తాడు – పుణ్యకోటి నీవే కానివ్వమన్నట్లు సంజ్ఞ చేస్తాడు)

నగర సేవాసమితికి భుజంగంగారిని అధ్యక్షులుగానూ, మణెమ్మగారిని ఉపాధ్యక్షులు గానూ ఎన్నుకున్నాము.

**(కరతాళధ్వనులు)**

జయమ్మ సహాయ కార్యదర్శి  పుణ్యకోటి కార్యదర్శి.

**(కరతాళధ్వనులు)**

**జయ :** మామయ్యగారూ క్షమించాలి నేను అంగీకరించలేను.

**మణెమ్మ :** అల్లా వీల్లేదు. నీవు తప్పకుండా అంగీకరించాలి. పుణ్యకోటిగారితో కలిసి పని చెయ్యటానికి వెనుకాడడ మెందుకు?

**పుణ్యకోటి** : అధ్యక్షులూ, ఉపాధ్యక్షులూ ఈ ఆసనాలు అలంకరించాలి.

(కూర్చున్న తరువాత మెళ్ళో దండలు వేసి కార్యక్రమం చేతికిస్తారు)

**భుజంగం :** 'ప్రార్థన'

**పుణ్యకోటి :** (జయమ్మవైపు చూస్తాడు)

**జయ :** (తప్పనిసరిగా లేచి నిలబడుతుంది)

**బుడే :** (వెళ్ళిపోబోతాడు)

**చంద్రశేఖరం :** బుడే! నీవు కూడా సమితి సభ్యుడివి, అక్కడ కూర్చో.

**బుడే :** క్యా మై భీ షభ్యుడూ? (భుజంగాన్ని చూచి భయం నటిస్తూ) ఆదాబరస్!

**జయ :** (లేచి)

**జోహారు జోహారు ఓ భరతమాతా!**
**జోహారు జోహారు వీర ప్రసూతా!!**
**రమ్యమూర్తివి నీవు. రత్నగర్భవు నీవు**
**తల్లులకు తల్లివే ఓ తల్లి నీవు? ॥ జోహారు ॥**

**ఋషి వాటికాధాత్రి రాజర్షినేత్రి**
**అందుకో అందుకో మావందనమ్ము ॥ జోహారు ॥**

**జోహారు జోహారు ఓ భరతమాతా!**
**జోహారు జోహారు వీరప్రసూతా!!**

(అంతా కరతాళధ్వనులు చేస్తారు జయ తిరిగివచ్చి తన స్థానంలో కూర్చుంటుంది. పుణ్యకోటి ప్రేమార్ద్ర నేత్రాలతో ఆమెనే చూస్తుంటాడు)

**భుజంగం :** (పుస్తకంలోనుంచి చూచి ఒక చిన్న ఉపన్యాసం చదువుతాడు – కరతాళధ్వనులు, చంద్రశేఖరం ధన్యవాదాలు చెప్పటం అయిపోయిన తరువాత)

**భుజంగం :** మరి ఫండ్సు విషయం ఏమిటోయ్ పుణ్యకోటీ!

**పుణ్యకోటి :** అన్నిటికీ మాకు మీరే ఉన్నారనుకున్నాము.

**భుజంగం :** నేనుమటుకు ఎన్నిటికని. మహిళాసంఘానికని మణెమ్మగారూ, నికేతనం పేరు పెట్టుకొని నీలమ్మగారూ, గ్రంథాలయం పేరుతో కామావధాన్లూ. మరో పేరుతో మన మరిడియ్య. – ఇలా ఇవ్వటం ప్రారంభిస్తే కుబేరుడు కూడా కొల్లబోతాడు.

**మణెమ్మ :** మీరామాటంటే మా మహిళామండలి ఇస్తుంది. ప్రస్తుతం డబ్బులేదని చూస్తున్నాను గాని.

**భుజంగం :** మీకేం మీరు వెళ్ళితే ఎక్కడైనా డబ్బు పుడుతుంది.

**చంద్రశేఖరం :** నాకోమంచి ఊహ తోస్తున్నది. మన అధ్యక్షులకూ, ఉపాధ్యక్షులకూ వేసిన దండలు వేలంవేస్తే వచ్చిన డబ్బు మూలధనంగా చేసుకుందాం.

**(భుజంగం, మణెమ్మ దండలు తీసి ఉంచుతారు)**

**రావు :** మా పత్రికా విలేఖరులపాట రెండువేలు.

**మణెమ్మ :** మహిళాసంఘం పాట రెండువేల అయిదు వందలు.

**చంద్రశేఖరం :** (భుజంగం అనుమతితో) భుజంగంగారి పాట మూడువేలు.

**పుణ్యకోటి :** జయమ్మ సంగీత ప్రదర్శనంపాట మూడువేల అయిదు వందలు.

**చంద్రశేఖరం :** మణెమ్మగారు వెనక్కు తీస్తున్నారు.

**మణెమ్మ :** మా పాట నాలుగువేలు.

**చంద్రశేఖరం :** భుజంగంగారి పాట అయిదువేలు.

**భుజంగం :** ఇంతటితో ఆపితే బాగుంటుంది.

**పుణ్యకోటి** : భుజంగంగారిపేర పాట కొట్టేశాం అయిదువేలు.

**మణెమ్మ :** మహిళాసంఘం చేతగానీ, ఉద్యోగసమితి చేతగానీ కొంతడబ్బు చందా వేయిస్తాను. సమితికి పదివేలు పోగు చెయ్యాలి.

**రావు :** అద్భుతంగా ఉందప్పా!

**చంద్రశేఖరం :** మణెమ్మగారి పాటతో ఈ మన కార్యక్రమం ముగిసి పోతుంది.

**మణెమ్మ :** సమయానికి సంబంధించినదే కానీ ఓ పాట అంటాను.

**పుణ్యకోటి :** ఆలోచిస్తే అన్ని పాటలూ అన్ని సమయాలకు సరిపోయి ఉంటవి.

**మణెమ్మ :** (గొంతు సవరించుకొని ఇంగ్లీషు డాన్సులాగా ఫాక్సు ట్రాట్‌లో)

> **లే, లే! లే, లే! లే, లే! లే, లే!!**
> **కాలం స్వల్పం భోగ్యమోయ్**
> **సౌఖ్యం సర్వం సాధ్యమోయ్!! లే, లే,**
> **నిన్న లేదు రేపురాదు.**
> **నేడే నేడే. నేడే, నోయ్!**
> **లే, లే! లే, లే! లే, లే! లే, లే!!**

**బుడే :** అచ్ఛా, బహుత్ అచ్ఛీ అచ్ఛీ బాత్ హై (భుజంగాన్ని చూచి భయపడి) ఆదాబరస్.

(తెర)

## * ప్రథమ యవనిక *

**చంద్రశేఖరం :** ఒరేయ్ పుణ్యం! ఇప్పుడీ భుజంగంగాడి దగ్గిర ఏ పాచికైనా పారుతుంది.

**పుణ్యకోటి :** అందుకనే అప్పుడప్పుడూ వచ్చి రవ్వంత స్తోత్రపాఠం ఘాటుగా పారెయ్యటం – నీ గురుత్వం అబ్బింది.

**చంద్రశేఖరం :** భేష్! ఐ యామ్ ఎ బిలీవర్ యిన్ కోల్డు ఫ్లాటరీ. ప్రసిడెంటుగిరితో మనిషి ఢిల్లీదర్వాజా అయిపోయినాడు కనిపెట్టావా? 'మంత్రాధీనాస్తు దేవతా' అన్నారు పెద్దలు.

**పుణ్యకోటి :** ఇందాక నీతో చెప్పానే ఆ ఆయన శిలావిగ్రహంతో మనిషి చిత్తైపోవాలి – అయితే జయ కొంత ఆలోచన ఉన్న మనిషిలా ఉంది?

**చంద్రశేఖరం :** 'స్త్రీణాం ద్విగుణ ఆహారో బుద్ధిశ్చాపి చతుర్గుణా' అన్నారు పెద్దలు. అందులో కొత్తగా కళాశాల నుంచి వచ్చిన గరల్ కావటం వల్ల ఇంకా కాస్త ఆలోచిస్తున్నది. అయితేనేం? బ్రదర్! స్త్రీ ఎన్నడూ పురుషుడు కాలేదంటే నమ్ము!

**పుణ్యకోటి :** నిజము. (చిత్రంగా చూస్తూ) ఏ పురుషుడైనా నీబోటి పురుషుడు చస్తే కాలేదు. మరి, నా మనవిమాట ఏం చేశావు?

**చంద్రశేఖరం :** ఇన్నిమాట్లు నాతో చెప్పటమంటే నన్ను శంకించటం మన్నమాటనేనా మరి?

**పుణ్యకోటి :** బుద్ధి,బుద్ధి! ఎంతమాట! చచ్చుపీనుగను నిన్ను శంకించటం బ్రతకటానికేరా భాయీ?

**చంద్రశేఖరం :** ఈ స్వల్పానికే ఇంత బాధపడతావనుకోలేదు.

**పుణ్యకోటి :** ఓ, నో నో! ఐ యాం ఒ.కె మరి మరచిపోవుకదూ?

**చంద్రశేఖరం :** ఇదిగో, అభయమిస్తున్నాను! ఇప్పటికి మూడోనెల తిరక్కముందే నీ యింటిముందు పెళ్ళికని కూష్మాండం కట్టించకపోతే అప్పుడడుగు. నేను బ్రహ్మయ్యశాస్త్రి కొడుకునే కాను. నిన్ను వాడి దశమగ్రహాన్ని జామాతను చెయ్యకపోతే...

**పుణ్యకోటి :** ఇక మనం ఆ విషయం మానేద్దాము. నీవు అనుగ్రహించావంటే నాకు చాలు. సేవాసమితికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్నట్లే కనుపిస్తున్నది.

**చంద్రశేఖరం :** మనమంతా పట్టి మోసేస్తుంటే ఉండ కదిి ఏం చేస్తుంది?

**పుణ్యకోటి :** ఏదో ప్రజాసేవ అంటూ ఆ చైతన్యంగాడు ఇన్నాళ్ళబట్టి పాకులాడుతున్నాడు. వాడివల్ల...

**చంద్రశేఖరం :** వాడి మొఘం – అయితే ఈ మధ్య ప్రాక్టీసు కూడా కొంత బాగున్నట్లుంది?

**పుణ్యకోటి :** డాక్టర్లకు ఎప్పుడూ ప్రాక్టీసుకు లోపం ఉండదు. ప్రతి వైద్యుడి ఇంటిముందూ తీర్థప్రజల్లా జనం ఎలా పుచ్చిపోతున్నారో చూడటంలేదూ. ఇసుకేస్తే రాలటం లేదు.

**చంద్రశేఖరం :** అది వాళ్ళ ప్రజ్ఞ అనటంకంటే, జనం అప్రయోజకత్వం అనటం సమంజసం. వాళ్ళకెప్పుడూ అసాధ్య రోగాలున్నవాళ్ళ వల్ల లాభిస్తుంది. అలాంటివాళ్ళు దొరక్కపోతే వాళ్ళే తయారుచేస్తారు కూడా! జలుబు చేస్తే చచ్చిపొయ్యేటంత హడావిడి చేసేవాళ్ళంటే వారికి మనస్సులో అపరిమితా నందం. ఆరోగ్యవంతులంటే పైకి ఆనందం.

**పుణ్యకోటి :** చైతన్యంగాడి ప్రాక్టీసు అంతా అటువంటిదే. అందువల్ల ఊళ్ళో కొంత ప్రభావం సంపాదించాడు.

**చంద్రశేఖరం :** బ్రదర్! ఒకమాట మరచిపోయినావు. డాక్టర్ల ప్రభావం అంతా ఉద్యోగస్థుల ఊసులాగా రోగంలో ఉన్నంతసేపు జబ్బునయమై స్నానం చేస్తే చాలు ఇంటికి వచ్చినా ముఖం జూడరు. చైతన్యం డబ్బు సంపాదించా డంటే ఒప్పుకుంటా! వైద్యానికని కొంత, ఖర్చులకని కొంతా బహుమానం క్రింద కొంతా ఇలా పోగు చెయ్యటం వాళ్ళకు పరిపాటి. వాళ్ళకారు పేషంట్లున్న ప్రతి అరఫర్లాంగుకు లెక్కకు గ్యాలన్ పెట్రోలు తాగుతుంది.

**పుణ్యకోటి :** ఎప్పుడైనా డాక్టర్లపని హాయైంది. జబ్బు నయమైతే తన ప్రజ్ఞనేయ వొచ్చు, రోగి చస్తే మందులు మంచివి రావటం లేదనో, మాచేతనైంది చేశాం వాడికి అదృష్టం లేదనో అనేయవచ్చు. అయితే ఇంతకూ చైతన్యంగాడి వల్ల సేవాసమితికి ఏమీ భయం లేదంటావు.

**చంద్రశేఖరం :** అబ్బే! వాడిని చూచి భయపడటమంటే అత్తను చూచి ఆధునిక అప్ టుడేట్ కోడలు హడలిపోవటం వంటిది. కేవలం అనాక్రానిజమ్ – సరే ప్రొద్దుపోయింది. మళ్ళీ ఒకమాటు కలుసుకొని భవిష్యత్కార్యక్రమం ఏర్పాటు చేద్దాం.

**పుణ్యకోటి :** మన సంగతి మళ్ళీ జ్ఞాపకం చేస్తున్నా!

**చంద్రశేఖరం :** జయను నీ యింట్లో నడిపించి నీ చేత నాట్యం చేయించకపోతే నేను... వెనక చెప్పానే... ఉఁ

**(నిష్క్రమణ)**

# ద్వితీయ దృశ్యం

(డాక్టరు చైతన్యం ఆసుపత్రి, మిస్ రేణు ముందుగా వచ్చి చిన్న చిన్న కేసులు చూస్తూ వస్తువులను సర్దుకుంటూ ఉంటుంది. దూరంనుంచి క్రింద జానపదగీతం ఉదయవేళ వినిపిస్తుంది)

**ఆడగొంతు :**

**'అప్పుడె మరిశావె మామా! న**
**న్నప్పుడె మరిశావె మామా!!**

**అద్దరేతిరియేళ**
**ఆకు తోటలకాడ**
**చందమామతొ మనము**
**సరసాలాడాము ...అప్పుడె....**

**మొగగొంతు :**

**ఎప్పుడు మరిశానె పిల్లా! ని**
**న్నెప్పుడు మరిశానె పిల్లా!!**

**చింతతోపుల్లోన**
**వంతపాటను పాడి**
**పులకరింతల వలపు**
**పొంగుపోశా నోసి ........... ఎప్పుడు .......**

**ఆడగొంతు :**

**అప్పుడు మరిశావె మామా! న**
**న్నప్పుడె మరిశావె మామా!!**

**రంగు గుడ్డలు కట్టి**
**కొంగు కొంగూ చుట్టి**

చిలిపి నవ్వుల తోటి
సిరిశైలమెక్కాము కామా?... ........అప్పుడె.........

**మొగగొంతు :**

ఎప్పుడు మరిచానె పిల్లా! ని
న్నెప్పుడు మరిచానె పిల్లా!!

ఏరు మన్నిద్దర్ని
వేరు చేస్తే యేమి?
గుండె గుండే చేరి
నిండుకున్నా యమ్మి ......ఎప్పుడు.........

**ఆడగొంతు :**

అప్పుడు మరిశావె మామా! న
న్నప్పుడె మరిశావె మామా!!

గుమ్మడీ పూవంటి
కొడుకు నియ్యామంటు
కొండదేవరవోరి
కోరుకున్నా మోయి! .....అప్పుడె........

**మొగగొంతు :**

ఎప్పుడు మరిచానె పిల్లా! ని
న్నెప్పుడు మరిచానె పిల్లా!!

మబ్బు పట్టిందంటె
మనసు నీకోసమ్మ
గునిసి గునిసీ యెంత
కోరాడు తుందోను ......ఎప్పుడు.....

(రేణు చేతితో సంజ్ఞ చేసి వారిని ఆపుతుంది. డాక్టరు చైతన్యం ప్రవేశించి ముసలయ్య సహాయంతో మందుల పెట్టె సర్దుకుంటాడు)

**రేణు :** నమస్తే, డాక్టర్‌సాబ్!

**చైతన్యం :** నమస్తే రేణూ!

**రేణు :** ఒక పేదరైతుకు పాతర తీస్తుంటే కట్లపురుగు కరిచిందట! అతనికి మందు వేసి వస్తున్నా.

**చైతన్యం :** మంపులు ఎక్కువగా ఉంటే మళ్ళా చెప్పమను. పాపం ఇంజక్షన్ ఇకటి ఇద్దాము. (థర్మామీటరు అందిస్తూ) ఆ ఎల్లయ్యకు టెంపరేచర్ ఎంతుందో చూడు. జబ్బు అర్థం కావటం లేదు. థౌజండ్ అండ్ ఒన్ కంప్లైయింట్లు.

**రేణు :** బ్రహ్మయ్య కళ్ళు బాగా నయమైనై. పనిపాటలు చేసుకుంటున్నాడు. మీకు ఏదో బహుమానమిస్తాడట!

**చైతన్యం :** పేదవాడు గామాలి?

**రేణు :** చెప్పినా వినేటట్లు లేదు.

**చైతన్యం :** ఉఁ అంతవరకూ వస్తే నేను నచ్చచెపుతాలే.

**(చీటీలు చూచి) బొౖరయ్యా!**

**(రేణు నిష్క్రమిస్తుంది)**

**బొౖరయ్య :** (వచ్చి నిలుచోని దణ్ణం పెడతాడు)

**చైతన్యం :** (పరీక్షించి) జబ్బేమిటి?

**బొౖరయ్య :** పోయిన తీర్థానికి చౌళ్ళంగిపోతే ఆడ ఓ గోసాయి ముండావాడు నన్ను రాయిలా సేత్తానని మందెట్టుండు బాబయ్యా!

**చైతన్యం :** (పెదవి విరిచి) మీరు వట్టి వెర్రిబాగులవాళ్ళోయ్! అందర్నీ నమ్మి దెబ్బతింటుంటారు.

**బొౖరయ్య :** సిత్తం, బాబయ్యా!

**చైతన్యం :** నెలదినాలు గట్టిగా మందు పుచ్చుకోవాలి. లేకపోతే చాలా ప్రమాదం.

**బొౖరయ్య :** జబ్బు నయమైతే నా కొడుక్కు నీ పెరెట్టుకుంటా బాబయ్యా!

**చైతన్యం :** ( చీటి వ్రాసియిస్తూ) కొడుకు పుడతాడని గట్టి నమ్మకమే నన్నమాట! సీసా లేకపోతే కంపోండరు నడిగి తీసుకోపో.

**(బొౖరయ్య డాక్టరు ఛలోక్తికి నవ్వి నిష్క్రమిస్తాడు)**

**రేణు :** (ప్రవేశించి) 1060

**చైతన్యం :** 1060. క్షణానికొక రకంగా ఉంటున్నది, ఇతని తత్వం. నెత్తిన ఐస్‌బాగ్ పెట్టి టెంపరేచర్ నోట్ చెయ్యి.

**(రేణు ఐస్‌బాగ్‌తో నిష్క్రమిస్తుంది)**

**(బాబోయ్, అమ్మోయ్, అనే కేకలు వినిపిస్తవి)**

**ముసలయ్య :** (ప్రవేశించి) సారాయికాపు ఊళ్లో మోపైంది సామీ! తాగి తందనాలు వేసి తలకాయలు బద్దలు కొట్టుకుంటున్నారు.

**చైతన్యం :** గ్రామాల్లో ఇది ఇంకా ప్రబలంగా ఉంది. అవినీతి ఇంతగా ప్రబలిపోతే ప్రభుత్వం మాత్రం ఎన్నింటికని – వీళ్ళను ఊళ్ళో పెద్దమనుష్యులు పట్టించకూడదూ?

**ముసలయ్య :** అంతా అలాగే ఉంటారుగాని పట్టించే అయ్య ఎవరో బయటపడలేదు. పట్టిస్తేమటుకు బయమేముంది? మర్నాడే బయటికొస్తారు.

**చైతన్యం :** ఎలా వస్తారు?

**ముసలయ్య :** అది మాకేం ఎరక? ఏదో నల్లబజారుందిట బాబూ!

**చైతన్యం :** (నిట్టూర్చి) నిజం, దొంగెవరో, దొరెవరో ప్రభుత్వం గుర్తించటం చాలా కష్టంగా ఉంది.

**ముసలయ్య :** ఆఁ. అన్నిందాలా మా పాణాలు పొయ్యాక అది గుర్తించేం. లేకపోతే ఏం? ఎటు చూసినా బీదోళ్ల బ్రతుకు నరకంగా ఉంది బాబయ్యా!

**చైతన్యం :** రోజుకూలీలు పెరిగినవిగా....

**ముసలయ్య :** ఏం ప్రయోజనం సామీ! అడ్డెడమ్మే ధాన్యం అరసోల తక్కువ మానెడు, సోల తక్కువ మానెడు. మళ్ళా మాట్లాడితే మూడు అరసోల్లు. ఉప్పు, మిరపకాయ, చింతపండు, ప్రతిదాని ఖరీదు సుక్కలు సూపిస్తున్నవి. (లోపలనుంచి 'గాంధీ పేరూ చెప్పి కల్లుముంతా వేసి' మొదలైన పాట ప్రారంభిస్తుంది)

**చైతన్యం :** అదేమిటి?

**రంగడు :** (ప్రవేశించి)

**గాంధీ పేరూ చెప్పి**
**కల్లుముంతా వేసి**
**పిల్లతో ఆటకు**
**పోరోయ్ బాబయ్య – అహఁ పోరోయ్ బాబయ్య –**

**చైతన్యం :** మోకాళ్లు బ్రద్దలైనా వీడికి కైపు తగ్గినట్టు లేదు.

**రంగడు :** కైపు. కాఫీ కైపు కాదంటయ్యా! నేను మంతిరినైతే హోటల్లు మూసేయించి పేదోళ్ళకోసం సారాయి షాపులు, కల్లుకొట్లూ కావాల్సినన్ని తెరిపిస్తా.

**కాఫీ కంటె నిజము**
**కల్లు మంచిదండి!**
**చలవచేసి ఒళ్లు**
**సత్తు వొస్తుందండి!**

**చైతన్యం :** రేణూ!... ఒక గ్లాసు ఇలా పట్టుకొరా?

**రేణు :** (సిరప్‌గ్లాసు తెస్తుంది)

**చైతన్యం :** (రంగడుదగ్గరకు వెళ్ళి) ఇంకా త్రాగుతావా?

**రంగడు :** తాగుతావా? తాగుతా, మళ్ళీ మళ్ళీ తాగుతా –

**ఓరు నువ్వు? రంగణ్ణే ఎరగవ్ –**
**రంగ డంటె ఓరు?**
**రాజోయ్ రాజోయ్!!**

**రంగడంటె ఊరి**
**రాజోయ్ మోజోయ్!!**

**ఊరిపెద్ద లంత**
**వొంగి దణ్ణమెట్టి**
**దొంగలల్లె మల్లి**
**తొల్గిపోవాలోయ్!** **రంగడంటె...**

**ముసలయ్య :** (కోపంతో) ఏడిశావు –

**రంగడు :** (కోపంతో చూస్తాడు)

**చైతన్యం :** అలాగే ఒప్పుకున్నాం.

**రంగడు :** ఓరికి బాకంట!

**చైతన్యం :** ఇదుగో ఇది పుచ్చుకో.

**రంగడు :** 'ఓవ్' (తాగి తృప్తి నటిస్తూ)

**ఎంత చక్కనిదానివే రంగిరీజు పిల్లా! ని**
**న్నే తల్లి గన్నదే రంగిరీజు పిల్లా!!**

**వంగపూవు కొప్పులోన,**
**వాలిపోయె సొగసు చూస్తె**
**ఒళ్ళు ఝల్లుమన్నదే**
**కళ్ళు చల్లనైనవే!** ఎంత చక్కని....

**పిల్ల అంటె పిల్లవా?**
**కల్లువంటి పిల్లవే!**
**ఒళ్ళు పనస తోటలే**
**కళ్లు మంచుతునకలే!** ఎంత చక్కని....

**కళ్లుకళ్లు కలిపి నీవు**
**ఒళ్లువిరిచి చూస్తివంటె**
**బాటలోన వెలుతురూ**
**తోటలోన తొలకరీ** ఎంత చక్కని....

**చైతన్యం :** (గట్టిగా) రంగడూ!

**రంగడు :** ఆఁ

**రంగడు :** ఓరు – చైతన్యం బాబయ్యా! బుద్ధి, బుద్ధి సామీ! మళ్ళీ తాగితే ఒట్టు బాబయ్యా, ఆడు పోయించాడు!

**చైతన్యం :** ఉ. పానపిశాచానికి ఇంత లొంగిపోయినావన్నమాట! మీవల్ల ఎవరికి ఉపకారమో ఆలోచించావా?

**రంగడు :** లేదు బాబయ్యా! ఇక తాగితే నామీద ఒట్టు. నా బిడ్డమీద ఒట్టు.

**చైతన్యం :** తాగుబోతులకు పెళ్ళాంబిడ్డ లున్నారటోయ్! (దీనంగా రంగడూ, నీవే తాగితే ఇంకేముంది. ఊరి పెద్దల్లో నీవూ ఒకడివి గదా? – మహాత్ముని విగ్రహం ముందు ఇక తాగనని ప్రమాణం చెయ్యి. మీ ఊళ్ళో కరణం మునసబుల తగాదా పరిష్కారం చేశాను. వాళ్ళు రంగడు సాయం చేస్తే మళ్ళీ గ్రామాన్ని సక్రమంగా నడిపిస్తారు.

**రంగడు :** తప్పక చేస్తా బాబూ!

**ముసలయ్య :** ఊరు చెడ్డదే వాళ్ళ తగాదావల్ల బాబూ! ఒకర్ని విడిచి ఒకర్ని పట్టుకొని భుజంగంగారు మా పొట్టలు కొట్టి పెట్టెలు నింపుకుంటున్నారు.

**పుణ్యకోటి :** (ప్రవేశించగానే ఇతరులు నిష్క్రమిస్తారు) హల్లో డాక్టరు!

**చైతన్యం :** (ఆసనం చూపిస్తూ) రండి. పుణ్యకోటిగారా?

**పుణ్యకోటి :** (కూర్చుంటూ) రేణు మా క్లాస్‌మేట్. ఏవో రెండు మాటలు మాట్లాడిపోదామని వచ్చాను.

**చైతన్యం :** స్త్రీ వార్డులో ఉన్నట్లుంది. (ముసలయ్యతో) నీ నాలుకేది? – మందడిగావు గదూ? (ముసలయ్య నాలుక చూపిస్తాడు) ఈ చీటి తీసుకుపో! (కలం క్రింద పెట్టి విశ్రాంతి నటిస్తూ) ఏమిటండి విశేషాలు?

**పుణ్యకోటి :** అన్నీ పేపర్లలో చూస్తున్నారు.

**చైతన్యం :** ప్రతి పత్రికా పార్టీతత్వంతో పనిచేస్తున్నట్టు కనిపించటం వల్ల ఈ మధ్య పేపరు చూడటము చాలావరకు మానేశాను. ముఖ్యవార్తలు చూచి అవతల పారవేస్తున్నాను. ఈనాటిలోకం చూస్తున్నకొద్దీ నాకు మహాత్ముని మాట ఎప్పుడూ జ్ఞాపకం వస్తుంది.

**పుణ్యకోటి :** ఏమిటది?

**చైతన్యం :** యుద్ధానంతరం ఏర్పడ్డ మొదటి నష్టం సత్యం అని.

**పుణ్యకోటి :** మహాత్ముడు! ఆయన ఏదన్నా అంత బాగుంటుంది? మన భుజంగంగారు కూడా అలాగే మహాత్ముడిలా మహాత్యాగి. దేశంలో నేడు జరుగుతున్న ప్రచార ప్రబోధాలకు ఆయనే కారకుడు. ఆయనకు ఆల్ ఇండియా ఫేమ్ వచ్చేస్తున్నది.

**చైతన్యం :** వరల్డు ఫేమ్ కూడా వస్తుంది. ప్రస్తుతకాలంలో డబ్బుంటే సరి?

**పుణ్యకోటి :** కేవలం ఆయనలో మీరన్న డబ్బొక్కటే కాదు. విద్య, ధనం, దానం, త్యాగం, భోగము – అన్నీ ఒక్కచోట రూపొందినవి. మొన్నటి వారపత్రికలో ఆయన సంపాదకీయం చదివారా?

**చైతన్యం :** 'ప్రగతి' మాటేనా? అది వారి పెట్టుబడిలో నడిచే పత్రికేగామాలి. పత్రికావిలేఖరులను కూడగట్టుకుంటే ప్రతిష్ఠకేమి లోటండీ!!

**పుణ్యకోటి :** అలా అనటం సాహసం.

**చైతన్యం :** అయితే ఇన్నాళ్ళబట్టీ ఏదో ఉడతాభక్తిగా ఉచితవైద్యం చేస్తూ ప్రపంచమంతా మెచ్చుకుంటున్న ఆ గాంధీతత్వాన్నే ప్రచారం చేస్తున్నాను గదా, నన్ను గురించి నాలుగు మంచిమాటలు ప్రగతి ఎప్పుడూ పలికినట్లు కనిపించదు?

**పుణ్యకోటి :** దానికి కారణ మేమిటంటారు?

**చైతన్యం :** అందరూ లక్ష్మీపుత్రులు కాకపోవటమూ, మణెమ్మలతో పరిచయం లేకపోవటము.

**పుణ్యకోటి :** మణెమ్మగారిని గురించి మీరు మహాపొరబాటైన అభిప్రాయం పడుతున్నారు. మన సంఘంలో ఉన్న దుర్గుణం అది. కాస్త ముందుకువచ్చే స్త్రీని చూస్తే కళ్ళల్లో దుమ్మోసుకుంటారు. అపనిందలు అంటగట్టుతారు – ఆమెలో ఏ గుణం లేకపోతే అంత ఇన్ఫ్లుయన్సు అందరిలో ఎలా వచ్చిందంటారు?

**చైతన్యం :** ఏమి ఇన్ఫ్లుయన్సు?

**పుణ్యకోటి :** ఏమి ఇన్ఫ్లూయన్సు అంటే చెప్పేదేమిటి? ఊళ్ళో ఉద్యోగులూ, ఉద్యోగేతరులూ ఆమె మాటకు అంతా అడుగుదాటటానికి వీలుందా?

**చైతన్యం :** అలాగేం? – ఆమె మీ సమితి ఉపాధ్యక్షురాలు గామాలి.

**పుణ్యకోటి :** మహిళామండలి అధ్యక్షురాలుకూడాను. సమితికి గొప్ప సాయం చేస్తున్నది.

**చైతన్యం :** నిర్మాణ కార్యక్రమం సాగించారా ఏమైనా?

**పుణ్యకోటి :** పార్టీని బలపరచటానికి పైకికొట్టిన టెలిగ్రాముల్లో ఆమె ఇంతంత పనిచేసిందని చెప్పలేము. – వారం దినాలల్లో క్రొత్త ఎన్నికలు వస్తున్నవి. మిమ్మల్ని సభ్యులనుగా జేసి అధ్యక్షుణ్ణిగా చెయ్యాలని భుజంగంగారూ, మణెమ్మగారూ ఏకాంతంగా ఆలోచించారు.

**చైతన్యం :** సారీ! నేను ఏ సంస్థతోనూ సంబంధం పెట్టుకోదలచలేదు.

**ముసలయ్య :** (ఆతురతతో ప్రవేశించి) భుజంగంగారి నోటు బాకీ ఇవ్వలేదని బుడేసాహెబు దౌర్జన్యం చేసి సన్యాసయ్య తలబద్దలు కొట్టి వెళ్ళిపోయినాడు – నెత్తురు వరదలై పోతున్నది. కట్టుకట్టించాలి బాబూ!

**చైతన్యం :** నేను వస్తున్నాను. సుబ్బయ్యను ముందుగా వెళ్ళి లోషను పెట్టి గాయం కడుగుతుండమను (పుణ్యకోటితో) ఇదండీ, ఈ గొప్పవారు చేస్తున్న ప్రజాసేవ. తాము చిక్కకుండా తప్పించుకోగలరు.

**పుణ్యకోటి :** వీళ్ళెంత మూర్ఖులో మీరు గమనించలేదు. ఆమాత్రం భయపెట్టకపోతే ఆయనమటుకు ఎన్నిటికని కోర్టెక్కుతాడు.

**చైతన్యం :** వాళ్ళు మూర్ఖులు కాకపోతే అన్ని ఐశ్వర్యాలు అనుభవిస్తున్న భుజంగంగారు మూర్ఖుడౌతాడా? – ఈ నాగరికత ఇలా నడిచేటంతవరకూ వారికేం ప్రమాదం లేదు – సెలవు.

**(నిష్క్రమిస్తాడు)**

**పుణ్యకోటి :** (చైతన్యాన్ని ఉద్దేశించి) పాపం! బాగుపడలేని పెద్దమనిషి! ముసలయ్య వచ్చి అవీ ఇవీ సర్దుతూ ఉంటాడు) ఏమోయ్ నీవు డాక్టరుగారి దగ్గిర పనికి కుదిరావా ఏం?

**ముసలయ్య :** ఆయన నాకు ప్రాణాలిచ్చారు బాబూ!

**పుణ్యకోటి :** (నవ్వుతూ) ప్రాణాలివ్వటమే! చంపేశావు!! ఆయన్ను అమాంతంగా దేవుణ్ణి చేసి కూచోపెడుతున్నావే? ఉc. డాక్టరుగారి సంపాదన జోరుగా ఉన్నట్లుంది?

**ముసలయ్య :** పేదోళ్ళదగ్గిర కానీ పుచ్చుకోని అయ్యకు సంపాదనే ముంటుంది? మోతుబరి రైతులేమైనా ఇస్తే అదీ మాకు మందుకోసం ఖర్చు పెడుతుంటాడు.

**పుణ్యకోటి :** సంసారమదీ ఏమీ లేదనుకుంటాను. ఇంకేం చేస్తాడులే.

**ముసలయ్య :** ఈ దొరలేకపోతే మొన్నటి మారెమ్మకు ఊరంతా తుడుచుకు పొయ్యేది.

**పుణ్యకోటి :** (నవ్వి) పిచ్చివాళ్లు! తెలివితేటలంటే ఇలా ఉండాలి. పెట్టెలమీద పెట్టెలు ఈయనకు మందు సప్లై చేసిన మహాత్ముడు భుజంగంగారు పోనేపోయినాడు.

**ముసలయ్య :** ఆయన బాబుగారి ఇల్లు తాకట్టు పెట్టుకొని ఇచ్చారటగా బాబూ!

**పుణ్యకోటి :** ఆ తాకట్టు మరో అందుకు. ఈ అయ్యగారిని సీమకు పంపించి చదువు చెప్పించిందే ఆయన.

**(రేణు ప్రవేశిస్తుంది)**

**పుణ్యకోటి :** హల్లో రేణూ! ఒకమాటు మీ ఇద్దరి సేవనూ ప్రశంసించి పోదామని వచ్చాను.

**రేణు :** (చిరునవ్వుతో) మాకు అన్నివైపులనుంచీ వట్టి ప్రశంసలు గట్టిగా వర్షిస్తూ ఉన్నవి.

**పుణ్యకోటి :** మావి గట్టి ప్రశంసలు! భుజంగంవంటి పుణ్యాత్ముడు ఊళ్ళో ఉంటే వృధాగా మీరు ఇంత శ్రమపడటమెందుకు?

**రేణు :** ప్రతిఫలం లేని ఉపకారం ఆయన చెయ్యడేమో!

**పుణ్యకోటి :** పొరపాటు! ఆయన త్యాగం ఇంకా ఎవరికీ అర్థం కాలేదు. మీరు తలపెట్టిన కార్యక్రమం పెద్దఎత్తుమీద భుజంగంగారు సేవాసమితి తరఫున చేయించదలచుకున్నారు. అందులోఅనేకమంది నర్సులమీద వైద్యం తెలిసి అజమాయిషీ చేసే నర్సుకు, నెల 1కి 400/- జీతం ఇవ్వటానికని నిశ్చయించు కున్నాడు.

**రేణు :** అయితే అనేకమంది దొరుకుతారు.

**పుణ్యకోటి :** తాలాతోలీ వాళ్ళవల్ల ప్రయోజనం! నీబోటి అకలంకమైన దేశభక్తురాలు కావాలి. భుజంగంగారికి - నేను నీ పేరే సజష్టు చేశాను.

**రేణు :** థాంక్సు! - కానీ నేను ఆ ఉద్యోగాన్ని స్వీకరించలేను.

**పుణ్యకోటి :** సమితి ఫండ్సులోనుంచి ఇంకా కావలెనంటె ఎక్కువ జీతం కూడా పుచ్చుకోవచ్చును.

**రేణు :** చైతన్యంగారిని ఒదిలిపెట్టి నేను ఒంటరిగా ఎక్కడికీ రాలేను.

**పుణ్యకోటి :** మీరు ఇద్దరూ సమితిలో సర్వీస్ చేస్తే మరీ సంతోషము.

**రేణు :** ఆయన భుజంగంగారితో ప్రజాసేవలో ఎటువంటి సంబంధం పెట్టుకోరను కుంటాను.

**పుణ్యకోటి :** అబ్బో! అగ్రశ్రేష్ఠుడు గామాలి. (లేస్తూ) బాగా ఆలోచించండి. భుజంగంగారితో వైరం ఏమాత్రమూ మంచిది కాదని మా సలహా. (చిరుకోపాన్ని ప్రకటిస్తాడు)

**రేణు :** ఇందులో వైరమేముంది?

**పుణ్యకోటి :** ఏముందంటే సరా. ఉంది. మరి మంచిది (నిష్క్రమణ)

**ముసలయ్య :** (ప్రవేశిస్తూ) అమ్మా! పాపం చాలా బాధపడుతున్నాడు. మీరు ఒక్కమాటు ఆయల్లమంద దగ్గిరకు వెళ్ళిచూడాలి.

**రేణు :** అలాగా (నెమ్మదిగా ఏదో ఆలోచిస్తూ వెళ్ళుతుంది)

**ముసలయ్య :** సాయంత్రం సభలో సంగతేమిటో చెప్పించాలిసిందే డాక్టరు బాబయ్యగారిచేత – మారెమ్మొచ్చినప్పుడు మందిప్పించి రక్షించినవాడు గూడెంలో గడ్డివాములు తగలేయించటమెందుకు? –

**చైతన్యం :** (ప్రవేశిస్తూ) పాపం! చాలా గట్టిదెబ్బ తగిలిందోయ్! (ముసలయ్య అందించే ఉత్తరం చూసి) సరే. సాయంత్రం మీటింగు పెట్టి అన్ని విషయాలూ మాట్లాడుతాను. మీ అందరి అండా నాకు ఉంటే ఇటువంటి భుజంగాలెంతమంది మన్నేం చేస్తారు.

**ముసలయ్య :** మారెమ్మకు మందు సప్లై చేశాట్టగా బాబూ, భుజంగంగారు.

**చైతన్యం :** పుణ్యకోటి చెప్పాడా? (ముసలయ్య తలూపితే) ఇతడు వాడి ఏజంటు. ఇప్పుడు వెనుకటిమాదిరిగా కాదు కొత్త ప్రభుత్వంలో ప్రతివాడికీ ఓటు ఉంది – దానివల్ల అన్నీ మారిపోతున్నవి.

**ముసలయ్య :** మాకు కూడాన బాబయ్యా?

**చైతన్యం :** మీకేమిటి! మైనారిటీ తీరిన ప్రతివాడికీ. అందుకోసమే ఈ ప్రచారమంతా?

**ముసలయ్య :** మళ్ళీ భుజంగం వంటివాళ్ళు పెబుత్వానికి రావటం కల్ల బాబయ్యా.

**చైతన్యం :** అంత చులకనకాదోయ్ ముసలయ్యా! అవసరమైతే సంచులు కుమ్మరిస్తారు మీలో కొందర్ని చీలదీసి కొనేస్తారు. వాళ్ళకు ఎన్ని నాటకాలైనా చేతౌ.

**చంద్రశేఖరం :** (ప్రవేశిస్తూ ఉంటాడు. చైతన్యం నమస్కరిస్తాడు) శతమానం భవతు శతాయుః పురుషశ్శతేంద్రియ ఎట్సెట్రా.

**చైతన్యం :** నిష్ప్రయోజనంగా ఎందుకంత దీర్ఘమైన దీవెన వృథా చేస్తావు బ్రహ్మచారిముండావాడిమీద?

**చంద్రశేఖరం :** అమ్మయ్య (కూర్చుంటూ) – ఘోటక బ్రహ్మచారులుగా ఉండిపోతామని ఘోరమైన శపథాలు చేసిన బ్రహ్మచారి ముండావాళ్లే పెళ్ళిళ్ళమీద పెళ్ళిళ్ళు చేసుకొని పిల్లల తండ్రులై ఇండియా జనసంఖ్య ఊరికే పెంచేస్తున్నారు – ఊc. ప్రాక్టీస్ అద్భుతంగా ఉందిటగా –

**చైతన్యం :** ఏదో బండి నడిచిపోతున్నది. ఎక్కడినుంచి?

**చంద్రశేఖరం :** సమితి చందాలకని గ్రామగ్రామమూ ప్రచారం చేసుకుంటూ ఊళ్ళో ఉన్నావని ఇలా వచ్చాము.

(చంద్రశేఖరం వెంటవచ్చిన ప్రచారకులు పాడుతూ ఉన్న క్రిందిగీతం లోపలనుంచి వినిస్తుంటుంది)

**రైతు కూలి రాజ్యమేను**
**రామ రాజ్యమూ అహ – రామరాజ్యమూ**

**కల్ల కపట మెరుక పడని**
**చల్లనైన రాజ్యము**
**సాగిరమ్ము రైతుబాబు**
**చక్క రమ్ము కూలిబాబు** ......**రైతుకూలి**....

**ధర్మపథము పట్టినడచి**
**ధైర్యమూని గడచి గడచి**
**సౌఖ్యహేతువైనభూమి**
**స్వర్గసీమ చేరుదాం** ......**రైతుకూలి**....

**చైతన్యం :** డబ్బాలు నిండుతున్నవా? హడావుడి జాస్తిగా ఉందే!

**చంద్రశేఖరం :** ఒరేయ్! ఇదంతా ప్రచారపు స్టంటుగానీ డబ్బెవడికి కావాలోయ్. తలచుకుంటే పట్టణంలోనే వసూలు చెయ్యలేమూ – ఆయన చందాలు వసూలు చెయ్యటమంత బాధకో పని మరొకటి లేదంటే నమ్ము.

**చైతన్యం :** ఏదో ప్రతిఫలం చూపించేశక్తి ఉండాలనుకుంటాను?

**చంద్రశేఖరం :** అందులో పడతి పాశుపతాస్త్రం!

**చైతన్యం :** భుజంగంగారి దగ్గిర రెండూ ఉన్నట్లున్నవి.

**చంద్రశేఖరం :** ఆయనకేమోయ్, అదృష్టవంతుడు!... లక్ష లార్జిస్తున్నాడు. లక్షలు ఖర్చు చేస్తున్నాడు. టక్కుటమార గజకర్ణ గోకర్ణ లంబవిద్యలన్నీ ఆయనకు వెన్నతో పెట్టినవి.

**చైతన్యం :** అయితే నీకు కోపం రాకుండా ఉంటే ఒక మాట అడుగుతాను. ఆయన ప్రస్తుతం ప్రజకోసం వెలగబెడుతున్నదేమిటోయ్!

**చంద్రశేఖరం :** ఇంకోరు మటుకు? పట్టణం రాజకీయాలన్నీ ఒక్క చేతిమీదుగా ఐకమత్యంతో నడిపిస్తున్నాడు. అందరికీ మంచిగా ఉండి, అంతవాడు లేడనిపించుకుంటున్నాడు.

**చైతన్యం :** ఎంత తెలివిగలవాడు కాకపోతే ఇంట్లో ఒక్కొక్కళ్ళను ఒక్కొక్క పార్టీలో సభ్యులుగా చేర్చి నాటకమాడగలుగుతాడు? తమ్ముడు సోషలిస్టు, కూతురు మరొక ఇష్టు. తాను కాంగ్రెసు. గాంధీజం పేరు చెపుతాడు. ఖద్దరు కట్టడు. హరిజన సేవంటూ వాళ్ళమధ్య పుల్లలు పెట్టి పోట్లాటల్లో ఇద్దరికీ పెట్టుబడి పెడుతుంటాడు, ప్రాపకంకోసం.

**చంద్రశేఖరం :** ఇంతేనా?

**చైతన్యం :** కులతత్వాలు నశించాలని స్లోగన్. తనవాడైతేనే గాని ఫ్యాక్టరీ కూలికైనా ఒప్పుకోడు. అంతదూరమెందుకు? తాను కట్టించిన ధర్మఫండు సత్రంలో తలకూడా దాచుకోనివ్వడు.

**చంద్రశేఖరం :** భాయీ! అంత చెడ్డవాడు కాడు. నీవు చాలాదూరం వెళ్లుతున్నావు.

**చైతన్యం :** నిన్ను గురించి నా అభిప్రాయం చెప్పనా? (ఉఁ అన్నట్లు చంద్రశేఖరం తలఊపితే) నీవు అతని ఏజంటువు. చంద్రం! మీబోటివాళ్ళవల్ల ఇతరులకు ఎంత ప్రమాదం కలుగుతున్నదో ఆలోచిస్తే నిమిషం ఆ పని చెయ్యలేవు.

**చంద్రశేఖరం :** (అంగీకరించినట్లు) నిజం! మనం అలా బతకవలసి వచ్చిన కాలం వచ్చింది. బుర్ర ఉంది పూర్తి అవకాశాలు లేవు. బ్రదర్ చాలా టైమైంది. నాకోసం సత్రంలో మణెమ్మ వెయిట్ చేస్తున్నది – మరి భుజంగం నీ మెడికల్ స్టోర్సు బాకీ గట్టిగా అడిగి రమ్మన్నాడు – నెల దాటక ముందు డబ్బు రాలేకపోతే కోర్టులో కేస్ ఫైల్ చేస్తానని చెప్పమన్నాడు. ఇవాళ 27వ తారీఖు.

**చైతన్యం :** చేస్తే మటుకు చేసేదేముంది?

**చంద్రశేఖరం :** ఒరేయ్, కాలం మారిపోయింది. ఒక్కమాటు భుజంగం దర్శనం చేస్తే – మొత్తం పద్దు ఎత్తేసే ఏర్పాటు చేస్తాను.

**చైతన్యం :** చంద్రం! ఈ గొంతులో ఊపిరి ఉండగా చేయలేను.

**చంద్రశేఖరం :** ఇక చెప్పేదేముంది? సరే! (నిష్క్రమణ)

**చైతన్యం :** (పంపించివచ్చి నిట్టూర్చి తీక్షణంగా గాంధీ బుద్ధవిగ్రహాలవైపు చూస్తూ ఉండగా రేణు ప్రవేశిస్తుంది)

రేణూ! మా సంభాషణ విన్నావా ఏం?

**రేణు :** విన్నాను – (బుద్ధదేవ, మహాత్మాగాంధీ విగ్రహాలను చూపిస్తూ) ఈ మహాత్ముల అనుగ్రహం తప్పకుండా ఉంటే కాలం అదే కలిసివస్తుంది – ధైర్యం వహించాలి.

**రేణు :**

> **ఓహో జగద్గురువులారా!**
> **ఓహో, జగజ్జ్యోతులారా!**

**చైతన్యం :**

> **నీరు పోసి పెంచిన మీ**
> **కోరికలను వల్లికలము –**
> **దెసదెసలను మసలుటయే**
> **తీయని మా కోరికలూ — ఓహో, జగద్గురువు లారా!**

**రేణు :**

> **క్రూరార్కుని కిరణములకు**
> **కొంత కొంత వాడితిమి**
> **జడిగా దయ వర్షింపుదు**
> **బడలికెదల వికసింతుము**
>
> **ఓహో, జగద్గురులారా!**
> **ఓహో, జగజ్జ్యోతులారా!**

(తెర)

*** ప్రథమ యవనిక ***

(ప్రవేశము : రంగడు దూరంగా పోతూఉన్న రావును చూచి)

**రంగడు :** ఇదుగో! నిన్నేనయ్యోవ్!.... ఓ టోపీ ఆయనా?

**రావు :** (దగ్గిరకు వచ్చి ఉరిమి చూస్తుంటాడు) ఏం? బ్రూట్‌లా వున్నావు?

**రంగడు :** కాందెందుకు పిలుస్తాను. అలా సూస్తావేమయ్యా! తెల్లోడి తొడలోనుండి వూడిపడ్డట్టు! మేమూ మనుష్యులమే.

**రావు :** కారని ఎవరన్నారు? మర్యాద తెలియవద్దూ.

**రంగడు :** ఇందులో తప్పేముందయ్యా నాయాల్టిది అప్పుడే అంత పొడుచుకోవచ్చింది. 'పేరు తెలియక టోపీ ఆయనా' అంటే అంత మండిపడతావు – సరేగాని నీవు పోర్టరువు గదూ?

**రావు :** నాన్సెన్సు! నేను కరస్పాండెంటును.

**రంగడు :** అదికాదయ్యా! పేపర్లకు రాసేవాడివి నీవు కాదటయ్యా!

**రావు :** అవును.

**రంగడు :** మరి నా పేరు వేయిస్తానని వెనక వచ్చినప్పుడు చెప్పావు. ఇంతవరకూ పడలేదటగా మా కరణమన్నాడు.

**రావు :** ప్రతివాళ్ళ పేరు పడుతుందనుకున్నావా ఏం? పెద్ద పెద్దవాళ్ళ పేర్లు దేశసేవ చేసినవాళ్ళవి గాని పడవు.

**రంగడు :** అయితే నన్ను తీసిపారేశావన్నమాటే! ఇదిగో నాయెంట పొలిమేరల్లో ఉన్న ఊళ్ళన్నిటికీ రా, ఎవరు గొప్పో తెలుస్తుంది.

**రావు :** నాకేం పని? నా యిష్టం వచ్చింది రాసుకోపోతాను.

**రంగడు :** ఆఁ, రాసుకోపోతావు, రాసుకోపోవూ మరి? నీయిట్టమేటయ్యా! ప్రతినాయాలు వచ్చేది, ఏందో రాస్కపొయ్యేది, మా తాడు తెగేది, ఇక్కడ ఏం రాశావో సదివి యినిపిచ్చి మరీ వెళ్ళకపోతే సూడు నా దెబ్బ.

**రావు :** మీరంతా వట్టి మొరటువాళ్లు. మీరు పట్టిన పట్టే గాని మంచీ చెడ్డా తెలియదు.

**రంగడు :** మాకు తెలియదంటావు. ఉః. అబ్బో! మీకంతా తెలిసింది. నాలుగు ఇంగ్లిపీసు ముక్కలు నేర్చుకోంగానే సరేనంటయ్యా! – ఏదీ సదువు సూద్దాము, ఏం రాశావో,

**రావు :** ఏముందీ! నేనేం రాయలేదు –

**రంగడు :** ఆ చెట్టుకింద కూర్చోని అన్ని కాగితాలు పాడుసేస్తివి గదయ్యా!

**రావు :** అది నా డైరీ లే.

**రంగడు :** అందులో నన్నా నా పేరు రాయవంటయ్యా ఎండలో ఎన్నాల్లో కట్టపడ్డాను.

**రావు :** నీవు చైతన్యంగారి మనిషివా?

**రంగడు :** (సంతోషంతో) అవును. ఆ అయ్య యేం సెయ్యమంటే అది సేస్తాను.

**రావు :** అందుకోసమనే నీ పేరు పేపర్లో పడలేదు.

**రంగడు :** (ఆశ్చర్యం చూపుతూ) అదేంటయ్యా! ఆ దొర మాలావుదొడ్డోడే! అందుకని నా పేరు పడకపోతే ఆసుపత్రికెందుకయ్యా?

**రావు :** మీకేం తెలుసు?

**రంగడు :** తెలియకే గదూ అడగటం – తెలిస్తే అడగటమెందుకు?

**రావు :** మా 'పత్రిక' ఎప్పుడూ ఒకే ఉద్దేశం పెట్టుకొని పని చేస్తుంది.

**రంగడు :** ఔను! ఆ సంగతి తెలుస్తూనే ఉంది. ఆ భుజంగం వంటివారిని గురించి మంచిగా రాస్తుంది. – మీరంతా గుడ్డివాళ్ళా ఏమయ్యా! చైతన్యంగారు మాకోసం ఇంత శ్రమపడుతూ ఉంటే ఆయన్ను గురించి ఓ మాటైనా వ్రాశారు గాదట, మావోళ్ళంటున్నారు.

**రావు :** మా ఇష్టం వచ్చినట్టు వ్రాయటానికి వీలుండదు. ఓ పాలసీ వుంటుంది. దాన్నిబట్టి వ్రాయాలి. లేకపోతే మా ఉద్యోగం పోతుంది.

**రంగడు :** పాలసీ ఆ – బోలెసీ ఆ! నిజం వ్రాస్తే ఉద్యోగం పోతే దానమ్మ నాయాల్టిది పోతే పోయింది. ముష్టెత్తుకోవచ్చుగదయ్యా! మీ సదువుకున్నాళ్ళే అబద్ధాలు చెపుతుంటే మమ్మల్ని తప్పట్టటమెందుకు?

**రావు :** నిజమే మరి? అది మన ఇష్టంలో లేదు.

**రంగడు :** అయితే మీరంతా సేతగానోళ్ళు. మా వూళ్ళో ఒక్క యెదవ అబద్ధం సెప్పిండో ఆడికి మళ్ళీ కూడుపుట్టకుండా సెయ్యంటయ్యా! మీకుకూడా అట్టా సేస్తే మర్నాటికల్లా మాటినరండి. సరేగానీ భుజంగం వంటి డబ్బున్నోళ్ళంతా మిమ్మల్ని కొనేస్తారంటగా?

**రావు :** మమ్మల్ని కాదుగానీ మా పేపరు పెట్టినవాళ్ళనే కొనేస్తారు.

**రంగడు :** అంటే అదే గదంటయ్యా! వాళ్ళనుకొంటే మిమ్మల్ని కొన్నట్లేగా. బఱ్ఱెను కొంటే దూడను కొన్నట్లే. ఓరి ముసలయ్యా!

(ప్రవేశము ముసలయ్య) ఈనెవరో పేపరాయనంటగాని, పట్టుకో బోదాంపా! ఏందేందో రాసుకోపోతున్నాట్ట!

**రావు :** (భయపడుతూ) నన్ను పట్టుకుపోతే ఏముంది? మావాళ్ళు ఎలా వ్రాయమంటే అలా వ్రాస్తాము.

**ముసలయ్య :** (దగ్గరికి వస్తాడు) మిమ్మల్ని పట్టుకుంటే యిడిపించను మీవాళ్లు వస్తారు. – వాళ్ళతో మాట్లాడి అప్పుడు ఇడిపిస్తాములే. ఆఁ

**రావు :** ఇది చాలా ప్రమాదం!

**రంగడు :** అవును నీకు ప్రమాదం కాదంటయ్యా మరి –

**రావు :** మాకు ప్రమాదమైతే నాలుగురోజులు జైల్లో పెడతారు. అంతేనా?

**ముసలయ్య:** పోనీ అబద్దాలు రాయనని ఒట్టెట్టుకో నిన్ను ఒదిలిపెడతాము.

**రావు :** (తప్పనిసరైనట్లు నటించి) అబద్ధాలు వ్రాయను.

**ముసలయ్య :** చైతన్యంగారిని గురించి మంచిగా వ్రాస్తామని మా ముందు దణ్ణం పెట్టి చెప్పు.

**రావు :** తప్పకుండా! (దణ్ణంపెడుతూ) నా దేవుడి సాక్షిగా చైతన్యంగారిని గురించి అబద్ధం వ్రాయను  అబద్ధం వ్రాయను.

**రంగడు :** మహానుభావుడని వ్రాస్తాను.

**రావు :** మహానుభావుడని వ్రాస్తాను.

**రంగడు :** మమ్మల్ని గురించో?

**రావు :** (మీరిద్దరూ నిలవబడండి) ఫొటోతో సహా గ్రామాలల్లో మీ సేవను గురించి వ్రాస్తాను. (ఫొటో తీసినట్లు నటిస్తాడు)

**రంగడు :** అయితే ఇక వెళ్ళు. ఇదుగో ఈ తడవ పొలిమేరల్లో అబద్ధాలు వ్రాసి కాలుపెట్టేవో కట్టేస్తాము –

**రావు :** నన్ను మరి నమ్మాలి. నేను కూడా పేదవాణ్ణి కదూ!

**ముసలయ్య :** అయితే పో బాబూ! – రంగడూ – ఆయనా మనంటి మారాజే! (రావు నిష్క్రమిస్తుంటాడు)

**రంగడు :** మనంటివాడైతే మనమంటే మండిపడతాడేమంట – ఇదిగో, ఇలా ఒక్కొకళ్ళకు బుద్ధిచెపితేగాని మంచి బయటికి రాదురా? – ఈ తెలివిగలవాళ్లు ఎంత దొంగలో నీకు తెలియదు.

**(నిష్క్రమణ)**

# తృతీయ దృశ్యం

(భుజంగం ఇంట్లో ఒక భాగం - సేవాసమితి ఆఫీసుగది. జయమ్మ ఒంటరిగా కూర్చొని ఉంటుంది. చైతన్యం వ్రాసిన గీతానికి ట్యూన్ వేసుకుంటూ ఉంటుంది)

**కలకందని ఆ లోకం!**
**కనినారా! కనినారా!!**

**కలకందని ఆ లోకం**
**కాంచన ఘన నవలోకం**
**కదలిందీ, కదలిందీ**
**జాతిరథం! రాతిరథం** **కలకందని...**

**ప్రభువులమే మేము**
**బానిస లిక లేరు**
**చైతన్యం! నవచైతన్యం**
**సుప్తోద్ధృత నవచైతన్యం**

**కలకందని ఆ లోకం!**
**కనినారా! కనినారా!!**

**రేణు :** (ప్రవేశించి) ఏం జయా! డాక్టరు చైతన్యంగారి పాటే!

**జయ :** ఏం వారిపాట నేను పాడకూడదా ఏం? - రా రేణూ ఇలా కూర్చో.

**రేణు :** ఏం జయా! ఒంటరిగా కూర్చున్నావు. మీ సమితి సభ్యులు ప్రచారగీతాలు పాడుకుంటూ కనిపించారే, ఇందాక, అగ్రహారంలో.

**జయ :** నీవు ఇలా దారితప్పి వస్తావని కూర్చున్నా!

**రేణు :** నీవూ నిన్న మండలిలో దారితప్పి మహోపన్యాసం చేశావని విని అభినందించి పోదామని వచ్చాను.

**జయ :** నో మెన్షన్ రేణూ! ఊరంతా గగ్గోలుగా ఉందిటగా? లేకపోతే ఎంతకాలమని వెధవ నాటకాలు! హృదయమున్నవాళ్ళు ఎక్కువకాలం ఆడలేరు.

**రేణు :** అందుకనే నీవు బయటపడ్డావు.

**జయ :** ఊళ్లో పెద్దమ్మలంతా గూడుపుఠాణీ చేశారట రాత్రి. నన్ను కార్యనిర్వాహకవర్గంలో నుంచి తీసేస్తారట!

**రేణు :** లేకపోతే అంతంత ఉద్యోగస్తుల పెళ్ళాలను పట్టుకొని ఛాలెంజి పారేస్తే ఊరుకుంటారా మరి.

**జయ :** గ్రామగ్రామానికీ వెళ్ళి రాష్ట్రభాష, వయోజనవిద్య ప్రచారం చేద్దామన్నాను.

**రేణు :** పనిమనుషుల నెత్తిమీద పిల్లలను ఒదిలిపెట్టి పచార్లు చేస్తూ క్లబ్బుల్లో కాలక్షేపం చేసేవారికి ఒళ్ళు వంగవద్దూ.

**జయ :** ఆ పని చేయలేనప్పుడు పెద్ద కబుర్లు చెప్పటం మానెయ్యాలి.

**రేణు :** మొగవాళ్ళ ఉద్యోగాలకు మేలుచేసే మాటలు మాట్లాడుతుంటే ఉపయోగం ఉంటుందని చేసే పనులు గాని, ప్రజమీద ప్రేమంటావా?

**జయ :** అందుకనే మనం చెప్పేమాటలన్నీ చిలుకపలుకులన్నాను. – నిన్నటి నా ఉపన్యాసం ఒకనాడు హఠాత్తుగా పుట్టుకొచ్చిన ఊహకాదు. అల్లరికోసం అన్న మాటలూ కావు. మథనపడి బయటపెట్టాను.

**రేణు :** విన్నవాళ్ళను అందుకనే అంత కలతపెట్టడమూ, ఆకర్షించటమూ జరిగింది. మీ మండలి సామాన్యసభ్యులు ఎంతో హర్షించారు. నీలో మార్పు వచ్చిందన్నారు.

**జయ :** నిజమే. నాలో బ్రహ్మాండమైన మార్పు వచ్చింది. నాకు ఈ వాతావరణం నచ్చటం లేదు. – రేణూ! నిజంగా నీవు ధన్యురాలివి. చైతన్యంగారితో బాటు ప్రజాసేవ చేసే భాగ్యం నీకు అబ్బింది.

**రేణు :** జయా! మీ తండ్రిగారు సేవాసమితికి అధ్యక్షులు కావటమేమిటి? నీవు నా అదృష్టాన్ని పొగడటమేమిటి? నీవు ఏ పని తలపెడితే అది జరిగిపోతుంది.

**జయ :** పొరబాటు! కొన్ని సంస్థలు వాటి ఖర్మవశాత్తు కొందరు వ్యక్తుల చేతుల్లో పడుతవి. 'పని చేస్తున్నట్లు కనిపించటమే' గాని ప్రయోజనం ఉండదు.

**రేణు :** ఔనౌను. నిన్న నిలయంవారి వార్షికనివేదిక విన్నాను. అంతవరకూ స్త్రీ జనోద్ధరణకోసం కొన్ని లక్షలు ఖర్చుపెట్టారట! ఆ సంస్థకు సంబంధించిన యువతి ఒక్కతే దేశంలో ఏ మంచి అంశంలోను పేరు ప్రతిష్ఠలు తెచ్చుకున్నట్లు వినిపించదు కనిపించదు.

**జయ :** సాంఘికంగా రాకపోవచ్చు.

**రేణు :** రాజకీయంగా వచ్చిందా ఏమిటి?

**జయ :** రేణూ! ఒక్కమాట చెపుతాను. నేటి సంస్థలున్ను వ్యక్తులకు కీర్తిధ్వజాలుగా నిలుస్తున్నవి గానీ సంఘాభివృద్ధికోసంగా కనపడటం లేదు.

**రేణు :** (రిష్టువాచి చూచుకొని) జయా! క్షమించాలి, చైతన్యంగారు ఊళ్లో కేసులు చూచుకొని ఆసుపత్రికి వచ్చే వేళైంది.

**జయ :** పాపం! చైతన్యంగారు చాలా శ్రమపడుతున్నట్లున్నారు. అనేక మాటలు చెప్పాను గానీ సాయం చెయ్యలేకపోయినాను.

**రేణు :** ఆయన పడుతున్న శ్రమ ఒకవిధంగానా? – శారీరకంగానూ, మానసికంగానూ, అప్పుతెచ్చి ఉచితవైద్యం చేస్తున్నారు. నీలాపనిందలు మోస్తున్నారు.

**జయ :** రేణూ! లోకం ఎవరెరుగనిది. నింద ఎప్పుడూ మంచివాళ్ళమీదనే పడుతుంది. వ్యక్తులు నమ్మిచేసే పనికే స్వార్థపరులు కొందరు అపనిందలు కల్పించి కూలదోస్తుంటారు.

**రేణు :** (లేస్తూ) ప్రయోజనం?

**జయ :** తమను తప్ప మరెవ్వరినీ లోకం చెప్పుకోకూడదు. అందరూ తనకు ఉపగ్రహాలుగా చుట్టూ తిరుగుతుండాలి.

**రేణు :** (సాభిప్రాయంగా) అవును, అవును.

**జయ :** (లేచి కొంతదూరం పంపించి మళ్ళీ వచ్చి కూర్చొని) పాపం! చైతన్యంగారు బాధపడుతున్నాడట! ఎవరినైనా చూస్తే చూడటానికి బుద్ధే కలగదు (సాభిప్రాయంగా) ఇటువంటివాళ్ళను చూచే

**'లాంగూల చాలన మథ శ్చరణావఘాతం**
**భూమౌ నిపత్య వదనోదర దర్శనంచ**

**శ్వాపిండ దస్య కురుతే గజపుంగవస్తు**
**ధీరం విలోకయతి చాటుశతైశ్చ భుంక్తే”**

అన్నాడు భర్తృహరి.

నిజం! కవి అన్నట్లే నీచజాతిదైనా కుక్క తిండిబెట్టే వాడి దగ్గిర సకలావస్థలు పడుతుంది. కానీ ఏనుగు మాత్రం మావటోడు ఆహారం తీసుకోవచ్చి బుజ్జగించి బతిమాలినా నోరు చాపదు. గొప్ప ఆశయాలు గలవాళ్ళ ప్రవర్తన ఎప్పుడూ ఇలాగే ఉంటుంది!

(దూరం నుంచీ ‘రైతుకూలి రాజ్యమేను, రామరాజ్యమూ’ వినిపిస్తుంది) (నవ్వుతూ) పట్టణాలల్లో ఈ ప్రచారం చేసి ప్రయోజనం? పిల్చ్! – (బోలో మహాత్మాగాంధీకి జై, పండిత్ జవ్వారులాల్ నెహ్రూకు జై, సర్దార్ భుజంగంగారికి జై, సేవాసమితికి జై (నానా రకాల ప్లేకార్డులతో పుణ్యకోటి ప్రవేశించి అన్నీ వరసగా ఆఫీసులో పెట్టిస్తాడు) (జయ, పుణ్యకోటిని లెక్కచేయనట్లుగా ఒకవైపుకు తిరిగి కూర్చుంటుంది. (పుణ్యకోటి రు. 5/– ఇచ్చి చాలకపోతే ఇదిగోనంటూ

రు. 10/– కాగితం విసిరివేస్తాడు కుర్రవాళ్ళకు – వాళ్ళు జై పుణ్యకోటిగారికి జై అని వెళ్ళిపోతారు. పుణ్యకోటి మెళ్ళో పూలదండను తీసి చెమట తుడుచుకొని దండ బల్లమీద పెడుతూ)

**పుణ్యకోటి :** జయా! నీవు సభలవైపు రాలేదు.

**జయ :** రా దలచుకోలేదు. – అయినా వస్తే సభలో ఏ అభాసు ఔతుందో నని భయపడ్డాను కూడా.

**పుణ్యకోటి :** అదేమిటి? నీ ధోరణి క్రొత్తగా ఉంది.

**జయ :** ఈ నటనంతా ఎందుకు? నన్ను గురించి నీవు ఏమీ వినలేదూ?

**పుణ్యకోటి :** క్లబ్ ప్రసంగం విషయమేనా?

**జయ :** నిన్నటి రాత్రి బడి విషయంగూడాను.

**పుణ్యకోటి :** అదేదో పాలసీకోసం నాన్నగారి ఇష్టంమీద మాట్లాడావను కున్నా. రాత్రిబడి నాన్నగారే నడపమని మొన్న అన్నట్లున్నారు? – అందరం ఒకేరకంగా మారితే కాలం మారినప్పుడు చెలామణి ఉండకపోవచ్చు.

**జయ :** అందుకే గామాలి, మీరు మహజాగ్రత్తగా గోడమీద పిల్లివాటంగా మాట్లాడి తప్పించుకుంటుంటారు – నాకు అలా వేషాలు వేయటం చేతగాదు.

**పుణ్యకోటి :** అయితే ఆ ఉపన్యాసం మనస్ఫూర్తిగా ఇచ్చిందన్నమాట!

**జయ :** ఔను, మహాత్ముని నిర్మాణ కార్యక్రమానికి నాచేతనైనంతగా తోడ్పడదామని నిశ్చయించుకొన్నాను. ఇంకా ఈ పాశ్చాత్య వ్యామోహపిశాచం మన్నెంత కాలం పట్టి బాధించటం!

**పుణ్యకోటి :** మీ నాన్నగారి అధ్యక్షతక్రింద మేము చేస్తున్నదేమని నీ అభిప్రాయం?

**జయ :** కాగితాలమీద తీర్మానాలు, ఇష్టం వచ్చిన వాళ్ళను నాయకులను చేసి సన్మానాలూ, పైకి తంతితపాలాలూ, మీలో ఒక్కరికీ హృదయమున్నట్లు నాకు కనుపించటంలేదు.

**పుణ్యకోటి :** అయితే మావల్ల మహాత్మునికి అపకీర్తేనని నీ నమ్మకమా?

**జయ :** నిశ్చయంగా. మాటలు చూడబోతే సేవా, త్యాగము, స్వేచ్ఛ, సౌఖ్యము, సర్వసమత్వము, అభ్యున్నతి, జాతీయత, అంతర్జాతీయత.

**పుణ్యకోటి :** (పెద్దపెట్టున నవ్వుతూ) జయా! వృథాగా ఈ కోపం ఎవరిమీద?

**జయ :** దేశద్రోహులమీద. అజ్ఞానాంధకారంలో అల్లటతల్లటౌతూ నిత్యయాత్రకు యాతనపడుతూ ఉన్న సామాన్య మానవుడి పేరు చెబుతూ ముందు ప్రాపకం, తరువాత డబ్బు సంపాదించుకొనే పాషండులమీద – ప్రజాసేవ పేరుచెప్పి సమితి ఏమి చేసిందో చెప్పండి.

**పుణ్యకోటి :** అలా అడుగు – సమితి లేకపోతే మద్యపానం నిషేధం అమలులోకి వచ్చేదే కాదు.

**జయ :** (వికటంగా) మద్యపానాన్ని నిర్మూలించారు.

**పుణ్యకోటి :** హరిజన దేవాలయ ప్రవేశం

**జయ :** గృహప్రవేశానికి మనస్ఫూర్తిగా అంగీకరించని మనం దేవాలయ ప్రవేశం చేయించాము.

**పుణ్యకోటి :** సంఘంలో ప్రచారం మూలాన అనేక విషయాలలో నిశ్శబ్ద విప్లవం తెచ్చాము.

**జయ :** తెచ్చాము. (వేళ్ళు లెక్కపెట్టటం మానేస్తుంది)

**పుణ్యకోటి :** జయా! ఇంతవ్యంగ్యం అనవసరం. చేయవలసిన పని చాలా ఉన్నదనే భయంలో నీవు నిరుత్సాహపడి 'పెసిమిష్టు' వౌతున్నావు.

**జయ :** ఇదుగో మీ దగ్గిర ఉన్న దుర్గుణమే అది. ఎవరైనా ఎదురు మాట్లాడితే మంచిచెడ్డలు ఆలోచించకుండానే వాళ్ళమీద ఒక ఇష్టు పారేసి నోరు మూయించటం – ఈ ఆటలిక సాగవు.

**పుణ్యకోటి :** నీవు వచ్చే సంవత్సరం ప్రధాన కార్యదర్శివై నీ యిష్టానుసారం కార్యక్రమం సాగించు.

**జయ :** ఇక ఈ సమితి పనిచేస్తుందనుకోటం పొరబాటు. ఇది ఎలాపోతే నాకెందుకు?

**పుణ్యకోటి :** (లోపలనుంచి పుణ్యకోటి, పుణ్యకోటి అని చంద్రశేఖరం గొంతు) (లేస్తూ) ఉద్వేగంలో అంతత్వరగా ఒక నిశ్చయం చెయ్యటం ఆట్టే క్షేమకరమైన పనికాదు.

**జయ :** డబ్బాలల్లో డబ్బు లెక్కకోసం గామాలి. వెళ్ళిరండి. – మణెమ్మగారు దర్శనమిప్పించలేదు.

**పుణ్యకోటి :** (నడుస్తూ) మీ నాన్నగారూ ఆమె అలా మీదుగా వస్తామన్నారు

**(వెళ్ళుతూ ఉంటే)**

**జయ :** (చిత్రమైన గొంతుకతో) ఓహో, అలాగేం! (పుణ్యకోటి నిష్క్రమించిన తరువాత, విగ్రహంతో) బాపూజీ! చూస్తున్నావా! నీ పేరుమీద లోకంలో ఎంత మోసం, అన్యాయం అక్రమం పెరిగిపోతున్నదో చూస్తున్నావా? అలా బోసినోరు విప్పి నవ్వుతావు బాపూజీ! నీ సిద్ధాంతాలన్నీ నీటగలసిపోతున్నవి.

**ఋడే గొంతుక :** హిందూ – ముస్లిం హేక్ హో హంటు

**హెగ్రీ హేషేషాన్**
**(ప్రవేశించి) షిన్న, ఫెద్దా హోక్టీ హంటూ**
**షెప్పీ హేషేసాన్** **హిందూ...**

**హరేక్ హోద్మీ ఖుషీకోషం,**
**షరత్ హుండాలి,**

**మల్లీ హిస్సా హుండాలి**
**ఔర్ హిమ్మత్ హుండాలి** **హిందూ...**

**మతంకోషం ఖొట్టుకుంటే**
**మందిదేషం మాడిపోద్ది**
**సునోభాయీ, దేఖో భయ్యా**
**లడైనైహై, భాయీ, భాయీ** **హిందూ...**

**జయ :** లోకంలో ప్రస్తుతం జరుగుతున్న మాయానాటకంలో వీడు హాస్యరసాన్ని పూర్తి చేస్తున్నాడు.

**బుడే :** (వెనక్కు తిరిగి) హమ్మాయిగార్! – నాకీ మల్లీ హెట్టాహుండాన్ హమ్మాయ్‌గార్!

**జయ :** రాబొయ్యే మా కల్కి అవతారంగా ఉన్నావు –

**బుడే :** (సంతోషంతో) గల్గిహవతారం! (తృప్తితో హమ్మాయిగార్! – నాకీ హది హంతా. తెల్దుగాని, హంతా నాకీ షద్వూకొని హరేక్ హద్మీ హీనేటట్టూ షెప్పి హేషేషాన్గా, నాకీ–

**జయ :** ఏం చదువుకున్నావు?

**బుడే :** షంద్రంబాబూ కాగజ్ మే వ్రాషి షెప్పిందంతా హొప్పషెప్పి... బహుత్ ష్రమా హైందీ హమ్మాయి గార్! – షేవా హంటే యహీ హైతో మాకీ దిల్ మేఘాల్మే హెగ్రిపోద్ది.

**జయ :** ఏమేం చెప్పావేమిటి?

**బుడే :** హేమేం షెప్పావ్? 'బీదల్ సాదల్ హోక్టీహుందీ, బూజహంగం సాబ్ మన్కీ బహుత్ ఫాయిదాషేస్తాడ్. ముందుముందు ఖుసీ హుందీ' హంటూ నాకీ జండాపట్టి షిందూ వేస్తూ షెప్తాహుంటే, హమ్మాయిగార్ పాట నాకీ పాడే తల్కీ మల్లీ మల్లీ పాడమంటూ – నవ్వలేక షచ్చి పొయ్యార్‌గా ఝునం మల్లీ!

**జయ :** భేష్! నిన్ను పెట్టి ఈ మాటు ఒక కొత్త నాటకం ఆడారన్నమాట!

**బుడే :** నాట్కం? బలే బరమాహండం హైనా నాట్కం, హమ్మాయిగార్ మీకీ వచ్చి చూస్తే నాకీ హీనాం మీద హీనాం హిచ్చేవార్గా మల్లీ?

**జయ :** (తీక్షణంగా) ఇప్పుడు నీవు చేసిన పనిని గురించి ఏమైనా ఆలోచించావా?

**బుడే :**  హది నాకీ హెొందుక్క హమ్మాయగార్! షేకహరం బాబూ షెయ్యామందీ షేష్తాం. సాబ్ బూజుహంగం హివ్వమంది హిస్తాడ్ మాకి. బీబీ బిడ్డల్ బత్కుతుంటే పాచ్చామల్లే పాణం హుంటే.

**జయ :** బుడే! వీళ్ళెవరికైనా పేదవాళ్ళంటే దయ ఉందంటావా?

**బుడే :** హమ్మాయిగార్! హంతా మీకీ కొత్త షేషి కుంటారేమ్టి – నాన్నగార్కి ధర్మం నైతో పేదల్ సాదల్ షచ్చీపోర్!

**జయ :** మాకు ఇంత డబ్బు ఎట్లా వచ్చిందో ఆలోచించావా? (లేదన్నట్లు తలూపితే) మీబోటి పేదవాళ్ళను కోటిమందిని పొట్టలు కొడితే వచ్చింది. మా నాన్నగారు మిమ్మల్ని పశువుల్ని చూచినట్లు చూస్తున్నాడు  పట్టి పాలిస్తున్నాడు.

**బుడే :** మాకీ కూడా ష్వతంత్రంకీ హొొచ్చిందిగా!

**జయ :** ఔను. మీ అజ్ఞానం ఇలా ఉన్నంతకాలం స్వతంత్రం కాదు  స్వర్గం వచ్చినా లాభం లేదు. పోష్టాఫీసుకు వెళ్ళి ఉత్తరం పోష్టులో వేసిరా, చైతన్యం గారికి త్వరగా రేపే చేరాలి.

**బుడే :** చైతన్యంగార్కి? (ఔనన్నట్లు చూడగానే) అచ్చా! హమ్మాయిగార్!ఔ (నిష్క్రమిస్తూ) హమ్మాయిగార్! నాదీ పేరు ఫేఫర్లోన పడ్తుందంట మల్లీ – షాంకు హింట్కీ హెళ్తే బీబీ షూషీ షంతోషంతో –

**జయ :** త్వరగా వెళ్ళిరా – నేను ఇంట్లో చిన్న పని చూచి వచ్చేటప్పటికి తిరిగి రావాలి నీతో పనుంది. మనం ఒక చోటికి వెళ్ళిరావాలి.

**బుడే :** మేఘాల్మే హెగ్రీ రానూ! (నిష్క్రమిస్తాడు)

(జయ  నెమ్మదిగా నిష్క్రమిస్తుంది. భుజంగం వచ్చి కూర్చొని 'చంద్రశేఖరం గారూ' అని పిలువగానే 'వస్తున్నా' అనే సమాధానంతో ధర్మడబ్బాలు, లెక్క తీసుకొని చంద్రశేఖరం ప్రవేశిస్తాడు.)

**భుజంగం :** ఏమండీ! సమితి చందాలు సన్నగిల్లిపోతున్నట్లున్నవి?

**చంద్రశేఖరం :** ఆహా! అనుమానం లేకుండా, వందరూపాయలకు మించి ఒక్క కానీ పడటం లేదు డబ్బాల్లో –

**భుజంగం :** పోయిన నాలుగు నెలల లెక్కా చదవండి.

**చంద్రశేఖరం :** మార్చి 99-12-9 ఏప్రియల్ 95-10-6 మే 90-14-3 జూన్ 80-14-5 జులై 60-5-3

**భుజంగం :** నెలచందాలు వసూలు కావటం లేదు.

**చంద్రశేఖరం :** నెలంతా తిరిగి నాలుగిళ్ళల్లో వసూలు చేసేటప్పటికి నా తల ప్రాణం తోకకు వస్తున్నది. ఏ ఇంటికి వెళ్ళినా ఎందుకివ్వాలి? భుజంగం గారు లక్షాధికారి కాలేదనా! సమితి ఏం చేసింది? అని అడుగుతున్నారు. చాలా అసహ్యంగా ఉంది ప్రజల ప్రవర్తన.

**భుజంగం :** ఏడిచారు! ఇటువంటి అవాకులు చెవాకులు మాట్లాడకుండా మర్నాటికల్లా ఆర్డినెన్సు పుట్టిస్తాను.

**చంద్రశేఖరం :** రోగం కుదురుతుంది.

**భుజంగం :** నేను మటుకు డబ్బు ఎక్కడనుంచి తెచ్చి పెడతాను?

**చంద్రశేఖరం :** మూలధనం మొన్న మీకు కావలసి వాడుకున్నట్లున్నారు కూడాను. అయినా అడిగే సత్తా ఉన్న సభ్యుడు కూడా లేడులెండి.

**భుజంగం :** ఆ భయం ఎన్నడూ లేదనుకోండి – ఆఁ మరచిపోయినాను. నిన్న ఢిల్లీనుంచి ఒక మిత్రుడు వచ్చాడు. ఆలిండియా సేవాసమితివారు ఈ సంవత్సరంనుంచీ గ్రాంట్లు ఆపివేయటానికి తీర్మానించుకున్నారట!

**చంద్రశేఖరం :** ఇది జరుగుతుందని వెనుక మీతో నేను అనలేదూ?

**భుజంగం :** ఊళ్లో నుంచి మనమీద పిటీషన్లు వెళ్ళినవట! ఎంక్వైరీ కమీషన్ ఒకటి వేస్తారట! – కొంచెం లెక్కలు సరిచెయ్యాలి.

**చంద్రశేఖరం :** నా మొఖం – ఏం సరిజేసేది? అంతా లెక్క గైరుహాజరుగా ఉంది.

**భుజంగం :** మరి, ఎలాగో సర్దాలి, లేకపోతే మనిద్దరి పీకలమీదికి రావచ్చు.

**చంద్రశేఖరం :** మీరేమన్నా చెప్పండి. జైలుకైనా వెళ్ళవచ్చునుగాని చిత్తులేని లెక్క సరిజెయ్యటం నాచేతగాదు చాలాకష్టం!

**భుజంగం :** కష్టం కాబట్టే చూడమనటం – వెధవ దేశం ఎవడైనా బాగు పడుతుంటే ఇంత వోర్చలేదేమండి? వట్టి ఈర్ష్య. ఇందువల్లనే ఇన్ని కష్టాలు వస్తున్నవి. మనకు ధర్మం తప్పింది.

**చంద్రశేఖరం :** మన కష్టమంతటికీ వెనక ఒక వ్యక్తి ఉన్నాడన్న సంగతి మీరు గమనించారా?

**భుజంగం :** ఆ చైతన్యంగాడేనా? వాడిమొఖం! – మనను దెబ్బకొట్టటం వాడి తాతతరం కాదు. అనవసరంగా వాడికి ఖ్యాతి తెచ్చిపెట్టవద్దు.

**చంద్రశేఖరం :** తెరవెనుకనుంచి మనమీద నాటకమాడిస్తున్నది వాడే.

**భుజంగం :** పుణ్యకోటిని కౌంటరు ప్రాపగాండాకు పెట్టాముగా.

**చంద్రశేఖరం :** బ్రహ్మాండంగా కష్టపడుతున్నాడు. ప్రయోజనం కనిపించటంలేదు.

**భుజంగం :** 'జయని' ఇస్తానని ఆశపెట్టలేదు. ఆ మాటంటే ఇంకా ఒళ్లు విరుచుకొని పనిచేస్తాడు.

**చంద్రశేఖరం :** అందువల్లనే అంత కష్టపడటం! మీరు ఇస్తారనే ఆయన నమ్మకం. అయితే జయ మారిపోతున్నది. పుణ్యకోటి మాట చెపితే మండి పడుతున్నది – చైతన్యమంటే కించిత్తు అభిమానం కూడా ఆమె మనస్సులో ఏర్పడుతున్నట్లుంది మీ శత్రువుకు ఆమె హృదయంలో స్థానం దొరుకుతున్నది.

**భుజంగం :** చిన్నపిల్ల! దానికో నిశ్చితాభిప్రాయమేమిటి?

**చంద్రశేఖరం :** ఎలాగైనా చైతన్యం ప్రజాదరణ పొందుతున్నాడు. మన డబ్బు తినేవాళ్ళే మనగుట్టు వాడికి మోసేస్తున్నారు. లేకపోతే మన మెడికల్ హాల్ తరఫున బోర్డుకు సప్లై చేసిన మందుసీసాలల్లో శివుడుబావి నీళ్ళని వాళ్ళకెలా తెలిసింది – నిన్ననే ప్రభుత్వానికి ఊళ్ళోనుంచి పిటిషన్ వెళ్ళిందట! మీ పేర ఎన్ని దొంగసంస్థలున్నవో అందులో వ్రాశారట!

**భుజంగం :** అయితే చైతన్యం నాకు ప్రబలంగా ప్రత్యర్థి అవుతాడన్నమాట!

**చంద్రశేఖరం :** ఇంకా సందేహిస్తారేం? ఎన్నడో అయినాడు.

**భుజంగం :** మెడికల్ హాల్ బాకీకి నోటు వ్రాసి ఇచ్చి ఇల్లు తాకట్టు పెట్టినట్లున్నాడు? దావా చేసి కొంప వేలం వేయిస్తాను, రిమ్మ అణుగుతుంది.

**చంద్రశేఖరం :** మీతో పగంటే పాము పగని వాడికి తెలిసి రావాలి. మనమూ ఒక పిటీషన్ పారేద్దాము. డాక్టర్లను జాతీయం చెయ్యమని, లేకపోతే చైతన్యం వంటివాళ్ళ దోపిడీకి ప్రజలాగలేరని. ఎంక్వయిరీ వస్తుంది. మన కాళ్ళమీద పడతాడు.

**భుజంగం :** ఓ వెయ్యి రూపాయలు మనవి కాదనుకుంటే మద్రాసులో మనపని జరిగిపోతుంది –

**చంద్రశేఖరం :** పోనీ ఎవడికో మందుపెట్టి చంపినట్లు వైద్యుడు కదూ ఎవడో చావకుండా ఉంటాడా అతని చేతిలో.

**భుజంగం :** మహజరు వెనక మరిన్ని సంతకాలుంటే కఠినశిక్ష చెప్పించవచ్చు కూడా. మోతుబరీ సాక్ష్యం బనాయిద్దాము.

**చంద్రశేఖరం :** మిల్లుదగ్గిర రైల్వేస్టేషను పెట్టించాలని అప్లికేషను వ్రాసి సంతకాలు పుచ్చుకుంటాను. ఓ నాలుగువేలు అయిన తరువాత దానికి ఈ మహజరు టైపుచేసి గుచ్చుదాము.

**భుజంగం :** భేష్! ప్లాను బ్రహ్మాండంగా ఉంది.

(సేవాసమితి ఆఫీసుముందుగా చైతన్యం, ప్రజాసేవకులతో పాట పాడుతూ వెళ్ళుతుంటాడు)

**భారత జయఘంటా! ఓహో**
**భవ్య విజయ ఘంటా!!**
**గణ గణ, గణ గణ,**
**క్వణియింపుమురా!** **భారత జయ....**

**మానవ మానస –**
**మహిమ జలేజము**
**మధుధారలతో**
**తిలకింప** **గణ, గణ....**

**ఋషిగణవాటీ**
**తుషితప్రశాంతి**
**క్రమహాసముల**
**కుళుకుల నీన** **గణ, గణ....**

**విశ్వహృదంతర**
**విమలాలయముల**

**వేదమహార్థమె**
**వినిపింప** **గణ, గణ....**

**దిశాదేవతల**
**దివ్యగృహమ్ముల**
**కలహిందోళము**
**క్రమ్మి స్వనింప** **గణ, గణ....**

**చంద్రశేఖరం :** వింటున్నారా? (కిటికీలోనుంచి చూచి) ఎంత ఉత్సాహంతో వస్తున్నాడో చూడండి! చైతన్యం.

**భుజంగం :** కడుపులో దావాగ్ని మండుతున్నది. చంద్రశేఖరుగారూ! వాడి విప్లవతత్త్వం ప్రజాశాంతికి భంగకరంగా ఉన్నదని మన సంతకాలతో కాకుండా మరో రిపోర్టు ప్రభుత్వానికి ఇవ్వాళే పోష్టు చెయ్యండి. కొంచెం కమ్యూనిస్టు వ్యవహారం వీడికి ఉన్నదా అనే అనుమానం కూడా పైవాళ్ళకు కలగాలి.

**చంద్రశేఖరం :** తప్పకుండా (భుజంగం లేవబోతుంటే) మరి నా రిక్వెష్టు ఏం చేశారు?

**భుజంగం :** ఇంటిమాటేనా? పాతాళగృహం కడుతున్నావా ఏమయ్యో! అప్పుడే పదివేలు మింగేసింది?

**చంద్రశేఖరం :** ఏదో మీ అనుగ్రహంవల్ల కొంచెం గట్టి కొంప వేద్దామని ప్రారంభించాను. ఇంతౌతుందని అనుకోలేదు.

**భుజంగం :** ఉఁ ఎలాగైనా త్వరలో పూర్తికావాలి. ప్రస్తుతం...

**చంద్రశేఖరం :** నాలుగువేలు చాలు.

**భుజంగం :** అంతులేదు. మూడువేలలో సర్దండి. ప్రస్తుతం నా దగ్గిర కూడా డబ్బులేదు. (డ్రాయిర్‌లోనుంచి బుక్కుతీసి చెక్కు వ్రాసి యిస్తాడు)

**చంద్రశేఖరం :** నా సహాయాలన్నీ మీరు మరచిపోయినట్లున్నారు.

**భుజంగం :** ఆ వెయ్యి కూడా రేపు తీసుకుందువుగాని లేవయ్యా! (లేచి) ఎలాగైనా వీటిల్లో నుంచి మనం గట్టెక్కాలి. లెక్క సరిచేయటం మరిచిపోవద్దు.

**చంద్రశేఖరం :** నిస్సంశయంగా (నిష్క్రమిస్తాడు)

**భుజంగం :** (అటూ ఇటూ పచారు చేస్తూ ఆలోచిస్తూ ఉంటాడు. బుడే కాఫీ ట్రేలో పట్టుకొని తీసుకోవస్తాడు (కాఫీ త్రాగుతూ) బుడే!

**బుడే :** జీ హుజూర్! (కప్పు అందుకుంటూ ) సాబ్, షైతన్యం బాబు మాకీ హిళ్ళకాడ్కి హొచ్చీ హేమో హేమో షెప్పీహేశాడంట్గా సాబ్! హింటిక్కిపోతే మా సాహెబ్లంతా హేమో హేమో హద్దేషేష్తారంట!

**భుజంగం :** (నిర్లక్ష్యంతో) ఏడ్చారు, వెధవలు – ఆ భటాచోర్ చెప్పేవాడూ, వీళ్లు విని అడిగేవాళ్లూనా?

**బుడే :** గూడెం హంతా మన్కీ వ్యత్రేకంగా తిప్పేశారంట సాబ్! మన్కీ పానీ భీ పుట్టదంట!

**భుజంగం :** నీవు వెళ్ళి సాయంత్రం మీటింగు పెట్టి అన్ని సంగతులూ చెప్పేయి – పిచ్చి చేష్టలు చేస్తే పీల్చి పిప్పి చేస్తానన్నానని చెప్పు.

**బుడే :** (భయపడుతూ మాట్లాడడు)

**భుజంగం :** నీకు భయమైతే నన్నే బబ్బేలను తీస్కోపో దబాయించి చెపుతారు.

**బుడే :** హాసాబ్! హాళ్ళషేత షెప్పిస్తాన్, మళ్ళీమళ్ళీ షెప్పిస్తాన్.

**భుజంగం :** నెత్తిన దమ్మిడీ పెడితే గానీ చెయ్యలేని వెధవలంతా ఏవో ఆలోచనలు – మన సంగతి మళ్ళీ ఊళ్ళో తెలిసిరావాలి.

**బుడే :** మంచి షేస్తే మడ్సుల్ కారు షాబ్!

**భుజంగం :** (జేబులోనుంచి కొంత డబ్బిచ్చి) ఉం తీసుకోపోయి జల్సా చేసుకొండి, – జ్ఞాపకం ఉంచుకోండి.

**బుడే :** (నిష్క్రమిస్తూ) మాకీ షచ్చిపోతే మడ్సిపోతాం.

**భుజంగం :**(దూరంనుంచి వస్తున్న మణెమ్మను చూచి) మణీ! నీకు నూరేళ్ళు – ఇప్పుడే మనస్సులో నిన్ను గురించి అనుకుంటున్నాను.

**మణెమ్మ :** ప్రవేశించిన తరువాత) నూరేళ్ళేమి ఖర్మం – ఇంకా మిమ్మల్ని విడిచిపెట్టి గంట కూడా కాలేదుగా –

**భుజంగం :** గంటసేపే! మై గుడ్ గాడ్! (సానురాగంగా) నిమిషం నీవు లేకపోతే యుగంగా ఉంటున్నది మణీ!

**మణెమ్మ :** నిన్న మండలిలో జయమ్మ ఇచ్చిన అవకతవక ఉపన్యాసంమీద రియాక్షన్సు ఎలా ఉన్నవోనని వాకబ్ చెయ్యటానికి వెళ్ళి వస్తున్నా –

**భుజంగం :** ఏదో విప్లవం గిప్లవం అన్నదిటగా –

**మణెమ్మ :** ఒకటేమిటి అనేకం పేలింది. అన్ని సంస్థలనూ తూర్పారపట్టింది. ప్రజాసేవకుల మాట అలా ఉంచండి ప్రభుత్వాన్నీ, ఉద్యోగస్థులనూ, వారి భార్యలనూ విపరీతంగా దూషించింది. మనం చేసేది సేవ కాదట! వ్యక్తిగత వ్యాపారమట!

**భుజంగం :** దానిమాటలు విశేషంగా లక్ష్యపెట్టదగ్గవి కావు. కొత్తగా కాలేజీలో ఎకనమిక్సు చదువుకోని వచ్చింది.

**మణెమ్మ :** మీ అమ్మాయని మర్యాద దక్కింది. లేకపోతే – ఏమిటా వెర్రికేకలు – వికేంద్రీకరణట! వికేంద్రీకరణ!! – పోనీ లెమ్మనుకున్నా సభ్యుల్లో ఈమెకు తోడుబోయిన వాళ్ళందరూ ఎకౌంట్లు చెప్పమనీ, కొత్త ఎలక్షన్లు పెట్టమనీ నామీద వెర్రికేకలు వేశారు.

**భుజంగం :** ఓస్, ఎలెక్షన్లే గదా? మనపక్షం గెలిచేటట్లుంటే పెట్టించు, లేకపోతే కరపత్రాలు వేయించి ఏదో కారణం చెప్పి వాయిదా వేయించేది. నెమ్మదిగా కాలం సాగుతుంటే అన్నీ సర్దుకుంటవి.

**మణెమ్మ :** భయపడతానని గాదు. సుఖంగా సాగిపోతున్న సంస్థలో చావుగంట కొట్టింది.

**భుజంగం :** అయినా ఆ మండలిలో ఉండకపోతే నీకు ప్రాపకం లేదా? – అది నీకు వ్యక్తిగతమైంది గాని సంస్థవల్ల వచ్చింది కాదే?

**మణెమ్మ :** పోనీ తెలివిగా మాట్లాడాననుకున్నదిగాని, అంత సభలో బహిరంగంగా చైతన్యాన్ని పొగిడితే ప్రజలు ఆమె శీలాన్ని గురించీ, మిమ్మల్ని గురించీ ఏమనుకుంటారో ఆలోచించలేదు.

**భుజంగం :** (సాలోచనగా) చైతన్యాన్నే!!

**మణెమ్మ :** అవును. మీ గర్భశత్రువు – చైతన్యాన్నే!!

**భుజంగం :** తల్లి లేని పిల్లగదా అని తాచేత చేస్తున్నాను.

**మణెమ్మ :** విషం పోస్తూ పాలిస్తున్నా ననుకుంటున్నారన్న మాట! నిజం దేవుడి కెరుక. అతనితో చాటుగా (గొంతుక తగ్గించి) స్నేహం చేస్తున్నదని జనం చెప్పుకుంటున్నారు.

**భుజంగం :** స్నేహమే!

**మణెమ్మ :** భుజంగం! దిస్ ఈజ్ ఎ పబ్లిక్ సీక్రెట్

**భుజంగం :** (దుఃఖభావంతో) మణీ! ఇన్నాళ్ళూ నాకెందుకు చెప్పలేదు.

**మణెమ్మ :** బాధపడతావని.

**భుజంగం :** శత్రువుకు నా యింట్లోనే స్థానం చిక్కుతుందన్న చంద్రశేఖరం మాట ఇప్పుడర్థమౌతున్నది.

**మణెమ్మ :** నా ఇంట్లోనూ స్థానం చిక్కింది. మన స్నేహాన్ని సహించలేని వెధవలెవరో మా ఆయనకు పుల్లలెక్కించి మనస్సు తిప్పేశారు. మనం ఏం చేసినా మాట్లాడని 'ధర్మరాజు' నా నిత్యప్రవర్తనకు హిందూకోడ్ బిల్లంత గ్రంథం తయారుచేశాడు. కాలుతీసి కాలుపెడితే ఎక్కడికని అడుగుతున్నాడు.

**భుజంగం :** ఇదీ ఆ చైతన్యంగాడి పనే!

**మణెమ్మ :** వాడు చేసిన పనికి కలిగిన ఫలితం.

**భుజంగం :** మీ ఆయనదేముంది, ఒక చెక్కు పారేస్తే చెప్పినట్లు వింటాడు.

**మణెమ్మ :** అలాగే జరిగిద్దాం. అయినా వెనుకటివ్యక్తి అనుకొని పొరబాటు పడుతున్నట్లున్నావు. నాకోసం రెండు లక్షలు బ్యాంకులో దాచిపెట్టాడట. బంగళాకు ప్లాన్ వేస్తూ ఉన్నాడు. సినిమాహాలు కంట్రాక్టు పుచ్చుకున్నాడు.

**భుజంగం :** మన అంతస్తు దాటిపోయినాడన్నమాట – అయితే మరుక్షణం నుంచీ నీవు అతని ఇంటికి వెళ్ళటం మానివేసి ఇక్కడనే ఉండిపోతే.

**మణెమ్మ :** డామిట్! లోకమో!

**భుజంగం :** నో ఫియర్స్, యు ఆర్ వెల్‌కం. నాలుగు దినాలు చెప్పుకొని మరచిపోతుంది, లోకం.

**మణెమ్మ :** నాకాధైర్యం లేదు. ఏదో మనం ఫ్రండ్షిప్పుకు భంగం లేకుండా ప్రవర్తించగలను గానీ – అమ్మో! 8 గంటలైంది. వెళ్ళిపోవాలి. ఆయన ఇంటికి వచ్చేస్తాడు.

**భుజంగం :** బుడే!

**బుడే :** జీ హుజూర్! (ప్రవేశించి సగౌరవంగా నిలబడతాడు)

**భుజంగం :** (తాళం చెవ్వి యిచ్చి) లోపల బీరువాలో రెండు సీసాలూ గ్లాసులూ పట్టుకోరా.

**బుడే :** (నిష్క్రమిస్తాడు)

**భుజంగం :** (ఆర్ద్రంగా) మణీ! చెక్కు ఒకటి తీసుకోబోతే కాస్త శాంతిస్తాడేమో!

**మణెమ్మ :** తప్పక ప్రయోజనం ఉంటుంది. అయినా నీవు కొంతగా నన్ను మరచిపోవటం నేర్చుకోవాలి. లేకపోతే ఇద్దరమూ బాధపడవలసి వస్తుంది. ఇక ఇల్లు కదలి రాలేను.

**భుజంగం :** ప్రాణముండగా మరచిపోలేను. మణీ! నీవు రాలేనప్పుడు నేనే ఏదో నెపం పెట్టుకొని మీ ఇంటికి వచ్చి కాలక్షేపం చేసిపోతుంటాను.

**మణెమ్మ :** భుజంగం, వెరి మెనీ థాంక్సు!

**బుడే :** (సీసాలూ, గ్లాసులూ తెచ్చి పెట్టి నిలువబడతాడు)

**భుజంగం :** (వెళ్ళమని సంజ్ఞ చేసి బుడేను పంపిస్తాడు సీసాలల్లో పానీయం పోస్తాడు) మీ ఆయన నన్ను రావద్దంటే!

**మణెమ్మ :** మరో చెక్కు పారేద్దాం.

**భుజంగం :** (మణెమ్మ చేతికొక గ్లాసు అందించి) నా ప్రేయసి ఆరోగ్యానికి

**మణెమ్మ :** నా.........

**భుజంగం :** (తన్ను చూపిస్తూ) భర్త ఆరోగ్యానికి

**మణెమ్మ :** ఊఁః నా భుజంగం ఆరోగ్యానికి (గ్లాసులు కలిపి త్రాగుతారు)

**మణెమ్మ :** (ఉత్సాహంతో లేచి డాన్సు ప్రారంభించి)

ఈనా మీనా మైనా హో!

**భుజంగం :** రావే రావే వెన్నెలరాణీ!

ఈనా మీనా మైనా హో!!

**మణెమ్మ :** రారా రారా వెన్నెల రాజా!

**భుజంగం :** నీవే ప్రణయిని వోహో మోహిని!

**మణెమ్మ :** నీవే ప్రియుడవు మోహనుడా!

(అన్యోన్యం ఆలింగనం చేసుకుంటారు)

**బుడే :** (చూచి కళ్లు చికిలించి వెళ్లిపోతాడు)

**మణెమ్మ :** (రిష్టువాచ్‌లో టైము చూస్తూ) భుజంగం! (నెమ్మదిగా నడుస్తూ ఉంటుంది)

**భుజంగం :** మణీ! – పద!

(ఇద్దరూ నిష్క్రమిస్తారు)

**బుడే :** (మరొకవైపునుంచి ప్రవేశించి) క్యా, బూజుహంగం సాబ్ కా ఘర్మే షరాబ్! – ఔర్ ఔరత్! – బూజుహంగం భీ మోషం! వేషం!! జయమ్మ హౌక్టీ హీ హై హచ్ఛీ లడ్కీ. హై. – అల్లాహో అక్బర్!

**అల్లా షైతన్యం, హాయ్, అక్బర్ షైతన్యం**
**బూజుహంగం షాబ్ షర్బత్ పియా**
**ఔరత్ లియా, కోన్ హై – షైతాన్**
**బూజుహంగం సాబ్ హై హై షైతాన్**

**(నిష్క్రమిస్తాడు)**

# చతుర్థ దృశ్యం

(డాక్టరు చైతన్యం రాత్రి 12 గంటల సమయంలో టైపు చేస్తూ వుంటాడు. రేణు నింపాదిగా క్రిందిగీతం పాడుకుంటూ ఉంటుంది)

**ఓహో, కోయిల పాడుమురా!**
**ఉద్ధృత పావక జ్వాలామాలిక!**

**వసంతకాలం మారినది,**
**అనంత గ్రీష్మ మ్మమరినది**
**కవి వని నిన్నే కోరెదరా,**
**గళఘంటా నినదమ్ములతో** **ఓహో కోయిల...**

**వెగటైనవి చెలుడా! నీ**
**విమల పంచమశృతులే**
**మేల్కొనవలె నిదురించే**
**మేలివనము లీయిలలో**

**ఓహో, కోయిల పాడుమురా!**
**ఉద్ధృత పావక జ్వాలామాలిక!**

**చైతన్యం :** అప్పుడే ఈ గీతానికి ట్యూన్ చేశావా ఏమిటి? రేణూ! ఇది కవులను ఉద్దేశించి వ్రాశాను.

**రేణు :** రేపు తప్పక పాడుతాను సభలో – ఇంకా మీకు నిద్ర రావటం లేదా? పన్నెండయింది.

**చైతన్యం :** పన్నెండే? – అయిపోయింది. (పూర్తిగా చుట్టి కాగితం బయటికి తీసి పని అయిపోయినట్లు నిట్టూరుస్తాడు)

**రేణు :** (దగ్గిరకు వచ్చి) ప్రతినిత్యమూ ఇంతవరకూ మేలుకొని పనిచేస్తే చాలా దెబ్బతింటారు.

**చైతన్యం :** నిజమే, తప్పటంలేదు. భగవదనుగ్రహంవల్ల ఇంకా మనకు మంచిదినాలు రాలేదు. – నిత్యం ఏదో నదికి ఎదురీదవలసి వస్తున్నది రేణూ!

**రేణు :** మళ్ళీ ఏదన్నా రిపోర్టు పంపవలసి వచ్చిందా ఏమిటి?

**చైతన్యం :**భుజంగం మనమీద పాముపగ పట్టాడు. మనం చేస్తున్న కించిత్తు ప్రజాసేవ కూడా ముందుకు సాగేటట్టు లేదు. పడగొట్టటానికి అతడు బ్రహ్మప్రయత్నం చేస్తున్నాడు.

**రేణు :** ఇవాళ ఏదో పెద్ద కవరు వచ్చినట్లుంది?

**చైతన్యం :** మొన్న ఈ గ్రామంలో ఎవరో రామన్న చనిపోయినాడట! అతని బంధువులు వారసత్వం కోసం మనకు లంచమిస్తే మందుపెట్టి చంపామని మనమీద కేసు బనాయించారు.

**రేణు :** అతడు మనదగ్గిరకు మందుకే రాలేదు. ఎవరో ఆచార్లుగారు మందు ఇస్తే రోగం నయం కాలేదట! చాలాకాలం తీసుకొని చచ్చిపోయినాడు.

**చైతన్యం :** ఇదంతా విచారించేవాళ్లెవరు? కావలసినంత డబ్బుంది. మంచి ప్లీడరును పెట్టుకొని వాదిస్తాడు. మనం కేసులోనుంచి బయటపడకపోతే ఎంతో ప్రమాదం. దేశంలో అపకీర్తి మాట అలా ఉంచినా నా డాక్టరు సర్టిఫికేటుకు మోసం రావచ్చు.

**రేణు :** అయినా వాళ్ళకు సాక్ష్యం దొరకవద్దూ. గ్రామమంతా మన పక్షం చెప్తుతుంది.

**చైతన్యం :** డబ్బు పారేస్తే ఏ సాక్ష్యం చెప్పమంటే ఆ సాక్ష్యం చెప్పేవాళ్ళు ఎందరైనా దొరుకుతారు. ఆ పాపం తన వృత్తిది గాని తనది కాదనే నమ్మకంతో అబద్ధపు సాక్ష్యం చెప్పించటానికి పాఠం నేర్పగల ప్లీడర్లు ఎంతోమంది దొరుకుతారు.

**రేణు :** మన తాత్కాలిక వైద్యశాల స్థలాన్ని గురించి కలెక్టరుగారికి వెళ్ళిన రిపోర్టు ఏమైంది?

**చైతన్యం :** ఈ ఆఫీసుల్లో దేముడు వరమిచ్చినా పూజారి వరమివ్వటం లేదు. తిరిగి తిరిగి నిన్ననే మళ్ళీ ఒకేడాదిపాటు పర్మిషన్ పుట్టించుకో వచ్చేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది. – చేతిలో చిల్లిగవ్వలేదు. ఈ చిక్కుల్లో నుంచి ఎలా బయటపడటమో అర్థంకావటం లేదు.

**రేణు :** ఆ బెంగ పెట్టుకోకండి. నా పేర మా నాన్నగారు బ్యాంకులో వేసిన అకౌంటు ఆరువేల రూపాయలున్నవి.

**చైతన్యం :** రేణూ! నీ డబ్బు ఖర్చుపెట్టటం!

**రేణు :** 'నా డబ్బుకూ – మీ డబ్బుకూ' భేదమేమిటి?

**చైతన్యం :** (ఆర్ద్రంగా) నీ ఔదార్యం, సేవానిరతి నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నవి, రేణూ! ఇటువంటి దేశసేవికలు ఎందరు ఉద్భవిస్తేనోగాని ఈ దేశం బాగుపడదు.

**రేణు :** మీరు నన్ను స్తుతిచేసి బాధపెడుతున్నారు. మీబోటి త్యాగమూర్తులు కంకణం కట్టుకుంటే ఎందరో సహృదయులైన యువతలు ముందంజ వేస్తారు.

**చైతన్యం :** రేణూ!

**రేణు :** డాక్టర్ బాబూ! (చైతన్యం 'అబ్బా' అనటం విని) మంచినీళ్ళు తెచ్చిపెట్టమన్నారా?

**చైతన్యం :** నేను తెచ్చుకుంటాను లే.

**రేణు :** (తీసుకోవచ్చి యిస్తుంది)

**చైతన్యం :** ఇంత తియ్యగా ఉన్నవేం? – మరో బావివా?

**రేణు :** ఈ తీపి మీ మనస్సులో ఉదయించింది. అదే బావివి.

**చైతన్యం :** ఔను – నీవు కూడా తాగిచూడు. నీకూ ఇంత తియ్యగా ఉంటవేమో

**రేణు :** (త్రాగి) నాకూ...

**చైతన్యం :** తియ్యగా...

**రేణు :** ఉన్నవి

(కిటికీవైపు నడుస్తూ)

ఓహో! శశికౌ జీవన వాసనలు

నెలరా, వన్నెల వెన్నెలలో

కలువకు వలపుల క్రొన్ననలూ

**చైతన్యం :** (రేణు నిలుచున్న చోటికి వచ్చి తల నిమురుతాడు)

**కుముదిని ముగ్ధసుహాసములో**
**శశికౌజీవన వాసనలూ,**
**ఓహో! శశికౌ జీవన వాసనలూ –**

(తలుపు చప్పుడు)

**రేణు :** (వెళ్ళి తలుపు తీస్తుంది)

**ముసలయ్య :** (గుడ్డిలాంతరుతో ఒక ఉత్తరం తీసుకొనివస్తాడు) బాబయ్యా!

(అందించి నిలుచోని చూస్తుంటాడు)

**చైతన్యం :** (ఆశ్చర్యంతో ఉత్తరం చూసి) 'జయ'

**రేణు :** మొన్న వ్రాసిన ఉత్తరంలో ఆమె బాధలు చెప్పుకుంటానన్నది. అందుకోసం వచ్చింది కామాలి.

**చైతన్యం :** ముసలయ్యా! ఒంటరిగా వచ్చిందా?

**ముసలయ్య :**వెంట భుజంగంగారి బుడే ఉన్నాడు – నిద్రపోతున్నారని చెప్పినా ఉత్తరం ఇప్పుడే ఇవ్వమని దీనంగా అడిగింది బాబూ!

**చైతన్యం :** ఆమెను లోపలికి పంపించు.

**ముసలయ్య :** ఆ సాయబును కూడానా?

**చైతన్యం :** ఆమె ఇష్టం.

(రేణు చూస్తున్న ఉత్తరాన్ని మళ్ళీ 'ఏదీ' అని అడిగి పుచ్చుకొని).

'తమతో నా మానసిక వ్యథను ఏకాంతంగా చెప్పుకుందామని వచ్చాను. అర్ధరాత్రి శ్రమకల్గించినందుకు క్షమించండి' – 'జయ'

**రేణు :** కొన్నాళ్ళబట్టి ఏదో వ్యథ అనుభవిస్తున్నట్లే ఉంది. మణెమ్మతో ఇప్పుడు మాటిమాటికీ కనిపించటంలేదు –

ఆ దుర్గంధంలో బ్రతకలేని మనస్వి కామాలి. అయితే మరి నేను…

**చైతన్యం :** నీవూ వుండవచ్చు.

**రేణు :** ఆమె ఏకాంతం కోరినప్పుడు నేనుండి కష్టపెట్టడం నాకు ఇష్టంలేదు.

**చైతన్యం :** మరి నీవు మా సంభాషణ వినాలి.

**రేణు :** అలా వినను

**చైతన్యం :** అయితే నామీద ఒట్టే!

**రేణు :** (వేలుతో వారిస్తూ) తప్పక వింటాను.

**(నిష్క్రమిస్తుంది)**

(చైతన్యం ఆలోచిస్తూ ఉండగా జయ ప్రవేశం)

**జయ :** (నమస్కరిస్తూ) క్షమించాలి, మీకు నిద్రాభంగం కలిగించినందుకు!

**చైతన్యం :** (కుర్చీ చూపిస్తూ) ఇంత ప్రొద్దుపోయిన తరువాత వచ్చారు?

**జయ :** ఈ లోపల రావటానికి అవకాశం లేక – మనస్సు ఒక వైపు మనుగడ మరొకవైపు

**చైతన్యం :** మీరు విస్పష్టంగా మాట్లాడవచ్చు.

**జయ :** విశేషాలు నాకేమీ లేవు. నేను ఓ నిర్భాగ్యజీవిని.

**చైతన్యం :** మీరు భుజంగంగారికి కూతురై కూడా నిర్భాగ్యజీవినని అనుకోవటమేమిటి?

**జయ :** ఆయన కూతురు కావటమే నిర్భాగ్యం.

**చైతన్యం :** అందువల్ల మీ ఆశయాలకు ఆటంకం కలిగిందా ఏమిటి?

**జయ :** అంతేకాదు  ప్రస్తుతం నా బ్రతుకే అయోమయశృంఖలా బద్ధమైంది.

**చైతన్యం :**మీ తండ్రిగారు బాగా చదువుకున్నవారు కూడాను. అందులో మీరు ఒక్కరే సంతానమని విన్నాము. మీకే బాధ కలిగించటం వల్ల ప్రయోజనం?

**జయ :** చదువుకోటం వల్ల ఎక్కువ చాకచక్యంతో బాధపెట్టగలుగుతున్నారు. ఒక్కమాటలో చెప్పవలసివస్తే ఆయన కేవలం స్వార్థపరుడు. తన కీర్తికోసం ప్రాభవం కోసం ఎవరినైనా ఎంత నీచంగా నైనా బలి ఇవ్వటానికి వెనుదీయడు.

**చైతన్యం :** ఆయన దూరాలోచన ఉన్నవాడు. మీరు అర్థం చేసుకోలేక పోతున్నారేమో!

**జయ :** నా మంచి కోరితే ప్రతి విషయమూ నన్ను అంతగా నిర్బంధించవలసిన అవసరం లేదు.

**చైతన్యం :** ఏ విషయంలో నిర్బంధించారో అడగవచ్చునా?

**జయ :** అన్నిటికంటే ముఖ్యమైంది. నా వివాహవిషయం.

అణుమాత్రం నాకు స్వేచ్ఛ ఇవ్వదలచలేదు. అందులోనూ ఆయన స్వార్థమే.

**చైతన్యం :** భవిష్యత్తునాలోచించి తగిన వరుణ్ణి వివాహం చేసుకోమని సలహా యిచ్చి ఉంటాడాయన!

**జయ :** ఆ పుణ్యకోటికీ – నాకు ఎక్కడి సామ్యం?

**చైతన్యం :** అతడు మంచి పలుకుబడి సంపాదిస్తున్నాడు. ముందు వచ్చే ఎన్నికల్లో గెలిచి అధమం ఓ మంత్రైనా ఔతాడని అందరూ అనుకుంటున్నారు.

**జయ :** కావచ్చు. దానివల్ల మా నాన్నగారికి మరో వనస్పతి ఫ్యాక్టరీకో, ఐరన్ కంపెనీకో పర్మిటు రావచ్చు. నాకేం ప్రయోజనం?

**చైతన్యం :** మినిష్టరుగారి భార్య అనే గౌరవం దక్కటం! అనేక పురమందిరాలూ, బాలికాపాఠశాలలూ, సినిమాహాల్లూ, ఓపెన్ చెయ్యటము, కళాశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో వార్షికోత్సవాలకు ప్రయిజ్ డిస్ట్రిబ్యూషన్ చెయ్యటం...

**జయ :** ఈ సాంఘిక గౌరవాలల్లో నాకు నమ్మకంలేదు. నాకా జీవితంలో ఆసక్తి లేదు. హృదయనైర్మల్యం లేని వ్యక్తి ఎంతవాడైనా నాకు గౌరవం లేదు. అటువంటి గౌరవాన్ని నాలో కల్గించలేని వ్యక్తిని లాంఛనం కోసం నేను వివాహం చేసుకోలేను.

**చైతన్యం :** మీ మనస్తత్వం మీకు వన్నె తెచ్చేదే. కానీ ఇది మీబోటి ధనిక గృహాలల్లో ఉండదగ్గ మనస్తత్వం కాదు.

**జయ :** అందువల్లనే నేను ఇమడలేకపోవటం!

**చైతన్యం :** మీరు ఎవరినైనా ప్రేమించారా?

**జయ :** ఆయన నాకిప్పుడు అలభ్యుడు. భవిష్యత్తులో నా ప్రవర్తనను చూచి నన్ను వివాహమాడవచ్చుననే ఆశమాత్రం ఉంది.

**చైతన్యం :** అతడెవరో చెప్పగలిగితే నాకు చేతనైనంత సాయం చేస్తాను.

**జయ :** క్షమించండి. ప్రస్తుతం నా మనస్సును విప్పలేను. మీ సానుభూతికి నేను ఏమి సమాధానం చెప్పవలెనో అర్థం కావటం లేదు – మీరు ఒక నా కోరికను అంగీకరించాలి.

**చైతన్యం :** ఏమిటది?

**జయ :** మీ సేవాశ్రమంలో ఉండి మీతోపాటు ప్రజాసేవ చేయటానికి అనుజ్ఞ ఇవ్వాలి.

**చైతన్యం :** మీ నిశ్చయానికి నాకు చాలా సంతోషము. కానీ మీరు ఎంతో కష్టసాధ్యమైన భారం ఎత్తుకుంటున్నారు.

**జయ :** మీ మీద విశేషభారం ఉంచుతున్నానండి. నేను మీ ఆశ్రమంలో ఉండటంమంటే మా నాన్నగారికి మీరు పూర్ణశత్రువులవటమన్నమాట! – అయినా మీరు అన్నమాట తప్పరు.

**చైతన్యం :** ఏమైనా రానివ్వండి. మీ రాకవల్ల నాకు జయం కలుగుతుందనే నమ్మకముంది.

**జయ :** ఈ క్షణంనుంచీ ఇక్కడనే ఉండదలచుకున్నాను.

**చైతన్యం :** నాకే అభ్యంతరమూ లేదు. రేణూ! రేణూ!!

**జయ :** (మహాత్ముని విగ్రహం దగ్గరకు వెళ్ళి నమస్కరిస్తూ)

> **నడిపించి నావయ్య**
> **ఓ దేవ! ఈ నావ**
> **కడలిలో తడబడుచు**
> **కానదేదారి యిది**
> **పెనుజడుల నలజడుల**
> **నన్ను గన నేతెంచి నడిపించి...**
>
> **పొడువుమల నెత్తాన**
> **పొలిచి తడబడు కాంతి**
> **విడివడెడు పొలిమేర**
> **నీదూర తీరానికై**
>
> **నడిపించినావయ్య**
> **ఓ దేవ! ఈ నావ**

(చైతన్యం దగ్గరికి వచ్చి నమస్కరించి) మీరు మహాత్ములు. నన్ను దీవించండి.

**చైతన్యం :** (చేయి శిరస్సుమీద ఉంచుతాడు).

**జయ :** (అధికానందంతో) అబ్బ!

**రేణు :** (ప్రవేశిస్తుంది).

**చైతన్యం :** జయమ్మగారూ!

**జయ :** నన్ను మీరు 'గారు' అని సంబోధిస్తే నా మనస్సు ఎంతో బాధపడుతుంది.

**చైతన్యం :** (చిరునవ్వుతో) అయితే జయ మన ఆశ్రమంలో ఉండి మనతోపాటు కష్టపడటానికి నిశ్చయించుకుంది. మీరిద్దరూ సోదరీమణులవలె ప్రవర్తించాలి.

**రేణు :** మేము ఇద్దరమూ క్లాసుమేట్సుము, మీకు తెలుసునో లేదో!

**చైతన్యం :** అలాగేం! మరీ సంతోషము!!

**జయ :** అక్కా!

**రేణు :** (లోపలికి పోదాం పదమన్నట్లు సంజ్ఞ చేస్తుంది).

**చైతన్యం :** పాపం! భుజంగం ఈ దెబ్బతో అల్లట తల్లటై పోతాడు – అయినా జయను త్రిప్పటానికి అనేక ప్రయత్నాలు చేస్తాడు. ఇందులో నా తప్పేముంది. జయకు సాయం చేయటం నా విధి. (కుర్చీలో కూర్చొని గీతతీసి క్రింది శ్లోకం చదువుతాడు)

> **'అనన్యా శింతయం తో మాం**
> **యే జనాః పర్యుపాసతే**
> **తేషాం నిత్యాభియుక్తానాం**
> **యోగక్షేమం వహా మ్యహం'**

**(తెర)**

## * ప్రథమ యవనిక *

**పుణ్యకోటి : మణెమ్మ :** (రెండు దిక్కులనుంచి ప్రవేశిస్తారు)

**మణెమ్మ :** హాల్లో, పుణ్యకోటిగారూ? పుణ్యకోటిగారూ? (వెర్రాడు, జయ పెళ్ళి చేసుకుంటుందనే వీడి తహతహంతా? చైతన్యం వైద్యశిబిరం దగ్గిరకు వెళ్ళి వస్తున్నాడు)–

**పుణ్యకోటి :** (ప్రవేశించి) ఏమండోయ్! క్లబ్ నుంచా ఏమిటి? –

– చేతులో బాట్ ఉంటే ఇంకా అడగటమెందుకు?

**మణెమ్మ :** వారెక్కడనుంచి?

**పుణ్యకోటి :** వెధవ పాపిష్ఠి పని ఒకటి ఉంటే వెళ్ళి వస్తున్నాను.

**మణెమ్మ :** పాపిష్ఠిపనే! – పనులు పాపిష్ఠివైనా, మీ పేరులో పుణ్యం చాలా వుంది లెండి–

**పుణ్యకోటి :** జీవితంలో 'పుణ్యం' ఎక్కడా లేదని గ్రహించే పెద్దవాళ్ళు పేర్లోనైనా ఉంటుందని పెట్టినట్లున్నారు?

**మణెమ్మ :** ఏమిటా నిస్పృహ! మీరు నిరాశ పొందినట్లున్నారు.

**పుణ్యకోటి :** ఎన్ని ప్రయత్నాలు చేసినా వ్యర్థమౌతుంటే నిరాశ కాక ఏముంటుందండీ!

**మణెమ్మ :** ఔను 'నేటి జీవితమే అలా ఉంది. నాకూ అలాగే అనిపిస్తున్నది.

**పుణ్యకోటి :** మీకేమండీ! మాకుగాని – నడిచివస్తున్నారు, కారేమైంది?

**మణెమ్మ :** ఇవాళ అయ్యగారికి ఏదో పనిఉందని వెళ్ళారు. కాస్త నడిచినట్లు ఉంటుందని ఇలా బయలుదేరాను.

**పుణ్యకోటి :** అయితే మీరు వారికేమైనా బంధువులా ఏమిటి? ఎప్పుడూ వారి కార్లో కనిపిస్తుంటారు.

**మణెమ్మ :** ఓ, నో, నో! కేవలం స్నేహితులం. వారు బాగా చదువుకున్న వారండీ! – ఇంగ్లీషులో కవిత్వం చెప్పుతారు. ఛటోపాధ్యాయ, టాగూర్లు అద్భుతమైన అభిప్రాయాలిచ్చారు.

**పుణ్యకోటి :** అలాగుటండీ – పాపం! ఆయనకు భార్య లేదని విన్నాను.

**మణెమ్మ :** అందువల్లనే అంత అద్భుతమైన కవిత్వం వ్రాయగలిగింది – లేకపోతే –

**పుణ్యకోటి :** 'జయ' కూడా తెలుగులో కవిత్వం చెప్పుతుందట! మీరెప్పుడైనా విన్నారా?

**మణెమ్మ :** తెలుగులోనా? – తెలుగులో కవిత్వమేమిటి? ఉః – చైతన్యంగారి దగ్గిర చేరినతరువాత మీరు మళ్ళీ ఆమెను చూచారా? మనస్సేమైనా మారిందా?

**పుణ్యకోటి :** ఆమెకు అతడు దయ్యమైపట్టాడు.

**మణెమ్మ :** మంచివి నాలుగుమాటలు చెప్పి మందలించ లేకపోయినారు.

**పుణ్యకోటి :** నా తరం కాలేదు – మొన్న మీరు ఆమెతో మాట్లాడినప్పుడు నా విషయాన్ని గురించి ఏమంది?

**మణెమ్మ :** ఏమందీ? పాయింట్ బ్లాంకుగా రెఫ్యూజ్ చేసింది.

**పుణ్యకోటి :** కారణం?

**మణెమ్మ :** ఆమె వివాహమే చేసుకోదట! అంతా 'స్పిన్స్టర్ ఫిలాసఫీ' మాట్లాడింది.

**పుణ్యకోటి :** చేసుకోక! – పాపం, భుజంగంగారు ఆ కూతురువల్ల అపకీర్తి పాలౌతున్నాడు.–

**మణెమ్మ :** భుజంగంది కూడా కొంత లోపం ఉందిలెండి. ఆమె పేర కొంత ఆస్తి ఉంచాడు. అందువల్ల ఆమె స్వతంత్రంగా వ్యవహరిస్తున్నది.

**పుణ్యకోటి :**మళ్ళీ మీరు ఒక్కమాటు నాకోసం ఆమెతో మాట్లాడితే!

**మణెమ్మ :** ప్రయోజనం లేదు. మొన్నటిమాటల్లోనే తెలిసిపోయింది. అయినా ప్రస్తుతము ఆమెవల్ల నాకు ఎంతో దెబ్బ తగిలింది – మా మండలి ఎలక్షన్లలో ఓడిపోయినాను –

**పుణ్యకోటి :** అవునట, విన్నాను – అప్పటినుంచే నాకూ ఆమెంటే ఒక విరక్తి కలిగింది.

**మణెమ్మ :** అది నామీద అనురాగంగా మారలేదు గదా!

**పుణ్యకోటి :** ష్యూర్! మీరు నాకెలాగైనా వివాహ విషయంలో సాయం చెయ్యాలి.

**మణెమ్మ :** (నవ్వుతూ) చేయగలిగినంత చేశాను. ఇక నా చేతనైంది, నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటమే – మరేమీ కనిపించటంలేదు, చెయ్యాల్సింది.

**పుణ్యకోటి :**నాకూ కావలసినంత డబ్బు ఏర్పడ్డది, మీ పుణ్యమా అంటూ, అనుభవించటానికి ఓ ఇల్లాలు మాత్రం కనిపించలేదు.

**మణెమ్మ :** అయితే మీకు మటుకు భార్య కావాలని అంత పట్టుదల ఎందుకు?

**పుణ్యకోటి :** తొందరలో జాగ్రత్త పడకపోతే భయమేస్తున్నది. ఎవరో ఓ అందమైన అమ్మాయి వలలో పడిపోయేట్టున్నాను. అందువల్లనే మిమ్మల్ని ఇంతగా బ్రతిమాలటం?– ఎక్కడైనా దయ ఉంచి ఓ మంచి సంబంధం చూచిపెడుదురూ?

**మణెమ్మ :** అయితే ఆ అమ్మాయికి ఉండవలసిన క్వాలిఫికేషన్సు?

**పుణ్యకోటి :** ప్రత్యేకంగా ఏమీ అవసరం లేదు. కాస్త దయాదాక్షిణ్యాలున్న ఒక హోం గ్రోన్ ఆర్టికల్ అయితే చాలు.

**మణెమ్మ :** నాకేమీ అర్థంకాలేదు.

**పుణ్యకోటి :** ఏమీలేదు. దయాదాక్షిణ్యాలతో పేదసాదలను కనిపెట్టాలని నా భార్య –

**మణెమ్మ :** సరే! – మీ భార్య అందుకు అంగీకరిస్తుంది. మిగిలిన విషయాలల్లో నా స్వేచ్ఛకు వదిలిపెట్టాలి?

**పుణ్యకోటి :** తప్పకుండా?

**మణెమ్మ :** మళ్ళీ మాట తిరగకూడదు.

**పుణ్యకోటి :** అది నా జన్మలో లేదు. మీకు తెలియని విషయమా?

**మణెమ్మ :** నాకో మంచి స్నేహితురాలుంది. ఆమెతో మాట్లాడి చెపుతాను. ఆమె కూడా మా క్లబ్బు మెంబరు.

**పుణ్యకోటి :** (దగ్గిరకు వస్తూ) ఆమెకు ఇంతకు పూర్వం వివాహం కాలేదనుకుంటాను.

**మణెమ్మ :** వివాహం కాలేదు. కానీ లోకంలో వివాహమైనట్లు కాలం గడుపుతున్నది.

**పుణ్యకోటి :** శాస్త్రోక్తంగా కాకపోతే సరి. ఈ ఆచారం కంటే నాకు శాస్త్రం ప్రమాణం. ఉc

**మణెమ్మ :** ఆమె పైకి కొంత కఠినమైన మనస్సుగా కన్పించినా హృదయం అమృతం.

**పుణ్యకోటి :** అమృతమే!

**మణెమ్మ :** అల్లా పైకి కనబడటానికైనా ఇంతకుపూర్వం ఆమెకు జీవితంలో ఆశించినంత మాధుర్యం దొరకకపోవటమే కారణం.

**పుణ్యకోటి :** అది నావల్ల తప్పకుండా ఆమె పొందకలుగుతుంది.

**మణెమ్మ :** ఆమె పేరుచెప్పిన తరువాత లోకంలో ఉన్న కీర్తిని గానీ అపకీర్తిని గానీ జ్ఞప్తికి తెచ్చుకొని మీరు అసహ్యించుకోకూడదు. ఆమె ఇంతకుపూర్వం అనేకమందిని ప్రేమించినట్లు నటించింది – అనేకులకు స్నేహితురాలని పించుకుంది.

**పుణ్యకోటి :** గొప్ప నటకురాలన్నమాట! ఇతరులకు స్నేహితురాలైతే నాకేం? మరీమంచిది.

**మణెమ్మ :** కీర్తికోసం ఎంతో తాపత్రయపడ్డది.

**పుణ్యకోటి :** నాకు కావలసిందే అది. నా భార్య కీర్తికాముకురాలు కావాలి. ఆమెవల్ల నా పేరు లోకంలో నిలిచినా ఈర్ష్యపడే స్వభావం నాలో లేదు.

**మణెమ్మ :** ఈ మాట మనస్ఫూర్తిగా వచ్చిందేనా? మగవాళ్ళకిది అరుదు.

**పుణ్యకోటి :** నీవు సాక్షిగా – ప్రమాణం చేస్తాను –

**మణెమ్మ :** అయితే ఆమెను నీవు ఇదివరకే ఎరుగుదువు?

**పుణ్యకోటి :** ఎవరబ్బా!

**మణెమ్మ :** ఆమె ప్రస్తుతం నీ ఎదటనే ఉంది.

**పుణ్యకోటి :** (ఆర్ద్రంగా) మణీ!

**మణెమ్మ :** పుణ్యకోటీ! మన వివాహం మాట ఇప్పుడప్పుడే ఎవరికీ తెలియనివ్వకూడదు.

**పుణ్యకోటి :** అసలు ఎప్పుడూ తెలియనివ్వవద్దు. అయినా మన పెళ్ళి సంగతి ఇతరులకెందుకు? పెళ్ళి కేవలం పర్సనల్.

**మణెమ్మ :** మన ఇద్దరమూ–

**పుణ్యకోటి :** భార్యాభర్తలము (చేతుల్లో చేయి వేసుకొని) భేదాభిప్రాయాలు రాకుండా మనం జీవించాలి.

**మణెమ్మ :** పార్కు లోపలికి వెళ్ళుదాము.

**పుణ్యకోటి :** లేదు. సినిమాకు వెళ్లుదాము. ఏయ్ జట్కా!

**(నిష్క్రమిస్తారు)**

# పంచమ దృశ్యం

(సేవాసమితి ఆఫీసులో హడావిడిగా అన్నీ విప్పి సర్దుతూ చంద్రశేఖరం 'నా గుండె చీల్చిచూడన్నా అందులో నవభారతం బున్న దన్నా!' అనే పాట పాడుతూ భుజంగం డ్రాయిరు బద్దలుకొట్టి, జేబులో డబ్బు దాచిపెట్టి)

**నాటకం! నాటకం!!**
**లోకమంత నాటకం!**
**పొద్దుకంటె ముందులేచి**
**పొడిచి పొలుచు బూటకం** **నాటకం...**

**ఎండ చూచి గొడుగు పట్టి**
**ఎప్పుడైన మారటం**
**రంగువేసి సింగరించి**
**రాజులాగ ఏలటం** **నాటకం...**

**తల్లక్రిందులైతె కొంత**
**తప్పుకోని జారటం**
**నాటకం! నాటకం!!**
**లోకమంత నాటకం!**

**పుణ్యకోటి :** చంద్రంభాయీ! చంద్రంభాయీ!!

**చంద్రశేఖరం :** (తాపీగా) ఏం భాయిసాబ్, ఇలా కొట్టుకొచ్చావు, అర్ధరాత్రి!

**పుణ్యకోటి :** కొట్టుకోరావటమేమిటి? కొంప మునుగుతుంటే.

**చంద్రశేఖరం :** గబ్ రావో మత్ – మనం ఉమర్ ఖయ్యాము శిష్యులము. వెనక చెప్పాను కదూ, మన పాలసీ, మరిచిపోయినట్లున్నావు. మిన్ను విరిగి మీదపడ్డా మనం ఖుషీమైన్‌టైన్ చెయ్యాలి.

**పుణ్యకోటి :** మన భుజంగంగారు ఏదో హైస్కూలులో మూగి మేష్టారును వేశాడటగా – డి.ఇ.ఒ అబ్జెక్షన్ చెప్పితే – 'చెపితే చదువు ఏం వస్తుంది, మేష్టరును చూస్తేనే రావాలి గాని' అని సమాధానం వ్రాసి పంపించాడట!

**చంద్రశేఖరం :** ఇంతే గదా! – మాట్లాడితే మధుసూదనమ్మను మార్చమని పెట్టిన పిటిషను డి.పి.ఐ దాకా వెళ్ళింది. దానిమీద ఎన్నో ఎంక్వయిరీలు –

**పుణ్యకోటి :** తనకు కొంచెం వ్యతిరేకంగా ఉన్నాడని ఆ చైతన్యం మీద కమ్యూనిష్టనీ, గ్రామాలల్లో దుష్టప్రచారం చేస్తున్నాడనీ, పేదలయిల్లు దోచమని బీదవాళ్ళను కొందరిని ప్రబోధిస్తున్నాడనీ రిపోర్టు పెడితే అది విచారణకు వచ్చి అందులో ఊళ్ళోవాళ్ళంతా వ్యతిరేకించారట!

**చంద్రశేఖరం :** వ్యతిరేకించరూ మరి, అన్ని దినాలూ అతనివౌతవా? నిన్న రాత్రి క్లబ్‌నుంచి ఒంటిగంటకు ఒళ్ళు తెలియని పరిస్థితిలో వస్తూ వుంటే అతని కారు క్రింద ఎవరో మనిషి పడ్డాట్ట – పోలీసు కేసులో చిక్కుకున్నాడని ఇప్పుడే ఇన్ఫర్‌మేషన్ వచ్చింది.

**పుణ్యకోటి :** తెల్లవారితే అరెష్టువారెంటు వస్తుంది.

**చంద్రశేఖరం :** ఓస్ ఇంతేనా! – ఏమిటా వెర్రి గాభరా – ఇవన్నీ ఆయనకు తెలియవనే? అందుకు ఆయన సిద్ధపడే ఉంటాడు.

**పుణ్యకోటి :** అతడు ఎక్కడికైనా పరారైపోతే.

**చంద్రశేఖరం :** పాపం! మణెమ్మను వదిలిపెట్టలేడు.

**పుణ్యకోటి :** ఆమెకూడా చాలా మారిపోయిందట! ఊళ్లో టాక్ పడ్డది, ఇక మర్యాదగా భర్తతోనే కాలక్షేపం చేసి పెద్దమనిషి అని అనిపించుకుదామని నిశ్చయించినట్లు.

**చంద్రశేఖరం :** ఎప్పుడూ సీతాకోక చిలుకను ఎవరు చూస్తారోయ్! కాలం కలిసి రానప్పుడు దానికో కమ్మని ఫిలాసఫీ కల్పించి ప్రవర్తించటమే ప్రజ్ఞంటే.

**పుణ్యకోటి :** మండలి ఎలెక్షన్సులో ఓడిపోయినప్పటినుంచి మనస్సులో మనస్సు లేదుట! అంతమాత్రంలో ఆమె ఇన్‌ఫ్లుయన్సుకు భంగం లేకపోయినా–

**చంద్రశేఖరం :** అబ్బాయీ! ఒకమాట చెబుతాను విను. న్యూటన్ భూమ్యాకర్షణశక్తి సిద్ధాంతం ప్రకారం ఒక బిందువు తప్పితే అంతా తలక్రిందు లౌతుంది. మణెమ్మ వంటి జీవితాలల్లో అందంలో ఒక బిందువు అటైతే చాలు అంతా తారుమారౌతుంది.

**పుణ్యకోటి :** పాపం! భుజంగం పడిపోతున్నాడు.

**చంద్రశేఖరం :** పడిపోయినాడు! పడిపోక తప్పదు!! పడవలసిందే!!

**పుణ్యకోటి :** శేఖరం! నీవు చాలా చిత్రమైనవాడివి. అంతవాడు పడిపోతుంటే నీకేమీ అనిపించటం లేదూ.

**చంద్రశేఖరం :** గుళ్ళో గంటపోతే నంబికేం లోటు అనిపిస్తున్నది.

**పుణ్యకోటి :** నిన్ను చూస్తే భయం వేస్తున్నది.

**చంద్రశేఖరం :** భయమా! అనుభవం లేక. ఈ భుజంగం పోతే మరో జంగం. ఆకాశాన ఎన్ని తారలు పుట్టటం లేదు గిట్టటం లేదు. ఇది రాజకీయ మేదస్సుకు ఉండవలసిన తత్వం.

**పుణ్యకోటి :** అది నాకు నచ్చదు. నాకు హృదయముంది.

**చంద్రశేఖరం :** అయితే నీవు గొప్పవాడివి చస్తేకాలేవు.

**పుణ్యకోటి :** పోనీ, హృదయం మలినం కాకుండా ఉంటే చాలు.

**చంద్రశేఖరం :** దాన్ని మలినం కాకుండా దాచిపెట్టుకుంటూ లోక వ్యవహారాల్లో వ్యవహరించటం నేర్చుకోవాలి. సెయిల్ విత్ ది విండ్. సేఫెష్టు పాలసీ!

**పుణ్యకోటి :** ఏమో! నీవన్నంత చులకనగా నేను చూడలేను. భుజంగానికి కష్టాలు వస్తున్నవని నామనస్సెంత బాధపడుతున్నదో తెలుసునా?

**చంద్రశేఖరం :** ఎప్పటికైనా మామగా రౌతారేమోనని నీకు కొంత మమకారం ఉంది గనక అంత బాధపడుతున్నావు.

**పుణ్యకోటి :** అది కల్లని ఎప్పుడో నిశ్చయించుకున్నాను. వ్యర్థప్రయత్నాలు చేసి విరమించుకున్నాను కూడాను.

**చంద్రశేఖరం :** అయితే నా మాటవిను. ఎవడు నాలుగు డబ్బులు ముట్టచెప్పగలడో వాడే మనకు నాయకుడు, ఇంద్రుడు, చంద్రుడు, సత్యకాలం తప్పిన తరువాత సర్వం జగన్నాథం.

**పుణ్యకోటి :** నీవు భ్రాంతిలో పడుతున్నావు.

**చంద్రశేఖరం :** నా భ్రాంతివల్ల నాకు లాభం – నీ భ్రాంతివల్ల నీకు మొప్పం. లెరన్ టు లవ్ అండ్ లేబర్.

**పుణ్యకోటి :** ఎవర్ని?

**చంద్రశేఖరం :** చైతన్యాన్ని?

**పుణ్యకోటి :** వాడు నాకు పరమశత్రువు.

**చంద్రశేఖరం :** నాకు పరమ మిత్రుడు. నేను తెల్లవారేటప్పటికి అతని క్యాంపుకు వెళ్ళి చేరిపోతున్నాను.

**పుణ్యకోటి :** ప్రాణం పోయినా నేను భుజంగానికి ప్రాపుగానే ఉండ దలచాను.

**చంద్రశేఖరం :** నీ మొఘం! నీబోటివాళ్లు కోటిమంది ఐనా అతగాణ్ణి రక్షించలేరు. – అతనికి వ్యతిరేకమయిన కాగితాలన్నీ అందినంతవరకూ ఇదివరకే చైతన్యం దగ్గిరకి చేరిపోయినవి. నేను అక్కడికి మరికొన్నిటితో చేరుతున్నాను. చెడిపోకు. నా మాట విను. – నీవూ నా వెంటరా!

**పుణ్యకోటి :** యూ ఆర్ ఏ రోగ్, స్కౌండ్రల్.

**చంద్రశేఖరం :** తెలుగులో ఏడవవోయ వెధవా?

**(దెబ్బ కొడతాడు)**

**పుణ్యకోటి :** (మళ్లీ తిరిగి దెబ్బకొడతాడు)

**బుడే :** (హడావిడిగ ప్రవేశించి) అరే లడాయ్ – క్యా అరెహల్లా బూజహంగం సాబ్, సాబ్ – (పిలుచుకుంటూ నిష్క్రమిస్తాడు)

**చంద్రశేఖరం :** జాగ్రత్త! (విపరీతంగా కొట్టి పారిపోతాడు)

**పుణ్యకోటి :** దొంగ! దొంగ!!

**భుజంగం :** (నెమ్మదిగా వచ్చి) పుణ్యకోటీ!

**పుణ్యకోటి :** (వెనక్కు వచ్చి) మీకు వ్యతిరేకమైన కాగితాలన్నీ పట్టుకొని చంద్రశేఖరం పారిపోతున్నాడు.

**భుజంగం :** (గాభరాతో వెతుకుతూ) డ్రాయరు బద్దలు కొట్టినట్లున్నాడు. పదివేలు కనిపించటం లేదు.

**పుణ్యకోటి :** (చెవిలో ఏదో చెపుతాడు)

**భుజంగం :** (నిర్ఘాంతపోతూ) అరెస్టా! అది నన్నేమి చేస్తుంది. (పెద్దగా నవ్వి) బ్యాంకులో నాకు నాలుగు లక్షలున్నవి.

**పుణ్యకోటి :** అవి మిమ్మల్ని రక్షించలేవు.

**భుజంగం :** నన్ను అధైర్య పరచవద్దు.

**పుణ్యకోటి :** పైవాళ్ళకు పైవాళ్ళు వ్యవహారం నడిపిస్తున్నారు.

**భుజంగం :** వాళ్ళు పైవాళ్ళవంటివారు కారూ?

**పుణ్యకోటి :** కాదు. కాలం మీకు చాలా వ్యతిరేకంగా ఉంది. కాగితాలు చంద్రశేఖరం అన్నీ పట్టుకుపోయినాడు. రిపోర్టులు చాలా ప్రూవ్ అవుతవి.

**భుజంగం :** ఔను ఔతవి. (వెర్రిగా) అయితే!

**పుణ్యకోటి :** పారిపోండి.

**భుజంగం :** ఎక్కడికి  ఎందుకోసం?

**పుణ్యకోటి :** ఎవరికి కనపడని చోటికి  అపకీర్తి రాకుండా ఉండటానికి.

**భుజంగం :** అసంభవము – ప్రాణంమీద నాకు ఆసక్తిపోయింది.

**పుణ్యకోటి :** మీకు ఇటువంటి దుస్థితి కలుగుతున్నందుకు నాకెంతో బాధగా ఉంది.

**భుజంగం :** కారణం?

**పుణ్యకోటి :**  నేటి నా స్థితికి కారకులు మీరు కావటం వల్ల.

**భుజంగం :** (ఆలోచించి) నీలో ఆ కృతజ్ఞత ఉన్నదన్నమాట!

**పుణ్యకోటి :** నిశ్చయంగా –

**భుజంగం :** అయితే నాకొక సహాయం చెయ్యాలి.

**పుణ్యకోటి :** తప్పక చేస్తాను.

**భుజంగం :** వాగ్దానం చేస్తావా?

**పుణ్యకోటి :** (చేతిలో చేయి వేస్తాడు)

**భుజంగం :** (జేబులోనుంచి తాళం చెవి తీసి మరొక డ్రాయర్లో ఉన్న పిస్టలు తీస్తాడు) ఇదుగో! ఈ దుస్థితికి కారణం నా శత్రువు చైతన్యం, అతని మృతివార్త నా చెవిన పడాలి.

**పుణ్యకోటి :** (నిర్ఘాంతపోతూ) బావా!

**భుజంగం :** ఔను, ఖూనీ! – చేయలేవూ – చేతగాదన్నమాట!

**పుణ్యకోటి :** క్షమించాలి. నేను హత్య చెయ్యలేను.

**భుజంగం :** పిరికిపందవు. కృతఘ్నుడివి – శత్రువును హతమార్చేవాడే నా స్నేహితుడు!

**పుణ్యకోటి :** స్నేహితుణ్ణి కాలేకపోయినందుకు క్షమించాలి.

**భుజంగం :** ఈ హృదయంలో ఇక క్షమకు స్థానం లేదు.

**పుణ్యకోటి :** సెలవు (నిష్క్రమిస్తాడు)

**భుజంగం :** స్నేహితులు! రాస్కెల్సు – వీళ్ళ స్నేహితాలు! బాగున్నప్పుడు తాళంవేసి బాగుపడదలచిన వెధవలు! బుడే... బుడే!!

**బుడే :** (ప్రక్కనుంచి చూస్తూండటం వల్ల భయంతో ప్రవేశించి) జీ హుజూర్!

**భుజంగం :** చైతన్యం మన శత్రువు.

**బుడే :** జీ హుజూర్! షైతన్యం హంకీ షత్రువ్ హై

**భుజంగం :** ఇదిగో! దీన్ని చేత్తో పుచ్చుకో –

**బుడే :** (భయంతో ఆపాదమస్తకం కంపిస్తూ) ఏ క్యా హై సాబ్.

**భుజంగం :** పిస్టల్

**బుడే :** (అటూ ఇటూ త్రిప్పి చూచి) పిస్తోలూ! బహుత్ (కొంచెం ధైర్యంతో) అచ్ఛీ హై సాబ్!

**భుజంగం :** ఈ మీట ఇలా నొక్కితే ఎవరివైపు త్రిప్పిలాగితే అతడు చచ్చిపోతాడు.

**బుడే :** షచ్ఛీపోతాడ్! – మర్గయా హై పోతాడ్!! దీన్కీ షేషిన ఆద్మీ మల్లీ బల్ తెల్వీహుందీ సాబ్! –

**భుజంగం :** దీనితో తెల్లవారేటప్పటికి చైతన్యాన్ని చంపివెయ్యాలి.

**బుడే :** (పిష్టల్ క్రిందకు వదిలేస్తూ) అరె బాపురే!– మీకీ పాగల్ హైపోతుండార్?

**భుజంగం :** నేనా?

**బుడే :** ఆప్ హుజూర్ – నైతో?

**భుజంగం :** ఛీ గాడిదా?

**బుడే :** జీ హుజూర్! మై గధాహూఁ ఆప్?

**భుజంగం :** మాట్లాడితే నిన్ను పేల్చేస్తాను.

**బుడే :** హరె అల్లా మైక్యాకరూఁ (ఏడుస్తాడు)

**భుజంగం :** అది చేతికిచ్చి నీవు వెళ్ళిపో – ఈ సంగతి ఎవరికైనా తెలిసిందా నీ ప్రాణాలుతీసేస్తాను –

**బుడే :** (నిష్క్రమిస్తూ ఏడ్పుతో) జీ హుజూర్!

**భుజంగం :** (అద్దం దగ్గిరకి వెళ్ళి) భుజంగం, నీకు నమ్మిన స్నేహితుడు లేడు. సేవకుడు లేడు, ఏ బంధువులూ లేరు. ఏకాకివి.

**మణెమ్మ :** (ఆతురతతో ప్రవేశించి) భుజంగం!

**భుజంగం :** మణీ! – నీకూ తెలిసిందా ఏమిటి? – సాయం చెయ్యను వచ్చావా?

**మణెమ్మ :** నీకూ ముందుగా తెలిసిందన్నమాట?

**భుజంగం :** నేనూ అందుకు సిద్ధపడుతున్నాడను. (పిస్టలుతో మణెమ్మవైపు తిరిగి) ఇదుగో!

**మణెమ్మ :** ఇదేమిటి?

**భుజంగం :** నా శత్రువుకు మారణాస్త్రం – మణీ! నాకోసం నీకోసం – చైతన్యాన్ని హత్యచేస్తావా?

**మణెమ్మ :** హత్య! బాబో!

**భుజంగం :** నీవు కూడా కృతఘ్నురాలివి! లోకం మోసం. అంతా అంధకారం – మణీ! నీవు అతణ్ణి హత్య చెయ్యాలి. హత్య!

**మణెమ్మ :** చెయ్యలేను. చెయ్యను.

**భుజంగం :** ఛీ! నీచురాలా! నీవు భర్తను చాటుపెట్టుకొని నాతో ఇంతకాలం కాలక్షేపం చేశావు. ఇప్పుడు కృతఘ్నురాలవౌతున్నావు.

**మణెమ్మ :** భుజంగం! మర్యాదగా మాట్లాడు.

**భుజంగం :** నీవంటి వ్యభిచారికీ మర్యాదా?

**మణెమ్మ :** (కోపంతో) భుజంగం!

**భుజంగం :** (వెర్రిగా నవ్వి) వ్యభిచారిణివి కావూ? కావు. పాపం, పతివ్రతవు, మహాపతివ్రతవు! – ఫో, అవతలికి ఫో నీ మొఖం చూడలేను! గెటవుట్.

**మణెమ్మ :** (వెళ్ళబోతూ) నీకు పిచ్చి ఎక్కింది?

**భుజంగం :** ఆగక్కడ? పిచ్చి! ఔను. నాకు పిచ్చే – అంతా మోసం, నటన! లోకమే నటన!! ప్రేమ – గౌరవం, త్యాగం – సర్వం స్వార్థం – మణీ! నీవంటి వ్యక్తులు లోకానికి సంఘానికి వేరుపురుగులు –

**మణెమ్మ :** (నడుస్తుంటుంది).

**భుజంగం :** ఆగక్కడ (వెళ్ళుటకు అడుగులు లెక్క పెడుతూ)

**మణెమ్మ :** (ముందుకు నడుస్తుంది జాలిగా) భుజంగం! నీవు వెర్రివాడవైపోయినావు. ఏమిటీ ప్రవర్తన. నీలో ప్రేమ ఏమైంది? (దగ్గరకు వెళ్ళగానే)

**భుజంగం :** ఇంకా మోసమా రాక్షసీ! నీవు చచ్చిపో, నేనూ చచ్చిపోతాను. ఇదిగో ఉఁ (పిష్టలు పేలుస్తాడు).

**మణెమ్మ :** (వెర్రికేకతో నేలమీద వాలిపోతుంది) భుజంగం!

**భుజంగం :** (వెర్రిగా చూస్తూ) ఆఁ ఏమిటీ! మణీ! మణీ!! హఁ హఁ హఁ దయలేదు – నా అంతఃశత్రువు చచ్చిపోయింది. బహిశ్శత్రువు చైతన్యం చచ్చిపోతాడు. ఒరేయ్, చైతన్యం! వస్తున్నా, నీ యముణ్ణి, నిన్నూ నన్నూ యమ భటులు ఒకేపాశాన పట్టుకోపోవాలి. ఏమిటి? ఇల్లంతా ఇల్లా తిరుగుతున్నది. ఇది విమానమై అతడి దగ్గరకి చైతన్యం దగ్గిరికి తీసుకోపోతున్నది. నా కీర్తినీ, కుమార్తెనూ అపహరించావు కదూ? (వెర్రిగా నవ్వుతూ) రైటు ఓ.కె.

**(పిష్టలుతో నిష్క్రమిస్తాడు)**

**బుడే :** (ప్రవేశించి) మణ్యమ్మ! (ఏడుస్తూ) షచ్చిపోతుండావ్!

**మణెమ్మ :** దాహం! – బాధ – అబ్బా! (కళ్ళుమూస్తుంది) భుజంగం!

**బుడే :** బూజుహంగం కాదు హమ్మ, బుడే సాహెబును – (చూచి) హోగయా – మర్గయా – ముర్గీ మర్గయా –

(లోపలనుంచి)

**తాయ్ తోయ్ తక్కధిమి తోల్బొమ్మా**
**బల్ తమాష షేస్తాది తోల్బొమ్మా**
**మంచిరోజు లైతెచాలు**
**మళ్ళీ మళ్లీ ఎగ్రుతాది**
**తల్లకిందులైతె ఎంతొ**
**తన్నుకోని ఒరుగుతాది** **తాయ్, తోయ్...**

**సాగిపోతు ఉంటె దాని**
**సంతసము చెప్పలేము**
**ముల్లుకుట్టిందంటె చాలు**
**మొత్తుకొని ఏడుత్తాది**

**తాయ్ తోయ్ తక్కధిమి తోల్బొమ్మా**
**బల్ తమాష షేస్తాది తోల్బొమ్మా.**

**బుడే :** (మణెమ్మను చూచి తెల్వి తెచ్చుకొని) హిక్కడుంటే ఖూనీ నాకీ షేషానంటూ షూసీ మళ్లీ పోలీస్ ఫట్కాపోతే – రే అల్లా! రే అల్లా!! (అంటూ నిష్క్రమిస్తాడు)

**(తెర)**

**∗ ప్రథమ యవనిక ∗**

**(చంద్రశేఖరం – రావు ప్రవేశిస్తారు)**

**చంద్రశేఖరం :** ఏమండీ, రావుగారూ ఎక్కడనుంచి? నడిచి వస్తున్నారు?

**రావు :** మా వుద్యోగం కాదుగానీ తల ప్రాణం తోకకు వస్తున్నదండీ!

**చంద్రశేఖరం :** అదేమిటి మహాశయా! మీరే అలా అంటున్నారు. మాబోటివాళ్లం మీ చేతుల్లో ఉన్నాం. మీరు ఎక్కమంటే ఎక్కుతాం  దిగమంటే దిగుతాం.

**రావు :** అవన్నీ వెనకటి దినాలండీ – ఇప్పుడు ప్రజల ఇష్టానుసారంగా నడవవలసి వస్తున్నది. మా అవస్థ చెప్పేటట్టు లేదు. ఫలానవాడిని ఎత్తవల సిందని పైనుంచి తాఖీదులు, అయితే పల్లెల్లోనూ పట్టణాలల్లోనూ పరువు మర్యాదలు నిలచేటట్టులేదు.

**చంద్రశేఖరం :** సత్యం చెప్పటానికి అంత జంకెందుకు?

**రావు :** సత్యం చెపితే స్టంటు ఉండవద్దటండీ – లేకపోతే పేపరు ఖర్చు కాదు – నిజానికి చైతన్యంగారు చాలా శ్రమపడి ప్రజాసేవ చేస్తున్నాడు. ఆయనను గురించి వ్రాస్తే అక్కడ అచ్చుపడటం దుర్లభంగా ఉంది అలా అయితే మాకు భుక్తి గడవదు.

**చంద్రశేఖరం :** అయితే భుజంగంగారిని గురించి లేటెస్టు న్యూస్ ఏమైనా మీకు వచ్చిందా?

**రావు :** ఏమీ రాలేదు.

**చంద్రశేఖరం :** ఆయనకు పిచ్చి ఎక్కిందటగా? – నాకూ ఆయనకు నిన్నటినుంచి చెడ్డదిలెండి.

**రావు :** ఏమిటీ? ఒక షేక్‌హాండ్ ఇలా పారెయ్యండి. అద్భుతమైన న్యూస్ చెప్పారు. యావద్దేశానికీ – ఆయనకు పిచ్చే! – మీ ఇద్దరికీ చెడిందా?

**చంద్రశేఖరం :** దానికీ దీనికీ సంబంధం లేదనుకోండి.

**రావు :** మీరు అంటే మటుకు మేమెలా అంగీకరిస్తాము? రేపు న్యూస్ ఫ్లాష్ చేయిస్తాను. చంద్రశేఖరం – భుజంగం మనస్పర్థలు – భుజంగం ఉన్మాదం అని హెడ్లయిన్స్ ఇవ్వమని వ్రాస్తాను. మళ్లీ కొంత అలజడి ఉండాలి.

**చంద్రశేఖరం :** ఈ మధ్య మీరు గ్రామంలో లేరా ఏమిటి? ముఖ్యమైన అనేక విషయాలు మీ పత్రికలో లేనట్లు కనిపిస్తున్నవి.

**రావు :** ఔనండీ – చైతన్యం క్యాంపు – కమ్యూనిష్టుక్యాంపుగా మారిపోతున్న దని వెళ్ళిపోతున్నదని వెళ్ళిన రిపోర్టుమీద నన్ను ప్రత్యేక విలేఖరిగా పంపించాడు?

**చంద్రశేఖరం :** అయితే చూచి వచ్చారా? – మీ అభిప్రాయం!

**రావు :** సత్యం చెప్పవలసివస్తే ఆయనకూ కమ్యూనిజానికీ ధ్రువాల కున్నంత దూరం. కానీ రిపోర్టు అలా వ్రాయవలసిందని స్పెషల్‌గా ఎడిటోరియల్ స్టాఫ్ దగ్గిరనుంచి ఉత్తరం వచ్చింది. వాళ్ళకు పై ప్రషర్ ఉండి ఉంటుంది.

**చంద్రశేఖరం :** అయితే ఇంత అన్యాయంటండీ! వచ్చే ఎన్నికల్లో ఎలాగూ చైతన్యం రావటం సత్యం. అప్పుడు మీరూ – మీ పేపరూ, ఏమైపోతుందో చూచుకోవాలి.

**రావు :** నిజంగానా?

**చంద్రశేఖరం :** మేమంతా అతని పక్షంలో పనిచెయ్యటానికి నిశ్చయించుకున్నాము – మరి ఈ న్యూస్ విన్నారా?

**రావు :** ఏమిటది? –

**చంద్రశేఖరం :** జయమ్మ చైతన్యం క్యాంపుకువచ్చి ప్రజాసేవ చేస్తున్నదని.

**రావు :** తెలిసింది. పంపిస్తే పడలేదు.

**చంద్రశేఖరం :** ఓహో! అది భుజంగానికి వ్యతిరేకమని కామాలి – ఇదిగో ఇంత అవస్థ ఎందుకుగాని, మీరు మా పేపరుకు సంపాదకులుగా వస్తారా?

**రావు :** మీరో పేపరు పెడుతున్నారా?

**చంద్రశేఖరం :** అవును 'క్షురా' – దేశంలో అనవసరంగా పెరిగిన కల్మశాన్నంతా ఒక్కమాటు తుడిచివెయ్యాలనుకున్నాము. మీబోటి అనుభవమున్న వారికి రు. 200/ – దాకా ముట్టచెపుతాము.

**రావు :** నాకు మావాళ్ళు రు. 250/– ఇప్పుడే ఇస్తున్నారండీ!

**చంద్రశేఖరం :** పడిపోయే పేపరు రు 250/– ఇవ్వటంలో గొప్ప ఏముందండీ రు. 500/– ఇవ్వవచ్చు – ఏ సంస్థయినా పడిపొయ్యేటప్పుడు విరివిగా ఇవ్వటం సహజం!

**రావు :** ఆలోచించి చెపుతాను, మీ పాలసీ?

**చంద్రశేఖరం :** ఎవరు పైకి వస్తుంటే వాళ్ళకు దోహదమివ్వటము, చైతన్యం అద్భుతంగా సేవ చేసి ప్రజాగౌరవం పొందుతున్నాడు. అతనికి మనం కూడా కొంత చేయూత ఇవ్వాలి.

**రావు :** నిజమండి. తప్పకుండా ఇవ్వాలి –సెలవు

**(నిష్క్రమిస్తాడు)**

**చంద్రశేఖరం :** బుడే, బుడే – ఈ వెధవ ఇలా పరుగెత్తుతున్నాడేమిటి? – జాగ్రత్త, నెమ్మదిగారా!

**బుడే :** షేఖహారం బాబూ! (ఏడుస్తూ) షేకహారం బాబూ!

**చంద్రశేఖరం :** ఏమైందిరా?

**బుడే :** హోగయీ సాబ్! సబ్ హోగయీ!! రే అల్లా! మర్గయీ!

**చంద్రశేఖరం :** చనిపోయింది ఎవరురా?

**బుడే :** మణ్యమ్మా సాబ్! మణ్యమ్మా!!

**చంద్రశేఖరం :** మణెమ్మా! ఛో, ఊరికి పీడా వొదిలింది. నీవేడుస్తా వెందుకు?

**బుడే :** (వణికిపోతూ)బూజుహంగం సాబ్ పిస్తోల్ టూట్‌కియా – మర్గయీ!

**చంద్రశేఖరం :** భుజంగం చంపాడా? – ఒక దెబ్బతో ఇద్దరూ వదలి పోయినారు.

**బుడే :** హుజూర్ – షైతన్యంగార్కి షంపాలంటూ మల్లీ హెళ్ళినాడ్ సాబ్. (వణికిపోతూ) రేసాబ్ –

**చంద్రశేఖరం :** ఎంతసేపైంది?

**బుడే :** పాంచ్ మినిట్ హై సాబ్ – పాంచ్ మినిట్

**చంద్రశేఖరం :** పద పోలీస్ స్టేషన్ వైపు పద –

**బుడే :** చలో సాబ్, చలో!

# షష్ఠమ దృశ్యం

(చైతన్యం పరుపు పరిచిన క్యాంపుకాట్ మీద కూర్చొని పుస్తకం తీసి చదువుకుంటూ ఉంటాడు, కొవ్వు వత్తి దీపం వెలుగులో దూరంనుంచి బుర్రకథ వినిపిస్తుంది)

**బాపూజీ! మన బాపూజీ!**
**జయ బాపూజీ! జయ్ బాపూజీ!!**
**పెట్టా కుడవా ఉన్న ఇంట**
**పుట్టినాడోయ్! బాపూజీ** **బాపూజీ...**

**సత్యమె తానై పుట్టీ అహ,**
**త్యాగము తానై పుట్టి ఓహో,**
**నేలను నడిచిన దేవతయై**
**తా నిలిచాడోయీ బాపూజీ** **బాపూజీ...**

**సత్యాగ్రహమే సాధనమంటూ, అహ,**
**మానవసేవే మనమత మంటూ, ఓహో**
**స్వాతంత్ర్యము మనకిచ్చీ,**
**స్వర్గం చేరాడు, బాపూజీ** **బాపూజీ...**

**చైతన్యం :** (గాంధీజీ విగ్రహానికి నమస్కరిస్తాడు. గీతలో నుంచి శ్లోకం క్రింది విధంగా పఠిస్తాడు)

**"ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః**
**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః**
**యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపి చోత్తమః**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః"**

**ముసలయ్య :** (పూలసెజ్జతో ప్రవేశించి, బల్లమీద ఉంచుతాడు)

**చైతన్యం :** బాబూ! బాపూజీ కథ అయిపోయినట్లుందే. ఎవరో అద్భుతంగా చెప్పారు.

**ముసలయ్య :** ఎవరో బాగా చదువుకున్న జట్టంట బాబయ్యా!

**చైతన్యం :** రేపు మన ఉత్సవంలో మరోకథ చెప్పిస్తే బాగుండేటట్లుంది.

**ముసలయ్య :** నేను ముందే అడిగాను బాబూ! ఒప్పుకున్నాడు. మన రంగడు అందుకోసమే ఊళ్ళోకెళ్లి రైతులతో మాట్లాడి ఏర్పాటు చేస్తానన్నాడు. – దండలకు కావలసిన పూలన్నీ తెచ్చాము. పందిట్లో తోరణాలు కట్టాము. అరుగూ అదీ సిద్ధం చేశాము.

**చైతన్యం :** మనవాళ్ళు ఇంకా రాలేదు.

**ముసలయ్య :** వాళ్ళ కేమీ భయంలేదు బాబూ. వెంట వెంకయ్య గోపయ్యా ఇద్దరూ ఉన్నారు.

**చైతన్యం :** పాపం! పేదవాళ్ళను చూచి వాళ్ళిద్దరి హృదయం ఊరికే కరిగిపోతున్నది. నిద్రాహారాలు లేకుండా పాటు పడుతున్నారు.

**ముసలయ్య :** నిజం బాబయ్యా! – అయితే జయమ్మగారు భుజంగంగారి కుమార్తెటగా బాబూ.

**చైతన్యం :** ముళ్లగులాబీ మొక్కకు ఎంతో చక్కని పూవు పూయటం లేదూ, ముసలయ్యా!

**ముసలయ్య :** అవును బాబూ! ఆ అమ్మలిద్దరికీ గూడెమంతా చెయ్యెత్తి మొక్కుతున్నారు. – మన రేణమ్మగారు మాలపిల్లటగా బాబూ!

**చైతన్యం :** ఇన్నాళ్ళబట్టీ నీవేమనుకుంటున్నావు?

**ముసలయ్య :** మీ భార్యగారనుకుంటున్నా?

**చైతన్యం :** (నవ్వుతూ) ఇప్పుడు కాదనుకుంటున్నావా? – కొద్దిరోజుల్లో నేను –

**ముసలయ్య :** పెళ్ళి చేసుకుంటారా బాబూ? – ఇప్పుడో మరి?

**చైతన్యం :** స్నేహితులము –

**ముసలయ్య :** అంతేనన్నమాట అరుగోబాబూ! అంతా వచ్చేస్తున్నారు – మీ పెళ్ళినాటికి ఊళ్ళోవాళ్ళంతా కలిసి మీకు ఇల్లేసిస్తారు లే.

**చైతన్యం :** మా పెళ్లిగూడా మీరే చెయ్యాలి –

**(ప్రవేశము – రేణు, జయమ్మ)**

రేణూ! ఇంత ప్రొద్దుపోయింది.

**రేణు :** (రిష్టువాచీ చూచి) ఇంకా పన్నెండన్నా కాలేదు. రోజూ మీరు చదువుకునేవేళ–

**చైతన్యం :** ఇందాకటినుంచీ ఇక్కడ మాకూ మంచి కాలక్షేపం. గాంధీ 'బుర్రకథ' – చాలా బాగా చెప్పారు. అక్కడ బాగా నడిచిందా ఇనాక్యులేషన్.

**(ముసలయ్య నిష్క్రమిస్తాడు)**

**రేణు :** సాయంత్రానికే పూర్తి ఐంది. కాని చిన్న మీటింగు ఒకటి పెట్టారు తరువాత.

**చైతన్యం :** (జయను చూస్తూ) భోజనం చెయ్యండి. తరువాత మాట్లాడుకుందాం. చల్లారిపోయి ఉంటుందిప్పటికే.

**రేణు :** అందుకే ఇంత ఆలస్యమైంది. భోజనం చేస్తేగానీ పోనివ్వమని పట్టుపట్టారు.

**జయ :** ఊళ్ళో జనం ఎంత మర్యాద చేశారండీ. పట్టణాలల్లో అంతా వ్యాపారంగా ఉంటుంది – అక్కడివారు ఉపన్యాసకులంటే 'పనిలేని మంగలి' కింద భావిస్తారు. (తల మీద చెయ్యి పెడుతుంది తలకాయనొప్పి నిరూపిస్తూ)

**చైతన్యం :** నీవు కూడా చాలా శ్రమపడ్డట్టున్నావు జయా!

**జయ :** ఆ అమాయక ప్రజను చూస్తుంటే ఒకవంక దీనస్థితికి దుఃఖపడుతున్నా, సంతోషం కలిగింది.

**రేణు :** రేపు మరొకసభ. దానికి అధ్యక్షులు మీరు. మన సభలకు అడ్డులేకుండానే కార్యక్రమం నిర్ణయించారు. ఆ గ్రామ గ్రంథాలయంలో మీ ఛాయాచిత్రం ఆవిష్కరిస్తారట!

**చైతన్యం :** నా ఫొటో వారికెలా వచ్చింది?

**రేణు :** మీరు ఏ సందర్భంలోనో ఔషధసేవ చేస్తున్నప్పుడు తీసిన చిత్రాన్ని ఎన్లార్జి చేయించారట!

**జయ :** ఎన్లార్జిమెంటు అద్భుతంగా ఉంది. – మరి నీమాట చెప్పవు రేణూ!

**చైతన్యం :** కొంత దాపరికం కూడా ఉందా ఏం  రేణూ!

**జయ :** రేణు నర్సు వేషంలో ఉన్న చిత్రాన్ని –

**రేణు :** జయచేత ఆవిష్కరింపజేస్తారు.

**చైతన్యం :** ఈ రిపోర్టు పేపర్లో చూసి భుజంగంగారు మనమీద విరుచుకోపడతాడు

**(అంతా నవ్వుకుంటారు)**

**రేణు :** జయా! తలనొప్పి ఎలా ఉంది?

**జయ :** ఇప్పుడేమీ బాధలేదు.

**చైతన్యం :** ఒక మాత్ర వేసుకొని గుక్కెడు మంచినీళ్లు త్రాగి నిద్రపోతే

**(క్యాంపు కాట్ వైపు చూస్తాడు)**

**జయ :** అప్పుడే తగ్గిపోయింది.

**చైతన్యం ::** మొఘమాటపడతావేం జయా! నా మాట విని ఆ కాట్ మీద పడుకో! – రేణూ – కాస్త ధర్మామీటరు చూడు.

**రేణు :** (ధర్మామీటరు అందిస్తే జయ నోట్లో పెట్టుకొని చూస్తూ ఉండగా చైతన్యం 'ముసలయ్యా! టెంపరేచరు చూచి మందు పెట్టె తీసుకోరా?' అంటాడు. ముసలయ్య ముందుపెట్టె లోపలినుంచి తెస్తాడు)

**చైతన్యం :** 1040. రేణు! ఆమెను క్యాంపుకాట్‌మీదికి చేర్చు.

(రేణు అలా చేరుస్తుంది. డాక్టరు మందుఇస్తాడు. జయ మంచంమీద వెన్నువాల్చి ఉంటుంది)

**జయ :** రేణూ! తెల్లవారిన తరువాత మన కార్యక్రమం విషయం డాక్టరుగారితో ఆలోచించు.

**రేణు :** నీ జ్వరం నెమ్మదికానీ –

**జయ :** తెల్లవారేప్పటికి తప్పక తగ్గుతుంది. ఎండదెబ్బ తగ్గి వేడిచేసింది అంతే.

**(ముసుగు పెట్టుకుంటుంది)**

**చైతన్యం :** ఎక్కువ అలసట పడకుండా నిద్రపట్టించుకోవాలి. ముసలయ్యా! ఈ పెట్టె లోపలికి తీసుకోపో (ముసలయ్య పెట్టెతో నిష్క్రమిస్తూ, 'బాబూ! మీకు నా మంచం తెమ్మన్నారా' అని అడిగితే 'అవసరం లేదు' అని చైతన్యం సమాధానం చెప్తుతాడు) (రేణుతో) పాపం! పెద్ద వాడు, అతణ్ణి శ్రమపెట్టటమెందుకు? నీవు ఫిమేలు వార్డులో బల్లమీద నిద్రపో –

**రేణు :** మరి మీరో?

**చైతన్యం :** నేను పడకకుర్చీలో పడుకొని ఏదో ఆలోచిస్తాను.

**రేణు :** అయితే ఇది కప్పుకోండి (చీరె యిస్తుంది)

(జయవైపు చూస్తే జ్ఞప్తికి వచ్చినట్లు నటించి)

పక్కగ్రామంలో అమ్మవారు విపరీతంగా ఉందిట!

**చైతన్యం :** అవును. ఇందాకనే ఆ వూరి పెద్దమనుష్యులు వైద్య సహాయాన్ని అడిగిపోవటానికి వచ్చి వెళ్ళారు.

**రేణు :** జయ అక్కడికి వెళ్లి సేవ చెయ్యాలని చాలా ఉత్సాహపడుతున్నది.

**చైతన్యం :** రేపు నేను ఈ గ్రామం ఒదలిపెట్టి రావటానికి వీలులేదు. మీకు సహాయంగా రంగణ్ణీ ముసలయ్యనూ తీసుకోవెళ్ళవచ్చు.

**రేణు :** చాలు.

**చైతన్యం :** మరి మందు?

**రేణు :** జయ ముందే కొంత కొని జాగ్రత్త పెట్టింది.

**చైతన్యం :** ధనికవర్గంలో ఇటువంటి ఉదార హృదయాలు మరికొన్ని ఉంటే దేశం ఎంతో బాగుపడుతుంది. అనేకమంది ఉన్నారు. అవకాశాలు లేవు, సేవ చేయటానికి.

**రేణు :** ప్రొద్దుపోయింది. మీరు కూడా ఇంకా మేలుకోటమెందుకు?

**చైతన్యం :** జీవరత్నం కేసు కొంత సీరియస్ ఐంది. కొద్దిగా ఆలోచించాలి.

**రేణు :** అంతేనా? – దాచిపెట్టటం లేదుగదా?

**చైతన్యం :** నీదగ్గిర దాపరికమెందుకు? దేన్నిగురించి నేనాలోచిస్తానంటావు?

**రేణు :** భుజంగంగారు మనమీద బనాయించిన కేసులను గురించి ఆలోచిస్తారను కొంటాను. రేపు మీ యిల్లు వేలం అని విన్నాను. ఆయనే పుచ్చుకొని అందులో భుజంగంగారు తోళ్ళషాపు పెట్టిస్తారట!

**చైతన్యం :** (నవ్వుతూ) ఆ ఇల్లు ఏమైతేనేం? అతనికి వ్రాసి యిచ్చిననాడే పోయిందని నిశ్చయించుకున్నాను. ఇక దాన్లో తోళ్ళషాపు పెడితేనేం, మరొకటి చేస్తేనేం? ప్రొద్దుపోయింది. నీవు కూడా నిద్రపో.

**రేణు :** (నిష్క్రమిస్తుంది)

(చైతన్యం లోపలికి వెళ్ళివస్తాడు – ముసలయ్య వచ్చి అవీ ఇవీ సర్ది వెళ్ళిపోతాడు. చైతన్యం కుర్చీలో ముసుగు పెట్టుకొని ఆలోచిస్తుంటాడు. తగ్గించిన దీపం, మరొకవైపునుంచి భుజంగం ప్రవేశించి చైతన్యాన్ని గుర్తుపట్టినట్లు నటించి)

**భుజంగం :** చైతన్యం! రాస్కెల్! (పిస్టల్ మోగించిన ధ్వని) అహ్హహ.... (పెద్దనవ్వు)... లే.,.... ఏడు! – నాకా నీవు శత్రువువు.

**జయ :** నాకు శక్తిచాలదు. (ముసుగు తొలిగించి) అబ్బా! అబ్బా! (కేక)

**చైతన్యం :** జయా! జయా!... భుజంగం?

**జయ :** నాన్నా! బాధ!

**చైతన్యం :** (పిస్టల్ జారవిడిచి) అమ్మా!

**జయ :** బాధ!... రేణూ! (కళ్ళుమూస్తుంది)

**భుజంగం :** చైతన్యం ... అహ్హహ్హ చైతన్యం నిన్ను చంపేశాను. మనస్సుకు సంతోషం... జయం... అహ్హహ్హ

**(పోలీసు సిబ్బందిని బుడే తీసుకోవస్తాడు)**

**జయ :** (రేణు ప్రవేశించిన తరువాత) నా సమస్తమూ మీది. నా పెట్టెలో ఒక విల్ ఉంది. చూడు. (ముందు డాక్టరు చేసిన శ్రమవల్ల వచ్చిన సత్తువతో) చైతన్యంగారూ రేణూ! మీరు వివాహం చేసుకోండి. నన్ను జ్ఞప్తి ఉంచుకోండి. నమస్తే... నన్ను దీవించం....డి.... (ఇద్దరి చేతులూ కలుపుతుంది)

**బుడే :** (పోలీసులతో) షూస్త్రారేంసాబ్ పట్టుకోండి. యహీ షైతాన్ –

(పోలీసులు భుజంగాన్ని తీసుకొనివెళ్ళిపోతారు)

**ముసలయ్య :** (పూజకు తెచ్చిన పూలు తెచ్చి ఆమెమీద చల్లి దణ్ణం పెడతాడు)

**రేణు :** చైతన్యం, పూలు చల్లటంలో తరువాత అనుసరిస్తారు)

**చైతన్యం :** ఓ దేశసేవికా!

ఓ మహాసేవికా!!

**రేణుతో కలిసి :** ఓ దేశ సేవికా! ఓ మహాసేవికా!!

**చైతన్యం :**

> **నీ ఆర్తి నిత్యమై**
> **నీ కీర్తి సత్యమై**
> **కలకాలమోదేవి**
> **వెలిగెదవు – తారవై –** **ఓ దేశ సేవికా!**

**రేణు :**

> **కనువిప్పు నీ చరిత**
> **కమనీయ మధుమూర్తి**
> **చైతన్యమౌ లోక**
> **చరితలో నోజయా!**

**ఇద్దరూ :** ఓ దేశసేవికా! ఓ మహాసేవికా!!

**చైతన్యం :** జయా! నీవల్ల జయం కలిగింది. కానీ నీవు లేక పోయినావు. నవచైతన్యం కోసం నీవు బలిపీఠమెక్కిన వీరవనితవు. నమస్తే!

**(అందరూ నిష్క్రమిస్తారు)**

**(తెర)**

# ఏకాంకికలు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | నాచీ | 305 |
| 2. | ఉత్పల | 318 |
| 3. | ఏ.క.తా.ర | 329 |
| 4. | సాక్షాత్కారము (దృశ్యనాటిక) | 343 |
| 5. | కజ్జల | 375 |
| 6. | చంద్రవదన | 413 |
| 7. | రాజ్య రక్ష | 428 |
| 8. | ఉడతా భక్తి | 439 |
| 9. | చివరి రోజులు | 448 |
| 10. | శివాజీ అఫ్జల్ ఖాన్ | 455 |
| 11. | నాలుగు దారులు | 465 |
| 12. | కేశరక్ష సంప్రదాయాలు | 480 |
| 13. | మధుర ప్రియ | 502 |

# నాచీ

### (జనశృతి సమాహృతే ఆధారం - ఆచారాలు ఆనాటివే - దేశం త్రిలింగం - కాలము 15వ శతాబ్ది)

**(జ్యోతిర్విద్గృహ ప్రాంగణము - దైవజ్ఞుడు ఏలేశ్వరుడు)**

**దైవజ్ఞుడు :** ఉపాధ్యాయా! ఈ విషయంలో దైవజ్ఞులకు ఏ విధమైన అభిప్రాయ భేదం లేదు. అంతా ఫల నిర్ణయంలో ఏకీభవించారు. ఈ హోరా శాస్త్రాన్ని బట్టి కించిత్తయినా మనకు అనుకూలించేటట్లు లేదు. స్త్రీ జాతకంలో ప్రత్యేకానుభవం వున్న మైథిలి శంభునాథుడు కూడా అదే ఫలం చెప్పాడు. ఇంకా ఏ ఇతరమైనా అనుకోవచ్చు. కానీ - మాంగల్య స్థానంలో శని. అంతే కాకుండా పాపాధిపత్యంతో పాపార్గళ పట్టిన శుభదృష్టి (ఖిన్నముఖము).... సర్వజ్ఞులు తమ రెరుగని దేమున్నది? కన్యకు వివాహాన్ని కట్టిపెట్టి శివాజీవిగా ఉంచితే బాగుంటుందేమోనని నా...

**ఏలేశ్వరుడు :** స్వామీ! అంతేనా?... అన్యోపాయం లేదంటారా? (గద్గదస్వరము) భాగ్య కోశాధిపత్యము నుండి పంచమకోణస్థితి వున్న గురుదృష్టి అష్టమాని కున్నదిగా?.... మరి చాలదూ?...

**దైవజ్ఞుడు :** ఏమిలాభం  ఆ గురుడు అస్తంగతుడైనాడు.

**ఏలేశ్వరుడు :** (దుఃఖము) నా ఆశలడుగంటాయి. నా పాపం పండింది.... నలుగురిలో నగుబాట్లు కావలసివచ్చింది. నా బ్రతుకు... జైముని ఆస్థాన పురోహితుణ్ణి ఆవహించాయి పంచ మహా పాతకాలు. కన్యాత్వం వచ్చిన కన్యకు వివాహం చేద్దామా అంటే ఒకవైపు శాస్త్రరీత్యా వైధవ్యం కనిపిస్తుంటే ఎలా చేస్తాను. చేతులెట్లా ఆడుతాయి. చేయకుండా ఉందామా అంటే శాస్త్ర విరుద్ధంగా వెలి... (తేర్చుకొని... చింతామగ్నత).... వివాహం జరిగి తీరవలసినదే. స్వామీ! మార్గేతరం ఏమీ లేదు కదూ?

**దైవజ్ఞుడు :** (ముఖదైన్యం) ఉపాధ్యాయా! కాని ఇటువంటి సందర్భంలో ముందుగా లోహ ప్రతిమకిచ్చి వివాహం శాస్త్రోక్తంగా చేసి ఆ ప్రతిమను నాశనం చేసి తరువాత

వరుని కిచ్చి కల్యాణం చేస్తే దోష పరిష్కార మౌతుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. పూర్వం అది ఆచారంగా కూడా ఉన్నట్లు జనశృతి.

**ఏలేశ్వరుడు :** అది పునర్భూవివాహం కాదా? స్వామీ! శుద్ధ శ్రోత్రియ వంశంలో పుట్టిన నేను అట్టి ప్రతిమా వివాహానంతర పునఃకల్యాణము చేస్తే ఏలేశ్వరుడు పునర్భూ వివాహానికి అంగీకరించడు  తన కూతురికి చేసిన పెళ్ళి పునర్భూవివాహం క్రిందికే వస్తుంది. ప్రతిమ కేవల ప్రత్యామ్నాయం అని తాము గూడా పునర్భూ వివాహాలు చేస్తే ఆ మతధ్వంసక పాతకం నన్ను చుట్టుకుంటుంది. అపకీర్తి! వద్దు! వద్దు! భావికుల ధ్వంసానికి మార్గదర్శకుణ్ణి కమ్మంటారా? శివ! శివ! శివ శివా.... జన్మ జన్మాలకూ వద్దు!

**(తలమీద చేతులు పెట్టుకొని కూర్చుంటాడు)**

**దైవజ్ఞుడు :** స్వస్థ చిత్తులై తామింకా ఈ విషయాన్ని గురించి ఆలోచించాలి. సర్వజ్ఞులు తక్కిన శాస్త్రా లేమంటున్నాయో తరచండి... మీరేది నిర్ణయించుకున్నా నా సాయ శక్తులా కార్యసానుకూలానికి ప్రయత్నిస్తాను. ఇంకా... (ఎవరో వచ్చే వానిని చూచి ఆగుతాడు)

**ఆనీకస్తుడు :** (వంగి ఇరువురకు నమస్కరించి) శ్రీ శ్రీ జైముని మహారాజులుంగారు తమ ఆస్థాన దైవజ్ఞయ్యను యుద్ధముహూర్త నిశ్చయం చేయటానికి కొని రావలసినదని అగత్యాన్ని బట్టి తమ ఆనీకస్తుని ఆజ్ఞాపించారు.

**దైవజ్ఞుడు :** (ఆనీకస్తునితో) బోయీలను ఆందోళిక సిద్ధపరుపమను. వారు ప్రక్క అరుగు మీద ఉంటారు... (ఏలేశ్వరునితో) చింతా మగ్నులైన లాభమేమి? కానున్న దానికి కర్తలెవరు?.... "శ్రీరవయేనమః"

**(ప్రవేశము బోయీలు – అందలముతో వచ్చి నమస్కరిస్తారు)**

**బోయీ :** స్వామీ! సిద్ధము.

**దైవజ్ఞుడు :** (ఏలేశ్వరునితో) ఉపాధ్యాయా! రాజాజ్ఞ తడవుండరాదు. అనుజ్ఞ? పోయి వచ్చెదను.

**(అని ఆందోళికా ఆసీనుడై పోతాడు)**

**ఏలేశ్వరుడు :** (దైవజ్ఞుని చావడిలోనే వుండి) పునర్భూవివాహాన్ని లోకంలో ప్రచారం చేయటంగాని, కన్యా వైధవ్యం చూడటం గాని తప్ప మార్గేతరం లేదుగామాలి. ... కష్టకాలం వచ్చింది... విధికృతం బలీయం... (కొంచెంసేపు ఆలోచించి) ఇంకా అన్ని శాస్త్రాలు పరిశీలిస్తే... పరిశీలించి నా మట్టుకు ఒక శాస్త్రం ఇలా చెపుతుంటే మనసు కెక్కడి శాంతి. (కొంత సేపాగి) శాస్త్ర పరిశీలనం ఇంకా యెందుకు, శాస్త్రాలలో వున్న ప్రతిముక్క మీద నాకు వెర్రి నమ్మకం ఎందుకు?.... అయినా చూస్తాను... ఎలా వస్తుందో వైధవ్యం... తారాబల, చంద్రబలాలన్నీ విచారించి, నిధుల చేత సుముహూర్తం నిశ్చయం చేయిస్తాను. కావలసి వచ్చునంటే నేనే నవగ్రహజపం చేస్తాను. ఇంకా వూరుకుంటే నాచీకి ఎనిమిదేళ్లూ దాటుతాయి. తరువాత వచ్చే అపవాదానికి అనుకుంటే లాభం వుండదు. మానవుడు పూర్వం చేసినదానికి ఇప్పుడు ప్రతిగా చేస్తే విధి మాత్రం ఏం చేస్తుంది.

(అని లేచి నెమ్మదిగా ఇంటి మార్గం పట్టుతూ వుంటాడు) రాజవీథిని శైవ భిక్షకుడు ఒకడు,

**జంగమయ్యా! గరుడ**<br>
**జంగమయ్యా! శివ!**<br>
**దేహధారణ నున్న**<br>
**దివ్య లింగమయా!**<br>
**నిఖిల లోకాధీశ**<br>
**నిర్మల జోతిస్సు**<br>
**నింగిలో వెలిగేను**<br>
**నేలపై వెలిగేను** **జంగమయా**

**కలుష బుద్ధీ! నీవు**<br>
**కనుమూయ జూడకో**<br>
**అంతరంగిక యత్న**<br>
**మాజ్యోతి కనలేదె?** **జంగమయా**

అని పాడే భిక్షుక గీతం వినీ విననట్లుగా పోతాడు

**(తెర)**

(ఏలేశ్వరుడు – కృష్ణపంతు – 'భాగీరథీ' స్నానం చేసి నెత్తిమీద నీళ్ళ కడవలు పెట్టుకొని వస్తుంటారు.) ఏలేశ్వరుడు,

**అక్షయ! త్రిభువనాధ్యక్ష! సర్వజ్ఞ!**
**దేవ! మహాదేవ! దేవతారాధ్య!**
**భావజ సంహార! భక్తమందార!**
**భక్తవత్సల! ఈశ! భర్గ! దేవేశ!**
**భక్త జనాధార! భవ్య సాకార!**

అనే శివస్తుతి చేస్తూ రాజవీథిలో నడుస్తూ వుంటాడు. కృష్ణపంతు, నాచీ తోడి బాలికలతో ప్రాతఃకాలం ఆడు కుంటుంటే ఇంటికి దగ్గిరగా వున్న శివాలయంలో చూచి)

**కృష్ణపంతు :** మహాత్మా! ఆ ఆటలో తన్మయత్వం చూచారూ? రూపం తాల్చి చిరు చెమట ముఖం మీద నాట్యం చేస్తూ ఉన్నది. ముంగురులు పవిత్ర గోదావరీ మృత్తిక శ్రమ వారితో కలిస్తే లేపనం వల్ల అతుక్కుపోయాయి. (కొంతదూరం నడచి) అదుగో! ఇంటిదారి పడుతూ ఉన్నది. ఆటగొల్లు వచ్చినట్లున్నది. అందులో అమ్మాయికి ఆవంత కూడా ఆనందం కనిపించకపోవటం అనేకమార్లు చూచాను. బిక్కమొగంలో దుఃఖమూర్తి ఆవేదన పడుతూ వుంటుంది. లోక ప్రవృత్తి కించిత్తేని తెలుసుకోలేని ఆ పసితనంలో...

(ఇంతవరకూ తలవంచుకొని చెప్పుతూ వున్న మాటలు గురువుగారి ముఖం చూస్తూ చెప్పబోతాడు. ఆయన ముఖంలో స్నిగ్ధత, కనుకొనలలో దాగులాడే దుఃఖాశ్రు కణాలు చూచి)

ముఖం వివర్ణమైన దేమి? ఆ అశ్రుకణాలకు కారణం ఏమి?

**ఏలేశ్వరుడు :** తండ్రీ! ఏమీ లేదు. అమ్మాయి ఆటలో మైమరుపునకు హృదయం కరిగి ఆనందాశ్రువులు కనుకొలకులనావరించాయి. అంతే.

**కృష్ణపంతు :** లేదు, లేదు మహాత్మా! ఏదో కలిగిన బాధను కప్పి పుచ్చుతూ ఉన్నారు. చెప్పరాని దైనందునా?

**ఏలేశ్వరుడు :** నీకు చెప్పరాని దేమున్నది తండ్రీ!... చెప్పేటందుకు ఏమీ లేదు కూడాను. నాకు 'జైముని' రాజాస్థాన పౌరోహిత్యము లేనప్పుడు నా ఏకైక పుత్రిని పెంచటానికి దంపతులము పడ్డ అవస్థలన్నీ అప్రయత్నంగా కళ్ళకు కట్టాయి. అందువల్లనే ముఖం వివర్ణమైంది.

**కృష్ణపంతు :** మహాత్మా! (అమ్మాయిని చూపించి) పురాదుర్దశ జ్ఞప్తికి తెచ్చినందుకు క్షమించాలి.

**ఏలేశ్వరుడు :** వెర్రి తండ్రీ! నీ తప్పేమున్నది క్షమించటానికి? కన్నతల్లి నా కళ్ళముందుంటే నీ కన్న నాకే ముందు కన్పించింది. నీవు చూడలేదు గాని నీవు చెప్పకముందే ఆ యశ్రువులు వచ్చాయి. నీ మనస్సు ఇంత లేత దేమి నాయనా! (కొంత సేపాగి నడుస్తూనే) ఇంతవరకూ నీకు నేనెప్పుడూ చెప్పని సంగతి ఒకటి చెప్పాలనుకున్నాను. ఆ విషయంలో నీ సలహా కావలసి వచ్చింది.

**కృష్ణపంతు :** నేనా... సలహా ఆఁ! స్వామీ! ఏమి ఈ విపరీత వాంఛ. కానీ మీ ఆజ్ఞ ఉల్లంఘింపను. ఏదో కించిత్తుగా నా చిఱుత బుద్ధికి తోచినట్లుగా...

**ఏలేశ్వరుడు :** ఏమీ లేదు, నాచీ వివాహ విషయం

**కృష్ణపంతు :** అర్భకుణ్ణి నేనా జీవిత సమస్యల్లో సలహా యిచ్చేది?

**ఏలేశ్వరుడు :** సమస్య ఏముంది? వరుని విషయమే... ఎటువంటి వాని కివ్వమంటావు?

**కృష్ణపంతు :** దానికి ఆలోచన ఏమున్నది? తమ గౌరవ సంప్రదాయాలకు అనుకూలునికి – సాంగంగా వేదాధ్యయనం చేసినవానికి – మీరు ప్రత్యేకంగా ఆదరించే సాహిత్య ప్రియునికి – రూపవంతుడైన యుక్త వయస్కునికి – అంతకన్నా అనుభవజ్ఞులు మహాత్ములకు నే చెప్పేదేముంది?

**ఏలేశ్వరుడు :** నా శిష్యకోటిలో నేను నిన్నే ప్రేమించాను. సకల విద్యావిదుణ్ణి చేశాను.

**కృష్ణపంతు :** సర్వదా కృతజ్ఞుడను.

**ఏలేశ్వరుడు :** ఆచారవంతుడివి బాగాను.

**కృష్ణపంతు :** తమ శిష్యులకు కించిదాచారమా!

**ఏలేశ్వరుడు :** యశః సంప్రదాయాలకు రెంటికీ సరిపోయావు. యుక్తవయస్కుడవు. నీకంటేనా ఇంత పాండిత్యముతో! రూపంలో వంకేమిటి?

**(అభిప్రాయంకోసం కొంతసేపు ఆగుతాడు)**

**కృష్ణపంతు :** (తలవంచుకొని సమాధానమీయడు)

**ఏలేశ్వరుడు :** మీ మాతా పితరులకు అభియోగం పంపిస్తాను. కృతార్థుని చేయమంటాను.

**కృష్ణపంతు :** (మాటాడడు. తన ముఖంలో చిందులాడే సిగ్గు - ఆనందం - కనిపించకుండా చేతులో వున్న కమండలం చెంపకు ఆనిస్తాడు. పులకాంకురాలవల్ల గురువుగారు కనిపెడతారు అంతాను... మాట్లాడకుండా వీథిలో కొంత దూరం నడిచాక ఏలేశ్వరోపాధ్యాయుని గృహము వస్తుంది. ఇద్దరూ నీళ్ళ బిందెలతో ఇంట్లోకి పోతారు.)

**(తెర)**

(నాచీ తండ్రికి అగ్ని కార్యానికి కావలసిన ఉపకరణాలు అమరుస్తూ వుంటుంది. కృష్ణపంతు ముంగిట్లో అరుగుమీద కూర్చుంటాడు)

**తల్లి :** (ఇంట్లోనుంచి) అమ్మాయీ! కృష్ణపంతుకు సంధ్యా వందనానికి పంచ పాత్ర ఉద్ధరణ యివ్వమ్మా బయట వున్నాడు.

**నాచీ :** ఇస్తున్నానమ్మా ముందు నాన్నగారికి ఇచ్చి.

**ఏలేశ్వరుడు :** (నవ్వుతూ) ఇంకా సిగ్గు బిడియం నేర్పకుండా అతనికి కావలసినవన్నీ తీసుకుపోయి యివ్వమంటావు. పెళ్ళి అయిన తర్వాత ఇస్తుందిలే!

**తల్లి :** ఏమంటారు?... నిశ్చయించుకున్నారా ఏమిటి?

**ఏలేశ్వరుడు :** (సగర్వంగా) అవును.

**తల్లి :** సంతోషము.

**నాచీ :** (తలవంచుకొని స్తంభం ఆనుకొని నిలవబడుతుంది)

**కృష్ణపంతు :** (మనస్సులో) అడగకుండానే తండ్రిగారికి అన్నీ అమరుస్తూ ఉన్నది. నాకు కూడా ముందు అట్లాగే అమరిస్తే నేనెంతగానో ఆనందిస్తాను. హవిస్సులు పరమ పవిత్రాలౌతాయి. అమరాగ్ని హోత్రులు ఆనందిస్తారు. నాకు మాత్రం అంతకంటే కావలసిన దేముంది? కల్యాణి యింట్లో అన్ని పనులూ చక్క బెడుతూ ఉంటే అమ్మా నాన్నా పొంగిపోతారు. నే చేసుకున్న పురాపుణ్యం వల్ల గురువుగారు అనుగ్రహించారు...

**నాచీ :** (తండ్రి జపం చేసుకోవటం తల్లి గోదావరికి మంచినీళ్ళకు పోవటం చూచి దొడ్డి తలుపు వేసి బయట ముంగిట్లో వున్న పంతు దగ్గిరకు వచ్చి నిలుచుంటుంది)

**కృష్ణపంతు :** (మాట్లాడించడు)

**నాచీ :** (సిగ్గాపుకొని) పంతూ! నీ కేమన్నా కావాలా యేమిటి? రోజుటి మాదిరిగా పిలిచి అడగటం లేదు.

**కృష్ణపంతు :** రోజూ ఏమని పిలిచేవాణ్ణి.

**నాచీ :** చెల్లీ! అని. రాత్రి నాన్నగారు నీకు 'గీత గోవిందం' పాఠం చెపుతూ వుంటే నేనే రాధికనై పోయి గేయం వ్రాశాను.

**కృష్ణపంతు :** చెల్లీ! ఏదీ ఆ గేయం.

**నాచీ :** నేను రాధికనై పోయానంటే! కృష్ణ! నీవు చెల్లీ అంటే మనసెలా వుంటుంది? చదవమంటావా?

**కృష్ణపంతు :** చదువు.

**నాచీ :** (గొంతుక సవరించుకొని)

**నా వలపు పూవీథి**
**నవనళినివై నీవు**
**నటనాలు సల్పరా**
**నందగోపాలకా!**
**మెరుగు తీగలు పూయు**
**మిసిమి పూదామమును**
**అంతరాంతరములో**
**అంబు ముత్యములతో**
**కూర్చి నీ మెడవేసి**
**కులుకుచున్ బాడెదన్** **॥నా వలపు॥**

**(అని చక్రభ్రమణము)**

**కృష్ణపంతు :** (సంతోషం లేనట్లు నటిస్తాడు నాచీ చూస్తే)

**నాచీ :** నీకిష్టం లేనట్లుంది, ఆపివేయమంటావా?

**కృష్ణపంతు :** (మాట్లాడడు)

**నాచీ :** (ధైర్యంగా) ముందేదో నీకూ నాకూ బాంధవ్యం కలపాలని అమ్మా నాన్నా నిన్ననే అనుకుంటే విన్నాను. నీకు కూడా తెలిసిందిగామాలి. అందుకోసమనా ఏమిటి మాట్లాడటం లేదు?

**కృష్ణపంతు :** (చిరునవ్వు) మాట్లాడటానికేముంది?

**నాచీ :** నీకు చెప్పారా మరి నాన్నగారు?

**కృష్ణపంతు :** (తెలియనట్లు నటిస్తూ) దేని విషయం? ఏమిటి?

**నాచీ :** ఏమీ ఎరగవు గామాలి. అబ్బో! తెలియనట్లు నాచేత చెప్పించాలనే ఆ అభిలాషెందుకూ?

**కృష్ణపంతు :** నిజంగా నాకేమీ తెలియదు. నీవు మాట్లాడేది నాకేమీ అర్థం కావటం లేదు.

**నాచీ :** నిజంగా తెలియదు?

**కృష్ణపంతు :** తెలిస్తే నీ దగ్గిర దాచి పెడతానా?

**నాచీ :** ఏమీ నామీద నీకంత?

**కృష్ణపంతు :** ప్రేమ!

**నాచీ :** మరి నీ చదువై వెళ్ళిపోతున్నావుగా నీవు! అప్పుడు నీవెక్క డుంటావో? నేనెక్కడుంటానో ఎలా ప్రేమిస్తావు నన్ను?

**కృష్ణపంతు :** నీవున్న వూరికే వచ్చిపోతుంటాను. నిన్ను తరుచుగా కలుసు కుంటాను. ఆవిధంగానే నా ప్రేమ వెల్లడించుకుంటాను (కాసేపాగి) నాచీ! చెప్పవు నాన్నగారు నీతో చెప్పలేదా అన్న సంగతి?

**నాచీ :** నీకు తెలియక పోతుందా. నాచేత చెప్పించాలని గాని.

**కృష్ణపంతు :** మళ్ళీ అదేమాట. పోనియ్యిలే చెప్పక పోతే మానె.

**నాచీ :** నీతో చెప్పకుండా ఎలా ఉంటాను? ముందు నీవెలావుంటావో అని చూచాను?

(చెప్పబోతుంది – మరింత సిగ్గు నెమ్మదిగా) నీకు... నన్నిచ్చి...

**(ఇంతలో దొడ్డివాకలి చప్పుడు)**

అమ్మ వచ్చింది. తలుపు తీయాలి. మళ్ళా వస్తా.

**(అంటూ లోపలికి పోయింది)**

**(తెర)**

(కళ్యాణపంతు, ఏలేశ్వరుడు ఇంటి చావట్లో కూర్చుంటారు వాళ్ళ ఇద్దరి భార్యలు లోపల గుమ్మంలో కూర్చుంటారు)

**ఏలేశ్వరుడు :** బావగారూ! ఇవాళ ఇంకో గణకుని దగ్గరనుంచి వివాహ మహోత్సవ పత్రిక వచ్చింది. సర్వవిధాలా రేపటి ముహూర్తమే మంచిదన్నారు. మనం పాణిగ్రహణ మహోత్సవ ప్రయత్నాలల్లో ఉండాలి. మీ ప్రయత్నాలల్లో మీరు ఉండండి.

**కళ్యాణపంతు :** అన్నిటికీ మీరే వున్నారు.

**కల్యాణపంతు భార్య:** పెళ్ళికొడుకు వారికి ఆడపనికి వొదినగారే వున్నారు.

**ఏలేశ్వరుడు భార్య :** మహానందము

**ఏలేశ్వరుడు :** ఊళ్ళో పెద్దలందరికీ రాత్రే చెప్పాను. రాజుగారికి అంతకు పూర్వమే విన్నవించాను. నజరానా డంకా, బాకాలు పంపిస్తానన్నారు. మహారాణిగారు స్వయంగా వచ్చి వధూవరులకు కట్నాలు చదివిస్తుందట.

**కళ్యాణపంతు :** శుభముహూర్త నిర్ణయానికి ఘటికాయంత్రం సంగతేమి ఆలోచించారు?

**ఏలేశ్వరుడు :** బోయీలు కులాలుణ్ణి పిలుచుకోవచ్చి యంత్రనిర్మాణం చేయిస్తామన్నారు.

**కళ్యాణపంతు :** యాజ్ఞీకుడో మరి?

**ఏలేశ్వరుడు :** అమ్మాయి పుట్టినప్పటినుంచీ రేవణశర్మ వివాహానికి యాజ్ఞీకం నాదంటు న్నాడు. అతడే చేయిస్తాడు. (కాసేపాగి) సమిధలకు నిన్ననే చెప్పి పంపించాను. వచ్చాయటగానీ చెట్టెక్కినవాడు కాలు విరిగిపడ్డాడట పాపం.

**కళ్యాణపంతు :** ఎవరో వస్తున్నారు.

**ఏలేశ్వరుడు :** మా బావమరది. మీ కోడలు మేనమామ. పంపిన మనిషి వెంటవుండి తీసుకో వస్తున్నాడు.

**బావమరది :** (కాళ్లు కడుక్కోని) బావగారికి బాబుగారికి నమస్కారం. చాలా సంతోషం ఐంది. అమ్మాయికి మంచి సంబంధం నిశ్చ యించారు.

**ఏలేశ్వరుడు :** నాయనా శర్మ! ఇంట్లోకి కావలసిన వన్నీ అమర్చవోయి. బావగారూ నేనూ ఇప్పుడే వస్తాము (అంటూ లేచిపోబోతుంటే)

**కులాలుడు :** (వచ్చి నమస్కారం చేసి) చెప్పారండి బాబు చెయ్యాల్సిన పని. అదెంతసేపు. రేపు ప్రొద్దున్నే చేసినా చెయ్యవచ్చు. అనుగ్రహం ఉంచాలి.

**(అని ప్రక్కకు తొలిగి నిలవబడతాడు)**

**ఏలేశ్వరుడు :** సరేలే. బావగారు! మనము వెళ్ళి వద్దాం ఆ పనికి.

**(ఏలేశ్వరుడు, కృష్ణపంతు నిష్క్రమణ)**

**(తెర)**

**(ఆడపిల్ల వారింట్లో)**

(తెల్లవారింది. పెళ్ళి పందిట్లో ముగ్గులు వేసి వుంచారు. ఏలేశ్వరుడు జపం చేస్తూ అరుగుమీద కూర్చున్నాడు. రేవణశర్మ మాంగల్యానికి పసుపు పట్టిస్తూ వివాహానికి కావలసిన వస్తువులు పందిట్లోకి తెచ్చుకుంటాడు)

**రేవణశర్మ :** (కులాలుని చూచి) అరే! యంత్రం నిర్మించావా?

**కులాలుడు :** (నీటి తొట్టిలో ఒక క్రొత్త కుండకు సున్నం వ్రాసి దాని అడుగున బెజ్జము చేసి నీరు నెమ్మదిగా కుంభంలోనికి వచ్చి అనుకున్న కాలానికి కుండ మునిగిపోయేటట్లుగా పూర్వం నిర్మించిన యంత్రాన్ని చూపిస్తూ) అదిగో! చాలాసేపైంది బాబూ నిర్మించి. కానీ ఎన్నో కుండలు వృధాగా పగిలి పోయాయి. (చివర మాట పని తొందరలో రేవణశర్మ వినిపించుకోడు)

**రేవణశర్మ :** (ఎటో చూస్తూ) ఐదున్నర ఘడియలకు నిండేటట్లుగా చేశావా?

**కులాలుడు :** అవును స్వామీ!

**రేవణ శర్మ :** (ఇంట్లోకి హడావిడిగా పోయి) అమ్మాయికి మంగళస్నానం చేయించారా? కానియ్యండి త్వరగా. (బయటకు వచ్చి భజంత్రీలతో) కానియ్యండిరా మంగళవాద్యం, ఉఁ! అనండి.

**(ధ్వనిగా మంగళవాద్యాలు)**

(ఏలేశ్వరునితో) బాబూ! లేవండి మధుపర్కాలు తీసికొని రాండి, పోదాం వరపూజ కోసం (ఏలేశ్వరుని భార్య పందిట్లోకి వస్తే) అమ్మా! పసుపు, కుంకుమ, గంధం, అగరు వత్తులూ మరచిపోవద్దు. తొందర చెయ్యండి. (ఎందుకో రేవణ శర్మ చేతిలో మంగళసూత్రం క్రింద పడుతుంది)

**ఏలేశ్వరుడు :** (చూచి) అమంగళం

**(అంతా వరపూజకు పోతారు)**

**నాచీ :** (యంత్రం చూడటానికి పోతుంది. ఆమెకు తెలియకుండానే మురిడీలో ముత్యం ఒకటి జారి యంత్ర కుంభంలో పడి నీరు నెమ్మదిగా వస్తూ వుంటుంది. కాలవ్యవధి గమనించరు. ఆ మంగళవాద్య ధ్వని, ఆదుర్దాలలో)

**రేవణశర్మ :** (వరుణ్ణి పెళ్ళి పందిట్లోకి తీసుకొని వచ్చి కూర్చోపెట్టి మహాసంకల్పం మొదలెట్టుతాడు. ఏలేశ్వరుడు యంత్రం మీదనే కళ్ళు పెట్టుకొని సుముహూర్తానికోసం వేచి వున్నాడు. కానీ అందులో ముత్యం అడ్డుకొని నీళ్లు రాకుండా చేస్తూ వున్నదన్న విషయం తెలుసుకోలేకపోయాడు)

యంత్ర పరిపూర్తికి ఎంతకాలం పడుతుంది?

**ఏలేశ్వరుడు :** బహుశః ఒక ఘడియకాలం.

**రేవణ శర్మ :** ఇంకా ఇక్కడ కొంత ఆలస్యం వుంది. సరిగా సుముహూర్తా నికే మాంగల్యం కట్టిస్తాను.

(కృష్ణపంతుతో) నాయనా "స్వాహా" అన్నప్పుడు ఇంధనం వ్రేల్చు... నీకు తెలిసిందే గదా!

**(మంగళ వాద్యాలు)**

**రేవణ శర్మ :** అయ్యా! ఇంకా ఎంతాలస్యం ఉంటుంది?

**ఏలేశ్వరుడు :** అరఘడియ కాలం.

**రేవణశర్మ :** అయితే వధువును తీసుకొని రండి గంపలో (నాచీని గంపలో తెచ్చి మధ్య తెర అడ్డం వుంచుతారు) కొంతసేపు అయిన తరువాత బెల్లం జీలకర్ర అదిమి ఒకరి నెత్తిన యింకొకరి చేత పెట్టిస్తాడు.

అబ్బాయీ! కృష్ణపంతు! ఈ మాంగళ్యము పట్టుకొని నాచీ మెడలో కట్టు.

**(కృష్ణపంతు ఆవిధంగా చేస్తాడు)**

**ఏలేశ్వరుడు :** సుముహూర్తానికే వివాహం జరిగింది.

**కృష్ణపంతు :** (లేచి తల్లి దండ్రులకు అత్తమామలకు నమస్కారం చేసి వచ్చి పెళ్లి పీటలమీద కూర్చొని కొంతసేపుండి)

అబ్బా! అబ్బా! బాధ! అమ్మా! (అని కేక వేస్తాడు)

**(సభ నిశ్శబ్దం అవుతుంది)**

**కళ్యాణపంతు, భార్య :**నాయనా! ఏమిరా ఇది! చెప్పు నాయనా (అని దీనంగా అడుగుతారు)

**కృష్ణపంతు :** (మాట్లాడడు – క్రిందకు ఒరగబోతాడు)

**ఏలేశ్వరుడు, కల్యాణపంతు :** (ఇద్దరు వచ్చి పట్టుకుంటారు. ఇద్దరి భార్యలు కాళ్ళ దగ్గిర నిలవ బడతారు ఏడుస్తూ)

**రేవణ శర్మ :** నిశ్శబ్దంగా వుండండమ్మా. ఏడ్వకండి. ఏమీ లేదు. ఆలస్యం అవటం వల్ల శోషపోయాడు. కొంచెం పాలిప్పించండి.

**కృష్ణపంతు :** (లోపలినుంచీ వచ్చిన పాలు త్రాగి తెప్పరిల్లి) కాలం సమీపించింది... మాతా పితృ గురు ఋణాలు తీర్చుకోలేక పోయాను. ఇంకో జన్మలోనైనా ప్రయత్నం చేస్తాను. ఈ జన్మకు నా తుది నమస్కారాలు ఇవిగో (అని నమస్కరిస్తాడు. కళ్ళు త్రిప్పుతూ) నాచీ!... నిన్ను... నిన్ను... అన్యాయం చేస్తున్నాను... కానీ ప్రేమించాను... జ్ఞాపకం ఉంచుకో... శివాజీవివిగా...ఉంటే సంతోషిస్తుంది... నా ఆత్మ.... అని ఏలేశ్వర కళ్యాణపంతుల చేతులల్లో కట్టెలాగా ఐపోతాడు... పెళ్ళి పందిట్లో గగ్గోలుగా ఏడ్పు... వినలేక ఏలేశ్వరుడు బయటికి వస్తాడు. బయట... పూర్వం భిక్షుకగీతం పాడినవాడు మళ్ళా.

**జంగమయ్యా గురుడ!**
**జంగమయ్యా! శివ!**
**దేహధారణ నున్న**
**దివ్య లింగమయా!**

**పుణ్యము పాపము**
**పూచిన పూవుల**
**వాసన వదలదు**
**వదలదు జన్మల ॥జంగమయా॥**

**ముఖమున వ్రాసిన**
**ముందుగతిగా మాన్ప**
**తరమౌనె శివునకు**
**తా వ్రాసి యున్నను ॥జంగమయా॥**

**నిజప్రజ్ఞపై మనసు**
**నీకేలరా జీవ!**
**నీ పప్పు లుడకవుర ॥జంగమయా॥**

అనేగీతం పాడుకుంటా ఏడుస్తూ వున్న పెళ్ళి పందిట్లోకి వస్తాడు. ఏలేశ్వరుడు వాని తత్వానికి మనస్సులో నమస్క రిస్తాడు)

**(తెర)**

– నవ్య సాహిత్య పరిషత్తు, గుంటూరు

***(ఎ.సి. కాలేజ్, గుంటూరు 1939)***

# ఉత్పల

## (మగధ దేశంలో ఒక సంఘారామం. ప్రశాంత వాతావరణం)

**నందుడు :** (వీణ తంతులు 'టింగ్ టింగ్' మని సవరిస్తూ రాగాలాపన చేస్తుంటాడు)

**అమితావి :** తమ్ముడూ! ఈ దినం బుద్ధ పూజానంతరం ప్రత్యేకంగా ఉపాసికల కోసం 'ఖేమా భిక్కుని' కథ చెప్పి కొన్ని ధర్మ ప్రవచనాలు వ్యాఖ్యానం చెయ్యమని భదంతు సెలవిచ్చారు.

**నందుడు :** (వీణ తంతులు మ్రోగిస్తూ) అయితే కానివ్వనా.

**అమితావి :** అది... ఆ తీవలు సవరించటం కొంతసేపు ఆపలేవూ?

**నందుడు :** క్షమించు. నెమ్మదిగా శ్రుతి చేస్తానులే.

**అమితావి :** (నిశ్చలంగా జ్ఞప్తి చేసుకుంటూ)

**'నగామ ధమ్మో నో నిగమస్స ధమ్మో**
**నచాపియం ఏకకులస్స ధమ్మో**
**సబ్బలోకస్స సదేవ కస్స,**
**ఐసేవ ధమ్మో యదిదం అనిచ్ఛతాతి'**

**నందుడు :** (తంతులు మ్రోగించటం నెమ్మదిగా ప్రారంభించి పారవశ్యంలో క్రమక్రమంగా గొంతు కెత్తి ఆలాపన చేస్తాడు.

**అమితావి :** (కొద్ది కోపంతో) తమ్ముడూ!... నా పని అణుమాత్రం సాగటం లేదు. ఒక్కమాటు కొన్నైనా ప్రవచనాలు జ్ఞప్తి చేసుకుంటే గాని ప్రస్తుతానికి భిక్షాటనానికి వెళ్ళటం పడదు. అయినా! ఇప్పుడా పాత వీణ సవరించక పోతేనేం.

**నందుడు :** బుద్ధ పూజా సమయంలో నగరం నుంచి వచ్చిన ఆమె పాడటానికి అంగీకరించింది.

**అమితావి :** తమ్ముడూ! ఎవరామె? నేను చూడలేదే?

**నందుడు :** అన్నా! నీవు కేవలం పుస్తకాలల్లో పురుగువై పోతున్నావు – అతిథిగా వచ్చిన బుద్ధోపాసికను గురించి అంత శ్రద్ధ వహించావన్నమాట!

**అమితావి :** ఆమె ఇప్పుడు ఎక్కడ ఉంది?

**నందుడు :** అపర శైలం మీద ఉన్న అమితాభ దేవాలయాన్ని చూపించ టానికని ఆమెను ఆనంద భిక్షువు తీసుకోవెళ్ళాడు.

**అమితావి :** అలాగా! – ఆమె ఎలా ఉంది?

**నందుడు :** చాలా చక్కంది. బుద్ధ భగవానుని తపోభంగం చేయటానికి వచ్చిన మారకన్యలా ఉంది. మన ఆరామంలో ఉన్న పారావతాలతో ఇందాకటి నుంచీ ఆడుకొని ఆట నేర్పిందన్నా!

**అమితావి :** నేను పెంచే వాటితోనేనా!

**నందుడు :** అన్నా! ఆమె పాములను పెంచుతూ ఉందట!

**అమితావి :** పాములే! బాబో! – మతి పోలేదు గదా?

**నందుడు :** అయితే సంగీతం ఎలా పాడుతానంటుంది? అడగంగానే అంగీకరించింది.

**అమితావి :** అతిథులు ఎవరు వచ్చినా సంగీతం పాడుతారో లేదో ఆలోచిస్తావు తమ్ముడూ!

**నందుడు :** తప్పేముందన్నా – సంగీతం మీద అపేక్ష ఉంటే ప్రజ్ఞా పారమితుడి అపాంగ వీక్షణం ప్రసరించదా ఏం?

**అమితావి :** కళలంటే – అందులోనూ సంగీతమంటే – మన భిక్షుకులకు ఇంత ఆసక్తి మంచిది కాదు.

**నందుడు :** అయితే నాకు 'నిర్వాణం' పొందే యోగ్యత లేదనేనా?

**అమితావి :** నిష్ఠతో కొంతకాలం ప్రణిధాన చర్య నడిపితే

**నందుడు :** సంగీతంమీద ఆసక్తి తగ్గిపోవటానికే – ఉఁ – మరి పెంపుడు పక్షుల మీద అభిమానం పోగొట్టమని ఎన్నడైనా భగవానుణ్ణి అర్థించావా?

**అమితావి :** అది స్నిగ్ధమైన అహింసాచరణానికి సాధనం.

**నందుడు :** సృష్టి రహస్య విజ్ఞానానికి సంగీతం సర్వోత్తమమైన సాధనం

**అమితావి :** తమ్ముడూ! నీకేం తెలియదు.

**నందుడు :** అన్నా! నీకు అంతకంటే తెలియదు.

**అమితావి :** (ప్రశాంతంగా ధర్మ ప్రవచనం చదవటం ప్రారంభిస్తాడు) 'న గా వ ం ధమ్మో నో నిగమస్సధమ్మో

**నందుడు :** బాబో! ఈ రొద భరించలేను (వీణ తంతులు 'టింగ్ టింగ్' మనిపిస్తూ నెమ్మదిగా రాగాలాపన చేస్తూ వెళ్ళి పోతాడు)

**అమితావి :** అమ్మయ్య! 'నచా పియం ఏక కులస్యధమ్మో (ఒక నర్తకి నడుస్తూ వస్తున్న కాలిగజ్జెల చప్పుడు)

**ఉత్పల :** మీ ఏకాంతతకు భంగం కలిగిస్తున్నాను, క్షమించాలి.

**అమితావి :** అమ్మా! ఇది అతిథి గృహం. మీ సత్కారం కోసం భదంతుల వారు నన్ను ఇక్కడ ఉండమని ఆజ్ఞాపించారు. అదుగో ఆ వేదిక మీద కూర్చోండి – కొంచెం దాహం తెచ్చి ఇవ్వ మంటారా?

**ఉత్పల :** అవసరం లేదు. (వేదిక దగ్గిరకు నడిచి వెళ్ళిన కాలిగజ్జెల చప్పుడు)

**అమితావి :** అమితాభ దేవాలయానికి వెళ్ళి రావటంలో శ్రమ పడినట్లున్నారు?

**ఉత్పల :** అలవాటు లేక కొంచెం శ్రమ అనిపించింది. శ్రావకా! ఇంత నిర్జన ప్రదేశంలో ఏకాంతంగా ఉండటం మీకు కష్టమనిపించటంలేదూ?

**అమితావి :** అమ్మా బుద్ధ పూజలో కాలం గడిచిపోతుంది.

**ఉత్పల :** ఏదో చదువుకొంటున్నట్లున్నారు?

**అమితావి :** సాయంత్రం 'ఖేమా' భిక్కుని గాథ చెప్పవలసిందని అగ్రశ్రావకులు సెలవిచ్చారు, ఒకమాటు చూస్తున్నాను.

**ఉత్పల :** ఈ ఆరామంలో చిలుకలనూ, గోరువంకలనూ పెంచి ఆట నేర్పింది మీరే కదూ?

**అమితావి :** (సంతోషంతో) అవును నేనే.

**ఉత్పల :** పాటలి నుంచి ప్రస్తుతం నేను వచ్చింది మీ పారావతాల, చిలుకల ఆట చూచిపోవాలనే. అక్కడ వీటికి ఎంత పేరు ఉందో మీకు తెలియదు.

**అమితావి :** అలాగా అమ్మా! బుద్ధభగవానుని హయరత్నం పేరు వీటికి పెట్టుకున్నాను. – మీరు పాములకు ఆట నేర్పారట!

**ఉత్పల :** ఎందుకా ఆశ్చర్యం? వాటిని పెంచటం చాలా సులభం.

**అమితావి :** మొన్న ఆరామానికి ఒక ఉపాసిక శ్రావస్తి నుంచి వచ్చింది. ఆమె పులులను పెంచిందట!

**ఉత్పల :** ఆమె చపలా ఏమిటి చెప్మా!

**అమితావి :** ఆమె ప్రాకృతంలో కవిత్వం కూడా చెప్పుతుంది.

**ఉత్పల :** అయితే సుజాత ఐ ఉంటుంది. ఓ సుప్రసిద్ధ రాజనర్తకి.

**అమితావి :** ఆమె పెంచే పులులు... అమ్మా! అరుగో భదంతులు.

**భదంతుడు :** అమ్మా! పూర్వ శైలం మీద ఆనందభిక్షువుతో మాటాడి రావటంలో ఆలస్యమైంది.

**ఉత్పల :** భదంతా! ఇక్కడ నాకే లోపమూ జరగలేదు.

**అమితావి :** భదంతా! కొన్నాళ్ళ క్రితం ఒక నర్తకి వచ్చిందే ఆమె పులులను పెంచుతుందట విన్నారా?

**భదంతుడు :** ఆమె కవయిత్రి అని మాత్రం నాకు తెలుసు. అమ్మా, నీకామె తెలుసునా? ఇప్పుడెక్కడుంది?

**ఉత్పల :** ఔను! ఇప్పుడామె ఊరూపేరూ లేదు. పాపము కాలగర్భంలో కలిసిపోయి ఉంటుంది

**(పక్షుల కిచకిచలు, కూతలూ దూరంనుంచి వినిపిస్తవి)**

**అమితావి :** అదిగో! కంటకాలు. ఆకాశం నుంచి దిగి వచ్చినట్లున్నవి. దాహం ఇచ్చి వస్తాను. ('గు'గ్గూ అంటూ నిష్క్రమణ)

**భదంతుడు :** అమ్మా! జ్ఞప్తికి రావటం లేదు, ఆమె పేరేమిటన్నారు?

**ఉత్పల :** సుజాత...

**భదంతుడు :** ఔను సుజాత... ఈ అతిథి గృహంలో ఆమె వ్రాసిన గీతం ఒకటి చెక్కించింది. అదిగో.

**ఉత్పల :** కొంతకాలం క్రితం ఈ గీతాన్ని నగరంలోని ఓ గోష్ఠిలో పాడి వినిపించింది.

**భదంతుడు :** అమ్మా నీవు అది పాడగలవా?

**ఉత్పల :** పాడగలను...

**నావికా!**
**బ్రతుకన ఆశయె లేదిక!**
**కడలిని తడబడి**
**కానను దారెదొ**
**పెనుజడి అలజడి**
**ననుగన రావో -** ॥నావికా॥

**భదంతుడు :** చాలా చక్కని కంఠమమ్మా నీది! గీతం వింటున్నంతసేపూ ఏవో అవ్యక్తానుభవాలు లీలగా ద్యోతకమైనవి.

**ఉత్పల :** మీరు ఎన్నడైనా కొంతకాలం పాటలిలో ఉన్నారా?

**భదంతుడు :** అనేక మారులు మేము అక్కడనే బుద్ధపూజ ఆచార్య సమితాప్రీలతో కలిసి జరిగించాము.

**ఉత్పల :** ఎప్పుడైనా 'ఉత్పలపర్ణ' పేరు విన్నారా?

**భదంతుడు :** లేదమ్మా! ఆమె అంత ప్రసిద్ధురాలా ఏం?

**ఉత్పల :** రాజలోకంలో ఎప్పుడూ ఆమె పేరు చెవినబడుతూ ఉంటుంది. నాగరకుల మాట చెప్పనవసరంలేదు. వారికామె దేవతామూర్తి.

**భదంతుడు** : (ప్రశ్నపూర్వకంగా) ఆమె....

**ఉత్పల :** నర్తకి... గాయని కూడాను.

**భదంతుడు :** నీకేమైనా స్నేహితురాలా?

**ఉత్పల :** కాదు గర్భశత్రువు... అయితేనేం ఆమె అంటే నాకో వెఱ్ఱి అభిమానం. ఆమె దుస్థితిని చూస్తే నాకో కనికరం!

**భదంతుడు :** దుస్థితా?

**ఉత్పల :** రాచలోకాలల్లోనూ, నాగరకుల్లోనూ దేవతామూర్తి కావటమే ఆమె దుస్థితి – జీవితారంభంలో ఆమె అతి పవిత్రురాలు... దారిద్ర్యము, దాస్యము! శరీరము అమ్ముకోవలసి వచ్చింది.

**శీలభద్రుడు :** పాపం!

**ఉత్పల :** ఈనాడో ఆమె పట్టింది బంగారం. ఆమె అపాంగ వీక్షణాన్ని అర్థించే ప్రభులోకం అపరిమితం. ఒకనాడు దాహం వేస్తే మంచినీరు త్రాగటానికి మృణ్మయపాత్ర లేని ఆమె ఈనాడు హేమ చషకాలల్లో మధువు క్రోలుతున్నది.

**శీలభద్రుడు :** కష్టాలు కలకాలం ఉంటవా అమ్మా!

**ఉత్పల :** భదంతా! ఆమె అనుభవిస్తూ ఉన్న ఐశ్వర్యానికి నేను చెప్పింది అతి స్వల్పమైన ఉదాహరణ.

**శీలభద్రుడు :** అమ్మా! కోపగించుకోకుండా ఉంటే నేను ఒక మాట అంటాను. ఆ ఉత్పలవు నీవు కాదు గదా?

**ఉత్పల :** (చకిత కంఠంతో) ఎందుకలా ప్రశ్నించారు?

**శీలభద్రుడు :** జీవయాత్రలో పడుతూ ఉన్న యాతనలను చెప్పుకొను ఆత్మబంధువులు లేని అనేకమంది అతిథులు మొదట అన్యాపదేశంగా ప్రారంభించి మాతో చెప్పుకోవటం పరిపాటి.

**ఉత్పల :** భదంతా! ఒకమాటు ఆమె విషాదాన్ని అపనయించుకోలేక ఇలా అన్నది ఒక గాథలో

**'అణత్తం తేణ తుమం పయిణో పహో ఏణ పడహ సద్దేణ**

**మల్లిణ లజ్జసి ణచ్చసి దోహగ్గే పా అడిజ్జన్తే' –**

అయితేనేం? నా ఘోర దుఃఖాన్ని ఆమె చవైనా చూడలేదు.

**అమితావి :** భదంతా! బుద్ధ పుష్పులవారు మిమ్మల్ని వెంటనే ఒక్కమాటు వచ్చి పొమ్మన్నారు.

**భదంతుడు :** అమ్మా! మళ్ళీ మాట్లాడుకుందాం.

**(నిష్క్రమిస్తాడు)**

**ఉత్పల :** మీరు నాకా గ్రంథం ప్రతి ఒకటి వ్రాయించి పెట్టాలి. ఉదయం కొన్ని గాథలు చదివాను. చాలా బాగున్నవి.

**అమితావి :** తప్పకుండా.

**ఉత్పల :** మీరు సాయంత్రం ఖేమా కథ చెప్పవలెనన్నారు కదూ?

**అమితావి :** ఔను! ఆమె, సామ్రాట్టు బింబిసారుని అగ్ర మహిషి. సౌందర్య గర్వి. బుద్ధ దర్శనానంతరం సమస్తాన్నీ త్యజించి భిక్కునీ వ్రతదీక్ష స్వీకరించింది.

**ఉత్పల :** జీవితాంతం వరకూ దీక్ష పాలించిందా?

**అమితావి :** అతినిష్ఠతో.

**ఉత్పల :** అనాలోచితంగా దీక్ష పుచ్చుకున్నానని తరువాత చింత పడలేదుగా?

**అమితావి :** లేదు. ఆమెను భిక్షుక గణం అగ్రశ్రావికగా పరిగణించింది. ఉపాసికా! ఆమె జీవితాంతంలో ఒక విచిత్ర సంఘటన జరిగింది.

**ఉత్పల :** ఏమిటది?

**అమితావి :** ధర్మ ప్రచార యాత్రలో అరణ్య మధ్యంలో దిక్కు తెలియక వెళ్లుతూ ఉంటే కార్చిచ్చులో చిక్కబడ్డది. భగవానుణ్ణి స్మరించింది. వెంటనే ఆయన లీలగా ఆమెను నడిపించి బయటపడవేశాడు.

**ఉత్పల :** సత్యమేనా?

**అమితావి :** థేరీ గాథలు నీవు నమ్మవా? తల్లీ!

**ఉత్పల :** అయితే భగవానుడు కార్చిచ్చులో చిక్కిన వాళ్ళందరినీ అలాగే కనికరిస్తాడా?

**అమితావి :** తప్పక అమ్మా! కంటకాలు రెండూ పోట్లాడుకుంటున్నవి, చిక్కు వదిలించాలి. (గు, గ్గూ, గూ, గుగ్గూ అంటూ నిష్క్రమిస్తాడు)

**ఉత్పల :** (విషాదాన్ని వ్యక్తం చేసే రాగాలాపన చేస్తుంటుంది)

**నందుడు :** (టింగ్... టింగ్ వీణ తీగలు మోగిస్తూ) అమ్మా! నీవు సంగీతము పాడతావట! నాట్యము చేస్తావట!!

**ఉత్పల :** అత్యవసరమైనప్పుడు... ఇందులో మీకేది ఇష్టం?

**నందుడు :** సంగీతమంటే మహానందము. ఆరామంలో సంగీత సాధన లుండకూడదని అగ్రశావికులు శాసించారు.

**ఉత్పల :** మరి ఈ వీణ...

**నందుడు :** ఇది లేనిది నేను బ్రతకలేనని గుర్తించి నా ఒక్కడికే అనుజ్ఞ ఇచ్చారు. అతిథులు యధేచ్ఛగా పాడుకోవచ్చును.

**ఉత్పల :** మీ వీణ చాలా పాతదే!

**నందుడు :** (దైన్యంతో) చాలా పాతది. పదేళ్ల క్రితం పాటలిలో ఒక ఉపాసిక నా చేత పాడించి సంతోషంతో ఇది సమర్పించింది. అమ్మా! అయితే నీవు ఈ పాతవీణ మీద పాడలేవా?

**ఉత్పల :** శక్తి కొద్దీ యత్నించి మిమ్మల్ని సంతోష పెట్ట ప్రయత్నిస్తాను. శ్రావకా! నేను ఏ పాట పాడినా మీరేమీ అనుకోవద్దు.

**నందుడు :** నీ ఇష్టం వచ్చిన పాట కానీ అమ్మా!

**ఉత్పల :** **'నడిపింపవా ఓ ప్రభూ! నీవు నా నావ,**
**భారాలను దేవ! బరువు మ్రోయగ లేను నడిపింపవా॥**
**పొడుపుమల నెత్తాన**
**పొలిచి తడబడి కాంతి**
**విడివడెడు పొలిమేర**
**నేదూర తీరాలకో... ॥నడిపింపవా॥**

**నందుడు :** వీణ మంచిదైతే పాట ఇంకా ఎంతో బావుండేది. ఎక్కడ నేర్చుకున్నావు తల్లీ ఈ పాట?

**ఉత్పల :** చిన్నతనంలో కోపం వచ్చి మా అమ్మ నన్ను ఇంట్లో నుంచి వెళ్ళగొట్టింది.

**నందుడు :** పాపం!

**ఉత్పల :** బహుదూరం నడిచి నడిచి అలిసిపోయి ఓ సరస్సు దగ్గిర చెట్టు నీడన విశ్రమించాను. ఒక భిక్షువు అప్పుడు ఈ పాట పాడుతుంటే విని నేర్చుకున్నాను – ఈ గీతం ఈనాడు పాటలిలో, మగధలో ఇంటింటా ధనికులైన తల్లులు పిల్లలకు నేర్పిస్తున్నారు.

**నందుడు :** అంత ప్రసిద్ధమైన పాటా తల్లీ!

**ఉత్పల :** ఉత్పల నిత్యమూ రాజలోకాల్నీ, నాగరకులనూ, ఈ పాటతోనే ముగ్ధులను చేస్తున్నది. పాడగల వాళ్ళకు ఈ పాట బ్రతుకు తెరువు కల్పిస్తున్నది.

**నందుడు :** అమ్మా! ఏమిటా వెర్రిచూపులు – అన్నా... అన్నా!

**ఉత్పల :** నా హృదయభారాన్ని లోకం ఎలా అర్థం చేసుకోగలుగు తుంది. నా చుట్టున్న పిశాచాలు నన్ను బంధిస్తున్నవి.

**అమితావి :** పిశాచాలే, బాబో!

**నందుడు :** అన్నా! ఈమెకు మతిభ్రంశం కలుగుతుందేమో!

**అమితావి :** పాములు పెంచుతున్నది కదూ?

**నందుడు :** 'ఇస్' – ఆమెకు వినపడితే బాగుండదు.

**అమితావి :** మనకు అతిథిగా వచ్చింది. – అమ్మా!

**ఉత్పల :** ప్రణయము! దుఃఖం – ఆశ, నిరాశ! కరుణా క్రౌర్యాల అవధులు చూచాను. మహా పట్టణంలో కంఠం కమలిపోయేటట్లు అమృతగాన మొలికించినా కమికెడన్నం దొరకని కాఠిన్యం! బాధ! అబ్బా!

**నందుడు :** ఉపాసికా! నీ పాట మహాద్భుతంగా ఉంది.

**ఉత్పల :** (ఉద్వేగంతో) 'తుందిలా! నాకు ప్రశాంతి గంగా గర్భంలో దొరుకుతుందన్నావు గదూ? చేత చిరుపాపతో నిస్సహాయనై, నిర్ధననై, నిరాహారనై నిన్ను పాదాలంటి వేడుకొన్నానే – డబ్బు! డబ్బు!

**అమితావి :** ఉపాసికా! ఉపాసికా!!

**ఉత్పల :** మాధ్వీ! కౌముదీ జాతరంలో నా నాట్యం! త్వరగా అలంకరించు. సభ ముగ్ధమై పోవాలి... అబ్బా!

**నందుడు :** అమ్మా! మీకు దేహారోగ్యం సరిగా లేదా?

**ఉత్పల :** ఔను! దానివల్ల నాకేం లోపం. 'మహాజనులారా ఉత్పలకు ఈ దినం మన స్వాస్థ్యం లేదు. నాట్యం చెయ్యదు. .... (పెద్ద పెట్టున నవ్వుతుంది) వెళ్ళిపొండి, వెళ్ళిపోండి.

**భదంతుడు :** నందా! ఏమిటిది?

**నందుడు :** నేను పాడమంటే పాడుతుండగా ఉపాసికకు మతి భ్రమణం కలిగింది.

**అమితావి :** అన్నీ అర్థంగాని మాటలు మాట్లాడుతున్నది.

**నందుడు :** భదంతా! ఇంత అందగత్తెకు ఈ కష్టం ఎందుకు వచ్చిందో – సంపన్నురాలి వలెనే కనిపిస్తున్నదే!

**భదంతుడు :** నాయనా! మీరు పూజా మందిరానికి వెళ్లిపోండి. ఉపాసికా!

**ఉత్పల :** భదంతా!

**భదంతుడు :** ఈ ఏకాంత ప్రదేశం నీకు క్రొత్త చేసినట్లుంది.

**ఉత్పల :** సుజాత గీతం వల్ల నా పూర్వ జీవితంలో కొన్ని ఘట్టాలు, స్మృతికి వచ్చినవి. అందువల్ల మనస్సు కొంత కళవళపడి ఉంటుంది తండ్రీ! ఏడేండ్ల నాడు ఎర్రని ఎండలో తిండిలేక మలమల మాడి చనిపోయిన నా ముద్దుబిడ్డ 'ఆకలి! ఆకలి' అని కంటిముందు రోదించాడు.

**భదంతుడు :** అమ్మా! అతణ్ణి గురించి ఆలోచించడం మానివెయ్యి. ఇనికిల స్వర్గంలో గంధర్వుడై అతడు యథేచ్ఛగా పాడుకుంటుంటాడు.

**ఉత్పల :** తండ్రీ! అతణ్ణి బ్రతికించుకోటానికే ఈ సంగీతం నాట్యం నేర్చుకున్నాను. కీర్తి గడించాను – ధనం ఆర్జించాను. ఇప్పుడు ఎవరికోసం?

**భదంతుడు :** ఇక నీకు పిల్లలు లేరా?

**ఉత్పల :** (వికటంగా నవ్వి) లోకంలో అందంగా కనుపించే పిల్లలందరూ నా పిల్లలే. దరిద్రురాలైనప్పుడు, పవిత్రురాలై నప్పుడు నే పాడిన పాట, ఆడిన ఆట ఎవర్నీ ఆకర్షించలేదు. దుర్వృత్తికి అలవాటు పడి నగర నర్తనశాలలో వేసిన గంతులన్నీ శాస్త్రార్థ వ్యాఖ్యానాలైనవి. లోకం గుడ్డిది. కళను అది అందుకోలేదు. లోకం కళకు శత్రువు! ప్రబల శత్రువు!!

**భదంతుడు :** అమ్మా! అంత ఉద్వేగివి కాబోకు.

**ఉత్పల :** భదంతా! లోకానికి ప్రేమ లేదు  సత్యం లేదు  శౌచం లేదు.

**భదంతుడు :** అమ్మా! అందుకనే భగవానుడన్నాడు.

**'యేవా గరత్తాను పతంతి సోతం**
**సయం కతం మక్కట కోవ జాలం**
**పతంసి చేత్వ నవజంతి ధీరా**
**అనపేర్ధినో సబ్బ దుక్ఖం పహాయ'**

**ఉత్పల :** భదంతా మీతో వెనుక ప్రసంగించిన ఆ ఉత్పలను నేనే! కడుపులో బడబాగ్నితో నిత్యమూ నాగరకలోకానికి ఆనందా మృత ప్రదానం చెయ్యవలసిన ఆ ఉత్పలను నేనే!!

**(ఆరామ ఆలయంలో నుంచీ ఘంటికలు వినిపిస్తవి)**

భదంతా! ఈ ఘంటికా నాదంలో ఎంత శీతలత్వమున్నది.

**భదంతుడు :** బుద్ధ పూజకు పిలుపు వినిపించింది.

**ఉత్పల :** (సోత్సాహంతో) ఈ ఆశ్రమ వాతావరణం ఎంత తాపా పనోదకంగా ఉంది.

**అమితావి గొంతుక :**

**'నసంతి పుత్తా తాణాయ నపితా నపి బాంధవా**
**అంతకే నాధిపన్నస్య నవీథి జ్ఞాతిషు తాణతా**
**ఏతమత్ ఖవసం జ్ఞాత్వా పండితో సీల సంబుతో**
**నిర్వాణగమనం మగ్గగం ధిప్పామేవ విసోధయె'**

**ఉత్పల :** భదంతా! అది అమితావి గొంతుకేనా? ఎంత అనునయంగా ఉంది

**నందుని గొంతుక :**

**'కర్మ స్య కారకో నాస్తి**
**విపాకస్య చ వేదకో,**
**శుద్ధ ధర్మం ప్రవర్తంతి**
**యే వేదం సమదర్శనమ్'**

*ఎ.ఐ.ఆర్. హైద్రాబాద్ **7-6-1949***

# ఏ.క.తా.ర

**కోప్పడకమ్మా! కోప్పడకు, నీవు తప్ప నాకు కలిగే అనుమానాలను తీర్చేవాళ్లు ఎవరమ్మా! నాన్న చూతామా అంటే అంత చదువుకున్నా ఆ మార్వాడీ దగ్గిర గుమాస్తా. నిమిషం తీరిక లేదు. ఉదయం పోతే సాయంత్రం గాని ఇంటికి రారు. వచ్చిన తర్వాత బడలిక. ఎప్పుడు చూచినా ఏదో కష్ట సముద్రంలో ఈదుతున్నట్లు ఉంటారు. ఇక మాట్లాడించటానికి నాకు ఏమి మనస్కరిస్తుంది? అవకాశమూ ఉండదు. బళ్లో చదువుకుంటున్నామన్నమాటేగాని మా అనుమానాలను తీర్చే గురువులు కారు వాళ్లు. ఎందుకూ పనికిరాని విషయాలు ఎన్ని చెప్పినా ఫరవాలేదు. మేము ఏవన్నా ప్రశ్నలు వేస్తే అప్రస్తుతమనీ, అధిక ప్రశంసనీ, ఇప్పుడు కాదనీ చేతగాక గర్వితనం వల్లా తప్పించుకొంటూ ఉంటారు.**

**తల్లి :** తప్పు! మేష్టర్లను నిందించకూడదు.

**కొడుకు :** (గడుసుగా) ఇక మాకు చెప్పేదెవరమ్మా మరి! మా భావాలను, జిజ్ఞాసను చంపుకోవలసిందేనా? మేమూ 'డూడూ వెంకన్నలము' ఐతే చూతామనేనా మీ అందరి అభిలాష... పోనీలే నీకేదైనా పని ఉంటే చూచుకో.

**తల్లి :** (కంటికి నీరు తిరిగి ఒక చుక్క బుగ్గమీద పడి చిందుతుంది) అంతలో ఆవేశము. అంతలో నైరాశ్యము. చెప్పుమరి ఏం కావాలో?

**కొడుకు :** నిమిషాల మీద అయ్యే జవాబులుండే ప్రశ్నలా! అన్నిటికీ సమాధానాలు చెప్పేంత వీలుంటే అడుగుతా! కాకపోతే మరొక తడవ అడుగుతాలే... (తదేక దృష్టి)

**తల్లి :** (ప్రేమార్ద్ర దృక్కులతో) పని కాలేదన్న విసుగులో ఏదో అన్నాను. దానికింత చింతామగ్నత ఎందుకు? తండ్రీ! నీ అనుమానాలను తీర్చకుండా నేను చేసే పనిమాత్రం ఏమి పాడైంది. నే చదువుకున్న చదువెందుకు! చట్టుబండలకా! మీ నాన్న వచ్చేటప్పటికి ఆ రెండు ఇళ్లూ చిమ్మి రెండు కప్పుల కాఫీ కాచలేక పోతానా!

**కొడుకు :** అమ్మా! అయితే అడగమంటావా?

**తల్లి :** కానియ్యి నాయనా! నీ ఎదురుగా కూర్చొనే జవాబులు చెపుతాను – నాకు తెలిసినంతమటుకు.

**కొడుకు :** అందరికీ ఒకటే రకం ఇళ్లు లేకుండా ఒకళ్లకు బంగళాలు, ఒకళ్లకు పెంకుటిళ్లు, మన ఇంట్లో పనిచేసే రామి మొదలైనవాళ్లకు పూరిళ్లూ ఉన్నాయే దానికి కారణం ఏమిటమ్మా!

**తల్లి :** (నవ్వుతూ) చాలా చిన్న సమాధానము. డబ్బు బాగా ఉంటే బంగళాలు, కొంచెం తక్కువగా ఉంటే పెంకుటిళ్లు, అసలే లేకపోతే పూరిళ్లు.

**కొడుకు :** (మూతి బిగించి) నవ్వులాట కాదమ్మా. నా మనస్సు ఎంతో ఆందోళనగా ఉంది. వాళ్లకున్న డబ్బు వీళ్ళకు ఎందుకు లేదు?

**తల్లి :** ఎందుకు లేదు, అంటే – లేదు కాబట్టే.

**కొడుకు :** ఏమిటే అమ్మా ఆ పెడ సమాధానాలు!

**తల్లి :** అల్లాంటి ప్రశ్నలు వేస్తే మరి ఏం జవాబు చెప్పేదిరా?

**కొడుకు :** పుడుతూనే వాళ్లు ఏ లోకంలో నుంచైనా, తెచ్చుకున్నారా మరి!

**తల్లి :** లేదు. కాని వాళ్ల పూర్వులు సంపాదించి ఇచ్చిపోయినారు...

**కొడుకు :** వాళ్లకు మటుకూ ఇక్కడిదేగా డబ్బు సంపాదించటానికి. న్యాయాన్యాయాల భయము, పాపభీతి లేకుండా సంపాదిస్తే మటుకు వాళ్లదౌతుందా! తోడి మానవులు నీచాతి నీచంగా ఉంటే వాళ్ల హృదయం ఎలా సహిస్తుంది. అమ్మా! వాళ్ళకు హృదయం అనేది లేదేమో!

**తల్లి :** డబ్బు దగ్గిర నువ్వన్నవన్నీ అవసరం లేదు. దేవుడనేవాడు ఉంటే అతడు గూడా వాళ్లకే సహాయం చేస్తాడట.

**కొడుకు :** అమ్మా! దేవుడంటే జ్ఞాపకం వచ్చింది. నిన్న ఎవరో బ్రాహ్మడు వచ్చి కార్తిక సమారాధన చేయబోతున్నాము చందా వేయాలన్నాడు నాన్నను. ఆ డబ్బంతా పోగుచేసి మనబోటి బీదవాళ్ళకు ఎవరికన్నా ఇస్తారా ఏమే!

**తల్లి :** పిచ్చి నాయనా! నువ్వు చాల చిన్నవాడవు. నీకింకా ఏమి తెలియ దోయి. ఆ బ్రాహ్మలదేవుడు బీదలకు ఇవ్వమనేవాడు కాదు. వాళ్ల కడుపుకు తినమనేవాడు.

**కొడుకు :** అమ్మా! నాకు తెలియక అడుగుతాను. బ్రాహ్మలదేవుడనీ, కోమట్ల దేవుడనీ, శూద్రుల దేవుడనీ, ఇంకోళ్ల దేవుడనీ దేవుళ్లు ఇంతమంది ఉంటారా ఏమిటే! (ఆశ్చర్యంతో) దేముడు ఒక్కడే గదమ్మా!

**తల్లి :** మనదేశంలో దేముళ్ళకేమి కొదవ నాయనా! కనపడ్డ చెట్టూ పుట్టా, రాయీరప్పా, గోడగొబ్బే అన్నీ దేవుళ్లే! దేముడు కాని వస్తువేమిటి? కానీ, సాటి మానవుణ్ణి వీటి అన్నిటికన్నా కనాకష్టంగా చూస్తారు. 'దేవుళ్లు ఇంత మందా'! అన్నావు? అసలు ఒకడున్నాడా ఏమిటి? ఆ విషయాన్ని గురించి పెద్దపెద్దవాళ్లకే అనుమానం. నిజంగా ఉంటే మనబోటి పేదవాళ్లకు ఎంతో మందికి ఎన్నో అన్యాయాలు, అక్రమాలు జరుగుతుంటే చేతగాని దద్దమ్మలాగా గుడ్లుమిటకరించి చూస్తూ కూచుంటాడా ఏమిటి!

**కొడుకు :** (మరింత ఆశ్చర్యంగా చూస్తూ)

అయితే దేముడే లేడంటావా అమ్మా?

**తల్లి :** ఉన్నాడేమో నీవే ఆలోచించు.

**కొడుకు :** అలా అయితే మరి మనం ఈ బ్రాహ్మళ్లకు సంతర్పణలకనీ, సమారాధనలకనీ, చందాలు ఇవ్వటం దేనికి, ఆ డబ్బు బీదవాళ్లకు ఉపయోగించకపోతే?

**తల్లి :** మనం కడుపుకు తిన్నా తినకపోయినా దేవుళ్ల పేరా, దయ్యాల పేరా జీవించే ఆ పుణ్యపురుషులకు ఈ మొక్కుబళ్లన్నీ చెల్లిస్తూ వాళ్లను పోషించాల్సిందే. లేకపోతే మనకు పాషండులనీ, చార్వాకులనీ, నాస్తికులనీ పేర్లు పెడతారు. వాళ్లకు దేముడిమీద నిజంగా గాఢమైన నమ్మకం ఉన్నా లేకపోయినా నమ్మకం లేదన్నవాళ్లను నలిపివేసి అష్టకష్టాలు పెట్టటానికి వాళ్లంతా ఒకటే అవుతారు. బీదలకు ఉద్యోగాలు దొరకవు. చాకిరీ చేసుకొని బతకడానికి కూడా చొరవ ఇవ్వకపోవటం వల్ల కూలినాలీలు దొరకవు. చిల్లిగవ్వ చేతిలో ఆడదు. ఎందుకైనా...

**కొడుకు :** ఉండు! అయితే ధనికులు ఎక్కువమంది ఉంటారా? బీద సాదలు ఎక్కువమంది ఉంటారా?

**తల్లి :** ధనికులు చాలా తక్కువ మంది. నూటికి ఏ నలుగురో ఐదుగురో ఉంటారు.

**కొడుకు :** అంహ. వాళ్ళతో యుద్ధం చేసి ఓడించి ఆ డబ్బంతా బీదవాళ్లు సమంగా పంచుకుండేటట్టు ఎందుకు చేయగూడదు!

**తల్లి :** అది అంత సులభసాధ్యం కాదు. వాళ్లకు పోలీసుల దన్ను చాలా ఉంటుంది.

**కొడుకు :** పోలీసులు కూడా బీదవాళ్లే కదా, వాళ్లను కూడా ధనికులు బాధ పెడుతుంటారే మరి వాళ్లకు డబ్బుగలవాళ్లంటే ఎందుకు కోపముండదో!

**తల్లి :** వాళ్ల సంగతి మనం మాట్లాడకూడదు. ఎవరన్నా వింటే కొంప మీదికి వస్తుంది.

**కొడుకు :** పోనీవే. పేదవాళ్లంతా ఒకటై ధనికులకు ఏ పనీ చేయమని అంటే వాళ్లు ఏం చేస్తారో!

**తల్లి :** అటువంటివాటిని 'సమ్మె'లంటారు. అవి చాలా చోట్ల జరుగుతూనే ఉన్నాయి. కానీ పూట కూటికి లేనివాళ్లు గదూ వీళ్లు. ఇందులో కొంతమందికి మరింత డబ్బాశ పెట్టి మిగిలిన వాళ్లలో నుంచీ చీలదీస్తారు. అంతలో వీళ్ల సంఘబలం తగ్గిపోతుంది. చదువుకున్నవాళ్లు పోయి మంచి ఏదైనా చెప్పబోతే తాగి తందనాలు వేసేవీళ్లు మంచి చెడ్డలు అర్థం చేసుకోలేరు. ముందు రూపాయి వస్తుందిరా అని మనం చెప్పినా ఆ నిమిషాన 'కంటికి కల్లుకు – కావలసిన పావలా' కనిపిస్తే ధనికులకు దాసోహం చేస్తారు.

**కొడుకు :** అమ్మా! వాళ్లు ఉత్త అమాయకులు ఏ అన్నెం పున్నెం ఎరుగరు చదువు శూన్యం.... నా మనస్సుకు వాళ్లకేదైనా సహాయం చెయ్యాలని ఉత్సాహంగా ఉందమ్మా! మొదట్లో ఏం జెయ్యమంటావు నన్ను?

**తల్లి :** ఏమిటి చేసేది! నీ మొహం, ఆ ఆలోచన మానేసి నిద్దరపో కాసేపు. ఇంతలో నాన్న వచ్చే వేళౌతుంది. లేచి కాఫీ తాగి మాట్లాడుదువు గాని తీరికగా. నేనింకా కుంపటి రాజెయ్యాలి.

**కొడుకు :** నిద్దర!... నిద్దరే!! పట్టదు. ఎలా పడుతుంది!? ధనవంతుల మోటార్లు అరిగిపోతాయని పేదవాళ్ల చెవులు పిండి వసూలు చేసిన డబ్బుతో వాళ్లు తినటానికి లేకుండా మలమల మాడిపోతున్నా తారురోడ్లు వేయిస్తారటగా?

**తల్లి :** కన్నా! ఎవరు చెప్పారురా నీకిదంతా?

**కొడుకు :** ఎవరైతేనేం గాని అమ్మా! నా కన్నా అందంగా లేడు. తెలివి తేటలూ లేవు ఆ కోమటివాళ్ల అబ్బాయి మహాగర్వి. టాకు–టీకుగా కారులో బడికి వచ్చి ఇంటికి పోతుంటే కడుపులో ఏమిటో మంటగా ఉంటుంది. ఇకముందు వాణ్ణి చూచి అసహ్యించుకొంటాను. ఎగతాళి చేస్తాను!! ఏడిపిస్తాను!! రాయి తీసుకొని వెనకగుండా వాడి కారు అద్దాలు పగలగొడతాను!! అద్దం పెంకులు గుచ్చుకొని తల చిల్లిపడి రక్తం

కారుతుంది. అంతటితో సరిపోతుంది. వాడి రిమ్మ అణుగుతుంది... మర్నాటినుంచీ బళ్లోకి నాతోపాటే నడిచి వస్తాడు. అప్పుడు అంతా వాణ్ణి చూసి నవ్వుతారు. ఆఁ వాడికి మూడిందిలే! అంతపనీ జరిగి తీరుతుంది.

**తల్లి :** (ఆశ్చర్యాన్ని కప్పి పుచ్చుతూ ఉన్న ఆదుర్దాతో) అదిమటుకు చెయ్యవద్దు. నన్నూ నాన్ననూ చంపుకున్నట్లు.

**(ప్రేమార్ద్ర కంఠంతో)**

బుజ్జీ! అలసిపోయావు. మళ్ళీ జ్వరం వస్తుందేమో! ఇక మాట్లాడకు. కాస్త నిద్దరపో నాయనా! నేను ఇంట్లో పని చూచుకోటానికి పోతున్నా. సరేనా తండ్రీ!

**కొడుకు :** (బలహీనత వల్ల శరీరం అలిసిపోయిందీ నెమ్మదిగా) అలాగే. (కుర్చీలోకి నెమ్మదిగా మేను వాలుస్తూ ఒరిగి నిద్ర పోతాడు. తల్లి కొంచెం సేపు చూచి నిద్ర పట్టిందని ఇంట్లోకి పని చూసుకోనుపోతుంది)

## ద్వితీయ రంగము

(సమయము ఆ రోజే మధ్యాహ్నం 3 గంటలు. కొడుకు నిద్ర లేస్తాడు. కనిపెట్టుకుని కూర్చున్న తల్లి ఒక చేతిలో కాఫీ కప్పు రెండో చేతిలో సాసరు పట్టుకొని నిలవబడి ఉంటుంది. తల్లి చేతిలో కాఫీ కప్పు సాసరు పుచ్చుకొని, సాసరులో కొంత కాఫీ పోసుకుని తాగుతూ)...

**కొడుకు :** అమ్మా! నాన్న రెండున్నరకు వచ్చి నాతో కొంతసేపు మాట్లాడతానన్నారే! వచ్చారా?

**తల్లి :** వచ్చారుగాని కాఫీ తాగి వెంటనే వెళ్ళిపోయినారు.

**కొడుకు :** (కాఫీ త్రాగటం ఆపి) నాన్నకు నాతో మాట్లాడటమంటే విసుగు కామాలి. కంటికి కనపడకుండా తప్పించుకుని తిరుగుతుంటారు.

**తల్లి :** కాదు! నాయినా, కాదు. వారికి నీతో మాట్లాడటమంటే ఎంతో సరదా! ప్రక్క ఇంట్లో భూషణంగారు మీ అబ్బాయి చాలా తెలివిగల వాడండీ అని అంటే ఆయనకు ఎక్కడలేనీ ఆనందమూ కూడా. కానీ బహు కష్టజీవి. ఒకసారి అనుభవం అవటం వల్ల ఉద్యోగం విషయంలో బహుజాగ్రత్తగా ఉంటారు. మన మార్వాడీ ఎవరో రైతుకు డబ్బు అప్పు పెట్టి ఆస్తి తాకట్టు పెట్టించుకుని అతడు ఇవ్వలేకపోతే దావావేసి

రాబట్టుకుంటున్నాడట! ఆ ఆస్థిని ఇవాళ కోర్టులో వేలం వేస్తారట. అక్కడ ఉండకపోతే కొంప మునిగి పోతుందని ఆ కప్పు కాఫీ తాగి ఉరుకులు పరుగులు పెడుతూ పరుగెత్తారు కోర్టుకు. నీతో మాట్లాడుతానన్న సంగతి కూడా జ్ఞాపకం ఉంది. టైములేదని అన్నారు. వాడు అలసి నిద్దర పోతున్నాడులెండి. లేపటం ఎందుకు అని నేను కూడా అంటే ఒక ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయారు.

**కొడుకు :** (కాఫీ కప్పు, సాసరు తన కుర్చీకి దగ్గిరగా క్రింద పెట్టి)

ఉద్యోగ విషయంలో పూర్వం నాన్న ఏదో అనుభవించారన్నావు అదేమిటమ్మా!

**తల్లి :** (దీర్ఘ నిశ్వాసము) నీవు పుట్టేటప్పటికి మీ నాన్న తాలూకా ఆఫీసులో హెడ్ గుమస్తాగా ఉండేవారు. నెలకు నూరు రూపాయల జీతం. అప్పుడు మన సంసారం సంగతి చాలా బాగా ఉండేది. ఏ లోటూ లేదు. నిన్ను ఎత్తుకొని ఆడించటానికి బజారునుంచీ కావలసిన సరుకులు తెచ్చి పెట్టటానికి ఇద్దరు దాసీవాళ్లు, ఇంట్లో వంటపనికి ఒక మనిషి ఉన్నారు.

**కొడుకు :** (ఆత్రుతతో) తరువాత ఏమి జరిగిందేమిటి?

**తల్లి :** (వినపడదు) నేను ఎప్పుడూ పుస్తకాలూ, పత్రికలూ చదువుకుంటూ కాలం వెళ్లబుచ్చేదాన్ని. నాన్న పేటంచు జరీపంచలు, ఖండువాలు, సిల్కు చొక్కా కోటు తప్ప కట్టేవారు కారు ఆ రోజుల్లో. ఇప్పుడు కష్టాలకు కాగి శరీరం నల్లబడి పోయింది కాని అప్పుడు వంగ పండు చాయగా ఉండేది. అంతేనా ఎంతో మంది మనకు...

**కొడుకు :** అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పవు. చివరకేం జరిగింది.

**తల్లి :** వినుమరి. అన్నిటికీ తొందరేమిరా! అప్పుడు గాంధీ మహాత్ముని ప్రభ బాగా సాగుతూ ఉంది. స్వాతంత్ర్య పోరాటం కోసం ఉద్యోగస్తులందరినీ ఉద్యోగాలకు రాజీనామాలిచ్చి ఉద్యమంలో దిగవలసిందని ఉద్బోధించాడు. వేలకు వేలమంది ఉద్యోగం ఒదులుకొని మొన్న నీకు మీ నాన్న చెప్పారే, ఆ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. వాళ్ళల్లో నాన్న కూడా ఒకరు. తరువాత జైలుకు కూడా పోవలసి వచ్చింది.

**కొడుకు :** సంతోషంగా పోయినారనుకుంటానమ్మా! చాలా మంచిపని చేశారన్నమాట. స్వతంత్రత కోసం పోరాడటానికి చేశారాపని. అందులో నష్టం ఏమిటి?

**తల్లి :** చేసిన పని మంచిదే. కానీ తరువాత – తరువాతే ఇంట్లో జరిగే స్థితి కనిపించలేదు. అందుకోసమనే ఈ మార్వాడీ కొలువులో ఇరవై రూపాయలకు గుమాస్తాగా చేరవలసి వచ్చింది. గాడిద చాకిరి చేస్తూ ఆ నీచునికి ప్రతినిమిషమూ 'చిత్తము–చిత్తము' అనవలసి వచ్చింది. ఇంకో ఉద్యోగం ఏదీ దొరకక పోవటం వల్ల. (కన్నులవెంట అశ్రువులు కారుస్తూ)

కోమల హృదయం మొదట్లో మొదట్లో ఎంతో బాధపడ్డది... ఏం చేస్తాము

**కొడుకు :** అయితే అమ్మా! నాన్న ఇప్పుడు ఆ మార్వాడీ దగ్గర ఉద్యోగం ఎందుకు మానుకోగూడదు?

**తల్లి :** సంసారం ఎట్లా వెళ్లుతుంది. తండ్రీ! నీవు ఉత్త అమాయకుడివిరా! ... మనకు పూర్వార్జితమైన ఆస్తి సెంటు భూమి కూడా లేదు.

**కొడుకు :** (కొంచెము సేపు ఆగి) మనకు వచ్చిన కష్టాలకంతా దయా దాక్షిణ్యం లేని ఆ ధనికుల ఇళ్లల్లో డబ్బు మూలుగుతూ ఉండట మేనా?... అమ్మా మనకు పాలించే రాజు ఆ డబ్బంతా మనకు ఎందుకు పంచి పెట్టించ కూడదు

**తల్లి :** (నెమ్మదిగా) ఆయన కూడా మనను దోపిడి చేసేవాడే! నిజంగా సుకుమార హృదయం కలవాడైతే సాటిమానవులను పరిపాలించ టానికి ఒప్పుకుంటాడా! రాజ్య పరిత్యాగం చేస్తాడు. ప్రభువంటే గొప్ప బందిపోటు దొంగ. బెదిరించి పన్నులు వసూలు చేస్తాడు.

**కొడుకు :** ధనికుల మీద తిరుగుబాటు చేస్తే బాగుంటుంది. చచ్చిపోయినా వీరస్వర్గం కదూ... డబ్బుగలవాళ్ల కూతురైనా స్వరాజ్యం ఎంతో మంచి పిల్లమ్మా! రోజూ బళ్లో నుంచి నడవలేక నడవలేక వస్తూ ఉంటే డ్రైవరు చేత మధ్యలో కారాపించి నన్ను ఎక్కమని బతిమిలాడేది చాలామాట్లు. నేను, కారంటే నాకు పరమ అసహ్యం, నడిచే వస్తాను, వంటికెంతో కులాసాగా ఉంటుందంటే నావైపు దీనంగా చూస్తూ ఉండేది. ఇంతలో వాళ్ల కారు డ్రైవరు కారు తోలుకుపోయేవాడు. ఎంతో మంచిదమ్మా! స్వరాజ్యం. (తల్లి ముఖవిన్యాసాలు పరీక్షిస్తూ) నేనంటే ఆ అమ్మాయికి అమితప్రేమ ఎందుకోననుకున్నాను!...

**తల్లి :** (నవ్వుతూ) ఏం చేసిందేమిటి?

**కొడుకు :** ఒకనాడు మాకు డ్రిల్ పిరియడ్ వచ్చింది. మేష్టరుగారు చెట్టుకింద ఎవరికి తోచింది వాళ్లను ఆడుకోమన్నారు. నన్నెవరూ పిలవకపోతే దిక్కులు చూస్తూ ఉన్నాను. 'స్వరాజ్యం' నా దగ్గరికి వచ్చి చెయ్యి పట్టుకొని ఆడుకొందాం రమ్మని పిలిచింది. పిల్లలందరూ ఒకళ్ల వెనకాల ఒకళ్లు మా దగ్గరికి చేరటం మొదలు పెట్టారు. అప్పుడు స్వరాజ్యం మేము ఇద్దరమే ఆడుకుంటాము. మీరు పోండి, అల్లరి చేస్తే మేష్టరుగారితో చెప్పి కొట్టిస్తానని భయపెట్టి వాళ్లను వెళ్లగొట్టింది. చివరకు ఆ రోజున ఇంటికి వచ్చేటప్పుడు నన్ను కారులో ఎక్కమని ఎంతో బతిమలాడితే ఎక్కాను. దిగబోయే ముందు (దృష్టి ఇంకో వైపు మార్చి)

సుకుమార్.... నిన్నే.... పెళ్ళి.... చేసుకోవాలని... ఉంది అన్నది.

**తల్లి :** (నవ్వుతూ) అంటే నువ్వేమన్నావు?

**కొడుకు :** సరేనన్నాను.

**తల్లి :** పిచ్చినాయనా! ఎంత అమాయకుడివిరా! వాళ్లు ధనికులు. మనం పేదవాళ్లం. మనకిస్తారుటరా పిల్లను వాళ్లు.

**కొడుకు :** వాళ్లిచ్చేదేమిటి! స్వరాజ్యం నన్ను తప్ప ఇంకొకణ్ణి పెళ్ళి చేసుకోనని పట్టుపడితే వాళ్లేం చేస్తారేం!

**తల్లి :** (ముద్దుగా) ఏడిచావులే. వాళ్లెవరైనా మన ప్రసంగం వింటే తిడతారు.

**కొడుకు :** (కోపంతో) మనం ఏమి తప్పిదం చేశామని!

**తల్లి :** పోనియ్యరా! ఆ ప్రశంస. అదెందుకు ఇప్పుడు.

**కొడుకు :** ఆ మాటలు ఎందుకో మనస్సులో మెదిలితే చెప్పాను అంతేనమ్మా... నేను. తెలుసుకో...

(క్లారినట్, బ్యాండ్ వినిపిస్తుంది తల్లి కొడుకు వీథి గుమ్మంలో నిలవబడి చూస్తుంటారు. త్రివర్ణ వస్త్రఖండాలతో కుట్టిన కాంగ్రెసు జండా పట్టుకున్న నాయక ప్రముఖుడు..

**జయ-జయ-జయ ప్రియభారత జనయిత్రీ - దివ్యధాత్రి!**
**జయ వసంత కుసుమలతా చలిత లలిత చూర్ణకుంతల!**
**జయ దిశాంత గత శకుంత దివ్యగాన పరితోషణ!**
**కవిగాయక వైతాళిక గళవిశాల పథవిహరణ!**

అందరూ మళ్లీ అదే అంటూ రోడ్డుమీద పోతూ ఉంటారు)

**తల్లి :** ఇవాళ మైదానంలో ఏదో మీటింగ్ ఉన్నట్లున్నది. వీళ్లంతా అక్కడికే పోతున్నారు. పూర్వం నేను ఇటువంటి ఉత్సవాలల్లో పాల్గొనేదాన్నే.

**కొడుకు :** అమ్మా! ఇప్పుడు మనం ఎందుకు పోగూడదు వినటానికి.

**తల్లి :** అప్పటి ఉద్రేకం కష్టాలవల్ల తగ్గిపోయింది అంతే! (కొంతసేపటికి ఎర్రటి జండా మీద తెల్లగుడ్డ పీలకలతో కొడవలి సుత్తివేసి ఉన్నదానిని పదియేండ్ల కుర్రవాడు పట్టుకొని నడుస్తుంటాడు. ముందు సామ్యవాద ప్రముఖుడు.

**ఓ దివ్య కార్మికా!**
**ఓ భవ్య కర్షకా!**
**సామ్యవాదమే**
**సముచిత మార్గము**
**బీదల సాదల**
**పీడలు తొలగగ**
**ఓ దివ్య కార్మికా!**
**ఓ భవ్య కర్షకా!**

అనే పాటను పాడి నడిచిపోతారు. తల్లి, కొడుకు వీధి గుమ్మంలో నిలబడి పాడుతున్నంత సేపు తన్మయత్వంలో మునిగి వింటారు. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత)

**కొడుకు :** రెండోతడవ వచ్చిన వాళ్ళ జండాను చూస్తే నాకు భయం వేసింది. కాని మొదటివాళ్ల పాటకన్నా వీళ్ళపాట ఎంతో బాగుంది. నాకు మనస్సుకు నచ్చింది. మొదటివాళ్లంతా పెద్దవాళ్ళు, ముసలివాళ్ళు కూడాను. వాళ్ళు స్వాతంత్ర్యం కోసం పోట్లాడటానికి ఏమి పనికి వస్తారమ్మా! నా బోటి కుర్రవాళ్ళు వాళ్ళ దగ్గరికి పోతే ఇంటికి పొమ్మనేటట్లు ఉన్నారే! ఆ జండా పట్టుకున్న పిల్లవాడి ముఖం ఎంత కళకళలాడుతూ ఉందమ్మా! నేను పోయి అది పట్టుకో వస్తానంటే ఒప్పుకుంటారా!

**తల్లి :** నీవెందుకు పట్టుకోవటము?

**కొడుకు :** ఆ అబ్బాయి ఎందుకు పట్టుకున్నాడో అందుకే.

**తల్లి :** నాన్న వింటే కోప్పడతారు. ఎవరన్నా ఆ మాటలు వింటారేమో మానేయి.

**కొడుకు :** (దీనంగా) సరే! వాళ్లెక్కడికి పోతున్నారో! బీదసాదలు అని పాడారు, చేసే సభలో మన కష్టాలు పోయే మార్గం ఏదైనా చెపుతారేమో! అమ్మా! నేను వాళ్ళతో పోయి వినివస్తాను.

**తల్లి :** వద్దు! నాయనా! మళ్ళా నడిచి మైదానం దాక పోయివస్తే అలసిపోవటం వల్ల జ్వరం తిరగబెడుతుంది. బాగా నయమైన తరువాత ఎక్కడ తిరిగినా ఫరవాలేదు.

**కొడుకు :** అన్నీ తెలిసి కూడా అలా ఆటంకం చేస్తావేమమ్మా! జ్వరం వస్తే వస్తుంది. మళ్లీ వెనక నయమైనట్లే నయమవుతుంది. అక్కడ చెప్పే సంగతులు నాకు తెలియాలంటే ఎట్లా తెలుస్తాయి. పోతానమ్మా.

**తల్లి :** ఎప్పుడో నాన్న చెపుతారు విందువుగానివి. ఇప్పుడు పోవద్దు! నా మాట విను.

**కొడుకు :** (మాట్లాడడు).

**తల్లి :** ఇక్కడనే కుర్చీలో కూర్చుని ఏదైనా చదువుకుంటుండు. అయిదు కాగానే నాన్న వస్తారు., మాట్లాదువుగాని. అక్కడ చెప్పే సంగతులన్నీ నాన్నకు బాగా తెలుసు. చెపితే నేర్చుకుందువుగాని. నేను ఇంకా మడిగట్టుకోవాలి. ఇవాళ ఆరు గంటలకే భోజనం చేసి నాన్న ఎక్కడికో పోవాలట. త్వరగా వంట చేయమని చెప్పిపోయినారు.

**కొడుకు :** (ఆలోచిస్తూ వీధి గుమ్మంలో నుంచి లోపలికి వచ్చి పడక కుర్చీలో చతికిల బడతాడు. తల్లి ఇంట్లో పని చూసుకోను పోతుంది).

ఏవిధంగానైనా ఇవాళ అక్కడికి పోవాలిసిందేను. అమ్మా నాన్న మళ్ళీ నన్ను ఇంటికి రానిచ్చినా సరే రానివ్వకపోయినా సరే! వాళ్ళతో నేను మీతో కలిసి ప్రచారం చేస్తాను, నాకు తిండి గుడ్డలు ఇచ్చి మీ చదువు చెపితే చాలని బతిమిలాడితే ఒప్పుకోక పోతారా!

(లేచి నాలుగు దిక్కులూ చూచి నెమ్మదిగా ఇంట్లోనుంచి బయటికి జారతాడు)

## మూడవ రంగము

(సాయంత్రం 7.30 గంటల ప్రాంతము. కుర్చీలో కొడుకు లేకపోవటం వల్ల తల్లి వీధి గుమ్మంలో నిలవబడి ఎక్కడికి పోయినాడో అని కనిపెట్టుకొని చూస్తూ ఉంటుంది. ఇంతలో కొంతసేపటికి ఒక సైకిలుమీద రొప్పుతూ రోజుతూ ఒక కామ్రేడ్ దిగుతాడు ఆమె ముందు).

**కామ్రేడ్ :** వీరసూనుని కన్నతల్లికి నమస్కారములు.

**తల్లి :** (తలవంచుకొని ఉంటుంది. ఒకవిధమైన సిగ్గుతో)

**కాన్రేడ్ :** అమ్మా మీ అబ్బాయి...

**తల్లి :** (వంచుకున్న తల కొంచెం పైకెత్తి) ఎక్కడున్నాడేమిటి?

**కాన్రేడ్ :** అక్కడ మైదానంలో జరిగే సభ దగ్గిర ఉన్నాడు. ఇందాకటి నుంచీ ఇప్పుడూ అక్కడ బల్లదగ్గిరే... ఉన్నాడు.

**తల్లి :** ఇంత పొద్దుపోయినా ఇంకా ఎందుకు రాలేదో!

**కాన్రేడ్ :** (తల వంచుకుంటాడు)

**తల్లి :** ఏమన్నా చేశాడా ఏమిటి?

**కాన్రేడ్ :** ఏమన్నా చేయటమేమిటమ్మా! మహోపకారం చేశాడు. ఏమి ధైర్యం! ఎంత వచో నైపుణ్యం! మాట్లాడటంలో కించిత్తైనా ఒడుదొడుకులు లేవు. బీదసాదల దుర్గతిని చూచి కరిగిపోయిన కోమల హృదయం! బాలహృదయం! ఎంత ఆవేశం! మనమంతా ఒక సంఘంగా చేరాలి. ఆ సంఘానికి బలం చేకూర్చుకోవాలి. బాగా ధనికుల దౌష్ట్యాలను రూపుమాపే ప్రయత్నంలో ఉండాలి. ఎప్పుడు, సమాన ప్రాభవ వైభవాలను సంపాదించుకోవాలనీ, ఉద్బోధించాడు. పేదసాదలను, ధనధాన్యాలు శాశ్వతాలు కావని, మానరక్షణ ప్రాధాన్యమట. జన్మజన్మాంతరాలనుంచీ దీర్ఘ సుషుప్తిలో ఉన్న కూలీనాలీలను, మేల్కొల్పి వారి వారి అంతరాలను విభజిస్తూ స్వతస్సిద్ధముగా లేని ధనికుల ప్రాభవాన్ని నిరసించాడు. జ్ఞానతృష్ణ కలుగవలెనని హెచ్చరించాడు. అంతేనా ఇంకా...

**తల్లి :** ఎక్కడ మాట్లాడాడు?

**కాన్రేడ్ :** మైదానంలో నమ్మా!

**తల్లి :** (ఆశ్చర్యంతో) అక్కడికి వచ్చాడా! వాళ్ళ నాన్నకు తెలుస్తుందే?

**కాన్రేడ్ :** అవును. వచ్చాడు. మతులు మారిపోయేటట్లు మాట్లాడాడు. తరువాత మా అధ్యక్షుడు మహానాయకుని పోకడలున్నాయి కుర్రవాడిలో అన్నాడు కూడాను. అటువంటి పిల్లవాడు (చివర వినకుండా)

**తల్లి :** ఎవరు మాట్లాడనిచ్చారు?

**కాన్రేడ్ :** ఉత్సాహపూరితుడై తనంతట తానే మాట్లాడతానని అధ్యక్షుణ్ణి కోరాడు. సభలో ఏమి గందరగోళం చేస్తాడోనని ఆయన భయపడి మొదట్లో వీలు లేదన్నాడట.

నేను బాగా మాట్లాడగలను, నాకు కడుపులో ఎన్నో సంగతులు ఉన్నాయి. నేర్చుకున్నాను. ఇవాళ నన్ను తప్పకుండా మాట్లాడనీయాలి అని కాళ్లా వేళ్లా పడి బతిమలాడితే అధ్యక్షుడు అంగీకరించాడు. అంగీకరించినందుకు సభను రసప్రవాహంలో ముంచి తేల్చాడు. కూలీ నాలీల చక్షుగోళాల వెనుక తాండవించే ఆకటి మాటలకు తాను మాడిపోయి వినేవాళ్ళను మాడ్చి వెర్రెత్తి పోయేటట్లుగా ఉగ్రూత లూగించాడు. భావనలో ఎంత సాత్వికము! భాషలో ఎంత సౌమ్యత! ఉద్రేకము! అవిచ్ఛిన్న వాగ్ధోరణి!

**తల్లి :** (సంతోషము కప్పి పుచ్చుకుంటూ) జబ్బు పడ్డాడు. అందుకోసం వెళ్ళవద్దురా నాన్నా అంటే నేను ఇంట్లో పని చేసుకుండే సమయం కనిపెట్టి జారాడు. మిమ్మల్ని మైదానంలో చేరుకున్నాడు గామాలి!

**కామ్రేడ్ :** లేదమ్మా! పరుగెత్తుకుంటూ రొప్పుతూ వచ్చి త్రోవలోనే కలిశాడు  మొదట మా నాయకుడి పక్కన నిలవబడి ఆయనకు ఒక నమస్కారం చేసి జండా పట్టుకొని వచ్చే 'సూర్యం' ప్రక్కనే నడవటం మొదలు పెట్టాడు. మా కామ్రేడ్సంతా చిరునవ్వు చిందులాడే అతని ముఖం చూసి ఊరికే నవ్వించేవాళ్ళు. లేత బుగ్గలమీద గులాబి రంగు తరకలు కట్టేవి. నాయకుడు మెడ మీద చెయ్యివేసి, ఎవళ్ళ అబ్బాయివి నాయనా! అంటే 'ఏమండీ!' నన్ను కాసేపు ఆ జండా మోసుకో రానీయరూ అన్నాడట.

**తల్లి :** (చకితయై) పట్టుకొచ్చాడా ఏమిటి! వాళ్ళ నాన్న ఎక్కడైనా చూచారేమో! చంపేస్తారే!

**కామ్రేడ్ :** లేదమ్మా! లేదు! వచ్చేటప్పుడు మోసుకొద్దువుగానిలే అన్నాడాయన. కాదండీ ఇప్పుడే మోస్తాను అన్నాడట. దానికి మధ్యలో మార్చటానికి వీలు లేదు వచ్చేటప్పుడు నిన్ను తప్పకుండా పట్టుకు రానిస్తాను అంటే సంతోషించి అట్లాగేనని తల ఊపాడు.

**తల్లి :** (దృష్టి రోడ్డుమీదకు మార్చి మెడసారించి దూరంగా చూచి) మీటింగ్ ఇంకా అయిపోలేదా? అబ్బాయి ఇంకా రాలేదే!

**కామ్రేడ్ :** మీటింగ్ అయి చాలా సేపయింది. మీ అబ్బాయి బల్ల... దగ్గిర... ఉన్నాడు.

**తల్లి :** కారణం ఏమిటో! తెలియదు! కాస్తపోయి పిలిచి వస్తావా బాబు! వాళ్ళ నాన్న వచ్చే వేళ అవుతున్నది.

**కామ్రేడ్ :** (ముఖం ప్రక్కకు త్రిప్పుకొని దైన్య కంఠస్వరముతో) నేను పోతే మటుకు వస్తాడా అమ్మా! రాలేదు... అక్కడనే ఉన్నాడు.

**తల్లి :** అక్కడ ఏమి జరుగుతుందేమిటి? ఇంతాలస్యానికి.

**కామ్రేడ్ :** (ఆగుతూ ఆగుతూ) కాంగ్రెస్ పార్టీవారు, మేము కలిసి సభ చేస్తున్నాము. సభను ఒక వృద్ధ జంబుకం అగ్రాసనాధిపత్యం వహిస్తున్నాడు. ఆయన మా సోషలిస్టును కుర్రకుంకలు అనీ, ఎడ్డిమడ్డి మృగాలట 'పేదసాదలు వాళ్ళకు పరిపాలనలో హక్కేమిటి?' వీళ్ళకు ఎలా వస్తుందో చూస్తామన్నాడు. అంటే మాకు కోపం వచ్చి ధిక్కార సూచకంగా మేము ప్రక్కనే ఇంకో సభ చేస్తున్నాము. మీ అబ్బాయి మా సభలోకే వచ్చాడు. వినటానికి వచ్చిన జనంలో చాలామంది మా సభకే వచ్చారు.

**తల్లి :** తప్పేమున్నది అది వాళ్ళ వాళ్ళ ఇష్టం.

**కామ్రేడ్ :** కొంతసేపు సభ జయప్రదంగా సాగింది.

**తల్లి :** తరువాత?

**కామ్రేడ్ :** ఇంతలో పోలీసువాళ్ళు ఎప్పుడు వచ్చారో తెలియదు వెనకనుంచీ లాఠీచార్జి చేశారు. సభంతా చిందరవందర అయిపోయింది. కొంతమంది పరుగెత్తి పారిపోయి తలలు దాచుకున్నారు.

**తల్లి :** (రోడ్డుమీద ఎలక్ట్రిక్ లైటు వల్ల వచ్చేకాంతిలో అతని దుస్తులు పరీక్ష చేస్తూ) నాయినా! ఆ రక్తం అదేనా?

**కామ్రేడ్ :** (కంటికి నీరు వస్తుంది) అవును.

**తల్లి :** మా అబ్బాయి ఏడి మరి?

**కామ్రేడ్ :** ఆ బల్ల.... దగ్గిరనే.... ఉన్నాడు

**తల్లి :** దెబ్బలు తగిలినవా..?

**కామ్రేడ్ :** సభాపతి అతనికి తగలబోయే దెబ్బలన్నిటికీ తన తల అడ్డంపెట్టి శాయశక్తులా రక్షించటానికి ప్రయత్నించాడు.

**తల్లి :** ఎంత పుణ్యాత్ముడో గదా! ఆయనకు ఎట్లా ఉంది ఇప్పుడు.

**కామ్రేడ్ :** (కన్నీటి ధార) కళ్ళు మూశాడు.

**తల్లి :** మా అబ్బాయి ఆయన దగ్గిర కూర్చున్నాడా?

**కామ్రేడ్ :** (కొంచెము ఓదార్చుకొని) సభాపతి కళ్ళు మూయగానే ఎక్కడిదో ఒక లాఠీదెబ్బ వచ్చి మీ అబ్బాయి కణతకు తగిలింది. అబ్బాయి.... బల్ల దగ్గర...

**తల్లి :** (తిరిగిపోతూ ఉన్న కళ్లతో) ఆఁ!

**కామ్రేడ్ :** (ఆమె ముఖం చూడలేక జేబు రుమాలు అడ్డం పెట్టుకొని భోరుమని ఏడుస్తూ) చనిపోయి... నేలమీద..... ఉన్నాడు.

**తల్లి :** (పెద్ద కేకతో వీథి గుమ్మంలో వెనక్కు పడిపోయింది. బజారులో ఎలక్ట్రిక్ లైట్లన్నీ ఒక్క తడవగా ఆరిపోతాయి. ఆనాటి అమావాస్య చీకట్లో కళ్ళు పొడుచుకొని చూచినా, కనుపించినా కనపడని ఆకాశంలో నవజీవనం వెళ్ళబోస్తూ ప్రకాశవంతంగా మెరుస్తున్నది ఒక తార).

సమాప్తము

**అముద్రితం**

# సాక్షాత్కారము

(దృశ్యనాటిక)

**పాత్రలు : పోతరాజు, శ్రీనాధుడు, మాచమ్మ, మల్లన్న**

**కాలము: క్రీ.శ. 15వ శతాబ్ది మధ్యభాగము**

## ఒకటవ దృశ్యము

(ఓరుగంటి బ్రాహ్మణవీథి పూరిల్లు. మట్టితో అలికి ముగ్గులు పెట్టిన అరుగుమీద కోదండరామస్వామి దారు విగ్రహము. న్యగ్రోధ వృక్షచ్ఛాయలో ఒక వ్యాసపీఠం మీద వ్యాస భాగవతముంటుంది. దానిముందు పరిచిన కృష్ణాజినంమీద మహాకవి పోతరాజు కూర్చొని తదేక దీక్షగా, భక్తి పారవశ్యంతో భాగవత మూలాన్ని ఆంధ్రీకరిస్తుంటాడు.)

**పోతరాజు :** (సంస్కృత భాగవతములో నుంచి)

**"యత్కీర్తనం యత్స్మరణం యదీక్షణం**
**యద్వందనం యచ్ఛ్రవణం యదర్హణమ్**
**లోకస్య సద్యో విధునోతి కల్మషం**
**తస్మై సుభద్ర శ్రవసే నమో నమః"**

(శ్లోకాన్ని పఠించి నిమీలిత లోచనాలతో రామచంద్ర విగ్రహానికి నమస్కరించి క్రింది విధంగా ఆంధ్రీకరించి తాళపత్ర గ్రంథంలో ఘంటంతో నిబద్ధం చేస్తాడు)

**ఏ విభు వందనార్చనము లేవిభు**
**చింతయు నామకీర్తనం**
**బే విభులీలలద్భుతము లెవ్వని**
**సంశ్రవణంబు సేయదో**
**షావళి బాసి లోకము శుభాయత**
**వృత్తి చెలంగునంద్రునే**
**నావిభు నాశ్రయించెద నఘౌఘ**
**నివృత్తిదు భద్రకీర్తియున్-**

(నమ్రభావంతో మళ్ళీ నమస్కారం చేసి నీడ తనలో లీనమై పోతూ ఉండడం వల్ల ఒకమాటు ఆకాశం వైపుకు చూస్తాడు. ఆదిత్యుడు గగనరంగ మధ్యంలో గంభీర నాట్య భంగిమతో ప్రకాశిస్తుంటాడు)

**మాచమ్మ :** (లోపలినుంచి ప్రవేశిస్తూ) ఏమండీ. మీకే వెర్రిపడితే అదే వెర్రి. తిండీ తిప్పలూ లేవా ఏమిటి? అపరాహ్ణం దాటి ఎంతసేపైందో చూచారా? ఇకనైనా కనికరించి దేవతార్చనమ్ చేస్తారా?

**పోతరాజు :** (చిరునవ్వుతో తాళపత్రగ్రంథాన్ని కట్టి పెడుతూ) అమ్మీ! నా కాశీ కమండలం తెచ్చి పెట్టు. ఇక్కడున్నట్లుగా గంగకు వెళ్ళి వస్తాను.

(భార్య లోపలికి వెళ్ళుతుంది)

కోదండరామా! కోదండరామా!!

(వెలిగే కన్నులతో ఒక్కమాటు నాలుగువైపులా లేచి చూస్తాడు. భార్య ప్రవేశించి)

**మాచమ్మ :** ఇదుగో కమండలం. అదుగో అంగవస్త్రము దణ్ణెంమీద, నిన్నా మొన్నా ఉపవాసం. మరిచిపోయినారేమో! అనుష్ఠానం కొంచెం త్వరగా పూర్తిచేసుకోండి. నా ప్రాణాలు అన్నుబట్టి పోతున్నవి.

**పోతరాజు :** (కమండలము భార్యచేతిలో నుంచి అందుకుంటూ దణ్ణెం వైపుకు నడుస్తూ) నాలుగు దినాలైంది. ఉద్ధరిణెడు పచ్చిగంగ ఎరుగను. నిన్నా మొన్నటికే అల్లట తల్లటై పోతున్నావు పిల్లా!

**మాచమ్మ :** మీకేం మహాత్ములు. పవనపర్ణాంబుభక్షులు. మీతో నాకెక్కడి వంతు. మీరేమిటో మీ వ్రాసుకోవటమేమిటో. రెండో ప్రసంగం పట్టిందా? ఇతర ప్రపంచం పట్టిందా? ఈ మహాగ్రంథం ఎప్పటికి పూర్తౌతుందో గాని వేళపట్టుకు భోజనానికి నిద్రకూ మోమువాచిపోతున్నాము. మీరు మటుకు నోచుకున్నారా?

"చేసుకున్న వారికే గోవిందారామ
చేసుకున్నంతాయె గోవిందారామ"

**పోతరాజు :** అమ్మా మన కోదండరాముడి కృపవల్ల భాగవత సముద్రాన్ని ఈది బయటపడాలి గాని ఈ అన్నమయకోశాన్ని పోషించుకోలేక పోతామా? అదంతా ఆ మహాప్రభువు కరుణ వెంటనే వచ్చేస్తాను.

**(గంగకు బయలుదేరుతాడు)**

(భార్య అక్కడే చేటలో ఉన్న బాదమాకులు విస్తరి కుడుతూ గోవిందనామాల పాట పాడుకుంటుంది.)

**మల్లన్న :** (ఆదుర్దాగా ప్రవేశించి ఇల్లు నాలుగు మూలలా వెతుకుతుంటాడు.)

**మాచమ్మ :** అబ్బాయీ! మళ్ళీ వచ్చావు మేడికోల మరిచిపోయినావా ఏమిటి?

**మల్లన్న :** మామ రాలేదామ్మా!

**మాచమ్మ :** ఏ మామ నాయనా?

**మల్లన్న :** శ్రీనాథుడు మామ.

**మాచమ్మ :** ఏడీ! రాలేదే! వాడు బతికున్నాడా? పోనీ ఇప్పటికైనా అక్కయ్య బతికున్నదని జ్ఞాపకం వచ్చింది అంతే పదివేలు.

**మల్లన్న :** మేనా మన ఇంటికి రాలేదూ? ఈ ఊరి పక్కగా మామ ఎక్కడికైనా వెళ్లుతున్నాడేమో!

**మాచమ్మ :** ఎవరినైనా జూచి మామనుకున్నావేమో!

**మల్లన్న :** ఎవరినో చూడటమేమిటి? అంతకథ జరిగితే ఉఁ – ఇంకా రాలేదేం.

**మాచమ్మ :** ఏం కథ జరిగిందేమిటి?

**మల్లన్న :** మామయ్య మేనా ఎక్కి,

**మాచమ్మ :** ఆ ఁ......

**మల్లన్న :** మన పొలిమేర పొలం గట్టు మీదగా వస్తున్నాడమ్మా!

**మాచమ్మ :** నిన్నుజూచి మేనాలో పిలిచి ఎక్కించుకోలేదురా? ఏదో సామెతలా ఉంది ఎందుకంటాడేం!

**మల్లన్న :** రాజాస్థానాలల్లో భట్రాజులలాగా కవిత్వం చెప్పి ప్రాభవం సంపాదించిన ఆయన కళ్లకు ఎక్కడో పొలం దున్నుకొంటూ పొట్ట పోసుకుండే మనం కనబడతామా, దానికేం కనబడక పోతేమానె–

**మాచమ్మ :** ఏం చేశాడేమిటి?

**మల్లన్న :** నన్ను దూరాన్నేజూచి గుర్తుపట్టి సగర్వంగా మేనా ఆపించి పగటిదివ్వె వెలిగించమన్నాడు. ఒక పడుచు కోయపిల్ల దారిన పాడుకుంటూ పోతుంటే పిలిచి ఒక మాడ విసిరి పారేశాడు నాకు కనబడేటట్లుగా.

**మాచమ్మ :** వాడు రమ్మనకపోతే మాని, నీవైనా పోయి 'ఎక్కడినుంచి మామా' అని పలకరించక పోయినావా?

**మల్లన్న :** ఎందుకు పలకరించాలేం? నేను మటుకు తక్కువ తిన్నానా? ఆయన గొప్ప ఏమిటో కొంచెం చెపుదూ వింటాను – లేదని ఎందుకనాలి. ఉంటే ఆయన్నే ఉంచుకోమను.

**మాచమ్మ :** అనవసరంగా ఎందుకురా ఇంత ఉక్రోషం. నిన్నేం తక్కువ చేశాడని.

**మల్లన్న :** అవమానించటానికి యత్నించాడు.

**మాచమ్మ :** నిన్నేమన్నా మాటన్నాడా?

**మల్లన్న :** మాటనకపోతే సరా! నా దారిని నేను పొలం దున్ను కుంటుంటే ఇష్టముంటే మర్యాదగా పిలిచి మాట్లాడాలి లేదా తన దారిని తాను పోవాలి. వెర్రిడాంబికం నా దగ్గరనా. చూడు  నా ప్రజ్ఞ అన్నట్లుగా మేనా బోయీలను ఒకవైపు మానేయించి నడిపిస్తాడా!

**మాచమ్మ :** నడిచిందిరా మేనా నాయనా? ఈ విద్యంతా వాడికి మీ నాన్న నేర్పిందేలే!

**మల్లన్న :** నాకూ మానాన్న నేర్పలేదు మరి. నేను మటుకు ఊరుకున్నానా? అరక ఎద్దును ఒకదాన్ని ఒదిలిపెట్టి పొలం దున్నించాను.

**మాచమ్మ :** ఆయనకు అన్ని మంత్రాలు రాబట్టేనా ఇలా ఉన్నాము – అయితే అరకవైపు మామ చూచాడా?

**మల్లన్న :** ఆఁ చూచి, బోయీలను రెండోవైపు కూడా విడిచి పెట్టమని మేనా నడిపించాడు.

**మాచమ్మ :** తరువాత నీకేం చెయ్యాలనో తెలియలేదుగామాలి.

**మల్లన్న :** అబ్బా! ఈపాటి క్షుద్రశక్తికే భయపడ్డాననుకుంటున్నావేం, ఒక్కమాటు భూదేవిని మనస్సులో స్మరించి రెండో ఎద్దును కూడా వదిలిపెట్టి అరక నడిపించాను – ఊరుకుంటానా మరి.

**మాచమ్మ :** తరువాత?

**మల్లన్న :** ఏముంది. మేనాలో ఉన్న అంత మామా అమాంతంగా దిగివచ్చి కొంటెతనంగా వెనక ఎరగనట్లు 'ఎవరబ్బాయివిరా నీవన్నాడు' – మనస్సులో చేయిపెట్టి కలిచినట్లయింది నా పని. ఆపుకోలేక రాజాస్థానాలల్లో కవితా సేవకు కుదరలేక కేదారఖండాన్ని నమ్ముకున్న ఒక కర్షక కవి కుమారుణ్ణన్నాను – పెడసరంగా.

**మాచమ్మ :** ఎందుకన్నావు ఆ మాట. వాడికి కోపం రాదూ?

**మల్లన్న :** ఏం వస్తే? నన్నేం తలగొట్టి మొలేస్తాడా?

**మాచమ్మ :** అయినా వాడు కాస్తకూ కూస్తకూ కోపం తెచ్చుకునే స్వభావం కలవాడు కూడా కాదులే. ఆc

**మల్లన్న :** ఓరి నీవట్రా మల్లన్నా? ఓరి నీ తస్సదియ్య ఎంతవాడివైనావురా? నేనెవరినో ఎరుగుదువా? ఎప్పుడో చిన్నతనంలో చూచానురా? చిన్నప్పుడు నీచేత నా నైషధంలో పద్యాలు వల్లె వేయించే వాణ్ణి మా ఇంటికి వచ్చినప్పుడు అని మంచి చేసుకొని మేనాలో ఎక్కు ఇంటికి పోదామన్నాడు. నీవు పద, నేను ఎడ్లకు మేతవేసి నీడనకట్టి వస్తానన్నాను.

**మాచమ్మ :** పాపం. మేనాఎక్కి రాకపోయినావా? వాణ్ణి ఎంత చిన్నబుచ్చావురా?

**మల్లన్న :** నన్ను చిన్నబుచ్చటం నీకు నచ్చిందేం? ఇంకా ఇంటికి చేరలేదే, అరఘుడియైనా. మనం పేదవాళ్ళమనీ మన ఇంట్లో మర్యాదలు సక్రమంగా జరగవనీ ఇంకెవరింట్లోనైనా విడిది దిగారేమో మామగారు.

**మాచమ్మ :** మల్లన్నా! మామను ఎంత అన్యాయం చేస్తున్నావురా!

**మల్లన్న :** ఇంతసేపైతే మరి ఎక్కడికిపోయి ఉంటాడంటావు – ఆc ఎక్కడికేమిటి? మరిచి పోయినాను. ఉందిగా మా అత్త భోగినీదేవి. దేశదేశాల నుంచీ తెచ్చిన చీరెలూ, సారెలూ ముందు అక్కడ చెల్లించుకోరావద్దూ?

**మాచమ్మ :** అది గోపాలోత్సవాలకు రాచకొండ వెళ్లిందటగా. దాని ఇంటికెందుకు వెళ్ళుతాడు. మా ఇంటావంటా లేవే అటువంటి గుణాలు. ఎందుకురా అన్యాయంగా అంతంత అభాండాలు వాడినెత్తిన వెయ్యటం?

**మల్లన్న :** పాపం! మీ తమ్ముడు కేవలం శ్రీరామచంద్రమూర్తి – నీకేం తెలుసు దేశం ఏమని చెప్పుకుంటున్నదో మామనుగురించి – పోనీ ఒక సంగతి ఆలోచించు. ఇన్ని ఆస్థానాలు తిరిగి, ఇంతమంది ధనికులను ఆశ్రయించి చేసిన సంపాదనంతా మీ తమ్ముడు కేవలం శ్రీశుకులే అయితే ఏం చేశాడంటావు.

**మాచమ్మ :** ఆఁ ఈలోకం చూచి వచ్చింది.

**మల్లన్న :** (ఉక్రోషంతో) లేదు. నన్ను చెప్పమన్నావా. లంకెబిందెలకేసి పడిపోయిన కొండవీటి కోటకొమ్మల్లో పాతేయించాడు – రాజమహేంద్రవరము నుంచీ అయ్యగారు ఎందుకు స్వస్తి చెప్పారో విన్నావో 'రన్ని' విషయంలో రాజుగారికీ ఈయనకూ రక్తపాతాలదాకా వచ్చిందట–

**మాచమ్మ :** పోనీ – నీవన్నట్లే అదంతా మనకెందుకొచ్చింది చెప్పు. మా నాన్నకు ఒక్కడైనా రత్నం. ఇంత వృద్ధిలోకి వచ్చాడు. పదిమంది పెద్దల్లో తిరగనేర్చాడు. తండ్రి తాతల పేరు నిలువ బెడుతున్నాడు. ఏంచేస్తేనేం. సంపాదనంతా ఏం చేస్తేనేం? – నీకు పిల్లనిచ్చేటప్పుడు కట్నమివ్వలేక పోతాడనేనా నీ దిగులు, ఆ భయం పెట్టుకోకు.

**మల్లన్న :** పిల్లిని చంకన వేసుకొని తిప్పినట్లు ఊరూరా పిల్లను తిప్పుతున్నాట్ట. పట్టణాలల్లో నిముషానికి ఒక కొత్తపోకడతో సింగారించుకుంటూ సీతాకోక చిలుకలాగా పెరిగే ఆ అమ్మాయిని అంటగట్టుకుంటే మన కాపురం నెగ్గినట్లే.

**మాచమ్మ :** అయితే మేనరికం పోగొట్టుకుంటాముట్రా.

**మల్లన్న :** 'నందోరాజా భవిష్యతి' – ఇప్పుడెందుకా విషయం.

**మాచమ్మ :** వాడే వస్తే ఈ తడవ వచ్చే కార్తికమాసంలో ముహూర్తం పెట్టించమని అడుగుదామనుకుంటున్నాను.

**మల్లన్న :** అప్పటికిమల్లె మనకు డబ్బువస్తుందా ఏం?

**మాచమ్మ :** అంతగా మనకు అప్పటికి రాకపోయినా లేకపోయినా మనకయ్యేది కూడా వాడే ఎక్కడనో తెచ్చిపెడతాడు.

**మల్లన్న :** అంత ఖర్మం మనకేం పట్టింది. భూదేవి చల్లగా చూడాలిగాని. నవ్విన మన నాపచేనే పండదుటే–

**(కాహళధ్వని ఒకటి వినిపిస్తుంది)**

**మాచమ్మ :** గంగకు స్నానానికని వెళ్లారు మీనాన్న. ఇంతవరకు అతీగతీ లేదు. అదుగో కోదండరామ స్వామి ఆలయంలో అర్చన అవుతున్నట్లున్నది.

**మల్లన్న :** (విడ్డూరంగా) అది స్వామి ఆలయంలో నుంచి కాదు వినిపిస్తున్నది. మీ తమ్ములు శ్రీనాథ కవి సార్వభౌములవారి లాంఛనం. ఈమధ్య విజయనగరంలో కర్ణాటరాజు కనకాభిషేకం చేసి ఆయనకు ఇచ్చాడులే ఈ లాంఛనం.

**మాచమ్మ :** అయితే మావాడు కర్ణాటక చక్రవర్తిని కూడా ఎరుగునన్నమాట! చూచావా మామయ్య పేరెత్తితే ఒంటి కాలిమీద వస్తావు గాని వాడి వెంటపోతే ఇటువంటి గౌరవాలన్నీ మీ నాన్నకు చేయించడురా మా వాడు. వాడి పొళకువంటే గిట్టదాయె ఆ మనిషికి.

**మల్లన్న :** రాజులను ఆశ్రయించటానికి ఆయన మనస్సే అంగీకరించాలి గాని అప్పుడు మీ వాడూ అవసరం లేదు మా వాడూ అవసరం లేదు. అయినా మహాకవులు లాంఛనాల కోసం, రాజబిరుదాల కోసం కవిత్వం చెపుతారటమ్మా. ఏనాటికైనా మహారాజులే మా నాన్నగారి కోసం మన ఇంటికి రావలసిందేగాని ఆయన వాళ్ల దేవిడీ గుమ్మాలు దాటుతారా?

**మాచమ్మ :** చూస్తున్నాను గదా మల్లన్నా, ఎప్పుడు బట్టినా సరిగా ఆ తండ్రికి కొడుకువనిపిస్తావురా. డబ్బున్న వాళ్ళంటే గిట్టదు. డబ్బు సంపాదించటమంటే గిట్టదు. ఒక ముచ్చటా లేదు. అచ్చటా లేదు. ఎన్నాళ్ళూ కాపురం చేసినా కట్టుకోను ఓ మంచి బట్టా పెట్టుకోను ఓ నగ! మా వాళ్ళు పెట్టిన పులిచేరు అమ్ముకున్నారు గదా? ఈ పుస్తెలతాడూ నేను మూసివాయినాల ముత్తైదులాగా మిగిలాను.

**మల్లన్న :** (నవ్వుతూ) అయితే నేను ఒక మాట చెప్పనా? నేను తండ్రికి తగ్గ కొడుకునైతే నీవు అక్షరాలా ఆ తమ్ముడికి తగ్గ అక్కవేనమ్మా!

**మాచమ్మ :** తప్పేముంది. ఎవరి వాళ్ళలాగా వాళ్లుంటారు.

**మల్లన్న :** ఎలాగైనా మొదటినుంచీ మీ వంశం గొప్పదే.

**మాచమ్మ :** మీ వంశం ఇంకా గొప్పదిగా? అంతా బ్రహ్మజ్ఞానులు. ఉగ్గుబాలతోటే వేదాంతం రంగరించి పోస్తారు. మీ ఇంట్లో– (దూరాన శ్రీనాథుణ్ణి చూచి) అదుగోరా మామయ్య.

ఒక మనిషి నెత్తి మీద పెద్ద మేదర పెట్టె పూరి వసారాలో దించి వెళ్ళిపోతాడు. మాచమ్మ లోపలికి పోయి కాళ్ళకు నీళ్ళు తెచ్చి చెంబు వాకిట్లో పెడుతుంది. శ్రీనాథుడు ప్రవేశించి కుళాయి తీసి చిలక కొయ్యకు తగిలించి “ఒరేయ్. మీరు ఆ నీడలో కూర్చోండి” (నీళ్ళతో కాళ్ళు కడుక్కుంటాడు).

**మాచమ్మ :** (నీళ్ల చెంబుతో) అబ్బాయీ! అక్కయ్య ఉన్నదనుకున్నావా – ఊడిందను కున్నావా?

**శ్రీనాథుడు :** ఏం మల్లన్నా! నాకంటే నీవే ముందు చేరుకున్నావే.

**మల్లన్న :** (గర్జితంగా) మీరు ఊళ్లో చూడవలసిన వాళ్లనందరినీ చూచివచ్చేటప్పటికి ఆలస్యమైనదను కుంటాను. నేను అడ్డదారిని త్వరగా వచ్చేశాను.

**శ్రీనాథుడు :** అక్కయ్యా! అల్లుడు బలే గట్టివాడే – మేము ఇద్దరమూ పొలిమేరలోనే కలుసుకున్నాం.

**మాచమ్మ :** ఏమో నాయనా మరి నీ పిల్ల వీడితో ఎలా నెగ్గుకోవస్తుందో – అయిదేళ్ళ నాడు నవమికి రావటమే తప్ప మళ్ళీ చీటి ముక్కైనా వ్రాశావు కాదు.

**శ్రీనాథుడు :** ఏదీ – నేను ఒకచోట స్థిరంగా ఉన్నదెప్పుడు? అమ్మ పోయినప్పటి నుంచీ మనస్థితి ఏమీ బాగాలేదు. కొంతకాలం దేశాటనం చేస్తే బాగుంటుందని కొండవీడు వదలి బెట్టాను..

**మాచమ్మ :** అయితే మా మేనగోడలు సరస్వతి ఎక్కడ ఉందిరా? దాన్ని ఒక మాటు తీసుకొచ్చి తలంటి పోసి పంపిద్దామంటే పడిందికాదు. పాపం తల్లి పోయిన పిల్ల. దానికి మాత్రం ఏ నూరుమంది ఉన్నారు.

**శ్రీనాథుడు :** అది వాళ్ల అమ్మమ్మ గారింట్లో ఉన్నది. దాన్ని చూచికూడా ఆరు నెలలు దాటింది. ఇదుగో అన్నిటికీ నేను దేశంలో లేక పోవటమే.

**మాచమ్మ :** నీవు ఎక్కడికో వెళ్ళేటప్పుడు పిల్లను అమ్మమ్మ గారింట్లో ఉంచకపోతే నా దగ్గిర వదిలిపెట్టి వెళ్ళకూడదూ! నీవు ఉంచకూడదా? మేము ఉంచుకోకూడదా? – అవునులే – పెద్దవాళ్ళము పోషించలేము. పెద్దది ఆమె ఎప్పుడు పోయిందో నీకూ నాకు దూరమయినది.

**(కంట తడి పెడుతుంది)**

**మల్లన్న :** మామగారూ! ఏ ఏ దేశాలు చూచారేమిటి?

**మాచమ్మ :** 'మామగారు' అదేమిటి 'మామ' అను నాయనా!

**శ్రీనాథుడు :** ఒక దేశమేమిటి? యావద్భారతమూ తిరిగి వచ్చాను. చూడని ఆస్థానమూ, ఆడని తీర్థమూ లేదు.

**మాచమ్మ :** మాటమాత్రమన్నా అన్నావు కాదురా. నీతోటి వచ్చి దేశమన్నా చూచేదాన్ని.

**శ్రీనాథుడు :** మహారాజులతో యాత్రకు బయలుదేరినవాణ్ణి 'నాకూ–నీకూ' ఎక్కడ కుదురుతుంది.

**మాచమ్మ :** నాయనా! అన్నిచోట్లా తీర్థవిధులు జరిగించావా.

**శ్రీనాథుడు :** అందులో లోపం చేస్తానా? అమ్మా నాన్నలకు ఏం కొదవని?

**మాచమ్మ :** వాళ్లకే కొదువాలేదు. ఉన్నన్నాళ్లు సుఖంగా బ్రతికారు. ఆ కన్నకొడుకు చేతిమీదుగా దాటి పోయినారు. ఒక్కడివైనా ఇంత పేరు ప్రతిష్ఠలలోకి వచ్చావు.

**మల్లన్న :** మామా! ఈ దేశాలన్నీ తిరిగేటప్పుడు ఎక్కడైనా నీకు మా అమ్మ గుర్తు వచ్చేదేనా?

**మాచమ్మ :** చూడు వాడి చమత్కారం. ఆటలు పట్టిస్తున్నాడు మామను.

**శ్రీనాథుడు :** మల్లన్నా! కంచిలో నీకు ఒక మంచి జరీ కుళ్లాయి కొన్నాను. కాశ్మీరంలో మీ నాన్నగారికి ఒక శాలువా పట్టుకొచ్చాను. మా అక్కయ్యకు ఏవో చాలాచోట్ల చాలా చీరెలూ రవికలూ పట్టుకొచ్చాను.

**(మేదర బుట్టవైపు చూస్తాడు)**

**(దొడ్డిగుమ్మం తలుపు చప్పుడు)**

**మాచమ్మ :** (శ్రీనాథుడితో) అబ్బాయీ అడుగో మీ బావగారు గంగనుంచి మడి కట్టుకొని వచ్చి దొడ్డిగుమ్మం తలుపు తడుతున్నారు. తరువాత చూపిద్దువుగాని ఇప్పటికే చాలా పొద్దు పోయింది. మడికట్టుకో (మల్లన్నతో) అబ్బాయీ మామను భావి దగ్గరకు తీసుకొని పోయి స్నానానికి నీళ్లు తోడి అందించు.

**శ్రీనాథుడు :** అల్లుడైనందుకు ఆ మాత్రం పరిచర్య చేయడూ? లేకపోతే పిల్ల నిస్తానా?

**మల్లన్న :** మామా ఇటు – (మల్లన్న దారిచూపిస్తుంటే శ్రీనాథుడు వెనుక నడుస్తాడు) (మళ్లీ దొడ్డిగుమ్మం తలుపు చప్పుడు విని మాచమ్మ తలుపు తీయటానికి వెళ్లిపోయింది).

## రెండవ దృశ్యము

(శ్రీనాథుడు ప్రయాణ సన్నాహంలో ఉంటాడు. ప్రాతః సమయంలో మాచమ్మ గంగకు మంచి నీళ్లకుపోయే ఉద్దేశంతో చంకన బిందెపెట్టుకొని ఇంట్లో నుంచి సావట్లోకి వచ్చి!

**మాచమ్మ :** అబ్బాయీ! ఏమిటి అప్పుడే ఆ పెట్టె సర్దించడం వచ్చినట్లా పెట్టినట్లా. అంత తీరుబడి లేకపోతే ప్రస్తుతము రావటమే మానుకోక పోయినావూ? వచ్చినందుకు రెండు దినాలైనా....

**శ్రీనాథుడు :** ఇవాళటికి నాలుగో నాటి సాయంకాలానికల్లా రాచకొండ చేరుకోవాలి. ఈతడవకు నన్ను ఆపకక్కయ్యా!

**మాచమ్మ :** ఏమంత అవసరము. రెణ్ణాళ్ళు ఆలస్యమైతే ముంచుకోబోయ్యేది ఏమన్నా ఉన్నది గనుక.

**శ్రీనాథుడు :** (అవీ ఇవీ సర్దుకుంటూ) రాచకొండలో గోపాలోత్సవాలకు సింగభూపతి ఆహ్వానిస్తే నేనూ తిప్పయసెట్టీ విక్రమ సింహపురం నుంచి బయలుదేరి వెళ్లుతున్నాము. అతడు అలాగే వెళ్ళిపోయినాడు. నేను నిన్ను చూచి వెంటనే బయలుదేరి వస్తానని చెప్పి ఇలా వచ్చాను.

**మాచమ్మ :** పోనీ ఇవాళ సాయంత్రందాకా నైనా ఉండకుండా అదేమిట్రా – ఆగర్భ శ్రీమంతు అతగాణ్ణి కూడా మన ఇంటికి తీసుకోరాక పోయినావూ, మీ బావగారికీ అతనికీ పరిచయం ఉంటే ఎన్నిటికైనా మాకు ఉపయోగించేది.

**శ్రీనాథుడు :** నిజమే, నాకు ఆ ధోరణే లేకపోయింది. ఔను అతని పరిచయము సామాన్యులకు లభించటము చాలా దుర్లభము. అతడు కేవలం ఆగర్భ శ్రీమంతేకాదు. మంచి రసికుడు. విశేషించి కవితాభిమాని. అయినా ఇంతలో ముంచుకో పోయిందేముంది. మరిచిపోయినాను బావగారు కూడా రాచకొండ గోపాలోత్సవాలకు వస్తారుగా. అక్కడ అతని పరిచయభాగ్యం కలిగిస్తాను. రాజు ఆహ్వానం పంపించాడా?

**మాచమ్మ :** వచ్చినట్లు లేదురా అబ్బాయీ?

**శ్రీనాథుడు :** ఇంకా గడువు చాలా ఉన్నదిగా. మొదటినుంచీ సింగభూపతి ఆశ్రయంలో ఉన్న కవిగూడానై పోయె బావగారు. ఆహ్వానం పంపించకుండా ఉండరు.

**మాచమ్మ :** ఏమో నాయనా? మొదటి మాట మీ బావగారికి ఎక్కడ ఎట్లా ప్రవర్తించాలో కూడా తెలియదు. భోగినీ విషయంలో ఎవరితోనో ఈన ఏదో అన్నాడనీ దానిమీద భూపతి మందలిస్తే ఈన ఏదో పెడ సమాధానం చెప్పాడట. బాగా మనస్పర్థలు ఏర్పడ్డట్లున్నవి. ఈన మాటలను బట్టి చూస్తే ఆహ్వానం వస్తుందో రాదో!

**శ్రీనాథుడు :** సింగభూపతి ఇలాటి చిన్నవిషయాలు మనస్సులో పెట్టుకుండేవాడు కాదు. పైన బావగారంటే విశేషాభిమానం ఉన్నట్లు విన్నాను కూడా. ఆయన మనస్సులో స్పర్థ ఉంటుందని అనుకోను – నేను ఇవాళనే బయలుదేరి వెళ్లుతున్నానుగా. భూపతితో మాట్లాడి బావగారికి వెంటనే ఆహ్వానం వచ్చేటట్లు చేయిస్తానుగా.

**మాచమ్మ :** ఒకవేళ వచ్చినా ఈన బయలుదేరవద్దూ.

**శ్రీనాథుడు :** దానికి ఎవరేం చేస్తారు – పోనీ మరొక సమయంలో తిప్పయసెట్టి పరిచయం చేస్తాను.

**మాచమ్మ :** అబ్బాయీ! అయితే ఉత్సవాలలో ఆధ్వర్యం నీదేనా ఏమిట్రా.

**శ్రీనాథుడు :** అందుకనే తిప్పయసెట్టి నేనూ ఇంతముందుగా బయలుదేరి రావటము. ఉత్సవ కలాపాలన్నీ వచ్చే పౌర్ణమికి పూర్తి కావాలి. మల్లన్న ఏడిఅక్కయ్యా! బావగారితో వాడుకూడా వస్తే ఎంతో బాగుంటుంది. ఏదో సందర్భంలో సెట్టికీ, సింగభూపతికీ మా కాబోయే అల్లుడని చూపిస్తాను.

**(దొడ్లో నుంచి మల్లన్న పొలానికి పోవటానికి సిద్ధపడి బయటికి వచ్చి)**

**మల్లన్న :** మామా! పొలిమేర చేలో గుంటక తోలటం కొంత మిగిలిపోయింది. త్వరగా పూర్తి చేసుకువస్తాను.

**శ్రీనాథుడు :** అబ్బాయీ! నేను ప్రయాణమౌతున్నాను. నీవు కూడా మీ నాన్నగారితో పాటు రాచకొండ గోపాలోత్సవాలకు తప్పకుండారావాలి. నడిపించేది నేనే.

**మల్లన్న :** ఇంత ఆలస్యం చేశావేం మామా! నిన్న సాయంత్రమే బయలుదేరక పోయినావేం.

**మాచమ్మ :** ఏమో! నాయనా, చెప్పుల్లో కాళ్లు పెట్టుకొని వచ్చాడు. వెళ్లక తప్పదట.

**మల్లన్న :** వెళ్లక తప్పదూ? ఎందుకు తప్పదో చూతాం. ఉత్సవాలెప్పుడో ఇంకా మాసం పై చిలుకుంటే వీరంతా ఎంత కార్య నిర్వాహకులైనా ఇప్పటినుంచే ఏం చేస్తారేం. ఆయన ఉండదలచుకోక ఇదొక సాకుచెప్పుతున్నాడు గాని.

**శ్రీనాథుడు :** కాదులే మల్లన్నా, నన్ను బలవంతం చెయ్యవద్దు. నేను ఒక్కణ్ణేకాదు, తిప్పయ్యసెట్టి కూడా బయలుదేరి వచ్చాడు. అతడు నాకంటే ముందే రాచకొండ చేరుకుంటాడు.

**మాచమ్మ :** అబ్బాయీ! తిప్పయసెట్టి అంటే నీకు తెలుసునా మామకు చిన్నప్పటి నుంచీ స్నేహితుడు. గొప్ప శ్రీమంతుడు.

**మల్లన్న :** మనిషినైతే చూడలేదుగాని తిప్పయ్య పేరు వినకపోవటమేం. తిరగటి కల్లులాగా దేశదేశాలూ తిరిగి కర్పూరం, చందనం, పునుగు జవ్వాజి అదే పేర్లతో రాజుల నందరినీ దోచుకుంటుంటాడు. ఆ రాజులు మనబోటి కర్షకులను దోచుకుంటుంటారు.

**శ్రీనాథుడు :** మల్లన్నా! అది దోపిడీ ఏమిటి, వ్యాపారానికి లక్షణం. వాళ్ళు ధనవంతులు కాక పోతే దేశానికి వస్తు సంభారాలు వచ్చే వీలేలేదు. రాజులు ప్రజల మీద పన్నులు వేసి గ్రహించక పోతే పరిపాలనే లేకుండా అరాజకమైపోతుంది దేశం.

**మాచమ్మ :** మల్లన్నా! ఎలాగైన మామను ఇవాళ పోనీయకుండా ఆపే భారం నీది.

**శ్రీనాథుడు :** అక్కయ్యా! ఎందుకీ నిష్ఠూరం వృథాగా! రానా పోనా?

**మల్లన్న :** అమ్మా! ఎలా పోతాడో చూస్తాను. నేను పొలం పని మానుకుంటాను. పోనీ రేపౌతుంది. నీవు త్వరగా గంగకు వెళ్ళి రాపో మడికట్టు కుందువుగాని.

**మాచమ్మ :** అబ్బాయీ, పొద్దున్నే మీ నాన్న పోతవరం వెళ్లారు. ఆయన వచ్చేలోపల మామయ్యకు మీ నాన్నగారు వ్రాసిన కవిత్వం వినిపించు తప్పులుంటే దిద్ది సరిచేస్తాడు.

**(బిందెతో గంగకు బయలుదేరుతుంది)**

**శ్రీనాథుడు :** మల్లన్నా! అనవసరంగా ఇక్కడ నేనుఆగిపోటమూ, అక్కడ మానెత్తిన తలకు మించిన బరువు కాచుకో కూర్చోటమూ.

**మల్లన్న :** కొంత కాలంనుంచి మా నాన్నగారు భాగవతము ఆంధ్రీకరిస్తున్నారు. అది నీవు వినకుండా పోవటానికి వీలులేదు.

**శ్రీనాథుడు :** ఆఁ...... సాహసమో...... శక్తో...

**మల్లన్న :** సాహసమో, శక్తో.... వినాలి. ఇప్పుడే వస్తాను.

(లోపలికి పోయి ధావళీకట్టుకొని భాగవతము తీసుకోవస్తాడు. శ్రీనాథుడు ఈ లోపల అటూ ఇటూ పచారుచేస్తూ ఆలోచిస్తుంటాడు)

(కృష్ణాజినం మీద మడికట్టు కొని కూర్చొని మల్లన్న గ్రంథ ప్రారంభం చేయబోతూ)

**మల్లన్న :** మామా! మొదలుపెట్టమన్నావా?

**శ్రీనాథుడు :** (పచారుచేస్తూనే) అబ్బాయీ! మీ నాన్న కవితా ధోరణి ఏమన్నా మారిందా? లేకపోతే వెనకటి వేళ్ళలోనే నడుస్తున్నదా బండి.

**మల్లన్న :** వెనుకటి వేళ్ళలోనంటే?

**శ్రీనాథుడు :** భోగినీ దండకమూ, వీరభద్ర విజయమూ రెండు నడిచిన వేళ్లు–

**మల్లన్న :** ఏమో అదంతా నీవే చెప్పాలి.

**శ్రీనాథుడు :** శైలిలో మార్పేమీ నీకు కనిపించలేదా! ఔచిత్యాన్ని ఆదరించటమూ, అనౌచిత్యాన్ని పరిహరించటమూ, భావాన్ని ఉపలక్షించటమూ వీటికేమన్నా ప్రయత్నించాడా. 'ముక్కస్య ముక్కార్థః' కాదుగదా?

**మల్లన్న :** ఆయనకు ఈ విషయమైన భ్రాంతే ఉన్నట్లు నాకు తోచలేదు.

**శ్రీనాథుడు :** మరి?

**మల్లన్న :** ఒకనాడు ప్రాతఃస్నానం చేసి గంగ నుంచీ యింటికి వచ్చి 'మల్లన్నా ఘంటం తాళపత్రం త్వరగా తీసుకోరా అన్నారు. తీసుకోవచ్చాను. తదేక దృష్టితో ఏ విధమైన స్మరంతీ లేకుండానే చెప్పేది వ్రాయమన్నారు. వెంటనే చెప్పండి అన్నాను. ఆయన–

> **"పలికెడిది భాగవతమట.**
> **పలికెడివాడు రామభద్రుండట నే**
> **పలికిన భవహరమగునట**
> **పలికెద వేరొండుగాథ పలుకునేలా"**

అని చెప్పి దేవతా ప్రార్థనము చేశారు. నేను వ్రాశాను.

**శ్రీనాథుడు :** వీరభద్ర విజయం వంటి వీరశైవ కావ్యాల మీద నుంచి ఒక్కమాటుగా మనస్సు భాగవతం మీదికి ప్రసరించి వేదాంతవీథి విహారం చేయటానికి సంకల్పించింది.

**మల్లన్న :** ఏమో మామా! ఈ పద్యమేమిటి ఈ దైవప్రార్థన మేమిటి నాన్నా అని ప్రశ్నించాను. ప్రశ్నిస్తే – స్నానంచేసి గంగ ఒడ్డున తారకమంత్రం జపించుకుంటూ కూర్చున్నానురా అబ్బాయీ, ఇంతలో కనుచూపు మేరలో మెరపుచెంగట ఉన్న మేఘములాగా ఒక దేవతా స్త్రీతో ఒక శ్యామసుందర మదనమోహనమూర్తి నా కళ్ళకు కట్టింది. అటే తదేక దృష్టితో చూస్తూ ఉండగా కొంతసేపటికి ఎక్కడో చూచినట్లు అనుమానం కలిగింది. స్మరణకు వచ్చి ప్రభూ! అని కేక వేసేటప్పటికి శ్రీ సీతారామ పరబ్రహ్మము నా చేరువకు వచ్చి 'పోతన్నా ఏ మహాకవి చేతనైనా భాగవతము ఆంధ్రీకరణము చేయిద్దామనే సంకల్పంతో వచ్చాను. నీవు చేస్తే బాగుంటుందని కోరటానికి వెతుక్కుంటూ వచ్చాను. నాకు బాసట ఇస్తేగాని వెళ్ళిపోనని చేతులో చేయివేయించు కుని తిరోహితుడై నాడురా ప్రభువు' అని చెప్పారు.

**శ్రీనాథుడు :** (వ్యంగ్యగర్భితంగా) ఒక కావ్యమన్నా కవి సమాజాల నోట పడకుండానే, మహారాజుల మన్నన పొందకుండానే బావగారు రామచంద్రమూర్తి మమతతో అర్థించి కావ్యాన్ని వ్రాయించుకోదగ్గ మహాకవి ఐనారు. అందుకు సంతోషము.

**మల్లన్న :** ఈ రాజులూ తరాజులు మన్నిస్తేనేం మన్నించకపోతేనేం, చూస్తున్నాంగా – లోకంలో ప్రచారంలో ఉన్న కవి సమాజాలన్నిటినీ, చిత్తచాంచల్యంతో చెలరేగుతూ ఉన్నవి. కపి సమాజాలంటే బాగుంటుంది. అటువంటి వాటి నోటికెక్కితేనేం ఎక్కకపోతేనేం. రాజాధిరాజు, రాజ పరమేశ్వరుడు రామచంద్రమూర్తి స్వయంగా వచ్చి అర్థించిన తరువాత.

**శ్రీనాథుడు :** (గర్భితంగా) తనను మహాకవిని చేసిన రామచంద్రమూర్తిని బావగారు కృతిపతినైనా చేయటానికి సంకల్పించుకున్నారా?

**మల్లన్న :** మామా అది వేమభూపతి కృపావీక్షణం లేనిదే ఘంటం బెత్తెడు సాగని నీకది నచ్చుతుందా.

**శ్రీనాథుడు :** (చిరునవ్వుతో) మల్లన్న – మీనాన్న నిరాశలో పడ్డారు. నిరాశకు పుట్టిల్లు భ్రాంతి. భ్రాంతి తన్నాశ్రయించిన వాళ్లకే కాదు వాళ్ల మాటలు వినేవాళ్ళకు కూడా మతి పోగొడుతుంది.

**మల్లన్న :** ఆ విభ్రాంతాత్మతోనే నాన్నగారు భాగవతము పూర్తి చేస్తున్నారు. ఆత్మీయతతో అతిశయించే ఈ భాగవతమంటే భ్రాంతి నీ మతినికూడా పోగొడుతుందో లేదో చూదము.

**శ్రీనాథుడు :** ఈపాటికే మామతి పొయ్యేటట్లయితే ఈ దిగ్విజయాలేం చేస్తాము. ఈ కనకాభిషేకాలేం చేయించుకుంటాం.

**మల్లన్న :** మామా! ప్రారంభించమన్నావా. ఈ కూశాస్తరణం మీద కూర్చొని వింటే ఎంతో బాగుంటుంది.

**శ్రీనాథుడు :** ఇలాగే తిరుగుతూ వింటుంటే విశేషాలు త్వరగా తల్లో ప్రవేశిస్తవి. కానీ.

**మల్లన్న :** (గొంతు సవరించి వ్యాసపీఠానికి నమస్కారం చేసి)

**శ్రీకైవల్యపదంబు చేరుటకునై**
**చింతించెదన్ లోక ర**
**క్షైకారంభకు, భక్త పాలన కళా**
**సంరంభకున్ దానవో**
**ద్రేక స్తంభకు,**

(అని వరుసగా చదువుతూ ఉంటాడు)

## మూడవ దృశ్యం

(సాయం సమయం – వేదికమీద సంధ్యారుణ కిరణ ప్రసారం వల్ల కిమ్మీరిత మౌతుంటుంది. శ్రీనాథ మహాకవి నీలాకాశం వైపు చూస్తూ ఆలోచించుకుంటూ మధ్య మధ్య బంగారపు టొరలోనుంచి ఘంటం బయటకు తీస్తూ తాళపత్ర గ్రంథం మీద వ్రాసుకుంటుంటాడు. మల్లన్న అప్పుడే పొలం నుంచి తిరిగి వచ్చే వేషంతో ముల్లుగర్ర, చెన్నకోల దూరంగా పెట్టి దగ్గరికి వచ్చి కూర్చొని)

**మల్లన్న :** ఏమిటా గ్రంథం మామా!

**శ్రీనాథుడు :** కాశీఖండం మల్లన్నా – వచ్చే వసంతోత్సవాలల్లో రాజమహేంద్రవరం వీరభద్రారెడ్డికి కృతి ఇవ్వాలి. మొన్న మేమంతా కాశీయాత్రకు వెళ్ళినప్పుడు ప్రసంగవశాత్తూ ఆయనకు ఆ క్షేత్ర మాహాత్మ్యం చెప్పవలసి వచ్చిందిలే.

**మల్లన్న :** ఓహో! అప్పుడు ఈ బేరం తగిలిందన్న మాట! ఊఁ

**శ్రీనాథుడు :** బేర మేమిటిలే. ఆ మహారాజు కోరటమే కాదు. నాకు చిన్నతనం నుంచీ కాశీఖండం కూడా అనువాదం చెయ్యాలనే అభిలాష కూడా ఉందిలే. అయితే ప్రస్తుతం ఆ మహారాజు కోరిక ఉద్బోధనమైంది. అంతే.

**మల్లన్న :** మంచిది. బాగుంది మామా! 'కాశీఖండ మయః పిండం నైషధం విద్వ దౌషధం' అన్నారు పెద్దలు. అయితే ముందే ఏదో ఒక ఆంధ్రరాజుచేత ఆ అయః పిండాన్ని మింగించి తరువాత నైషధ విద్వదౌషధాన్ని ప్రసాదించవలసింది. సమంజసంగా ఉండేది.

**శ్రీనాథుడు :** ముందు ఔషధం చేతిలో లేందే, ఏమౌతుందో చూద్దామని ఇనపముద్ద మింగిస్తే, రోగి అస్తుబిస్తైతే తరువాత గుడ్లు మిటకరించాలిసిందే వైద్యుడు. ఆయన చేతి మాత్ర వైకుంఠ యాత్ర ఔతుంది మన పని.

**మల్లన్న :** అందుకని ముందే నైషధవిద్యదౌషధాన్ని కనిపెట్టి ఇప్పుడు ఆయుః పిండం మింగబోతున్నావన్న మాట – అయితే ఇది స్కాంద పురాణాంతర్గతం కదూ! మామా సగానికి పైబడ్డదా?

**శ్రీనాథుడు :** పంచమాశ్వాసంలో ఉన్నాను. కానీ ఇవాళ ఉదయం నుంచీ ఘంటం సాగటం లేదోయ్–

**మల్లన్న :** కారణం?

**శ్రీనాథుడు :** మీ నాన్నగారి అనువాద పద్ధతి చూచిన తరువాత కావ్యమంతా మరొక దృక్పథంతో ఆంధ్రీకరిస్తే బాగుంటుందేమోననిపిస్తున్నది.

**మల్లన్న :** మా నాన్న పద్ధతి నిన్నాకర్షించిందా? చిత్రమే – వెనుక ఒక మాట అన్నావు జ్ఞాపకముందో లేదో!

**శ్రీనాథుడు :** ఏమన్నానేమిటి?

**మల్లన్న :** కొత్తగా ఛందస్సు నేర్చుకున్న వాళ్ళు చెప్పినట్లుందన్నావు.

**శ్రీనాథుడు :** ఎప్పుడు?

**మల్లన్న :** ఆయన నీకు వెనక వీరభద్ర విజయం వినిపించినప్పుడు.

**శ్రీనాథుడు :** ఏమో! అంటే అనే ఉండవచ్చు – అప్పుడు నైషధం సింగామాత్యున కంకితమిచ్చాను. అత్తలేని కొత్త కోడలి కాపురంలా ఉండేది నా పని. నన్ను మహాకవి అని పొగడినా నాకు మనస్సుకు తృప్తిగా ఉండేది కాదు. ఇంకొకడు కవి అంటేనే సహించేవాణ్ణి కాదు. ఛందస్సు కొత్తగా నేర్చుకున్న వాళ్లు చెప్పినట్లుందనన్నా అన్నాను. అప్పటికి విశేష గౌరవమిచ్చి మాట్లాడినట్లే – నా స్థితిని బట్టి–

**మల్లన్న :** అంతేకాదు. పాండిత్యము ఏ మాత్రమూ లేదన్నావు.

**శ్రీనాథుడు :** ఆ మాటా అని ఉంటే ఉండవచ్చు. ఇప్పుడు అంగీకరించ టానికి ఏ అభ్యంతరమూ లేదు. అయినా పాండిత్యానికీ కవిత్వానికీ చుక్కెదురు. లక్ష్మీ సరస్వతులకున్నంత సంబంధం, సహవాసం.

**మల్లన్న :** మామా, నిన్న రాత్రితో మా నాన్న భాగవతమంతా విన్నావు గదా, నీ వెనకటి అభిప్రాయమేమన్నా సడలిందా?

**శ్రీనాథుడు :** అబ్బాయీ, బావగారి భాగవత శ్రవణం నాకేదో చెప్పరాని నూతనోత్తేజం కలిగించింది. లేఖిని, వెనక నడచిన నడక నడవనని మొరాయిస్తున్నది.

**మల్లన్న :** లోపాలేమన్నా ఉంటే దాచకుండా నాతో చెప్పు మామా, నాన్నకు చెప్పి సవరణ చేయిస్తాను.

**శ్రీనాథుడు :** లోపాలకేం లేవోయ్. వెదకటం మొదలు పెడితే లోపాలు కవికుల గురువు కాళిదాసు కావ్యాలలోనే కనిపిస్తవి. కావలసినన్ని అపాణినీయ ప్రయోగాలు. వాటిజోలెందుకు.

**మల్లన్న :** మామా ఏమిటాలౌక్యము – రాజా స్థానాలల్లో అలవాటు పడ్డందుకు అది నిన్ను వదిలిపెట్టదా ఏం ఆప్తులతో మాట్లాడేటప్పుడు కూడా!

**శ్రీనాథుడు :** అయినా బావగారు నిర్దుష్ట, నిర్గద్య నిరోష్ఠ్యాలే వ్రాస్తానని ప్రతిజ్ఞ చేయలేదుగా – అదీకాక మహానుభావుడు ఆయన భాగవతం వింటున్నప్పుడు ఈ చెదపురుగు చేసే పని చెయ్యటానికి మనస్సుకు ఆసక్తే కలగలేదు. వెనుక బావగారి కవిత్వమంటే నాకు గౌరవ ముండేది కాదు. మనస్ఫూర్తిగా చెప్పుతున్నాను. నిన్నటితో నా విశ్వాసం మారిపోయింది.

**మల్లన్న :** ఆయన ఆశించడు. కాని భవిష్యత్తులో మా నాన్నగారికి ఆంధ్ర కవికుల సార్వభౌముల్లో ఏమన్నా స్థానముంటుందా?

**శ్రీనాథుడు :** ఆయనది ఒక అద్వితీయస్థానము. భావి విమర్శకులు ఆయనను సారస్వతాకాశ శీతమయూఖుడిగా పరిగణిస్తారు. ఆంధ్ర జాతికెంత వయస్సున్నదో ఆంధ్రభాగవత కన్యకకూ అంతవయస్సు. బావగారు ఆంధ్రభాషను పునీతం చేయటానికి పుట్టిన పుణ్యమూర్తి. కవిత్రయం ఏ మహోన్న తాశయాలతో కవితా వ్యవసాయం సాగించారో, ఆ దృక్పథంతో కావ్య రచనకు పూనుకున్నది మళ్ళీ బావగారే – మల్లన్నా! ఆయన చెప్పుకున్నాడే – 'నా జతనంబు సఫలంబు సేసెద పునర్జన్మంబు లేకుండగన్' అని ఆ విధంగానే ఆయనకు పునర్జన్మ లేదనే నా నిశ్చయము. తన తరణోపాయం చూచుకొని కాలం వెళ్ళబుచ్చుకు పోదలుచుకున్న కవి సామాన్యుడు కాడు ఆ వ్యక్తి. తనతో పాటు ఆంధ్రజాతినంతటినీ మోక్షమార్గ సాంయాత్రికులను చేసుకుంటేగాని సంతృప్తి కలగనట్లుంది ఆయన ఆత్మకు. ద్వైపాయనతుల్యుడు గాని సామాన్యుడా?

**మల్లన్న :** మామా! నీ వింత భావోద్వేగివని నేను ఎన్నడూ అనుకోలేదు.

**శ్రీనాథుడు :** ఈ మాటలన్నీ శిలాక్షరాలు మల్లన్నా! సమస్త కవితా సాగరాలలోనూ నాకు అందుకోలేని అగాధ జలధిలా ఉన్నది మీ నాన్నగారి కవితాత్మ. – ఇదంతా సత్యమని నమ్ము.

**మల్లన్న :** సత్యం కాదని కాదు. నీకు అభిమానం కలిగితే అది అవధులు దాటిపోతుందేమోనని నా భయం. లేకపోతే – అష్టాదశ మహాపురాణాలను ఆపోశనం పట్టిన ద్వైపాయన మహర్షికీ మా నాన్నగారికీ ఎక్కడి సామ్యం – ఆయన ఋషిత్వం.....

**శ్రీనాథుడు :** (సోద్వేగంగా) ఆయన ఋషిత్వమేమిటి? ఆయన దార్శనికస్థితిని తలతన్ని పోయినారు బావగారు.

**మల్లన్న :** ఏమో!

**శ్రీనాథుడు :** ద్వైపాయనమహర్షికంటే బావగారిలో ఇంకో విశేషగుణమున్నది. భక్తి భావ పారవశ్యము.

**మల్లన్న :** ఒకటి మాత్రం సత్యము. మహర్షిని కవితా వైదగ్ధ్యంలో మా నాన్న మించుతాడు.

**శ్రీనాథుడు :** ఏ మహారాజుకో అంకితమిచ్చేనాడు కవిపండిత సమాజాలు ఏమంటవో వింటావుగా.

**మల్లన్న :** నరాంకితం చెయ్యటానికి నాన్న అంగీకరిస్తాడా?

**శ్రీనాథుడు :** లేకపోతే గత్యంతరమేముంది. ఈ ఘోర దారిద్ర్యాన్ని ఎన్నాళ్ళు అనుభవిస్తారు.

**మల్లన్న :** మేమేం దారిద్ర్యాన్ని అనుభవించటం లేదే! కష్టపడిపొలం దున్నుకుంటాం. పండిన దేదో వండుకొని సుష్ఠుగా భోజనం చేస్తాము. పత్తి పండించుకొని వడికి నేయించుకొని బట్టలు కట్టుకుంటాం. మాకేం లోపము? దేనికీ లోపము?

**శ్రీనాథుడు :** బాగుంది పద్ధతి. ఏముంది. గురివెంద చేరులు పెట్టుకొని కులికే కోయపిల్లకు కంసాలితో పనేముంటుంది. సుఖపడటమంటే ఏమిటో ఎరగని వాళ్ళకు తమకేం కావాలో, ఏం లోపమో ఏం తెలుస్తుంది.

**మల్లన్న :** భౌతిక జీవితానికి అవసరమైనంత వరకు కోరుకుంటాం. కష్టపడి సంపాదించుకుంటాం. కోరికల కళ్ళాలు సడిలిస్తే మళ్ళీ చేతికి చిక్కుతాయా? ఏదో పరమేశ్వరుడు ఇచ్చిన దాంతో తృప్తి పడాలి గాని ఊరికే కోరికలు పెంచుకుంటే మానవజీవితం ఎంత దుర్భరమై పోతుందో ఆలోచించావా?

**శ్రీనాథుడు :** మేము కష్టపడుతున్నామంటావు. అదంతా వృథా శ్రమ. మనకు కాని శ్రమ. లేకపోతే కవులకు కర్షక వృత్తేమిటి? ఎందుకు–

**మల్లన్న :** స్వేచ్ఛను చంపుకోకుండా కాపాడుకోటానికి, సత్యాన్ని రాజభయం లేకుండా బహిర్గతం చేసే స్వాతంత్ర్యాన్ని రక్షించుకోటానికి–

**శ్రీనాథుడు :** స్వనాశన సమయంలో కూడా స్వాతంత్ర్య రక్షణ మనబోటి సంసారులకేం సాగుతుంది. మహాత్ములైన మహర్షులకు గాని.

**మల్లన్న :** మామా! అయితే నీవు మా నాన్నను ఏ మహారాజునైనా ఆశ్రయించి ఒక అగ్రహారం సంపాదించమంటావు. అంతేనా?

**శ్రీనాథుడు :** లేకపోతే జీవన సముద్రాన్ని తరించేదెట్లా? దారిద్ర్య నౌక నెక్కితే దరిజేరటానికి అవకాశం ఉందో లేదో ఆలోచించుకోకపోతే ఎలా?

**మల్లన్న :** 'పునరపి జననం, పునరపి మరణం'గా జీవయాత్ర సాగిద్దామనుకుంటే మటుకు యీ సాంయాత్రికతకు అంతెక్కడో, అవధియెక్కడో కూడా ఆలోచించుకోవాలి కదా?

**శ్రీనాథుడు :** బాగున్నది వేదాంతము. దాని మెళ్ళో మేం పెట్టిన పులిచేరుతాడు పోయినంతకు అమ్ముకుతిన్నారు. పుస్తెల తాడూ అదీ మిగిలింది. సంసారాన్ని ఇంత అయోమయంలో పడేస్తే తరువాత సాగేదెట్లా?

(లోపలినుంచి మాచమ్మ ఎందుకో పని ఉన్నట్లుగా బయటికి వస్తుంది)

**మాచమ్మ :** ఏమో నాయనా, బాగా నచ్చచెప్పిపో తండ్రీ వీడికైనా. ఆయనకు పట్టిన పిచ్చే వీడికి పట్టింది. సంసారం గొడవ ఆ తండ్రికీ పట్టదు ఈ కొడుక్కూ పట్టదు. పొద్దున లేచింది మొదలు పూజా పునస్కారాలతో ఆయనా, పొలం పనితో వీడూ–

**శ్రీనాథుడు :** అయితే–ఇంకేం–బాగుపడ్డట్టే.

**మాచమ్మ :** మీ బావగారితో ఏం చెప్పుతావో ఆలోచించుకో. వియ్యానికీ, కయ్యానికీ సరిసాటి కావాలిగా, సాటివాళ్ళనుగా చేస్తావో సంబంధమే మాను కుంటావో. నేను ఎన్ని తడవలు నెత్తిన నోరు పెట్టుకొని కొట్టుకున్నా, ఆ తండ్రి తండ్రే, ఈ కొడుకు కొడుకే – సంగతులన్నీ ఒక్క మాటు నీవు మాట్లాడితేగాని తేలదు. ఎన్నాళ్ళీ ముసుగులో గుద్దులాట.

**శ్రీనాథుడు :** ఆయనకు నా మాటమీద కొంత విలువ ఉన్నదనుకుంటాను. మాట్లాడి చూస్తాను.

**మాచమ్మ :** చూస్తానంటే కాదు. అదుగోనంటే ఆయన ఆరు నెలలకు మనిషి. నీ యిష్టం ఏమైనా చెప్పు. ఒప్పించి ఇప్పుడే నీ వెంట ఎక్కడికైనా తీసుకోపోతే సరిగాని లేకపోతే నా కాపురం వల్లకాడే.

**శ్రీనాథుడు :** ఇప్పుడే నా వెంట బయలుదేరుతానంటే నాకు మరీ సంతోషము. రేపటి గోపాలోత్సవాలలోనే భాగవతము సింగభూపతికి ఇప్పించి బావగారికి ప్రత్యేకంగా ఒక ఖండ్రిక శాశ్వతభోగం చేయించనూ.

**మల్లన్న :** అమ్మా! అదుగో నాన్న. (లేచి దూరంగా వస్తూ ఉన్న పోతన్నకు ఎదురుపోయి నెత్తిమీద మూట అందుకొని తీసుకువచ్చి సావట్లో దించుతాడు. మల్లన్న వెనుక పోతన్న నేలచూస్తూ అలసిపోయి అడుగులో అడుగు వేసుకుంటూ వేదికమీదకు వచ్చి కూర్చుంటాడు.

**పోతన్న :** (మోకాళ్ల మీద చేతులు పెట్టుకొని కూర్చోబోతూ)

రామచంద్ర ప్రభో! రామచంద్ర ప్రభో

**(నెమ్మదిగా కూర్చున్న తరువాత)**

**శ్రీనాథుడు :** బావగారూ.... ఎక్కడ నుంచి?

**పోతన్న :** అదుగో! పోతవరం పొలిమేరలలో పెద్ద మర్రిచెట్టు నాయనా, విస్తరాకుల కోసమని వెళ్ళి వస్తున్నాను.

**శ్రీనాథుడు :** మీకు వృద్ధాప్యం వచ్చేసింది.

**పోతన్న :** రాకేముంది. షష్టిపూర్తికి నాలుగో మెట్టులో ఉన్నాను? – ఇదుగో ఈ పని బడి నీతో పగలు భోజనం చేసిన తరువాత మాట్లాడటానికి అవకాశం లేకపోయింది. ఊఁ ఇప్పుడేమన్నా కొత్తకావ్యం చెపుతున్నావా?

**శ్రీనాథుడు :** రాజమహేంద్రవరం రెడ్డిరాజు వీరభద్రారెడ్డికి వచ్చే వసంతోత్సవాలల్లో కాశీఖండం అంకితమివ్వాలి. పోయిన ఆషాఢారంభంలో కర్పూరపు తాంబూలము అందుకున్నాను. వ్రాస్తున్నాను.

**పోతన్న :** గ్రంథం సగభాగమైనా అయిందా? – మొదటినుంచీ నీ కావ్యకన్యకు ప్రౌఢతేనోయ్–

**శ్రీనాథుడు :** ప్రౌఢలను మహారాజులుగాని ఏలుకోలేరని నా అభిప్రాయం.

**పోతన్న :** నీ ఛలోక్తి నేను ఉద్దేశించలేదు.... నాయనా!

**శ్రీనాథుడు :** బావగారూ! మల్లన్న వినిపిస్తే మీ భాగవతము విన్నాను.

**పోతన్న :** నా భాగవతమా! నాదేముంది నాయనా! అది వ్యాసభగవానుల భాగవతము.

**శ్రీనాథుడు :** మీరు వారి అపరావతారము. మీ ఆంధ్రీకరణమార్గం అన్యకవిపాంథగమ్యం కానిది.

**పోతన్న :** ఆ ఆంధ్రీకరణములో నా ప్రతిభ ఏముంది తండ్రీ! ఆ రామచంద్రమూర్తి నా జిహ్వాగ్రంలో నిలిచి ఏం పలికిస్తే అది వ్రాశాను – భాగవతకర్త శ్రీరామచంద్రమూర్తి కాని మరెవ్వరూ కాదు.

**శ్రీనాథుడు :** మీరెలా భావించినా లోకం భవిష్యత్తులో భాగవతము పోతనామాత్యులదనే చెప్పుకుంటుంది.

**పోతన్న :** లోకం ఏమని చెప్పుకుంటే నాకెందుకు

**శ్రీనాథుడు :** బావా, మీరు చాలా అదృష్టవంతులు. కాబట్టే భాగవతము ఆంధ్రీకరించే మహాభాగ్యం మీకబ్బింది – అంతకంటే మరొక విధంగా – భాగవతాంధ్రీకరణము మీ చేతుల్లో పడటము వల్ల ఆంధ్రులు అదృష్టవంతులనటం మరీ సమంజసమైన అభిప్రాయము.

**పోతన్న :** ఆంధ్రుల అదృష్టముమాట నాకు తెలియదు గాని ఒక విధంగా నేను అదృష్టవంతుడననే భావించుకుంటున్నాను. నా పురాకృత శుభాధిక్యం కాకపోతే రామచంద్రమూర్తి భాగవతం నా నోట పలికించటానికి సంకల్పిస్తాడా?

**శ్రీనాథుడు :** నన్నయాది మహాకవులు పురాణాలు తెలుగుచేస్తూ భాగవతం తెలిగించక పోవటము నా పురాకృతపుణ్యమని వ్రాసుకున్నారు గానీ – ఆ మహాకావ్యానికి అవసరమైన శక్తి సంపన్నత వారికి లేదని నా అభిప్రాయం.

**పోతన్న :** ఎంతమాట! ఆంధ్రకవితా విశ్వానికి త్రిమూర్తులు మహాత్ములు నన్నయాదులకు భాగవతాంధ్రీకరణానికి అనుయోగ్యమైన శక్తిలేదని నా అంతరాంతరాలల్లో కూడా అనుమానం లేదు. అవిరళ జప హోమతత్పరుడూ, సంహితాభ్యాసి, బ్రహ్మాండాది నానా పురాణ విజ్ఞాననిరతుడూ అయిన నన్నయ్యభట్టారుడికి భాగవతాన్ని తెలిగించే ప్రజ్ఞ లేదనుకోటం భావ్యంకాదు. ఉభయ భాషా కావ్య రచనాభిశోభితుడూ శిల్పపారకుడూ, తను కావించిన సృష్టితక్కొరులచేత కాదనిపించుకున్న తిక్కన మహాకవికి ఎదురుతిరిగే వస్తువెక్కడ ఉంటుంది. ఎర్రన్న మాత్రం – సామాన్యుడా. ఆదిగురువులు నడిచిన అనన్య సాధ్యమార్గద్వయంలో అందెవేసిన చేయి – భాస్కరాదులు.

**శ్రీనాథుడు :** మీ భాగవత కన్యకకు తగ్గ వరుణ్ణి ఊహించాను, బావగారూ!

**పోతన్న :** మా కన్యకకు సమస్త విధాలా తగ్గవరుణ్ణేనా?

**శ్రీనాథుడు :** అవును – మదన మోహనుడు, సర్వజ్ఞుడు

**పోతన్న :** రసార్ణవ సుధాకరుడు!

**శ్రీనాథుడు :** సింగభూపతి, ఔను రసార్ణవ సుధాకరుడు.

**పోతన్న :** (చెవులు మూసుకొని) ప్రభో! రామచంద్ర ప్రభో!

**శ్రీనాథుడు :** మీరు కోరుకున్నది ఇప్పిస్తాను.

**పోతన్న :** మా 'ఓలి' ఈ మండలాధిపతులు ఏమివ్వగలుగుతారు.

**శ్రీనాథుడు :** మీరు కోరినది ఇప్పించే భారం నాది.

**పోతన్న :** నాకొక శాశ్వత మహాదానం చేయించాలి.

**శ్రీనాథుడు :** మీరు కోరిన గ్రామం శాశ్వతవృత్తులతో దాన మిప్పేంచేటట్లు – అంగీకరిస్తారా.

**పోతన్న :** శాశ్వత వృత్తులతోనా! – కల్ల నాయనా! పిచ్చివాడా, సగరుడు, మాంధాత, నహుషుడు,నాభాగుడు – ఎంతెంత మంది మహాచక్రవర్తులు ఈ లోకంలో జన్మించారో – మృత్యువులు తప్పించుకొని చిరంజీవులైన వాళ్లే అరుదు. అంతటివారే అశాశ్వతులైనప్పుడు ఈ సామాన్య మహా మండలాధిపతులు శాశ్వతులా – వీరు నాకేవిధంగా శాశ్వతదానం చేస్తారు. ఆ శాశ్వతమైన బ్రతుకుతో నేను శాశ్వత దానానికి ప్రతిగ్రహీతను ఎలా కాగలను.

**శ్రీనాథుడు :** బావగారూ, మీరేం మాట్లాడుతున్నారో నాకేమీ అర్థం కావటం లేదు – పోనీ కర్ణాట చక్రవర్తిచేత కనకాభిషేకం చేయిస్తాను – ప్రతిగ్రహీతలుకండి. కావ్యకన్యక నిచ్చి కల్యాణం చేయించండి.

**పోతన్న :** నాయనా! శ్రీనాథా! కర్ణాటభూపతి చేత కనకాభిషేకం చేయించినా– కేవలం కనక కల్పితమైన అగ్రహారం దానం చేయించినా అతడు నా కావ్యకన్యకను వరించటానికి తగ్గ వరుడు మాత్రం కాలేదు – అయినా నాకీ రాజుల వివక్షతో పని ఏముంది. ఆమెను ఎన్నడో పురుషోత్తముడి కిచ్చి ధారవోసి తరించటానికి నిశ్చయించుకున్నాను.

**శ్రీనాథుడు :** ఇంత వృద్ధాప్యంలో కూడా మీరు ఈ దారిద్ర్య దేవతకు స్వస్తి చెప్పటానికి సంకల్పించుకోలేదన్నమాట.

**పోతన్న :** అబ్బాయీ! అనిత్యాలైన ఈ శరీరాలకు ఈ దారిద్ర్యమెన్నాళ్లు, ఈ సుఖాలెన్నాళ్లు, క్షణకాలం అయినా నా దారిద్ర్యం ఎవరినీ బాధపెట్టేది కాదే.

**శ్రీనాథుడు :** ఇదివరకు బాధ పెట్టకపోయినా ఇక ముందు బాధపెట్టక మానదు.

**పోతన్న :** అంటే–

**మాచమ్మ :** (ప్రవేశించి) అంటేనా మల్లన్నకు మావాడు పిల్లనివ్వ దలచుకున్నాడు. చూడబోతే మన ఇంట్లో సూర్యచంద్రాదులు తప్ప ఏమీ లేకపోయెను. ఏమని ఇస్తాడు. వాణ్ణయినా వాడివెంట పంపిస్తే ఇంత పెద్దవాణ్ణిచేసే వాడనుకుంటే అదీ ఆలోచించకపోతిరి. వాడి మెడకు వ్యవసాయం గుదిగొయ్య తగిలించి ఒక వేదాంతిని చేసి కూర్చోపెడితిరి.

**పోతన్న :** అయితే ఏతావత మల్లన్న పెళ్ళికోసం నాకు ఏ మహారాజుకో కాళ్ళుకడిగి కన్యక నర్పించుకోటం తప్పదన్నమాట! అదేనా మీ అభిప్రాయం. రామచంద్ర ప్రభో, రామచంద్ర ప్రభో!

**(మల్లన్న ప్రవేశిస్తాడు)**

**శ్రీనాథుడు :** ఏదో నాకూ కొంత బాధ్యత ఉండబట్టి చెప్పదలచుకున్న మాట లేమిటో నాలుగూ బయట పెట్టాను. తరువాత మీ ఇష్టం.

**మాచమ్మ :** మన బాగు కోరే గదా వాడు ఏదిచెప్పినా? అంత మీకు తలకు ఎక్కకపోతే ఎవరేం చేస్తారు. ఏమిటా విస్తుపోయి దొంగలు పడి కొంప దోచుకుపోయినట్లు ఆ దిగులూ మీరూ, ఎందుకా తలపట్టుకొని కూర్చోవటం – ఏమిరా మల్లన్నా! మామ ఏమన్నాడో వింటున్నారా?

**మల్లన్న :** వినకేం, అన్నిమాటలూ లోపలికి వినిపిస్తూనే ఉన్నవి.

**మాచమ్మ :** అయితే నీ యభిప్రాయమేమిటో స్పష్టంగా మామతో తేల్చిచెప్పు.

**మల్లన్న :** నా కోసమని ఆయన మనస్సుకు నచ్చని పని బలవంతం చేసి ఆయనచేత ఒప్పించటానికి నేను ఎంత మాత్రమూ అంగీకరించను – అయినా నా పెళ్ళికీ – ఆయన గ్రంథం ఏ రాజుకో అంకితమివ్వటానికి ఎక్కడి సంబంధం?

**మాచమ్మ :** అయితే మామతో సంబంధం వదులుకోటానికే నిశ్చయించుకున్నావన్న మాట.

**మల్లన్న :** భాగవతాన్ని మానాన్న మహారాజుకు అంకితమివ్వకపోతే నాకు పిల్లనివ్వటానికి వీల్లేదన్న మాట!

**శ్రీనాథుడు :** ఏం చూచి ఇవ్వమంటావు?

**పోతన్న :** సంప్రదాయం చూచి – సౌశీల్యం చూచి.

**శ్రీనాథుడు :** అవేం నా పిల్లకు అచ్చటా ముచ్చటా తీరుస్తవా? అన్నం పెడతవా – అయినా ఒక మాట అడుగుతాను మీకు కోపం రాకుండా ఉంటే. మహారాజులంటే మీకు తృణప్రాయంగా ఉన్నది గాని మీరేం మహాకవులు. తిక్కనాదుల కంటె ఎక్కువా? ఆయన మనుమసిద్ధికి కావ్యం అంకితమివ్వలేదా. ఆయనచేత 'మామా' అని పిలిపించు కోటానికి మనసు పడలేదా–

**పోతన్న :** చిన్నతనంలో చేసిన తప్పిదాలను చెరిపేసుకోటానికే యజ్ఞం చేసి సోమయాజిగా మారి భారతాన్ని హరిహరనాథాంకితం చేసి అమృతమూర్తి అయినాడు.

**శ్రీనాథుడు :** మీ కుటుంబ స్థితితో ఈ ఆశయాన్ని ఎంతకాలం నెగ్గించుకుంటారో చూడాలి.

**పోతన్న :** అదంతా ఆ మహానుభావుడి కృప.

**(దారువిగ్రహం వైపు చూపిస్తాడు)**

**మల్లన్న :** మామా! నీకు ఈ విషయంలో ఇంతపట్టుదల ఎందుకు – పిల్లనిచ్చేది నాకు గాని, మా నాన్న సంపాదించి యిచ్చే నా అగ్రహారానికి కాదుగా. అధవా నా దురదృష్టం వల్ల అది పోగొట్టుకుంటాననుకో – అప్పుడేం చేస్తావు?

**శ్రీనాథుడు :** అందుకని చూసి చూసి పిల్లకు స్వయంగా నా చేతులతో గొంతుకు ఉరిబోసి గోతిలో దించుతానా–

**మాచమ్మ :** (పోతన్నతో) ఏమండీ! ఏమీ మాట్లాడరేం.

**పోతన్న :** నన్నేం మాట్లాడమంటావు?

**మాచమ్మ :** మా వాడు చెప్పిన మాటకు మీరేం సమాధానం చెపుతారు?

**పోతన్న :** కంఠంలో ప్రాణమున్నంతవరకూ నా కావ్య కన్యకను శ్రీరామచంద్ర మూర్తికి తప్ప ఇతరులకిచ్చి వివాహం చేయలేను.

**మాచమ్మ :** మా పుట్టింటితో సంబంధం వదులుకుంటానికే సంసిద్ధులై నారన్నమాట.

**మల్లన్న :** ఎందుకాయనకు ఊరికే ఒత్తిడిచేసి బాధ పెట్టటము.

**శ్రీనాథుడు :** (లేస్తూ) అక్కయ్యా! వారి దృష్టి వేరు నా దృష్టి వేరు. ఇంక నీకూ–నాకూ ఇంతటితో సంబంధం తీరిపోయినట్లే. మల్లన్నా! నీవైనా నావెంట బయలుదేరి రావటానికి ఏమైనా అభ్యంతరమున్నదా?

**మల్లన్న :** తల్లీతండ్రిని ఒంటరిగా విడిచిపెట్టి – స్వర్గమిచ్చినా బయలుదేరను మామా.

**శ్రీనాథుడు :** ఈ పండీ పండని పొలాలను నమ్ముకొని దున్నుకుంటూ కర్షక వృత్తితోనే జీవిస్తావన్నమాట.

**మల్లన్న :** ఈ వృత్తిలో ఉన్న స్వాతంత్ర్యం సౌఖ్యం రాజ సౌధాలల్లో కూడా లేదనే నా నమ్మకము మామా!

**శ్రీనాథుడు :** సరే బాగుంది. వినని వాడికి చెప్పేదెవరు? (లేస్తాడు) అక్కయ్యా! వీడి వ్యవహారం కూడా తేలిపోయింది. బావగారూ సెలవు.

**పోతన్న :** చీకటిపడబోతుంటే ఇప్పుడెక్కడికి పోదామని.

**మాచమ్మ :** అన్నం తిని పోదువుగాని – పండువంటి సంబంధం పోతే పోగొట్టుకున్నాను గాని.

**శ్రీనాథుడు :** నన్ను అనవసరంగా బాధపెట్టవద్దు – (బోయీలను ఉద్దేశించి) ఒరేయ్!

**(చకచకా నడిచిపోతాడు)**

**పోతన్న :** శ్రీనాథా! శ్రీనాథా!

**మాచమ్మ :** తరతరాల నుంచీ వచ్చే సంబంధం చేతులారా పోగొట్టుకునే వాళ్లు ఎవరైనా ఉంటారా, ఈనాటితో నాకూ నా పుట్టింటికి ఋణం తీరిపోయింది. (కన్నీళ్లతో) మల్లన్నా నీవైనా వాడివెంట వెళ్లరా?

**మల్లన్న :** నీవు వెళ్లు – ఇక్కడ కష్టపడకపోతే–

**మాచమ్మ :** ఇంతకూ నేను చేసుకొన్న ప్రారబ్ధం – ఈ ఘటం కాస్తా హరీ అన్నా వాళ్లు ఎవరు పట్టుకొని పాకులాడుతారు. ఎవరికి ఏం పట్టింది.

**మల్లన్న :** అమ్మా! ఏం ప్రయోజనం ఈ మాటలతో – పోయి త్వరగా మడికట్టుకో–

**మాచమ్మ :** నా కడుపులో ఎంత మండిపోతున్నదో నీకేం తెలుసు – ఎవర్నీ ఏమీ అడగరట!

**మల్లన్న :** వంటకానివ్వు పోవే–

**మాచమ్మ :** ఏం బెట్టి – చేతులూ, కాళ్లూ, నా కెందుకొచ్చింది. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి – ఈ పూటకు బియ్యం లేవు, ఉప్పులేదు, పప్పు లేదు.

**(సురాళించుకొంటూ వెళ్ళిపోతుంది)**

## నాలుగవ దృశ్యం

(ఒక మంచం మీద పోతన కూర్చొని చెపుతూ ఉంటే మల్లన్న వ్రాస్తూ ఉంటాడు. చెప్పలేక చెపుతూ మధ్యమధ్య పోతన్న జ్వరంతో దగ్గుతూ బాధపడుతూ ఉంటాడు)

**పోతన్న :** ఖోర్, ఖోర్..... ఘోర్ (దగ్గుతాడు)

**మల్లన్న :** నాన్నా! అంత ఆయాసపడుతూ ఇప్పుడు చెప్పలేక చెప్పలేక చెప్పకపోతే ఏం మునుచుకు పోతున్నది గనుక – పరిసమాప్తం చేయలేక పోతారా, పోనీ జ్వరం బాగా నయమైన తరువాత వ్రాయకూడదూ, ప్రస్తుతము కట్టిపెడదామా?

**పోతన్న :** అలా కాదులే ... నా మాట విను నాయనా, ఏం వ్రాశావు.

ఖోర్, ఖోర్, ఖోర్ – (దగ్గుతాడు)

**మల్లన్న :** అదుగో అదేకొంప తీసేది. నిన్నా మొన్నా లేదు. మళ్ళీ వెంట పడ్డది. చాలా చెడ్డదని వైద్యుడు నెత్తిన నోరు పెట్టుకొని మొత్తుకున్నా వినిపించుకోకపోతే ఆయన ఏం చేస్తాడు. విశ్రాంతి అవసరం మీ నాన్న గారికని ఇందాక రామస్వామి ఆలయం ముందు కనిపించి మళ్ళీచెప్పాడు.

**పోతన్న :** (దగ్గుతూనే బాధతో) నన్నేం చేయమంటావురా, నేనేం ఈ దగ్గును రమ్మని పిలిచిపీట వేశానా?

**మల్లన్న :** కావాలని తెచ్చి పెట్టుకోడం కాకపోతే ఏమిటిది. ఈ విధంగా మనస్సుతో శ్రమచేస్తే ఎంత ప్రమాదం.

**పోతన్న :** ఖోర్, ఖోర్, ఖోర్ – పరిగెత్తే మనస్సును .... ఎంత పట్టుకుందామన్నా చేత... కావటం లేదు.

**మల్లన్న :** పట్టుదలతో ప్రయత్నం చేస్తే సాధ్యం కానిదంటూ ఉంటుందా?

**పోతన్న :** (దగ్గుతూ) ఆ కొరత కొంచెం పూర్తి అయితేగాని నాకు నిద్రపట్టదురా మల్లన్నా, నన్నెందుకు బాధ పెడతావు. నా మాట విని... కట్టిపెట్టకు... నశ్వరమైన ఈ దేహానికి ఎప్పుడేదో, రామచంద్రమూర్తికి బాస ఇచ్చాను. చెల్లించుకోలేక పోతే చివరకు ఆ ప్రభువుకు – ఖోర్... ఖోర్...ఖోర్... నాయనా ఏదీమూలం? కానివ్వు ...(తల పట్టుకొని) రామచంద్ర ప్రభో! రామచంద్ర ప్రభో!

(లోపల నుంచి మాచమ్మ తలకు పట్టువేసి ప్రవేశించి)

సీతమ్మ తల్లి! సీతమ్మ తల్లి!! ఈ చెరలు నేను పడలేకుండా ఉన్నానమ్మా... ఈ సంసారంతో నేను వేగలేకుండా ఉన్నానమ్మా... నాకు ఏ నుయ్యో గొయ్యో చూపించు తల్లీ–

**మల్లన్న :** ఇప్పుడేమొచ్చిందమ్మా?

**మాచమ్మ :** ఎప్పుడూ వచ్చేదే ఇప్పుడూ వచ్చింది. గొంతుకు ఉరి పెట్టుకుందామన్నా ఊపిరాడదు గదా! ఏ మహాపాపం చేశానో కాని, అన్నిటికీ ఒక్కతెను ఆడపక్షిని. అటు పొలం పోయి గడ్డే తెచ్చేదా ఇటు పొయ్యి మీది పనే చూసేదా... ఈ పూట నాకు కూడా కాక తగిలినట్లుంది.

**మల్లన్న :** ఊఁ–కానీ నువ్వుకూడా మంచమెక్కు.

**మాచమ్మ :** (పోతన్నను చూస్తూ) మహారాజులు ఎక్కేవాళ్ళు ఎక్కితే సరిపోతుంది గాని నేనెక్కితే ఊరుకుంటారా. మెడబెట్టి గెంటుతారు.

**మల్లన్న :** అమ్మా! ఏం తలనొప్పి వచ్చిందా ఏం – దుప్పికొమ్ము గంధం పట్టేశావు. కాసేపు అలా వెన్ను వాల్చరాదూ తగ్గుతుంది.

**మాచమ్మ :** ఆ అంత అదృష్టం కూడానా ఆ మోపెడు అంట్లూ ఎవరుతోముతారు. నా తాత వెనక వాళ్ళూ, అబ్బ వెనక వాళ్ళూ–

**మల్లన్న :** అమ్మా! నీకేం కష్టం వచ్చిందనమ్మా అనవసరంగా అనని మాటలు అనుకోటం. అవతల ఆయన లేవలేకుండా బాధపడుతుంటే ఉత్త అఘాయిత్యం తప్ప.

**మాచమ్మ :** అంతే.... అంతకంటే ఇంకేమయింది అయ్యకు చేతనైనపని. ఆయనను వెనక వేసుకోరావటం – అయినదానికీ, కాని దానికీ. కష్టపడి కనిపెంచినందుకు అమ్మకు చేసే సాయం బాగుంది నాయనా. బాగుంది.

**మల్లన్న :** అమ్మా! ఇప్పుడెందుకు అనవసరంగా అంత గొంతు పెట్టుకొని అరవటం.

**మాచమ్మ :** ఔవ్వ..... నోరు నొక్కేసుకోమన్నావా?

**మల్లన్న :** అసలు విషయమేమిటమ్మా!

**మాచమ్మ :** (పోతన్నను చూస్తూ) ఊ, ఆ, అనకుండా చేసే పని చేసి బెల్లం కొట్టిన రాయిలాగా ఊరుకోటం.

**మల్లన్న :** ఎవరు చేశారు. ఏం చేశారు.

**మాచమ్మ :** చేసిన వాళ్లను అడుగు.

**మల్లన్న :** ఈ గొడవంతా ఏమిటి నాన్నా!

**పోతన్న :** (భార్యతో) ఆ భట్రాజువాణ్ణి ఇంతకూ ఇక్కడ యీ పూట భోజనం చేసి పొమ్మన్నందుకేనా ఈ వషట్కారాలన్నీ – ఖోర్, ఖోర్, ఖోర్.

**మాచమ్మ :** ఒక్కపూట పాలుమాలితే సోలెడు గింజలు ఉడకవేసే ఆడదిక్కు లేదు. కాపరానికి వచ్చింది  మొదలు నా వంటఇల్లూ – నేనూ – ఆడదానికష్టం తెలుసుకోలేకపోతే సరి. ఒకరో ఇద్దరో ప్రతిదినం పైమనుషులైతే ఎక్కడ చచ్చేది. పోనీ పంక్తికి భోంచేసి పోయే వాళ్లా అంటే అంతా మా అమ్మ వెనుక చుట్టాలూ, నాన్న వెనుక చుట్టాలూ.

**మల్లన్న :** ఏదో ఎరిగిన వాడని ఆశిస్తే అంతఅన్నానికి ఏం పోయిందని ఆయన ఉండమన్నారేమో దానికెందుకింత రాద్ధాంతాం. అయినా లేనివాళ్ళకు పెడితేనే ఏమన్నా, ఉన్నవాళ్ళకు పెడితే ఏం వస్తుంది.

**మాచమ్మ :** లేనివాళ్లకు ఇంతమందికి పెట్టబట్టే మనకింత (నేలచూపిస్తూ) వచ్చింది. అబ్బో! సంస్థానం బమ్మెరవారి  సంస్థానం. ఇంటి పేరు కస్తూరి వారు. ఇంట్లో గబ్బిలాల కంపు.

**పోతన్న :** రామచంద్ర ప్రభో! రామచంద్ర ప్రభో!! ఖోర్... ఖోర్... ఖోర్ (దగ్గుతాడు)

**మాచమ్మ :** అయినా నాకెందుకు వచ్చింది. రెక్కల్లో సత్తువున్నంత వరకూ ఇంత ఉడకవేసి పెడతాను. నా మొర ఆలించే వాళ్ళా పాలించే వాళ్ళా – మల్లన్నా! నువ్వు కూడా ఇంత పట్టించుకోక పోతే ఏం చేసేదిరా (కంటతడి పెడుతూ) గింజలు నిండుకున్నవని చెప్పి నాలుగు దినాలైంది కదా... నువ్వు ఏం చేసినట్టు.

**మల్లన్న :** మొన్న పోటు వేసిన కొర్ర బియ్యం అయిపోయినవా ఏం?

**మాచమ్మ :** ఇంకా ఎన్నాళ్లువస్తవి నాయనా, అంత అక్షయంగా గడపటానికి నేనేం అనసూయనా! వాటి పుణ్యమా అంటూ అక్కడికి వారం రానే వచ్చినవి.

**మల్లన్న :** మధ్యాహ్నం ఆ ఉన్న కాసిని సజ్జలూ పోటు వేస్తాను. తరువాత సంగతి తరువాత చూచుకుందాం. ఈ పూటకు ఎక్కడన్నా అప్పు పుచ్చుకో.

**మాచమ్మ :** ఎవరిస్తారు? మన పేరు చెపితే ఎక్కడ పట్టినా భగ్గం పాడే.

**మల్లన్న :** అడుగో ఆ దారిన మారన్న మూటనెత్తిన పెట్టుకు వస్తున్నాడు. మరిచి పోయినాను. వెనుక మన కళ్లంలోనే పది మానికలు అప్పు తీసుకున్నాడు. ఇవ్వటానికి వస్తున్నాడనుకుంటాం. నువ్వు త్వరగా మడి కట్టుకొని ఆయనకు ఇవాళనైనా ఇంత ధారకం పోసేటట్టు చూడు.

**(మాచమ్మ నిష్క్రమిస్తుంది)**

(భార్య వెళ్ళిపోతుంటే) ఖోర్, ఖోర్ ఖోర్ మల్లన్నా! అనేక మాట్లు పరీక్షిస్తున్నాడు, ప్రభువు నన్నెంత అగ్నిపరీక్ష చేస్తున్నాడురా. తీరా సమయం వచ్చేటప్పటికి తానే ఆదుకుంటున్నాడు.

**మల్లన్న :** మన దగ్గర అప్పు తీసుకున్న గింజలు ఇప్పించటమూ కూడా ఆదుకోటమేనా ఏమైనా ఆయన పరిపూర్ణ కటాక్షాన్ని ఆశించుకొని కూర్చుంటే.

**పోతన్న :** రామచంద్ర ప్రభో – రామచంద్ర ప్రభో – జగద్రక్షకా తండ్రీ – (లేస్తాడు)

**మల్లన్న :** నాన్నా! ఏమిటా మంచంలోంచి లేచి పోవటం. నాలుగు లంఘణాలతో పైత్యించి ఆ కాస్తా విరుచుకుపడితే (దగ్గిరికి వచ్చి చేయిపట్టుకొని) దేహం ఇంత కాకెక్కుతున్నదేం (నాడి చూచి) జ్వరం మళ్లీ వచ్చేస్తున్నది. అంతర్గతం పూర్తిగా వదలలేదు మీకు.

**పోతన్న :** జ్వరం కాదు... చట్టు బండలూ కాదు.

**మల్లన్న :** మీకీ జబ్బుచేయటమూ నా దరిద్రమే.

**పోతన్న :** లోకం దృష్టిలో నాకంటే పరమ దరిద్రుడెవ్వడున్నాడు. నాయనా – (మానసిక స్థితిలో మార్పు చూపిస్తూ) అబ్బాయీ, మల్లన్నా చూస్తున్నావా... అదుగో ఎక్కడిదా శతపత్ర సితాంబుజము.... పరిశీలిస్తున్నావా – ఆ అరుణారుణ పాదపల్లవ కాంతులు – నా మీద కనికరించి ప్రభువు వస్తున్నట్లున్నాడురా నేను దరిద్రుడననుకున్నానని – ఆఁ–కాదు కాదు నా ప్రభువు కాదు. అయితే ఆ అందెలచప్పుడు వినిపించదే – ఆ కాంచీదామాన్ని చూస్తున్నావా... కాదురా సీతమ్మ తల్లిరా అయోధ్య నుంచి భక్తుణ్ణి చూచి పోదామని బయలుదేరి వచ్చినట్లుంది–

**మల్లన్న :** నాన్నా! మీకు బాగా పైత్యిస్తున్నది. కాసేపు కళ్లు మూసుకొని పడుకోండి. నేను ఇంతలో కాస్త తేనె పట్టుకొస్తాను.

**పోతన్న :** ఎవరురా యీ తల్లి – ఎక్కడో చూచినట్లే ఉంది కాని గుర్తురావటం లేదు. ఓహో నీవా తల్లీ!

**మల్లన్న :** అమ్మా! అమ్మా!!

**పోతన్న :** అమ్మా! రాతల్లీ – అంబుజగర్భురాణీ, నవాంబు జోజ్వల కరాంబుజ – ఈ పేదవాడి కుటీరం మీద ఈనాటికైనా ప్రసరించింది తల్లీ నీ అమృతమయ వీక్షణం – ధన్యుణ్ణి.

(మంచంలో నుంచి లేచి ఊహాకల్పిత మూర్తికి నమస్కరిస్తాడు మోకరిల్లి)

(తలపైకెత్తి) మల్లన్నా అమ్మను పిలూ అర్ఘ్యం తీసుకురమ్మను. పాద్యం తీసుకు రమ్మను. తల్లి వచ్చింది. త్వరగా అమ్మను రమ్మను.

**మల్లన్న :** (భయంతో వెనకటికంటే పెద్ద గొంతుకతో) అమ్మా! అమ్మా!!

**పోతన్న :** తల్లీ! కవుల జిహ్వాగ్రంలో నాట్యమాడినంత మాత్రానే వాచాలురను చేసే నీకు నోటిమాటే రావటము లేదు తల్లీ – అదీ నా దారిద్ర్యమే కాబోలు–

**మల్లన్న :** నాన్నా!

(మాచమ్మ లోపలనుంచీ అబ్బాయీ ఏమిట్రా ఈ గొడవంతా అంటూ ప్రవేశిస్తుంది)

**మల్లన్న :** పైత్యించిందని ఎంతచెప్పినా వినకుండా అమాంతం ఒకమాటు మంచంలోనుంచి లేచేటప్పటికి నాన్న ఆస్తు బిస్తయిపోయి ఏవో అర్థంగాని మాటలన్నీ మాట్లాడుతున్నాడు.

**మాచమ్మ :** అయ్యో! అయ్యో! – త్వరగా వైద్యుణ్ణి పిలుచుకురా పోరా – ఒక పని చేస్తారా – ఒకటే మూర్ఖం. ఆ మనిషి పట్టిందేపట్టు – నేను ఆ నొసటి కుంకుమకు కూడా నోచుకోలేదు కామాలి.

**మల్లన్న :** అమ్మా! నీవేం భయపడవాకు. ఇదుగో ఆయన్ను కదిలించకుండా అలాగే విసనకర్రతో విసురుతూ ఉండు–

(నిష్క్రమిస్తాడు)

**పోతన్న :** (దీనంగా) అమ్మా! నీ ముఖచంద్రుణ్ణి ఏవో కారుమేఘాలు కప్పేస్తున్నవి తల్లీ – అమ్మా కన్నీరా.... ఎందుకు తల్లీ – ఇలారా అమ్మా నన్ను తుడవనీ – నీ శతపత్ర నేత్రాలు వాడి పోనీయకమ్మా – నా సర్వస్వమూ నీది. ఒక్కమాటు ఆ కారుమేఘాలన్నీ విరిసి పోయేటట్లు తరిపి వెన్నెలలు కాయించుతల్లీ నీ చిఱునవ్వుతో.

**మాచమ్మ :** ఎప్పుడూ మేఘాలు – మట్టీ మశానం – ఇవే మా కొంప తీసినవి – పిచ్చెక్కినా కవిత్వం మానలేదుగదా బ్రాహ్మణుడు. ఈ పిచ్చే అందువల్ల అయితే అదెక్కడికి పోయింది.

**పోతన్న :** (ఎవరి ప్రశ్నలకో సమాధానమిస్తున్నట్టు). ఔను.... ఆ.... నిరుపేదనే నీవన్నట్లు.... నా జీవనమా? నీ కృపవల్ల... రాజుల నెవరినైనా ఆశ్రయించమంటావా. నా కంఠంలో ప్రాణముండగా.... లేదు తల్లి.... నాకు ఏకోశానా ఆ ఊహలేదు.... ఇదుగో నీవన్నట్లు రామచంద్రమూర్తికే నిన్నిచ్చి కల్యాణం చేస్తాను – వాగ్దానమూ.

(చేతిలో చేయివేస్తున్నట్లుగా చేయి ఉంచి)

**కాటుక కంటినీరు చను కట్టుపయింబడ నేల యేడ్చెదో**
**కైటభ దైత్యమర్దనుని గాదిలి కోడల, ఓ మదంబు, ఓ**
**హాటక గర్భురాణి నిను నాకటికిం గొనిపోయి అల్ల క**
**ర్ణాట కరాట కీచకులకమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ –**

సంతోషం తల్లీ – తిరోగమిస్తున్నావా – నామాట ఏం చెప్పినట్లు – ఊః సరే–

**మాచమ్మ :** వెర్రి వేయివిధాలంటారు – ఇది ఆ వేయిలో చేరుతుందో లేదో! ఇటువంటి వాళ్ళు వెనక పుడితేగా చేరటానికి – ఊ చేరదు.

**పోతన్న :** (అమితానందంతో కళ్ళు.... ముడిచి మళ్ళా తెరిచి) అమ్మా – అమ్మాయి తీరా వెళ్ళి పోయిన తరువాత వచ్చేశాం – అభయమిచ్చేశాను. ఆమె ఆ రామచంద్రమూర్తికే తన్నిచ్చి వివాహం చేయమంది – రామచంద్ర ప్రభో! రామచంద్ర ప్రభో!! (విగ్రహం వైపు చూస్తూ పరమానందంతో) త్వరలో నీ వివాహం తండ్రీ – అమ్మాయి వచ్చి స్వయంగా నిన్నే వరించింది తండ్రీ – (దారు విగ్రహం ముందు మోకరిల్లి)

**నమోనంతాయ సూక్ష్మాయ**
**కూటస్థాయ విపశ్చితే**
**నానా వాదానురోధాయ**
**వాచ్య వాచక శక్తయే–**

(సాష్టాంగ ప్రణామం చేస్తాడు. వెనుక మాచమ్మ ఆశ్చర్యంతో ముక్కుమీద వేలు వేసుకొని చూస్తూ నిలబడుతుంది.

(సమాప్తం)

***(ప్రజావాణి – 7-10-62 – 28-10-62)***

# కజ్జల
# పూర్వార్థము
## ప్రథమ దృశ్యము

(రాజాంతఃపుర సౌధోపరిభాగం. సౌధం చుట్టూరా నగర ప్రజలంతా 'యువరాజ' ముఖ దర్శనార్థం నిరీక్షిస్తూ హర్ష ధ్వనులతో, కేరింతలతో, గుమికూడి ఉంటారు. సౌధోపరి భాగంలో కాబొయ్యే యువరాజుకు నీళ్ళు పోసి, అగరు ధూపాలతో కురులారుస్తూ స్త్రీలు మంగళహారతు లెత్తు తుంటారు. అతడు అక్క సారంగదేవి చేతుల్లో హాయిగా నిద్రపోతూ ఉంటాడు. ఒక మూలన బంగారు గొలుసుల ఉయ్యేల. రెండువైపులా దీపపు సెమ్మెలు – కర్పూరపు వాసనలు – అగరుధూప పాత్రికలు ప్రస్తుతము మహారాణి అనే పేరుతో వ్యవహరిస్తూ ఉన్న కజ్జల (దేశాధిపతి ఉంపుడు కత్తె) రాజసంతో ఒకమాటు పసిబిడ్డనూ, మరొకమాటు జన సమూహాన్ని చూస్తూ మంగళగీతం వింటూ ఆనంద పరవశురాలై అలసటవల్ల నిట్టూరుస్తూ ఉంటుంది. సారంగ దేవి చేతుల్లో నుంచి పిల్లవాడిని ఉయ్యాలలో నిద్రపుచ్చుతూ జోలపాట పాడుతుంటారు. చత్వర నుంచి సౌధం ముందు గుమిగూడి "కజ్జల మహాదేవికీ జై" అనే సంతోష సూచక ధ్వనులతో ఉప్పొంగిపోతూ ఉన్న ప్రజలను చూస్తూ నిలుచున్న కజ్జల మంగళగీతం పూర్తికాగానే ఒక మాటు హఠాత్తుగా వెనకకు తిరిగి కుమార్తె సారంగదేవితో)

**కజ్జల :** ఒకమాటు కుమారుణ్ణి ప్రజలకు చూపించు.

**సారంగదేవి :** (పసిబిడ్డను కంచుకి చేతికిస్తుంది)

**కజ్జల :** అమ్మాయీ! నీవే తమ్ముణ్ణి ప్రజకు చూపించు.

**సారంగదేవి :** (అనుమానిస్తూ) నేనా!

**కజ్జల :** అవును నీవే. ఈ దినంకూడా నిన్ను చూడటానికి ప్రజ తహతహ పడుతూ ఉంటుంది.

**సారంగదేవి :** (కొంతదూరం పసిబిడ్డను అందుకొని నడుస్తుంది. ప్రజ "కుమార మహాప్రభువుకు జై" అని కేకలు వేస్తూ ఉంటారు)

**కంచుకి :** (సారంగదేవిని అనుసరిస్తూ) అమ్మాయీ! సారంగదేవి, అటు చూడు. ఎంత ఆనందకరమైన దృశ్యమో చూడు. సమస్త కాశ్మీర ప్రజానీకం నీ తమ్ముణ్ణి దర్శించటానికి వచ్చారు. ఉత్కంఠతో ఎంత ఉత్సాహాన్ని ప్రకటిస్తున్నారో చూడు. నీ అదృష్టాన్ని ఏమని కొనియాడాలో తల్లీ ... అమ్మా ఎప్పుడూ ఏమిటా అర్థం కాని అయోమయ చింతారేఖలు నీ ముఖం మీద.

**సారంగదేవి :** (పసిబిడ్డను చత్వరం దాకా తీసుకు పోయి పెద్ద పెట్టుగా) అబ్బా బాధ – కంచుకీ – నీవు చూపించు.

**(వెనుకనే నిలుస్తుంది)**

**కంచుకి :** (పిల్లవాణ్ణి తీసుకుపోయి చూపిస్తుంటే ప్రజలు జయఘోషలు చేస్తారు – కజ్జలా దేవితో)

అమ్మా! ప్రజలెంత ఆనందంతో అబ్బాయికి జయపెడు తున్నారో వింటున్నారా! వాళ్ళకు ఆయనమీద ఎంత అనురాగమో చూస్తున్నారా. అదుగో! ఆవైపు చూడండి ఉత్సాహాధిక్యంలో ఉత్తరీయాంశుకాలు ఎలా ఎగుర వేస్తున్నారో! ఆ కుంకుమ కేసరాలు చల్లుకోటం చూస్తున్నారా? చిందులేసి నృత్యం చేసే ఆ చిన్నవాళ్ళ గుంపును చూడండి. ఆబాలగోపాలమూ ఎంత అనురాగాన్ని ప్రకటిస్తున్నారో మీకు అవగతమౌతున్నదా? ఏ రాజకుమార దర్శనానికి...

**కజ్జలాదేవి :** ఇంకా నా మనస్సుకు సంతృప్తి కలుగలేదు కంచుకీ – మా రాజమహిషి బంధులుణ్ణి కన్నప్పుడు ప్రజ చూపించిన అతిశయానురాగానికి ఇది సాటి వస్తుందా? ఒక వసంత మన్నా బ్రతకకపోయినా ఆ బంధులుడు అతని దర్శనార్థం విచ్చేసి ప్రజలు చూపించిన ఆనంద రసావేశం నా జీవితంలో మరచిపోలేను. వారి సంతోష సూచకధ్వనులు ఈనాటికీ నా చెవుల్లో రింగుమని మార్మోగుతూనే ఉన్నవి – కంచుకీ! ఈ ఉత్సాహంతో నా మనస్సు శాంతి పడటం లేదు. సంతృప్తి కలగటం లేదు. బిడ్డను నా చేతికిచ్చి ఒక్కమాటుగా ఆ బొక్కెనలు విప్పి రౌప్యఖండాలను ప్రజల లోకి వెదజల్లు – ఆ కాంచన కుంభాలలో పన్నీరు చిలకవోయ్ – ఆ గులాబీ కుంకుమతో ఒక్కమాటు వాళ్ళందరినీ గప్పివేయ్.

**కంచుకి :** (కుమారుణ్ణి కజ్జలాదేవి చేతి కందిచ్చి చెప్పినట్లు చేస్తాడు. మాటిమాటికీ ప్రజలలో హర్షధ్వనులు చెలరేగుతూ వినిపిస్తవి. కజ్జలాదేవి పట్టరాని సంతోషంతో దీర్ఘంగా నిశ్వాసిస్తూ కొంతసేపు నిలవబడి పసిబిడ్డతో వెనకకు వచ్చి పర్యంకం మీద కూర్చొని)

**కజ్జల :** అమాత్య కంచుకీ – ఆమె ఇంకా పిల్లవాణ్ణి చూచిపోవటానికి రాలేదు.

**కంచుకి :** ఆమె ఎవరు? తల్లీ –

**కజ్జల :** మన మహారాణి.

**కంచుకి :** మొగం చెల్లలేదేమో.

**(మహారాణి వస్తూ ఉన్నట్లు సూచించే ప్రాసాద ఘంటికలు వినిపిస్తవి)**

(ప్రవేశము రాణి. కంచుకి తదితరులూ ప్రక్కకు తప్పుకుంటారు. కజ్జల లేచి సగౌరవంగా ఆర్వాసన మిచ్చి, గౌరవించిన తరువాత)

**రాణి :** కజ్జలా! నిన్న సాయంత్రం నిన్ను గురించి ఎంత ఆదుర్దా పడ్డానో విన్నావా? ఇంకేముంది అయిపోయిందన్న వార్త వినేటప్పటికల్లా నా గుండె గుభేలు మన్నది. ఇంతకు పరమశివుడి కృప నీ మీద ఉన్నది. యముడి నోట్లో గడ్డకొట్టి బ్రతికావు. అంతటి క్రితం రాత్రి నీ మీద పీడకల కూడా వచ్చింది సుమా.

**కజ్జల :** మీ ఆదరానురాగాలకు ఎంతో కృతజ్ఞురాలను. అనవసరమైన పీడకలలతో మీ నిద్రకు నావల్ల ఏమీ భంగం రాలేదు కద.

**రాణి :** ఉహూ– బలే మంచి సందేహమే కలిగింది కజ్జలా! లోకమంతా ఒక్కమాటుగా తారుమారైనా ప్రస్తుత స్థితిలో నా నిద్రకు ఏ విధమైన భంగమూ కలగదు. పట్టుపట్టి ప్రయత్నించినా ఏ పరమ దౌర్భాగ్యుడూ పంతం చెల్లించుకోలేడు.

**(కజ్జల ముఖం కేసి చూస్తూ)**

అయినా ఒకప్పుడు మాత్రం ప్రతినిత్యమూ నా పర్యంకం దుఃఖభాష్పాలతో పంకిలమైపోయినమాట వాస్తవము. అయినా ఏం ప్రయోజనం... నిద్ర పట్టించుకొనక తప్పింది కాదు. తరువాత క్రమక్రమంగా అలవాటు పడ్డాను. ఆ కజ్జల జలమూ ఇంకి పోయింది. నా పర్యంకం పంకిలం కావటమూ మానివేసింది. (ఆ ప్రసంగాన్ని తుడిచివేసినట్లుగా చప్పరించి) కజ్జలా, ఏదీ ఒకమాటు ఇలారా. (తానే దగ్గరికి పోయి)

ఒక్కమాటు నీ ముఖం చూడనీ – (ముఖం చిట్లిస్తూ) శరత్కాల చంద్రుణ్ణి పరిహసించే అంత చక్కని నీ ముఖం ఇలా అయిపోయిందేం కజ్జలా. ఎంత పాలిపోయింది నీ శరీరం. కామదేవుణ్ణి తప్ప కొలవలేనన్న నీవు నీకు తెలియకుండానే విభూతి ధారణం చేసి శివదీక్ష పుచ్చుకున్నావనిపిస్తున్నదే నీ దేహం. ఏదీ నీ చెయ్యి (అందుకొని) కాక తగిలినట్లున్నది... ఎందుకో నీవు బాగా లేవు. నీ మనస్సు బాగా లేదా?

**కజ్జల :** తాము నా ఆరోగ్య విషయంలో అతిశ్రద్ధ వహిస్తున్నారు. నాకేమీ జబ్బులేదు. ఈ ప్రజల సంతోష కోలాహలము కనులార చూచి ఆనందిస్తూ ఉన్న నా మనస్సు బాగా లేకపోవటానికి అవకాశం కూడా లేదు.

**రాణి :** కజ్జలా! ఏ విధమైన అనుమానం ఉన్నా దాచిపెట్టవద్దు. నాతో చెప్పటానికి నీకేం దాపరికం గనుక... ఈనాడే నా దగ్గరికి ఒక మానస శాస్త్రవేత్త వచ్చాడు. పంపనా! భూతవైద్యులలో ప్రఖ్యాతి గన్న పశుపతినాథుడు ప్రస్తుతం మన శ్రీనగరములోనే ఉన్నాడట – ఎందుకు వృధాగా రోగాన్ని కప్పిపెట్టి తరువాత ఎందుకు అపమృత్యువును ఆహ్వానిస్తావు కజ్జలా! నీ వియోగాన్ని నేను భరించగలుగు తానా? ఎలా భరించటం. భరించలేను కజ్జలా!

**కజ్జల :** (వ్యంగ్యోక్తిగా) తమ సేవకు నా బ్రతుకు ఇంత అత్యంతావశ్య కమని ఎన్నడూ గుర్తించలేకపోయినాను. తాము క్షమించాలి.

**రాణి :** అదే కాదు నేను అలవాటుపడ్డ వాళ్ళలో తప్ప మెలగలేను. అయిష్టమైన వాళ్ళను ఆదరించగలుగుదును గాని కొత్త మొగాలతో పరిచయమంటే నాకేమిటో భయమేస్తుంది కజ్జలా! – చూడలేను.

**కజ్జల :** (రాణి మాటలను జాగరూకతతో అవగతం చేసుకుంటున్నట్లు వర్తిస్తుంది)

**రాణి :** నీకూ నాకూ ఉన్న అనుబంధం ఈనాటిదా అలా అనుకోగానే తెంచి వేసుకోటానికి. నీ ప్రాణానికి ఏదైనా అపాయం కలిగితే అది నా ప్రాణానికీ అపాయమే. నా మంచికోసం, ఆత్మరక్షణ కోసం నిన్నర్థిస్తున్నాను కజ్జలా! నీవు ఈ విధంగా బాగా లేకపోవటానికి కారణమేమిటో బయటపెట్టు. ఎంత ఆదరానురాగాలతో ప్రజలు నీకు జయపెడుతున్నారో వింటున్నావా? ఆ జయఘోషలవల్ల నీకు వెర్రెత్తటం లేదూ?

**కజ్జల :** అది నాకు సంతృప్తే కలిగించలేదు. సంతృప్తికి మించిన తరువాత గదా ఉన్మాదం – ఉత్తమాత్మలకు తను యూహాగానం వినటం కన్నా వేరే సంగీతమే లేనప్పుడు...

**రాణి :** నేను బంధులుణ్ణి ప్రసవించినప్పుడు కూడా ప్రజలు ఇంత ఉత్సాహాన్ని ప్రకటించలేదు. అయినా అది మాకు అనవసరం కూడాను.

**కజ్జల :** కారణం.

**రాణి :** ప్రజ ప్రేమించినా ప్రేమించకపోయినా వాడు యువరాజు కాక తప్పకపోవటం. అతని ఆజ్ఞానుసారంగా వాళ్లు నడవక తప్పకపోవటం.

**కజ్జల :** దేవీ! రాజ్యార్హత కేవలం పుట్టుకతోటి వచ్చే శాశ్వత భోగం కాదు. ప్రేమ మూలకంగా రాజ్యాన్ని సంపాదించుకొని ప్రజలను సంతుష్టి పరచిన రాజులదే ప్రజ్ఞ. చరిత్రల్లో వన్నె కెక్కిన రారాజు లందరూ ఇటువంటివారే.

**రాణి :** నీవన్నమాట సత్యమే కజ్జలా! ఈ విషయం నాకిప్పుడు కాదు, ఈ కాశ్మీరంలో కాలు పెట్టినప్పుడే తెలిసింది. సీతాకోక చిలుకల్లా చిందులేసే చేటికలకే ఈ దేశంలో పరమ పతివ్రతలకన్నా ప్రాభవం, విస్తారం. గౌరవం అత్యధికము. మొదట మొదటా నా మనస్సుకు ఎంతో కష్టం వేసేది. కాని తరువాత తరువాత మెట్టిన చోటు ఎంత నికృష్టమైనదైనా ఆ దేశాచారాన్ని మన్నించక తప్పదని మనస్సును సమాధాన పరిచాను.

**కజ్జల :** పాతివ్రత్యం బహూకృతి కోరదుగదా! ఒక వేళ వాంఛించినా అది అందులోనే ఉంది.

**రాణి :** అదొక్కటే సంతృప్తి పతివ్రతలకు. కానీ ప్రాభవం కోసం ఒకప్పుడు కొందరు పతివ్రతలు తమ పాతివ్రత్యాన్ని కూడా బలి ఇవ్వటానికి వెనుకాడరు.

**కజ్జల :** బలి ఇవ్వటమనటంలో మీ అభిప్రాయం?

**రాణి :** (అర్థోక్తిగా) కజ్జలా! మనకెందుకిప్పుడీ అనవసర ప్రసంగం. ఆ విషయాన్ని ఇకపోనీ – అనవసరంగా తరచకు. మన సంభాషణ విషయాలు ఎన్నడూ శివదేశికుల చెవిన పడ నీయకు – మన వయస్సులో ఉన్నవాళ్ళు మధ్యపెట్టి ఇంకొకళ్ళ మనస్సును ఆకర్షించాలని పూనుకోటం ఎంత పొరబాటు. ఇన్నేళ్ళు వచ్చిన తరువాత మనకు మదనుడు ఏ ఊహలు ప్రసాదిస్తే ఏం ప్రయోజనం. పతివ్రతలంగా ఉండటం తప్ప మరొక పని చెయ్యలేం గదా! ఆ మాటని ఊరుకుంటామా అంటే ఊరుకోనూ లేము. మధ్య మధ్యా మన్మథ బాణాలకు గురికావటం తప్పించుకోలేము. అటువంటి సమయాలల్లోనే మనం జాగరూకత వహించాలి. చిత్త చాంచల్యానికి చోటివ్వకూడదు. చితిమంటలు ఎక్క వలసి వచ్చినా శీలం కాపాడుకోవాలి.

**కజ్జల :** దేవీ! మీరేమి మాట్లాడుతున్నారో నాకేమీ అర్థం కావటం లేదు.

**రాణి :** పాపం! పిచ్చిదానివి. నీ చుట్టూ ఎన్ని కుట్రలు జరుగుతున్నవో నీకేం తెలియటం లేదు? మహారాజు మాటమాత్రం నీ చెవిలో వేయలేదూ?... (అటూ ఇటూ చూస్తూ) ఎప్పుడైనా సరే జ్ఞప్తికుంచుకో... చుట్టూ మాంత్రికులు. మధ్య మనం. వాళ్ళ తంత్రాలల్లోనుంచీ ఎవరూ తప్పించుకోలేరు. కాల్చినా మళ్ళీ పుట్టుకువచ్చే వీళ్ళను కాలుడే జయించలేకపోతున్నాడు. ఒక్కొక్క మాంత్రికుడి చేతిలో ఎన్నెన్ని పిశాచాలున్నవో నీకు తెలియలేదన్నమాట! ఎంత మంది రాజులు వాటి కాహుతై పోతున్నారో నీవు ఎరగవన్నమాట!! – అదేం కజ్జలా అలా చల్లబడిపోతున్నావు?

**కజ్జల :** లేదు దేవీ. కానివ్వండి మీరు దయ ఉంచి మరికొంత ప్రస్ఫుటం చెయ్యాలి మీ ప్రసంగం.

**రాణి :** ఆ పిశాచాలు మన ఆస్థానమంతటా వికృతనృత్యం చేస్తున్నవి. ధనార్జనకోసం కొందరూ, గౌరవవాంఛతో కొందరూ, ప్రేమ పేరుతో మరికొందరూ వాటికి తమ పవిత్రాత్మలను అమ్మేసుకుంటున్నారు. పాపం! అభీరుడు ఎంత మంచివాడో నీవు ఎరుగుదువా? ఎరక్కపోవటమేమిటి? తన భార్యను ఒక పురుష పిశాచానికి ప్రీతిపూర్వకంగా అర్పించాడు. ఆ పిశాచాలల్లో కల్లా నాయకురాలు తనను ప్రేమించిన మహారాజుకు విషమిచ్చి చంపేసిందట. విషము! అమ్మయ్యో విషము!! ఏది ముట్టుకోబోయినా విషం – ఏది తాగబోయినా విషం. దాని చెల్లెలు మళ్ళీ పెళ్ళి చేసుకోటానికి అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భర్తకు పాషాణం పోసింది. పురుషుల్లో క్రౌర్యముంటుందంటే వెనక నమ్మేదాన్ని. స్త్రీలల్లో క్రౌర్యం. కుసుమ కోమలులా! గండశిలా కర్కశలు! స్త్రీలు! స్త్రీలు కూడా విషప్రయోగం.

**కజ్జల :** మీరు ఇంతగా ఎందుకు ఆశ్చర్య పడుతున్నారో నాకవగతం కావటం లేదు.

**రాణి :** అంటే స్త్రీలు కూడా విషప్రయోగం చేస్తారన్నమాట.

**కజ్జల :** ఎందుకు చెయ్యరు, కోరికలు సిద్ధించటమే ప్రధానంగా పెట్టుకున్నవాళ్ళు. కోమలాంగులయితే ఆ సాధనను స్వీకరించటానికి మరీ త్వరగా లొంగుతారు.

**రాణి :** నరకం మాటే మరచిపోతారా ఆ సమయంలో.

**కజ్జల :** మరవకు రానూవచ్చు – రాకపోనూ వచ్చు. అయినా క్రౌర్యానురాగంతో పోలిస్తే నరకం ఏపాటిది?

**రాణి :** క్రౌర్యంగానీ, అనురాగం గానీ కలకాలం అనుభవించేది కాదుగా – అందుకోసమని కలకాలం యుగయుగాలు, తరతరాలు రౌరవాది నరకాలల్లో రాక్షసబాధలనుభవిస్తారా?

**కజ్జల :** (ఉద్వేగంతో) ఒకనాటి దైతేనేం – ఒక క్షణకాలానిదైతేనేం విజయం విజయమే – దోషానికి మొగ్గలేక జీవితాన్ని తొలగదోసుకోబోయే పిరికిగుండె ఎవరికో గాని ఉండదు. అందులో ప్రేమకోసం క్రౌర్యం – ఈర్ష్య ఎంత గొప్ప విశేషాలు. ఎన్ని జన్మలకైనా సాధించతగ్గవి. దేవీ – ప్రేమించ లేని ఆత్మ జీవించటమే లేదన్నమాట. ప్రేమించిన తరువాత సాధించలేకపోవటం మరీ చవటతనం. నా దృష్టిలో ప్రేమ విజయమే ప్రధానం గాని పరమపాపిష్ఠి నరకమన్నా భయంలేదు. ఆ సాధనలో చరమ సోపానాన్ని చేరుకొని పడిపోయినా భయం లేదు. ఆ సాధనలో ప్రాప్తించిన నరకంలోనే స్వర్గ సౌఖ్యమున్నదని నా ఆశయం.

**రాణి :** కజ్జలా! ఎందుకంత ఆవేశం. ఏమిటా దీర్ఘ నిశ్వాసాలు. ఉc... ఆ పిశాచాలను పూజించేవారంటే నీకూ అభిమాన మన్నమాట. ఈ మాటకు అంగీకరిస్తావా?

**కజ్జల :** అంగీకరించటమూ కాదు. అంగీకరించకపోవటమూ కాదు. వారి మనస్సులను అర్థం చేసుకొని వాళ్ళ దైన్యానికి చింతిస్తున్నాను. కాదు కాదు. వాళ్ళ సాహసాన్ని అభినందిస్తున్నాను. పాపం చెయ్యడానికి ప్రయత్నించాడని రుజువు కావాలనే పరమ దౌర్భాగ్య దండన విధించుటకేనా? పాపం చెయ్యటానికి ఎంతటి వీరగుణం కావాలో ఆలోచించాలి. అంత సాహసానికి పూనుకోవలసిన ఆగత్యమేమిటో అవగతం చేసుకొని దోషి అని తోస్తే దండన విధించడం ఎంత సమంజసము!

**రాణి :** కజ్జలా! నేను ఎవరినీ ఉద్దేశించి ప్రసంగించటం లేదు. దూషించటం లేదు. ఏమిటీ ఉద్వేగం. నా మాటలు నిన్ను ఇంత కలవరపెడుతవని కలలో కూడా భావించలేదు – వృథాగా ఎందుకు శరీరానికి అలసట తెచ్చి పెట్టుకుంటావు. పచ్చి వళ్లు బహు జాగ్రత్తగా పథ్యం చేయాలి సుమా! ఇంత లోనే ఎంత చెమట పోసింది – అంత ఇష్టం లేకపోతే ఆ ప్రసంగం నేనుమటుకెందుకు చేస్తాను – కజ్జలా! నా పతకాన్ని ఏం చేశావు?

**కజ్జల :** మీ పతకము?

**రాణి :** అవును. నా పచ్చల పతకము.

**కజ్జల :** మీ అభిప్రాయము?

**రాణి :** మహారాజు రాత్రి నన్ను అడిగి పుచ్చుకొని వెళ్ళారు. నీకోసమే ననుకున్నాను కజ్జలా! ఎంత సంతోషంతో తీసి ఇచ్చానను కున్నావు. అయితే ఆ కానుక నీకు కాదన్నమాట. ఇంకెవరికిచ్చి ఉంటారబ్బా (యోచన) ఉఁః... నమ్మలేను. ఉఁ నమ్మలేను.

**కజ్జల :** వారి మెడలోనే ఉండి ఉండవచ్చు. వచ్చి కొడుకును ముద్దాడి నా కంఠసీమను అలంకరించవచ్చు.

**రాణి :** ఆ కంఠసీమను అలంకరించటం గత రాత్రే జరిగిపోయినది. నీ కంఠసీమను కాదని ఇప్పుడు నాకు అవగతమౌతున్నది. – మీరిచ్చిన బహూకృతికి ప్రియ సంతోషించిందా అని ప్రశ్నిస్తే మహానందపడ్డదని ప్రభువు సమాధానం చెప్పి నప్పుడు నాకెంత ఆహ్లాదం కలిగింది కజ్జలా! నీవంటే నాకు మొదటినుంచీ అదేదో అర్థంకాని అనురాగమూ, అనుబంధమూ ఏర్పడ్డవి... పోనీలే దిగులు పడవద్దు. నేను ప్రత్యేకంగా నీకివ్వమని మరొక పతకం – అంతకంటే చాలా విలువగలది – మా తండ్రిగారు నాకు వివాహ సమయంలో బహూకరించింది – ప్రభువుచేత పంపిస్తాను దిగులు పడకు.

**కజ్జల :** నాకేమీ అవసరం లేదు.

**రాణి :** నేను తప్పకుండా పంపిస్తాను. నీవు ఇంత చిన్నబుచ్చు కోవటం వల్ల నా మనస్సుకు ఎంత బాధగా ఉన్నదో నీకేం తెలుసు... ఉఁ ఇంతకూ మహారాజు నిన్ను మోసగించారన్న మాట – ఇక బయలుదేరనా... వెంటనే పతకం పంపిస్తాను. (లేవబోతుంది)

**కజ్జల :** (యోచనాపూర్వకంగా) దేవీ – మీరు పంపవద్దు. నాకు అనవసరం. ముమ్మాటికీ నేను స్వీకరించను.

**రాణి :** స్వీకరించవూ? ఏమిటా కలవరము కజ్జలా? ఈ దినము ప్రతి చిన్న విషయమూ నిన్నింతగా కలతపెడుతూ ఉన్నదేం? పోనీ. పంపనులే. నీ మనస్సుకు అంత కష్టంగా ఉంటే నేనుమాత్రం బలవంతం చేస్తానా. ఎందుకీ బాధ పడటం. ఏం ప్రయోజనం. మహారాజు చిత్తవృత్తి ఎరుగని దానివి కావుగా... ఆయన ఎప్పుడూ కొత్త కొత్త సీతాకోక చిలుకలను వెతుకుతూ ఉంటాడుగదా. నూతన ప్రియుడు ఈ పతాకాన్ని తన్నుకుపోను పరసీమనుంచి ఏదో ఒక సీతాకోకచిలుక మన రాజు సౌధాగ్రం మీద వ్రాలిందన్నమాట.

**కజ్జల :** (దీర్ఘ నిశ్వాసంతో) దేవీ నేను అలసి పోయినాను. క్షమించాలి.

**రాణి :** అవును. అవును. నీ ముఖ వర్చస్సును బట్టే అవగతమౌతూ ఉన్నది. కొంచెం విశ్రాంతి తీసుకో – నేనూ బయలుదేరనా (రెండడుగులు ముందుకు వేసి మళ్ళీ వెనుకకు వచ్చి ఆప్యాయంగా) నీ రూపం ఎంత చెడి పోయింది కజ్జలా! గుర్తుపట్టలేకుండా ఎలా మారి మారి పోయినావు. ఆరోగ్య విషయంలో అతిశ్రద్ధ వహించు సుమా! ఇది నాకోసం చెపుతున్నమాట. మనం వయస్సులో ఉన్న వాళ్ళము. బహు జాగ్రత్తగా ప్రవర్తించాలి. ధైర్యం పోగొట్టు కోకు. మహారాజు మన్ననా మళ్ళకేం చేస్తుంది. పుష్టిగా తిను. ప్రసవాసవాలు సేవించు, దీర్ఘ నిద్ర అవసరం. దేన్ని గురించీ అట్టేసేపు ఆలోచించవద్దు.

**(కజ్జల వాడిపోయిన ముఖంతో లేచి వణికిపోయే చేతులతో రాణికి నమస్కరిస్తుంది. రాణి నిష్క్రమిస్తుంది.)**

**కజ్జల :** కంచుకీ!

**కంచుకి :** (ప్రవేశించి) అమ్మాయీ!

**కజ్జల :** (అతనిచేయి ఊతగా తీసుకొని మయూరాసనం మీద విశ్రమిస్తూ) విన్నావా? మహారాజు నన్నెలా మోసగిస్తున్నాడో. ఇంకొకతెను ప్రేమిస్తున్నాడు. అనన్య సాధ్యమైన నా స్థానాన్ని మరెవరో ఆక్రమించారు... నా పారితోషికాలు మరొకతె స్వీకరించి అలంకరించుకుంటున్నది. ఇంత వరకూ ప్రభువు ఇక్కడికి రాకపోవటానికి ఇదే కారణం. పసిబిడ్డను చూడకుండా ఆ పాపిష్ఠి కళ్ళు ఎలా ఉండగలిగాయో? సౌధాలల్లో తిరిగేటప్పుడు నాకంటపడి కూడా చూడనట్లు తప్పించుకు తిరుగుతున్నాడు. ఛీ! అన్యాయంగా ఆయనమీద అపనిందలు వెయ్యటమెందుకు? రాణి చెప్పిన మాటల్లో సత్యమెంతో... ఈర్ష్యాపరురాలు! అలా జరగటానికి అవకాశమెక్కడిది? ఇదంతా నా ప్రాభవాన్ని చూచి ఓర్వలేని ఈ కుతంత్రురాలు పన్నిన పన్నాగమై ఉంటుంది. ఈ ఉత్సాహ సమయంలో కాసేపైనా నన్ను బాధపెట్టి మనస్సులో సంతోషించటానికి. అబ్బా! ఇది ఎంత కథ పన్నింది!

**కంచుకి :** అమ్మాయీ! ఆమె చెప్పిన మాటల్లో అణుమాత్రం అసత్యం లేదు. నీకు నిజంగా ఎవరో శత్రువు మొలకెత్తింది.

**కజ్జల :** ఓరి సాహసీ! నీకు తెలుసునన్నమాట. ఇన్నాళ్ళబట్టీ నాకెందుకు ఎరుక పరచలేదు పాపీ.

**కంచుకి :** అమ్మాయీ! మరొకమాట రానియ్యకు. నేను వెళ్ళిపోతాను. (బయలు దేరతాడు)

**కజ్జల :** ఆగక్కడ. ఎవరా వ్యక్తి? ఇంతకు ముందెందుకు చెప్పలేదు?

**కంచుకి :** నీవే తెలుసుకుంటావని. నీవు గ్రహించలేకపోవటం నా దోషమా?

**కజ్జల :** నమ్మి నా గుట్టంతా నీ చేతుల్లో పెడితే నీవు చూపించవలసిన కృతజ్ఞత ఇదేనా? కోరుకున్నదల్లా ఇచ్చి నిన్ను సంతృప్తి పరిచానే – ఇదేనా నీ సానుభూతి?

**కంచుకి :** నామీద నీ నేరము. నీవీ స్థితికి రావటానికి కారకులెవరో మరిచిపోయి మాట్లాడకు. పదిహేను వసంతాలపాటు మహారాజు మనస్సు నీకిప్పించిన నా మీదనా నీ నేరము.

**కజ్జల :** (తప్పిదాన్ని గ్రహించినట్లు) అవును నిజమే. అందుకు నేను కృతజ్ఞురాలను. కానీ కంచుకీ, నా జీవితంలో నిమిషం సుఖం లేదు. ప్రతి దినమూ ఏదో ఒక ప్రళయము. మిన్ను విరిగి మీద పడటము. చిట్టచివరకీ మోసము. నా విజయశ్రీ ఎంత చంచలమైంది కంచుకీ – జయించి సుస్థిరమనుకున్న విజయం ఇన్నిమార్లు చేయి జారిపోతుంటే ఎన్ని ప్రయత్నాలు చేసేది.

**కంచుకి :** రూపంతో మురిపించి నన్నాళ్ళు మురిపించావు తల్లీ – ప్రణయ సామ్రాజ్య జయపతాకవైనావు. ఆ రూపం అనిత్యం. అందువల్ల చేకూరే విజయమూ అనిత్యం. నిన్ను మించిన సౌందర్యం నిన్ను త్రోసి రాజన్నది. అది పరిపూర్ణ విజయం పొందటం భావ్యం కూడా. నీవు అనుసరించే మార్గము ఇంత కంటే సుస్థిరమైన విజయాన్ని ప్రసాదించలేదని చెప్పిన నా మాటలు నీకు వెనుక నచ్చినవా?

**కజ్జల :** ఆ శాశ్వత విజయానికి మార్గమేమిటో?

**కంచుకి :** (చిత్రంగా కజ్జల కళ్ళల్లోకి చూస్తూ) వెనుక విన్నవించిందేగా నీకే తెలుసు.

**కజ్జల :** (కోపంతో) ఛా! నోరు ముయ్.

**కంచుకి :** నేను ఎవరి క్షేమం కోరి మాట్లాడుతున్నానో గ్రహించావా? అతి స్వల్పతంత్రం.

**కజ్జల :** ఆ ప్రసంగం మరొకమాటు రానిస్తే మన్నించను కంచుకీ!

**కంచుకి :** కజ్జలా! కోపం తెచ్చుకోకు. శాక్తేయపంక్తి కంఠస్వామి ప్రజ్ఞ – అసామాన్యంలో యావద్భారతంలో ప్రఖ్యాతి పొందింది. అంతటి మహాత్ముడి అండ ఉండి కూడా ఆశ్రయలోపం వల్ల ఆశయ సాఫల్యం పొందలేకపోవటం మన దురదృష్టం – అవ్యక్తత.

**కజ్జల :** సమస్త శక్తులూ నాకరగతాలౌతవా?

**కంచుకి :** ఇంకా సందేహమా?

**కజ్జల :** (యోచనాపూర్వకంగా) నా ఆత్మ మహారాజుది. పంక్తికంఠ స్వామి నీచ కైంకర్యానికి కాశ్మీర రవికిరణ సంఫుల్ల కైరవం – ఈ దేహాన్ని ఉపహారం చేయగలుగుతానా?

**కంచుకి :** మనస్సులో మహారాజును స్మరించుకుంటూ, కాసేపు కళ్ళు మూసుకొని...

**కజ్జల :** నగ్నంగా... శక్తి ముందు నేనూ నా మీద భయంకర శాక్తేయకరాళ హస్తాలు – నా జీవధనాన్ని నిమిషంలో దోచుకుంటాడా... బాబో మనస్సు అంగీకరించటంలేదు.

**కంచుకి :** ఆశయంతో పోలిస్తే నీ త్యాగమెంత? శక్తికి దేహాన్ని ఉపహారంగా ఇవ్వలేని నీకు మహత్తరమైన ఈశ్వితశక్తి ఎలా వస్తుంది. సాధనను బట్టే గదా సిద్ధి.

**కజ్జల :** కంచుకీ! నన్నేదో మోహ మహాసముద్రంలో ఈదించబోతు న్నావు. ఉఁః... విజయం హస్తగతం కాకపోయినాసరే. ఈ నీచమార్గాన్ని అనుసరించలేను కంచుకీ. నా పవిత్రదేహాన్ని బలిపీఠం ఎక్కించలేను కంచుకీ –

**(రెండు చేతులతో తల పట్టుకుంటుంది)**

**కంచుకి :** శుభాశుభాలనే అవధులందని జలధుల్లో మానవులు తట్టాడుతుంటారు. ఎవరో సాహసికులు కాని ఆ మహా సాగరాన్ని తరించి బయటపడలేరు – తరించినవాళ్ళకు ఈశిత్వమూ! వశిత్వమూ! త్రిలోక ప్రాభవమూ! కజ్జలా! కరతలామలకాలు కాబోతూ ఉన్న మహత్తర సౌఖ్యాన్నీ విజయాన్ని చేతులార చెడగొట్టుకోవద్దు. ఆలోచించుకో!

**కజ్జల :** రుగ్మత నా గుండెలు బ్రద్దలు చేస్తున్నది. ఈ క్రూర కర్మకు ఎదురు నిల్చే ధైర్య సాహసాలు దానికి లేవు. కంచుకీ – ఆ ప్రసంగమిక చాలించు. అనుభవించిన సౌఖ్యం చాలు. వెనక హస్తగతమైన విజయం చాలు. మోహానికి నిముషం లొంగానా నా జీవనావ మునిగిపోతుంది.

**కంచుకి :** ఆ నిమిషమే నిన్ను జగజ్జేతను చేస్తుంది. నీ పతనానికి నీవే కారణభూతురాలవు కావద్దు కజ్జలా! ఆలోచించుకో –

**(వెళ్ళబోతాడు)**

**కజ్జల :** (నీరస కంఠంతో) కంచుకీ! కోపం వద్దు. నన్ను ఒంటరిగా విడిచిపోవద్దు. ఈ జబ్బు నన్ను పీల్చి పిప్పి చేసి సగం చేసింది. నాలో శక్తి ఏదో నన్ను వదలి పెట్టిపోయింది. స్వయంగా ఆలోచించలేను. కన్నబిడ్డలా చూస్తూ ఉన్న నీవే నన్ను కాపాడాలి. ఆ భారం నీది... కంచుకీ – కాసేపు నన్ను విశ్రమించనీ. – (కంచుకి చేయి ఊత ఇచ్చి పాన్పు మీదికి చేరుస్తే ఆమె పవళిస్తుంది.)

## ద్వితీయ దృశ్యము

(రాజసౌధంలో కజ్జలాదేవి మందిరం. కజ్జలాదేవి గాఢంగా నిద్రిస్తూ ఉంటుంది. కుమార్తె సారంగదేవి ఒక ప్రక్కన వీణా నాదం చేస్తూ ఆలోచనా నిమగ్నురాలై ఉంటుంది.)

**షట్పది :** అమ్మాయీ! కజ్జలాదేవి గాఢనిద్రలో ఉన్నది. మనం ఇక్కడ పాడుకుంటూ ఆమె సుషుప్తికి భంగం కలిగించటం భావ్యం కాదు. ఎప్పుడూ ఏదో అవ్యక్తమైన బాధ అనుభవిస్తూ ఉంటుంది. ఈ దినం చాలా నీరసించిపోయింది.

**సారంగదేవి :** నిజమే! షట్పదీ – తోచక ఏదో పాట పాడుతున్నాను గాని, ఆమె నిద్రకు అంతరాయం కలిగించటము ఏమాత్రమూ నాకు ఇష్టం లేదు. నీవన్నట్లు ఆమె ఎప్పుడే ఏదో అవ్యక్తమైన వేదన అనుభవిస్తూ ఉన్నది. నేను పుట్టినది మొదలు చూస్తూనే ఉన్నాను. ఆమె జీవితంలో సుఖంగా గడిచిపోయింది ఒక దినమూ నాకు కనిపించలేదు.

**షట్పది :** (పెదవి విరుస్తూ) పాపం! ఆమె ఎన్నడూ సుఖంగా లేదు. అందులో ఈ ఉదయం.

**(వాతాయనంవైపు నడిచి చూచి వచ్చి దీర్ఘంగా నిశ్వాసిస్తుంది)**

**సారంగదేవి :** ఎందుకో దీర్ఘంగా నిశ్వాసిస్తున్నావు షట్పదీ!

**షట్పది :** కజ్జలదేవి జీవితంలో ఇది ఎంత మహోత్సాహసమయం. సమస్త కాశ్మీరమూ సాదర గౌరవం చూపించటానికి ఈనాడు ఆమె సౌధం చుట్టూ చేరింది. మహారాణి

స్వయంగా ఎవరి సౌధానికి వచ్చి ఆదరించింది? అమ్మాయీ! ఇది నీకూ కజ్జల దేవికి ఎంత శుభదినం... ఎందుకో నీవు కూడా సంతోషంగా లేవు తల్లీ –

**సారంగదేవి :** నా ఆనందాన్నంతా నీకిస్తాను, మనః పూర్వకంగా అనుభ వించి ఆనందించు. పరమాత్మను నా పునర్జన్మలోనైనా ఇటువంటి శుభదినాన్ని నాకు ప్రసాదించవద్దని ప్రార్థిస్తు న్నాను. నా పరిస్థితిలో మీరుండి ఈ ఆనంద సమయాన్ని అర్థం చేసుకుంటే నేను సంతోషంగా లేకపోవటానికి కారణం అవగతమౌతుంది.

**షట్పది :** అంటే – నీ అభిప్రాయము.

**సారంగదేవి :** (కంట తడితో) ఏమీ లేదు.

**షట్పది :** అమ్మాయీ! ఏమీ లేకపోతే ఏమిటా కంటతడి.

**సారంగదేవి :** ఏమీలేదు షట్పదీ. (కంటతడి తుడుచుకుంటుంది)

**షట్పది :** అమ్మాయీ! నీవు కూడా కొన్నాళ్ళనుంచీ ఏదో అర్థంగాని బాధ అనుభ విస్తున్నావు. నేను వినగూడని అంశమేదన్నా నిన్ను కలవరపెడుతున్నదా?

**సారంగదేవి :** నీవు వినగూడనిది నా జీవితంలో ఏదన్నా ఇంతవరకూ ఉన్నట్లు విన్నావా?

**షట్పది :** కానప్పుడు నీ చింతకు కారణమేమిటో నాకు బోధపడటం లేదు – చెప్పు తల్లీ! అనవసరంగా మనస్సులో పెట్టుకొని ఎందుకు కృశిస్తావు. నేనంటే నీకు అనురాగం తప్పి పోయిందా? అయితే బ్రతిమాలనులే.

**సారంగదేవి :** షట్పదీ ఏమిటా నిష్ఠూరం. నన్ను మళ్ళా అనవసరంగా ఏడిపించటానికి ప్రయత్నించవద్దు. నేను ప్రస్తుతం మాట్లాడకుండా ఉండటం తప్ప మరొక పని చెయ్యలేను.

**షట్పది :** ఇప్పుడు దుఃఖించావన్నమాట. సంగతేమిటో బయటపెట్టు తల్లీ! అంత దుఃఖించవలసిన అగత్యమేమి వచ్చింది – నీ ప్రియుడేమైనా నిన్ను మోసగించాడా?

**సారంగదేవి :** (దుఃఖంలో నవ్వుతూ) లేదు.

**షట్పది :** మరి –

**సారంగదేవి :** నే నీ నీచమైన బ్రతుకు గడపలేకుండా ఉన్నాను.

**షట్పది :** అంటే నీ అభిప్రాయం

**సారంగదేవి :** నే నీ పాపాన్ని భరించలేను. ఈ పాపంలో బ్రతకలేను. ఈ పాపవాయువు క్రమక్రమంగా నా ప్రాణాన్ని హరిస్తున్నది. అనేక రాత్రులనుంచీ నాకంటికి కునుకు లేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు స్తంభించినా బ్రతుకుతున్నాను. నా ఇంట్లో ఏ వస్తువును ముట్టుకున్నా కళంక భూయిష్ఠం పాప పంకిలము. ఎన్నాళ్ళబట్టో మృత్యువును ఆహ్వానిస్తున్నాను. కొలది కాలం క్రితం దర్శనమిచ్చింది. ఆనాటినుంచి ఆమె వికట నృత్యాన్ని దర్శిస్తూ ఆనందిస్తున్నాను. చివరకు ఆమె చిన్మయహాసంలో నురుగునై పోవటానికి నిశ్చయించుకున్నాను. ఇక జీవించ లేను షట్పదీ! జీవించను –

**షట్పది :** అమ్మాయీ! ఏమిటా లేనిపోని పిచ్చి ఊహలు. నీకేం శరీర స్వస్థత లేదా?

**సారంగదేవి :** షట్పదీ! ఎందుకు నాచేత చెప్పించటము. ఇందులో నీవెరుగని దేమున్నది. నా అవమానపు బ్రతుకును చూస్తుంటే నీకు అసహ్యం కలగటం లేదూ. నాతో మాట్లాడేటప్పుడు నాచుట్టూ ఉన్న వ్యభిచార వాయువు మీమీద సోకటం లేదూ? (కంటికి గుడ్డ అడ్డం పెట్టుకొని దుఃఖిస్తుంది)

**షట్పది :** తల్లీ! సారంగీ! సారంగీ!

**సారంగదేవి :** షట్పదీ! (నిద్రలో ఉన్న కజ్జల దేవిని చూచి) నా మాటలన్నీ అమ్మ విన్నదా? లేదు. ఇంకా దీర్ఘనిద్రలోనే ఉన్నది. ఆమె వినకూడదు. నా హృదయంలో ఏమున్నదో ఆమెకు తెలియ కూడదు. తెలిస్తే నేను బ్రతకను. అప్పుడు నా దుఃఖమే నాకు దహనాగ్నిగా మారిపోతుంది. (కజ్జలను చూపిస్తూ) ఆమె వివాహిత. వితంతువైనా మహారాజు అనేక వివాహాలు చేసుకున్నాడు. ఇద్దరికీ సంతానం ఉన్నది. కానీ వీరి వ్యభిచారం లోకంలో ఏ మహాభావమూ ఆపలేకపోతున్నది. వృద్ధాప్యానికి చేతగానప్పుడు... ఈ పాపపంకిలంలో ప్రాణాలు ఉగ్గబట్టుకొని బ్రతుకుతూ ఉన్న నేను చాలక – ఈ పాప కారాగారంలో ఈ పాపకూపంలో నాకు తోడుగా మరొక ప్రాణిని పంపించాడు బ్రహ్మ. అమాయక ప్రజ! దానికేం తెలుసు, తమ్ముణ్ణి పొగడటానికని వచ్చారు. కజ్జలా దేవి మహారాణి అని వారి విశ్వాసం. కాబొయ్యే యువరాజని తమ్ముడికి జయ పెట్టవచ్చారు. ప్రజదేముంది, అమాయక ప్రజ. ప్రజలకు తమ్ముడు యువరాజు, అమ్మ మహారాణి నేను రాజకుమార్తెను, ప్రభు వర్గంలో అమ్మ... చెప్పలేను – మేము తొత్తు సంతానము, (ఏడుస్తూ) నా యీ దేహం, దానికి సంబంధించిన సమస్తమూ పాపానివి, మహా పాపానివి, నా తండ్రి వ్యభిచారి, తల్లి వ్యభిచారణి. ఈ కళంకాన్ని కడిగి వేసే దివ్యహస్తాలు ఏ దేవతాలోకంలో ఉన్నవో!

**(కజ్జల నిట్టూరుస్తుంది)**

**షట్పది :** (పెదిమల మీద చేయిపెట్టి నివారిస్తూ) ఇష్‌–ఇష్.

**సారంగదేవి :** (కజ్జలాదేవిని చూస్తూ) కలలు కంటున్నావా తల్లీ! నీ స్థితిని నీవు అర్థం చేసుకోలేని దుస్థితిలో పడ్డావు. నీ లోపాలను చెప్పే పెద్దలెవరూ నీకు లేరు. అందరూ నిన్ను జూచి అడుగులకు మడుగులొత్తే వారే. అమ్మా! నీ చుట్టూ ప్రసరించే గాలి, వెలుతురు, పాపభూయిష్ఠం! పాపభూయిష్ఠం నీవల్ల కాశ్మీరంలో నీతి అవినీతి – అవినీతి నీతిగా మారిపోతున్నది. అమ్మా నేనీ సౌధంలో విశేషకాలం సంతోషంగా బ్రతకలేను.

**షట్పది :** సర్వసంగ పరిత్యాగం చేసుకొని భిక్షుక సంఘంలో చేరిపోవాలని నీకు ఎన్నడైనా కోరిక కలిగిందా ఏమిటి?

**సారంగదేవి :** ఎందుకలా ప్రశ్నించావు షట్పదీ. నా హృదయం ఎపుడో నీకు అర్థమైనట్లు మాట్లాడావు. ఈకోరిక ఎప్పుడో ఒకప్పుడు కాదు. అనేకమార్లు కలిగింది. మన జీవితాలకు శాంతి మహాయానంలో తప్ప దొరకదని అమ్మకు ఎన్నోమాట్లు మనవి చేశాను. ఆమె ఈ సౌధాన్ని వదలిపెట్టలేదు. భ్రమ పడ్డా ఈ సౌఖ్యాలకు స్వస్తి చెప్పలేదు. అందుకు ఎన్నడూ అంగీకరించింది కాదు.

**షట్పది :** అందులో ఆమె దోషమేమీ లేదు. నీ మేలుకోరి చేసింది ఆ పని.

**సారంగదేవి :** ఇకముందు నేను పరిపూర్ణానందాన్ని అనుభవిస్తానన్నమాట కల్ల. ఆమె మటుకు ఏమి సుఖపడుతూ ఉన్నది. ఎప్పుడూ కన్నీళ్ళలో కరిగిపోతున్నది. ఆమెకు బ్రతుకులో సుఖస్వప్నం వంటి ఒక్క నిమిషమైనా ఉన్నదెప్పుడో చెప్పు షట్పదీ!

**షట్పది :** ధర్మాధర్మాలు నీ వనుకున్నంత నిశ్చితాలు కావు తల్లీ! ఒకరి నొకరు ప్రేమించుకోవటం పాపం కాదు. ప్రేమ అమృతం వంటిది. రాహు కేతువులు ఆ అమృత పానం వల్లనే కదా దేవతలను క్షణకాలమైనా జయిస్తున్నారు. ఆ ప్రేమ ముగ్ధ. యౌవనంలో ఉన్నప్పుడు వ్యక్తి ఒక పాపమైనా చేయలేక పోవటం పాపము!

**సారంగదేవి :** షట్పదీ వెనుకటినుంచీ నీకూ ఈ వెర్రి సిద్ధాంతాల మీద అభిమానం ఉన్నదా?

**షట్పది :** పురుష హృదయాలను చేత జిక్కించుకొని వాటికి అధిష్ఠాన దేవతలమై పాలించటం! కీర్తితో లోకాన్ని వ్యామోహ పెట్టటం!! కాంక్షలో కైపు!!! ప్రణయ కోపాలతో ఎంతంత మహాప్రభువులను పాదదాసులను చేసుకోవటం ఉజ్జ్వల యౌవనానికి

లక్షణాలు. ఎంత అదృష్టవంతులకో గాని, పూర్వజన్మలో ఎంతో మహాపుణ్యం చేసుకున్న వాళ్ళకు గాని లభించని లక్షణాలు! అందుకోలేని ఆశయాలు! ప్రభువులను ప్రేమించి వారు ప్రణయ భుజ పంజర కీరాలై శుకానువాదం చేస్తున్నప్పుడు కలిగే పరితృప్తీ, మహాప్రభువులు మనసారా ప్రేమిస్తే వారి ఆజానుబాహువులను ఆధారం చేసుకొని అల్లుకుపోయే ప్రణయ లతికలమై ఆనందరసోన్మత్తతలో 'ప్రభూ' అని పలవరించుటము ఒక జీవికి ఎన్ని జన్మలకో!... మహాప్రభువు కలశ భూపతిది ఎంత జాలిగుండె తల్లీ – ఆయన ఎంత చక్కనివాడు ఎంత రసికుడు.

**(తన మెడలో ఉన్న హారాన్ని చూచుకొని సవరించు కుంటుంది)**

**సారంగదేవి :** షట్పదీ! నీ ప్రసంగం ఇక చాలించు. నా మనస్సుకు బాధ కలిగిస్తున్నది.

**షట్పది :** అమ్మాయీ! మీ తండ్రిని ప్రేమమూర్తి అని అభినందిస్తుంటే నీకు బాధెందుకు తల్లీ!

**సారంగదేవి :** ఆయన ప్రేమమూర్తి కాదని కాదు. ఆయన ప్రేమమూర్తని ఎరగక కాదు ఆయన ప్రేమమూర్తని నీవు చెప్పే లక్షణం నాకు నచ్చలేదు. నాకు మహా బాధ కలిగించింది.

**షట్పది :** (సారంగదేవి చేతులు స్పృశిస్తూ) అమ్మాయి! వెర్రిదానా. నీమీద అనురాగం లేకనా ప్రభుహృదయాన్ని గురించి నీతో ప్రసంగించటం.

**సారంగదేవి :** (బిగ్గరగా) షట్పదీ. నా కోపం అధికమౌతున్నది. మరొక మాటు మహారాజు ప్రశంస రానిచ్చావా నీకు మర్యాద దక్కదు... (షట్పది మెడలో హారాన్ని నిర్దేశిస్తూ) నీకెక్కడిదా హారము? ఎవరిచ్చారు? ఇదివరకు నీ మెళ్ళో లేదే! – ఇది మహారాణిది కదూ. నీకెలా వచ్చింది. చెప్పవూ?

**(కజ్జలాదేవి ఈ సంభాషణ వింటూ ఒక్కమాటున కదిలి లేస్తుంది)**

చెప్పవూ?

**షట్పది :** చెప్పకూడదు.

**సారంగదేవి :** నాదగ్గిర దాపరికమా షట్పదీ! ఊఁ హారమెవరిచ్చారు?

**కజ్జల :** మహారాజు! మహారాజు!!

**షట్పది :** (ఉక్కిరి బిక్కిరైపోతూ మొగం ప్రక్కకు తిప్పుకొని వెళ్ళిపోబోతుంది)

**కజ్జల :** షట్పదీ! ఆగక్కడ. సారంగీ నీవు బయటికి వెళ్ళి జనసమూహాన్ని చూచి ఆనందించు. వారిని తృప్తి పరచటము మన కర్తవ్యము.

(సారంగదేవి నెమ్మదిగా బయటికి వెళ్ళిపోతుంది. షట్పది తలవంచుకొని నిలవబడుతుంది)

**కజ్జల :** ఒకమాటు మొగం పైకెత్తి నన్ను చూడు షట్పదీ!

**షట్పది :** (మాట్లాడదు)

**కజ్జల :** నా ఆజ్ఞ పాలించవన్నమాట షట్పదీ!

**షట్పది :** దేవీ! నన్ను బాధపెట్టవద్దు.

**కజ్జల :** ఉఁ....

**షట్పది :** (కొంచెం పక్కకు పోయి ఆలోచనచేసి) కజ్జలా! మహారాజు నాకీ హారమిచ్చి గౌరవించారు.

**కజ్జల :** (ఆవేశంలో) ఎప్పుడు? ఎక్కడ?

**షట్పది :** (ఠీవితో) నిన్న సాయంత్రం. తామ్రస్వామి ఆలయంలో.

**కజ్జల :** రాజు నిన్ను ప్రేమిస్తున్నాడన్నమాట!

**షట్పది :** అవును.

**కజ్జల :** నీకెలా తెలుసు?

**షట్పది :** నాతో చెప్పారు.

**కజ్జల :** రాజు! నీతో చెప్పాడా?

**షట్పది :** అవును నిన్న రాత్రి శంపా ప్రాసాదంలో.

**కజ్జల :** (దీర్ఘంగా నిట్టూర్చి వెనకకు పోయి పర్యంకం మీద వెన్నువాల్చి మళ్ళా లేచి కూర్చొని) ఉఁ ఇంతకూ నిన్ను ఆయన ప్రేమించాడన్నమాట.

**షట్పది :** (తలవంచి సగర్వంగా) ఔను.

**కజ్జల :** ఎప్పటినుంచి?

**షట్పది :** గత వసంతారంభంనుంచి.

**కజ్జల :** నాకు ఋగ్మత ప్రారంభించినప్పటి నుంచీ – మీ ఇద్దరికీ ప్రథమ పరిచయం ఎలా జరిగింది?

**షట్పది :** (మాట్లాడదు)

**కజ్జల :** చెప్పవా? చెప్పలేవు. మోసము. అతడు నిన్ను మనసిచ్చి ప్రేమించలేదు. కేవలం ఆటవస్తువుగా గ్రహించాడు.

**షట్పది :** ప్రేమించటంలేదూ? శుద్ధ అబద్ధం. ప్రథమ పరిచయంనాడు నీమీద చూపించిన అనురాగం చాలదని చెప్పాడు మహారాజు. నీ కళ్ళను మించిన కాంతులు నా కళ్ళల్లో తొణికిస లాడుతున్నవని పొగిడాడు. కన్నీటితో నా చేతులు కడిగి వేశాడు. పాదదాసుడై ప్రణామం చేశాడు.

**కజ్జల :** (రాని నవ్వు తెచ్చుకుంటూ) షట్పదీ రాజు నిన్ను మోసగించాడు. నీవు మోసపోయినావు. ఎవరైనా మోసగించే వాళ్ళు ప్రేమించటంలేదని చెపుతారా? కన్నీళ్ళతో కడి గేయరూ? కేవలం పాదదాసు కావటమే కాదు. పాద దాసానుదాసు లౌతారు ఆ సమయానికి. షట్పదీ వెర్రిదానా ఎంత మోసపోయినావు. పాపం! వృద్ధాప్యం రాజ్యమేలుతూ ఉన్న ఆ ముదినుగ్గు హృదయంలో ఇంకా ప్రేమకు స్థాన మున్నదా? మనసారా నీకు పాదదాసుడైనాడనేనా నీ భావం. ఆ కన్నీళ్ళు కాలుష్యం లేనివనేనా నీ ఆనందం – వెర్రిదానా? పోనీ...ఆ పుంజును ఏ మదనమంత్రంతో బుట్టలో వేశావు షట్పదీ.

**షట్పది :** కామదేవాలయములలో, ఉద్యానవనాలల్లో నీమాదిరి కన్నులు కలుపలేదులే – మహారాజును నేనేమీ కవ్వించలేదు. మనఃపూర్వకంగా ఆయనే ప్రణయార్థిగా నా కన్యాప్రణయాన్ని అర్థించాడు.

**(మెళ్ళో హారాన్ని సవరించుకుంటుంది)**

**కజ్జల :** (శయ్య మీదనుంచి లేచిపోయి షట్పది మెళ్ళో హారాన్ని గుప్పిటితో పట్టుకొని) ఇది నాకు ఇచ్చేయ్!

**షట్పది :** ఇవ్వలేను.

**కజ్జల :** నాకు కావాలి.

**షట్పది :** ఇది నాది (పెనుగులాడుతూ తెగిపోతుందేమో నన్న భయంతో) నేను నీకివ్వను.

**కజ్జల :** నీ చేతులు విరిచేస్తాను. (ఎడం చేతితో షట్పది చెయ్యి మెలి త్రిప్పుతుంది)

**షట్పది :** ఏమిటీ దౌర్జన్యం... ప్రభువుతో చెప్పి.

**కజ్జల :** (ఈర్ష్యతో) శిక్ష వేయిస్తావా! (హారం తెంచి) కృతఘ్నురాలా! ఇదిగో హారం – బలవంతంగా తీసుకున్నావు. ఎవరితో చెప్పుకుంటావో.

**షట్పది :** నా హారం నాకివ్వు.

**కజ్జల :** నా సౌధంలో నుంచి బయటికి కదులు.

**షట్పది :** నీవు దొంగవు... అందరికీ చెపుతాను. బలవంతంగా నా హారాన్ని కాజేశావు.

**కజ్జల :** నిజంగానా, దొంగనా. ఇదిగో నీ హారం తీసుకో... ఇచ్చే స్తున్నానుండు. (హారాన్ని తెంచి దానిలో పచ్చరాయిని బల్లమీద పెట్టి చిన్నరాతితో ముక్కలు ముక్కలుగా కొట్టేస్తుంది)

**షట్పది :** ఆఁ... ఆఁ ఘనకార్యం చేశావు. అశక్తురాలవు. అంతకంటె నన్ను ఏం చేస్తావు పాపం! నీ కళ్ళమంట తీరిందా. ఎంత అఘాయిత్యమే జంతువా? మహారాజు యిలాంటి నిన్ను ఇంకా ఎలా ప్రేమిస్తాడు? నాతో ఏమని చెప్పాడో చెప్ప మన్నావా?

**కజ్జల :** (ఉరోభాగాన్ని నిక్కించి రాజసంతో) నోరు ముయ్యి.

**షట్పది :** నాకేం అవసరం. నువ్వే ముయ్యి. నిన్నూ నీ దురవస్థనూ చూచి రాజూ నేనూ ఇప్పుడే నవ్వుకుంటాము. ఆయన నన్ను మనసారా ప్రేమిస్తున్నాడు. నాకు యౌవనముంది నీవు ముదివగ్గువు. నీలో ఈర్ష్య చావలేదు యౌవ్వనం చచ్చినా–

**కజ్జల :** (కలవరపాటుతో) (లేచి పక్క గుడ్డలు అటూ ఇటూ విసరి పారేసి తలగడ క్రింద కత్తి తీసి) ఏదీ మళ్ళీ అను ఆ మాట (షట్పది మీదికి పొడవటానికి వస్తుంది)

**షట్పది :** (భయంతో) అమ్మయ్యో! రాక్షసీ! రజా, రుజా, కజ్జా!!

**కజ్జల :** ఒళ్లు దగ్గిర పెట్టుకొని బ్రతుకు. నాతోనా నీకు. జాగ్రత్త తులువా!

(కత్తి విసరి క్రింద పారవేయబోతూ) ఈటిముండ – మెడబెట్టి గెంటిస్తాను. పాలుపోసి పెంచినందుకు పాము వనిపిస్తున్నావా జాగ్రత్త (తలుపులలోనుంచి రజా, కజ్జా తొంగి చూస్తారు. "ఎవరా పక్షులు" అనే కజ్జలాదేవి ఉన్మత్తకంఠం విని, బయటికి వెళ్ళిపోతారు) కదలు అవతలికి. (షట్పది నెమ్మదిగా కన్నీటితో వెళ్ళిపోతుంది) పాపిష్ఠిముండ– బంధకి (కత్తి నేలమీద పారేసి పర్యంకం మీద వాలిపోతుంది)

## చతుర్థ దృశ్యము

(కజ్జలాదేవి తన మందిరంలో నిద్రిస్తుంటుంది. సారంగదేవి, షట్పది మాట్లాడుకొంటుంటారు)

**సారంగదేవి :** ఔను! నిజమే. మనోవేదనను ఎన్నాళ్ళు దాచుకోవటం. బయట పెట్టవలసిందే. లేకపోతే బ్రతకటం కష్టం. షట్పదీ! నాకెందుకీ కంపం! ఎందుకీ భయం!! అమ్మా!... అబ్బా! (నెమ్మదిగా నేలమీదికి ఒరిగిపోతుంది)

**కజ్జల :** (మేల్కొని, వేగంతో) అమ్మా! సారంగీ! సారంగీ!!

**సారంగదేవి :** (తెప్పరిల్లి నెమ్మదిగా తల్లి దగ్గరకు చేరి) 'అమ్మా!' అని పిలుస్తూ ముట్టుకోబోతుంది.

**కజ్జల :** నన్ను ముట్టుకోవద్దు. సారంగీ! తల్లీ నా ముఖాన్ని చూడలేక పోతున్నావా? ఏమిటి నీకీ భయం. కళ్లెత్తు – ఒక్కమాటు నీ కన్నీళ్ళను తుడవనీ –

**సారంగదేవి :** వద్దు – నేను చూడలేను తల్లీ – నా దగ్గిరికి రావద్దు. ఒంటరిగా నన్నిలానే బాధపడనీ. మీరంతా వెళ్ళిపోండి. ఏకాంతంగా కాసేపు నన్ను శ్రమ తీర్చుకోనీయండి.

**కజ్జల :** (నాలుగు దిక్కులూ పరిశీలిస్తూ) సారంగీ, ఒక్కమాటు నావైపు కన్నెత్తి చూడు తల్లీ!

**సారంగదేవి :** అమ్మా నన్ను మాటాడించవద్దు – పోనీ నన్ను వెళ్ళిపోనీ. నిన్ను చూడలేను.

**కజ్జల :** తల్లీ! నీ కంటికి నేనంత వికృతంగా కనిపిస్తున్నానా! అసహ్యించు కుంటున్నావా? నిజమే కావచ్చు – తప్పులేదు. నన్ను నేనే అసహ్యించుకుంటున్నాను. నాకంటే నీవు నన్ను అసహ్యించుకో లేవు. దీనికి నీకు భయం అవసరం లేదు. అమ్మా! కలశరాజు నీచుడు – నన్నీ నీచకృత్యానికి పురి కొల్పాడు.

**(దగ్గరకు వచ్చి సారంగదేవి తల పైకెత్తమని కోరుతుంది)**

**సారంగదేవి :** (వేదనతో) అమ్మా! నన్ను ఒక్కసారి మనసార కౌగలించుకో – తాపం! బాధ! అబ్బా!

**కజ్జల :** తల్లీ! ఈ పాపి నిన్ను ముట్టుకోదు. నా స్పర్శవల్ల ప్రతిదీ పంకిలమై పోతుంది. దూరంగా ఉండనీ. ఈ అపవిత్ర దేహాన్ని ఏమి చేయటమో! పాపిష్ఠి పంక్తి కంఠుడి

హస్త్రాలకు లొంగిపోయింది ఈ దేహం. ఆ కుహనా గురువు కరకు చూపులకు గురై పోయింది. ఈ దేహం... అబ్బా! బాధ – ఉః.

**సారంగదేవి :** అమ్మా! నీవీ పని ఎలా చేయగలిగావు

**కజ్జల :** తల్లీ! నాకిప్పుడు అర్థం కావటం లేదు. నేనేం చేశానో నాకు తెలియటం లేదు. అమ్మా! నేనిప్పుడెక్కడున్నాను. నా సౌధంలోనేనా... అమ్మాయీ ఇప్పుడిక్కడి కెందుకు వచ్చాను. మతి భ్రమిస్తున్నది. నేను పిచ్చిదాన్నై పోతున్నాను.

**సారంగదేవి :** అమ్మా! నీవు సంపాదించిన సౌఖ్యం, ఇదేనా?

**కజ్జల :** సౌఖ్యం! శక్తి!! జగత్తులో ఈ రెంటికే స్థానము లేదు. పాలనా కాంక్షలో సౌఖ్యం ఎక్కడుంది తల్లీ! – అయినా పాలించలేనిది బ్రతకలేం. – ఇదంతా నీకు అర్థం కాదు. ఎందుకు పాలించాలో నీవు అవగతం చేసుకోలేవు. భిక్షుకుల మధ్య బ్రతక వచ్చు. కానీ ప్రభువులూ, పశువుల సాంగత్యంలో ప్రాణాలు నిలుపుకోలేము. మన కులం మానవ సౌఖ్యమనే కసాయి కత్తులకు కంఠాలర్పించే కంచి మేకలం. జనసామాన్య జీవితంలో శాంతి సౌఖ్యాలు దొరకవని భ్రాంతి పడ్డాను. ప్రభుసౌధ పర్వతాగ్రమెక్కి పదిహేనేండ్లు పరిపాలించాను. ఈనాటికి, ఈ వయస్సున నాకు పతనం! భరించలేను. మళ్ళీ సామాన్య జనసాంగత్యం! అబ్బా బాధ భరించలేను.

**సారంగదేవి :** సామాన్య జనజీవిత మెంత సౌఖ్య ప్రదమయిందో నీవు గుర్తించలేదు తల్లీ. వారి ఆనందం మనకు అనంత లోకాలు వెదికినా దొరకదు.

**కజ్జల :** కాదు! కాదు పొరబాటు!! అమ్మాయీ! వాళ్ళు పాలింపబడటానికి పుట్టారు. నేను పాలించటానికి జన్మించాను.

**సారంగదేవి :** నీవు పాలించటానికి ఎవరవని తల్లీ! లోకంలో ఒకరిని ఒకరు పాలించలేరు. పాలిస్తున్నామని భ్రమపడతారు. కాని – పాలించేది పరమ శివుడొక్కడే.

**కజ్జల :** తల్లీ! జనసామాన్యం కెంధూళి. నాబోటి ఉత్తమ జన్మలు తారాపథ మంటేటట్లు దాన్ని తరిమివేసే ఝంఝూమారుతాలు.

**సారంగదేవి :** అమ్మా! పాలనాకాంక్ష ఆత్మను పతితం చేస్తుంది.

**కజ్జల :** అది వట్టి భ్రమ. పతితం చేయదు. పవిత్రం చేస్తుంది. మలినం చేసేది మనస్సులుగాని మరేమీ కాదు. పాలకులతో భ్రమపడి సంధి చేసుకుంటే ఆత్మ పతితమౌతుంది. లోకంలో ఉన్నదల్లా ఒకటే పాపం! ఆత్మను గుర్తించలేకపోవటం.

అది మహాపాపం!! జన్మతః కొందరు ప్రాభవం సంపాదించ కుండానే అసహ్యించుకొని, నేను విశ్వప్రయత్నం చేసి విజయం పొంది అనేకమంది వ్యక్తులను పాలించాను. సాధనలో నాకు ప్రతి మెట్టునా ప్రత్యర్థులే! నాతో ఏ కోశానా సాటిరాలేని ప్రతిభా శూన్యులే నాకు ప్రత్యర్థులు!! నా సేవకురాలు గాయనే నాకొక ప్రత్యర్థురాలు. నా మహోన్నత పదవిని ఊపిరి ఉండగానే దానికి కరస్థం చేసి నేను ఎలా జీవించ గలుగుతాను, దక్కించుకొని తీరవలసినదే.

**సారంగదేవి :** (దీనంగా) నీ వనుసరిస్తూ ఉన్న మార్గాలు నిన్ను ఏ లోకాలకు నడిపిస్తున్నవో గుర్తిస్తున్నావా?

**కజ్జల :** అదంతా మరొక జన్మం మాట! మరొక లోకం మాట!! ఈ జన్మలోనే అపజయం పొందుతూ ఉన్నప్పుడు ఎప్పటి మాటో నాకెందుకు? ఈ అపజయాన్ని భరించలేను – ఇక మృత్యువు మాటా? అది నాకు ఎంతో దూరాన ఉంది. దాన్ని గురించి ఇప్పుడు నేను ఆలోచించవలసిన ఆగత్యమే లేదు.

**సారంగదేవి :** ఆ వేయి కళ్ళ తల్లి ఎప్పుడూ మనను వెన్నాడే ఉంటుంది. కాలం గడిచి పోతున్నది. వయస్సు ముదిరి పోతున్నది. ఇంకా మృత్యువు ఎంతో దూరాన ఉన్నదని ఎందుకు భ్రమపడతావు తల్లీ!

**కజ్జల :** (తన శరీరాన్ని ఒక్కమాటు కలయ చూచుకుంటూ) వృద్ధాప్యము! మానవ లోకానికి ఎంత దారుణమైన శిక్ష! నరకము లేదు. ధైర్య స్థైర్యాలు లేని దద్దమ్మల సృష్టి – అసహజము అసత్యము! కానీ యౌవన సౌందర్యానికి ఇన్నాళ్ళు మురిసిపోయిన యీ కళ్ళు సడలిపోతూ ఉన్న ఈ శరీరాన్ని ముందు ఎలా చూచి భరించగలుగుతవో!

ఒకప్పుడు అలంకారం చేసుకున్న నన్ను నేనే అద్దంలో చూచికొని మురిసి పొయ్యేదాన్ని – నేనే పురుషుడనై నా యౌవనాన్ని అనుభవిస్తే ఎంత ఆనందముంటుందోనని ఊహించేదాన్ని. అటువంటి యౌవ్వనం ఏమైపోతున్నట్లు? ఎక్కడికి పోతున్నట్లు!! సౌందర్యం ముదిమి చేతుల్లో ఏనాటి కైనా ముక్కి పోవలసిందేనా? తప్పదా– తప్పదు. జరామరణ భయాలు ప్రాణికి సహజం – తప్పదు. ప్రప్రథమంలో పలితకేశాన్ని చూచినప్పుడు నా పంచప్రాణాలు పోయి నట్లైంది. అయినా ఈ ముసలితనం ఏం జేయగలుగుతుందో చూస్తాను. దాన్నీ జయించటానికి ప్రయత్నం చేస్తాను.

**సారంగదేవి :** అమ్మా! ఎంత వెర్రిన పడుతున్నావు. జర మానవలోకానికి – కాదు సమస్త ప్రాణి లోకానికీ సహజధర్మం. దానిమీద విప్లవం చెయ్యలేము.

**కజ్జల :** సహజ ధర్మం కాబట్టే విప్లవం. నేను సహజ ధర్మాలకు లొంగలేదు. ఎదుర్కొనలేని సామాన్య జనాన్ని జరామరణా లకు స్వాగతమిచ్చి ఆహ్వానించనీ – నేను మాత్రం జయించటానికి ప్రయత్నించవలసిందే.

**సారంగదేవి :** అమ్మా! ఈ ప్రపంచ పరిణామంలో ఏదీ స్థిరమైంది కాదు. సమస్త వస్తువూ నశించేదే – అలాగే వృద్ధాప్యం కూడా.

**కజ్జల :** అమ్మాయీ! నీవు చెప్పేది నాకేదీ తలకెక్కదు. నేను అదంతా నమ్మలేను.

**సారంగదేవి :** నమ్మనంత మాత్రంలో అవేవి సత్యాలు కాకపోవు.

**కజ్జల :** భగవంతుడు కూడా సత్యమేనా?

**సారంగదేవి :** భగవంతుడుంటే ఏమిటో గ్రహించే స్థితికి వచ్చిన తరువాత సత్యమే–

**కజ్జల :** నా అభిప్రాయమేమిటో చెప్పమన్నావా? భగవంతుడనే ఒక నపుంసకుణ్ణి సృజించి యీ ప్రవక్తలందరూ లోకాన్ని మోసపుచ్చుతున్నారు. మభ్య పెడుతున్నారు. నా దృష్టిలో అతడు ఎంతో నీచుడు. హృదయం లేని జంతువు! అమాయకమైన ప్రాణాలకు దేహం కల్పించి అవి జీవయాత్రలో అల్లట తల్లటై పోతుంటే చూచి లీలగా ఆనందిస్తాడట! ఎంత అభూత కల్పన! సౌందర్యమంటే ఎరగని ఆ రసికుడు ప్రపంచంలో ఎన్నెన్ని ఏహ్య వస్తువులు సృజించాడు. యౌవనాన్ని సృజించిన చేతులతోనే వృద్ధాప్యాన్ని ఎలా సృష్టించాడు. సుందర మూర్తులను ఊహించిన మేధాశక్తితో అందవికారుల రూపకల్పన మెలా చేయగలిగాడు. ఆ భగవంతుడు ప్రేమ ఎరుగని పీనుగ. కేవలం సృష్టిలో కదల మెదల లేని భయంకర జడవస్తు సమూహంలాగానే అతనూ ఒక అవ్యక్త, అద్వైత, అనంత, జడపదార్థం. అంతేనా?

**సారంగదేవి :** అమ్మా! నీ మాటలు నా గుండెలు బ్రద్దలు చేస్తున్నవి. (తల్లి నోరు చేత్తో మూయబోతుంది)

**కజ్జల :** (వారిస్తూ చిరునవ్వుతో) అమ్మాయీ! నీ యౌవనరూపం ఎంత నయనానంద కరంగా ఉంది. నేనే అనుభవిస్తే...

**సారంగదేవి :** అమ్మా! నిన్ను చూస్తుంటే నాకేదో భయం వేస్తున్నది. అలా ఆకలిడేగ కళ్ళతో నన్ను చూచి భయపెట్టకు. నామీద కలిగే ఈర్ష్యకు మనస్సులో స్థానం కల్పించకు–

**కజ్జల :** అమ్మాయీ! నీ ఉజ్జ్వలరూపాన్ని నాకు ప్రసాదిస్తావా! మరికొంత కాలం లోకాన్ని పరిపాలిస్తాను.

**సారంగదేవి :** అవకాశం ఉంటే అవశ్యం ఇచ్చేస్తాను. నాకు ఎంత అసహ్యంగా ఉన్నదో నీకు అర్థంకాదు ఈ సుందరరూపం, ఈ యౌవన నవకం నా ఆత్మకు ఎంతో భారమనిపిస్తున్నవి.

**కజ్జల :** అమ్మాయీ! జీవమధువు నీకు విషప్రాయమైపోయిందా? ఆనందించలేకుండా ఉన్నావా?

**సారంగదేవి :** మహావెగటుగా ఉంది తల్లీ!

**కజ్జల :** దానికి నేనే కారణం!

**సారంగదేవి :** నీవొక్కతెవే కాదు.

**కజ్జల :** ఏమిటి? "నీవొక్కతవే కాదు"

**సారంగదేవి :** (పొరపాటున నోటివెంట జారి రానిచ్చినట్లుగా) ఆఁ ఆఁ అది కాదు.

**కజ్జల :** (దీనంగా) తల్లీ! నేను నీ మనస్సును బాధ పెడుతున్నానా?

**సారంగదేవి :** (నేలమీద చూస్తూ) ఔను.

**కజ్జల :** నీ మనస్సులో ఏమున్నదో ఒక్కమాటుగా నన్ను అర్థం చేసుకోనీ తల్లీ!

**సారంగదేవి :** నేను చెప్పలేను. ఈ ప్రపంచంలో ఉన్న సమస్త వస్తువుల కంటే విశేషంగా అన్యోన్యం ప్రేమించుకుంటూ ఉన్న మనం దూరమైపోతాము.

**కజ్జల :** (యోచనా పూర్వకంగా) మంచిది.

**సారంగదేవి :** (మాట్లాడదు. కొద్దిసేపు నిశ్శబ్దం)

**కజ్జల :** అమ్మాయీ! ఏమిటీ మూకీభావం! ఇది నాకు బాకుకంటే కఠోరంగా...

**సారంగదేవి :** అమ్మా! పొరబాటు పడవద్దు. నిన్ను ప్రేమించినట్లు ఈ ప్రపంచంలో నేను ఎవరినీ ప్రేమించలేదు.

**కజ్జల :** నీ మనస్సును సంక్షుభితం చేసే నన్ను ప్రేమిస్తున్నావా!

**సారంగదేవి :** మనఃపూర్వకంగా – ఆత్మసాక్షిగా –

**కజ్జల :** ఎలా ప్రేమించగలిగావో నాకు అర్థం కావటం లేదు. నిన్ను నే నెన్నడూ ప్రేమించలేదు. నీకోసం నేనేమాత్రమూ శ్రమపడలేదు.

**సారంగదేవి :** నా బాల్యావస్థలో నీవు నాకోసమేమి శ్రమపడ్డావో నేను చూడలేదు. నన్ను నీ దగ్గర లేకుండా మరొకచోట ఉంచినా నీ చిత్రపటాన్ని చూచి కలలు కంటూ ప్రేమించి అర్పించే దాన్ని.

**కజ్జల :** నీకు నన్ను దూరంచేసి నిన్ను ఎంతో బాధపెట్టాను.

**సారంగదేవి :** నీవు నన్ను చూడటానికి వచ్చేదినం నా మనస్సుకు పట్టరాని సంతోషం కలిగేది. కాని నీ ప్రక్కన నిలువబడితే నాకే భయమేసేది. ప్రతివాళ్ళూ నిన్ను ప్రేమిస్తుంటే నాకు ఎంతో ఆనందం వేసేది. లోకానికి నీమీద అంత ఆదరం, ప్రేమా ఎందుకో అర్థమయ్యేది కాదు. అప్పుడు నేను ఇంకా చిన్నదాన్ని. పూలమొక్కలతో తోటలో ఒక దినం ఆడుకుంటుంటే ఇద్దరు పెద్ద మనుష్యులు నిన్నుగురించి ఏమేమో చెప్పుకున్నారు. వాళ్ళు మనకు ఆప్తులనుకుంటాను.

**కజ్జల :** (ఆపుకోలేక) ఏమని చెప్పుకున్నారు?

**సారంగదేవి :** నాకు జ్ఞాపకం లేదు.

**కజ్జల :** వాళ్ళిద్దరూ సూర్యచంద్రులు కాదుగదా!

**సారంగదేవి :** కాదు. ఎవరో చెప్పలేను. వాళ్ళేదో నిన్ను గురించి అసహ్యమైన సంభాషణ చేశారు. ఆనాటినుంచీ నాకు జీవితమంటే సహించరానిదై పోతున్నది. ఏకాంతంగా నీవు కార్చే కన్నీటికి ఆ పెద్దమనుష్యుల సంభాషణకు ఏదో సంబంధమున్నట్లు నాకు మధ్యమధ్యా అర్థమయ్యేది. అమ్మా! లోకం రకరకాలుగా నిన్ను గురించి చెప్పుకుంటుంటే వింటూ ఉన్న నేనే భరించ లేకపోతున్నాను. ఇంత గర్వివికదా ఎలా బ్రతక గలుగుతున్నావు?

**కజ్జల :** అయితే నన్నేమి చెయ్యమంటావు తల్లీ!

**సారంగదేవి :** ఈ రాజ బాంధవ్యాన్ని త్యజించు. ఈ లోకాన్ని ఈ నిమిషం నుంచీ మరిచిపో. మనమిద్దరమూ 'మహాయానాన్ని' స్వీకరించి బౌద్ధారామాలలో ప్రశాంతంగా పునీతులైన 'భిక్కుణీ' సంఘమధ్యంలో జీవిద్దాము. సంఘసేవలో నిన్ను భయపెట్టే ముదిమి లేదు. ఆత్మ నిర్వాత దీపాంకురంలాగా భాసిస్తుంది. మనను ఏకోశానా

మోసగించని ప్రేమ లభిస్తుంది. నాగరిక లోక వాసనే లేని ఆ ప్రపంచం ఎంత మధురమైనదమ్మా! దివ్య సుమగంధాలతో వాసించే ఆ కళ్యాణభవనాలను ఒక్కమాటు ఈ రాజభవనాలతో పోల్చి చూచుకో– గుండె చెరువైపోవటం లేదూ!

**కజ్జల :** ఎంత అమాయకురాలివి తల్లీ. నీవన్నీ వట్టి పిచ్చికలలు. వెర్రిదానా! నీ ప్రేమ సత్యం. నీ కన్నీరు సత్యం. నీ కలలు అసత్యాలు, నీ ఆదర్శాలు అసత్యాలు – కానీ నీ సరస హృదయం నన్నొక రసస్రవంతిని చేస్తున్నది. ఒక్కమాటు నాదగ్గిరకి ఇలా రా తల్లీ! నిన్ను మనసార ఈనాడైనా ఈ పాపిని ప్రేమించు నీ – (స్పృశిస్తూ) నీ సర్వాంగాలు శతపత్ర కోమలాలు తల్లీ! ఈ ముదివగ్గు కన్నీటిని వాటిమీద హిమ బిందువులుగా వెలువనీ – నాకిప్పుడు నీవంటే ఈర్ష్య చచ్చిపోతున్నది – ఈ ఖిన్న హృదయానికి ఎన్నాళ్ళకు నీదగ్గిర ప్రశాంతి దొరికింది సారంగీ! చింతాజడం కాబోకు. కిలకిలా నాతోబాటు నవ్వుతూ ఉండు. ఇతరులను నవ్వించు. ఆనందించు. నీలో ప్రతిబింబిస్తూ ఉన్న నా యౌవనరూపాన్ని చూచి ఆనందిస్తూ కాలం వెళ్ళబుచ్చుతాను తల్లీ!

**సారంగదేవి :** నా కోరికను అనుసరిస్తావా?

**కజ్జల :** రేపే బయలుదేరుదాము.

**సారంగదేవి :** (పట్టరాని సంతోషంతో) అమ్మా!

**కజ్జల :** (ప్రగాఢంగా) తల్లీ!

**(ఇద్దరూ ఒక కౌగిలిలో ఒదిగిపోతారు)**

**(బయట కలకలం 'పట్టుకొండి' 'తన్నండి')**

**సారంగదేవి :** ఏమిటది?

**కజ్జల** : అమ్మాయీ! నీవు త్వరగా ఇక్కడనుంచి వెళ్ళిపో.

**సారంగదేవి :** (కదలదు)

**కజ్జల :** ఊఁ త్వరగా

**సారంగదేవి :** నీవో!

**కజ్జల :** నాకేమీ భయం లేదు. నేను ఒంటరిగా ఉండగలను.

**కంచుకి :** (వణికిపోతూ ప్రవేశించి) సంగతి బయటపడ్డది తల్లీ!

**కజ్జల :** ఏమిటి?

**కంచుకి :** మనకోసం రక్షకభటులు వచ్చేస్తున్నారు. ఈనాటితో మన జీవితాలు అయిపోయినట్లే!

**కజ్జల :** నీవిక్కడికి రావటం రక్షకభటులు చూచారా?

**కంచుకి :** చూడలేదు.

**కజ్జల :** అయితే భయమెందుకు?

**కంచుకి :** పంక్తి కంఠస్వామి పట్టుబడ్డాడు. ఆయన పళ్ళు ఊడకొడతారట. అప్పుడు మన సంగతి కూడా బయట పెడతాడు – ఇక మనం బ్రతకము.

**కజ్జల :** ఓరి పాపిష్ఠి పక్షీ! చివరకు నా బ్రతుకు నిలా చెడగొట్టావు. ఇందుకేనా నన్ను పంక్తి కంఠస్వామి పాదదాసిని చేసింది! శక్తి!! నా దేహానికి తీరని కళంకాన్ని తెచ్చి పెట్టావు. నీ మూలకంగా... ఛీ నీ మొగం చూడకూడదు వెళ్ళిపో!

**కంచుకి :** అమ్మాయీ! ఇంకా నన్ను నిందిస్తావేం. నీ మూలకంగా నాకు ప్రాణాలు పోవటానికి సిద్ధంగా ఉన్నవి.

**(తెరలో 'పొడవండి', 'రాళ్ళు రువ్వండి' అని కేకలు)**

**కజ్జల :** (లేచి వాతాయనం నుంచి తొంగిచూస్తూ) చంపండి ద్రోహి! పాపి! చండాలుడు చంపండి.

**కంచుకి :** ఆఁ ఆఁ...

**కజ్జల :** నీ పాపాలకు ప్రతిఫలం! కూలిపో!!

**కంచుకి :** (దూరంనుంచి) ఏమైంది తల్లీ!

**కజ్జల :** (కోపంతో) మీ గురుదేవులు నరకస్థులౌతున్నారు.

**కంచుకి :** ఆఁ ఆఁ – పంక్తి కంఠస్వామీ ప్రభూ! (నేలమీద ఒరిగి పోతాడు)

**కజ్జల :** ఈ కలకలానికి రాజు నిద్ర మేల్కొంటాడు. అంతా తెలుసుకుంటే గాయనీ షట్పదీ తెల్లవారి నేను లేని నీకు పండుగ – మహాపండుగ

(కంచుకి దగ్గిరకు వచ్చి) కంచుకీ! నీ చేతిలో ఇంకా మాంత్రికులున్నారు గదా! తప్పించుకోవటానికి మరేమైనా తంత్ర క్రియలు చేయిద్దామా?

**కంచుకి :** గురుస్వామి సిద్ధిపొందిన తరువాత ఇంకా మన మాట ఎవరు వింటారు? ప్రయత్నం నిష్ఫలం. మన దేహాలమీద మమతను వదులుకోవటమే మంచిది.

**కజ్జల :** పోనీ మనమైనా తప్పించుకొని కాశ్మీరం నుంచి వెళ్ళిపోయే మార్గం ఆలోచించు.

**కంచుకి :** ఏం ప్రయోజనం? మనం రక్షకభటుల బారి పడకుండా బయటపడలేం... (ఏడుస్తాడు)

**కజ్జల :** ఏడ్చి ఏమి సాధిస్తావు?

**కంచుకి :** అమ్మా! రేపు ఉదయం నాకేమి శిక్ష విధిస్తారో నీవు ఊహించావా తల్లీ!

**కజ్జల :** దుఃఖిస్తే శిక్ష తప్పుతుందా? లే సాహసం వహించు.

**కంచుకి :** నీకేం ఏమైనా చెపుతావు తల్లీ! నాబోటి అల్పులకు ఆ సాహసమంటేనే అదురు.

**కజ్జల :** సాహసించక తప్పదు. ముందెన్నడో రాబొయ్యే శిక్ష కంటే వేయిరెట్లు శిక్ష అనుభవిస్తున్నాను. ఈ శిక్షవల్ల కలిగే బాధ కరకు కసాయికత్తి కూడా ఊహ చేయలేదు.

**కంచుకి :** తల్లీ! ఒకవేళ నీవు చిక్కినా దేశంలో నుంచీ వెళ్ళగొడతారు. నన్నో!

**కజ్జల :** నా అంతట నేను పారిపోను. పొమ్మంటే వెళ్ళేదాన్ని అంతకంటే కాదు. ఉండి సాధించంది వదలను. చనిపోవటానికైనా సిద్ధపడతాను గాని లొంగిపోను.

**కంచుకి :** ఈ మాటలకేంలే తల్లీ – దండనాయకుడు ముందు నిలబడితే అప్పుడు...

**కజ్జల :** నా సంగతి నీకింకా బాగా అర్థం కాలేదు. క్రొత్తవాడివి.

**కంచుకి :** ఈ సమయంలో ఏం జరిగితే మన దుఃఖం నశిస్తుంది

**కజ్జల :** ఆఁ ఆయన చనిపోతే.

**కంచుకి :** ఆయనెవరు?

**కజ్జల :** రాజు!

**కంచుకి :** ఘోరము – రాజు చనిపోవటమే!

**కజ్జల :** ఏం వణికి పోతున్నావు.

**కంచుకి :** తరువాత కారకులకు శిక్ష – చిత్రవధ.

**కజ్జల :** తప్పించుకోవటానికి అనేక మార్గాలున్నవి.

**కంచుకి :** చంపటానికి మార్గమో!

**కజ్జల :** ఉదయమే రాజు లేస్తూనే ప్రసవాసవాన్ని సేవిస్తాడు. అది కలిపి ఇచ్చేది చిత్రరథుడు. అతన్ని నేను బాగా ఎరుగుదును. నా మాట జవదాటడు వెళ్ళు అందులో (దగ్గిరకి పిలిచి చెవిలో ఏదో చెప్పి) కలిపి ఇవ్వమను. బయలుదేరు. ఆలస్యం చెయ్యకు. మళ్ళీ నా మనస్సు యీ మాటకే వ్యతిరేకంగా తిరగవచ్చు – ఆశ కూడా పెట్టు.

**కంచుకి :** గాయని ఎక్కడ ఉంటుందో జాగ్రత్త.

**కజ్జల :** ఆమె విషయం నేను జాగరూకత వహిస్తాను.

**కంచుకి :** (నిష్క్రమిస్తాడు)

**కజ్జల :** ప్రభూ! నన్ను ఎక్కడికి నడిపిస్తున్నావో.

**(తెర)**

## పంచమ దృశ్యము

(రాజాంతః పురములో ఒక ఏకాంత విశ్రాంతి మందిరము)

**ధర్మాధిపతి :** ప్రభూ! రాజద్రోహుల విషయం మీకు విన్నవించుకోటానికి...

**రాజు :** నేను స్వస్థ చిత్తంతోటే ఉన్నాను. నివేదించవచ్చు.

**ధర్మాధిపతి :** ప్రభూ! మా సాహసానికి క్షమించాలి.

**రాజు :** ధర్మవివక్షలో మీ సాహసమేముంది?

**ధర్మాధిపతి :** ఈనాడు మీకీ విషయం నివేదించటానికి నాకు భయం వేస్తున్నది.

**రాజు :** కారణం?

**ధర్మాధిపతి :** ధర్మద్రోహులూ, రాజద్రోహులూ, మీకు సన్నిహితులు కావటమే –

**రాజు :** న్యాయము న్యాయమే! బాంధవ్యము బాంధవ్యమే!!

**ధర్మాధిపతి :** ద్రోహులు రాజబంధువులైనా ధర్మశాస్త్రాన్ని వ్యతిక్రమించటానికి వీలు లేదన్న శ్రుతి ప్రమాణాన్ని అనుసరించే ఈ సాహసానికి పూనుకున్నాను.

**రాజు :** ద్రోహులు తమ తప్పిదాన్ని ఒప్పుకున్నారా?

**ధర్మాధిపతి :** అర్ధ నిశా సమయంలో ద్రోహి కంచుకిని బందీ చేశాము ప్రభూ!

**రాజు :** కంచుకి రాజద్రోహాన్ని తలపెట్టాడా?

**ధర్మాధిపతి :** కంచుకి భయపడి రక్షకభటుల బాధలకు తాళలేక సమస్తమూ నివేదించాడు.

**రాజు :** ఏమని?

**ధర్మాధిపతి :** రాజద్రోహానికి తాను కేవలమూ ఉపాదాన కారణమని.

**రాజు :** మూలమెవరు?

**ధర్మాధిపతి :** (జంకుతూ) క...జ్జ....లా...దేవి.

**రాజు :** కంచుకి నోటివెంట కజ్జల రాజద్రోహి అనేమాట వచ్చిందా?

**ధర్మాధిపతి :** ప్రభూ క్షమించాలి! ప్రస్తుతము కజ్జలాదేవి హృదయం వెనుకటివలె స్వచ్ఛమైనది కాదు. కలుషితమై పోతుందని కంచుకి మాటలవల్ల వ్యక్తమౌ తున్నది.

**రాజు :** సాధారణంగా ద్రోహం తలపెట్టి పట్టుపడ్డవాళ్ళు తమ నేరాన్ని ఇంకొకళ్ళ మీద ఆరోపణ చేయటానికి పూనుకుంటారు.

**ధర్మాధిపతి :** అతని మాటల్లో ఏవిధమైన అపనమ్మకానికి స్థానం లేదు ప్రభూ! తదితరులను కూడా ప్రశ్నించి కజ్జలాదేవి కలుష హృదయాన్ని గుర్తించగలిగాను.

**రాజు :** వారూ కంచుకి మాటలనే స్థిరపరిచారా?... కజ్జల చాలా కాలం నుంచి జబ్బుగా ఉన్నది. ఏ విధమైన ద్రోహానికీ ఆమె అనర్హురాలు.

**ధర్మాధిపతి :** గత మాసం నుంచి పంక్తి కంఠుణ్ణి ఆశ్రయించి ప్రభువారికి కళంక మాపాదిస్తున్నది. మాంత్రికుల చేత అభిచారిక క్రియలు చేయిస్తున్నది.

**రాజు :** ఎవరికీ వాటివల్ల బాధ కలుగనంతవరకూ ఆమె దోషి కాదుగదా?

**ధర్మాధిపతి :** మందుమాకులతో ప్రభువారి పానీయాలను మలినాలను చేస్తున్నది.

**రాజు :** ఎందుకోసమని?

**ధర్మాధిపతి :** తమను వశపరచుకోవటానికి...

**రాజు :** నేను నమ్మలేను.

**ధర్మాధిపతి :** ప్రభూ! ఆమె అపకీర్తి దేశమంతటా వ్యాపించింది.

**రాజు :** ఏమో!

**ధర్మాధిపతి :** న్యాయ నిశ్చయం చేయబోయేముందు పరమేశ్వరుణ్ణి ప్రార్థించాను. నా స్థితిలో ఉండి నీవే నిశ్చయం చేయమన్నాను. ఒక దివ్యవాక్కు నా నిశ్చయాన్నే ధ్రువపరిచింది. తమకా దేవనిర్ణయం వ్యతిరేకంగా ఉన్నా తప్పదు. దేవ వార్తాహరుడనైన నన్ను క్షమించాలి.

**(పాదాభివందనము చేస్తాడు)**

**రాజు :** (లేవదీస్తూ) నీ కీ మహారాజు అభయమిస్తున్నాడు.

**ధర్మాధిపతి :** ప్రభూ! నిజస్థితిలో అనేకమంది పైకి కనబడేటంత ఉదాత్తులు కారు. కజ్జలదేవి తమ ప్రాణాలకే అపచారం తలపెడుతుందని ఈ కాశ్మీరంలో ఏ ఒక వ్యక్తి అయినా చివరకు కలలోనైనా భావించాడా?

(దూరంగా వచ్చే కజ్జలను చూచి ధర్మాధిపతి నెమ్మదిగా నిష్క్రమిస్తాడు)

**రాజు :** (కోపంతో) కజ్జలా! పిలిపించందే అకారణంగా ఇక్కడికి ఎందుకు వచ్చావు?

**కజ్జల :** నా మనస్సు నన్నిక్కడికి వెళ్ళమని ప్రేరేపించింది.

**రాజు :** నీవు ఇక్కడికి రావటానికి నైతికాధికారం కూడా లేదు. తప్పిపోయింది.

**కజ్జల :** సమస్తాధికారాలు నాకు సంబంధించినంతవరకు నా హస్తగతమై ఉన్నవి. మీ అధికారం మీద నేను ఆధారపడను.

**రాజు :** నీ సమస్తాధికారాలు నేను పూర్వమిచ్చినవే కాని అన్యమైనవి కావు.

**కజ్జల :** మీరివ్వటమేమిటి? నేను జయించుకున్నాను. ఇప్పుడు నిలుపు కుంటాను.

**రాజు :** నీవెంత దుస్థిలో ఉన్నావో నీకు తెలుసునా? ఏమిటీ వెర్రి ధైర్యము?

**కజ్జల :** నా స్థితీ, మీ స్థితీ ఒకేవిధంగా ఉన్నది. నేను ఇప్పుడు నామీద జరిగిన నిందారోపణను తీర్చుకోవటానికి రాలేదు. మీమీద నాకున్న ప్రేమను ఒకమారు వెలిబుచ్చటానికని వచ్చాను... ప్రభూ! వృథాగా కోపించవద్దు. హృదయ స్వాస్థ్యం తెచ్చుకోండి. ఇతరులమాట నమ్మవద్దు. నా మనస్సును గ్రహించండి.

**రాజు :** కజ్జలా! నీ దోషాలు నాకు తెలియలేదనుకుంటున్నావా?

**కజ్జల :** తెలిసినవా?

**రాజు :** అవును.

**కజ్జల :** మరీ మంచిది. నేను ఒప్పుకోవలసిన అగత్యం తప్పిపోయిం దన్నమాట.

**రాజు :** అయితే నా చెవినబడ్డ విషయాలన్నీ సత్యాలన్న మాటేనా? ఆ విష ప్రయోగాలూ, మాంత్రికులూ, తాంత్రికులూ...

**కజ్జల :** ఇవన్నీ నా నేరాలెలా ఔతవి? మీ నేరాలే.

**రాజు :** (కోపంతో) నీకేమైనా మతి పోయిందా?

**కజ్జల :** (దీనంగా) ప్రభూ! నా దోషాలన్నిటికీ మీరే కారణమని విన్నవించు కుంటున్నాను. మీ ప్రేమ, మీ మోహము, మీ స్వార్థమూ నన్నింతకు తీసుకువచ్చినవి. నన్ను మొదటినుంచీ ఒక చదరంగపు పావుగా భావించి ప్రవర్తించారు. మొదట మోసపోయి ఇప్పుడు గ్రహించాను. నా పూర్వస్థితిని నిలువ బెట్టుకోవటానికని అనేక అడ్డదారులు త్రొక్కుతున్నాను.

**రాజు :** నేను నీకు చేసిన మేలంతా మరిచిపోయి చివరకు నా ప్రాణాలకే... ఛీ నీ మొగం చూడకూడదు. ఎక్కడో పల్లెటి దిక్కున తిండిలేక మలమల మాడిపోతూ ఉన్న నిన్ను ప్రేమ పూర్వకంగా పిలుచుకువచ్చి మహారాణులకు కూడా దక్కని గౌరవమిచ్చి చూస్తుంటే – మనస్సులో పుట్టవలసిన బుద్ధులు ఇవేనా? ఏమనుకున్నావో నీవనుభవించే వస్తువులలో చిన్నమెత్తు కూడా నీది కాదు – పాపీ, ఏమని నాతో మాట్లాడటానికని నిర్భయంగా ఇక్కడికి వచ్చావో నాకర్థం కావటంలేదు.

**కజ్జల :** నీ భార్యనని.

**రాజు :** నా భార్య ఛీ! నా భార్య మహారాణి కాంభోజ రాజపుత్రి.

**కజ్జల :** ప్రభూ! మీ నోటికి వచ్చినట్లు మాట్లాడవద్దు. మీ భార్య కాంభోజ రాజపుత్రేనా? ఔను నిజమే. నిర్వంశం కాకుండా ఉండటానికని నేను అంగీకరించిననాడు మీ పర్యంకాన్ని చేరిన మహారాణి కాంభోజ రాజపుత్రి – మీ భార్య – నేను, మహారాణి! ఏనాడు మహారాణి. నేను మహారాణి. సకల కాశ్మీరాన్నీ నా శాసనబద్ధం చేశాను. నీవూ, నీ మంత్రులూ, నా ఇష్టానుసారంగా పరిపాలన చేశారు. జ్ఞప్తి లేదా?

**రాజు :** ఆ మాట సత్యమే. కానీ నీకాస్థితి నేను కల్పిస్తే వచ్చింది.

**కజ్జల :** ప్రభూ! మీ కీర్తి విశ్వవ్యాప్తం కావటానికి నేనెలా శ్రమించానో మరిచిపోవద్దు, మిమ్మల్ని మహోత్కృష్ట నాయకుణ్ణి చేయటానికి అహోరాత్రం నేనెంతగా అల్లట తల్లటైనానో మీకు తెలియనిది కాదు. నా వ్యక్తిత్వాన్నే మరిచిపోయి మీలో ఐక్యమై పోవటమే నా జీవిత పరమావధి అని నేను ఎంత భ్రాంతి పడ్డానో మీకు తెలియటం లేదు. సమస్త కాశ్మీరమూ మీ ఆజ్ఞానువర్తి కావటానికి ఈ కజ్జల మేధాబలం కారణం! ఈ కజ్జల అకలుష హృదయం కారణం! అమలిన ప్రేమ కారణం!!!

**రాజు :** కజ్జలా నీ గర్వపోతుతనం నిన్ను గ్రుడ్డిదాన్ని చేస్తున్నది. నేను లేనిది కజ్జలే లేదు. నిన్ను సృజించిన నాకే నీవు సహాయం చేశావా? పరమ దరిద్రులను భాగ్యవంతులుగా, భాగ్యవంతులను పరమ గర్భదరిద్రులునుగా తీర్చి దిద్దగల శక్తి నాకు న్నది. నేను జగజ్జేతను. నీవు నాకు కొంతకాలం సేవకు రాలివి. ప్రస్తుతం నాకు నీమీద ప్రేమలేదు.

**కజ్జల :** ప్రస్తుతం మీకు నామీద ప్రేమలేదా? నేను మిమ్మల్ని ఎన్నడూ ప్రేమించలేదు.

**రాజు :** స్పర్ధ నిన్ను పశువును చేస్తున్నది జాగ్రత్త. నీవు పూర్వం నన్నెలా ప్రేమించావో నేను ఎన్నడూ మరిచిపోలేను.

**కజ్జల :** నేను కాశ్మీరాధిపతిని. ప్రేమించాను గాని నిన్ను ప్రేమించ లేదు.

**రాజు :** ఈ ధైర్యం నీకు ఇప్పుడే వచ్చిందా?

**కజ్జల :** వంది మాగధ స్తోత్రాలలో మతి చెడిపోతుండే మీకు ఈ సత్యం ఎన్నడూ అవగతం కాలేదు. మీ అంత కురూపి ప్రపంచంలో లేదు. నేను ప్రేమించినా, మరొకతె ప్రేమించినా మీ అందచందాలకు కాదు – మీ రాచరికానికి.

**రాజు :** (ఉద్రేకంతో) ఇక సహించను. నోరుముయ్.

**కజ్జల :** ప్రభూ! ఒక్కమాటు ముకురం ముందుకు పోయి మీ అందాన్ని చూచుకోండి. అయితే వంది మాగధస్తోత్రాలు విని వినీ మీ మనస్సు మలినమై పోవటం వల్ల మన్మథాకారమేనని భ్రమ పుట్టవచ్చు. ఆ కమురు తొలగించుకొని చూడగలిగితే – మీమీద అసహ్యం కలుగకపోదని నా విశ్వాసం. బట్టతల, రాలిపోయే ఆ పళ్ళు (దంతాలు) మీ శూన్య హృదయం!... కొన్నాళ్ళు కజ్జలాదేవిని సంతోష పెట్టాననే భ్రాంతికూడా మీ మనస్సులోనుంచి తొలగిపోవాలి. నేను మీవల్ల ఏ నిమిషమూ సంతోషపడలేదు – మీ గాఢా లింగనం వల్ల నా పంచేంద్రియాలు బండబారి పొయ్యేవి.

ఈ పదిహేను సంవత్సరాలూ మిమ్మల్ని ఎంతగా అసహ్యించు కొన్నానో అర్థమౌతున్నదా?

**రాజు :** అయితే... నీకు ధర్మాధికారి ఇవ్వదలచుకున్న శిక్ష సమంజసమైందే! నీ నిజ స్వరూపాన్ని ఇప్పటికైనా బయటపెట్టావు.

**కజ్జల :** నన్ను శిక్షిస్తే మిమ్మల్ని మీరే శిక్షించుకొన్నట్లు. లోకం మిమ్మల్ని నన్నూ ఎన్నడూ వేరు చెయ్యలేదు. చెయ్యదు. అయితే నా పిల్లలో?

**రాజు :** నిన్నే తప్ప మరొక వ్యక్తిని ప్రేమించలేని నీకు సంతానం కూడానా కజ్జలా!

**కజ్జల :** లోకానికి మీ పిల్లలూ నా పిల్లలూ? నన్ను శిక్షించి వాళ్ళనేం చేయదల్చు కున్నారు?

**రాజు :** చంపి గోతిలో పారేయిస్తాను. నా యిష్టం వచ్చినట్లు ఏదో చేస్తాను.

**కజ్జల :** నన్ను అన్యాయం చేసినట్లు వాళ్ళను కూడా...

(సారంగదేవి వెనుకనుంచి వచ్చి నమస్కారం చేస్తూ)

**సారంగదేవి :** ప్రభూ! మేమేమి అపచారం చేశామని మమ్మల్ని చంపి గోతిలో పారవేయ దలచుకున్నారు?

**రాజు :** తల్లీ సారంగీ (లేచి వచ్చి సారంగదేవి తల నిమురుతూ దగ్గిరకు తీసు కుంటాడు) కజ్జలా! సారంగి నీకోసం బలి కాబోతున్నది.

**కజ్జల :** మీ ఇష్టం. మీరు మహారాజులు.

**రాజు :** (సారంగదేవితో) అమ్మాయీ! నీవు చింతపడకు. నీవిక్కడకి ఎలా వచ్చావు తల్లీ!

**సారంగదేవి :** ప్రభూ! ఎందుకు మీలో మీకీ కోపాలు?

**రాజు :** అది నీ విషయం కాదు. సారంగీ నీవు ఇక్కడినుంచి వెళ్ళిపో!

**సారంగదేవి :** ఎక్కడికి వెళ్ళమంటారు. కన్నవారు మీరే వెళ్ళగొడితే నేను ఎక్కడికి పోయేది. మీ కౌగిలి తప్ప ఈ కాశ్మీరంలో నాకు గమ్యస్థాన మింకోటేముంది?

**రాజు :** (కన్నీళ్ళతో) తల్లీ! సారంగీ!

**(దగ్గరగా తీసుకుంటాడు)**

**కజ్జల :** అమ్మాయీ! ఈ వెర్రి ప్రేమలకు లొంగిపోకు. చివరకు నీ హృదయంలో చితిమంటలు జ్వలిస్తవి. మోసపోకు. హృదయాన్ని అర్పించకుండా జగత్తును చూడటం నేర్చుకో. అది భయంకర వ్యాఘ్రం. మానవజాతి స్వభక్షణ చేసే పెనుబాముల కూటమి. జాగ్రత్త మోసపోకు.

**రాజు :** కజ్జలా! వృధాగా భయపెట్టి బిడ్డ భవిష్యత్తును పాడు చేయకు.

**సారంగదేవి :** అమ్మా! జగత్తు పెనుబాముల కూటమైతే దానికి ఒప్పచెప్పటానికేనా నన్నింతకాలం పెంచారు. మొదటే నా తనూలతను ఎందుకు గిల్లివేయ లేదు? మీరు మొదట ఒకరినొకరు ఎందుకు ప్రేమించుకున్నారు? మాకీ విపత్తెందుకు తెచ్చి పెట్టారు. మీ వినోదం కోసం అమాయకులను బలి ఇవ్వటము మీకు న్యాయమేనా?

**(తండ్రి దగ్గరికి పోయి దుఃఖిస్తుంది)**

**కజ్జల :** (సారంగదేవి మీద వ్రాలుతుంది)

**రాజు :** (సకరుణంగా సారంగదేవిని చూస్తూ బుజాలు తడుతూ) తల్లీ! నన్నిప్పుడేమి చేయమంటావు.

**సారంగదేవి :** మా అమ్మను క్షమించండి.

**రాజు :** మీ అమ్మ నేరస్తురాలు. నేను క్షమించినంత మాత్రంలో... రాత్రి ఏమి జరిగిందో నీకు తెలుసునా?

**సారంగదేవి :** తెలియదు... ఆ.... ఆ... తెలియదు.

**(కజ్జల దూరంగా నిలవబడుతుంది)**

**రాజు :** నా ప్రేమనైనా త్యాగం చేస్తాను గాని న్యాయానికి విరుద్ధంగా ప్రవర్తించలేను.

**సారంగదేవి :** తండ్రీ! మీరు తలచుకుంటే ఏది జరగదు? మీరు చెప్పిందే న్యాయమై తీరుతుంది.

**రాజు :** అమ్మాయీ! నీకోసం మీ అమ్మ ప్రాణాలు రక్షిస్తాను. కానీ, కాశ్మీరదేశంలో ఆమె ఉండటానికి వీల్లేదు.

**సారంగదేవి :** మీ ఆజ్ఞను మన్నిస్తే క్షమించి మళ్ళీ రానిస్తారా?

**రాజు :** ఈ గర్వి ఆ శిక్షను అంగీకరిస్తుందా?

**సారంగదేవి :** అంగీకరిస్తుంది. కాశ్మీరదేశం వదలి పెడతానని నాకు వాగ్దత్తం చేసింది. (కజ్జలతో) కాదమ్మా!

**కజ్జల :** ఔను నిజమే. నా అంతట నేనే కాశ్మీర దేశం వదలిపెట్టి పోదామని నిశ్చయించుకున్నాను.

**రాజు :** న్యాయాధిపతి విధించిన శిక్షను పాలించినట్లు కూడ ఉంటుంది. కజ్జలా! నీ హృదయమెలా బండ బారింది?

**కజ్జల :** నా హృదయమా! ఎవరి హృదయం బండబారిందో మీ హృదయానికే తెలుసు.

**సారంగదేవి :** అమ్మా! కాశ్మీరాన్ని వదలివేయటము మీకు ఇష్టం లేదా?

**కజ్జల :** నీవు కూడా నా శత్రుపక్షంలో చేరావా తల్లీ! ప్రభూ! ఎలాగైతేనేం మీరే జయించారు. దీనికి కారణం సారంగి. దాని మాట త్రోసివేయలేను. దాని జాలికళ్ళు నన్ను కరిగిస్తున్నవి. కాని మీ ఆజ్ఞ శిరసా వహించి మాత్రం కాశ్మీరాని వదలిపెట్టి వెళ్ళటం లేదు.

**రాజు :** (కోపంతో) కాశ్మీరదేశాన్ని దాటి వెళ్ళిన తరువాత మళ్ళీ నీవు ఈ దేశంలో కాలు పెట్టవద్దు. ఇది రాజాజ్ఞ. సారంగి నీవెంట రావడానికి వీలులేదు.

**సారంగదేవి :** తండ్రీ!

**రాజు :** ఇది రాజాజ్ఞ! అమ్మాయీ ఎదురు మాటాడవద్దు.

**కజ్జల :** విధి ఏం చెయ్యదలచుకుంటే అది చేస్తుంది. కాని మానదు.

**సారంగదేవి :** నాన్నా! మా అమ్మ వెళ్ళిపోతుంది. మళ్ళీ కనుపించదు. మనఃపూర్వకంగా ఆమెతో ఒక్కమాట మాట్లాడండి.

**రాజు :** అమ్మాయీ నాకు ఆమెమీద ప్రేమ లేదు. ద్వేషమూ లేదు.

**కజ్జల :** నా ప్రేమకు వృద్ధాప్యం లేదు. అది పరిపూతమైంది.

**రాజు :** కజ్జలా! ఇక సెలవు.

(అని పానీయ పాత్రలున్న బల్లదగ్గరకు పోయి చషంక గ్లాసులో పానీయం పోస్తే కజ్జల తనకిస్తాడని చూస్తుంటుంది. రాజు ఇవ్వటానికి పూనుకోడు. నోరు తెరుస్తుంది. రాజు త్రాగబోతుంటాడు. సారంగదేవి త్వరగా వెళ్ళి)

**సారంగదేవి :** ఆ పానీయాన్ని నన్ను త్రాగనివ్వండి.

**రాజు :** (సకరుణంగా) తీసుకో తల్లీ!

(కజ్జల ఒక వెర్రికేక పెట్టి సారంగదేవి అందుకొని త్రాగబొయ్యే పానీయ పాత్రను చేతితో తీసుకొంటుంది)

**కజ్జల :** (వెర్రిగా చూస్తూ ఉన్న సారంగదేవితో) సారంగీ ఏమిటది?

**సారంగదేవి :** ఏమిటమ్మా అలా వెర్రికేక పెట్టావు – (కజ్జల ఒక గుక్కలో పానీయాన్నంతా తాగేస్తుంది)

**కజ్జల :** వెర్రి కేకా... అమ్మాయీ.

**సారంగదేవి :** (భయోద్వేగంతో) అమ్మా.

**కజ్జల :** ఏ... విషమ... పరిస్థితులు వచ్చినా నన్ను మోసగించకు.

**సారంగదేవి :** అమ్మా! నీ కోరికను ప్రాణమిచ్చైనా పరిపాలిస్తాను.

**రాజు :** కజ్జలా! ఏమిటా ఆయాసం.

**కజ్జల :** ఏది చూచినా నాకు వ్యతిరేకం! భగవదిచ్ఛే నాకు వ్యతిరేకం! నేను బలికావలసిందే కాని ప్రయత్నం నిష్ఫలం. జీవితం నిష్ప్రయోజనం (తూలి పడబోతుంది).

**సారంగదేవి :** (దగ్గరకు పోయి) అమ్మా! అమ్మా!! (పట్టుకొని నేలమీద పడుకోబెడుతుంది)

**రాజు :** కజ్జల, ఏమిటా దుస్థితి?

**సారంగదేవి :** అమ్మను మృత్యువు పిలుస్తున్నది నాన్నా!

**రాజు :** నేను మొదట త్రాగబోయింది విషమన్న మాట! ప్రభో నన్ను బ్రతికించావు.

**కజ్జల :** ప్రభూ! మీరు నా దుస్థితి చూస్తూ కూడా స్వార్థపరు లౌతున్నారా?

**సారంగదేవి :** (ఏడుస్తూ) అమ్మా! అమ్మా!!

**కజ్జల :** ఏడవకు తల్లీ – ఏడ్చి ఏం ప్రయోజనం?

**(సారంగదేవి చేతులు ముద్దాడుతుంది)**

**రాజు :** స్వార్థం నాదా కజ్జలా! మృత్యువు నిన్ను ఆహ్వానించి లోకానికి ఎంత మేలు చేస్తున్నది.

**కజ్జల :** (సారంగదేవితో) తల్లీ నాకు మృత్యువు తప్పదుగానీ నీవు రాజదండన తప్పించావు. ఉరికంబాన్ని దర్శించటం తప్పించావు. పానీయపాత్ర నీవు అందుకోకపోతే...

**(హఠాత్తుగా గాయని షట్పది ప్రవేశించి)**

**షట్పది :** కజ్జలా! కజ్జలా!! ఏమిటీ దుస్థితి?

**కజ్జల :** (వికటంగా) ఏమున్నది? మృత్యువు. యౌవనంలో ఉన్న వాళ్ళకు కూడా తప్పదు, షట్పదీ!... ఇది మృత్యువు... మృత్యువు... మృత్యువు...

**(తెర)**

(సమాప్తము)

***ప్రజావాణి, 1963***

# చంద్రవదన

లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణమహోత్సవ కోలాహలము. ఆలయ ఘంటికలు, వాద్యాలు, వైవాహిక చిత్రాలు కలగలుపుగా వినిపిస్తూ ఉంటవి. "ఒసేవ్! సుబ్బక్క! ముహూర్తాలు పెట్టుకున్నాము. – అదుగో ఆ లావుపాటి ఆయన ప్రక్కన కూర్చున్నాడే అతడే మా అల్లుడు", "ఏమే లక్ష్మమ్మ కోడల్ని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టిందట. ఇదేం పొయ్యేకాలమే", "ఇక్కడ కూడా ఇంటి సొరేనట్రా" "ఇస్, అబ్బ, కళ్యాణం చూడడానికి వచ్చారా – కబుర్లు చెప్పుకోవటానికి వచ్చారా" – పసిపిల్ల ఏడుపు "ఎందుకమ్మా పిల్లవాణ్ణి అలా ఏడిపిస్తావు, వాడికి కాసిని పాలిచ్చి సముదాయించరాదూ", "అయ్యా, ఆచార్లగారూ... ఒక విసనకర్ర ఇలా అందుకోండి" "అబ్బాయీ! పానకం తాగారా" "శ్రీ లక్ష్మీనృసింహ చరణం శరణం ప్రపద్యే" "ఇవిగో తలంబ్రాలు వచ్చేశాయి. కట్నాలతో నాయుడుగారి కుమార్తె చంద్రవదన వచ్చింది" "ఓయ్ భజంత్రీలూ! మేళాలు కానివ్వండి" – మేళాలు కొంత సాగిన తర్వాత

**సూర్యారావునాయుడు:** నింపాదిగా – మోహియార్! మా చంద్రవదన ఎలా వుంది?

**మోహి:** ఇన్నాళ్ళనుంచి నీవు ఈమెను గురించి చెప్పినదంతా కవిత్వమనుకున్నాను, సూర్యం. అబ్బ, ఎంత చక్కని చుక్క, ఏ పుణ్యాత్ముడికో నిత్యం అమృతాన్ని అందించడానికి స్వర్గంలోనుంచి దిగివచ్చిన అప్సరసలా ఉంది.

**సూర్య:** ఆమెను గురించి బహిరంగంగా ప్రశంసించడం బహుప్రమాదం. మనచుట్టూ ఉన్న యువతలోకం అణుమాత్రం సహించదు. అందులో ఆమె మేనత్త కుమారుడు మాధవనాయుడు మహ దొడ్డవాడు.

**మోహి:** సూర్యం, మా పర్షియాలో బయలుదేరింది నా హృదయానికి నచ్చిన వైచిత్ర్యం తాజ్‌మహల్. కాని ఆ సౌందర్యం యీమె అందం ముందు యెందుకూ కొరగాదు.

**సూర్య:** బిగ్గరగా మాట్లాడకు. మారువేషంలో ఉన్నావని మరిచిపోకు. కన్నుతో చూచి మనస్సులో ఆనందించు.

**మోహి:** సూర్యం, మహోజ్వల కాలసర్పంలా మనస్సులు దోచుకుంటూ ఉన్న ఆ జడలో మల్లెపూదండ చంద్రవంక వలె ఈ కళ్యాణమండపంలో చిరువన్నెలను చిలకరించటం లేదూ?

**సూర్య:** నింపాదిగా మాట్లాడమంటే ఏమిటా ఉత్సాహం. నమ్మి, నిన్ను యిక్కడికి తీసుకురావటం నాదే తప్పు. నీవు ముసల్మానువని మరిచిపోయి నట్లున్నావు.

**మోహి:** అయితే మాకు అందాన్ని చూచి ఆనందించే అధికారం లేదంటావా? నేను సుందరమైన ఏ వస్తువును చూచినా ఎందుకో చలించిపోతాను.

**సూర్య:** నీకు అధికారం వుంది. నీవు ఇంతకంటె వేయిరెట్లు చలించిపో. కానీ ఇది స్థలమూ కాదు, సమయం అంతకంటే కాదు.

**మోహి:** సౌందర్యోపాసనకు స్థలమూ, సమయమూ యేమిటోయ్ సూర్యం?

**సూర్య:** అన్యమతస్థులకు ఈ ఆలయంలో ప్రవేశించటానికి హక్కులేదు. అలా ప్రవేశించిన వాళ్ళను శిక్షించడానికి ధర్మకర్తలకు నవాబులు అన్ని హక్కులూ ఇచ్చారు. అయినా ఇది కళ్యాణ సమయం.

**మోహి:** సూర్యం, నన్ను వృధాగా భయపెట్టకు. ఆ జగదేకసుందరి ఒక్కమాటు సంపూర్ణంగా తన ముఖచంద్రుణ్ణి యీ వంకకు త్రిప్పితే ఆనందామృతపానం చేసి నాయీ కన్నులు ధన్యమౌతాయి.

**సూర్య:** ఒరే అబ్బీ! ఇవాళ నీవేదో వెర్రి పని చేస్తావు. మర్యాదగా మనం ఇంటికి వెళ్ళుతామని నాకు నమ్మకం కలగడం లేదు.

**మోహి:** నీవేమీ భయపడకు. సభ్యత తెలియకుండా ప్రవర్తిస్తానని అనుకోకు.

**సూర్య:** అయితే నామాట విను. ఆమె మీదే కళ్ళు గుచ్చి చూడకు. అంతా గమనిస్తారు.

**మోహి:** ఈ ఆవరణలో నాకు ఆమె తప్ప మరెవ్వరూ కనిపించటంలేదు. ఆమె చుట్టూ ఉన్నదంతా ఆమె సౌందర్య కాంతి.

**సూర్య:** ఊఁ లే. ఇక్కడ ఇక నీవు క్షణకాలం ఉండతగవు లే.

**మోహి:** సూర్యం నిన్ను బ్రతిమాలుకుంటున్నాను. త్వరపెట్టకు. అదిగో ఆమె ఇటువైపే చూస్తున్నది. ముఖం చంద్రబింబమా? కాదు, దానికి చలవేగాని మాధుర్యమెక్కడుంది?

నీలి నీలాంబరాల మిలమిలలతో ఆ నేత్రాలు రెండూ రెండు మధుకలశాలు. సూర్యం నీ గుండె తియ్యబడడం లేదూ...?

**సూర్య:** (కఠినంగా) మోహియార్, అలా వెర్రిగా చూడకు. ప్రక్కవారు యేమనుకుంటారు. నాకు భయమేస్తున్నది.

**మోహి:** అలాగా. నాకేమీ భయంలేదు. సూర్యం, ఆమె నన్నే చూస్తున్నది. కన్నులతో పలకరిస్తున్నది. మందహాసంతో నన్ను గౌరవిస్తున్నది. నేనూ నేత్రాలతో పలకరిస్తాను. మందహాసంతో గౌరవిస్తాను.

**సూర్య:** మోహియార్! తొందరపడు లే. నీవు బయలపడిపోయినావు. అడుగో ధర్మకర్త నీమీదనే దృష్టి నిల్పి యిటే వస్తున్నాడు. లే వెళ్ళిపోదాం.

**మోహి:** నాకేం భయంలేదు. సూర్యం అదుగో చంద్రవదన రోజా పుష్పాన్ని హృదయానికి హత్తుకొని వాసనలూది స్వీకరించనున్నట్లు అందిస్తున్నది. అందుకుంటున్నట్లు శిరస్సు వంచి సంజ్ఞ చేస్తాను.

**సూర్య:** నీకు మతిపోయింది. నీ ఖర్మం – నే వెళ్ళిపోతున్నా.

**మోహి:** (దీనంగా) వెళ్ళిపోకు సూర్యం. నేను శిరస్సు వంచి గుర్తు చేసిన తరువాత ఆమె కంటివెంట వచ్చిన ఆ ఆనందబాష్పాలు గమనించు.

**సూర్య:** గ్రంథం కొంత సాగించావుగా. ఇకలే. లేకపోతే నేనిక ఆగను. వెళ్ళిపోతాను.

**మోహి:** మరొకమాట. ఆమె దర్శనం చేయిస్తానని వాగ్దానం చెయ్యి. బయలుదేరి వస్తాను.

**సూర్య:** అలాగే తప్పకుండా.

**మోహి:** సూర్యం ఆమె జాలికన్నులతో నావైపే యెలా చూస్తున్నదో చూడు. నీవు దయలేనివాడివి... పద.

**సూర్య:** నీవు వట్టి వెర్రివాడివి. ఆమె ఇంతకుపూర్వం యెంతోమంది యువకులను యిలాగే చూచింది. ఎంతోమంది మోసపోయి పండువంటి బ్రతుకులను భంగం చేసుకున్నారు.

–సీతమ్మ పెళ్ళికూతురాయెనే, రామయ్య పెండ్లి
కొడుకాయెనే అన్న వాక్యం వినిపిస్తూటుంది.

## రెండవ రంగము

(చంద్రవదన క్రింది పాట పాడుకుంటూ ఉంటుంది)

**నవ వసంత మధుపా!**
**అధిపా, హృదయాధిప!!**

**ఎలదోటకు రాణి యిది**
**లేఁబ్రాయపు సుమకన్నియ**
**కృప వీడిన నావై నీ**
**కృప కల్గనో లేదో, ఓ... నవ వసంత...**

**ఎద తీవియ కదలించిన**
**పదమల్లెను వినవొల్లనా**
**యుగ యుగాల కిది నీదే**
**వగపో మది వలపో... నవ వసంత...**

**మాలతి:** మదన మహాసామ్రాజ్యానికి పట్టమహిషివైపోయినట్లు అప్పుడే యేమిటమ్మా యిలా పట్టరాని ఆనందం...

**చంద్ర:** (అమితానందంతో) మాలతీ! అప్పుడే వచ్చేశావు. వెళ్ళినపని ఏమైంది? కాయా పండా...?

**మాలతి:** కాయా కాదు – పండూ కాదు. పండుకాయ.

**చంద్ర:** అంటే...

**మాలతి:** ఆయనగారిని దగ్గరికి పోయి నా రెండు కళ్ళూ పెట్టుకొని చూతునుగదా వట్టి కుబేరుడు... ఒళ్ళంతా గట్టి.

**చంద్ర:** (కోపంతో) మాలతీ! పరిహాసాలు కట్టిపెట్టు.

**మాలతి:** అయితే సత్యమే చెపుతాను. ఇన్నివిధాల పేరుమోసిన రాజకుమారుల నందరినీ కాలదన్ని అమ్మా మహ అందగాడని ఓ వినాయకుడికి నీ హృదయమిచ్చుకున్నావు.

**చంద్ర:** అయితే అందమంటే యేమిటో నీకు తెలియదు. అంతటి అందగాణ్ణి నా జీవితంలో చూడలేదు.

**మాలతి:** అంతటి అనాకారివాణ్ణి నేనూ చూడలేదు. పోనీ అందమేమి కొరుక్కుతినేదా అని మాట్లాడించి చూస్తే అయ్యగారు వట్టి వెర్రిబాగులవాడు.

**చంద్ర:** నీవడిగిన కొంటె ప్రశ్నలకు సమాధానం చెప్పలేదేమో. తెలివిగలవాళ్ళందరూ నీబోటి వాచాలురతో అలాగే ప్రవర్తిస్తారు.

**మాలతి:** పోనీ వట్టి వాజమ్మలుగాని అధిక ప్రసంగం చెయ్యరని అనుకుందామంటే, చంద్రవదన అని నీ పేరు చెబితే వినీ విననట్లు ప్రవర్తిస్తే...

**చంద్ర:** నీవు అబద్ధం చెపుతున్నావు. నీ అభిప్రాయమేమిటి?

**మాలతి:** ఏమీలేదు. అందచందాలూ ఆటపాటల్లో అన్నిట్లో నీకు తగ్గ వరుడు మన మాధవనాయుడు గారేనని నా అభిప్రాయం.

**చంద్ర:** మాలతీ, మరొక మాటు అతని పేరెత్తితే నేను సహించను.

**మాలతి:** నిద్రలో కూడా నీ పేరే స్మరిస్తుంటాడు గనక అతణ్ణి పెళ్ళాడితే సుఖిస్తావనీ, నీవు సుఖిస్తే చూసి ఆనందిద్దామని చెప్పాను గాని నాకెందుకు వచ్చింది. ఇంతకూ 'తామునిగినది గంగ'

**చంద్ర:** పోనీలే. ఇంతకూ వారెవరో కనుక్కున్నావా?

**మాలతి:** మీ పేరేమని ప్రశ్నించాను. అది నీకు చెప్పేది కాదు. నేనూ ఒక రాజవంశంలో జన్మించానని చెప్పాడు.

**చంద్ర:** రాజవంశంలో జన్మించకపోతే యిలా క్షాత్ర తేజం దుస్సాధ్యము. మరి, మన ప్రాంతంవారేనా?

**మాలతి:** మనస్సు ఇచ్చుకొన్న తరువాత మన ప్రాంతంవారైతేనేం? మరొక ప్రాంతం వారైతేనేం. మళ్ళీ రాబట్టుకోగలుగుతామా...?

**చంద్ర:** అందుకు నేనేమీ చింతపడడం లేదు. ముందు చింతపడను కూడాను.

**మాలతి:** అయినా, నీవంటి ఉత్తమ క్షత్రియ కాంత కుసుమ కోమల హృదయాన్ని ఒక అజ్ఞాతమైన తావున పారేయటం క్షేమం కాదు.

**చంద్ర:** మాలతీ! నీ విపరీత సంభాషణతో నా మనస్సు కలతపెట్టకు. జాలివహించు. సమస్తవిధాలా సాయపడు.

**మాలతి:** జాలిగలదాన్ని కాబట్టి, ఒప్పుకొని మనస్సుకు ఎలాగో నచ్చజెప్పి మీ ఇద్దరికీ యేకాంత సన్నివేశాన్ని ఏర్పాటు చేసి వచ్చాను.

**చంద్ర:** నిజమేనా? మాలతీ... ఎప్పుడు? ఎక్కడ?

**మాలతి:** వెర్రిదానా! నీ ఆనందం నా ఆనందం కాదూ? ఏమనుకుంటావో అని నిన్ను పరీక్షించాను గాని సత్యం చెపుతున్నాను – మీ యిద్దరికీ వివాహం జరిగితే రతీ–మన్మథుల్లా ఉంటారు. – మీ సన్నివేశం సాయంకాలానికి మన ఉపవన సౌధంలో.

**చంద్ర:** మాలతీ, మంచి ప్రదేశాన్ని నిర్దేశించావు.

**మాలతి:** రాత్రి అంతా వారు యిక్కడనే వుంటారు. చంద్రుని కళలన్ని రాత్రికి మా చంద్రవదన మనోజ్ఞ సౌందర్యం ముందు చెల్లిపోవాలి.

**చంద్ర:** నీ మేలు జన్మజన్మలా మరచిపోలేను.

**మాలతి:** నాన్నగారు ఊర్లోకి ఏ క్షణానైనా రావచ్చు. ఏమరివుంటే యెంతటి ప్రమాదమైనా సంభవించవచ్చు.

**చంద్ర:** అన్నిటికీ నీవు వున్నావు.

**మాలతి:** (ముద్దుగా) అవును పాపం. లేను మరి, అనుభవించటానికి నీవు – అటూ యిటూ దెబ్బలు తినటానికి నేనూ.

## మూడవ రంగము

(రంగనాయుడు ఏకాంతముగా లక్ష్మీ నృసింహస్తోత్రములో నుంచి క్రింది శ్లోకాన్ని పఠిస్తుంటాడు)

> **ప్రహ్లాద నారద పరాశర పుండరీక**
> **వ్యాసాంబరీష శుకశౌనక హృన్నివాస**
> **భక్తానురక్త పరిపాలన పారిజాత**
> **లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్**

**పెద్దియజ్వ:** రంగనాయుడుగారేనా అది?

**రంగ:** ఎవరు? ఓహో పెద్దియజ్వగారా? దయచేయండి. ఆ ఆసన మలంకరించండి. ఆఁ, నృసింహస్వామివారి కళ్యాణోత్సవాలు సలక్షణంగా సాగిపోయినట్లేనా..?

**పెద్దియజ్వ:** అబ్బబ్బ! ఎంతమాట సెలవిచ్చారు? అన్ని ఏర్పాట్లూ తాము చేయించిన తరువాత ఇక లోపం జరగటమే...? అయితే తలంబ్రాల సమయంలో తాము లేకపోవటం మాబోటివాళ్ళందరికీ గొప్ప లోటనిపించింది.

**రంగ:** సంభావన సమయంలో గల్లంతు లేకుండా నడిపించారా?

**పెద్దియజ్వ:** మన మాటకు అడుగుదాటి వెళ్ళేవాడు ఇంతవరకూ పుట్టలేదు. ఇక పుట్టబోడు.

**రంగ:** ఉత్సవకాలానికి ఉండలేకపోవడం వల్ల నేనూ ఎంతో బాధపడ్డాను. ఇలా జరగటం ఇదే ప్రథమ పర్యాయం.

**పెద్ది:** తమ మీద పడ్డ కార్యభారం అటువంటిదనుకుంటాను. సౌభాగ్యవతి తమ కుమార్తె చంద్రవదనమ్మగారు తాము కూర్చుండే స్థానంలో కూర్చొని సమస్తమూ నడిపిస్తుంటే అదో నూతన శోభ కలిగింది.

**రంగ:** అన్ని నడవళ్ళూ సక్రమంగా జరిగించమని, ఏ లోపం జరుగరాదని యెన్నోరీతుల చెప్పి వెళ్లాను.

**పెద్దియజ్వ:** తమ ప్రభుతకు తగ్గ కుమార్తె అనిపించింది. ఎన్నడూ రాని రాజకుమారులందరూ వచ్చి వేదికల నలంకరించటం మరీ ముచ్చట వేసింది.

**రంగ:** వాళ్ళంతా మా చంద్రవదన మనస్సుకోసం వచ్చి ఉంటారు.

**పెద్దియజ్వ:** తప్పేముంది. వాళ్ళల్లోనే యెవరో ఒకరికి ఇచ్చి వివాహం చేయక తమకు మాత్రం తప్పేదేముంది? యుక్తవయస్సు వచ్చిందికూడాను.

**రంగ:** పెద్దియజ్వగారూ! మా చంద్రవదన వివాహం మాకో తీరని సమస్యైనది.

**పెద్ది:** ఆశ్చర్యంగా ఉంది. 'అమ్మాయి కురూపి అనా, అడిగినంత కట్నం ఇవ్వలేరనా' సమస్య కావటానికి...

**రంగ:** నా కుమార్తె కురూపిణిగా పుడితే యెంతో సంతోషించేవాణ్ణి. అందరూ అమ్మాయిని 'మాకివ్వమని మాకివ్వమని' అడుగుతున్నారు. అందులో మాధవుడి గోల మరీ అన్యాయంగా ఉంది.

**పెద్ది:** తమ అక్క వెల్లాయమ్మగారి కుమారుడు కదూ. మంచివాడు, సంబంధం కలుపుకున్నట్లౌతుంది.

**రంగ:** నిజమే. కాని వాడంటే మా చంద్రవదనకి గిట్టదు.

**పెద్ది:** అయితే మరి అన్నివిధాలా మనకు సరిసాటైనవాడి కింకోడికిచ్చి వివాహం చేయించండి.

**రంగ:** ఒకరికిస్తే మరొకరికి కోపం. అందుకనే కురూపిగా పుట్టినా బాగుండేదన్నాను. ఇది సౌందర్యదోషం.

**పెద్ది:** అపూర్వ సౌందర్యం కల దమయంతి మొదలైన కూతుర్లను కన్న తండ్రులందరూ ఈ సమస్య ఎదుర్కొన్నారు. మీరూ వారివలెనే స్వయంవరం ఏర్పాటు చేయించండి. 'వరపరీక్ష'లో నెగ్గిన వాడికి కన్యనిచ్చి కల్యాణం చెయ్యండి.

**రంగ:** తమ సలహాకెంతో కృతజ్ఞుణ్ణి. అలా చేస్తేగాని నేను కోపతాపాల్లోనుంచి బయట పడేటట్లు లేదు.

**(లోపలనుంచి మామయ్యా మామయ్యా అని వినిపిస్తుంది)**

**రంగ:** అదుగో మాధవుడు యేదో కొంప ముంచుకొని పోయే పనిపెట్టుకొని వస్తున్నాడు. మరి సెలవా...?

**పెద్ది:** సెలవు. తమకు తీరుబడి ఉన్నప్పుడు పునర్దర్శనం చేస్తాను.

**రంగ:** మాధవా, యేమిటా హడావుడి?

**మాధవ:** హడావుడి యేమిటి? కొంప మునిగిపోతుంటే. ఇది మనకెంత అప్రతిష్ఠ. తరువాత నీవు చంద్రవదనను నన్ను పెళ్ళి చేసుకోమన్నా నేను అంగీకరించను. నేను కనిపెడుతూనే ఉన్నా.

**రంగ:** అసలు సంగతేమిటి?

**మాధవ:** మొన్న కల్యాణోత్సవాలనాటినుంచీ ఒకటే వెర్రివేషాలు. ఎవరూ తన్ను గమనించ లేదనుకుంది కామోసు. ఇంద్రుడిలా వేయి కళ్ళతో కనిపెడుతూనే ఉన్నా.

**రంగ:** ఎవర్నిరా...?

**మాధవ:** ఎవరేమిటి...? మన ముద్దుల కుమార్తెను.. చంద్రవదనను.

**రంగ:** ఏం చేసింది...?

**మాధవ:** ఎవరో దేశంలోకి క్రొత్తగా వచ్చిన ఒక రాజకుమారుణ్ణి చూసి వెర్రి వెర్రి వేషాలు వేసింది.

**రంగ:** పాపం. నిన్ను పలకరించనైనా లేదు కామాలి. అదా నీ కోపం... అంతేనా?

**మాధవ:** ఎప్పుడూ నీకు నేనంటే వేళాకోళమే మామయ్యా! నిజం చెపుతున్నాను. ఇవాళ రాత్రంతా అతగాడు మన ఉపవనంలో వున్న సౌధంలోని చంద్రవదనతో విహరించటానికి యేర్పాటు...

**రంగ:** (కోపంతో) ఛీ. అబద్ధాలాడకు. నేను నమ్మను.

**మాధవ:** నామీద ఒట్టు మామయ్యా. ఉదయం ఊరుబయట ఉద్యానవనంలో వున్న అతని దగ్గరికి వచ్చి మాలతి మాట్లాడి వెళ్ళుతుంటే చాటుగా వుండి నేను విన్నాను.

**రంగ:** ఇది అబద్ధమైతే...

**మాధవ:** నీవు నాకు చంద్రవదన నిచ్చి పెళ్ళి చేయవద్దు.

## నాల్గవ రంగము

**(ఉరుములు... పిడుగులు... వర్షధ్వని వినిపిస్తుంది)**

**చంద్ర:** తల్లీ! పరమేశ్వరీ! నామీద నీకు దయలేదా? మహేశ్వరుని కోసం నీవు పడ్డ మహార్తిని మరిచిపోయావా? నన్ను కనికరించు. మా మధు సమాగమానికి తోడ్పడు. నీకివే నా జోహారు. మాలతీ... మాలతీ...

**మాలతి:** అరుగోనమ్మా! వచ్చారు

**చంద్ర:** (ఉద్వేగంతో) వచ్చారా??

**మాలతి:** వెర్రిదానా. నీకోసం వస్తారుటమ్మా! నీ హృదయం ఎలా తహతహ పడ్డదో, నీబోటి త్రిలోకసుందరితో పరిచయం చేసుకోను ఆయన హృదయం మాత్రం అలా ఆరాటపడదూ..? వెంట స్నేహితుడు సూర్యనాయుడుగారు కూడా వున్నారు. వారితో నేను వినోద కథలు చెప్పి, కాలక్షేపం చేస్తాను. రాజకుమారులవారిని లోపలికి పంపిస్తాను.

**చంద్ర:** చతురురాలవు. అన్నీ నీ ఇష్టం వచ్చినట్లు నడిపించు. నాన్నగారు ఇంకా గ్రామంలోకి రాలేదుగా...?

**మాలతి:** రానట్లే తెలిసింది. మరి సెలవు.

**చంద్ర:** మీకు శ్రమ ఇచ్చాను. క్షమించాలి. కష్టం లేకుండా త్రోవను కనుక్కోగలిగారను కుంటాను.

**మోహి:** ప్రతిక్షణము మిత్రుడు నన్ను వారిస్తూనే ఉన్నాడు. అన్నీ అపశకునాలని. ప్రియా! చంద్రా!! నీ సమాగమ భావనావేశం నన్ను లాక్కోవచ్చింది.

**చంద్ర:** ఈ ఉరుములు పిడుగులు అపశకునాలుగా భావిస్తున్నారు. లేదు. ఇవి శుభశకునాలు. లేకపోతే మనమిక్కడ ఇంత స్వేచ్ఛగా సంభాషించ డానికి అవకాశం ఉండేదికాదు. నేను పరమేశ్వరిని ప్రార్థించాను. ఆమె మన పునస్సమాగమానికి యీ ప్రకృతి నేపథ్యాన్ని కల్పించింది.

**మోహి:** కల్యాణమండపంలో ఆనాడు ముందుగా వెళ్ళిపోయినానని కోపం వచ్చిందా...? మిత్రుడు భయపడి నన్ను వెళ్ళిపోదామని బలవంతపెట్టాడు.

**చంద్ర:** సిగ్గు విడిచి ఇలా పిలిపించుకున్నాని మీ మనస్సులో ఏమైనా నన్ను గురించి న్యూనతగా భావించడం లేదుగదా?

**మోహి:** లేదు. నీ సాహసానికి హృదయంలో ఎంతో మెచ్చుకున్నాను. మాలతి రాకకు క్రితంనాడు నీ రూపాన్ని దూరంనుంచి చూచి కన్నులరమోడ్చి నీ సౌందర్యమూర్తిని ఆరాధించాను.

**చంద్ర:** ప్రథమ వీక్షణం నాడే నాకు మీమీద ప్రణయం జనియించింది. మీ మనోహరమూర్తినే మనస్సులో నిల్పుకొని పూజిస్తున్నాను.

**మోహి:** చంద్రా! ఇలా దగ్గరికి రా. యేమిటా సిగ్గు? ఇంత సాహసించింది ఇందుకేనా...?

**చంద్ర:** నన్ను మీరు మనసారా ప్రేమిస్తున్నారా?

**మోహి:** నా బ్రతుకెంత సత్యమో నీమీద ప్రేమ అంత సత్యం. అయితే మరొక విషయంలో నేను నిన్ను ఈ రాజవేషంతో మోసగించాను.,

**చంద్ర:** మీరు రాజకుమారులు కాకపోయినా నాకు ఇష్టమే.

**మోహి:** నేను రాజవంశంలోనే జన్మించాను. కానీ నా జన్మదేశం పర్షియా. ఈ పవిత్ర భారతం మాత్రం కాదు. రత్న వర్తకుడిగా యిక్కడికి వచ్చి నీవనే యీ రత్నాన్ని

హృదయమిచ్చి కొనుక్కున్నాను చంద్రా! అన్యమతస్థుడనీ, విదేశీయుడనీ తెలిసి కూడా ఈ మోహియార్‌ను ప్రేమిస్తున్నావా?

**చంద్ర:** మోహియార్! నా ప్రేమ నిష్కళంకమైనది. మిమ్మల్ని ప్రేమించిన తరువాత మీ దేశాన్ని గురించి తెలుసుకున్నాను గాని మీ దేశాన్ని గురించి తెలుసుకున్న తరువాత మిమ్మల్ని ప్రేమించలేదు. నా ప్రేమ అచంచలమైంది. మానవ నిర్మితాలైన అవధులు కొన్ని అడ్డుపెట్టలేవు.

**మోహి:** చంద్రా!

**చంద్ర:** మోహియార్!

**మోహి: ఏదీ ఒక్కమారు ఈ కౌగిలిలో ఒదిగిపో**

(లోపలనుంచి మాలతి గొంతు)

**మరల మరల నోహో ఈ**
**మధువసంత మరుదెంచునె**
**యోవ్వన సుఖ మనుభవింప**
**కేల జేలయ్యెదరు... మరల మరల నోహో...**

**సూర్య: పూలతావి తరగినదా**
**పూలబ్రతుకె అణిగినదా**
**నాకమైన యీ లోకమె**
**నరకముగా మారునొహో... మరల.... మరల...**

**మోహి:** మరి నేను వెళ్ళిరానా...? మిత్రుడు బయట వేచి ఉంటాడు.

(తలుపు చప్పుడు... చంద్రా...! చంద్రా)

**రంగనాయుడు:** ఛీ! కులట! ఏమిటిది..? నిష్కళంకమైన మన వంశానికి యిది యెంతటి అపకీర్తి! ఇన్నాళ్ళమట్టీ నంగనాచివని నమ్మి మోసపోయినాను.

**చంద్ర:** కోపగించకండి నాన్నా. నా పవిత్ర హృదయాన్ని యీతనికి అర్పించుకున్నాను. యితడే నా భర్త.

**రంగ:** (చేదుగా) అర్పించుకున్నావు. అర్పించుకోవు. అంతా నీ యిష్టమే. ఈ ప్రేమబంధాన్ని త్రెంచేసుకో. నన్ను అపకీర్తి పాలు చేయకు.

**చంద్ర:** నేను మోహియార్‌ను తప్ప మరొకణ్ణి ప్రేమించలేను.

**రంగ:** (వెగటుగా) లేవు. చూస్తానుగా ఎలా ప్రేమించలేవో? వరపరీక్ష యేర్పాటు చేశాను. అందులో నెగ్గినవాణ్ణి వివాహమాడటానికి సిద్ధపడు.

**చంద్ర:** నా వివాహం ఇదివరకే అయిపోయింది. నాన్నా నన్ను కనికరించండి. మీరు దయామూర్తులు. నాన్నా! మాట్లాడరేం.

**రంగ:** చంద్రా! నీ కన్నీళ్ళతో నన్ను లొంగదీయవద్దు. వరపరీక్ష తప్పక జరిగి తీరవలసిందే. యువక రాజలోకానికి వాగ్దానం చేశాను. లేకపోతే నాకెంత అప్రతిష్ఠ. తల ఎత్తుకొని తిరగలేను.

**చంద్ర:** వెళ్ళిపోతున్నారా నాన్నా! నన్ను కనికరించలేరా...?

**మోహి:** చంద్రా.... దుఃఖించకు. నీ కన్నీరు చూడలేను. ఆ వరపరీక్షలో నేనూ పాల్గొంటాను. మన అదృష్టాన్ని పరీక్షించుకుందాం.

**చంద్ర:** మోహియార్ నీ వీరగుణం నన్ను ముగ్ధురాలిని చేస్తున్నది. పరమేశ్వరిని నా పతికి విజయం చేకూర్చమని ప్రార్థిస్తాను.

**మోహి:** పరీక్షా సమయంలో స్మృతి చిహ్నంగా నాకేదైనా...

**చంద్ర:** ఇదిగో... ఈ అంగుళీయకాన్ని కరాగ్రాన ధరించు.

**మోహి:** నీ సుందర హస్తంతోటే దాన్ని అలంకరించు.

**చంద్ర:** మోహియార్.

**మోహి:** (ప్రేమపూర్వకంగా) చంద్రా!

## ఐదవ రంగం

**(దూరం నుంచి మల్లయుద్ధ దోహదంగా ఢక్కా నినాదాలు వినిపిస్తవి)**

**పెద్దియజ్వ:** నాయుడుగారూ! తాము వరపరీక్షలో అతి కఠినమైన నిబంధనలు ఏర్పాటు చేయించారు. ఎంతెంత ప్రజ్ఞ కలవాళ్ళూ ఎందులోనో ఒకదానిలో ఓడిపోతున్నారు.

**రంగ:** లేకపోతే, మా కుమార్తెను వివాహమాడడమంటే అంత చులకనంటారా. అదీకాక ఎంత కష్టపడి భార్యను సంపాదించుకుంటే తరువాత ఆమె మీద అంత అనురాగాన్ని ప్రకటిస్తాడు.

**పెద్దియజ్వ:** గొప్పగా సెలవిచ్చారు. నిన్నా, మొన్నా ప్రదర్శనాలల్లో ఓడిపోయినవాళ్ళు కూడా చాలా ప్రజ్ఞావంతులు.

**(దూరం నుంచీ హర్షధ్వనులు, హాహాకారాలు)**

**రంగ:** ఈ ఉదయం నుంచి మల్లయుద్ధం అతి తీవ్రంగా సాగుతున్నట్లుంది.

**పెద్దియజ్వ:** ఇక మిగిలిపోయినవారు ఇద్దరే. హోరాహోరీగా పోరాడుతున్నారు. వీళ్ళ పోరాటం భీమ బకాసురుల యుద్ధాన్ని తలపిస్తూ ఉంది.

**రంగ:** ఈ ఇద్దరిలో ఒకడు మా మాధవనాయుడు.

**పెద్దియజ్వ:** రెండవవాడు ఎవరో ఒక అజ్ఞాత యువకుడటగా! మూడు దినాలనుంచీ ప్రదర్శనల్లో పాల్గొంటున్నాడని వింటున్నాము. మరి అతడు ఏ కులంవాడో?

**రంగ:** ఏ కులంవాడైతేనేం..? నా కుమార్తె వివాహ సమయంలో కేవలం క్షాత్రగుణాన్నే ప్రధానంగా పెట్టుకున్నాను.

**పెద్ది:** తామే అలా సెలవిస్తే ఇక దేశంలో వర్ణాశ్రమాచారాల గతేమిటి..?

**రంగ:** కాలం మారిపోతున్నది. ఇక వర్ణాలు, గుణ ప్రధానాలుగా ఉండాలి గాని, జాతి ప్రధానాలుగా ఉండడం క్షేమకరం కాదు.

**రంగ:** ఆ 'మాధవనాయునికి జై' – హర్షధ్వనులు

**చంద్ర:** మాలతీ! మోహియార్‌కు గట్టిదెబ్బ తగిలినట్లుంది.

**మాలతి:** లేదమ్మా! అలా నటించడం కూడా మల్లయుద్ధంలో ఒక ఎత్తు. అదిగో చూడు తిప్పుకొని ఎంత వేగంతో మళ్ళా మాధవనాయనిమీద పడుతున్నాడో...

**చంద్ర:** పరమేశ్వరి కృప యెలా వుందో. మోహియార్ విజయం పొందితే నాన్నగారు నన్ను అతనికే ఇచ్చి వివాహం చెయ్యటానికి అంగీకరించారు.

**మాలతి:** ఆఁ... అయ్యో, అన్యాయం. కొట్టరానిచోట దెబ్బ కొట్టాడు మాధవనాయుడుగారు.

**చంద్ర:** దుష్టుడు. వట్టి ఈర్ష్యాపరుడు.

**మాలతి:** మోసం! అన్యాయం!! మళ్ళా త్రిప్పుకుంటుంటే మరోదెబ్బ!! ప్రభూ! ఇది అన్యాయం, అక్రమం... అమ్మాయిగారూ గమనిస్తున్నారా! మోహియార్‌గారు మెలికలు తిరిగిపోతూ నోటరక్తం క్రక్కుతూ...

**చంద్ర:** రక్తమా! ఎంత అపశ్రుతి! అయ్యో నేలమీద పడిపోతున్నాడు. ఎంత ఘోరం, ఎంత అన్యాయం, నాన్నా... నాన్నా...

**మాలతి:** అయ్యో, అయ్యో... మళ్ళీ మర్మమైన ఆయువుపట్టులో మరొక దెబ్బ కొట్టాడు.

**చంద్ర:** నాన్నా! నాన్నా!

**రంగ:** చంద్రా!

**మాలతి:** ప్రభూ! అన్యాయం మోహియార్ మరణిస్తున్నాడు.

**('అబ్బా బాధ' మూలుగు... హాహాకారాలు)**

**రంగ:** చంద్రా! ఈ వెర్రిచూపులేమిటి తల్లీ! అయ్యో! రక్తస్రావము. ఆత్మహత్య చేసుకున్నావా...?

**మాలతి:** అమ్మో చంద్రవదన... నీ భర్త తెప్పరిల్లి మళ్ళీ శత్రువు మీద పోరాడుతున్నాడు.

**చంద్ర:** లేదు. మోహియార్ నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోవద్దు. నేనూ నీతో వస్తున్నా.

**రంగ:** చంద్రా! నేను నీ తండ్రిని కాను నీ పాలిటి యముణ్ణి. అకారణంగా ఈ వరపరీక్ష కల్పించి నీ భర్తను హతమార్చాను. నన్ను క్షమించు.

**చంద్ర:** నాన్నా! మా పవిత్రప్రేమ లోకానికి అర్థం కాలేదు. కాకపోవడం తప్పులేదు. లోకానికి ప్రేమలేదు. వర్ణమున్నది. ఆచారాలున్నవి. అంతే లోకాన్ని అనుసరించి మోహియార్‌ను వివాహమాడిన నేను అన్యమతస్థురాలిని. నా భర్తతో సహగమనం చేశాను. మా ఇద్దరికి కలిసి ఒక గోరీ కట్టించండి. ఇదే నా తుది కోర్కె. అబ్బా... బాధ... నాన్నా! మాలతీ...

**రంగ:** పట్టరాని దుఃఖంతో చంద్రా! తల్లీ! నన్ను ఒంటరివాణ్ణి చేసి యీ లోకంలో నుంచి వెళ్ళిపోతున్నావా? క్రూరుణ్ణి... చేతులార నిన్ను చంపుకున్నాను., మరణశయ్య మీద వున్న నీ తల్లికి నిన్ను సర్వవిధాలా సంతోష పెడతానని వాగ్దానం చేశాను. లోకానికి వెరిచాను. పోనీ దేశంలో నుంచి మీ ఇద్దరినీ పంపించివేస్తే ఏ అరణ్యాలలోనైనా సుఖించేవారు.

**పెద్దియజ్వ:** ధైర్యం కోలుపోకండి. చింతించి ప్రయోజనమేముంది? ఇది మన సాంఘికాచారాల దుష్ఫలితం. ఇంతటి అపూర్వ ప్రేమ మును కన్నదీ కాదు– విన్నదీ కాదు. అమ్మాయిని, ఆ మోహియార్ శవం దగ్గరికి చేర్చి, నృసింహస్వామి ఆలయం ముందు గోరీ కట్టించి ఏటా ఉత్సవాలు చేయించి ఋణం తీర్చుకుందాం.

(ఆలిండియా రేడియో)

***ఎ.ఐ.ఆర్. విజయవాడ 15-7-1953***

# రాజ్య రక్ష

**(దూరం నుంచి ఆలయ ఘంటికలూ, కలకలమూ, మొదటి అంకము హాహాకారాలు కలగలుపుగా వినిపిస్తయ్.)**

**మహేదాబీ:** మేఘ్‌సింగ్ మన పుణ్యభూమిలో ఇంకా ఈ ఘోరకృత్యాలు ఎన్నాళ్ళో... ఆక్రందన ధ్వనులు వినలేకపోతున్నాను.

**మేఘసింగ్:** మహేదాబీ మీ వలెనే నేనూ బాధపడుతున్నాను. ప్రస్తుత స్థితి చూస్తే పరమేశ్వరుడు తప్ప మరెవ్వరూ శాంతి చేకూర్చేటట్టు లేదు.

**మహే:** ఎన్ని దేశాలల్లో మంత్రుల హత్య జరగలేదు. ఈ విడ్డూరం మన ముఖాల్నే ప్రొద్దు పొడిచిందా?

**మేఘ:** అతగాడు బ్రతికినన్నాళ్ళు మంత్రి రావల్ మహాక్రూరుడనుకున్నాము. దేశం మీద ప్రజలమీద అతనికి ఆదరాభిమానాలు లేవనుకున్నాం. దేశంలో అతనియెడ యెంతటి గాఢభక్తి, శ్రద్ధా ఉన్నవో ఇప్పుడర్థమౌతున్నది.

**మహే:** కుట్రదారులమీద ఎక్కడ చూచినా తిరుగుబాట్లేటగా. అణచటానికి వాళ్ళకు తలకు మించిపోతున్నదట.

**మేఘ:** నిజం. కుట్రదారులు మహారాజులను కారాగారంలో పెట్టకుండా ఉంటే ఎంతో బాగుండేది. ఏదో తప్పు జరిగిపోయిందని క్షమాపణ వేడుకుంటే ఆ సాధుమూర్తి కనికరించేవాడు. దేశానికి ఈ ఉపద్రవం ఉండేది కాదు.

**మహే:** మహారాజులకూ కుట్రదారులకూ సంధి జరిగి ఆయన్ను మళ్ళా సింహాసనం ఎక్కిస్తే తప్ప దేశానికి విముక్తి లభించేటట్టు లేదు. అందుకు కుట్రదారులంగీకరిస్తారా?

**మేఘ:** ఆప్తమిత్రుడైన మంత్రి రావల్‌ను హత్య చేసిన వాళ్ళతో సంధికి మహారాజు కూడా అంగీకరిస్తాడా అని నా అనుమానం.

**మహే:** కుట్రదారులమీద మహారాజుగారికి కోపం ఉండవచ్చు. కానీ రాజ్యరక్షకోసం శాంతి భద్రతల కోసం ప్రియమైన తన ప్రజాక్షేమం కోసం వారు సంధికంగీకరిస్తారని నా నమ్మకం.

**మేఘసింగ్ :** మహెదాబీ! మహారాజు ఉత్తమోత్తముడిలా ప్రవర్తించాడు. అనూప్‌సింగ్ మంత్రిత్వాన్ని మహానందంతో అలంకరించారు. ఆప్తమిత్రుడైన రావల్‌ను హత్య చేశాడన్న క్రోధం అణుమాత్రం కనుపించదు.

**మహెదా:** అయితే వారికి తిరిగి రాజ్యం చేయటం యిష్టమేనన్నారు.

**మేఘ:** దేశానికి మన ప్రాణాలు బలిగా ఇవ్వడానికైనా ఇష్టమేనన్నారు.

**మహే:** అందువల్లనే నేను వారి పాలన వల్ల తప్ప, రాజ్యరక్ష లభించదని వెనక నిశ్చయించి...

**మేఘ:** మహారాజు రాయ్‌సింగ్‌కు రాజ్యమిప్పించుటకు, తాము తపోవనాలకు వెళ్ళిపోవాలనే అభిప్రాయాన్ని కూడా ప్రకటించారు.

**మహెదా:** బాగానే ఉంది. కానీ, రాయ్‌సింగు చిన్ననాటినుంచీ దుస్సాంగత్యాలల్లో పెరిగాడు. మనము క్షమించినా ప్రజ అతన్ని అంగీకరించరు.

**మేఘ:** అయితే అనూప్‌సింగు అతనికి మంత్రిత్వం వహించడానికి ఇష్టపడవచ్చు.

**మహే:** అలా జరగటానికి వీల్లేదు. మహారాజు రాజ్యాన్ని పాలింప వలసిందే.

**మేఘ:** (రహస్యంగా) మహెదాబీ! మీ భర్త అనూప్‌సింగు గారికి యువరాజును సింహాసనమెక్కించి, స్వల్పకాలంలో అసమర్థుడనిపించి తామే రాజ్య పాలన స్వీకరించాలని ఉద్దేశమున్నట్లు గోచరిస్తుంది.

**మహే:** ఇది మహాద్రోహం. తీరని కళంకం. ఏ రాజవంశాన్ని తరతరాలు సేవించామో – ఆ వంశాన్ని చేతులారా నిర్మూలించడం ఘోరమైన ద్రోహం.

**మేఘ:** ఎన్నోవిధాల అనూప్‌సింగుగారితో చెప్పిచూచాను. ప్రయోజనం లేకపోయింది. మా ఇరువురి మైత్రి కూడా ఇందువల్ల భగ్నమౌతుందని బెదిరించాను. అతడు నన్ను శత్రువుగా భావించాడు కూడాను.

**మహే:** నిజమే! మేఘసింగ్. ఆయనకు మీరు శత్రువు. ఆయన దేశానికంతటికీ శత్రువు. ఈ క్షణం నుండీ నేను కూడా ఆయనకు శత్రువునే. ఇది నిశ్చయం.

**మేఘ:** మహెదాబీ! మీరు త్వరపడుతున్నారు.

**మహే:** మావారిలో రాజ్యకాంక్షను నేను పూర్వమే పసిగట్టాను. (ఉద్వేగంలో) నేనిటువంటి రాజద్రోహికి, దేశద్రోహికి భార్యనని. ఇక క్షణకాలం అనిపించుకోలేను.

**మేఘు:** అనూప్‌సింగు గారికి అటువంటి కోర్కె కలిగితే అడ్డుపడగలవారు కన్పించడం లేదు.

**మహే:** సత్యం, ధర్మం తమ్ము తామే రక్షించుకోగలవు. అయినా, నా ప్రయత్నంతో అర్జునసింగు సంపూర్ణంగా సహకరిస్తాడని నా నమ్మకం.

**మేఘు:** అతడు యోధానయోధుడు. సైన్యాలకు కూడా అతనంటే అమితాభిమానం. ప్రభుపక్షం వహించిన సైన్యాలను అవసరమైతే అతడు నడిపిస్తాడు.

**మహే:** అతడు మహారాజుగారి అనురాగాన్ని చూరగొన్నవాడు కూడా ననుకుంటాను.

**మేఘు:** అన్నగారికి వ్యతిరేకంగా అతడు మహారాజుగారిని కారాగారం నుంచి విముక్తుణ్ణి చేయడానికి అంగీకరిస్తాడా అనేదే అనుమానం.

**మహె:** ఆ భారాన్ని నామీద వదిలిపెట్టండి. అతణ్ణి ధర్మంవైపు నడిపించగలనని నా నమ్మకం. బురావర్ వీరుడు. వీరిద్దరూ తోడైతే మీ సహాయంతో ఎంతటి వీరులనైనా జయించగలరని నా నమ్మకం.

**మేఘు:** ధర్మాన్ని నమ్మినవాళ్ళను ధర్మమే రక్షిస్తుందన్న విశ్వాసం నాకు గాఢంగా ఉంది. అడుగో బురావర్ ఎక్కడికో వెళ్ళడానికి సిద్ధపడుతున్నట్లు కనిపిస్తున్నది.

**మహే:** మీరు ప్రభుభక్తి గలవాళ్ళందరినీ చేకూర్చి, సైనిక శిక్షణను ఇవ్వండి, త్వరపడండి.

**మేఘు:** మహెదాబీ! మీ అచంచలస్వామి భక్తి పరాయణత్వాన్ని ఎలా ప్రశంసించాలో నాకర్థం కావడం లేదు.

**మహే:** ఇది నా ధర్మం. దీనిని నమ్మి మీరు ప్రశంసించవలసినదేమీ లేదు.

**మేఘు:** మరి సెలవా...

**మహే:** జాగరూకతతో వ్యవహరించండి. ఏకలింగజీ! ప్రభూ... నా ప్రయత్నాల నన్నిటినీ సఫలీకృతాలు చేయి తండ్రీ. అతి పవిత్రమైన మా వంశానికి కళంకం ఆపాదించకు. ఎవరది...? – బురావర్... నామీదేమైనా కోపం వచ్చిందా...? ఎక్కడికో చెప్పకుండా వెళ్ళిపోతున్నావు?

**బురావర్:** తండ్రిగారి ఆజ్ఞను శిరసావహించి ఒకానొక రాచకార్యం మీద అప్రమత్తుడనై వ్యవహరించడానికి వెళ్ళుతున్నానమ్మా.

**మహే:** ఆ రాచకార్యమేమిటో నాకు చెప్పవచ్చునా...?

**బురా:** కొందరు దేశద్రోహులు ముబ్రాజ్‌ను చెర విడిపించి సింహాసన మెక్కించడానికి శతవిధ ప్రయత్నాలు చేస్తున్నారట. నన్ను కారాగారాన్ని అతి జాగరూకతతో సంరక్షించమని నాన్నగారు ఆజ్ఞాపించారు.

**మహే:** అయితే, మహారాజును చెరవిడిపించటం సదుద్దేశమే కదా...?

**బురా:** వారిని గురించీ, మంత్రి రావల్‌ని గురించి నా వెనుకటి అభిప్రాయాలన్నీ మారిపోయినవి. రాజ్యం వీరభోగ్యం.

**మహే:** నిరంతరం వీరులు రాజ్యంకోసం పోరాడుతూ ఉంటుంటే రాజ్యానికి రక్ష యెక్కడ ఉంటుంది? ప్రజలకు శాంతి ఎక్కడ చేకూరుతుంది??

**బురా:** అమ్మా! నాన్నగారు జగదేకవీరులు. నేను వారి కుమారుణ్ణి. అప్రతిహత వీరుణ్ణై రాజ్యసంపాదన విషయంలో వారికి అన్నివిధాలా తోడ్పుడు తానని వారికి వాగ్దానం చేశాను.

**మహే:** జగదేకవీరులు!... వాగ్దానం. నాయనా బురావర్! మీ తండ్రి కుమాళ్ళు ఇద్దరూ అనుసరించదలకున్నది అధర్మ మార్గం. మీరు ద్రోహులు.

**బురా:** ద్రోహులమా...?

**మహే:** ముమ్మాటికీ. ఇది వీరమా మరి కుటిల కుతంత్రాలతో క్రూరకర్మలతో దేశంలో రక్తపు నదులు పారించటం ద్రోహంకాక మరేమిటి? హృదయం చీల్చిచూడు. బంధుత్వాలను దూరంగానెట్టి ఆలోచించు. అపకీర్తి పాలు కాబోకు. ఈ రాజ్యం, ఈ భోగం – రెండూ శాశ్వతాలు కావు.

**బురా:** అమ్మా! నన్ను క్షమించు. తండ్రిగారితో మాట్లాడిన తరువాత తాత్కాలికంగా మనస్సు మారింది. నిజమమ్మా! దేశానికి ప్రభువు మహరాజు ముబ్రాజ్. మనం ఆయన సేవకులం.

**మహే:** ఇవి హృదయస్ఫూర్తిగా పలికే మాటలేనా..? అయితే ఇదిగో ఈ కరవాలం అందుకో. మహారాజును చెరవిడిపిస్తానని వాగ్దానం చెయ్యి.

**బురా:** మీ ఆజ్ఞ శిరసావహిస్తాను. మహారాజును చెరవిడిపిస్తాను.

**మహే:** (పట్టరాని సంతోషంతో) బురావర్! ఏదీ ఇలారా... నాయనా

**బురా:** మంత్రి రావల్‌కూ, అతని కుటుంబానికీ జరిగిన అన్యాయానికి తగ్గ ప్రతీకారాన్ని చెయ్యమని నా మనస్సు ప్రబోధిస్తున్నది.

**మహే:** ఈ ప్రబోధానికి అర్థమేమిటో గమనించావా? ఈ ఇంట్లో ఈ దేశంలో ఇక నీకు స్థానం లేదన్నమాట.

**బురా:** నాకేం భయంలేదు. అవసరమైతే దేశభ్రష్టుణ్ణి కావటానికి వెనుదీయను. నీ దీవెన ఉంటే చాలు.

**మహే:** సెబాస్ బురావర్ ఏదీ ఇలారా... ఒక్కమాటు నన్ను కౌగిలించుకో... ఇంతటి సత్య ప్రియత్వమున్న ధర్మవీరుడవని ముందెన్నడూ నాకు తోచలేదు, తండ్రీ... ఆలయ ఘంటానాదం అవిగో... ఏకలింగజీ ఆలయ ఘంటికలు వినిపిస్తున్నవి. మనస్ఫూర్తిగా నిన్ను దీవిస్తున్నాను. విజయోస్తు.

***

**(పారా హుషార్ పారాహుషార్ అన్న కేకలు నింపాదిగా వినిపిస్తుంటవి)**

**ముల్రాజ్:** రాయ్‌సింగ్ ఏకలింగజీ ఇంకా నన్నెన్నేళ్ళు ఇలా బ్రతకమని ఆజ్ఞాపించాడో నిద్రాహారాలు లేవు. ఈ కారాగారానికి నామీద దయ కలిగేటట్లు లేదు.

**రాయ్‌సింగ్:** ద్రోహిని. ఈ మీ ఆపదలన్నిటికీ కారణం నేను. మంత్రి రావల్‌ను హత్య చేస్తే నాకేదో ఒలికి పోతుందనుకున్నాను.

**ముల్రా:** ఆనాడు నీవు అనూప్‌సింగుతో కలిసి రావల్‌ను హత్య చేసినప్పుడు నన్ను కూడా పూర్తిచేస్తే ఎంతో బాగుండేది. నాకూ నీకూ ఇద్దరికీ ఈ కష్టాలు తప్పేవి.

**రాయ:** మీ శిరోవేదన ఎలా ఉంది?

**ముల్రా:** నా ప్రాణాలతోగాని అదీ పొయ్యేటట్టు లేదు. నాన్నా నన్ను కనికరించి ఒక్క గుక్కెడు విషం తెప్పించలేవూ?

**రాయ:** విషమా? ఆ మాట మళ్లీ ప్రస్తావిస్తే నన్ను చంపుకున్నట్లు పరమేశ్వరానుగ్రహం వల్ల మనకు మళ్ళీ మంచిరోజులు వస్తాయి.

***

**మేఘు:** అదుగో ఆ వీరుడు క్రమంగా దారి చేసుకుని, కారాగారంలో ప్రవేశించాడు. బహుశః మహారాజును, యవరాజును చెర విడిపించవచ్చు. మనం ఇక విడివడిపోదాం.

ఓహో సైనికులారా... మీరు దక్షిణంగా కదలండి. జై మేఘసింగుకు జై. జై ముల్రాజు మహారాజుకు జై– జై రాయసింగు యువరాజుకు జై–

**బురా:** ఓహో సైనికులారా... మీరు ఉత్తరంగా కదలండి.

బురావర్‌కు జై– జై ముల్రాజు మహారాజుకు జై

జయధ్వానాలు వినిపిస్తవి

దూరం నుంచి జై అనూప్‌సింగుకు జై. జై ముల్రాలుకి జై

అని ధ్వానాలు, సైన్యకోలాహలంలా వినిపిస్తుంది.

***

**అనూప్‌సింగ్:** రాయసింగ్.... నీకోసం పాటుపడ్డ నన్ను ఎదుర్కొనటానికి వచ్చావా...?

**రాయ్‌సింగ్:** ద్రోహీ! ఇంకా నన్ను మోసగిద్దామనా...? ఇదుగో ఈ దెబ్బ తప్పుకో...?

**అనూప్:** ఇంతమాత్రంతో ఏమి జరుగలేదు. మీ రాజవంశం ఇంతటితో అంతమైనట్లే.

**రాయ్:** (వికటంగా) నీ ఆశలన్నీ ఈడేరినట్లే! ఇదిగో అందుకో... ఊఁ పారిపో..

**మహేదాబీ:** మహారాజా! త్వరపడండి. ఈ ఖడ్గమును కొని కదనరంగంలో ప్రవేశించండి.

**ముల్రా:** పురుష వేషంలో ఉన్న తామెవరో నేను గుర్తించలేకుండా ఉన్నాను.

**మహే:** నేనెవరినో తాము తరువాత గుర్తించవచ్చు. శత్రువులు ప్రళయభీకరంగా పోరాడుతున్నారు. త్వరపడండి. ఇదిగో మీ కరవాలం.

**ముల్రా:** అచంచల స్వామిభక్తి పరాయణవైన మీకు కృతజ్ఞుణ్ణి. ఇదిగో... క్షణంలో యుద్ధభూమిలో ప్రవేశిస్తున్నాను. ఓహో సైనికులారా...

**(జై ముల్రాజు మహారాజుకు జై అనే ధ్వానాలు వినిపిస్తవి)**

***

**అనూప్:** మేఘసింగ్... నీ మిత్రుణ్ణి మరిచిపోయినావా...

**మేఘ:** మన మైత్రి యుద్ధానంతరం. ఇప్పుడు మనం శత్రువులం. పోరాడు లేదా... పారిపో ఈ దెబ్బ అందుకో...

***

**ముఁ్రా:** నాన్నా రాయ్‌సింగ్ – ఏదీ నన్ను ఒక్కమారు కౌగిలించుకో... అబ్బ ఎంత ఆర్ద్రంగా ఉందోయ్ నీ శరీర స్పర్శ. నాకీ రాజ్యం వద్దు. నిన్ను సింహాసన మెక్కిస్తామంటే ఎంత ఆనందంతోనైనా అంగీకరిస్తాను.

**రాయ్:** నా కుతికలో ప్రాణం ఉండగా అందుకు అంగీకరించను. ఇతఃపూర్వం మీకు నే చేసిన ద్రోహం చాలు. మీరు పాలించవలసిందే. రాజ్యాన్ని రక్షించవలసిందే... అదుగో అతడు వచ్చేస్తున్నాడు. మరి నాకు సెలవు.

**ముఁ్రా:** ఏకలింగజీ! ఏకలింగజీ!...

**మేఘు:** మహారాజా.... నమస్తే...

**ముఁ్రా:** ఎవరు వారు నాయనా – (ఉన్మత్తతను నటిస్తూ) – నన్ను వధ్యశిల దగ్గిరకు నడిపంచుకోవచ్చావా తండ్రీ... ఆలస్యం చెయ్యను. సిద్ధపడతాను.

**మేఘు:** (ఆర్ద్రంగా) ప్రభూ! క్షమించండి మీకీ కష్టాలు తెచ్చి పెట్టటానికి తోడ్పడ్డ ద్రోహిని. మీ పాద పద్మాలను కన్నీటితో పంకిలం చేసి హృదయ వేదనను తీర్చుకోటానికి వచ్చిన స్వార్థపరుణ్ణి క్షమించండి.

**ముఁ్రా:** ఆఁ కష్టాలు. నాకే కష్టం లేదు. మహానందాన్ని అనుభవిస్తున్నాను.

ఈర్ష్య, క్రోధం, ద్వేషం, హింస వీటిలో కుటిలమైన రాచరిక జీవితం తప్పిపోయింది. మహా స్వేచ్ఛను అనుభవిస్తున్నాను. మహానందాన్ని అనుభవిస్తున్నాను.

**మేఘు:** ప్రభూ! మీరు నన్ను కనికరించండి. నాతో నటించకండి. తమ సత్యగుణాన్ని అర్థం చేసుకోలేక స్వార్థపరుడైన అనూప్‌సింగు దుష్కృత్యానికి దోహదమిచ్చాను. మీరు సమస్త భారత సామ్రాజ్యాన్ని ఏలదగ్గ మహా పురుషులు.

**ముఁ్రా:** ఈ పొగడ్త నాకెందుకు? ఇన్నాళ్ళబట్టీ వినివిని నా హృదయం మలినమైంది. అయితే నాయనా క్రొత్త పాలనలో జై సల్మార్ ప్రజ సుఖిస్తున్నారా?

**జై మేఘసింగ్‌కు జై...**

***

**బురా:** పితాజీ ఎక్కడికలా పారిపోతున్నారు. ఇది మన వంశానికి అప్రతిష్ఠ. ఈ ఖడ్గాన్ని అందుకొని పోరాడండి.

**అనూప్:** ఎవరు? ...బురావర్...?

**బురా:** అవును మీ పుత్రుణ్ణి పోరాడండి. వీరస్వర్గాన్ని అలంకరించండి.

**అనూప్:** అయితే ఈ దెబ్బ అందుకో... అబ్బా బాధ. బురావర్ నేను ద్రోహిని... ద్రోహిని... అబ్బా!...

**బురా:** పితాజీ! మీ దురుహలకూ, దుష్కృత్యాలకు ఫలితం ఇది. మన వంశం అప్రతిష్ఠపాలు కాలేదు. అందుకు సంతోషించండి.

**(జై బురావరుకు జై, జై ముల్రాజుకు జై)**

**అనూప్:** (బాధపడుతూ) నాయనా! నీ శత్రుత్వం తీరిందా...? ముల్రాజ్ మహాశయులకు నన్ను క్షమించమని చెప్పు.

**బురా:** నాకు శత్రుత్వమేముంది. అదుగో మహారాజులుగారు.

**అనూప్:** మహారాజా! ఈ దేశద్రోహిని క్షమించండి.

**ముల్రా:** ద్రోహమేముంది నాయనా వీరుడివి. రాజ్యకాంక్ష ఉండడం సహజం.

**అనూప్:** నన్ను క్షమించానని అంటే ఆనందంతో మరణిస్తాను.

**ముల్రా:** నా ప్రాణాలు దక్కించిన మహావీరుడు ఇదుగో ఇతడు. ఆయన అనుజ్ఞయిస్తే అలాగే క్షమిస్తాను.

**మహే:** తప్పక క్షమించండి.

**అనూప్:** అబ్బా బాధ. బురావర్! మహేబా... మహేబా...

**మహే:** ఓ ప్రభూ! మీకు వ్యతిరేకంగా రాజరక్షణకు వ్యవహరించిన ఈ పాపిని మీ మహేబాయే. క్షమించండి. నేనూ మీతో సహగమనానికి సిద్ధపడు తున్నాను.

**ముల్రా:** మహేదాబీ! మీ ఋణం మేము తీర్చుకోలేము. రాయ్‌సింగ్ వారికి ప్రణామం చెయ్యి. బురావర్... ఇక నీవు జైసల్మీర్ సామ్రాజ్య సేనాపతి.

**(జై ముల్రాజుకు, జై మహెబాకు, జై మురావరుకు జై)**

***

**మేఘు:** మీరు అతని మంత్రిత్వానికి అంగీకరిస్తే పొసగుతుందని నా నమ్మకం. మీ ప్రజలకోసం, దేశం కోసం తాము అతని మంత్రిత్వాన్ని అంగీకరించక తీరదు.

**ముఖ్రాజ్:** నా ప్రజలు సుఖిస్తారంటే ఈ ప్రాణాలను కూడా బలివ్వటానికి సంసిద్ధుణ్ణి...

**మేఘసింగ్:** ధన్యుణ్ణి. నాకు సెలవిప్పించండి. సమస్త విధాలా సంధికే యత్నిస్తాను. లేకపోతే గాని దండనీతికి దిగము – మమ్మల్ని ఆశీర్వదించండి.

**ముఖ్రా:** జయోస్తు

**మేఘ:** సెలవు

**ముఖ్రా:** రాయ్‌సింగ్, విన్నావా మా ప్రసంగమంతా?

**రాయ్:** మీ సంభాషణ విన్నంతసేపూ నా స్వప్నం సత్యమౌతుందని ఆనందించాను. మహేదాబీ ధార్మికురాలి అండ వుంటే అన్నీ అనుకూలిస్తవి.

**ముఖ్రా:** అయినా, అనూప్‌సింగ్, అంగీకరిస్తాడని నమ్మను. మన ఇద్దర్నీ విడదీయటానికి యత్నిస్తాడు.

(దూరం నుంచీ మహారాజరాయ్ సింగ్‌కు జై, మహామంత్రి అనూప్‌సింగుకు జై, అన్న నినాదాలు శంఖ కాహళ ధ్వానాలమధ్య వినిపిస్తవి)

**రాయ్:** (చిన్న నవ్వు) నన్ను సింహాసనాన్ని స్వీకరించమని కోరటానికి అనూప్‌సింగు సపరివారంగా వస్తున్నాడు.

**ముఖ్రా:** తప్పక అంగీకరించు నాయనా నాకింతకంటే కావలసినదేముంది? అయితే అతణ్ణి ప్రాణాయనగా నమ్మవద్దు. ఇందులోకూడా ఏదో గొప్ప ఎత్తు ఉంటుందని నా నమ్మకం.

**రాయ్:** మీరు మీ కక్ష్యలోకి వెళ్ళిపొండి. మా ప్రసంగాన్ని వినండి. సెలవు.

**అనూప్‌సింగ్ :** నమస్తే మహారాజా...

**రాయ్:** 'నమస్తే అనూప్' ఏమిటీ వింత సంబోధన?

**అనూప్:** స్వీకరించి ప్రజలను ఏలుకోవాలి.

**రాయ్:** నేను కారాగార బంధితుణ్ణి సింహాసన మెక్కడమేమిటి? దేశం కల్లోలంగా ఉన్న సమయంలో మీకే ప్రమాదం సంభవిస్తుందోనని క్షేమం కోసం బందీని చేశాను. క్షమించండి. రాజ్యభారాన్ని స్వీకరించండి.

**రాయ్:** తండ్రిగారు సజీవులై ఉండగా నేను రాజ్యం చేయుట ఆత్మధర్మ విరుద్ధం.

**అనూప్:** తండ్రులు అసమర్థులైనప్పుడు భక్తివంతులైన కుమాళ్ళు రాజ్యపాలనను హస్తగతం చేసుకొని పాలించడం మన చరిత్రకు క్రొత్తది కాదు. పైగా క్షాత్ర ధర్మం కూడాను.

**రాయ్:** నాన్నగారు సమస్త సద్గుణాలూ కలవారు, ప్రజాభిమానం చేకొన్నవారు. వీరే రాజ్యార్హులు.

**అనూప్:** యువరాజా మీరు చేసేది వ్యర్థప్రయత్నం. ముల్రాజ్ మహారాజుగారికి ఇక రాజ్యం లభించటం కల్ల. రేపు ఉదయం శుభలగ్నం.

**రాయ్:** అనూప్ నీవు అనుసరిస్తున్నది దౌర్జన్య మార్గం. మంత్రి రావల్‌ను నీవు హత్య చేసింది ఇందుకోసమే కదూ?

**అనూప్:** ఈ మాటలతో ప్రయోజనం లేదు. మీరు సింహాసనం స్వీకరించే లోపల ప్రజాద్రోహ నేరం క్రింద ముల్రాజు మహాశయుడికి ఉరిశిక్ష జరగవలసి ఉంది. దానికి కూడా సర్వసన్నాహాలు పూర్తి చేయించాను.

**రాయ్:** (ఉద్వేగంతో) అనూప్ ఇది అన్యాయం అక్రమం దౌర్జన్యం.

**అనూప్:** మీ మాటలతో నాకేమీ ప్రయోజనం లేదు. త్వరగా ఒక నిశ్చయానికి రండి.

***

**బురావర్:** పితాజీ నమస్తే. ఎందుకో పిలిపించారు.

**అనూప్:** నీతో ఒక ఆంతరంగిక విషయం మాట్లాడవలసి రమ్మన్నాను. అలా నడుస్తూ మాట్లాడుదాము. ఈనాడు మన వంశానికీ, మన దేశానికీ, జాతికీ ఒక పరీక్షా సమయం వచ్చింది. రాజ్యరక్ష అతి ప్రమాదస్థితిలో పడిపోయింది.

**బురా:** మీ అభిప్రాయం ఏమిటో నాకు అవగతం కావడం లేదు.

**అనూప్:** నీ తోడ్పాటు ఇకనుంచి నాకు అతిశయంగా కావాలి. దేశభక్తి పరాయణులైన సర్దారుల సహాయంతో దుష్టమంత్రి రావల్‌ను హత్య చేయించాను. అసమర్థుడైన ముల్రాజ్‌ను కారాగారంలో నిల్పాను.

**బురా:** మీ ఉద్దేశాలేమైనా పైకి చెప్పటానికి ధైర్యం చాలకపోయినా లోకంలో ప్రజలు మిమ్మల్ని దేశద్రోహులుగా భావిస్తున్నారు.

**అనూప్:** ప్రజలు ఏమి భావిస్తే నాకెందుకు? ప్రజలు ఏమైనా అనుకుంటారు. వాళ్ళ మేలు వారికే తెలియని వెర్రివాళ్ళు ప్రజలు.

**బురావర్:** ప్రజలంత మూర్ఖులని నేను నమ్మలేను.

**అనూప్:** (పెద్ద పెట్టుగా నవ్వి) అయితే నీవు గూడా నన్ను గురించి ఇదే అభిప్రాయపడుతున్నావన్నమాట...

**బురావర్:** ప్రస్తుతం దేశంలో రాజవంశం మీద కనిపించే అభిమానం, తిరుగుబాట్లు గమనిస్తుంటే ఎవరో కొందరు కుట్రదార్లు మిమ్మల్ని ప్రేరేపించి ఒక దుష్కృత్యం చేయించి మన వంశానికి తీరని కళంకం తెచ్చిపెట్టారని నా నమ్మకం.

**అనూప్:** (హృదయం బాధపడ్డట్లు) బురావర్ నా మిత్రులెవరో కుట్రదార్లు కాదు. నిజం నిలకడ మీద కాని తెలియదు. మేము చేసిన పనివల్ల ప్రజలకెంత లాభం కలిగేదో ముందు తెలుస్తుంది.

**బురా:** ఇది ఒక మహత్తర కావ్యమని నేను మనస్ఫూర్తిగా నమ్మలేకుండా ఉన్నాను.

**అనూప్:** మంత్రి రావల్‌ను హత్య చేయమని నన్నెవరూ ప్రేరేపించలేదు. ఆ బుద్ధి నా మనస్సులోనే పుట్టింది.

**బురా:** అయితే మిమ్మల్ని చూడటానికి నాకేదో తెలియని భయం వేస్తున్నది.

**అనూప్:** (ఆర్ద్రంగా) నాయనా! బురావర్ నా ప్రయత్నాలన్నీ ఎందుకో హృదయం విప్పి ఆలోచించు. మనస్సులో ఎవరో కలిపిన విషాన్ని క్రక్కివేయి.

**బురా:** మీకు హృదయంలో రాజ్యంమీద గుప్తంగా కాంక్ష లేదా?

**అనూప్:** ఇంతవరకూ లేదు. ఉన్నా తప్పుకాదు. రాజ్యం వీరభోగ్యం. నేను వీరుణ్ణి. నా పుత్రుడవైన నీవు వీరుడవు. నీ అంతటిశక్తి ఒక సామాన్య సైనికునిగా ఉంటే నా మనస్సు చూడటానికి ఇష్టపడటం లేదు. నామీద అనుమానం మాను. సిరి తనంతట తాను వస్తుంటే మోకాలడ్డకు. రాయ్‌సింగ్ అసమర్థుడు. అతని పాలన అట్టేకాలం సాగదు. నన్ను రాజ్యపాలనను స్వీకరించమని మన ప్రజ కోరితే వృద్ధుడనని తప్పుకొని నిన్ను సింహాసనాధిష్ఠితుణ్ణి చేస్తాను. లే! ఇదిగో ఈ ఖడ్గం నీది. ఈ సేనలు నీవి. ఈ క్షణం నుంచీ నీవు సేనాధిపతివి.

**బురా:** (నిశ్చలకంఠంతో) తండ్రీ మీ ఆజ్ఞ శిరసా వహిస్తాను.

**(జై అనూప్‌సింగుకు జై, బురావర్‌కు జై నినాదాలు వినిపిస్తవి)**

***ఎ.ఐ.ఆర్. విజయవాడ 3-6-1952***

# ఉడతా భక్తి

**"ఏం చేశాం – మనమేం చేశాం**
**మన క్షేమానికి మన గ్రామానికి – ఏం చేశాం**
**పిన్నలు పెద్దలు – పేదలు ధనికులు**
**ఉడతాభక్తితో ఉత్సాహంతో –ఏం చేశాం"**

**(దూరం నుంచి ప్రచారగీతం వినిపిస్తూ వుంటుంది)**

**సుబ్బారాయుడు:** (కోపకంఠంతో) చెయ్యకేం చేయగలిగిందంతా చేశాం. కరువు కాలంలో నల్లబజారు వ్యాపారం చేసి, నానావిధాల పెట్టెలు నింపుకున్నాం. అడిగినవాడికల్లా అప్పులు పెట్టి, ఆస్తిపాస్తులు కట్టుకున్నాం. డాబాలు పడగొట్టి మేడలు వేశాం. పెళ్ళాల మెళ్ళలోకి పెట్టుకోలేనన్ని నగలు చేయించాం. నాలుగు దిక్కులా డబ్బుగుప్పి, అన్నివిధాలా నాయకులమై కూచున్నాం.

**జగన్నాథం:** సుబ్బారాయుడు కొంచెం శాంతించవయ్యా...

**సుబ్బా:** లేకపోతే ఎందుకొచ్చిన ప్రచారాలయ్యా ఇవి. ఎన్నికల కోసమేనా...? ఆనాడు గాంధీజీ కృష్ణజన్మస్థానానికి రమ్మని పిలిచిననాడు పత్తా చిక్కకుండా దాక్కున్న పెద్దలు కారయ్యా వీరు. అసలు తప్పుమీది. మీ బోటివాళ్ళంతా చేరి వీళ్ళకింత ఆధిక్యం తెచ్చిపెట్టారు.

**జగన్నాథం:** సంగతేమిటో తెలుసుకోకుండా తొందరపడతావేమిటి? ఈ ప్రచారం ఎవరు చేయిస్తున్నారని?

**సుబ్బా:** ఎవరేమిటి? గ్రామనాయకుడు వినాయకుడు – శ్రీమంతు

**జగన్నాథం:** పొరపాటు డాక్టరు కుటుంబరావుగారు. సేవాసమితి అంటూ స్థాపించి దానిద్వారా గ్రామానికి కొంత సేవ సేద్దామని, ఆయన నిశ్చయించుకున్నాడు.

**సుబ్బా:** చెప్పవేం, కొంపదీసి అల్లాగుటయ్యా!

**జగన్నాథం:** ఊళ్ళో పెద్దలందరినీ ఒక్కచోట చేర్చి కార్యక్రమాన్ని గురించి ముచ్చటిద్దామనుకున్నారు.

**సుబ్బా:** ఇదొక ఊరు. ఈ ఊరికో పెద్దలూనా... వీళ్ళంతా కలవటమే... ఒక్కచోటే కలిసేది కాట్లో.... ఆ వచ్చేది డాక్టరుగారు కదూ...

**జగన్నాథం:** అవును. మరి నాకు కొంచెం పనివుంది. వెళ్ళివస్తా.

**సుబ్బా:** (పిలుపుగా) అయ్యా! డాక్టరుగారూ... డాక్టరుగారూ ఒక్కమాటు మా ఇంటికి దయచెయ్యాలి. తమకోసమే రాబోతున్నా.

**కుటుం:** ఏమిటీ విశేషాలు? ఇంట్లో అంతా కుశలంగా ఉన్నారా?

**సుబ్బా:** ఏం ప్రశ్న అడిగారండీ? నే బ్రతికి ఉండగా అటువంటి అపభ్రంశపు పని ఎపుడైనా జరుగుతుందీ? ఇల్లంతా ముట్టడుగా ఉంది. చిన్నవాడికి వేపూ్వ్రత, మధ్య పిల్లకు మసూచి, పెద్దమ్మాయికి ఒళ్ళెరగని జ్వరం, ఇంటిదానికి కంటిమీద కురుపు, నాకు నడుములో నొప్పి – రాత్రంతా భళ్ళున తెల్లవారింది.

**కుటుం:** ఎపుడూ మీ ఇంట్లో ఏదొఒకటి వస్తూనే వుంది. మీరు మీ ఇంటి ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ తీసుకోకపోతే మా మందులు ఎంతని పనిచేస్తయ్... అవిగో ఇంకా ఆ పెంటదిబ్బలు, మురికి కాలవలు అన్నీ ఇంటి చుట్టూ అలాగే వున్నాయ్.

**సుబ్బా:** గ్రామపెద్దలతో చెప్పి చెప్పి నోరు కాయ కాసింది. ఈ నిష్టదరిద్రపు గ్రామం ఒదిలిపెట్టి ఎక్కడికైనావెళ్ళి ముష్టెత్తుకొని బ్రతుకుతా – ఈ మాటుకు గట్టెక్కించండి.

**కుటుం:** ఊరేం చేసింది. మన గుణాలు మంచివైతే... దేనికి ఎవర్ని కదిలించినా మీ పేరు చెబుతున్నారు.

**సుబ్బా:** అవును., చెప్పకేం చేస్తారు. దొరికాను ఊరికెల్లా పాపాలకు భైరవుణ్ణి.

**కుటుం:** మీకు శ్రీమంతుగారికి ఉన్న శత్రుత్వం వల్ల గ్రామం అష్టకష్టాల పాలౌతున్నది. (ఆర్ద్రంగా) గ్రామాన్ని ఎలాగైనా బాగు చేయాలని సంకల్పించండి.

**సుబ్బా:** నేనేం చేస్తాను తాడూ బొంగరం లేనివాణ్ణి. ఊరుకోలేక ఏవో నాలుగంటాను, పది పడతాను – ఆ అంతేగా...

**కుటుం:** గ్రామానికి సేవ చేద్దామనే ఉద్దేశంతో ఉత్సాహవంతులైన కొందరు యువకుల్ని చేరదీసి, సేవాసంఘం స్థాపించాము. ఉడతాభక్తిగ ఎవరికి తోచిన త్యాగం వారిని చెయ్యమని ప్రార్థిస్తున్నాము. మీరూ మాకు మాట ఇవ్వాలి.

**సుబ్బా:** సాలోచనగా ఏమని?

**కుటుం:** మీ ఇరువురి శత్రుత్వాలను వదిలిపోవటమే మీ దగ్గరనుంచి మేమర్థించే త్యాగం. తప్పదు. వాగ్దానం చెయ్యండి.

**సుబ్బా:** (ఆర్ద్రకంఠంతో) గ్రామం బాగుపడుతుందంటే నేను అడ్డు వస్తానా? తప్పకుండా... అతడు అంగీకరిస్తాడని నేననుకోను.

**కుటుం:** ఆ బాధ్యత నాకు వదిలిపెట్టండి. అదుగో ఆ వచ్చేది శ్రీమంతుగారేనా! శ్రీమంతుగారూ... ఒక్కమాట.

**శ్రీమంతు:** అక్కడికి రానులెండి. ఇలా తామే దయచెయ్యండి.

**కుటుం:** అలాకాదు, మీరు ఇక్కడికి వచ్చితీరాలి. చూస్తావేం పిలవ్వయ్యా సుబ్బారాయుడు.

**సుబ్బా:** రా అన్నయ్యా! అరుగుమీద కూర్చొని మాట్లాడుకుందాం.

**కుటుం:** శ్రీమంతుగారూ! ఈనాటినుంచీ మీరిద్దరూ సోదరులు. మనస్సులో మాలిన్యమంతా కడిగేసుకోవాలి. గ్రామక్షేమం కోసం మిమ్మల్ని యాచిస్తున్నాను.

**శ్రీమంతు:** అంతకంటె నాకు కావల్సిందేముంది? నేనెప్పుడూ సంసిద్ధమే.

**సుబ్బా:** నేనూ అంతే. అన్నయ్యా! ఇంట్లో పిల్లలంతా క్షేమంగా వున్నారా?

**శ్రీమంతుడు:** ఆఁ మదరాసు నుంచి రాత్రే వచ్చాను. మీ వదినకు జబ్బు కొంత నెమ్మదించింది. ఆసుపత్రిలో నుంచి ఇంకా ఆరు రోజులకు విడుదల చేస్తారు.

**కుటుం:** ఈనాటినుంచీ మన గ్రామ జీవితంలో ఒక నూతన ఘట్టం ఆరంభమైంది. శ్రీమంతుగారూ.. పెద్దల సహాయంతో పెద్దపని నెత్తికెత్తుకున్నాం. అన్ని రంగాల్లో గ్రామాన్ని ఒక దారికి తీసుకొద్దామని. గ్రామం స్థితిగతులు నానాటికీ తీసికట్టుగా ఉన్నవి. ఆహారానికి, వృత్తికీ, విద్యకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

**శ్రీమంతు:** మీ ఉద్దేశం చాలా మంచిదే. దేశంలో అన్ని గ్రామాల స్థితి ఇలాగే వుంది. చింతపడటం తప్ప ఇందులో మనం చేయగలిగింది ఏమీ లేదు. వీటిని ఉద్ధరించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున పూనుకోవాలి. అపుడేదైనా మోక్షం కలగాలి. ఏమంటావోయ్ సుబ్బారాయుడు.

**సుబ్బా:** నా అభిప్రాయమూ అదే. అయినా డాక్టరుగారు శక్తిసంపన్నులు. ఉత్సాహవంతులు.

**కుటుం:** ప్రతిపనీ ప్రభుత్వం చెయ్యాలనటం సమంజసం కాదు. అదిమటుకు యెన్ని సమస్యలకని? మనమేం చేశామన్న విజ్ఞానం కలిగిస్తే ఆబాలగోపాలం కదిలివస్తుందనీ – అనేక పనులు సాధించవచ్చుననీ నా విశ్వాసం.

**శ్రీమంతు:** కానివ్వండి. కార్యక్రమం ఏమన్నా వేశారా?

**కుటుం:** సేవాసంఘం స్థాపించాం. కాని యాజమాన్యాన సమస్తం నడపించాలని అంటే దానికొక మందిరం కట్టాలి. ఉడతాభక్తిగ గ్రామక్షేమానికి ధనం, ధాన్యం, విద్య, శ్రమ, అన్నీ త్యాగం చెయ్యమని అర్థిద్దాం.

**శ్రీమంతు:** అయితే, నేనే ప్రారంభిస్తాను. ఊరిబయట దక్షిణంగా ఉన్న నా మామిడితోట మందిరానికి నేను త్యాగం చేస్తున్నాను.

**సుబ్బా:** చాలా బాగుంది. అన్నా! అందులో మందిరం నేను కట్టిస్తాను.

**కుటుం:** భేష్! నేను ఉచిత వైద్యశాలకు ఒక భవనం కట్టిస్తాను.

**శ్రీమంతు:** తరువాత వైద్యం కూడా చెయ్యాలి సుమా...

**కుటుం:** మీ అందరి సహాయం వుంటే అలాగే తప్పకుండా... ఇక గ్రామంలో చిన్న, పెద్ద అందరినీ కలుపుకోవాలి. స్త్రీలలో ఉత్సాహవంతులు ఒకరు కొంత ప్రచారం చెయ్యాలి.

**శ్రీమంతు:** మా అమ్మాయి గోవర్ధనమ్మతో మాట్లాడండి. నేను చెబుతాను.

**సుబ్బా:** అయ్యా, డాక్టరుగారూ... అది ఒప్పుకుంటే ఆడవాళ్ళందరితో ఎంత పనైనా చేయిస్తుంది. మహా చురుకైన పిల్ల.

**కుటుం:** వచ్చే సోమవారం కార్యనిర్వాహక వర్గ సమావేశం. మీరు ఇద్దరూ తప్పకుండా హాజరు కావాలి. సుబ్బారాయుడుగారూ లోపలికి పదండి... పిల్లలెలా వున్నారో చూచి, చీటి వ్రాయిస్తాను. కంపౌండరు దగ్గరికి వెళ్ళి మందు తీసుకోండి.

## రెండవ రంగము

**(కాలువలోని నీరు పారుతున్న చప్పుడు. పక్షుల కిచకిచలు)**

రాళ్ళు బళ్ళమీద తోలుకువచ్చి క్రిందపడవేసే చప్పుడు. కట్టుబడి వేసేవాళ్ళు ఉలితో రాళ్ళు మలిచే చప్పుడు.

**"ఎవరో చేస్తారని మనముంటే**
**ఏమౌతుందో ఎంతౌతుదో**
**ఉడతాభక్తితో ఉత్సాహంతో**
**ఏం చేద్దాం మనమేం చేద్దాం**
**మనక్షేమానికి మన గ్రామానికి"**

**జగన్నాథం:** డాక్టరుగారూ! మీరు సంకల్పసిద్ధులు. గ్రామంలో చిరకాలం నుంచీ నిద్రిస్తూ ఉన్న శక్తిని మేల్కొల్పారు. మహత్తర కార్యాలు సాగిపోతున్నవి. మన గ్రామప్రజల్లో ఇంత త్యాగనిరతి ఉందని నేను ఎన్నడూ అనుకోలేదు.

**కుటుం:** (దగ్గుతూ) ఇంతేనా... ఇంకా ఎంతో వుంది. మనజాతికి శక్తి సామర్థ్యాలు లేకనా, జిజ్ఞాస కలగక, కలిగించేవాళ్ళు లేక... స్వాతంత్ర్యం వచ్చింది... దాని ఫలితాలు అనుభవింపపోయేముందు సంధియుగం ఏ దేశానికీ తప్పదు.

**జగన్నాథం:** నిజం. అందువల్లనే అర్థం చేసుకోక పోవటం వల్ల స్వార్థం, ద్వేషం, ఈర్ష్య ఈ మధ్యకాలంలో కనిపించి, అంతా అంధకార ప్రాయంగా ఉంది. శ్రీమంతుగారు గొప్పదానం చేశారు.

**కుటుం:** కాలవ ఒడ్డున ఇంత అందమైన తోట మన గాంధీ మందిరానికి లభించడం మన అదృష్టం. (దగ్గుతాడు పెద్దగొంతుతో) చంద్రయ్యా, అక్కడికే మహాత్ముని విగ్రహం వస్తుంది. దిమ్మ బలంగా కట్టాలి. అ... అక్కడే విగ్రహం కూడా... ఎంత ముచ్చటగా వుంది... (దగ్గుతాడు)

**జగన్నాథం:** మీకు శ్రమ ఎక్కువై బాగా సుస్తీ చేసింది. ఈ పనులు ఇంకెవరికైనా ఒప్పచెప్పి విశ్రాంతి తీసుకోకూడదూ...

**కుటుం:** విశ్రాంతా! ఆగస్టు 15 అయిన తరువాత... మందిరంలో అన్ని శాఖలూ ప్రారంభమైతే గాని, నా ప్రాణం కుదుటపడదు. (దగ్గుతూ) అయితే శేఖరం మిమ్మల్ని కలుసుకున్నాడా! ఏడాదిపాటు రాత్రి పాఠశాలలో వయోజనులకు విద్య నేర్పే అవకాశం ఇప్పించమంటూ వచ్చాడు.

**జగన్నాథం:** వచ్చాడు. ఉద్యోగాలన్నిటికీ ఏంగాని, మెచ్చుకోదగ్గవి – కూటికిలేని కూలి జనం చూపిన త్యాగం... రోడ్లు వేయడం, నీటి కాలవలు తీయటం, మురికి గుంటలు పూడ్చటం ఇది సామాన్యమైన పనా... అనుకున్నపనిలో అర్ధభాగం అప్పుడే అయిపోయింది.

**కుటుం:** వారి హృదయాలల్లో మహాత్ముడు ప్రవేశించి పని చేయిస్తున్నాడు., (దగ్గుతూ) సాముదాయిక వ్యవసాయ విషయంలో శ్రీమంతుగారూ సుబ్బారాయుడు గారూ కృషి చేస్తామని వాగ్దానం చేశారు.

**జగన్నాథం:** వారి మైత్రితో గ్రామంతో వాతావరణమంతా మారిపోయింది. చినుకుపడ్డ తరువాత అంతా కలిసి దున్నుదామని రాత్రి రైతులు చెప్పుకుంటుంటే చెవిన బడ్డది.

**కుటుం:** మంగమ్మగారు బాలబాలికలకు ఆటస్థలం ఇచ్చిందటగా...?

**జగన్నాథం:** అంతేకాదు, అందులో ఒక మందిరం కట్టించి రేడియో పెట్టిస్తానన్నది.

**కుటుం:** గోవర్ధనమ్మగారు మహాదొడ్డ ఇల్లాలు. అంత గొప్ప ఇంట పుట్టానన్న గర్వం ఆమెకు అణుమాత్రమైనా ఉందేమో చూడండి. నిద్రాహారాలు లేకుండా పనిచేస్తున్నది.

**జగన్నాథం:** ఆమె దారి చూపించకపోతే గ్రామంలో స్త్రీలు చలించేవాళ్ళు కాదు. చివరకు స్త్రీల త్యాగమే విశేషంగా ఉండేట్లు కనిపిస్తున్నది.

**కుటుం:** ఎప్పటికైనా కోమల హృదయం స్త్రీల సొత్తు. (దగ్గుతూ) వారిది మాతృ హృదయం – కష్టాలకు కరిగిపోతుంది. త్యాగానికి నిలుస్తుంది. ధర్మానికి కట్టుబడుతుంది.

**జగన్నాథం:** అదుగో... ఆ వచ్చేది గోవర్ధనమ్మగారేనా? మందిరం చుట్టూ తిరిగి చూసి వస్తున్నట్లున్నది.

**కుటుం:** మరిచిపోయినాను. స్వాతంత్ర్యోత్సవ సభలకు కార్యక్రమం సక్రమంగా ఏర్పాటు చేశారా? ఏ లోపం రాకూడదు!

**జగన్నాథం:** అందరికీ ఆహ్వానాలు పంపించాను. ప్రత్యేకం స్వహస్తంతో కలెక్టరుగారు తాము సభకు వస్తామని వ్రాశాడు. శ్రీమంతుగారు ఒక భాగవతార్ గారినీ, సంగీత విద్వాంసులనూ పిలిపిస్తున్నారు. రాత్రి కార్యక్రమం ఏర్పాటు జరిగిపోయింది. అబ్బో 7.20 అయింది. నాకు సెలవియ్యండి. నేను శ్రీమంతుగారిని కలుసుకోవాలి.

**కుటుం:** మంచిది. గోవర్ధనమ్మగారూ! ఇటు, ఇటు..., యెలా వుంది. మన సేవాసంఘం – గాంధీ మందిరం (దగ్గుతాడు)

**గోవర్ధ:** నమస్తే డాక్టరుగారూ. మహాగొప్పగా వుంది. 'ఉడతాభక్తి' అని పేరు పెట్టి ఊళ్లో వాళ్ళందరినీ దోచేస్తున్నారు.

**కుటుం:** మీ మహిళాలోకం ఏమనుకుంటున్నారేం?

**గోవర్ధ:** ఏమనుకుంటారు? డాక్టరుగారు మహానుభావు డనుకుంటున్నారు.

**కుటుం:** పొగడకండి. గర్వం వస్తుందని భయంగా వుంది. (దగ్గుతాడు)

**గోవర్ధ:** మీరెంతైనా గర్వపడవచ్చు. మనస్ఫూర్తిగా చెబుతున్నాను. మా గ్రామాన్ని స్వర్గభూమి చేశారు. గ్రామోద్ధరణ చరిత్రలో మీ పేరు స్వర్ణాక్షరాలతో లిఖించాలి.

**కుటుం:** నేను చేసిందేముంది? మన గ్రామానికి మనమేం చేశాం, ఏం చేద్దాం అనే విజ్ఞాన ప్రజలకు కలిగింది. ప్రజాహృదయ రాతిరథం కదలక కదలక కదిలింది. ఇక సమస్తం పూర్తి చేసుకొని నిద్రపోదు. అయినా మీ కృషి ముందు మా కృషి ఎంత? ప్రభాతసేవకు మహిళలు అంగీకరించారా?

**గోవర్ధ:** అంగీకరించటమేమిటి? స్త్రీలకు సంబంధించిన శాఖలనన్నిటినీ మనమే నడుపుకుందామనుకుంటున్నారు. అవసరమైతే ఎక్కడికైనా వెళ్ళి శిక్షణ పొంది రావడానికి సిద్ధంగా కొందరున్నారు.

**కుటుం:** ఇక నాకు వైద్యశాలకు వెళ్ళవలసిన కాలమైంది... సెల విస్తారా...?

**గోవర్ధ:** సాయంత్రం మిమ్మల్ని కలుసుకొని సవిస్తరంగా మాట్లాడుతాను.

## మూడవ రంగము

"బోలో! మహాత్మాగాంధీకి జై,
సేవా సంఘానికి జై... గాంధీ మందిరానికి జై....

**(సభా కోలాహలము... జయజయధ్వానాలు)**

**శ్రీమంతు:** సోదర సోదరీమణులారా! ఈనాడు మన గ్రామచరిత్రలో మహా సుదినం. బాపూజీ రామరాజ్యం కేవలం కలని భావించేవాణ్ణి పూర్వం. స్వల్పకాలంలో ఉడతాభక్తిగా మనం చూపించిన అన్యోన్య సహకారం, సేవ, త్యాగం, అంతటికీ ఒక వ్యక్తి కారకులు.

శ్రీ డాక్టరు కుటుంబరావుగారు. మీ అనుమతితో వారికి గ్రామోద్ధారక బిరుదాన్ని ఇస్తున్నాను.

**(జై గ్రామోద్ధారక కుటుంబరావుగారికీ జై)**

**కుటుం:** మహాజనులారా! నేనీ బిరుదానికి అనర్హుణ్ణి. అంతేగాక గ్రామానికి నావల్ల జరిగిందేముంది. మీరంతా బీదలు, సాదలు, ధనికులు, కులమతవర్గ విచక్షణ లేకుండా ఉడతాభక్తిగా పిలుపు విని త్యాగం చేశారు. ఇంకా చేయటానికి సంసిద్ధులుగా ఉన్నారు. మనం సాధించవలసినవి ఇంకా ఎన్నో వున్నవి. దీనికి మహత్తర త్యాగం అవసరం. త్యాగం లేని సంఘం జీవించలేదు. ఇది ముఖ్య సిద్ధాంతం. మన మందరమూ ఉత్తమ సేవకులు అయిన శ్రీ జగన్నాథంగారికి ఎంతో ఋణపడ్డాము.

**(జై జగన్నాథం గారికీ జై)**

**జగన్నాథం:** సభాసదులారా! మనలో ఏ ఒక్కరూ మరొకరికి ఋణపడ లేదు. మనదంతా ఒక సమష్టి కుటుంబం. ఇందులో ఈర్ష్యలకు, క్రోధాలకు, విరోధాలకూ తావులేదు. అన్యోన్య సహకారం, ప్రేమ, మైత్రి యివి ఈ కుటుంబ సౌఖ్యానికి ముఖ్య సూత్రాలు. సంఘంలో ఒకరు ఎవరేమైనా నేను సుఖంగా ఉంటానని భావించటం తెలివితక్కువ. వ్యక్తి జీవితం సంఘజీవితం మీద ఆధారపడి వుంది. ఇది నగ్నమైన సత్యం. నాకు ఒకందుకు సంతోషం వేస్తున్నది. మన గ్రామంలో స్త్రీ లోకం ఇంత ఉత్సాహంతో ఇంతకు ముందు ఎన్నడూ సభల్లో పాల్గొనటం నేను చూడలేదు. దీని అంతటికి కారణం మన గోవర్ధనమ్మగారు.

**(జై గోవర్ధనమ్మగారికీ జై)**

**గోవర్ధ:** నామీద అభిమానం కొద్దీ సోదరులు నన్ను గురించి చెప్పినమాటను గురించి ప్రసంగించి కాలహరణం చెయ్యదలచుకోలేదు. ఈ స్వాతంత్ర్యదినోత్సవ కార్యక్రమంలో ఎన్నెన్నో చిత్రవిచిత్ర విశేషాలను సోదరులు ఏర్పాటు చేశారు. కానీ ఒక్కమాట ఉడతాభక్తిగా అంతో, ఇంతో ధనమనండి, ధాన్యమనండి... లేదు శరీరకష్టమనండి... గ్రామోద్ధరణకు ధారపోయటానికి ముందంజ వేయని స్త్రీ మన గ్రామంలో లేదని నేను సగర్వంగా చెప్పగలను. మేము సంఘంలో మా స్థానాన్ని ఆక్రమించటానికి సమస్తవిధాలా కృషి చేస్తామని ఈ సభాముఖంగా వాగ్దానం చేస్తున్నాను. (కరతాళ ధ్వనులు) ఏనాటికైనా మన గ్రామం ఆంధ్రదేశంలో...

**శ్రీమంతు:** సోదరులారా! మీకో సంతోషవార్త తెలియజేయడానికి అడ్డువస్తున్నాను. క్షమించండి. కలెక్టరుగారు కారణాంతరాలవల్ల రాలేకపోయినామనీ, మన గ్రామాభ్యుదయాన్ని గురించి ప్రత్యేకచారులవల్ల విని, ఆనందించి ప్రభుత్వం వారికి తెలియజేశామని వార్త పంపించారు

**(కరతాళ ధ్వనులు)**

**గోవర్ధ:** మన ఉడతాభక్తి కార్యక్రమాన్ని చూసి వెళ్ళి ప్రభుత్వమే ఈ విధానాన్ని అన్ని గ్రామాల్లో అమలు పరచవచ్చు. అప్పుడు మన ఊరిపేరు మార్మోగి పోతుంది.

**(కరతాళ ధ్వనులు)**

**శ్రీమంతు:** అప్పుడు మన గోవర్ధనమ్మగారు, జగన్నాథంగారూ, కుటుంబరావుగారూ ఆఫీసర్లయిపోతారుగామాలి. మనం పంపటానికి వీల్లేదని వ్రాద్దాము. (కరతాళ ధ్వనులు) సోదర సోదరీమణులారా! మేమంతా వృద్ధులమైనాము. ఇక యువకులు ముందుకు రావాలి. వృద్ధులు వారికి స్థానమివ్వాలి. పదవులు అందిపట్టుకుని కూర్చోవటం సంఘద్రోహం. (భేష్... భేష్... భేష్...) ఈ ఉద్దేశంతో ఉడతాభక్తిగా ఇప్పుడే నేను వహిస్తున్న అన్ని అధ్యక్ష పదవులకు రాజీనామా ఇస్తున్నాను. జీవితాంతం వరకూ ఏ పదవీ స్వీకరించను. ఈ మార్గాన్నే అనుసరించమని పెద్దలకు నా మనవి.

**(సెహబాస్, సెహబాస్)**

**సుబ్బా:** మహాజనులారా! ఉడతాభక్తి కార్యక్రమానికి తోడ్పడ్డ మహాత్యాగమూర్తులందరికీ సేవాసంఘం కార్యనిర్వాహక వర్గం తరపున వందనాలర్పిస్తున్నాను. ఈనాటి స్వాతంత్ర్య దినోత్సవాలల్లో ఇంకా కార్యక్రమం ఎంతో వుంది. దానిలోనూ తరువాత స్త్రీలకు, పురుషులకు, బాలబాలికలకూ ఏర్పాటు చేసిన సంఘం కార్యక్రమాల్లోనూ పాల్గొని ప్రయోజనాలు పొందవల సిందని ఇంతకంటె విరివిగా త్యాగం చేసి గ్రామాన్ని ఉద్ధరించవలసిందని మిమ్మల్ని పదే పదే ప్రార్థిస్తూ విరమిస్తున్నాను.

**(దూరం నుంచి క్రింది గీతం వినిపిస్తుంది)**

**"ఉడతా భక్తితో ఉత్సాహంతో**
**ఇంకేం చేద్దాం ఈ గ్రామానికి**
**పిన్నలు పెద్దలు పేదలు ధనికులు**
**ఏం చేద్దాం మనమేం చేద్దాం"**

*ఎ.ఐ.ఆర్. విజయవాడ 15-8-1953*

# చివరి రోజులు

**ఔరంగజేబు:** ఈ రోజు ఉదయం నుండీ కిటికీలోంచి మసీదువైపు చూస్తున్నాను. చంద్రరేఖ ఏదో పెనుగాలికి కంపించినట్లు ఊరికే ఊగిపోతూ కనిపిస్తున్నది. అఖండ హిందూస్థాన్‌ను సాధించి, ఆ తరవాత దాన్ని దార్ ఉల్ – అస్లాంగా తీర్చిదిద్దుదామనుకున్నా. నా దివ్యాదర్శనానికి అల్లా అంగీకారం ఉన్నట్లు కనిపించడం లేదు. ఇబ్రహీం! సున్నీరాజ్యాలను, బీజాపూర్, గోల్కొండలను సర్వనాశనం చెయ్యటంతో సాలీనా పదకొండు కోట్ల రూపాయిలు ఖజానా హెచ్చింది. కానీ నా ప్రశాంతి చచ్చింది.

**ఇబ్ర:** కాసేపు విశ్రమించండి. ఖుదావంద్ ఇంతలో అజ్జం బహదూర్ వస్తాడు. అన్నీ ఆలోచించుకోవచ్చు...

**ఔరంగ:** ఎలా విశ్రమించను? మొగలాయీ సామ్రాజ్యం నా కళ్ళ ఎదుటనే ఛిన్నాభిన్నమయ్యేట్లు కనిపిస్తున్నది.

**(సైన్య ఘోషలు దగ్గరకు వస్తున్నట్లు వినిపిస్తుంది)**

**ఇబ్రహీం:** అదుగో సైన్యాలతో అజ్జం, షహజాదా ఖుదావంద్! తమను చూచి పోవటానికి వస్తున్నట్లున్నాడు.

**ఔరంగ:** చూచిపోవటానికో చుట్టుముట్టటానికో... వీడు ద్రోహో దొరో ఇంతవరకూ అర్థం కాలేదు. అక్బర్ తిరుగుబాటు చేసి అలా అడవులపాలై పోయినాడు. అజ్జం షూజాతో కలిసి సువ్వరైపోయినాడు. కాంబక్ష్ కందిసీలతో కాలక్షేపం చేస్తున్నాడు. దేశం అజ్జం కాంబక్ష్‌లకు పంచియిస్తే ఇంతటితోనైనా అంతఃకలహం మానేస్తారేమోనని ఆశ...

**ఇబ్ర:** ఆయీయే జనాబ్. అజ్జం బహదూర్, ముబారక్ ముబారక్...

**అజ్జం:** ముబారక్ ఖుదావంద్. ముబారక్ జహాపనా. ముబారక్ అబ్బాజాన్...

**ఔరంగ:** అబ్బాజాన్ అజ్జం అల్‌బేనాఁ ఆవ్... ఈ పక్కమీద కూర్చో నీ గొంతెంత మీఠాగాఉంది బేటా... నా తబాయత్ – ఆరోగ్యము – ఏమీ బాగాలేదు. శరీరం ఎలా

శుష్కించిపోయిందో చూడు... ఏదీ నీ చల్లని చేత్తో ఈ గుండెను ఒక్కమారు స్పృశించు... అచ్ఛా..

**(సంతోషాన్ని నటిస్తూ -హాయ్ః హాయ్... అల్లా హాఫీజ్)**

**అజ్జల:** లడాయి ఆపించి మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను అబ్బాజాన్.

**ఔరంగ:** ఔను... బేటాః నీ హృదయం నాకు తెలుసు. ఇవాళోరేపో వస్తావని ఇప్పుడే ఇబ్రహీంతో అంటున్నాను. ఎంత శ్రమపడి వచ్చావు. అలిసిపోయినావు. శ్రమ తీర్చుకో కాంబక్ష్ నీకు ఎదురు వచ్చాడా... రాలేదూ... వద్దన్నానులే.

**అజ్జం:** రానివ్వకపోయినారా అబ్బాజాన్ కలిసి వచ్చేవాళ్ళము.

**ఔరంగ:** కాస్త తొందరపాటువాడని భయపడ్డాను. ఏమైతేనేం మీరిద్దరూ అన్నదమ్ములు. ఈ విశాల సామ్రాజ్యం మీ ఇద్దరిదీ. ఈ ప్రమాద స్థితిలో మీ ఇద్దరు అన్నదమ్ములూ ఏకం కాకపోతే మొగలాయీలకు దేశంలో నిలవనీడ ఉండదు.

**అజ్జం:** (అనుమానిస్తూనే) జీహాః అబ్బాజాన్.

**ఔరంగ:** కాంబక్ష్‌తో మాట్లాడాను. మీ అంతఃకలహాలు నాకు నచ్చటం లేదు. కావలసినంత ఫౌజు ఉంది, ఖజానా ఉంది, నమ్మక్ హరాములు కాని సమర్థులైన సరదారులు, మున్సబ్‌దారులు ఉన్నారు. అలంఘీరులు కండి! మీ కోసం కాకపోతే ఢిల్లీ దర్వాజా దాటి ఇంత వృద్ధాప్యంలో ఈ వ్యాధితో ఈ తంటాలు పడవలసిన స్థితి నాకేముంది. అవసరమైతే అన్నదమ్ములు పాలుపంచుకొని ఒకరు ఢిల్లీనుంచీ మరొకరు ధియోగర్ నుంచీ పాలించండి.

**అజ్జం:** (అదిరిపడ్డట్టు) ఏమిటి అబ్బాజాన్?

**ఔరంగ:** కాంబక్ష్‌తో మాట్లాడు.

**అజ్జం:** మాట్లాడే వచ్చాను అబ్బాజాన్.

**ఔరంగ:** అయితే నా అభిప్రాయం అతడు నీకు చెప్పాడన్నమాట.

**అజ్జం:** (ఆలోచనా పూర్వకంగా) ఔను!

**ఔరంగ:** ఆ ఖురాన్‌మీద నీ కైజారు ఉంచు... ఆలోచించకు... అచ్ఛా దేవాః బోత్.... ఉః కాంబక్ష్ మేరా భాయీ... దార్ ఉల్ ఇస్లాం... మేరా ఇరాదా...

**అజ్జం:** (తండ్రి చెప్పిన మాటలను ఒక్కొక్కదానిని వెంటనే పాఠం చెప్పుకుంటున్నట్లు) అంటాడు. అందులో ఆత్మశుద్ధి అంతగా కనిపించదు. ఖురాను నుంచి ఔరంగజేబు క్రిందిరీతిగా పఠిస్తాడు.

**ఔరంగ:** హాయ్ అల్లా.............

## రంగం-2

**(రెండు సైన్యాలు యుద్ధం చేస్తూన్న కోలాహలం)**

**ఔరంగ:** (విసుగు మీద కల్గిన కోపంతో) గులాం రే గులాం... ఎవ్వరూ లేరు. అరె అల్లా అరె అల్లా ఔరంగజేబ్. ఢిల్లీ పాదుషా. అలంఘీర్ దేఖో నీ దుస్థితి ఎలా వచ్చిందో చూడు... హఁ హఁ హఁ (పెద్ద గొంతుతో) గులాం... ఏమిటి... సితార్ కీ ఆవాజ్ సంగీతము ముప్ఫై నాలుగేళ్ళనుంచీ నా చెవిన బడలేదు. సంగీతం వినరాదని శాసించాను.

**జెహరా:** ముబారక్, ఖుదావంద్ ముబారక్ సంగీతం వినిపించాను క్షమించండి అబ్బాజాన్...

**ఔరంగ:** నీవెవరు?

**జెహరా:** జెహరా... మీకు ఉపచారం చెయ్యమని షాజాదా పంపించారు.

**ఔరంగ:** ఎవరు? అజ్జం.

**జెహరా:** ఊఁ...

**ఔరంగ:** సిగ్గుపడతావేం... కాంబక్ష... అతనికీ నీకూ ఏమి సంబంధం?

**జెహరా:** ఇదిగో ఈ ఉత్తరం చిత్తగించండి జహాపనా...

**ఔరంగ:** "అబ్బాజాన్ మీరు నాతో చెప్పిన విషయాలను అన్నతో మాట్లాడాను. అందుకు అంగీకరించినట్లు లేదు. మిమ్మల్నీ నన్నూ ఖైదీలను చేసే సూచనలు కనబడడం వల్ల అతనితో లడాయికి దిగుతున్నాను. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు. అందుకు ప్రయత్నించకండి. మీ సేవకోసం నా ప్రియను, జెహరాను పంపిస్తున్నాను... షాజాదా కాంబక్ష్... "హాయ్ ఖుదా హాయ్ ఖుదా..."

**జెహరా:** ఎందుకలా బాధపడతారు, జహాపనా. ఈ పూలను చూడండి. ఇది అనార్, అంతా ప్రేమ మయం. నా వలెనే బయటపడిపోతుంది. ఇది అన్వర్ కంటే ప్రేమను గుప్తంగా దాచిపెడుతుంది. ఇది రోజా – దీనికి రెండు లక్షణాలూ ఉన్నవి. ఒక్కమాటు దీన్నీ వాసనను చూడండి. మీ బాధ పటాపంచలైపోతుంది.

(సైన్య కోలాహలం భయంకరంగా తారసిల్లుతున్నట్లు వినిపిస్తుంది)

**ఔరంగ:** జెహరా చేయి పట్టుకొని ఒక మారు నన్ను విటంకం దగ్గరకు దీసుకుపో. వీలైతే వాళ్ళ యుద్ధం ఆపుతాను.

**జెహరా:** అయితే మీ ప్రియపుత్రుడు కాదిబక్ష్ పాదుషా కావటం మీకు ఇష్టం లేదూ?

**ఔరంగ:** హాయ్ పర్వర్థిగార్... హాయ్ పర్వర్థిగార్...

**జెహరా:** సంగీతం, పూలూ తప్ప ప్రపంచంలో మీ బాధను పోగొట్టేదేమీ లేవు జహాపనా... రంగులతో, వాసనలతో, చూపులతో, నవ్వుతో, పూలు ఎన్ని రహస్యాలు చెపుతాయని? ఖుదావంద్. పూలంటే ఇష్టంలేనివాళ్ళకు ప్రేమ హృదయం లేదన్నాడు – మామీకవి.

**ఔరంగ:** (సంభాషణ ఆపమన్నట్లుగా) జెహరా నీవు వెళ్ళిపో... నన్ను ఏకాంతంగా ఉండనీ...

**జెహరా:** ఎందుకు సర్కార్ ఏమేమో ఆలోచించి బాధపడటానికా? సితార మోగిస్తూ చిన్న పాట పాడుతాను

**చేతి చెఱను పడినానని**
**చింతపడకె ఓ పూవా**
**ప్రియుడెవరో పలుకుము నే**
**పిలని యతని విడియెదనీ...** **చింతపడకె...**

**జాలువార నాడకెద విడి**
**జడులమనుచు కన్నీరా?**
**వలపుతీర త్రావుకై**
**వరుని కౌఱకు కన్నీరా?** **చింతపడకె...**

**ఔరంగ:** (సకరుణంగా) జెహరా... ఇక ఆపు. ఈ పాట నా పూర్వ చరిత్రను స్మృతికి తెస్తున్నది. అయ్యో నేనెంత దుష్టుణ్ణి. ద్రోహిని? తంత్రజ్ఞుణ్ణి, హంతకుణ్ణి, మతోద్రేకిని,

మతోన్మాదిని. అన్నలను, తమ్ముళ్ళను, అక్కచెల్లెళ్ళను, తండ్రినీ నా పొట్టన పెట్టుకున్నాను. ఖుదావంద్ షహన్ షా షాజహాన్... అబ్బాజాన్ నీవు చాలా గొప్పవాడివి... భాయీ దారా నీ వెంటపడి వేటకుక్కలా తరిమాను...

(ఫ్లాష్‌బాక్) షాజహాన్ అస్వస్థతతో ఆయాసంతో మాట్లాడుతాడు. జెహనారా దీనంగా ఓదార్పు మాటలు పలుకుతుంది

**షాజహాన్:** జెహనారా దారా సంగతులేమైనా తెలిసినవా?

**జెహ:** లేదు అబ్బాజాన్... అతణ్ణి గురించి అట్టే ఆలోచిస్తూ ఉండకండి, ఆయాసం ఎక్కువౌతుంది.

**షాజహాన్:** (ఆయాసంతో) బేటా దారా ఎంత పొరబడ్డావు... నా మాట విన్నావుకావు. సముర్ధర్ సమరాంగణానికి నన్ను వెళ్ళనిచ్చావు కావు. సులేమాన్ వచ్చేదాకా సుస్తి చెయ్యమంటే సైన్యాలల్లో నీతిపోతుందని భయం పడ్డావు... నిన్ను నరరూపరాక్షసి ఏ నట్టడవుల్లో వెన్నాడుతున్నాడో... ఎంత దుస్థితి చేతులారా తెచ్చుకున్నావు. మాకు తెచ్చిపెట్టావు... హాయిఖుదా... హాయిఖుదా.

**జహ:** అబ్బాజాన్ అట్టే మాటాడకండి దాహం వేస్తుంది. మంచినీటి కూజా ఇంకా రాలేదు.

**షాజహాన్:** మన ఇద్దరికీ రెండు రోజులకు ఒక చిన్న కూజా మంచినీళ్ళా... మన మేం అపచారం చేశామని? ఖైదీని చేసి కష్టపెడుతున్నాడు? కత్తిని కానుకగా పంపించి అలంఘీరువు కమ్మని ఆశీర్వదించాను... జెహన్ వెర్రితల్లి రోషనారాలా నీవు వీడికి లొంగిపోయి సుఖపడమ్మా. అల్లా కరుణ వచ్చేదాకా ఇలాగే అలమటించి చనిపోతాను.

**జెహనారా:** (దుఃఖిస్తూ) అబ్బాజాన్ అలా ఆజ్ఞాపించకండి. నేను బులి బుచ్చి కాలాడలేను. ఆ నరకంలోనికి వెళ్ళమని నాతో చెప్పకండి అబ్బాజాన్. అల్లా కృపవల్ల అన్న దారా విజయంతో తిరిగి వస్తాడు.

**షాజహాన్:** విజయం. అల్లా కృప. అల్లా ఉంటే ఇన్ని అన్యాయాలు జరుగుతుంటే చూచి ఊరకుంటాడా జెహన్ మన కూజా ఇంకా రాలేదు.

**ఔరంగ:** (వికటంగా నవ్వుతూ వ్యంగ్యగర్భితంగా మాట్లాడుతాడు) హఁ హఁ హఁ అల్లాలేదూ? అల్లా లేనివాళ్ళకు కూడా ఎందుకు ఇదుగో వెంటబడి పట్టించుకోవచ్చాను. ఇబ్రహీం దాన్ని నేలమీద బ్రద్దలు కొట్టివేయ్. (చప్పుడు) హఁ హఁ హఁ హఁ షాజహాన్

ఢిల్లీ కా పాదుషా. షాహన్‌షా, ఖుదావంద్ ముబారక్ ముబారక్... జెహన్... రోషనారాకీ బహిన్... కాఫిన్ దారా ఖైదీ అయిపోయినాడు. కాపిర్లతో స్నేహం చేసిన వీడికి కళ్ళు పీకించ పోతున్నా.. (జహనారా భయంతో కేకపెడుతుంది). షాజహాన్... అల్లా హాఫీజ్ కాదు కాదు శిరచ్ఛేదన శిక్ష విధించాను. మరిచిపోతాను. జహనారా...

**షాజహాన్:** బేటా ఔరంగజేబు ఢిల్లీ పాదుషాలైనందుకు నిన్నొక చిన్న కోరిక కోరుతున్నాను. ఆ విషాద వార్త వినలేను నన్ను నీ కైజారుతో పొడిచి చంపెయ్.

**ఔరంగ:** జీ నహీఁ పాదుషా దారాకా అబ్బాజాన్ తాము తమ కుమారుణ్ణి ఢిల్లీ ప్రజలు ఎలా స్వాగతమిస్తున్నారో చూచి సంతోషించకుండానే మరణిస్తారా? నేను ఒప్పుకోను. అల్లా అంగీకరించడు (దూరం నుంచీ దారాను ఎగతాళి చేస్తూ వస్తూ ఉన్న జనసమూహం కోలాహలం) సుల్తానా బెహన్ అదుగో నీ భాయీ దారా అఖండ స్వాగతంతో వస్తున్నాడు. ఇబ్రహీం పాదుషావారిని విటంకం దగ్గిరకు నడిపించుకురా...

**ఇబ్రహీం:** రండి సర్కార్... (దారాను ఎగతాళి చేస్తూ ఉన్న కోలాహలం దగ్గరికి వచ్చేస్తుంది)

**ఔరంగ:** హఁ హఁ హఁ చాలా కాఫిర్ దారా, మేరా దుష్మన్ ఇస్లాంకా దుష్మన్.

**షాజహాన్:** బేటా ఔరంగజేబ్ ఇది అక్రమం అన్యాయం, మొగలాయీ వంశానికి తీరని కళంకం... నీవు చేస్తున్న ఈ పాపానికి నిన్నెప్పుడూ అల్లా క్షమించడు.

**ఔరంగ:** హఁ హఁ హఁ రాజ్యాన్ని ఈ కాఫిర్‌కు కట్టబెట్టదలచిన మిమ్మల్ని క్షమిస్తాను. రే ఇబ్రహీం నీవు త్వరగా వెళ్ళు. దారా శిరస్సును ఖండించి బాలుడు గోరీ దగ్గిరకు చేర్చుమని చెప్పు... ఇదుగో ఈ గుర్తు చూపించు... (జహనారా ఏడ్పు వినిపిస్తుంది. షాజహాన్ హాఫీజ్ అల్లా అంటాడు.

ఇబ్రహీం ఉండు వెళ్ళకు. అతని శిరచ్ఛేదనా నేను సింహాసనం ఎక్కటం ఒక్కమారు జరగాలి... సమస్త ప్రయత్నాలూ సాగించమని వజీరుతో చెప్పు... ఉఁ...

**ఇబ్ర:** జీ మాలిక్. అబ్బాజాన్ షాజహాన్ నీ పుత్రులందరిలో మిగిలినవాణ్ణి నేనే. ఢిల్లీ సింహాసనమెక్కుతున్నాను... దీవించండి.

**షాజ:** హఁ హఁ హఁ పాగల్ బేటా ఔరంగజేబ్ మతాన్ని వృద్ధి చేయటానికి... ఇది మార్గం కాదు. రక్తంతో తడిసి ఎక్కుతూ ఉన్న ఈ సింహాసనం నీ రక్తాన్ని బలి కోరుతుంది. నీ ఆశయం సిద్ధించకపోగా ఆత్మశాంతిని పోగొడుతుంది. నేను అనుభవిస్తూ వున్న ఇటువంటి ఘట్టమే తిరిగి నీ జీవితచరిత్రలో సంభవిస్తుంది.

**(ప్రస్తుతం)**

**ఔరంగ:** (ఏడుస్తూ) అబ్బాజాన్ అనే మాటలన్నీ ఇప్పుడర్థమైనవి. ద్రోహిని, దుష్టుణ్ణి, మూర్ఖుణ్ణి క్షమించండి. ఏ లోకాల్లో ఉన్నారో క్షమించండి. బహిన్ జెహనారా బలి బుచ్చకాల, రోషనారా మాటలు విని నిన్నూ బాధపెట్టాను. రక్తసంబంధమైనా ఎరగని రాక్షసుణ్ణి. (ఎక్కిళ్ళుపెడుతూ ఏడుస్తాడు) ఇన్ని హత్యలకు కారకుడైన ఈ హంతకుణ్ణి అల్లా నన్నెలా క్షమిస్తావు? క్షమిస్తే నీమీద ఏం నమ్మకం ఉంటుంది? అబ్బా నాది ఎంత రాతిగుండె... ఎన్ని దారుణ హత్యలు చేశాను. చేయించాను. (మళ్ళీ ఏడుస్తాడు).

**జెహరా:** పితాజీ నీకు ఏడ్వడం చేతగాదు.

**ఔరంగ:** (కొంచెం ఆర్ద్రంగా) ఎందువల్ల బేటా...

**జెహరా:** జనానికి నవ్వటం తెలుసు. నవ్వగలవాళ్ళు ఏడ్వగలరు... నీకు నవ్వటం చేతగాదు, అందువల్ల సరిగా ఏడవలేవు. అందుకని నిన్ను అందరూ జిందాపీర్ అంటారు. నవ్వాలంటే పూలువాసన చూడాలి. మంచి మధురమైన సంగీతం వినాలి. మీకు పూలంటే గిట్టదు, నేను సంగీతం పాడుతుంటే విని సహించలేరు., కోపపడతారు. నేను మీ దగ్గర ఉండలేను. అబ్బాజాన్ ఎక్కడికైనా వెళ్ళిపోతాను.

**ఔరంగ:** (ఆర్ద్రంగా) బేటా వెళ్ళిపోకు... ఇప్పుడు నేను నవ్వగలను. ఏడ్వగలను. నీవు వెళ్ళిపోతే నేను బ్రతుకలేను. వృద్ధుడైన ఈ అబ్బాజాన్ మీద నీకు కనికరం లేదూ? ఏదీ ఒక మంచి పాట పాడు... ఆ రోజా ఇలా తే బేటా... (వాసన చూచిన ధ్వని) అబ్బ జెహరా... ఎంత కమ్మని వాసన... కానీ నా పాట కానీ...

**జెహరా:** నరహంతల హృదయాలను

> **సురభిళమ్ము లొనరించే**
> **సుమజగమ్ము కనవోయీ**
> **అమలగీతి వినవోయీ...**
> **పంకిలమున జనియించిన**
> **పద్మాలను కనవోయీ**
> **పాపములను కొన్న జగతి**
> **భవ్యుడవై మనవోయీ**

**ఔరంగ:** బహుత్ ఖూబ్... బహుత్ ఆరామ్ ఆరామ్ హి ఆరామ్ హై...

***ఎ.ఐ.ఆర్. విజయవాడ 15-7-1952***

# శివాజీ అఫ్‌జల్ ఖాన్

**శివాజీ:** గురుదేవ్, రామదాస స్వామీ, హైందవ సామ్రాజ్యాన్ని నిర్మిస్తానని మీ పాదాలకు వందనం చేసి ప్రతిజ్ఞ గైకొన్నాను. మానవ యత్నమంతా చేస్తున్నాను. కానీ దైవం... మాయీ భవానీ! నీ దయవల్ల శత్రువులకు చేజిక్కకుండా ఇంతవరకూ ఎన్నో ఆపదలను గడిచి వచ్చాను. కష్టాలమీద కష్టాలను తెచ్చిపెట్టి నన్నింతగా అగ్నిపరీక్ష చేయదలిచావేమ్మా!

**జిజియాబాయి:** శివా! (లోపలినుంచి వస్తూ వున్నట్లు) మళ్ళీ ఏం మార్పు వచ్చింది నాయనా! నీ ఇష్ట భృత్యులెవరైనా నిన్నా మొన్నట్లో శత్రువులతో చేరిపోయినారా?

**శివాజీ:** అదొక విశేషమే కాదు. అయినా అటువంటి దేశద్రోహులు మన మహారాష్ట్ర జాతిలో మరింతమంది లేరు.

**జిజియాబాయి:** అయితే నీవు కళ్యాణదుర్గాన్ని కొల్లగొట్టావని నిన్ను సాధించేటందుకు మీ నాన్నగారిని చెరసాలలో ఉంచి చిత్రహింసలు పెడుతున్నారట?

**శివాజీ:** ఇప్పుడు నన్ను సాధించటానికి బీజాపురం వారికి ఇటువంటి పిరికి పనులతో పనిలేదు. కాలం ఎంతో అనుకూలంగా వారికి కలిసి వచ్చింది. ఢిల్లీ రాజ్యం కోసం మొగలాయీ రాజు కుమారుల మధ్య అంతః కలహాలు చెలరేగాయి. దేవగిరి ప్రాంతం నుంచి నాకు మిత్రుడుగా ఉంటాడన్న మొగలాయీ రాకుమారులు ఢిల్లీకి సైన్యాలను తరలించికోవెళ్ళారు.

**జిజియాబాయి:** అయితే ఇక వారి దృష్టి అంతా నిజంగా నీమీదనే నిలిపి బీజాపురం వారు వ్యవహరిస్తారన్నమాట!... అక్కడికి వెళ్ళిన విశ్వాసరావు వచ్చాడా?

**శివాజీ:** లేదు. ఫకీరు వేషంతో బీజాపురం కోటలో అతడు ప్రవేశించటాన్ని చూచి, మోరే, ఎన్నాళ్ళకూ అతడు తిరిగి రాకపోవడం వల్ల విసుగు వచ్చి తిరిగి వచ్చేశాడు. బహుశః అతడు చిత్రవధకు గురై ఉంటాడేమో!

**జిజియాబాయి:** అలా ఊహించటానికి వీలు లేదు. అతడికి ఏ ఆపదా కలగదు. అతడు దీర్ఘాయుష్మంతుఁడని దాదాజీ వెనక జోస్యం చెప్పారు.

**విశ్వాసరావ్:** మాయీా, జిజియా మాయీా!! ప్రభూ! శివాజీ ప్రభూ!!

**జిజియా:** రా, నాయనా నీకు నూరేండ్లు.

**శివాజీ:** కోటలో ప్రవేశించటానికి ఎంతో కష్టపడ్డావని విన్నాను. మోరే చెప్పాడు. నీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను.

**విశ్వాసరావ్:** మీ కృప నా మీద ఉంటే అంతే చాలు. అవన్నీ ఒక కష్టాలా. కానీ వెనుకటి బీజాపురం కాదు. లంచాలు అణుమాత్రం పనిచెయ్యటం లేదు. ఎటువంటి అంతఃపురం వారైనా అట్టే బయటపడేది పూర్వం. ఇప్పుడు ఎంత భూమి ఎర చూపించినా ఇంత రహస్యం కూడా బయటికి రావటం గగనంగా ఉంది. పసిబిడ్డను రాజ్య సింహాసనమెక్కించి రజియాబేగం బలే పకడ్బందీగా పాలిస్తున్నది.

**శివాజీ:** ఆమె మహా సమర్థురాలన్నమాట!

**విశ్వాసరావ్:** సమర్థురాలే కాదు. చండశాసనురాలు. రెండు కళ్ళూ విప్పి చక్కగా చూచిందంటే చచ్చినంతపని గాని సర్దారంటూ కనిపించటం లేదట! మొగలాయీ రాజకుమారులు సైన్యాలతో ఉత్తరానికి వెళ్ళిపోయారన్న వార్త వచ్చిన మరుక్షణంలోనే సర్దారులు నందరినీ పిలిపించి సభ తీర్చింది. ఉత్సాహంతో ప్రసంగించి వాళ్ళ రక్తాన్ని ఉడుకెత్తించింది. తమ రాజ్యాన్ని సామ్రాజ్యం చేసి గాని నిద్ర పోనన్నది. అందుకు ముందుగా మహారాష్ట్ర శివాజీని మసిచెయ్యాలట.

**జిజియాబాయి:** అంతేనా?

**విశ్వాసరావ్:** క్షమించాలి. అతడి శిరస్సును తెచ్చి ఇచ్చినవాళ్ళకు ప్రస్తుతానికి ఒక పరగణా బహూకరిస్తుందిట! మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన తరువాత మున్సబ్దారును చేస్తుందిట!!

**జిజియా:** మరి సభలో "ఆ పని నేను చేస్తా"నని ఎవరైనా ముందుకు వచ్చారా?"

**విశ్వాసరావ్:** ఆఁ ఆమె సోదరుఁడు. అఫ్జల్‌ఖాన్ ఆ పనికి తాను పూనుకుంటానని అల్లామీద ప్రతిజ్ఞ చేశాడు.

**శివాజీ:** అఫ్జల్‌ఖానా! అతఁడు ఆఫ్ఘన్ వీరుడు కదూ! మొగలాయీలతో బీజాపురం చేసిన యుద్ధాలల్లో పేరు గన్నాడని విన్నాను.

**విశ్వాసరావు:** అవును అతడే. మహాబలశాలి, చూచాను చాలా ఎత్తైన వాడు. మనమీద ఎప్పుడో హఠాత్తుగా విరుచుకు పడటానికి సైన్యాలను సమకూర్చుకుంటున్నాడట! అతడు వెంట తీసుకో రావటానికి ఒక టర్కీ ఫిరంగి దళాన్ని కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

**జిజియా:** అయితే మన శివాజీని ఎదుర్కోవటానికి ఇప్పుడు మంచి ఉజ్జీ దొరకాడన్నమాట!

**శివాజీ:** అమ్మా! నీ కుమారుడు అంతటి బలశాలి అని నీ విశ్వాసమా?

**జిజియా:** నీ పౌరుష పరాక్రమాల విషయంలో నాకు అణుమాత్రమైనా అనుమానం లేదు. భవానీమాత నీ భక్తికి మెచ్చింది. ఆమె కృప వల్ల రాబొయ్యే పోరాటంలో విజయం నీదే. ఇదిగో ఈ ఖడ్గాన్ని అందుకో.

**శివాజీ:** మహాప్రసాదం. ఓ ఖడ్గమా! భవాని అపరావతారమైన మాతృశ్రీ నిన్ను నాకు ప్రసాదించింది. ఇక నీవు నా చేతిలో నిల్చి వీర విహారం చెయ్యి. విశ్వాస్! నీవు కూడా మనకు అవసరమైన సైన్యాలను సమకూర్చు.

**(జై జిజియా బాయికి జై, జై భవానికి జై)**

## 2

**అఫ్జల్ ఖాన్ :** హుఁ హుఁ హుఁ కలలట కలలు. దయ్యాలట, భూతాలట! నేను నిఖ్హా కట్టిన బీబీలు ఇంత పిరికివాళ్ళని ఎన్నడూ అనుకోలేదు. అయినా 'శివాజీ' అనే ఆ కొండ ఎలుక అంటే అంత భయమేమిటి? మొగలాయీ మహావీరులను పారద్రోలిన మహా పరాక్రమశాలిని.

**కృష్ణజీ:** తాము వీరాగ్రేసరులన్న విషయం ఎవరు కాదంటారు. కానీ తాము బీబీల భయానికి కూడా కొంత...

**అఫ్జల్ ఖాన్:** కృష్ణజీ! నా బీబీలందరూ నాశనమైపోయినా సరే నేను మాత్రం శివాజీ శిరస్సు తీసుకోరావటానికి వెళ్ళి తీరుతాను. వాళ్ళను అలాగే కలలతోనే కాలం చెయ్యనివ్వండి. కావలసి వస్తే గట్టివి గోరీలు కట్టిస్తాను.

**రజియాబేగం:** సోదరా! నీకు మాత్రం అంత పట్టుదల ఎందుకు? నీ వంశాన్ని నాశనం చేస్తున్నానని నీ బీబీల చేత నన్నెందుకు తిట్టిస్తావు. శివాజీపని పట్టడానికి మరో వీరుణ్ణి పంపిద్దాము.

**అఫ్జల్‌ఖాన్:** సోదరీ! రజియా! ఆఫ్ఘన్ పుట్టుక పుట్టి, అనేక యుద్ధాలు చూసి, నా చేత అనేక యుద్ధాలు చేయించిన నీవే ఇలా మాట్లాడుతావను కోలేదు. నా శక్తి మీద నీకు నమ్మకం లేదా?

**రజియా:** లేక కాదు. శత్రువు అంత సామాన్యుడు కాడని.

**అఫ్జల్‌ఖాన్:** ఏమిటి? ఆహవం అంటే ఏమిటో ఎరక్క అరణ్యాల మధ్య పెరిగిన ఆ ఆటవికుడు శివాజీ ఒక వీరుడనేనా? అతడు నాకంటే బలవంతుడనా నీ అభిప్రాయం?

**రజియా:** నిత్యమూ మన చారులు తెచ్చే వార్తలు వింటుంటే అలాగే అనిపిస్తున్నది.

**అఫ్జల్‌ఖాన్:** అయితే నేను అతణ్ణి తప్పక ఎదురించి తీరుతాను.

**కృష్ణజీ:** అక్కగారు చెబుతున్నా మీరు అంత గట్టి పట్టు పట్టటం ఆట్టే బాగాలేదు.

**రజియా:** చిక్కించుకొని పులిని అతడు చేతులతో చీల్చి వేస్తాడట! అతడికి నీవో లెక్కా? నీ ఉబలాటం మానేయ్.

**అఫ్జల్‌ఖాన్:** అది మానేయటమంటే మరి నన్ను నేను హత్య చేసుకోవటానికి నీవు అంగీకరిస్తావా?

**రజియా:** అయితే నీవు అతణ్ణి మోసం చేసి ఎదుర్కోటానికి ఒప్పుకుంటే నీవే అతని మీదికి వెళ్ళటానికి ఒప్పుకుంటాను.

**అఫ్జల్‌ఖాన్:** సాటి వీరుణ్ణి మోసగించటమా... పోనీ, అలానైనా ఒక మారు అతడితో పోరాడే అవకాశం లభిస్తుంది. సరే మోసగించటానికి ఒప్పుకుంటాను. ఇక ముందు జరగవలసింది.

**రజియా:** కృష్ణజీ! ఏమంటారు?

**కృష్ణజీ:** బాగుంది. మోసాన్ని తలపెట్టకుండా ఆ మహారాష్ట్ర సింహాన్ని పట్టుకోవటం సాధ్యమైన పని కాదనే నా అభిప్రాయం.

**అఫ్జల్‌ఖాన్:** ఒక మహావీరుడి చేతులలో మరణించానన్న ఖ్యాతి నాకు దక్కనీయండి. మోసగించి ఎదుర్కోవటం నాకు ఇష్టం లేదు.

**కృష్ణజీ:** మీరు అటువంటి సాహసానికి పూనుకుంటే ఇక బీజాపుర రాజ్యం పని ఏం కావాలి? మళ్ళీ మీరు మనస్సులో గిలి పెట్టుకోవద్దు.

**రజియా:** ఉపాయం ఏదైతేనేం శత్రువును చేజిక్కించుకోవటం ప్రధానం. అఫ్జల్! అనుభవశాలి, మన కృష్ణజీనే శివాజీ దగ్గరికి దూతగా పంపిద్దాము. మనం అతని స్నేహాన్ని కోరుతున్నట్లు, అందుకు నిదర్శనంగా అతడు గెలుచుకొన్న దుర్గాలను అతని కిచ్చేటట్లు చెప్పి పంపుదాము. అతడికి మన ఎడ మైత్రి ఉన్నట్లు ప్రదర్శించటానికి ప్రతాపగడంలో లేక మరెక్కడైనా సరే ఒంటరిగా మనను కలిసుకోవలసిందని చెప్పిద్దాము.

**అఫ్జల్‌ఖాన్:** అప్పుడు అతణ్ణి బందీ చేసి ద్వంద్వ యుద్ధం యిమ్మని కోరుతాను సోదరీ! మంచి పథకం ఆలోచించావు.

**కృష్ణజీ:** అఫ్జల్! మీ సోదరి అసామాన్య బుద్ధిబలం కలది. ఆ ఢిల్లీకి సుల్తానా కాదగ్గది.

**రజియా:** కృష్ణజీ మీరు సాధ్యమైనంత త్వరలో శివాజీని కలుసుకుని ఆహ్వానించి రావాలి. మనపని తప్పక సానుకూలంగా చేసుకో రావాలి.

## 3

**శివాజీ:** విశ్వాసరావ్! ఈనాడు చారుడు తెచ్చిన వార్త ఎంతో వింతగా ఉంది. సంధి చేసుకుంటారటనా? బీజాపురం వారు మనతో సంధి చేసుకుంటారటనా? ఉన్న మొగలాయిాల అండ కాస్తా ఊడిపోయిన ఈ స్థితిలో వారికి మనతో సంధి ఎందుకు? సఖ్యమెందుకు?

**విశ్వాసరావ్:** తమ బలపరాక్రమాలకు భయపడి సఖ్యం కోరుతున్నారేమో! కానివ్వండి. సంధే జరగనివ్వండి. పోయిందేముంది? బహుకాలం నుంచీ మన యోధులకు కంటికి నిద్రలేదు. కొన్నాళ్ళ పాటు సుఖపడతారు.

**జిజియాబాయి:** నాయనలారా! పొరపడకండి. దక్షిణ దేశమంతటా తమ కత్తికి ఎదురు కత్తి లేని యీ సమయంలో వాళ్ళు మీతో సంధిని కోరుతున్నారంటే ఇందులో ఏదో తప్పక మోసం ఉండి తీరుతుంది.

**విశ్వాసరావు:** మాయీ! మీరు అన్నది ఆలోచించవలసిన విషయమే. శివాజీ సూటి ఐన యుద్ధంలో మనం వాళ్ళకు చేజిక్కమని స్నేహాన్ని నటించి మనను చెరసాలలో పెట్టదలచి ఉంటారు.

**(ప్రభూ! బీజాపురం నుంచి ఎవరో దూతలు వచ్చారు అన్న వాక్యం వినిపిస్తుంది)**

**శివాజీ:** సగౌరవంగా ప్రవేశపెట్టు. దూతను కూడా పంపించారు. ఒకవేళ వారు ఏనాటికైనా బలవంతుల మౌతామనీ, మనతో మంచిగా ఉండటం వల్ల మంచే జరుగుతుందని కూడా వాళ్ళు ఊహించి ఉండవచ్చు.

**విశ్వాసరావు:** మన ఊహే నిజమైతే బీజాపుర పాలకులను భారత సామ్రాట్టులను చెయ్యగలం.

**కృష్ణజీ:** (ప్రవేశిస్తూ) శుభమస్తు! శివా! శుభమస్తు!! మాయీ నమస్కారము.

**శివాజీ:** మా తండ్రి షాజీవారికి కుశలమా? రజియాబేగంల వారికి క్షేమమా? మిగిలిన వారందరికీ శుభమా?

**కృష్ణజీ:** అక్కడ మీ తండ్రి షాజీవారికి కుశలం. వారిని బేగం మహా గౌరవంతో చూస్తున్నది. బేగం వారికి క్షేమం. చారుల వల్ల విన్నదట, ఎప్పుడూ నీ పౌరుష పరాక్రమాలను గురించి మాకు చెపుతుంటుంది. ఆమెకు నిన్ను తనవాణ్ణి చేసుకోవాలని ఎంతో కుతూహలంగా ఉంది.

**జిజియా:** అంతకంటే మాకు మాత్రం కావలసిందేముంది?

**విశ్వాసరావు:** మరి మా శివాజీ జయించుకొన్న దుర్గాల మాటేమిటి?

**కృష్ణజీ:** వాటితోబాటు మరికొన్ని కూడా ఇచ్చి అతణ్ణే పాలించమని చెప్పదలిచింది.

**జిజియా:** అయితే సంతోషం. ఇందుకు ప్రతిగా మా శివాజీ చేయవలసింది ఏమో సెలవిచ్చారు కాదు.

**కృష్ణజీ:** ఏమీ లేదు. ఒక్కమారు వారి సోదరుడు అఫ్జల్‌ఖాన్‌ను ఏకాంతంగా కలుసుకోవటం. ఒకరికొకరు పారితోషకాలిచ్చుకోవటం.

**శివాజీ:** అతడున్న చోటికి నేను రాలేను.

**కృష్ణజీ:** అయితే మరి?

**శివాజీ:** ఇరువురం ఏ ప్రతాపగడం దగ్గరో ఒకరి నొకరు కలుసు కుంటాము.

**కృష్ణజీ:** అతడు తన వెంట ఇరువురిని తెచ్చుకొంటాడు. నీవూ ఇరువురిని తెచ్చుకోవచ్చు. వచ్చే పంచమినాడు మీ సమావేశం. మరి అంగీకారమిస్తే నేను సెలవు తీసుకుంటాను.

**శివాజీ:** అమ్మా! ఇందుకు మీ అనుజ్ఞయేనా?

**కృష్ణజీ:** శివా! కష్టసుఖాలు ఎరిగిన నీవు బీజాపురంతో సఖ్యం చేసుకొంటానంటే వారు కాదంటారా?

**జిజియా:** కాదనను. కానీ ఆ జాతి నమ్మదగ్గది కాదు. అందులో తాము అఫ్జల్‌తో 'ఏకాంతంగా మా శివ' కలుసుకోవాలని కోరుతున్నారు. ఇందులో ఏమైనా మోసం ఉందా అని ఇంచుక సందేహంగా ఉంది.

**శివాజీ:** అమ్మగారన్నమాట అంత త్రోసివేయదగ్గది కాదు. కృష్ణజీ! మీరు సజ్జనులు. ఈ సంధి యత్నంలో ఏమీ మోసం లేదంటారా?

**కృష్ణజీ:** మోసం ఏమీ ఉండదనే నా అభిప్రాయం.

**జిజియా:** మీ కంఠధ్వనిని బట్టి నా అనుమానం అధికమౌతున్నది.

**కృష్ణజీ:** అనుమానించకండి. సఖ్యానికి అంగీకరించండి. సర్వం సాగిపోతుంది.

**విశ్వాసరావ్:** కృష్ణజీ! తాము బ్రాహ్మణోత్తములు.

**శివాజీ:** తాము గాయత్రి సాక్షిగా ఇందులో మోసం లేదని సెలవివ్వండి. నేను ఒంటిగానైనా ఆ అఫ్జల్‌ను కలుసుకోవటానికి ప్రతాపగడం దగ్గరకు వస్తాను.

**కృష్ణజీ:** నాయనా! నా చేత ప్రమాణ మెందుకు చేయిస్తావు. మహారాష్ట్ర సామ్రాజ్యాన్ని నిర్మించదలచుకున్నావు. నీవు నీ సైన్యాలతో ప్రతాపగడానికి రా. వాటిని చాటున నిల్పు. ఖాన్ కూడా సైన్యాలతో వస్తాడు. పోరాటానికి సిద్ధపడే రా! అందులో విజయం చేకున్నావో నీకు మహత్తరమైన భవిష్యత్తు ఉంది. మహారాజువౌతావు. నీకు శుభమగు గాక! కానీ ముందుగానే నీ సైన్యాన్ని బయట పెట్టి నాకు చిక్కు తెచ్చిపెట్టకు. మరి మాయీ సెలవు.

**జిజియా:** కృష్ణజీ! సెలవు! శివా! విశ్వాస్!! ఇక సైన్యాలను చేకూర్చుకోవటంలో త్వరపడండి. ప్రతాపగడానికి ప్రయాణం దగ్గరలోనే ఉంది.

## 4

**శివాజీ:** విశ్వాస్! ఈ ప్రతాపగడం ఎంత గొప్ప దుర్గమోయ్! ఇది ఇవాళ మన చేతికి చిక్కిందో బీజాపుర పాలకులనే కాదు, మొగలాయీ పాదుషాలను కూడా ఒక ఆట ఆడిస్తాను. సైన్యాలను తరలించుకో రమ్మని మోరేకు ఆజ్ఞ ఇచ్చి వచ్చావా?

**విశ్వాస్:** అదుగో ఆ గుట్టమీదుగా చూడు చీమల బారుల్లా వస్తున్నది మన సైన్యమే. వెంట జిజియా బాయి కూడా వస్తున్నది. ఈనాటి మీ పోరాటాన్ని చూడాలట. – నీవు ఇనప చొక్కా జాగ్రత్తగా వేసుకున్నావు కదూ! పులిగోళ్ళు జాగ్రత్త. పూర్తిగా ఆ అఫ్జల్ డొక్కలో దిగిపోవాలి సుమా!

**శివాజీ:** అదుగో దూరంగా ఎవరో ముగ్గురు ఆశ్వికులు గుఱ్ఱాలుదిగి నడిచి వస్తున్నారు.

**విశ్వాసరావ్:** ఇంకా అనుమానమెందుకు? అతడు అఫ్జల్. అదుగో దూరంగా అతడి సైన్యం చుట్టూ తిరిగి వస్తున్నట్లున్నది. లేకపోతే అటువైపు ఆకాశం అలా దుమ్ముతో ఎందుకు నిండిపోతుంది.

**శివాజీ:** అఫ్జల్ నా దగ్గరకు వచ్చేదాకా మన గుడారంలో ఉండిపోదాం. విశ్వాస్ నా శరీరం ఇవాళ ఎందుకో పొంగిపోయి తొడిగిన ఇనుప చొక్కాను బ్రద్దలు కొడుతుందా అనిపిస్తున్నది.

**అఫ్జల్:** పాపం! అమాయకుడు. మాట ఇచ్చినట్లుగా శివాజీ ఒంటరిగానే వచ్చినట్లున్నాడు. రజియా! నా పరాక్రమాన్ని ఈనాడు చూచి ఆనందించు. నాకు సాటి ఐన ఉజ్జీ దొరికాడు. నీకు నా శక్తిని చూపించటం కోసమే ఇలా పురుష వేషంతో నిన్ను పిలుచుకో వచ్చాను.

**రజియా:** అఫ్జల్, అతడి దగ్గరికి వస్తున్న కొద్దీ నాకేమిటో భయం వేస్తున్నది. పోరాడేటప్పుడు జాగ్రత్త సుమా!

**అఫ్జల్:** సోదరీ! నీవు ఇంత పిరికిదానివనుకోలేదు. చాలా దగ్గరికి వచ్చాము. అదుగో నాకోసం శివాజీ గుడారం ముందు వేచి ఉన్నాడు. ఇకనుంచి నీవు నా సేవకుడివిగా వెనక రావాలి! పోరాడుతున్నప్పుడు ఒకవేళ మొదట నాకేమైనా దెబ్బ తగిలితే బయటపడిపొయ్యేవు. ఏ ప్రమాదమైనా జరగవచ్చు.

**శివాజీ:** విశ్వాస్! మనం అఫ్జల్‌కు ఎదురు వెళ్ళి ఆహ్వానిద్దామా?

**(అఫ్జల్ ఖాన్‌కు జై)**

**అఫ్జల్ ఖాన్:** శివాజీకి జై! మిత్రుడా శివాజీ!

**శివాజీ:** నెచ్చెలీ అఫ్జల్!

**అఫ్జల్:** శివాజీ! నీ కంఠమెంత తీయనైంది. ఏదీ, రా ఒక్కమారు నా బాహువుల్లోకి వచ్చి మనఃపూర్వకంగా నన్ను కౌగిలించుకో.

**శివాజీ:** అఫ్జల్! నీవు మహావీరుడిలా వున్నావు, ఏదీ ఒక్కమారు నన్ను గాఢంగా కౌగిలించుకో

**అఫ్జల్:** ద్రోహి! రాజద్రోహి!! శివాజీ దేశాన్ని కొల్లగొట్టుతూ అరాజకం చేసే ద్రోహి... నా చేతుల్లో నలిగిపో... నలిగిపో...

**శివాజీ:** మిత్రద్రోహి! సఖ్యానికని పిలిచి... చంపటానికి పూనుకొన్న ద్రోహం... అబ్బా.

**విశ్వాసరావ్:** ప్రభూ! త్రిప్పికొట్టు.

**శివాజీ:** ఏదీ! ఇందాకేమన్నావో చెప్పు! ఈ పులిగోళ్ళు చూచావా? నీ జాతిని నమ్మకూడదనే జాగ్రత్త పడే వచ్చాను. ఇనుప చొక్కాను తొడిగాను. ఇవిగో పులిగోళ్ళు. నీ కడుపులో గుచ్చి చీల్చి వేస్తాను.

(ఇంతలో ఉభయసైన్యాలు అఫ్జల్‌ఖాన్‌కు జై, శివాజీకీ జై అని తారసిల్లిన ధ్వనులు) (యుద్ధ దుందుభులు... యుద్ధం జరుగుతుంది) ఛీ! పాపీ! నిన్ను పూర్తిగా చంపదలచలేదు. విడిచి పెడుతున్నాను. పో పారిపో. అపకీర్తి వెన్నాడుతూ నీ వెంట వస్తుంది పారిపో.

**అఫ్జల్:** అబ్బా! బాధ!! నిన్ను మోసగించాను. నీ కత్తితో చంపు. నాకు కీర్తి దక్కుతుంది.

**శివాజీ:** విశ్వాస్! వీడిని మన సైన్యంలోకి తరుముకో పో!

**విశ్వాస్:** పద! తులువా పద!

**శివాజీ:** మోరే! వీరుణ్ణి చిత్రవధ చేయకండి. పాపం గొప్ప పుటక పుట్టాడు. (సోదరా ఎంత చెప్పినా వినక ఎంత ఆపద తెచ్చుకున్నావు)

**విశ్వాసరావు:** ప్రభూ! మోరే దుర్గపాలకులను ఓడించి ప్రతాప గడాన్ని పట్టుకుని మన భగవధ్వజాన్ని ప్రతిష్ఠించాడు. అదుగో అటు చూడు. జిజియా బాయి వందన సమర్పణం చేస్తున్నది. మన సైన్యం కోలాహలంగా ముందుకు వస్తున్నది.

**(జై శివాజీ మహారాజుకు జై, జై జిజియా బాయికి జై)**

**జిజియా:** నాయనా శివా! శత్రువును సంహరించి నాకు మహా సంతోషాన్ని కల్పించావు. నీ పోరాటం సర్వం  చూస్తున్నాను. ఇవే నా ఆశీస్సులు. భావి భారత సామ్రాట్టువి నాయనా!

**శివాజీ:** అమ్మ నీ ఆశీర్వాదబలం అమ్మ భవానీదేవి కృప వుంటే తప్పక భారత సామ్రాట్టు నౌతాను. జై భవానీ మాతకి జై, జై జిజియా బాయికి జై.

**(సైనికులు జై భవానీ మాతకి జై, జిజియా బాయికి జై అని ప్రతిధ్వనిస్తారు)**

*ఎ.ఐ.ఆర్. విజయవాడ **28-11-1958***

# నాలుగు దారులు

## 1

**మాళవగౌడరాగంలో ఏకతాళంలో**
**"సజి హో కేశిమధన ముదారం రమయ మయా సహ**
**మదన మనోరథ భావితయా సవికారమ్**
**కిసలయ శయన నివేశితయా చిర మురసి మమైవ శయానమ్**
**కృత పరిరంభణ చుంబనయా పరిరభ్య కృతాధరపానమ్"**

అన్న అష్టపదిని రాధమ్మ పరవశురాలై పాడుతూ నృత్యం చేస్తుండటం వినిపిస్తుంటుంది. చుట్టూ ఉన్న భక్తులు, భక్తురాండ్రు 'ఓహో! ఏం పారవశ్యం!! ఏం తన్మయత్వం!! సాక్షాత్తు గోలోకంలోని రాధాదేవే మనకోసం మళ్ళీ అవతరించింది. ఓహోహో...', 'చూడు, చూడు ఆ ముసి ముసి నవ్వులు. ఏమబ్బా! అంతలోనే అలా చిన్నబుచ్చుకున్నదేం' అన్నమాటలు వినిపిస్తుంటవి)

**రాధమ్మ:** (దీనంగా) కృష్ణా! కృష్ణా!! మోహన కృష్ణా!! మురళీ కృష్ణా!! మరపించి మాయమై పోతున్నావా! నా పాట బాగులేదా! నా ఆట బాగు లేదా! దొంగవు వెళ్ళి పోయావా! మానసచోరా! మళ్ళీ రావూ! చిన్ననాడు మీ అమ్మ నిన్ను రోటికి కట్టేసినట్లు గట్టిగా పట్టెమంచానికి కట్టేస్తాను... ఆc... ఏమన్నాను... కృష్ణా! అపచారం చేశాను. నిన్ను కట్టివేస్తానన్నానా? నీ భక్తురాలిని. చరణదాసిని. ప్రియరాలిని. క్షమించు. కృష్ణా! కృష్ణా!!

(ఇష్. నిశ్శబ్దం. ఆటవల్ల అలసిపోయింది. సంకీర్తన ప్రారంభించండి. హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే అన్న భక్తుల భజన వినిపిస్తుంది)

**రాధమ్మ:** (అలసిన గొంతుకతో, కూనిరాగంతో)

**నీ మురళి పాటలో, నే కలిసిపోయెదను**
**నీవె నా గతి వోయి నీవె నా పతి వోయి**

(నెమ్మదిగా భక్తులు భజన చేస్తుంటారు. 'రాధాదేవీ!! రాధాదేవీ!' అన్న పిలుపులు వినిపిస్తుంటాయి)

**జోగన్న:** (ప్రవేశిస్తూ) వెంకా!! ఓరి వెంకా!! బాగుంది తంతు. బ్రహ్మాండమైన మా అన్నగారి యజ్ఞశాల భక్తుల భజన కూటంగా మారిపోయిందన్నమాట. మహాభక్తా గ్రేసరులారా! ఒక్క మనవి. యజన యాజన పరులు, తపస్సంపన్నులు, మహాజ్ఞానులు పుట్టిన మా యింట్లో మళ్లీ ఎన్నడూ ఇలాంటి భజనలు జరగవు. దయ ఉంచి తామంతా ఇళ్ళకు దయచేయండి. వెంకా!! ఓరి వెంకా!! (భక్తులు వెళ్లుతున్న కోలాహలం)

**వెంకడు:** (ప్రవేశిస్తూ) చిన్నబాబుగారా! దేశంలోకి ఎప్పుడు వచ్చారు బాబయ్యా! ఇక్కడ సంగతులన్నీ తమకు ఎన్ని ఉత్తరాలు వ్రాయించాను బాబయ్యా! మీరూ లేరు. ఉత్తరం లేదు.

**జోగన్న:** అలా సంచారం వెళ్ళానోయ్. అన్నగారు సన్యసించారని తెలిసి అతడ్ని చూసి వెళ్ళి వస్తున్నాను.

**వెంకడు:** ఎవరు? పెద్దబాబుగారా బాబయ్య! సన్యసించారా! వారు చెప్పుకొన్న వేదమంతా ఏం చేశారు బాబయ్యా! ఎన్ని దానాలు ఎన్ని ధర్మాలు. ఆయన మహాదొడ్డ దొర బాబయ్యా! వారు వెళ్ళిపోయినప్పటినుంచీ ఈ ఇల్లంతా గల్లంతు అయింది బాబయ్యా! అమ్మాయిగారు ఎప్పుడూ ఇలాగే ఒళ్ళు తెలియకుండా ఏమేమో పాడి, ఆడి స్మృతి లేకుండా పడి పోతున్నారు బాబయ్యా! అబ్బాయిగారు...

**జోగన్న:** ఈ శ్యామలకు ఈ పిచ్చి ఎన్నాళ్ళనుంచిరా వెంకా!!

**వెంకడు:** బాబయ్యా! నాలుగు నెలలకు పూర్వం ఎవరో నారాయణమ్మ గారట, మహాభక్తురాలట, వచ్చి మన ఇంట్లో 'నాలుగు దారుల'ను గురించి ఏవో గీతోపన్యాసాలిచ్చి భజనలు చేయించింది. అమ్మాయిగారికి రాధాదేవి అని పేరు పెట్టింది. అప్పటినుంచీ అమ్మాయిగారు...

**జోగన్న:** ఈ వెట్టిలో పడ్డదన్నమాట!

**వెంకడు:** ఒకప్పుడైతే రెండు మూడు రోజులు అన్నం కూడా లేకుండా అలాగే మైకంలో ఉండిపోతుంటుంది బాబయ్యా! అదుగో అమ్మాయిగారికి తెలివి వస్తున్నట్లుంది.

**జోగన్న:** శ్యామలా! శ్యామలా!!

**వెంకడు:** బాబయ్యా! అలాగే ఏవో ముసి ముసి నవ్వులు నవ్వుతుంటుంది.

**జోగన్న:** శ్యామలా! శ్యామలా!!

**రాధమ్మ:** ఎవరు? నీవా? వచ్చావా? శ్యామ సుందరా! (కూనిరాగంతో)

**నన్ను వలచి వచ్చితివ**
**నందసుతా! సుందరుడా!!**

**జోగన్న:** ఇటువంటి ఇంట్లో పుట్టిన నీకు ఏం ఖర్మ పట్టింది తల్లీ! శ్యామలా!

**రాధమ్మ:** కృష్ణా! కృష్ణా!! వచ్చావా!!

**జోగన్న:** కృష్ణుణ్ణి కాదమ్మ! నీ బాబయ్యను జోగన్నను వచ్చాను.

**వెంకడు:** అమ్మా! రాధమ్మగారూ! మీ బాబయ్యగారు, చినబాబుగారు వచ్చారమ్మా! పెదబాబుగారిని చూచి వచ్చారుటమ్మా!

**రాధమ్మ:** ఎవరు? వెంకా!!

**జోగన్న:** వెంకా! ఇక నువ్వు వెళ్ళి నేను వచ్చానని చెప్పి అబ్బాయిని ఎక్కడున్నా సరే తీసుకురా! ఊ<sub></sub> వెంటనే వెళ్ళు.

**రాధమ్మ:** ఎవరది? బాబయ్యా! ఎప్పుడు వచ్చావు?

**జోగన్న:** పది నెలలు సంచారం చేసి మొన్ననే ఇంటికి వచ్చాను. వెంకడు వ్రాయించిన ఉత్తరాలు చదువుకొని గుండె నీరై వెంటనే ఇలా కొట్టుకో వచ్చాను. ఈ భక్తులేమిటి? ఈ భజనలేమిటి? ఎంత పిచ్చిలో పడ్డావమ్మా?

**రాధమ్మ:** సర్వజన ప్రియుడైన కృష్ణ పరమాత్మను భక్తితో సేవించటంలో పిచ్చేముంది బాబయ్యా! నాన్నగారు వెళ్ళిపోయిన తరువాత మహాభక్తురాలు నారాయణమ్మ ఇంత కృపావీక్షణం నామీద ప్రదర్శించింది. 'నాలుగు దారుల్లో' సర్వోత్కృష్ట మైంది భక్తని తెలుసుకున్నాను.

**జోగన్న:** భక్తితో భగవంతుణ్ణి సేవించటం చెడ్డ మార్గమని ఎవరంటారు? కానీ అమ్మా! శ్యామలా! నా కడుపున పుట్టిన మాణిక్యం కంటే నీవంటే నాకెంతో మమకారమమ్మా! అర్థరహితంగా చిన్నతనంలోనే ఆత్మహత్య చేసుకొని మా అల్లుడు నిన్ను నట్టేటిలో ముంచినప్పుడు నమ్ము శ్యామలా నేను నాలుగు రోజులు అన్నం కూడా ముట్టలేదు.

**రాధమ్మ:** వారు నట్టేటిలో ముంచటం వల్లనే నాకు గట్టి మార్గం దొరికింది. అర్చావతారుడు భక్తలోక మందారుడు అయిన ఆ కృష్ణ పరమాత్మ యందు అన్యచింతలన్నీ విడిచిపుచ్చి మనస్సును, బుద్ధిని లగ్నం చేశాను. గోపిక నైనాను. రాధనైనాను. 'మయ్యర్పిత మనో బుద్ధి ర్యోమే భక్తః సమే ప్రియః' అన్న గీతా వాక్యాన్ని తరిచి చూచాను. భక్తి మార్గమే నాలుగు దారుల్లో సర్వశ్రేష్ఠమని బోధపడింది.

**జోగన్న:** నిర్వహించవలసిన లోక ధర్మాలను, నిత్య నైమిత్తిక కర్మలను విడిచి పుచ్చి ఇష్టం వచ్చినట్లు వ్యవహరించటం ఉత్తమ మార్గం కాదమ్మా! ఉత్తమ మార్గమే కాదు గీతా మార్గం కూడా కాదు. అదీకాక నీ మధురభక్తి మహా ప్రమాదకారి కూడాను. ఇది పరిణత బుద్ధులకు గాని నీకు మార్గం కాదమ్మా!

**రాధమ్మ:** 'సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ' – అన్న గీతా వాక్యాన్ని స్త్రీనైన నా పరంగా సమన్వయించుకొంటే మధురభక్తి మార్గమే మార్గమని నాకు నిర్ణయమైంది. నాలుగు దారుల్లో భక్తి ఉత్తమమైంది. అందులో మధురభక్తి మహోత్కృష్టమైంది.

**జోగన్న:** అమ్మా శ్యామలా! నీవు చెప్పేదంతా అపసవ్యంగా ఉంది. తెలిసీ తెలియని వాళ్ళందరూ ఈనాడు గీతకు అర్థాలు చెప్పటం ప్రారంభించారు. అందువల్లనే అపమార్గాలు బయలుదేరాయి. గీత కీకారణ్యం వంటి గ్రంథం. సంప్రదాయ సిద్ధమైన భాష్యం వినాలి. అది కర్మత్యాగం చెయ్యమని ఎక్కడా చెప్పలేదు. కర్మమార్గం కష్టసాధ్యమైంది కనుక అలస స్వభావులు సులభమైన అన్య మార్గాలను అన్వేషిస్తుంటారు! 'స్వధర్మ నిర్వహణ శ్రేయం పరధర్మం భయావహమ్' – అన్న మకుటాయమానమైన గీతా వాక్యాన్ని బహుకాల కర్మాచరణంతో అనుసంధించి తరిచి చూడటం నేర్చుకో. మన పెద్దల మార్గాన్ని అనుసరించు.

**రాధమ్మ:** మీరన్న వాక్యంలో స్వధర్మ శబ్దానికి మనోధర్మమని అర్థం. మన పూర్వులు వారి వారి మనోధర్మాలను అనుసరించారు. 'ప్రణయదాస్యం' నా మనోధర్మం. సమస్త దాస్య భావాలల్లో సత్వర మోక్షసిద్ధికి సాధనం. అందువల్ల నేను దానిని అనుసరిస్తున్నాను. లౌకికాలైన రాగద్వేషాలను, కామ క్రోధాలను త్రెంచుకొన్న నన్ను మళ్ళీ కర్మబంధాలతో సంసార చక్రానికి కట్టి పడేయవద్దు.

**జోగన్న:** తీర్చి దిద్దుకోబోయే పెద్దలు ఇంట్లో లేకపోవటం వల్లా, తీరని కోర్కెలు తికమక పెట్టటం వల్లా నిరాశను పొంది నీవీ అపమార్గాన్ని పట్టావు. మోక్షం ఇంత చులకనగా

ఇట్టే చేజిక్కేదా? అయితే అందరికీ మోక్షం వచ్చి జీవులకు సమాప్తి కలిగి ఉండేది. 'మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే' అన్న గీతా వాక్యంలో ఎవ్వడో ఒక్కడే ఎప్పుడో ఒకప్పుడే కైవల్య మోక్షాన్ని పొందుతాడని గీతాకారుడు చెప్పలేదూ? సన్యసించిన అన్నగారు సర్వజ్ఞులు. వారిని అబ్బాయి వివాహ సమయానికి మన ఊరు రమ్మని ప్రార్థించి వచ్చాను. వారివల్ల సన్మార్గమేదో తెలుసు కొందువుగాని అమ్మా!...

**రాధమ్మ:** ఎవరెన్ని చెప్పినా బాబయ్యా మళ్ళీ నా మనస్సును మార్చలేరు. కర్మాచరణంతో నన్ను కట్టి పడవేయలేరు.

**జోగన్న:** మీ అమ్మగారు చనిపోవటం, నాన్నగారు సన్యసించటంతో గృహనిర్వహణ భారమంతా నీమీద పడింది. శ్యామలా! నీవు ఇలా అయిపోతే తమ్ముడు చెడ్డ సహవాసాలకు పూనుకుంటున్నాడు. ఇంకో చెల్లెలికి పెళ్ళి కావలసి ఉంది. నేను అనేదంతా ఏకాంతంగా ఆలోచించుకో - అబ్బాయి కోసం వెళ్ళిన వెంకడు ఇంకా రాలేదు.

**రాధమ్మ:** వాడు స్వర్ణయోగం కోసం కొన్నాళ్ళబట్టీ ఒక యోగిని సేవిస్తున్నాడు. బహుశః ఊరుబయట పాడుపడ్డ శివాలయం దగ్గరికి వెళ్ళి ఉంటాడు. అబ్బాయి కూడా అక్కడే ఉండవచ్చు.

**జోగన్న:** వాడు కూడా ఆ యోగిని సేవిస్తున్నాడా ఏమిటి? కర్మిష్ఠుల కుటుంబానికి ఎట్టి కష్టకాలం వచ్చింది. సరే! నా దేవతార్చనకు యత్నం చేయించు. అక్కడ బల్లమీద ఉన్న మడి సంచిలో నా అంగవస్త్రం ఉంది. మడికి ఆరేయించు. నేను అబ్బాయి సంగతి ఏమిటో కనుక్కొని వస్తాను.

## 2

**"శివ శివాయన మేలు తుమ్మెదా!**
**నీకు**
**శివయంటె విన మేలు తుమ్మెదా నీకు!!**
**చిత్తమేకాగ్రతకు**
**చేర్చి నిల్పిన నీకు**
**సిద్ధి చేకూరునే తుమ్మెదా నీకు!**

**నీకు**

**శివలోక మబ్బునే తుమ్మెదా!!**

అన్న పదాన్ని శంకరం వెంకడు పాడుతుంటారు.

**శంకరం:** వెంకా! నెగడు ఎగసన తొయ్యి! నేను ఈ చిలుము బాగు చేసి గురువుగారు కన్నులు తెరిచేటప్పటికి సిద్ధం చేస్తాను. (కూనరాగంతో 'సిద్ధులను సేవింప తుమ్మెదా నీకు సకలార్థ సిద్ధి యొడగూడునే తుమ్మెదా!' అని పాడుతూ) వెంకా! యోగివారు క్రొత్త శక్తులేమైనా చూపించారా?

ఆయన కెన్ని శక్తులుంటే ఏం బాబూ! ఇన్నాళ్ళబట్టీ కొలుస్తున్నాం కదా. ఇంత బంగారం చెయ్యటమన్నా మనకు చెప్పలేదు. చెప్పలేదంటే జ్ఞప్తికి వచ్చింది బాబూ! నిన్న మీ బాబయ్యగారు మన ఊరికి వచ్చారు. మిమ్మల్ని వెంటనే పిలుచుకురమ్మన్నారు. చెప్పటం మరిచి పోయాను బాబూ!!

**శంకరం:** ముంచుకో పోయింది ఏమీ లేదులే. చెప్పినా వెళ్ళేవాణ్ణి కాదు. ఈ మాటు గురువుగారిని కొన్ని ప్రశ్నలడిగి కాని ఇంటికి వెళ్ళదలచుకోలేదు.

**వెంకడు:** ఆయనగారికి కోపం వస్తుందేమో బాబూ!

**శంకరం:** సంసారాన్ని వదులుకొన్నవాడిని ఆయన కోపం నన్నేం చేస్తుందిరా! వెంకా! గురువుగారు సమాధి చాలించేటట్లున్నారు చూడు!

**వెంకడు:** అవును బాబూ! లక్షణం అలాగే ఉంది. మనం పంచాక్షరి చేస్తుందాము. (ఇద్దరూ 'ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ' అంటుంటారు)

**శంకరం:** ఓం నమశ్శివాయ... జై సదాశివ యోగీంద్రులకు జై. (వెంకడు 'జై' అంటాడు.)

**సదాశివయోగి:** మహదేవ్! మహదేవ్! శంభో శంకర్!! సదాశివ శంకర్!! శంకర యోగీ! వెంకటయోగీ! కైలాసంలో పార్వతీ పరమేశ్వరులను సందర్శించి వచ్చాను. వారు ఎంతో ప్రేమతో మీ పేర్లు చెప్పి క్షేమంగా ఉన్నారా అని ప్రశ్నించారు. పరమ శివుడు మీకు ఈ విభూతిని పార్వతి ఈ కుంకుమను ఇచ్చారు.

**శంకరం:** మహా ప్రసాదం! వెంకా పుచ్చుకో!! శంకరం ఇదుగో గురువుగారికీ చిలప అందించు.

**యోగి:** (గంజాయి పీలుస్తున్న చప్పుడుతో) జయ్‌శంకర్! (గాలి విడుస్తూ) జయ్ మహదేవ్!!

**వెంకడు:** స్వామీ! తాము ఇక్కడనే ఉన్నారు గదా  తెలియకడుగుతున్నాను, కైలాసానికి ఎలా వెళ్ళి వచ్చారు?

**యోగి:** (నవ్వుతూ) వెంకట యోగీ! ఆత్మశక్తి చేత మేము అణిమాద్యష్ట సిద్ధులను సంపాదించాం. 'ఖేచరీ విద్య'తో ఒక కైలాస మేమిటి, ఇంద్ర, మహేంద్ర, బ్రహ్మలోకాలన్నీ తిరిగి క్రీడించి వస్తుంటాము.

**శంకరం:** గురుదేవా! ఇదంతా వేటి సహాయంతో...

**యోగి:** (చిఋ కోపంతో) వేటి సహాయంతోనా! పవమాన రూపంలో. అంగరూపాలైన మనస్సుతో, ఇంద్రియాలతో... సరి. చిత్తనిరోధం చెయ్యటంలో మీ రెంతవరకు వచ్చారు? గురుదేవులే మీకు సర్వమని భావించగలుగుతున్నారా? ఇవి మీకు కుదిరితే సమాధి నిమగ్నులై తేజోమయమైన ఆత్మ స్వరూపాన్ని దర్శించటం మీకు నేర్పుతాను. సంశయించటం మాని వేశారా?

**వెంకడు:** స్వామీ! తాము వెనక చెప్పింది నాకేమీ తలకెక్కలేదు. నిత్యమూ మీకు పాలు తెచ్చి యివ్వటం, మీ దర్శనం చేసి ఇంత చిలుము పట్టటం తెలిసింది.

**యోగి:** అయితే ఇప్పుడిప్పుడే గురుభక్తి కుదురుకొంటున్నదన్నమాట!

**శంకరం:** గురుదేవా! గీతలో పరమాత్మ 'సంశయాత్మా వినశ్యతి' అని చెప్పినా సంశయించటం మానవ స్వభావమై పోయింది. అందులో చెప్పిన నాలుగు దారుల్లో 'ధ్యాన యోగం' సర్వోత్తమమైంది.

ఇలా తమకు కోపం వస్తే నేనేమీ అడగనులెండి.

**యోగి:** (నవ్వుతూ) మీకు శిష్యులై ఉండి చిత్త నిరోధం చెయ్యలేక సంశయించినప్పుడు మాకు కొంత కోపం రావటం కద్దు. అంతటితో భయపడవద్దు. శంకర యోగీ! అడగలదలచిందేమిటో కానీ...

**శంకరం:** గీతలో చెప్పిన భక్తి, కర్మ, ధ్యాన, జ్ఞానాలనే నాలుగు మార్గాలల్లో...

**యోగి:** 'ముక్తిమార్గం ధ్యానమొక్కటే' భగవంతుడు వేరు – జీవుడు వేరు, ఆయనకు దాస్యం చెయ్యటమే ముక్తి అని చెప్పే భక్తిమార్గం ఉపాసకుడికి ఆరంభ దశలో కొంత

ఉపకరిస్తుంది. కర్మత్యాగం చేస్తేగాని సమాధిస్థితి రానప్పుడు, అందుకు కామక్రోధాలను చంపుకోవలసి ఉండగా, భోగాసక్తిని పురికొల్పే శ్రౌత కర్మలను ఆచరించమని చెప్పే కర్మమార్గం అర్థం లేనిది. యోగకర్మా చరణం వల్ల బ్రహ్మజ్ఞానానికి అధికారం లభిస్తుంది.

**శంకరం :** అప్పుడీ జ్ఞానంతో జీవుడు ధ్యానయోగాన్ని అనుసరించి సమాధి స్థితిని పొంది, చైతన్యరూపాన్ని దర్శించి, సంసారబంధం వల్ల కలిగిన అజ్ఞానం చేత – అంటే మాయ చేత – లోపించిన సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాదులను సంపాదించి యోగీశ్వర సార్వభౌముడైన మహాదేవుడిలా అష్టసిద్ధుడౌతాడన్నమాట!

**యోగి:** (నిష్కర్షగా) అంటే. శంకరయోగీ! ఇప్పుడు నీకు సన్మార్గం బోధపడింది. ఇక సంశయించటం మానివెయ్యి!

**వెంకడు:** ఇదంతా నాకేమిటో అయోమయంగా ఉంది. స్వామీ! నాకు మీరు చెప్పదలచుకొన్న విద్య ఆ 'స్వర్ణయోగం'తో ఆరంభించండి. ఇంత బంగారం చేసి ఇంట్లో పడేసి వస్తేనే గాని నేను చిత్త నిరోధం చెయ్యగలిగేట్లు లేదు. అందాకా మిమ్మల్ని భక్తితో సేవిస్తాను.

**యోగి:** (నవ్వుతూ) వెంకట యోగీ! అలాగే చేద్దాం. ఇదుగో! ఈ చిలప పుచ్చుకో!

**వెంకడు:** స్వామీ! కైలాసానికి వెళ్ళి వచ్చానంటున్నారు, మీ కాళ్లెంత నొప్పులు పెడుతున్నాయో! అనుగ్రహిస్తే పిసుకుతాను.

**శంకరం:** నన్ను కూడా అనుగ్రహించండి!!

**యోగి:** జయ్ మహాదేవ! శిష్యుల కోర్కెలను కాదనటం మా మతం కాదు. కానివ్వండి. (శంకరం, వెంకడు, యోగి కాళ్ళు పడుతుంటారు. యోగి 'ఓం నమశ్శివాయ అంటూ 'గురునకు హరునకు తుమ్మెదా! అంతరువు లేదు నిజము తుమ్మెదా!' అని పాడుతూ మధ్య మధ్య 'అబ్బ' అంటుంటాడు.)

**జోగన్న:** (ప్రవేశిస్తూ "సాధుకారీ సాధుర్భవతి. పాపకారీ పాపోః భవతి. పుణ్యం పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన" అన్న శ్రుతి పాఠాన్ని హఠాత్తుగా ఆపి) శంకరం!! శంకరం!! ఆరి భ్రష్టుడా!! సదాచార సంపత్తి గల సత్కుటుంబంలో పుట్టావు. స్వాధ్యాయం చేశావు. ఈ దొంగ యోగి కాళ్ళు పట్టటానికి నీకేం ఖర్మ పట్టిందిరా! పాడుపడ్డ ఈ శివాలయమేమిటి? ఈ గడ్డాలు, మీసాలు ఏమిటి? బాగుంది. కడుపు నిండేటట్లుంది.

అది అలా!! నీవు ఇలా!!... పద ఇంటికి. అబ్బాయిని పిలుచుకో వస్తానని నిన్న వచ్చినవాడివి నీవూ ఇక్కడే చచ్చావు? ఇక్కడున్నట్లుగా వాణ్ణి ఇంటికి తీసుకోరా. లేకపోతే నీ తాట వొలిపిస్తాను.

**స్వామి:** అయ్యా! తామెవరో కాలాగ్ని రుద్రుల్లా వచ్చారు. కానీ వీళ్ళిద్దరూ ధ్యాన యోగసిద్ధిలో ఎన్నో భూమికలు గడిచినవాళ్లు. బలవంతపెట్టి సంసారంలో పడేయకండి. ఇది పాపం!!

**జోగన్న:** అయ్యా! దొంగ యోగీ!! నిన్ను గురించీ నీ ధ్యానయోగాన్ని గురించీ ఎంతో విన్నాను. నీ గారడీలతో తెలిసీ తెలియనివాళ్ళను ఇలాగే వశం చేసుకొని కర్మభ్రష్టులను చేస్తున్నావట! నీవల్ల కమ్మని సంసారాలు పాడౌతున్నవి. నిన్ను చేరినవాళ్ళకు మోక్షం కలగటం మాట ఎట్లా ఉన్నా నీకు మాత్రం నరకం తప్పదు.

**యోగి:** (నవ్వుతూ) అజ్ఞానం! అష్టసిద్ధులను సంపాదించిన మాకు నరకమా! అర్థరహితమైన కర్మిష్ఠులు ఇలాగే అంటారు. యోగమార్గంలో...

**జోగన్న:** యోగం లేదు జోగం లేదు. ఇక కట్టిపెట్టు. నేను నీ దగ్గరికి జ్ఞానోపదేశం కోసం రాలేదు. పిల్లవాణ్ణి పిలుచుకో పోవటానికి వచ్చాను. ఓ కపట యోగీ! మంచి మాటలు చెప్పి మావాణ్ణి ఇంటికి పంపించు. లేకపోతే నీకు ఈ ఊళ్ళోనే జీవసమాధి చేయించకపోతే నా పేరు జోగన్నే కాదు. నేను యజ్ఞ నారాయణ దీక్షితుల తమ్ముణ్ణే కాదు.

**స్వామి:** (పెద్దపెట్టున నవ్వుతా) ఇది అన్యాయం! దౌర్జన్యం!! అజ్ఞానం.

**జోగన్న:** ఏడిచావు నీవు మహాజ్ఞానివి! మేము అజ్ఞానులం!!! ఒరేయ్ శంకరం ఇంకా బయలుదేరవేం ఇంటికి... ఓరి వెంకా! వాణ్ణి వెంట బెట్టుకోరా!

**శంకరం:** నేను రాను బాబయ్యా! ఆ చయనులగారి అమ్మాయిని పెళ్ళి చేసుకోను.

**జోగన్న:** (కోపంతో) చేసుకోవూ. యజ్ఞోపవీతం కూడా తీసేసి ఘోటక బ్రహ్మచారిలా ఉండి ఈ కపటయోగి కాళ్ళు పడుతుంటావు. ఎలా చేసుకోవో చూస్తాను. భ్రష్టుడివైన నీకు ప్రాయశ్చిత్తం చేయించి బలవంతాన్నయినా సరే చయనుల గారి పిల్లనిచ్చి పెళ్ళి చేయిస్తాను. యోగీ!! పిల్లవాణ్ణి పంపించు. వెంకా!! వాణ్ణి వెంట బెట్టుకురా!!

## 3

**చయనులు:** (శిష్యుల చేత అగ్నికార్యం చేయిస్తూ "స్వస్తి శ్రద్ధాం మేధాం యశః ప్రజ్ఞాం విద్యాం బుద్ధిం శ్రియం బలం ఆయుష్యం తేజ ఆరోగ్యం దేహిమే హవ్యవాహన, శ్రియం దేహిమే హవ్యవాహన" అన్న మంత్రాన్ని తాను చెపుతూ బ్రహ్మచారులచేత అనిపిస్తుంటాడు).

**సూరమ్మ:** ఏమండోయ్ మిమ్మల్నే. మీ కర్మలేమో మీరేమో! కాస్తయినా ఇంటి సంగతి పట్టించుకోకపోతే ఎలా చచ్చేది?

**చయనులు:** అగ్నికార్యం చేయించి వచ్చే ఇంతలోనే అంత ముంచుకోపోయేది. ఏం వచ్చి పడ్డది.

**సూరమ్మ:** ఇంకా ఏం వచ్చి పడాలి. పెద్ద మనిషి అయిన పిల్లను ఏడాది దాటినా ఇంకా ఇంట్లో పెట్టుకొని కూర్చున్నామా? అమ్మలక్క లేమంటున్నారో యజ్ఞశాల దాటిరాని మీకేం తెలుస్తుంది. వినలేక చెవులు చిల్లులు పడిపోతున్నవి. తాంబూలాలు పుచ్చుకొని కూడా ఏడాది దాటి పోవస్తున్నది.

**చయనులు:** అమ్మా! అలా తొందరపడితే ఎలా. ఆ యజ్ఞేశ్వరుడి కృప ఎప్పటికుందో అప్పటికి గాని ఏ పనీ జరగదు. ఆమె పోయిన తరువాత యజ్ఞ నారాయణ ఎక్కడికో వెళ్ళి సన్యాసం పుచ్చుకున్నాడు. అతని తమ్ముడు జోగన్న సంచారానికి వెళ్లి తిరిగి వచ్చినట్లు తెలిసి ముహూర్తం పెట్టించుకొని రావల

సిందని ఉత్తరం వ్రాయించాను. ఇవాళో రేపో అతగాడు రానే వస్తాడు. ఎవరో మన ఇంటికోసం వెతుకుతున్నట్లున్నారు?

**జోగన్న:** అమ్మా! నారాయణ చయనులగారి ఇల్లు ఇదేనా? ఇంట్లో ఉన్నారా?

**సూరమ్మ:** ఇదే. రండి. కాళ్ళకు నీళ్ళు తీసుకొస్తాను.

**జోగన్న:** ఏమిటి? బావగారూ? అలా చూస్తున్నారు గుర్తు పట్టలేదా ఏమిటి? నేను జోగన్నను. యజ్ఞనారాయణ దీక్షితులుగారి తమ్ముణ్ణి.

**చయనులు:** అరె నీ తస్సదియ్యా! ఎంతవాడివైనావోయ్! నిన్ను ఎప్పుడో చిన్నప్పుడు మీ నాయనగారి యజ్ఞమప్పుడు చూచాను... రా నాయనా! కూర్చో మంగళం పల్లిలో మనవాళ్ళంతా కుశల మేనా? నా ఉత్తరం అందిందా?

**జోగన్న:** మంగళంపల్లినుంచే వస్తున్నా.

**చయనులు:** మరి ముహూర్తం పెట్టించుకోవచ్చావా?

**జోగన్న:** లేదు బావగారు! మంచిచెడ్డలు ఒక్కమాటు మీతో మాట్లాడి వెళ్ళుదామని వచ్చాను.

**చయనులు:** అబ్బాయీ! జోగన్నా! ఈ లౌక్యాలన్నీ కట్టిపెట్టు. కట్నాలు కానుకలు చూచుకోకు. సంప్రదాయం చూచుకో. తరతరాలుగా మాది ఆహితాగ్నుల వంశం.

**సూరమ్మ:** (లోపలినుంచి వస్తూ) అన్నగారూ! కట్నాలూ కాన్కల సందర్భాలన్నీ ఇదివరకే అన్నగారితోటీ, వదినగారితోటీ మాట్లాడుకున్నాం. మీ బావగారు అన్నవాటి విషయంలో తిరిగిపోయేవారు కాదు. కానీ ఈ సంబంధం ఇప్పుడు అబ్బాయికి ఇష్టమేనా?

**చయనులు:** అదేమిటి? అలా అడుగుతున్నావు?

**సూరమ్మ:** ఆఁ ఏమీ లేదు. నిన్న మా చెల్లెలు మహలక్ష్మమ్మ చేత కబురు చేసింది. ఆ అబ్బాయి అక్క శ్యామల భక్తురాలైపోయి ఇంట్లో దొంగలు పడ్డా పట్టించుకోలేని స్థితిలో ఉందట. ఎవరికి చిక్కింది వాళ్ళు ఎత్తుకోపోతున్నారట! ఆమె రాధాదేవని పేరు కూడా మార్చుకున్నదట! జనమంతా పిచ్చెక్కిందనే చెప్పుకుంటున్నారుట!

**చయనులు:** మన అమ్మాయి వెళ్ళితే అన్నీ చక్కబడతాయి. కుఱ్ఱవాడు చక్కనివాడు. స్వాధ్యాయ పరుడు.

**సూరమ్మ:** అతడు కూడా మనిషి చాలా మారిపోయినాడట! వెనుకటి కథ కాదట. స్నాన సంధ్యలు కూడా లేవట. పిల్లకు మరో మంచి సంబంధం చూచుకోవటం మంచిదని మా చెల్లెలు చెప్పి పంపించింది.

**చయనులు:** అదేమిటోయ్! జోగన్నా!! ఏదో అన్యాయం చేసి పోదామని వచ్చినట్లున్నావు?

**జోగన్న:** కోప్పడకండి బావగారూ! నేను ఏ దురుద్దేశంతోటీ రాలేదు. మీ సహాయంతో జరిగిన సమస్తాన్ని చక్కదిద్దుకుందామని వచ్చాను. బేరమాడి ఎక్కువ కట్నాలు పుచ్చుకుందామని రాలేదు.

**చయనులు:** అయితే మరి మా ఆవిడ చెప్పే విషయాలు?

**జోగన్న:** నిజమే బావగారూ పది నెలల పైచిలుకుగా నేనీ ప్రాంతంలో లేకపోవటం వల్ల మా అన్నగారి ఇంటి పరిస్థితులు కొంత తారుమారైనాయి. శ్యామలకు నచ్చచెప్పి

దాని అపమార్గాన్ని మాన్పగలిగాను. కానీ కుఱ్ఱవాణ్ణి సరిదిద్దటం నాకు కష్టమై పోయింది. ఇందుకు అన్ని సంపత్తులూ కల మిమ్మల్ని అర్థించటానికని వచ్చాను.

**చయనులు:** అసలు విషయ మేమిటి?

**జోగన్న:** కుఱ్ఱవాడు శంకరం ఒక కపటయోగి వలలో పడ్డాడు. వాడు ధ్యానయోగమని కొన్ని గారడీలు చూపించి ఇంటిమీద బుద్ధి లేకుండా కుఱ్ఱవాణ్ణి అరికట్టేశాడు.

**చయనులు:** ఇంతకూ కుఱ్ఱవాడు కర్మభ్రష్టుడైనాడన్నమాట! పెళ్ళి అయిన కొద్ది రోజుల్లోనే వాడికి యాగదీక్ష ఇప్పిద్దామనుకున్నాను. చెప్పుకున్న శ్రౌతమంతా గుంటలో పెట్టి గంట వాయించాడన్న మాట!

**జోగన్న:** అంతటితో ఆగితే చాలు. ససేమిరా నాకు పెళ్ళి వద్దంటున్నాడు.

**సూరమ్మ:** అన్నగారూ! అటువంటివాడికి బలవంతాన పిల్లనిచ్చి అంటగడితే తరువాత అది మన జీవానికి ఏడవవలసి వస్తుంది. ఏమండోయ్! ఈ సంబంధం నాకేం నచ్చలేదు. ఇంత ఉన్న వాళ్ళం. అవసరమైతే మరో ఎకరం మాగాణి ఇచ్చి ఐనా సరే ఎక్కడైనా మరో సంబంధం చూడండి.

**జోగన్న:** అక్కగారూ! మీరు తొందరపడవద్దు. బావగారు కర్మిష్ఠులు సద్వంశంలో పుట్టిన కుఱ్ఱవాడు చెడిపోతుంటే సహించి ఊరుకోరని నా నమ్మకం.

**చయనులు:** ఊరుకుంటే మహా పాపం కదుటోయ్ జగ్గన్నా! ఏమైనా సరే! వాణ్ణి సన్మార్గానికి త్రిప్పి తీరాలి. మంగళంపల్లిలో నీ మాటంటే కాదనేవాడు ఎవడున్నాడు?

**జోగన్న:** సంతోషం బావగారు!

**చయనులు:** నేను ఇంత కష్టపడి కుఱ్ఱవాణ్ణి ఒకదారికి తెచ్చిన తరువాత నీవు మళ్ళీ ఏదో అడ్డుపుల్ల వేసి కట్నం విషయంలో పేచీ లేవదీయకూడదు సుమా! కానుకల విషయంలో కూడా అంతే.

**జోగన్న:** సర్వం మీ ఇష్టానుసారంగానే సాగిస్తాను. వాగ్దానం చేస్తున్నాను. మీ బోటి లౌకికుల వాగ్దానాలు చెల్లించేవి కావంటారా. ఈశ్వర సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.

**చయనులు:** ఇంతకూ కుఱ్ఱవాడు ప్రస్తుతమేమంటున్నాడు.

**జోగన్న:** గీతాకారుడు చెప్పిన కర్మ–భక్తి–జ్ఞాన–ధ్యాన మార్గాలల్లో కర్మమార్గం అధమాధమమట! వైదిక కర్మలన్నీ ఇంద్రలోకంలో నందనవనంలో ఇతర లోకపాలక

లోకాలల్లో భోగాలను అనుభవించటానికేనట! కర్మత్యాగం వల్ల తప్ప చివరకు గురుభక్తి కూడా కుదురుకోదట!

**చయనులు:** ఆరి పుండా కోర్! కష్టసాధ్యమైన కర్మమార్గం అధమస్తుల దృష్టిలో అధమంకాక ఏమౌతుంది. యజ్ఞ యాగాలల్లో కర్మిష్ఠులు కొలిచే దేవతలంటే మంత్ర శక్తులనీ, యజ్ఞాలంటే కామధేనువులనీ ఎరగని యంబ్రహ్మలు ఏవేవో చెపుతుంటారు. మంచి చెడ్డ ఎఱగని పసి మనస్సులను అవి పట్టుకుంటాయి. అందాకెందుకు ఈ మధ్య జ్ఞానవాదులంటూ ప్రత్యేకంగా బయలు దేరారు కొందరు. ఈ అలస స్వభావులు పుట్టుకనుంచే బ్రహ్మజ్ఞానుల్లా "ఓ మిత్యే కాక్షరం బ్రహ్మ, తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి, సోహం" ఇత్యాది ఉపనిషద్వాక్యాలకు విచిత్ర వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఈనాడు గీతకు ఎవరి ఇష్టం వచ్చిన వ్యాఖ్యానం వారిది. అన్నీ యోగాలే. అంతా జోగులే. కర్మ భ్రష్ఠులు!! యోగులట! జ్ఞానులట!! అన్ని అపమార్గాలూ గీత పేరుతో చెల్లిపోతున్నవి.

**జోగన్న:** బావగారు! మీరు ఎలాగైనా మా శంకరాన్ని మంచి మార్గానికి త్రిప్పి మీ అల్లుణ్ణి చేసుకోవాలి సుమా! వాడిచేత మీరు బ్రహ్మగా మహనీయమైన ఒక మహా యజ్ఞం చేయించాలి.

**చయనులు:** తప్పక  చేయిస్తాను. మర్నాటికల్లా ఆ యోగిగాడిని మంగళంపల్లి పొలిమేరలలో లేకుండా తరిమేయిస్తాను. జగ్గన్నా! ఇది యజ్ఞేశ్వర సాక్షిగా చెపుతున్నమాట! మంచిది ఇక నీవు లోపలికి వెళ్ళి స్నాన సంధ్యాద్యనుష్ఠానం పూర్తి చెయ్యి. ఇదిగో! అమ్మాయితో మామగారికి నీళ్ళు తోడి ఇవ్వమని చెప్పు.

**జోగన్న:** బావగారు మరి సెలవా!

**చయనులు:** ఇదుగో అమ్మీ! మనం మటుకు అంత తొందరపడితే ఎలా! ఏదో చెడిపోయిన వాడిని బాగు చేసుకొని అల్లుణ్ణి చేసుకొంటే తరువాత అతగాడు చెప్పినట్లు వింటాడు. అటువంటివాళ్ళ వల్లనే ఇచ్చుకున్న పిల్లలకు ఎంతైనా సౌఖ్యం ఉంటుంది.

## 4

(సర్వం శ్రీయజ్ఞేశ్వరార్పణ మస్తు... అమ్మా మంగళహారతి కానివ్వండి. అన్న పురోహితుడికి వాక్యాల తరువాత 'శ్రీరామచంద్రునకు సీతా సమేతునకు' మంగళం, మంగళంపల్లిపుర మహిత రాజేంద్రుడు మంగళం నిత్య శుభమంగళమ్' అన్న హారతి వినిపిస్తుంటుంది.)

**రాధాదేవి:** బాబయ్యా! నీవు స్వామివారి దగ్గర ఉండు. అబ్బాయి వాళ్ళ అగ్నికార్యం పూర్తి అయినట్లుంది. వాళ్ళను తీసుకోవచ్చి స్వామి వారికి వందనం చేయిస్తాను. అత్తగారూ! మీరు కూడా రండి, అమ్మాయిని వెంటబెట్టుకోవద్దురుగాని.

**సూరమ్మ:** ఇంక మాదేముందమ్మా! అమ్మాయి నీదే. అబ్బాయి ముందే నీవాడు. ఇద్దర్నీ నీవే నీవాళ్ళచేత నడిపించుకోరా!!

**జోగన్న:** అరుగో! సమయానికి చయనులు బావగారు కూడా వచ్చారు.

**చయనులు:** ఓహో! స్వామివారా! బాధానంద భారతీ స్వాములవారికి హరితసగోత్రో ద్భవుడయిన చయనుల పాదాభివందనాలు.

**స్వామి:** నారాయణ! నారాయణ!!

**వెంకడు:** చిన్న బాబుగారూ! ఆ కూర్చున్నది తమ అన్నగారు పెదబాబు గారు కాదు. ఓ పెద బాబయ్యా! దండాలు దండాలు. మీరు వెళ్ళిన తరువాత అంతా తలకిందులైంది బాబయ్యా! ఏమీ తెలియక ఆ దొంగయోగి పాదాల పట్టాను బాబయ్యా! ఎరగనోణ్ణి! క్షమించండి బాబయ్యా! ఇప్పుడు నాకు కడుపు నిండినట్లుంది బాబయ్యా! నాకేదన్నా మార్గం చెప్పండి (ఏడుస్తాడు).

**చయనులు:** వెఱ్ఱివాడు. కల్లాకపటం ఎఱగడు. స్వామీ! వీడికి తామేదైన తరణోపాయం సెలవియ్యాలి.

**స్వామి :** ఇటువంటి వారి కందరికీ నామస్మరణం, వారి వారి ధర్మాలను ఆచరించటమే తరణోపాయాలు. నారాయణ! నారాయణ!!

**జోగన్న:** వెంకీ! స్వామివారు చెప్పిందేమిటో నీకు నేను తరువాత విపులంగా చెపుతానులే.

**రాధమ్మ:** మామగారూ! అత్తగారు అమ్మాయినీ అబ్బాయినీ స్వామివారి దగ్గరికి తీసుకోవస్తున్నారు.

**జోగన్న:** బావగారి అనుగ్రహం వల్ల మన శంకరం ఒక ఇంటివాడైనాడు.

**స్వామి:** నారాయణ! నారాయణ! చయనులూ మీరు పడ్డ శ్రమ సమస్తం జోగన్న వల్ల విన్నాను. అమ్మా! శ్యామలా! పరమ విజ్ఞాన సంపన్నులకు గాని పనికిరాని మధురభక్తి మార్గంలో నుంచి నీవు బయటపడి నందుకు సంతోషం. సామాన్యో పాసకుల విషయంలో అది మహాప్రమాదకారి. నీవు పరాభక్తి స్వరూపాన్ని తెలుసుకోటానికి

యత్నించు. పరమేశ్వరుడి సర్వ శక్తిత్వాన్ని, సర్వజ్ఞత్వాన్ని, భక్తానుగ్రహత్వాదులను భావించు. పరమేశ్వరార్చ నలలోనూ, తత్స్వరూపధ్యానా దుల్లోనూ చిత్తాన్ని లగ్నం చెయ్యి. ఇటువంటి ఉపాసనలవల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. జ్ఞానాన్ని ఆర్జించి క్రమంగా నీవు గార్గి మైత్రేయి మొదలైన బ్రహ్మవాదినులు పొందిన స్థితిని పొందుతావు.

ఇదుగో పిల్లలు వచ్చారు.

**జోగన్న:** స్వామీ! ఇదుగో దంపతులు. మీకు పాదాభివందనం చేస్తున్నప్పుడు మా శంకరానికి సన్మార్గాన్ని సెలవివ్వాలని మా ప్రార్థన.

**స్వామి:** నారాయణ! నారాయణ! శంకరం ముక్తిని కోరే ఏ ఉపాసకుడైనా సమస్త భూమికలను సక్రమంగా గడవవలసిందే. సమస్తమైన వర్ణాశ్రమ ధర్మాలను యథావిధిగా పాటించి తీరవలసిందే. లేకపోతే పరమేశ్వర జ్ఞాన సంపాదన విషయంలో యమనియమాదులు కుదరవు. వీటిని పాటించక పోవటం అతీత వ్యక్తులై కారణాంతరాలవల్ల పూర్వజన్మలో యోగభ్రష్టులైన కొందరు మహా పురుషుల విషయంలో చెల్లటం ఉంది కాని అది నీబోటి సామాన్యోపాసకుల విషయంలో పనికిరాదు. భక్తి, కర్మ, ధ్యాన, జ్ఞానాలు నాలుగూ నాలుగు విడి, దారులు కావు. యథావిధిగా అనుసరిస్తే మొదటి మూడు సోపాన క్రమంగా జ్ఞానానికి దారి తీస్తాయి. ప్రస్తుత స్థితిలో నీకు మీ మామగారైన చయనులే పరమ గురువు.

**శంకరం:** స్వామీ! తమ ఆదేశానుసారంగా వారు చూపించిన మార్గాన్ని అనుసరిస్తాను.

**స్వామి:** నారాయణ! నారాయణ!

**చయనులు:** స్వామీ! 'యజ్ఞ శిష్టాశినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః', 'తస్మాత్సర్వ గతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్' – అన్న గీతాకారుని వాక్యాలు భక్తి, ధ్యాన, జ్ఞాన, కర్మల్లో కర్మే సర్వోత్కృష్టమైందనీ, దానివల్లనే మోక్షం కలుగుతుందనీ తాము అంగీకరించారనుకొంటాను.

**స్వామి:** అంగీకరించము. 'జ్ఞానాదేవ మోక్షః' లోకాంతరాలలో భోగాలను.........

(అసంపూర్ణం)

**అముద్రితం**

# కేశరక్ష సంప్రదాయాలు

## 1

**బుధాదేవి :** (ప్రవేశిస్తుంది – సామంతులు – అమాత్యులు లేచి ప్రత్యుత్థానం చేసి నిలవబడతారు. రాణి సింహాసనము మీద కూర్చోగానే..)

అమాత్యవర్యా! తామిక ప్రారంభించవచ్చును.

**సామంతుడు :** ప్రజాసభాభవనమున మాకంటె కులీనుడు గాని అమాత్యుడు ప్రసంగించుటకు అంగీకరింపమని సవినయంగా చక్రవర్తిని బుధాదేవికి మేము మనవి చేయుచున్నాము.

**బుధాదేవి :** సామంత రాజ్యానికి నేను ఈ దేశానికి నూతనంగా చక్రవర్తిని నైనానని తెలిసిన విషయమే కదా! సభామర్యాదలకే విధమైన వ్యతిరేకాలు జరుగుతున్నా నాకు ముందుగా తెలియపరచవలసిందని నా కోరిక.

**(సామంత రాజుతో) అయితే మీరు మాట్లాడవచ్చు.**

**సామంతరాజు:** మా రాజవంశము బహు ప్రాచీనకాలమునుండి ప్రసిద్ధి వడసినదని తమకు నివేదించుకొనుట తప్ప తదితరమున మేము ప్రస్తుతము ప్రసంగింపవలసిన విశేషాంశమెయ్యదియును లేదని దేవేరికి మనవి చేయుచున్నాము.

**(ప్రజానాయకులు – గుసగుసలాడుతారు)**

**బుధాదేవి :** అమాత్యవర్యా! తదుపరి కార్యక్రమం నడిపించండి.

**అమాత్యుడు :** మహారాజ్ఞీ! చండస్కంధ చక్రవర్తులవారి అస్వస్థత కఖిల సామ్రాజ్య ప్రజ చింతాక్రాంతమైనదని ప్రప్రథమమున తమకు అమాత్యముఖమున విన్నవించుకొన వచ్చింది. ఈ యల్ప మానవుడు తమ పాద పర్యారాధకుడై యింత కాలము మనినానని తమకు సువిదితము. భృత్యభావమున నీ సభాభవనమునకు విచ్చేయుడని సమస్త రాజ్య ప్రజానీకమునకు తమ యాజ్ఞానుసారముగా పాలించితిని. ఐన నిట్టి విషమ

పరిస్థితియందీ జనసామాన్య మెట్టి సదుపదేశమును తమతమ యమాత్యవర్గమునకు నీ సామంత లోకమున కీయగలదోయని మాత్రము నామానసమించుక సంకోచింప సాహసించినది.

**(జనసామాన్యము వైపు అమాత్యులవైపు చూస్తాడు)**

**బుధాదేవి :** అమాత్యవర్యా! మా జన్మదేశం కృత్రిమత్వం ఏమాత్రము లేనిది. మీ దేశంలో అమాత్యులూ, సామంతులూ స్వామికి క్లిష్ట పరిస్థితులలో సదుపదేశ మివ్వలేనప్పుడు జనసామాన్యాన్ని ఆహ్వానించి వారి యిష్టానుసారం వర్తించటం అలవాటు.

**అమాత్యుడు :** అయిన నీ నూతనోపదేష్టలతో తమ యిచ్చవచ్చినరీతి బ్రసంగించ వలసినదని ఈ సేవకుడు మనవి చేయుచున్నాడు –

**(మళ్లీ జనసామాన్యం వైపు చూస్తాడు)**

**బుధాదేవి :** అమాత్యా! నేను మీ అనుజ్ఞ లేనిదే చక్రవర్తిని చూడడానికి అవకాశము లేదు. వారిని దర్శించి చాలాకాలమైనది. ప్రస్తుతము వారెటువంటి మానసిక స్థితిలో ఉన్నారో నాకు తెలియదు. నేనీ జనసామాన్యంలోకి ప్రసంగించడానికి పూర్వం చక్రవర్తి శరీర స్వస్థత ఏరీతిగా ఉందో ఒకసారి నివేదించమని కోరుతున్నాను–

**అమాత్యుడు :** మహారాజ్ఞీ! ఈ పాలకవర్గము మహాప్రభువు శరీర స్వాస్థ్యమును గూర్చి బహు విశదముగా నెఱింగి యేయున్నది – గాని

**బుధాదేవి :** ఔను! నిజమే. కానీ ఈ మహాసభలో అనేకమంది నూతనోపదేష్టలున్నారని మీరు ప్రథమంలోనే నివేదించారుగదా? – వారికి చక్రవర్తి స్థితిగతులు తెలియనవసరం లేదా?

**అమాత్యుడు :** మహారాజ్ఞీ! వారి సంఖ్య అత్యల్పము. అయిన మహాప్రభువు శరీరస్వాస్థ్యము వారెరిగినను, నెరుగకున్నను మన రాజ్య చక్ర భ్రమణమునకు విశేష ప్రమాదము లేదని ఈ రాజసేవకుని మనవి.

**(జనసామాన్యం వైపు చూస్తాడు)**

**బుధాదేవి :** ప్రమాదమున్నదో లేదో అది మరో విషయం –

**(ఒక భూర్జపత్రం చేతపుచ్చుకొని విప్పి)**

అమాత్యవర్యా! రాజవైద్యుని ప్రభువు వారి శరీరస్థితిని గూర్చి ప్రజలకు నివేదింపమని ఆజ్ఞాపింపకోరుతున్నాను.

**అమాత్యుడు :** భృత్యశ్రేష్ఠా! రాజభిషగ్వరుని రావింప యోగ్యుడగు రక్షకభటుని కాహళ పూరింప నాజ్ఞాపింపుమని రాజు అంగరక్షకులని మహారాజ్ఞి అనుశాసించుచున్నదని నివేదించిరమ్ము –

**బుధాదేవి :** రాజవైద్యులు మీ కుడిప్రక్కనే ఉన్నారు గదా అమాత్యవర్యా!

**అమాత్యుడు :** అయిన మన అనుస్యూతములైన సంప్రదాయ మర్యాద లనుల్లంఘనీయములు గదా దేవీ!

**బుధాదేవి :** ఇట్టి విషమ పరిస్థితులలో, ఇంకా సంప్రదాయాలూ, మర్యాదలను పాటింపనవ సరం లేదని నేను ప్రకటిస్తున్నాను.

**అమాత్యుడు :** అయిన నిక సంప్రదాయానుసారం నియోజితులైన రక్షకభటులు –

**బుధాదేవి :** ఎక్కడివారక్కడనే ఉండాలి. ఇది ప్రత్యేకంగా నేను ఏర్పరచి నడిపించ పూనుకొనే కార్యాలోచన వర్గము – దీనికి మీ పాలక వర్గంతోనూ మీ అమాత్యాది భృత్య వర్గంతోనూ ఏ విధమైన సంబంధము లేదు. మీ సంప్రదాయాలూ, ఆచార వ్యవహారాలతో నాకు కొంత పరిచయం కలిగిందని మీరు ఇప్పటికే గ్రహించారను కుంటాను.

**అమాత్యుడు :** అయిన మీ పాలకవర్గము వారి సంపూర్ణామోదమును బొందకయే మహారాజ్ఞి జనసామాన్యముతో ప్రత్యేక కార్యాలోచనావర్గము నేర్పరచరాదని నేను సవినయంగా మనవి చేయుచున్నవాడను.

**బుధాదేవి :** అమాత్యవర్యా! మీరంతగా పట్టుపట్టినప్పుడు నేనీ జనసామాన్యంలో కొందరికి రాజ్యమిచ్చి ప్రభువులను చేసిన తరువాతనే, ప్రస్తుత స్థితిని గూర్చి నాకు సదుపదేశాలివ్వగల కార్యనిర్వాహక వర్గాన్ని ఏర్పరచుకుంటాను –

**అమాత్యుడు :** ఇట్టి విషమ పరిస్థితుల యందా జనసామాన్యమునందున్న వారిలో కొందరికి ప్రభువర్గముగా రాజ్యాధిపత్యమిచ్చి గౌరవస్థానముల నభివృద్ధి నొందింపదగదు. అది దేశమునకును, మన సామ్రాజ్యమునకు మహారాజాధి రాజశ్రీ చండస్కంధ చక్రవర్తికిని ప్రమాదమని మీ భృత్యుడు సవినయముగా బుద్ధిబలము నుపయోగించి, ఆలోచించి విన్నవించుకొనుచుంటిని.

**బుధాదేవి :** అమాత్యవర్యా! ఆ విషయమును గూర్చి తరువాత చర్చించవచ్చును. ప్రభువువారి శరీరస్థితిని రాజవైద్యుడు సభామధ్యంలో అందరికీ నివేదింప కోరుతున్నాను. సభవారి కాలమతి అమూల్యమైనది. అనవసర ప్రసంగం ఏమాత్రం రాకూడదని ముందుగా అతడు అర్థంచేసుకోవాలి.

**రాజవైద్యుడు :** (అమాత్యుల ప్రక్కనున్న ఆసనం మీది నుంచి లేచి) మహాచక్రవర్తి శ్రీ చండస్కంధశ్రీ వారి యారోగ్య స్థితి యీ సామాన్య మానవులు గ్రహింపవలయు నన్న యయ్యది సామాన్య కార్యంబె. అయినను నేను నేర్చుకొలది విశదీకరింప యత్నింతు – భిషగ్బ్రహ్మయగు చరకాచార్యుల మతాను సారంబున మానవకోటి యందు బ్రధానముగా నున్న ధాతుతత్వములు ముత్తెరంగులు – వాత, పిత్త, ఉష్ణములు ఇమ్మూడింట పిత్తతత్వము మహా భయంకరమైననది. ప్రభువు వారీ పిత్తతత్వముచే బుజాగ్రస్తులై రాజ్యపాలనా కాంక్ష యే మాని, మానసిక వేదననొందుచున్నారని అస్మదీయ ప్రసిద్ధ మతంబు–

**బుధాదేవి :** అమాత్యవర్యా! చక్రవర్తి వారి దుస్థితికి ప్రారంభం వారు విశేషంగా ఎవరితో కలిసి కాలం గడిపేవారు?

**అమాత్యుడు :** రాజవిదూషకుడు దక్క సామ్రాట్టెట్టి యిక్కట్లు సంభవించినను అన్యులతో బ్రసంగించిన తరువాత అవకాశ మొండొరుల కీయనే లేదు.

**విదూషకుడు :** (ఒక పెద్దపెట్టున కాంగ్రించి దగ్గి) మీ, మి మీ్మ మీ్మ – వ వ వ వంశంలో – మ్మా మ్మా వాళ్ళు చెప్పినవి న.... న... నవ్వించటానికి ము... మీ్మ...మన్నాడు.... కి... చ కిచలున్నైనై.... ఎ......ఎ....ప్పుడు ర... రాజు గారికి వి....నిపిస్తాను"

**అమాత్యుడు :** ఈ సుప్రసిద్ధ సమయంబునం దమాత్యుండు దేవేరి కొక అమూల్యమైన విన్నపము గావించవలసి యున్నది. (రాణి అమాత్యునివైపు చూస్తుంది) అదెట్టిదన యావద్భారతంబునందున్న విదూషక వంశ శ్రేష్ఠులలో భుజంగుని వంశంబు విశేష ఖ్యాతి గడించె – నట్టి కులంబున జనించిన విదూషక మూషికంబగు బుజంగుడనవరతము రాజకార్య నిర్వహణా విధానాలను యందే నిమగ్నమగు నన్నే యితండు ద్వాత్రింశద్వత్సరంబులకు నాచే నొక్కపరి చిరునవ్వు నవ్వించె –

**బుధాదేవి :** మానసికబుజకు రాజవైద్యం పనికిరాదే. భూతవైద్యులను పిలిపించమని మీ అభిప్రాయమా?

**రాజవైద్యుడు :** మహాచక్రవర్తి కెట్టి భూతసంబంధము లేదు. పిత్త ప్రకోపము వలననే వారికి దేహద్రఢిమతగ్గీ మానసిక పరివర్తనమేర్పడియె – హృదయమున కానంద కరములగు బ్రయోగముల వెదకి చక్రవర్తి కానందము గల్గింప కలిగినచో పిత్త ప్రకోపనము వ్యత్యస్తమై మానసిక రోగమెడ బాయునని భాబ్రవీయుల మతము

**బుధాదేవి :** చరకము, భాబ్రవీయుల మతము తప్ప దేశీయమైన మార్గమేదీ మరొకటి దేశంలో లేదా?

**రాజవైద్యుడు :** వేరొండు మతముననుసరించి రాజరోగముల నయమొనర్చుకొనుట మనకెన్నడును సంప్రదాయము కాదని ఈ రాజభిషగ్వర్యుండు దేవేరికి సవినయముగా మనవి యొనర్చుకొనుచున్నవాడు –

**బుధాదేవి :** (జనసామాన్యం వైపు తిరిగి) దీనికి మీ ప్రజావైద్యులేమని సమాధానం చెప్పదలచుకున్నారు?

**ఒక వైద్యుడు :** (ప్రజలలోనుంచి వచ్చి) మహారాజ్ఞీ! వెనుక నవ్వుతో ఉన్న మహారాజు అమాంతంగా ఒకమాటుగా ఈ దుస్థితికి వచ్చారు. ఇటువంటి క్లిష్టస్థితి అకారణంగా కలుగదు. వీటిని గురించిన నివేదన వింటేగాని మేము వైద్యము చేయటము చాలా కష్టము.

(రాజవైద్యుడు చెవులు మూసుకుంటాడు. వినటానికి ఇష్టము లేనట్లు)

**సుమిత్రుడు :** నా పేరు సుమిత్రుడు – మహాదేవీ! మీరు నన్ను ప్రత్యేకంగా ఆహ్వానమంపి పిలిపిస్తే వచ్చాను గాని యీ బుద్ధిహీనుడైన అమాత్యుని చేత అల్పబుద్ధినని అనిపించుకోవటానికి రాలేదు.

**బుధాదేవి :** సుమిత్రా! త్వరపడవద్దు – ప్రజా వినోదాలు నీవు పరిపూర్ణంగా ఎరుగుదువని గ్రహించి పిలిపించాను. కొంచెము సేపు ఓపిక పట్టితే నీతో ప్రసంగిస్తాను – పాలకవర్గ మర్యాదలూ, సంప్రదాయాలూ ఈ సభకు వర్తించవని నేను అన్నంతమాత్రాన నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించమని నా అభిప్రాయము కాదు. అమాత్యవర్యా! ఆస్థాన గాయకుడెక్కడ

**గాయకుడు :** (లేచి నిలవబడతాడు)

**బుధాదేవి :** మీరు మహారాజు కానందం కలిగించటానికి అవకాశాలింకా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారా?

**గాయకుడు :** లేదు

**బుధాదేవి :** 'ఆస్థానకవి' – మీరింకా నూతన కావ్యాలు వ్రాసి చక్రవర్తికి సంతోషం కలిగించగలరనేనా?

**కవి :** "లేచి"

''A poem which has no beginning nor end - Must be written

"కవికి సుమిత్రుడికీ కొంత ప్రసంగం"

"పులిని"

లేదు లేదు.

అది యిట్లుండగని ప్పట్టున నీ సభాభవనము నందొక్కరుడైన మహాచక్రవర్తి యట్టి విషమస్థితియందుండ చిరునవ్వైన నవ్వరాదని యట్లొనర్చిన రాజదండనకు బాత్రులగుదురని పాలక వర్గాభిప్రాయమున నేర్పరుపబడిన ధర్మ శాస్త్ర సూత్రార్థమును విశదపరచవలసిన యగత్యము తోచి వక్కాణించుచుంటి"

**సుమిత్రుడు :** (హటాత్తుగా జనంమధ్యలోనుంచి లేచి) తల్లీ! దేశాన్ని యింతకంటే పిచ్చివాళ్ళు మూర్ఖులు పరిపాలిస్తే ఎంతో బాగుంటుంది.

**అమాత్యుడు :** (కోపంతో) దేశం క్లిష్టపరిస్థితులలో నున్నదియో గ్రహించలేని యల్పబుద్ధియగు నీకు మహా సభామధ్యమున బ్రసంగింప నెవ్వడనుజ్ఞ నొసంగె – మహారాజ్ఞీ – ఇట్టి అల్పబుద్ధులను దమయభిప్రాయము లొసగ నవకాశమిచ్చినచో –

**బుధాదేవి :** ఇప్పుడేమి జరిగింది?

**అమాత్యుడు :** (కోపంతో) నీవెవ్వండవు? చండస్కంధశ్రీ వారి రాజ్యంబునందే మొనర్చు చుంటివి?

**సుమిత్రుడు :** త్రిగర్త దేశంలో వింత వింత గాయకులూ, రాజవినోదులూ ఉన్నారు. ప్రభువు వారిని సేవించే సదవకాశం నాకు ఇప్పిస్తే వారిని వెంటనే పిలుచుకో వస్తాను. ఈనాటికి మూడోదినానికల్లా చక్రవర్తి కోలుపోయిన ఆనందాన్ని సంపూర్ణంగా సంపాదించ గలిగేటట్లు చేయగలనని నా విశ్వాసం.

**బుధాదేవి :** అమాత్యవర్యా! కావలసిన సమస్తావకాశాలూ వెంటనే ఇప్పించ గోరుతున్నాను.

**అమాత్యుడు :** మహారాజ్ఞీ! ఇట్టి సాహస చర్యలకు బూనుకొన్నయెడ నట్టివారు తామొనర్చిన శపథముల నెరవేర్పనియెడ నెయ్యదియోయొక దండము వారి కిప్పించుట బహు ప్రాచీన కాలంబునుండి మన యాచారమై యున్నదని నేనియ్యెడ సవినయముగా మనవి చేయక తప్పదు. మమ్ము బోలిన మహామాత్యుల మేధావిశేషమును తారు మారొనర్చిన శాత్రవ కంఠీరంబగు చండస్కంధ శ్రీవారి బుగ్మతను తొలగింతునని విశ్వసించు నీయల్పబుద్ధి నయ్యది నెరవేర్పజాలనిచే యాతని దక్షిణ కరపల్లవంబుల ఖండింపదగు.

**బుధాదేవి :** అమాత్యవర్యా! మీ అభిప్రాయం ఎంతో సమంజసంగా ఉన్నది.

**సుమిత్రుడు :** ఇందుకు నేను... అం.... గీక....రింపను.

**బుధాదేవి :** ఇందాకటి మాటలన్నీ ఏమైపోయినవి? అమాత్య శేఖరా సుమిత్రుని దక్షిణ కరపల్లవాలు వెంటనే ఖండించమని రాజభటులకాజ్ఞాపించు.

**బుధాదేవి :** సభా ఆస్థానంలో మరెవరైనా ప్రభువువారికి సంతోషం కలిగించడానికి మార్గాలను ఆలోచించారా? మీరు – భౌమా!

**భౌమా :** మహారాజ్ఞీ! నాది ఒకటే అభిప్రాయం – ప్రభువు ఏ దేశంమీదనైనా ఒక్కమాటు యుద్ధం చేసి శత్రువులను చీకాకు పరిచివస్తే వారి కండూతితీరి మనస్వాస్థ్యం చేకూరుతుంది.

**అమాత్యుడు :** అట్టి అమోఘమగు ఊహ నా బుద్ధి కెన్నడో పొడమినది. చక్రవర్తికి నివేదించుకొంటి గాని వారించుకయైన రణభూమిపై నభిమానమును ప్రకటింపలేదు. ప్రభువువారికి బ్రస్తుతస్థితిని మనోల్లాస ప్రదంబగువస్తు వెద్దియన నొక మాంత్రికుడు–

**బుధాదేవి :** ప్రభువువారి శుభాన్ని కోరి వారికి ఆహ్లాదం కలిగించటానికి మార్గాన్వేషకులైన ప్రజనొక్కరినే ఆహ్వానిస్తాను. – సుమిత్రుడు

**సుమిత్రుడు :** (లేచి) అనాదికాలమునుంచీ వస్తూ ఉన్న రాజ వినోదాలన్నీ ప్రభువుకు మనోల్లాసం కలిగించడం లేదు. వారికొక నూతనమూ, అధునాతనమూ అయిన క్రొత్త వినోదాన్ని మనం శ్రమపడి సృజిస్తేగాని వారికి ఆహ్లాదం కలుగదని నా అభిప్రాయము.

**బుధాదేవి :** నిజమే – చక్రవర్తి ముఖమండలము నేమాత్రమైన హాస రేఖలు ద్యోతకములు కాకున్నా, సభికులెవ్వరామోదములను సూచింపరాదనియు, సామ్రాట్టు వదనసీమ

దుఃఖరేఖ మేమాత్రము పొడసూపినను వెంటనే సభాఘంటికను మ్రోయింప వలయుననియు, అట్టి సందర్భమున నీవిదూషక శేఖరుడు సభామధ్యము నుండి తొలగింపవలయుననియు నమాత్యవర్యుడు అంగరక్షాధిపతియగు వర్మ కనుశాసించెను.

## 2

(సభావనంలో – రాజు, రాణి Enthroned guards stand between the thrones. a careful observer with note book on hand ప్రవేశము, సుమిత్రుడు, అమాత్యుడు)

**అమాత్యుడు :** (రహస్యంగా) సుమిత్రా! నీ ప్రతిజ్ఞ నిర్వహింపగలవనియే హృదయపూర్వకము విశ్వసించుచుంటి సుమిత్రా!

**సుమిత్రుడు :** (ముందుకువచ్చి) తిరుహత్తి! ఇతడు మహాగాయకుడు – అతని దేశంలో తిరుహత్తి కంఠస్వరము వినటానికి కోటానుకోట్లు తహతహపడిపోతుంటారు.

**అమాత్యుడు :** (ముందుకు వచ్చి) అలా అయితే నేను మరికొందరు వైద్యులు వచ్చి ప్రభువారికి నాడీపరీక్ష చేస్తే బాగుంటుంది.

**బుధాదేవి :** మీరెవరైనా వైద్యులను పిలుచుకోరావాలి.

**సుమిత్రుడు :** వెంటనే ఎక్కడనుంచి వైద్యుణ్ణి తీసుకోరాను? నాకొక ఘడియ కాలం ఇప్పించాలి.

**బుధాదేవి :** అయితే మన కార్యాలోచనా సభను ప్రస్తుతం ముగిద్దాము.

**(తెర – సంగతులు)**

**కథకుడు :** అంతనొక నాటి మధ్యాహ్న సమయమందుదయ వేళ చక్రవర్తిని సంతోషాంబుధుల నోలలాడింతునని శపథమొనర్చి వెడలిన సుమిత్రుడు సాధన సంపత్తితో పట్టణమును చేరుకొనెనని రాణికి వార్త వచ్చినది. అల్పకాలములోనే మంత్రులు, సామంతులు, జనసామాన్యము, సభాభవనమునకు విచ్చేసిరి. సభయంతయు నిశ్శబ్దముగా యుండెను. అంతటి పెద్ద సభయందొక్కడైన తలయాడింపలేదు. మహాచక్రవర్తి ముఖ విన్యాసములలో నీషద్భేదము కనుపట్టెనని పరిశీలించుట కమాత్యులవారు నియమించిన పారిపార్శ్వకులు తప్ప నన్యులెవ్వరచ్చుట నవయవచాలనమొనర్చు వారు లేకుండిరి.

**సుమిత్రుడు :** "విదూషకులు" రీతి, అరీతి (ప్రవేశిస్తారు – రీతి – అరీతి)

**చండశ్రీ :** అమాత్యా! వీరుకూడా మిత్రరాజ్యాలవారేనా?

**అమాత్యుడు :** ఈ రీతిఅరీతులు మిత్రరాజ్య సంబంధులని మనవి చేయవలసి వచ్చినందులకు హృదయమించుక భయంబొందుచున్నది ప్రభూ!

**చండశ్రీ :** వారు ప్రయోగించిన కిచకిచ లెంత పాతవి –

**(తిరుహత్త ప్రవేశించి రాజుకు నమస్కరించి ఒక పాట పాడతాడు మందస్మితంతో)**

**చండశ్రీ :** రక్షామాత్యా!

**రక్షామాత్యుడు :** ప్రభూ! (సవినయంగా మోకరించి)

**చండశ్రీ :** ఆ రోదించే వ్యక్తికి శిరచ్ఛేదనం

**(భటులు తిరుహత్తను బంధిస్తారు)**

**అమాత్యుడు :** (నెమ్మదిగా) ప్రభూ! అతడు మన మిత్ర రాజాస్థాన గాయకుడు

**చండశ్రీ :** అయితే – ఆ రాజు మీద యుద్ధాన్ని ప్రకటించు

**అమాత్యుడు :** (నెమ్మదిగా) ప్రభూ! ఇట్టి సాహసకృత్యమిప్పట్టున మన రాజ్యమునకెట్టి ఇక్కట్టు వాటిల్ల జేయునోయని డెంద మూరాట పడుచున్న...

**చండశ్రీ :** భయంలేదు – రక్షామాత్యా! శిరచ్ఛేదనం

**(తిరుహత్తిని తీసుకోబోతారు)**

**అమాత్యుడు :** ప్రభూ! తాప్పట్టున నున్న సంతోష దాయకుల జూచు, మానసిక స్వాస్థ్యము గలిగియున్నవారే –

**చండశ్రీ :** నాకే అభిప్రాయమూ లేదు.

**(గంట తొలగింపు)**

**(రాజు పెద్దగా మూలుగు)**

**అమాత్యుడు :** రక్షక భటులారా! సుమిత్రుని పట్టున పట్టి బంధించి పెడరెక్కలు విరిచి కట్టుడు–

**(పట్టుకోబోతారు)**

**సుమిత్రుడు:** తల్లీ బుధాదేవీ – నీవు నాకిచ్చిన అభయం మరిచిపోయినారా? నా వైద్యుణ్ణి పరీక్షించకుండానే – నాకీ కఠోర దండన? మహాప్రభువును శాస్త్రవేత్తలైన వైద్యులెవరూ పరీక్షించలేదు.

**(విసుక్కుంటాడు)**

**అమాత్యుడు :** ప్రభూ! ఇట్టి సందర్భమునందీ సుమిత్రుని మీద రక్షకభటులేల బంధింపరాదని నా బుద్ధికే దోచుచున్నయది

**సుమిత్రుడు :** (రాజు దగ్గరికి చేరబోతూ) ప్రభూ! మా రాజవైద్యుడే మీ ఋగ్మతలవంటి వెన్నో నివారించాడు.

**సుమిత్రుని వైద్యుడు :** ప్రభూ! నేను మీ ఋగ్మతలను నివారించి పారితోషికాలు పొందగలననే నా విశ్వాసము.

**అమాత్యుడు :** అయ్యవెంత ప్రాచీనత నోచుకున్నవో యెవ్వడెరింగింప సాహసించు ప్రభూ! మీమతంబున నయ్యవి వేదకాలమునాటివని విన్నవింపదలచితి –

**చండశ్రీ :** (అసహ్యించుకుని) దుహ్ః (దూరంగా తొలగించమని హస్త సంజ్ఞ చేస్తాడు)

**(తీసుకోబోతారు భటులు).**

**సుమిత్రుడు :** "గూభి దోభి" నర్తకులు

**రాగానే నాట్యము**

**అమాత్యుడు :** "సుమిత్రా! ప్రాచీన మార్గానుయాయులై గానమొనర్పగల వారున్న ప్రవేశపెట్టుము. లేదా వృధాగా శ్రమించి నీ దక్షిణ కరపల్లవముల గోల్పోవుదువని యస్మదీయంబైన హితవు.

**సుమిత్రుడు :** నిమిష మాగండి, పాత సరుకు మా దగ్గిర దొరకదు

'కథకుడు ప్రవేశించి గొంతు ఎత్తగానే తోసేస్తారు – 'గంట' –

**సుమిత్రుడు :** రేవుడు "హాస్య గాయకుడు"

(హాస్యంగా పాడుతాడు) – 'పాట' –

**వైద్యుడు :** మీకు నిత్యమూ కలిగే కలలూ, చిన్నతనపు జీవితమూ, మీ తల్లిదండ్రులూ వారి జీవిత చరిత్రలూ నాకు బాగా పరిచయముంటే గాని మీ వ్యాధి ఇదమిత్థమని నేను నిరూపించలేను.

**అమాత్యుడు :** ప్రభువు వారొసంగిన క్షణకాలమయిపోయినది. మీరు మాంత్రిక ప్రయోగ మెరుగుదురా?

**వైద్యుడు :** ఔను.

**అమాత్యుడు :** ప్రయోగింపుడు.

**వైద్యుడు :** "ఒక భయంకర ఖడ్గాన్ని చదివి
పలుకు పలుకు
అంబ పలికింది

**అమాత్యుడు :** ఆఁ పలికిన మాట సత్యంబౌ దేవి ఏమనినయది

**వైద్యుడు :** రాజు ఋగ్మత దేశమునందున్న "నిత్యానందుని" కేశములతో నొక రక్షతాయెత్తు కట్టించుకొనిన నయమవుతుందని –

**చండశ్రీ :** నేను తప్ప నా రాజ్యమున సమస్త జనాలును నిత్యానందులే –

**అమాత్యుడు :** వేమతి శ్రద్ధ వహించి యట్టి నిత్యానందుడుకై అన్వేషణ మారంభించెదము–

**అమాత్యుడు :** ఈ అల్పబుద్ధికి ప్రజ్ఞ యున్నదాయని సందేహము

**సు. వైద్యుడు :** మహా మాత్యవర్యులు తమరేనా? మీ శరీరంలో పాలనాతత్వం (Power complex) విశేషంగా ప్రకోపించినట్లున్నది. మీ ఋగ్మత కూడా నయం చేస్తాను.

**అమాత్యుడు :** అప్రస్తుత ప్రశంసమాని ప్రభువువారి విషయము ఆలోచింపవలయునని అస్మదీయా దేశము

**సు. వైద్యుడు :** (రాజును పరీక్షించి) ప్రభూ! మీరు మేధా ప్రభావం వల్ల బాధపడుతున్నారు.

**చండశ్రీ :** ఏమిటీ?

**అమాత్యుడు :** కుద్దా. మన రాజకుటుంబాలకు యుగయుగాలనుంచీ వస్తూ ఉన్న దేవత మహాప్రభూ! విదూషకులకేరీతి బ్రాచీన హాస్యము గొనివచ్చిరో యిట్టి విధమునసీ రాజవైద్యుడు – ప్రాచీన భైరవమూర్తిని బేర్కొనుచున్నాడు.

**వైద్యుడు :** కుద్దా దేవత కాదు అమాత్యా! ప్రభువువారి మృత్యువు. "ముదిమి ఈ రెంటి మూలకంగా మానసికా వేదన పొందుతున్నారని మా అభిప్రాయం"

**అమాత్యుడు :** రక్షకాధికృతులారా?

**చండశ్రీ :** క్షణంలో నా మానసిక వేదనను పోగొట్టే ఔషధాన్ని నిరూపించాలి.

బుధాదేవి వారు దయచేయుచున్నారు –

**(రాణిప్రవేశము సభ ప్రత్యుత్థానం చేసి నిలవబడుతుంది)**

**అమాత్యుడు :** మహారాజ్ఞి వారికి పాదపద్మారాధకుడు సవినయముగా

**బుధాదేవి :** అమాత్య! ఈ సంప్రదాయాన్నిక చాలించి – అధిక సంతోషి మన రాష్ట్రములో ఎవ్వరో కనుక్కున్నారా?

**అమాత్యుడు :** అట్టి యుత్కృష్ట గౌరవమన్యుల కేల దక్కవలయునను నభిప్రాయమున నట్టి 'సంతుష్టి' మనలో నెవ్వరా యను విచారణమున పాలకవర్గమువారు అధిక శ్రద్ధ వహించి పర్యాలోచన మొనర్చు...

**బుధాదేవి :** ఆ ఆది సంతోషిత్వము మీకే తక్కువేమో!

**అమాత్యుడు :** మహారాజ్ఞీ! ఎంతమాట! అట్టిదెట్టి పట్టునను వాటిల్లదని నా మనవి. కారణమేమన ఈ మహాసామ్రాజ్య భార మస్మదీయ బాహువుల పైనుండ నేనెట్లు సంతుష్టస్వాంతుడను గాగలను –

**బుధాదేవి :** సరే – అట్టివాణ్ణి వెదకటంలో మీ ప్రయత్నాలు ఎంతవరకు సఫలమైనవి?

**చండశ్రీ :** అట్టివాణ్ణి చూచేటంతవరకు నన్ను మళ్ళీ బాధపెట్టవద్దు

**అమాత్యుడు :** చిత్తంప్రభూ! నిత్యానందుని "దీర్ఘకేశము"తో తాయెత్తు!!

## 3

**(సభా భవనము – అమాత్యుడు)**

**అమాత్యుడు :** ఈ నామపట్టిక తయారొనర్చిన వారెవరు?

**కార్యనిర్వాహకుడు :** రక్షకభటాధికారి అమాత్యవర్యా! వీరందరును నధిక సంతోషావిష్టులైన మన రాష్ట్ర ప్రజలు.

**అమాత్యుడు :** మీరిట్టి పట్టికల సేకరించుట యందు చక్రవర్తి కోరు సేవకంటే యధికముగా ఇప్పట్టున నిట్టి నాయప్పటి కలతో చక్రవర్తికెట్టి ప్రయోజనమును జేకూరదని నా యభిమతము. వీటినెల్ల పరశురామప్రీతి గావించుటయే మదీయాభీప్సితంబు మీరిందెట్టి జోక్యమును గలుగ జేసుకొనరాదు. ఈ విషయమున పరిపాలకవర్గమువారు నియోగించిన 'ప్రత్యేక సభ'వారే యట్టి సంతోషావిష్టుల గూర్చి యోజించి కొని రావలసి యున్నారని మీకు ఎరుక పరుచుచున్నాడను – ఈ నామపట్టిక యందున్నవారిలో అధిక భాగము మీ బంధువర్గము కాదుగదా!

**(ప్రవేశము – ఒక కన్య)**

నేను సవినయముగా మనవి చేయగలుగుచున్నాను. ఈ దినమే యొక ప్రత్యేక నివేదిక పాలకవర్గమువారి కార్యాలయమునకు రాగలదని నేను విశ్వసించుచుంటిని.

**బుధాదేవి :** మంచిది – సంతోషావిష్టులెంతమందిని ఇంతవరకు పరీక్షించారు?

**అమాత్యుడు :** అట్టి వారెందరైరో నేనిప్పట్టు సంఖ్యాపూర్వకంగా చెప్పలేను. గణకుని పిలిపింతును. రక్షకా!

**రక్షకా :** చిత్తము

రక్షకుణ్ణి తోసుకుంటూ రాజపుత్రులు, సామంతులు కొందరు కత్తుల కణకణలతో ప్రవేశిస్తారు – రాణిని చూచి భయపడి కరవాలముతో నమస్కరిస్తారు.

**అమాత్యుడు :** రాజపుత్రులారా! మహారాజ్ఞి యిందు కొలువు దీర్చియున్నవారు. మీరెల్లరు నాకౌక్షేయకములను దూరముగా నుంచి ప్రణామ మొనర్చుడు.

**బుధాదేవి :** రాజసభలో యుద్ధం చేయకూడదనే నిషేధం పూర్వంలేదా?

**అమాత్యుడు :** అట్టి నిషేధమున్నయది. అయిన

**బుధాదేవి :** వీరంతా సంతుష్టమనస్కుని అన్వేషించటానికి ఏర్పడ్డ ప్రత్యేక సభలో వాళ్ళేనా?

**అమాత్యుడు :** తాము పాలకవర్గమువారు నియోగించిన ప్రత్యేక సభవారీ విషయమున వహించు జాగరూకతలను, వారొనర్చిన మహోత్కృష్ట పరిశ్రమను వినుటకుద్యుక్తులు కావలసినదని సవినయముగా మనవి జేయుచున్నాను

**బుధాదేవి :** 'ప్రత్యేక సభ' వారీ విషయమున నేమాత్రమన్వేషణాన్ని సాగించినా అల్ప సంతుష్టి మనలో ఎవరా అనే ప్రశ్న మీలో ఉదయించేది కాదని నా అభిప్రాయం.

**అమాత్యుడు :** ప్రతి విషయమును కడు శీఘ్రగమనమున నడచుచున్నది. ఇంత వేగముతో నడచిన రాచకార్యమే మంత్రిత్వము వహించిన తదుపరి నెన్నడేనియు జరుగలేదని మహారాజ్ఞి కస్మదీయంబైన వినయపూర్వక ప్రకటనము. ప్రస్తుతమున ప్రత్యేక సభవారొనర్చిన విశేష పరిశ్రమ కొకరీతి నా మనము నందానందము పొరిలివచ్చుచున్న – నొక్క విషయమునకు ఈ భృత్యుడెంతయో చింతపడుచున్నాడు.

**బుధాదేవి :** మనం సంతోషావిష్టుని వెతకటంలో ఎంతవరకు వచ్చావెూ వినగోరుతున్నాను.

**అమాత్యుడు:** తాము సర్వమును కొలది కాలములోగా చూడగలరని భృత్యుడు మనవి జేయుచున్నాడు. అట్టివాని నన్వేషించుటకై మా పాలకవర్గమొక ప్రత్యేక సభ నీనాటికి నియమింపగలిగినది.

**గణకుడు :** అన్య రాష్ట్రమున దొరుకదనియే మా నమ్మకం. అట్టి అనన్య సామ్రాజ్య సంతుష్ట స్వాంతము మన పాలకవర్గ సభ్యులలో నెవ్వరికైన నుండక మానదనియే మా విశ్వాసము.

**బుధాదేవి :** పాలకవర్గ సభ్యులలో నొకడు అటువంటి వాడు ఉండటానికి అవకాశము లేదని నా నమ్మకం –

**గణకుడు :** పాలకవర్గమున సంతుష్ట స్వాంతుడు లేకున్న నీ దేశమునందెట్టి స్థలమునందైన నట్టివాడు దొరకునా?

**బుధాదేవి :** మంచిది. రాజపుత్రులారా! మా దారిని మమ్మలిని ఒదిలి పెట్టండి. మీ ప్రాచీన సంప్రదాయాన్ననుసరించే అట్టివాణ్ణి వెతికి పట్టుకోండి.

(ప్రత్యేక సభ వెళ్ళిపోయింది. వారు వెళ్ళిపోతుంటే రాణివారు చూస్తూ ఉంటుంది)

**బుధాదేవి :** అమాత్యా! నన్నొకమారు ఆ పట్టికలను చూడనీయండి.

**అమాత్యుడు :** మహారాజ్ఞీ! మేము సంతుష్ట హృదయులమని జెప్పుకొను వారెందరో యున్నారు. అట్టివారిలో బరీక్ష కనర్హులగు వారి పట్టికలకై వార్తనంపితిని కార్యవాహకా!

**బుధాదేవి :** (పట్టిక చేతిలో గ్రహించి) మనము మొదట వర్తక శేష్ఠులతో పరీక్ష ప్రారంభిద్దాము.

**అమాత్యుడు :** వీరెల్ల నా 'ప్రత్యేక సభ'లో నున్న రాజపుత్రులేనని సంతోషపూర్వకముగా మనవి చేయుచున్నాను.

**బుధాదేవి :** రాజగణకు డెంతమంది పరీక్షింపబడ్డారో మనవి చేయగోరుతున్నాను.

**గణకుడు :** ఇంతవరకొక్కరుడైన పరీక్షింపబడలేదని నేను మహారాజ్ఞికి సవినయంగా మనవి చేయుచున్నాను.

**బుధాదేవి :** ఎందువల్ల?

**గణకుడు :** అమాత్యుల వారింతవరకూ "సంతుష్ట" శబ్దమున కర్థనిర్ణయమొనర్చుట పూర్తిగావింపనందున నింతవరకెవ్వరిని పరీక్షించుట కవకాశము దొరకక నేను సవినయముగా మనవి చేయుచున్నాను.

**బుధాదేవి :** ఈ అర్థనిర్ణయ విషయంలో ఎన్ని మతభేదాలేర్పడ్డవో చెప్పగలవా?

**గణకుడు :** ఇంతవరకా శబ్దార్థ నిర్ణయమును గూర్చి కలిగిన మతభేదములు పంచాశత్తు (పొరబడి) నూన పంచాశత్తు – నిన్నటి సాయంత్రమున శబ్దార్థ నిర్ణయయుగములో నొకడు మరణించెనని స్థానమునకు వార్త వచ్చినది.

**బుధాదేవి :** ఆ పోనీ. అర్థ నిర్ణయం జరిగిన తరువాత అట్టి సంతుష్ట స్వాంతుడెక్కడ చిక్కుతాడని?

**(మరొక వర్తకుడు ప్రవేశము)**

**బుధాదేవి :** నీవు నవద్వీపాలతో వ్యాపారం చేస్తున్నావు కదూ.

**శ్రేష్ఠి :** యాడిదీ తొమ్మిది దీపాలతోనేగా... మా బుచ్చిచెట్టి పదకొండు దీపాలతో వర్తకం –

**మరొక శ్రేష్ఠి :** ఎంత యాపారం ఏడిస్తే ఏం – పిల్లలో పిల్లలు –

**మరొక శ్రేష్ఠి :** అజీర్ణం. కడుపుకు తిని సచ్చిందాడుంది. అరుగుద్దా – ఎప్పుడూ సబ్బులిపాయ. పచ్చిపుల్సు ఇంతేగా – తిండో తిండి.

**బుధాదేవి :** అమాత్యా! ధనమున్నంత మాత్రాన సంతోషం ఉండనవసరం లేదని అర్థమైపోయింది. అంతకంటే ధనికులు సుఖంగా ఉండలేరందాము – సరే – సరే పనిపట్టికలో వ్యక్తులను పూర్తిచేయాలి.

**కొన్ని గొంతుకలు :**

(వేగంగా) సంతోషంతో ఉండటం పాపం

(నెమ్మదిగా పీల గొంతుతో) పూర్వం సంతోష ముండేది.

(గట్టిగా) నాకు పిచ్చి

(కోపంతో) నా కూతురు అన్నం పెట్టలేదు.

(నెమ్మదిగా) మా అత్తగారింట్లో బాధలు

(నిర్నివేశంగా) పెళ్ళాం చెప్పిన మాట వినదు

(నిశ్చలంగా) ఉద్యోగం లేదు

**అమాత్యుడు :** రక్షభట శ్రేష్ఠా!

**బుధాదేవి :** ఇప్పుడు ఘంటిక మ్రోగించుట మన అవసరము.

**అమాత్యుడు :** పనియతి త్వరితముగా గావలయును.

**(కార్యవాహకుడు నిష్క్రమిస్తాడు)**

**బుధాదేవి :** ఈ కోటానుకోట్ల వర్తక శ్రేష్ఠులు సర్వవిధ సంతుష్ట మనసులని నేనూహిస్తున్నాను.

**భటుడు :** రక్షకభటా!

**భటుడు :** చిత్తము – "వర్తక శ్రేష్ఠుల ప్రవేశపెట్టు –

**(ప్రక్కవాకిలినుంచి నిష్క్రమించి ఒక వర్తకుడితో ప్రవేశిస్తాడు)**

**బుధాదేవి :** (వర్తకుణ్ణి చూచి) ఇతడు బాగా చియ్యపట్టి సంతోషంతో ఉన్నట్లున్నాడు.

**శ్రేష్ఠి :** "నేను అసంతృప్తితో లేని మాట వాస్తవమేకాని, యాపారముందే యాపారం ఒడుదొడుకులతో కూడింది. లాబాలో లాబాలు – యాడవి అన్నీ ఏ పన్ను లే పన్ను చంతోషమే – చంతోషమే – యాడిది.

**బుధాదేవి :** చాలు, చాలు అతడిని బయటికి పంపించండి – (భటుడు రెక్క పట్టి బయటకు లాగుతాడు)

**బుధాదేవి :** మనరాజ్యంలో సంతోషావిష్టు డొక్కడైనా ఉండకపోడు. నేను అటువంటి వాణ్ణి వెదికి పట్టుకోవటానికి ప్రయత్నిస్తాను. చిన్న చిన్న వ్యాపారస్తులను, ఉద్యోగులనూ పరీక్షించి ప్రయోజనం లేదు. వాళ్ళు అనునిత్యమూ కష్టాలకు గురి కావలిసిందే. కర్షకులు వారికంటే సుఖంగా జీవిస్తుంటారు. మనపట్టణంలో సమస్త విధాలా సుఖానికి స్థానం లేదని గ్రహించి నేను పల్లెదిక్కులో తిరిగి సంతోషావిష్టుని వెదికి పట్టుకోదలచుకున్నాను.

**అమాత్యుడు :** మహారాజ్ఞీ! నేనును రాజనగరమును వీడి తమ సహాయార్థమా పల్లెటి దిక్కునకు రావలయునా? యని సంతోషముతో ప్రశ్నించుచుంటి.

**బుధాదేవి :** అవసరము లేదు. నా వెంట కవినీ, రక్షక భటాధిపతిని కొంత సైన్యాన్ని తీసుకువెళ్ళుతాను. మీరు రానవసరము లేదు.

**(తెర – ప్రవేశము – కథకుడు)**

**కథకుడు :** రాణి సంతోష స్వాంతుని యన్వేషించుటకై కొలది సైన్యముతో బయలుదేరి పట్టణము నుండి బయలుదేరిన కొంత కాలము వరకామె సమాచారమేది రాజనగరమునకు చేరలేదు. ప్రభుత్వ వర్గము వారేర్పాటు గావించిన 'ప్రత్యేక సభ' వారింకను – సంతుష్ట శబ్దార్థవిమర్శనము తేలలేదు. సంతోషము "మానసికమని" కొందరు, శారీరకమని కొందఱు వాదోపవాదనముల మధ్యన విషయమింకను నిర్ణీతము కాలేదు. వీరి వివాదము నమాత్య శేఖరుడు ప్రత్యేకముగా నిరువాదముల వారు

**(గట్టిగా)**

ఆకలి –

తెలివిగలవాడు సుఖంగా ఉండడు –

స్నేహితుల మోసం –

పళ్ళు లేక

కన్ను లేదు

కాలు లేదు

దగ్గు ఉబ్బసం

క్షయ –

రోగం –

బట్టతల –

ముట్టుకుట్టు –

**(మాటలు వినిపిస్తవి – మళ్ళీ వెలుతురు)**

**అమాత్యుడు :** మన పట్టికయందున 105వది

**బుధాదేవి :** అందులో వారంతా సంతోషస్వాంతులేనా?

**అమాత్యుడు :** మీరు ప్రశ్నించు వరకు వారెల్ల నత్యధికానందము ననుభవించెదరనియే నేను భావించుచున్నాడనని మనవి చేయుచున్నాను

**బుధాదేవి :** అయితే ఈర్ష్య, కక్ష, కార్పణ్యం ఇత్యాదులు లోకంలో ప్రబలిపోవడంలేదా? ఇక ప్రేమకు స్థానమెక్కడ ఉంటుంది?

**అమాత్యుడు :** అయితే మీరు ఇట్టి ప్రశ్నలు నుడువవలసినదేనా? వలసినదేనా యని నేను సంశయించుచుంటి –

## 4

## సభాభవనము

**(ప్రవేశము – రాణి – వెంట భిక్షుకుడు)**

**అమాత్యుడు :** స్వాగతము. మహారాజ్ఞీ స్వాగతము – తామంత వేగముగ పట్టణమునకు దిరిగి రాగలిగినందులకు దేశమెల్లరి పక్షమున నీయమాత్యుని నమస్కారములు – "సంతుష్టస్వాంతుని దేవేరి యింత యనతికాలమున గనుగొనగలిగినదే... యని మేమాశ్చర్యాయున్మత్తులమగుచున్నామని దేవేరికి సవినయముగా నమాత్యుడు మనవి చేయుచున్నాడు

**బుధాదేవి :** లేదు – మీ ప్రత్యేక సమితి ఎంతవరకట్టి ప్రయత్నంలో కృతకృత్యత వహించింది.

**అమాత్యుడు :** ఈనాటి ఉదయముననే "యుర్ణముఖమున" శబ్దార్థము నిర్ణీతమైనది.

**బుధాదేవి :** "ఈ దేశ స్థితిని గురించి తెలుసుకోవలసిందంతా తెలిసిపోయింది. ఇక మీ దేశానికి వెళ్ళి పోతాను. రక్షకభటునితో ఈ మూకను దూరంగా నిలపమని ఆజ్ఞాపించండి.

**అమాత్యుడు :** రక్షకభటా

**రక్షకభటుడు :** చిత్తము –

యుద్ధమొనర్చి గెలిచినవారు వాదమున గెలిచినట్లని తీర్మానమొనర్చెను"

**(కథకుడు – నిష్క్రమిస్తాడు)**

**జయభేరీతో ఇరువురు భటులు**

"అన్నా! చూడటానికి ఎంత చిత్రంగా ఉంది. యుద్ధభూమి దుమ్ము రవ్వంతైనా నేలమీద లేదు. అయితే ఆకాశపథంలో విహారం చేస్తున్నది. "మానసికులకు – శారీరులకు యుద్ధం ఎంత భయంకరంగా నున్నది.

**(జన ఘోషలు) యుద్ధం ప్రారంభము జయభేరి మోగుతున్నది.**

గొప్ప దెబ్బ వగైరా

భటుడు (జనాల్ని దూరంగా కొడుతూ ఉంటుంటే ఒక భిక్షుకుడు అతడి దెబ్బ లెక్క చేయడు)

**బుధాదేవి :** (రక్షక భటునితో) ఆగక్కడ? ఎవరా మనిషి?

**అమాత్యుడు :** ఒక మలిన వస్త్రధారి. భిక్షువు మహారాజ్ఞీ?

**బుధాదేవి :** అమాత్యా! అతణ్ణి ఇక్కడికి పిలిపించు.

**అమాత్యుడు :** భటాధిపా! అతని కొరకొక భటశ్రేష్ఠుని నియమింప నాజ్ఞాపించుచున్నాను.

**బుధాదేవి :** అబ్బీ! ఇలారా!

**భిక్షువు :** ఎవరు నేనా?

**బుధాదేవి :** అవును నీవే?

(భిక్షుకుడు దగ్గరికి రాగానే) నీవు బాగా పాడుతుంటావు కదూ! డబ్బు ఎంత సంపాదించావు –

**భిక్షువు :** నేను డబ్బుకోసం పాడటం లేదు – పాడకుండా నా కంఠం ఊరుకోలేదు. ఒకప్పుడు నాకు అపార ధనముండేది. అది నన్ను అన్ని విధాలా నా సంతోషాన్ని చెరిచిందని దాన్ని త్యజించాను.

**బుధాదేవి :** ఇప్పుడు నీవు సంతోషంగా ఉన్నావా?

**భిక్షువు :** సమస్త విధాలా?

**బుధాదేవి :** అయితే నీకు ఇప్పుడేమి కావాలి?

**భిక్షువు :** నాకేమీ అవసరం లేదు.

**బుధాదేవి :** నీ జీవనోపాధి

**భిక్షువు :** నేను దానిని గురించి విశేషంగా ఆలోచించకుండానే జరిగిపోతున్నది.

**బుధాదేవి :** అయితే నీవు గొప్ప బాధ్యతారహితుడవన్నమాట?

**భిక్షుకుడు :** లోకం నన్ను గురించి ఏమనుకున్నా, ఏమన్నా నాకవసరం లేదు.

**బుధాదేవి :** నీకు స్నేహితులూ, బంధువులూ, భార్యాబిడ్డలూ, ఎవరైనా ఉన్నారా?

**భిక్షుకుడు :** లేరు

**బుధాదేవి :** అయితే నీవు కేవలం స్వార్థపరుడవన్నమాట.

**భిక్షుకుడు :** మీ ఇష్టం వచ్చినట్లు భావించవచ్చు.

**బుధాదేవి :** అయితే నీకు రాజదర్శన మిప్పిస్తాను.

**భిక్షుకుడు :** నేను ఇక్కడినుంచే నా కుటీరానికి వెళ్ళిపోతాను.

**బుధాదేవి :** అయితే... నీవు సంతుష్ట స్వాంతుడవన్నమాట.

**భిక్షుకుడు** : అవునని నేననుకుంటున్నాను.

**బుధాదేవి :** రక్షకభటా! ఇతణ్ణి వెంటనే రాజుగారి దగ్గరికి తీసుకోపద.

**అమాత్యుడు :** రక్షకభటా! రక్షకభటా!

**(ప్రవేశిస్తాడు వేగంగా)**

**రక్షకభటుడు :** (అసహ్యంతో) ఏయ్ అబ్బీ ఇలారా!

**అమాత్యుడు :** (గంభీర కంఠస్వరంతో) జాగ్రత్త – అతడొక్కడే నిక్కువముగ సంతోషస్వాంతుడుగ జీవితం సాగిస్తున్నాడు. కావున నతని నతిగౌరవముతో దేవరవారి సన్నిధికిం జేర్పవలయును –

**(జనం – నవ్వుతారు – తెర)**

**కథకుడు :** సంతోష స్వాంతుడు దొరకినాడు. ప్రతి స్వల్ప విషయమున నొక పండుగగుట ఆ దేశాచారము. రాజుగారికా భిక్షుకుని కేశములతో తాయెత్తు కట్టించుట యొక పండుగైనది. 'ప్రత్యేక సమితి'యును నట్టి సభకేతించినది – కాని యెవరి మొఖముననూ సంతోషమన్నది లేదు. చక్రవర్తి ముఖమున నవ్వు తొలకాడితే గాని యితరు లెవ్వరును నవ్వరాదు.)

## 5

### సభ – రాజు రాణి సింహాసనము

**అమాత్యుడు :** (లేచి) మహాప్రభువు వారినీ సమయమున అత్యధిక సంతోష స్వాంతునితో పరిచయము చేసుకొనవలయునని దేశము అమాత్య ముఖమున కోరుచున్నది.

**చక్రవర్తి – సంతోషము.**

**(భిక్షువును రాజభటులు ప్రవేశపెడతారు)**

**చక్రవర్తి :** (భిక్షుకునితో) నీవు సంతోష స్వాంతుడవన్నమాట

**భిక్షుకుడు :** మానవుడెంత వరకు సంతోష మనుభవించటానికి వీలున్నదో అంతవరకు నేను సంతోష స్వాంతుడనే.

**చక్రవర్తి :** అయిన నీవు నా ఋగ్మతను బాపుదువన్నమాట

**భిక్షుకుడు :** అది నా చేతకాదు.

**చక్రవర్తి :** నీవు సంతోష స్వాంతుడవైనచో నది చాల సులభమైన ప్రక్రియ. నీ దీర్ఘ కేశద్వయము నాకిచ్చినచో దానితో నొక తాయెత్తు జేయించుకొని నేను నా ఋగ్మత బాపుకొనియెదను.

**భిక్షుకుడు :** నిజమే కావచ్చును – మీకు నా దీర్ఘ కేశాలు ఏవిధంగా లభిస్తయాయని నేనాలోచిస్తున్నాను.

(అసంపూర్ణం)

***అముద్రితం***

# మధుర ప్రియ

(చిత్తూరు రాజమందిర ప్రాంగణము. గిరిధరగోపాల పూజామందిరము ముందు వితర్దిక మీద శిలావిగ్రహము. గోసాయిలు ముందు వచ్చి కూర్చుంటారు. సేవకురాలు పూజాద్రవ్యాలు పట్టుకోవస్తుంటే వెనుక అర్ధనిమీలిత నేత్రాలతో మీరా ప్రవేశిస్తుంది. ఒకవైపునుంచి. సూర్యాస్తమయానంతరమూ మీరాబాయి రావటాన్ని జూచి)

**గోసాయీలు:** జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై!
జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై!!

**మీరా:** (దగ్గరకు వచ్చి) ఓహో! ఈనాడు కృష్ణాష్టమి. నా ప్రభువు జన్మదినము. అందుకనే కాబోలు పూజామందిరము కిక్కిరిసిపోతున్నది. గోసాయీలతో... అబ్బా! ప్రభుతుల్యులు, ఎంతమంది గోసాయీలు... భక్తబృందానికి వందనాలు!

**గోసాయీలు:** జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై!
జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై

**మీరా:** (నాలుగు దిక్కులు కలయజూచి) మహానుభావులారా! ఎవరా చిత్తూరు మహారాణీ! ఏది? ఎక్కడ?... (నవ్వుతూ) మీరా చిత్తూరుకు మహారాణీ కాదు. ఆ మహారాణీ పుట్టలేదు... మాయారహితుడు, మహాప్రభువు. గిరిధర గోపాలుడికి ఈ మీరా ఆత్మను అంకితం చేసిన ప్రేయసి... కాదు... కాదు... పాదదాసి.

**గోసాయీలు:** జై! మీరామాయికీ జై!
జై! మీరామాయికీ జై!

**మీరా:** అతిథులారా! నా మనోహరుని పుట్టినరోజని దేశదేశాలనుంచీ సంకీర్తనకోసం వచ్చిన మిమ్మల్ని చూస్తే నా హృదయం ఉప్పొంగిపోతున్నది! ఎందరు వైష్ణవభక్తులు... నా కళ్ళు చూడలేక పోతున్నవి. జయ పెట్టవలసింది నాకు కాదు... (విగ్రహం కేసి చూపిస్తూ, సమీపిస్తూ) అడుగో ఆ మోహనమూర్తికి... నా మనోనివాసికి... కాదు నా మనోహరుడికి...

**(దగ్గరకు చేరి కూర్చొని విగ్రహ పాద పద్మాలను నిమీలితలోచనాలతో దర్శిస్తూ)**

**జయ జయ జయ జయ గిరిధర గోపాలా!**
**జయ జయ జయ జయ గిరిధరగోపాలా!**
**అలికుల గానోద్భూతామృతరస**
**లలితమాలపదాంబుజయుగళా, గోపాలా!**

(తల ఎత్తి కేకిపింఛాన్ని నిరూపిస్తూ)

**మకుట ఘటిత కేకిపింఛరుచి శబలిత**
**సకలాశాపరిపూరిత దివ్యతేజ, గోపాలా!**

(కన్నులదగ్గరకు లేచి కలయజూస్తూ)

**అక్షయ గోపీతరళ కటాక్షా**
**క్షీణ మనోహరా రాజీవాక్షా, గోపాలా**

(మురళీగానాన్ని అభినయిస్తూ)

**రాధాధర మధుర సుధారస ధా**
**రారంజిత బింబాధర వంశీరవ గోపాలా**

(చక్రభ్రమణంతో)

**జయ జయ జయ గిరిధర గోపాలా!**
**జయ జయ జయ జయ గిరిధర గోపాలా!**

(తన్మయురాలైన గోసాయిాల మధ్యకు చేరి)

అదుగో నా ప్రియుదు నవ్వుతున్నాడు. మన పిలుపు అందింది. ఓహో! ఎంత రసికుడు... పల్లవీ కన్యలమధ్య పిల్లనగ్రోవి మౌని... నా కంఠాన్ని అనుకరిస్తున్నాడు. కనికరం కలిగింది కాబోలు. అదుగో నీల మేఘం అదేమిటి... అబ్బా! ఏమిటా మెరుపు దానికి పైగా... (అనుమానించినట్లు పరికించి మిలా మిలా కళ్ళార్పి) ఔను... ఔను తెలిసినది... అంతే నా మనోనాథుడు గోలోకం నుంచి బయలు దేరి వస్తున్నాడు... ఆ ఆషాఢమేఘచ్ఛాయలు ఆయన దేహకాంతులు... ఇదిగో మనమంతా నీలనీలంగా మారిపోతున్నాము. అయ్యో! కాంచనాభరణాలను త్యజించిన నా ఒంటిమీద బంగారపు రుద్రాక్షల జపమాలలు నిలుపుతూ నిమిషంలో మటుమాయమై నిమిషంలో జ్యోతిష్మతులను వెలిగించే ఆకాంతులేమిటో తెలుసునా? నా హృదయవతి కేకిపింఛసంకాశం. నెమ్మది నెమ్మదిగా... నాకోసకు. ఔను నాకోసకు దిగి వస్తున్నాడు.

ఎందుకు రాదు, వస్తాడు. ఇద్దరమూ చిన్ననాటినుంచీ స్నేహితులము. మా అమ్మ పక్కలో నేను. నా పక్కలో నా హృదయపతి... అడుగో మరీ మరీ దగ్గిరికి వస్తున్నాడు. (గోసాయీల కేసి చూస్తూ) మీరేమీ చూడటము లేదూ! అలా బిక్కమొగాలు వేసుకొని కూర్చున్నారేమిటి? (ఒక గోసాయి దగ్గిరకు వచ్చి) స్వామీ! నా మనోహరుడు మీకు కనబడటం లేదూ?

**గోసాయీ:** (లేదన్నట్లు తల తిప్పుతాడు.)

**మీరా:** (మరొక గోసాయిదగ్గరకు వచ్చి) మహాత్మా! మీకో?

**గోసాయీ:** ఏడమ్మా తల్లీ, ఎక్కడ! నీది వట్టి భ్రాంతి!

**మీరా:** అదేమిటి స్వామీ, కళ్ళ ఎదుట అలా కనిపిస్తూ ఉంటేనే!

**గోసాయీ:** ఇదేమిటమ్మా! ఎన్నడూ కనీ వినని దీచిత్రం... నీది వట్టి భ్రాంతి. ప్రభువేమిటీ? మనదగ్గిరికి రావడమేమిటి? రూపగోస్వాములు ఎన్నడూ చెప్పలేదే. దేహయాత్ర చాలించి మనమే గోధామంలో ప్రభువును కలుసుకుంటాము. గాని ఇదేంమాట! ఎన్నడూ వినలేదు...

**మీరా:** చాలులే మహాత్మా, చాలులే! అబ్బా! ఎక్కడేమిటయ్యా? స్వామి! (జరిగిపోతూ మరొక గోసాయితో) తేజోమూర్తులు తమకు తప్పకుండా కనిపిస్తూంటా డనుకుంటాను.

**గోసాయీ:** తల్లీ! దూరంగా ఏదో లీలగా కనిపిస్తున్నది.

**మీరా:** కాదు కాదు మీ కన్నులు ఆయన వెలుగును భరించలేక పోతున్నవి... అడుగో ఆయన వచ్చేస్తున్నాడు. నేను ఏం చేసేది స్వామీ! ఏమి చెయ్యమన్నారు? ఆయన వచ్చేదారిలో దుమ్ము అంటుకుంటుంది కాబోలు. పూవులు చల్లిరానా? వద్దు వద్దు. పమిట పరిచి వస్తాను. అర్ఘ్యానికి జలం సిద్ధం చేసుకోనా? అవసరం లేదు. హర్షాశ్రు వు లున్నవి కదా! వస్తున్నాడు కదూ నామనోనాథుడు!

**గోసాయీ:** అవునమ్మా! తల్లీ, ఏదో తేజోవిగ్రహం. మనవైపుకే కదిలివస్తున్నది... (తన్మయుడై) తల్లీ! (మెడలో చెయ్యి పెట్టి హారం బయటికి తీసి) ఇదిగో ఈ హారం వేసి అర్చించు... (చేతికి అందిస్తాడు).

**మీరా:** (చేతికి హారం తగిలేటప్పటికి స్మృతికి వచ్చి) ఏమిటిది? నేను ఇందాకటినుంచీ. ఏ లోకంలో ఉన్నాను? ఈ పూజామందిరానికి ఎలా వచ్చాను? ఇదుగో వీరంతా

గోసాయిలే.. అయితే నా మనోనాథుడు ఏడీ... తిరిగి వెళ్ళిపోతున్నాడు (కన్నీటిలో) వెళ్ళిపోతున్నావా నాథా! (గోసాయిని చూచి) నీవు గోస్వామివి కాదు. ప్రేయసీ ప్రియుల మధ్య అడ్డుపడే పిశాచానివి! మ్లేచ్ఛుడివి! పో! అవతలికి పో! ఇక్కడ ఉండవద్దు!

**గోసాయీ:** కోపించకు తల్లి! మహానుభావుని లీలలు అతిమానుషాలు. నన్ను హారం ఇవ్వమన్నట్లు సైగ చేశాడు. తాను తిరుగు మొగం పట్టాడు. నా తప్పు ఏముందమ్మా?

**మీరా:** (తగ్గి) నిజమే! స్వామీ! నన్నే ఇల్లా అనేకమాట్లు మోసగించాడు. క్షమించండి మహాత్మా! ప్రేమోన్మాదంలో ఏదో పిచ్చిగా మాట్లాడాను.

**గోసాయీ:** తల్లీ! నీమనస్సు నాకు తెలుసును. చింత పడకు.

**మీరా:** చింతపడకుండా ఎలా ఉంటాను? (విగ్రహానికేసి చూచి) మోసగించా నన్నట్లుగా మొలకనవ్వులలో ఈ విగ్రహం చాటున... లోపల... దాక్కొని నవ్వుతున్నాడు. ఈ హారము మెడలో వేసి మళ్ళీ రమ్మని మొర పెట్టుకుంటాను. (విగ్రహం వైపు నడుస్తుంటుంది).

(ప్రవేశము సేవకురాలు... చేతులో పూలబుట్ట... గంట కొట్టుతుంది... మీరా వెనక్కు తిరిగి) ఎవరు? గిరిజా?

**గిరిజ:** (వంగి నమస్కరిస్తూ) దేవీ! శ్రీ శ్రీ కుంభరాణావారు ఈనాడు గిరిధర గోపాల దేవుణ్ణి వనమాలికలతో కాదట. ఈ సెజ్జలో పూలమాలికలతో అలంకరించమని దేవేరిని ప్రార్థిస్తున్నామని విన్నవించి రమ్మన్నారు.

**మీరా:** (ఉద్వేగంతో) గిరిజా! గిరిజా! ఏమిటిది? సత్యమేనా? కుంభ రాణా మాటలేనా ఇవి? ఇలా "గిరిధర గోపాల" నామం రాణా నోట ఉచ్చరించాడా... 'వనమాలికా' నీవు కల్పించింది కాదు కదా! నన్ను ఉద్దేశించి ప్రార్థిస్తున్నా నన్నాడా?

**గిరిజ:** (చెప్పలేక చెపుతూ) ఆ... అ... అ......వు...వు...ను...దే...వీ...

**మీరా:** ఏమి టాతడబాటు?

**గిరిజ:** ఏమీలేదమ్మా! అది నా సంతోషము. (సెజ్జ అందిస్తుంది)

**మీరా:** (అందుకుంటూ) మహాత్ములారా! మీరాకవల్ల నేడు చితోడు నిజంగా వైష్ణవభక్తలోకంగా మారిపోతున్నది. కుంభరాణావంటి భూతేశ శిష్యుడు గోధామదర్శనాన్ని కోరుతున్నాడు.

**గోసాయీలు:** జై కుంభరాణా మహారాజుకు జై!
జై కుంభరాణా మహారాజుకు జై!

**మీరా:** (విగ్రహాన్ని చూస్తూ) ప్రభూ! ఇదిగో వస్తున్నా. నిన్ను అలంకరిస్తా. గిరిజా! వెంటనే వెళ్ళి కుంభరాణావారిని సంకీర్తనానికి రమ్మని దేవి పునః ప్రార్థిస్తున్నదని చెప్పు! త్వరగా పోయి విన్నవించు.

**గిరిజ:** చిత్తము దేవీ! (నిష్క్రమణ)

**మీరా:** ఈ పూల మాలికలతో అలంకరించి స్వామిని తిరిగి రమ్మని ప్రార్థిస్తాను. (అని తత్తరపాటులో గోసాయి ఇచ్చిన హారం వేస్తుంది. సెజ్జకము మూత తియ్యకుండా అక్కడనే కింద పెట్టి ఆపుకోలేని ఉత్సాహంతో).

**నిదుర ఎరుగనికనుల నీకొరకె! నీకొరకె!**
**ఒక్కతెనె యీరేయి చుక్కలలో ఓనాథ!**
**విశ్వమంతా నిదుర వెలిముసుగు వేసుకొనె**
**వెన్నెలల బయలులో! విరహినై నిలచితివి**
**పెంచుకొన్నా వోయి ప్రేమలత కన్నీట**
**బాధ యని ఎరుగ నిక పలుక ప్రేమించ మని**
**నావిరహగాథలను నడికి రేయికి చెపుతు**
**సగము రాతిరి నొక్క యుగముగా గడపితిని.**

నాథా! ఇంతటికైనా దయ రాదా! ఈ దీప విరహిమీద మళ్ళీ ఒకమాటు నీ ఆసాయవీక్షణము ప్రసరించదా! అయ్యో! ఎన్ని యుగాలైనా రావు నాథా! దాసి మీరా ఈ విరహవేదనాగ్నికి ఇంధనమై కాగిలి కృశించి నశించిన వెనుకనా? వచ్చి ఏమి ప్రయోజనము? అబ్బా!

**(నెమ్మదిగా నేలమీదికి ఒరుగుతుంది).**

**గోసాయీలు:** (కలకలము)

**ఒక గోసాయీ:** నిశ్శబ్దము. అరవకండి... అద్వితీయ మహాభక్తురాలు భక్తి తన్మయత్వంతో మూర్ఛపోయింది. లేపవద్దు... చప్పుడు చెయ్యవద్దు... భయపడకండి.

**మరొక గోసాయీ:** కూర్చోండయ్యా, కూర్చోండి.

**మరొక గోసాయీ:** ఇస్! నిశ్శబ్దం.

**మీరా:** (నెమ్మదిగా తెప్పరిల్లుకొని లేస్తుంటుంది)

**గోసాయీలు:** జై మీరా మాయికి జై!
జై మీరామాయికి జై!

**మీరా:** (విభ్రాంతితో నే) ప్రభూ! ఎన్నాళ్ళని నిద్రాహారాలు లేకుండా వియోగంతో... ఇస్ (ఆలోచన అభినయించి) ఏమి తప్పు చేశాను... (దృష్టి రాణా పంపిన సెజ్జమీద ఉంచి) అవును.. నిజమే... తెలిసింది. తప్పు చేశాను. రాణా ప్రభుభక్తుడైనాడు. రాణా ఆజ్ఞను ధిక్కరించాను.. మొదట గోసాయీ యిచ్చిన హారంతో నాథుణ్ణి అర్చించాను... అబ్బా! ఎంత తప్పిదం చేశాను.. ప్రభో, క్షమించు. ఇదుగో నీ మెడలో వేసి కళ్ళార చూచి ఆనందిస్తాను. (సెజ్జ కాని దగ్గరకు తీసుకొని తియ్యటానికి చెయ్యి పోనిస్తుంటుంది. చివరగోసాయి అతని మిత్రుడు లేచి వెళ్ళిపోతారు).

**విరజ:** (గంట కొడుతూ ప్రవేశించి ఆతురతతో) అమ్మా! అమ్మా! ముట్టుకోకు.. ముట్టుకోకు... తియ్యకు! తియ్యకు! అవి పుష్పమాలికలు కావు! సర్పాగ్ని జ్వాలామాలికలు. రాణా శివారాధకుడు అన్న సంగతి మరచిపోయినావా తల్లీ!

**మీరా:** (ఆశ్చర్యచకితయై) విరజా! ఏమిటీ తొందర?

**విరజ:** తొందర ఏమిటి తల్లీ! నిమిషము ఆలస్యమే ఐతే కొంపలు అంటుకో పొయ్యేవి.

**మీరా:** ఏమిటీ?

**విరజ:** అమ్మా! ఇందాకటినుంచీ తమ చేతులో హారమేదో ఉన్నదటగా

**మీరా:** అదిగో! నా స్వామిని దానితో అర్చించాను.. అయితే-

**విరజ:** దానిని రాణా ఎక్కడినుంచో మీ చేతిలో ఉండటము ... చూచాడు.

........ అయితే దాంట్లో తప్పేముంది. ఈ గోసాయీ నాకిచ్చారు.............. (గోసాయీలు కనిపించరు ఆశ్చర్యపడి) ఆఁ!

**విరజ:** అది ఢిల్లీ చక్రవర్తి అక్బరు పాదుషాకు కానుకగా ఇచ్చాడట! రాణా మిమ్మల్ని అనుమానించి.. (సర్పాల సెజ్జ చూపుతుంది)

**మీరా:** మహాగాయకుని తాన్సేనును వెనుక పాదుషా ఒకనాటి సంకీర్తనతో తన మందిరాన్ని పవిత్రం చెయ్య మని కోరి రమ్మని పంపించాడు. నేను అంగీకరించలేదు. పాపము సంకీర్తన వినటానికి గోసాయీ వేషంతో ఎంత దూరం నడిచి వచ్చాడు..

అబ్బా, ఎంత భక్తుడు.. ఎక్కువసేపుంటే బయట పడతానని కాబోలు వెళ్ళిపోయినాడు. విరజ! నీ మాటలు సత్యమేనా? అవి సర్పములేనా?

**విరజ:** తల్లీ! నీ కనుమానమైతే మొదట నన్ను తియ్యనిచ్చి చచ్చి పోనీ...

**మీరా:** ఏమైనా సరే! నా ప్రియుడు నన్ను పరీక్షిస్తున్నాడు. ఇదంతా ఏమిటో నాకు అర్థం కావటము లేదు. ఈ విచిత్ర వరపరీక్షలో నేనెందుకు వెనకపడి పోతాను? పడను ముమ్మాటికీ పడను. అవి సర్పమాలికలైనా సరే కృష్ణుని అలంకరించక తప్పదు. (కొద్ది గొంతుకతో చెయ్యి సెజ్జకము దగ్గరికి పోనిస్తూ)

జయ జయ జయ జయ గిరిధర గోపాలా!
జయ జయ జయ జయ గిరిధర గోపాలా!

(అంటూ నెమ్మదిగా మూత ఎత్తుతుంది. అందులో పూలమాలికలు కిల కిలా నవ్వుతవి. మీరా విరజ మొగం చూస్తుంది. ఆమె ఖిన్నవదనంతో తల వంచుకుంటుంది. పూలహారాలతో విగ్రహాన్ని అలంకరించి గోసాయీలు మీరా సంతోషాధిక్యంలో కొద్దిసేపు)

జయ జయ గిరిధర గోపాలా జయ జయ గిరిధర గోపాలా

**(అని సంకీర్తన చేస్తారు. తరువాత నిశ్శబ్దము)**

**మీరా:** ప్రభూ! పూలదండలతో కులకటమేనా? పూబోడిని మరిచి పోయినావా? ఇప్పటికైనా రావా? నాథా! నోట మాటే రాదుగదా! మూగి వాడవా? కావే! మురళీ మోహనమూర్తివే! నాయీ కష్టాలను ఎప్పటికి ఈడేరుస్తావో కదా! ఈ జగత్తుతో నాకు ఏ సంబంధమూ లేదు. ఇంక అసలే వద్దు తల్లీ, తండ్రి, రాణా అందరూ నాకు కాని వాళ్ళే... నిన్ను ప్రేమిస్తే ఏమో వచ్చి పడుతుందని ఉద్ఘోషించారే మహాత్ములు! ఏమి వచ్చింది నాకు... వచ్చింది.. ఆఁ ఏమిటి? వట్టివేదన... చిన్నతనంనుంచీ నీ రూపాన్నే స్మరిస్తూ పలవరిస్తూ ఉన్న దానిమీద ఇంత నిర్దయా ప్రభూ! నీ నామస్మరణకు శిలలు ద్రవిస్తవన్నారే నీ హృదయమింత పాషాణమే మరి? మెరపు మెరసినట్లు కనబడి తప్పించుకొని నావే! నాథా! అవి ఎప్పటికైనా ఫలించేవేనా? ఎన్నాళ్ళకైనా ఊహా సౌందర్యామృత పావనమేనా మీ అధరామృతపానం నాకు లభించదా?

**రాణా:** (చేతిలో పాత్రతో ప్రవేశించి విచిత్ర కంఠంతో) ప్రేయసీ! మీరా! నీ పరిపూర్ణానురాగానికి మెచ్చుకున్నాను. ఇదిగో... అమృతపానం చెయ్యి... (విషపాత్రిక అందిస్తాడు)

**మీరా:** నాథా... నాథా... గోధామమునుంచి వచ్చావా... ఎటునుంచి వచ్చావు... అమృతమా... నాకోసమా ప్రభూ... ఏది? ఏది? (విష పాత్రను అందుకోబోతూ)

**దాసిమీరా పైన దయ కలిగెనా నేడు**
**అమృతపాత్రిక నీయ నరుదెంచినావా!**
**ఓనాథ, ఓనాథ!**
**తాళలేనోయి నే నాలసింపగ నేల?**
**అమృతపాత్రిక నిమ్ము. ఆరగించెద నోయి!**
**నీవె నేనై నాథ! నేనె నీవై నాథ!**
**మీరాకు జన్మమిక మిథ్యయేనా నాథ**
**ఓనాథ, ఓనాథ!**

(అని అందుకొని గుటగుటా తాగి) అబ్బ... హాఁ హా.... (నెమ్మదిగా నేల మీదికి ఒరుగుతుంది)

**వనజ:** (పరుగెత్తుకుంటూ ప్రవేశించి) అమ్మా! అమ్మా! అప్పుడే తాగేశావా! నేను పరుగెత్తుకుంటూ వచ్చేలోపలనే ఎంతపని జరిగింది! అది కాలకూటవిషము తల్లీ... (రాణావైపు చూచి, చకితయై) ప్రభువే స్వయంగా వచ్చి ఇచ్చారా! అయ్యో! అయ్యో! (అని పక్కకు తొలగి ముఖము ఎదుటికి వచ్చి నిలువబడుతుంది)

**రాణా:** (మీరాతలవైపుకు వచ్చి నిలువబడతాడు)

ఒక **గోసాయీ:** (ఉగ్రుడై) రాణా! మహాభక్తురాలికి విషమిచ్చి పాతకానికి ఒడికట్టావు!

**మీరా:** (నెమ్మదిగా లేస్తూ) నానాథుడు నేను ఇద్దరమూ ఇప్పుడు ఇక్కడనే మాట్లాడుతుంటిమే! ఆయన ఏమైనాడు? ఎక్కడికి పోయినాడు? బృందకు పోవాలన్నాడు వెళ్ళాడా!

(పరికించి) ఎవరిది? గోస్వామి! ఇదెవరు! రాణా!

**రాణా:** (గద్గదకంఠంతో) దే...వీ!

**మీరా:** (నిశ్చేష్టురాలై) రాణా!

**రాణా:** దేవీ! నీభక్తి ఇంత మహత్తర మైన దని ఎరుగక అనుమానించి బాధపెట్టినవాణ్ణి.

**మీరా:** కాదు, కాదు. పరమాత్మస్వరూపుని మనోనాథుని చూపించిన పుణ్యాత్ముడవు.

**రాణా:** క్షమాపణ అర్థిస్తున్నాను దేవీ! నిన్ను ఎన్నో బాధలు పెట్టాను. (మోకరిల్ల బోతాడు).

**మీరా:** కాదు, కాదు. (అని వారిస్తూ తానే మరీ వంగి నమస్కరించి) పొరబాటు, రాణా! నీరూపకంగా ప్రభువు నన్ను పరీక్ష చేశాడు నీలోపము ఇక్కడ ఏమీలేదు.

**రాణా:** దేవీ! మహారాజుననే భ్రాంతిలో మత్తెక్కిన నాకేదైనా తరణోపాయం చూపించి అనుగ్రహించమని ప్రార్థన!

**మీరా:** గురు జ్ఞానము తప్ప వేరేమార్గము ఏమీలేదు. వెళ్ళి వస్తాను నాకు సెలవివ్వండి.

**రాణా:** దేవీ! ఎక్కడికి?

**మీరా:** ఎక్కడి కేమిటి? బృందకు. నా ప్రభువు బృందలో ఉంటాడు. పోయి ఆయన్ను కలుసుకోవాలి. ఇక నాకు అమృతత్వం తప్ప వేరేలోక యాత్ర లేదు.

**రాణా:** (నిశ్చేష్టుడై నిలువబడతాడు.)

**మీరా:** బృంద బృంద బృంద భక్తలోక మందారమే బృంద
బృంద బృంద బృంద సాధులోక చంద్రికయే బృంద

(గోసాయీలు ఆమెను పాటలో అనుసరిస్తారు. రాణా కనుచూపుమేర వరకూ వంగి నిలుస్తాడు).

# పీయూషలహరి

# భూమిక

తెలుగు భాషా సాహిత్య కళాసంస్కృతుల సర్వతోముఖ విలసనానికీ, వికసనానికీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం ప్రకారం 1985 డిసెంబరు 2వ తేదీన రూపుదాల్చిన విశిష్ట విద్యా సంస్థ తెలుగు విశ్వ విద్యాలయం. శోధన, పరిశోధన, ప్రచురణలతోపాటు విస్తరణసేవ, రాష్ట్రేతరాంధ్రులకూ, విదేశాంధ్రులకూ సహాయ సహకారాల కల్పన వంటి బహుముఖీన కార్యక్రమాలను కూడా విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది. పూర్వంపున సాహిత్య, సంగీత, నృత్య, నాటక, లలితకళా అకాడమీలు, తెలుగు భాషా సమితి, అంతర్జాతీయ తెలుగు కేంద్రం విలీనం కావడంతో విశ్వవిద్యాలయం వివిధ పీఠాల, విభాగాల సమాహారంగా వ్యవహరిస్తోంది.

తెలుగుజాతి వైభవోన్నతులకు అద్దంపట్టే గ్రంథాల ప్రచురణ విశ్వవిద్యాలయ ప్రధానాశయా లలో ఒకటి. విశ్వవిద్యాలయంలో విలీనమైన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవిశ్రాంత కృషి ద్వారా దేశ సాహిత్య రంగంలో విశిష్టస్థానం సంతరించుకుంది. 1957 ఆగస్టు 7వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన ఈ అకాడమి దేశం మొత్తం మీద ప్రప్రథమ రాష్ట్రస్థాయి అకాడమి కావడం విశేషం. ఈ అకాడమి ప్రామాణికమైన నిఘంటువులు, పదకోశాలు, కావ్యాలు, ప్రబంధాలు, వ్యాసాలు, విమర్శలు, కల్పనా సాహిత్యం, పరిశోధనాత్మక గ్రంథాలు, జీవితచరిత్రలు, అనువాదాలు మొదలైనవి అనేకం ప్రచురించింది.

సంగీత, నృత్య, నాటక లలితకళా అకాడమీలు తమ ఆశయాలకూ, లక్ష్యాలకూ అనుగుణమైన గ్రంథాలను ప్రకటించాయి. అంతర్జాతీయ తెలుగు సంస్థ ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న తెలుగువారికి పెక్కు గ్రంథాలను అందించింది. తెలుగు భాషాసమితి విజ్ఞానసర్వస్వ సంపుటాలను ప్రచురించింది.

తెలుగు విశ్వవిద్యాలయం ఈ ప్రచురణ సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఇంతవరకు 103 గ్రంథాలు వెలువరించింది.

ప్రస్తుత ప్రచురణ 'పీయూషలహరి' అపురూపమైన కృతి. అత్యంత ప్రజాదరణ పొందిన గీతగోవింద కావ్యకర్త జయదేవకవి రచించిన 'గోష్ఠీ రూపకం' ఇది. గీత గోవిందానికి పీయూష లహరి పూర్వరంగం వంటిదనవచ్చు. రెండింటిలోనూ శ్రీకృష్ణుని రాసలీలలు ఇతి వృత్తాలు. ఈ గోష్ఠీరూపకాన్ని ప్రసిద్ధ సాహితవేత్తలు శ్రీ వావిలాల సోమయాజులుగారు సేకరించి అనువదించి ప్రచురణకోసం తెలుగు విశ్వవిద్యాలయానికి అందించారు. వారి కృషిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను, వారికి కృతజ్ఞతలు అందచేస్తున్నాను.

'పీయూషలహరి'పై పండిత కె.కార్ సంస్కృతంలో వ్యాఖ్యానం రాశారు. ఈ వ్యాఖ్యానం, ఇంగ్లీషులో పీఠికతోపాటు నాగరలిపిలో సంస్కృత మూలపాఠాన్ని ప్రత్యేక ప్రచురణగా విశ్వ విద్యాలయం పాఠకలోకానికి అందిస్తోంది.

ఉత్తమ గ్రంథాలను అందించాలనే తెలుగు విశ్వవిద్యాలయం సంకల్పానికి ఈ గ్రంథం ఒక నిదర్శనం. ఇది తెలుగు పాఠకుల అభిమానాన్ని చూరగొంటుందని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు-4
తేది : 22-2-1990

**ఆచార్య సి. నారాయణరెడ్డి**
ఉపాధ్యక్షులు
తెలుగు విశ్వవిద్యాలయం

# శ్రీ జయదేవ కవి విరచిత

# పీయూషలహరి

# పీఠిక

### శ్రీ వావిలాల సోమయాజులు

## గీతగోవిందం

ఆంధ్రులకు అష్టపదులంటే అపరిమితమైన అభిమానం. బహుకాలం నుంచీ సంగీత విద్వాంసులు గాన విద్యాప్రావీణ్యానికి 'గీతగోవింద' గాన సామర్థ్యాన్ని ఒక ఒరపిడి రాయిగా నిర్ణయించి ఉండటం గమనించ దగ్గ విషయం.

అష్టపదులకు ఏతత్కృతికర్త ఉంచిన నామం గీతగోవిందం. గోవిందుని గురించిన గీతాలుగల ప్రబంధం కాబట్టి దానికీ పేరు ఉచితమని భావించి ఉండవచ్చును. అష్టపదులంటే అంత ఆదరాభిమానాలను ప్రకటిస్తున్నా ఆంధ్రులు తద్రచయిత జయదేవుని గురించి విశేషంగా తెలుసుకున్నట్లు కనిపించదు.

## జయదేవుడు

మహాకవి జయదేవుడు అద్వితీయ మహాభక్తుడుగా పరిగణితుడైనాడు. భక్త చరిత్రల వల్ల ఆయన జీవిత విశేషాలు కొన్ని తెలుస్తున్నవి. క్రీ.శ. 15వ శతాబ్దంలో చంద్రదత్తుడు కూర్చిన 'భక్తమాల'లో జయదేవుని జీవితం కొన్ని సర్గలలో (36–47) వర్ణితమైనది. ఆయనను గురించిన కొన్ని జనశ్రుతులు కూడా దేశంలో ప్రచారంలో ఉన్నవి.

జయదేవుని బాల్యదశను గురించిన విశేషా లేమీ తెలియటంలేదు. విద్యార్థిదశలో గురువుల యొద్ద పక్షం మార్చి మరొక పక్షం విద్యాభాసం[1] చేయటం వల్ల జయదేవుడికి పక్షధరమిశ్రుడనే పేరువచ్చిందని కొందరంటారు. కాని యీ బిరుదం గీతగోవిందకారునిది కాదనీ, ప్రసన్న రాఘవకర్త అయిన మరొక జయదేవుడిదనీ తెలుస్తున్నది. గీతగోవిందంలో జయదేవుడు "పద్మావతీ చరణచారణ చక్రవర్తి" నని

---

1. ప్రతిభ–జనవరి 1938– 'జయదేవుడు' – రాయప్రోలు సుబ్రహ్మణ్యము పే. 209.

చెప్పుకున్నాడు. పద్మావతీదేవి ఆయన భార్య అనీ, దేవదాసి అనీ భిన్నాభిప్రాయాలున్నవి. ఇందులో ప్రథమాభిప్రాయాన్నే పండిత లోకం అంగీకరించింది. బహుకాలం సంతానం లేక ఒక బ్రాహ్మణుడు జగన్నాథస్వామి నారాధించి ఒక పుత్రికారత్నాన్ని పొంది ఆమెకు పద్మావతి అని నామకరణం చేసి మహా విష్ణువుకు తప్ప నన్యుల కామె నీయనని నిశ్చయం చేసుకున్నాడట. ఆమెకు యుక్తవయసు వచ్చిన తరువాత పుత్రికను వెంటతీసుకుని ఆమెను దేవదాసిగా స్వామిపేర విడిచిపెట్టటానికి పురుషోత్తమ క్షేత్రానికి వెడుతుండగా జగన్నాథస్వామి సాక్షాత్కారించి 'ఓ భక్తశ్రేష్టుడా! నా కర్పింపదలచిన యీకన్యకను నా అంతరంగ భక్తుడైన జయదేవుడి కర్పించు. అదే నా కమితానంద మని పలికినాడట! అప్పుడు పరివ్రాజక శ్రేష్ఠుడుగా ఉన్న జయదేవుడామెను స్వీకరింప నిరాకరింపగా తండ్రి 'ఇది భగవదాజ్ఞ' యని పుత్రిక నట నుంచి పోగా జయదేవు డామె శుశ్రూషను స్వీకరించి క్రమముగ స్నేహ భావము పెంపొందిన పిమ్మట వివాహమాడి నటుల 'భక్తమాల' వల్ల తెలుస్తున్నది.

జయదేవుడు ఉపాస్యదేవత అయిన నారాయణమూర్తి కైంకర్యం కోసం ధనార్జన చేయటానికి బృందావనం, జయపురం మొదలయిన ప్రదేశాలకు వెళ్ళి తిరిగి వస్తుండగా దారిలో చోరులు ఆయన ధనాన్ని అపహరించి కాళ్ళూచేతులు విరుగగొట్టి పోయినారట! ఒక ప్రభువు వేటకు వచ్చి ఆయన దుర్దశను జూచి రాజధానికి తీసుకొనిపోయి చికిత్స చేయించి స్వాస్థ్యం చేకూర్చిన తరువాత పద్మావతితో ఆ కవి అక్కడనే కాపురం చేస్తూ ఉన్నాడు. యతి వేషాలు వేసుకొని వెనుకటి చోరులు ఆ రాజధానికి వచ్చినా తెలుసుకొని కూడా వారికి జయదేవుడు శిక్షచెప్పింపలేదట![2]

జయదేవస్వామిగా వేదవ్యాసులే నిజాంశతో తిందుబిల్వ గ్రామమున జనించినారని యొక ప్రతీతి యున్నది. జయదేవుడు పదునెనిమిది క్రోసుల దూరంలో ఉన్న గంగానదికి నిత్యమూ స్నానానికి వెళ్ళి వచ్చేటవాడట. గంగాదేవి ఆయన కష్టాన్ని జూచి ఓర్చలేక ప్రసన్నరాలై "ఒకమాట, నీవు నిత్యమూ నా దగ్గరకు రాలేవు. నేనే నీ

---

2. "శిష్యునిపైగల వాత్సల్యంతో అతని దేశానికి వెళ్ళి వచ్చేటప్పుడు ఆ శ్రేష్ఠి శిఖామణి స్వామికి తెలియకుండా పల్లకీలో దాచిఉంచిన ధనాన్ని బోయీలే అపహరించి జయదేవుని కాలుచేతులు విరుగగొట్టి యరణ్య మధ్యమున విడిచి పారిపోయినట్లు మరియొక కథ" గీత గోవిందము – పీఠిక : ఎ.వి. నరసింహ పంతులు పే. 12 (M.Adhi & Co. Madras-Publication 1911)

దగ్గరకు వస్తాను" అని కెందులిప్రాంతానికి వెళ్ళిందని మరొక కింవదంతి. తన కపకార మొనర్చిన చోరులు సాధు వేషముల ధరించి తిరుగుచుండగా రాజభటులు వారిని పట్టుకొనినపుడు జయదేవస్వామి వారికి రాజుసన్నిధిని సన్మానమును కల్పించి పంపుచుండగా వారిని మార్గమధ్యమున పృథ్వి తన గర్భమున జేర్చుకొన, రాజభటులు వచ్చి విన్నవించినారట! అపుడు జయదేవస్వామి యా ప్రాంతమున కేగి గరుడ వాహనుని ప్రార్థింప నాతడు ప్రత్యక్షమై ద్రోహుల్ని మరల పుడమినుండి రప్పించి పంపినట్లు మరియొక కథనము వినిపించు చున్నది.

పద్మావతీదేవి పాతివ్రత్యమును బరీక్షింప నొకమారు సాత్యకిరాజు స్వామి ఇంటలేని సమయమునందు విచ్చేసి 'మీ భర్త దుర్జనులచే హతమైనా' దని ఒక యశీకవార్త వినిపింప నామె యాత్మహత్య చేసుకొనగా జయదేవస్వామి తిరిగివచ్చి కృష్ణ సంకీర్తన మొనర్చగా నామె 'సుప్తిబోధిత' వలె మేల్కొనినట్లు మరియొక జనశ్రుతి వినవచ్చుచున్నది.

ఇట్టివి అభూత కల్పనలని త్రోసివేసినను స్వామి అసామాన్య శక్తి సంపన్నుడని అంగీకరించుట కెట్టి విప్రతిపత్తియును లేదు.

## జయదేవుని జన్మస్థానం

జయదేవ మహాకవి జన్మదేశాన్ని గురించి పండిత లోకంలో భిన్నాభిప్రాయా లున్నవి. పండిత పరంపరలో అతడు ఉత్కల దేశస్థుడని ఒక అభిప్రాయం ఉంది. ఆయన వంగ దేశంలో జన్మించాడని కొందరు విద్వాంసులు నిర్ణయించారు. జయదేవ కవి తన జన్మస్థలాన్ని గురించి ఏడవ అష్టపది ముద్రికలో "తిందుబిల్వ సముద్ర సంభవ రోహిణీ రమణేన" అని సూచించినాడు. కలకత్తా సర్వకళాశాలలో ఓఢ్ర పండితులు, శ్రీ వినాయక మిశ్రో మహాశయులు ఒకమారు శ్రీ శివశంకరులకు ఒక లేఖ వ్రాస్తూ[3] జయదేవ మహాకవి జన్మస్థానాన్ని గురించి ఇలా వ్రాసినట్లు తెలుస్తుంది.

"జయదేవుడు ఉత్కలదేశంలోనే పుట్టినట్లు నిస్సందేహంగా చెప్పటానికి తగినంత ఆధారం లేదన వలసి వస్తుంది. అయితే ప్రతాపరుద్ర మహారాజు పదహారో శతాబ్దిలో రాజ్యం చేశారు. ఆయన జగన్నాథ దేవాలయంలో దేవదాసీలు 'గీత గోవిందం' తప్ప మరేదీ పాడకూడ దన్నట్లు ఒక శాసనంలో కనపడుతోంది. మహారాష్ట్ర దేశంలో ఒకానొక

3. ప్రతిభలో 'జయదేవుడు' (సం. 2 సంచిక 3) అన్న వ్యాసంలో ప్రకటితము.

వైష్ణవశాఖ వారి సంప్రదాయంలో జయదేవుడు ఉత్కలదేశంలో జన్మించాడనే ఉంది. ఇప్పటికీ ప్రతీ సంవత్సరమూ జయదేవ గౌరవార్థం వేదువి గ్రామంలో 'మేలా' జరుగుతున్నది. కాబట్టి వంగ దేశ విద్వాంసులు ఆ గ్రామమే కేందు బిల్వ మని అంటున్నారు.

ఈ లేఖనుబట్టి జయదేవుని జన్మస్థాన మిదమిత్థమని నిర్ధారితం కాలేదు. కానీ ఉత్కల దేశ గ్రంథకర్తలు జయదేవుడు 'తమవా'డని ఉద్ఘోషించినారు. గీతగోవింద ప్రతుల్లోనే కేందు బిల్వానికి తిందుబిల్వమూ బిందుబిల్వమూ అనే రూపాంతరాలు కనిపిస్తున్నవి.

కొందరు జయదేవుని కేందుబిల్వమును వంగదేశంలోని వీరభూమి జిల్లాలోని కేందులి గ్రామమని భ్రాంతి పడినారు. అది అజయనదికి ఉత్తర తీరాన ఉన్నది. అజయ భాగల్పూరు జిల్లా దక్షిణాంశములో పుట్టి నంటాల్ పరగణా దక్షిణాంశములో ప్రవహించి తరువాత వీరభూమి, వర్ధమాన జిల్లాల మధ్యగా, తూర్పుగా వెళ్ళి కాటోజార్ దగ్గిర భాగీరథిలో పడుతుంది. వీరభూమి జిల్లాకు ప్రధాన పట్టణమైన సురికి ఇది రమారమి తొమ్మిది క్రోసుల దూరంలో ఉంటుంది. ఈ గ్రామంలో రాధాదామోదర విగ్రహాలు ఉన్నవి. అందువల్ల ఇది జయదేవుని జన్మ గ్రామమై ఉంటుందన్న అభిప్రాయంతో తరువాత చారిత్రక పరిశోధన జరిపినవారు ఏకీభవించటం లేదు.

వీరి అభిప్రాయంలో కెందులి ప్రాంతము పూరీ జిల్లాలోని రెహంగ్ వద్ద ఉన్న– కెందులి సానసము, కెందులి పట్నము, కెందులి దౌళి– మూడు గ్రామములలో కలసిన దేశము. ఇవి 'ప్రాచీ'నది ఒడ్డున ఉన్నవి. ఈ నది ఒరిస్సా దేశీయుల దృష్టిలో పరమ పవిత్రమైంది. ఈ నదిని ప్రాచీన మాహాత్మ్యమూ, పద్మపురాణమూ సరస్వతీనది అని వ్యవహరించినవి. 'సాక్షాత్సరస్వతీ ప్రాచీ నాన్యధా నృపసత్తమా క్రోశే, క్రోశేచ లింగాని తటే తస్యా మనోరమే' అనే కపిల సంహిత లోని శ్లోకం ఇందుకు ప్రమాణము. కెందులి గ్రామ సీమనుండి రెండు మైళ్ళ దూరంలో కుశభద్రానది రెండు పాయలతో ప్రాచీనదిని కలిసే చోటును జనం 'త్రివేణీసంగమ' మని వ్యవహరిస్తారు. కెందులి గ్రామంలో వాసుదేవ విగ్రహాలు నారాయణ నామంతో అనేకం కనిపిస్తున్నవి. ప్రాచీనది ఒడ్డున నిలిచి ఒకమారు సింహావలోకనం చేసే వారికి చైతన్యస్వామి కాలంలో పంచమహాపురుషుల్లో ఒకడని ప్రసిద్ధి పొందిన అచ్యుతానందుడు శూన్య సంహితలో కెందులిని వర్ణించిన అతిశయమంతా గోచరిస్తుంది. అందువల్ల జయదేవుని జన్మగ్రామం

ఒరిస్సాలోని ప్రాచీననది ఒడ్డున ఉన్న కెందులి అని అనటం సమంజసం అని చరిత్రజ్ఞులు నిర్ణయించినారు[4].

కెందులి వీరభూమి జిల్లాలోని అజయ నది ఒడ్డున ఉన్నదని కొందరు భ్రమపడి వ్రాయటానికి కారణాలు క్రింది ఈ రెండు శ్లోకాలు.

"గోవర్ధనశ్చ శరణో జయదేవ ఉమాపతిః
కవితారాజశ్చ రత్నాని సమితౌ లక్ష్మణశ్చచ"

(వీరభూమి వివరణము పే 196)

"వాచః పల్లవయ త్యుమాపతిధరః సందర్భ శుద్ధింగిరామ్
జానీతే జయదేవ ఏవ, శరణశ్లాఘ్యో దురూహ ద్రుతేః
శృఙ్గారోత్తర సత్ప్రమేయ రచనై రాచార్య గోవర్ధనః
స్పర్ధీ కోపి న విశ్రుతిధరో ధోయీకవి క్ష్మాపతిః"

(గీతగోవిందం సర్గ 1. శ్లో. 4)

ఇందలి మొదటి శ్లోకమును నవద్వీపములోని సభామంటప భిత్తిక మీద ఉండగా శ్రీవాది సనాతన గోస్వామి చూచినట్లు వంగదేశంలో ఒక ప్రథ ఉన్నది కానీ సనాతన గోస్వామి ఈ విషయాన్ని గురించి ఆయన గ్రంథాలలో ఎక్కడా పేర్కొనలేదు. అందువల్ల ఈ శోక్లాన్ని ఎవరో జయదేవుని వంగవాసిని చేయటానికి కల్పించి ఉంటారు. "వాచః పల్లవ యత్యుమాపతిధర" ఇత్యాది శ్లోకాన్ని జయదేవ మహాకవి వ్రాసి ఉంటాడని అనటానికి వీలులేదు. అది ఎవరివల్లనో 'గీతగోవిందం'లో ప్రవేశించి ఉంటుంది. గీతగోవిందప్రబంధానికి ప్రప్రథమంలో వ్యాఖ్యానం వ్రాసిన కుంభరాణా పలికిన "ఇదానీంకవిః కవి గణనాయాం పరైరపి కవిభి రహం పరిగణిత ఇతి స్వప్రశంసార్థం క్షేపకమపి తత్కృతం శ్లోకం స్వగ్రంథస్వ కుర్వన్నాహ" అన్న వాక్యం నేటి చరిత్రజ్ఞుల పైఊహకు ఉపోద్బలకంగా కనిపిస్తుంది. కుంభరాణా అభిప్రాయం కూడా దీన్ని ఎవరో గీతగోవిందంలో ప్రవేశపెట్టి ఉంటారనే.

కాబట్టి వంగదేశం జయదేవుని జన్మస్థానమని చెప్పటానికి ఎవ్విధమైన ఆధారమూ కనిపించడం లేదు. అతడు ఉత్కల దేశస్థుడనుటమే సమంజసము. దీనికి అనుగుణంగా ప్రాచీనులు వ్రాసిన గ్రంథాలలో ప్రబలాధారాలు కనిపిస్తున్నవి. సంస్కృత భాషలో

4. Journal of the Kalinga Historical Research Society, March 1947 Introduction to Kavi Jayadeva in Gita Govinda-H.K. Mukharji.

భక్తమాల గ్రంథాన్ని చెప్పిన చక్రదత్తుడు జయదేవుణ్ణి గురించి వ్రాస్తూ ఆయన వ్యాస భగవానుని అవతార మనీ, జగన్నాథనిలయమైన పూరీకి దగ్గిరగా ఉన్న తిందు బిల్వ మతని జన్మగ్రామమనీ చెప్పినాడు. ఇదే అభిప్రాయాన్ని గ్వాలియర్ నవజీ, మహారాష్ట్ర దేశీయుడైన మహాభక్తి విజయ కర్త మహాపతీ పలికినారు. అస్సాంలోనూ, మహారాష్ట్రంలోనూ జయదేవుడు ఉత్కల దేశీయుడేన న్న ప్రతీతి. గదుని సంప్రదాయ కులదీపికలో జయదేవుడు ఉత్కల దేశీయుడని వ్యవహృతము కావటమూ జయదేవుని జన్మదేశం ఉత్కలమనే నిరూపిస్తూ ఉన్నవి.

జయదేవుడు రాఢ దేశస్థుడని శ్రీసునీత కుమార ఛటర్జీ మతము

**జయదేవుని కాలం**

జయదేవ మహాకవి కాలనిర్ణయమును గురించికూడా భిన్నాభిప్రాయాలున్నవి. మేవాడ ప్రభువు కుంభరాణా గీతగోవిందానికి ప్రథమంలో వ్యాఖ్యానం వ్రాసినాడు. ఆయన క్రీ.శ. 1419వ సంవత్సరంలో సింహాసనాన్ని అధిష్ఠించాడు. అందువల్ల జయదేవ కవికూడా ఆ ప్రాంతం వాడై ఉండవచ్చునని ఒక అభిప్రాయం ఉన్నది. జయదేవుడు రామానందుని శిష్యుడని ఉన్న ఒక ప్రవాదాన్ని ఆధారం చేసుకుని కొందరు ఆయన క్రీ.శ. 14వ శతాబ్దంలో జీవించి ఉన్నాడు గనుక ఇతడు కూడా క్రీ.శ. 14వ శతాబ్దివాడనినారు. 'హృది బిసలతాహారో' అన్న జయదేవ శ్లోకాన్ని విద్యాపతి సంపూర్ణంగా ఒక గీతికలో అనుకరించటం వల్ల అందుకు కొంచెం పూర్వుడై ఉంటాడని కొందరి అభిప్రాయం. వంగ వాఙ్మయ చరిత్రకారుడు విద్యాపతి క్రీ॥శ॥ 1380 ప్రాంతమువాడని నిశ్చయించినారు. పృథ్వీరాజు ఆస్థానకవి చాంద్ బర్దాయీ తన పృథ్వీరాజరాసోగ్రంథంలో 'జయదేవ అఠంకవీ కబ్బిరాయం, జినైకేవల్ కిత్తగోవింద గాయం' అని చెప్పినాడు. క్రీ.శ. 1193వ సంవత్సరాన టిలైన్ యుద్ధంలో పృథ్వీరాజు ఘోరీతో పోరాడి మృతినొందినాడు. కాబట్టి చాంద్ భట్టుకు జయదేవుడు పూర్వుడై ఉండాలి. జయదేవ లక్ష్మణ సేనులు సమకాలికులన్న నిశ్చయంతో రాజేంద్ర లాల్ మైత్రా జయదేవుడు క్రీ.శ. 1101–1121 మధ్య కాలములోని వాడనీ, రామకృష్ణ ముఖర్జీ అతడు క్రీ.శ. 1205 ప్రాంతంవాడనీ నిర్ణయించినారు. జయదేవ కవి కాలనిర్ణయమును శ్రీకరుణాకరకార్ మహా శయులు మరియొక నూతన మార్గమున ననుసరించి యొనర్చినారు. వారి మార్గము నూతనము. ప్రమాణములును

నూతనములు. జయదేవ కవికిని లక్ష్మణసేనునికి నెట్టి సంబంధమును వారి నిర్ణయమున పొడకట్టదు.

క్రీ.శ.16వ శతాబ్ధంలో ఉన్న కేశవ మిశ్రుడు తన అలంకార శేఖరంలో

"ప్రాక్ ప్రత్యక్ పృథివీభృతోః షరిషది ప్రఖ్యాత సంఖ్యావతాం
మహనీ యాద్భుత తర్క కర్కశతయా విచ్ఛిద్య విద్యామదమ్
యేకేప్యుత్కల భూపతే తవ సభా సంభావితాః పండితాః
పత్రం శ్రీజయదేవ పండిత కవి స్తన్మూర్ధ్ని విన్యస్యతి"

అని చెప్పినాడు. మహారాష్ట్ర భాషలో ఉన్న కవి చరిత్రలో క్రీ.శ.14వ శతాబ్దానికి పూర్వము పురుషోత్తమదేవుడు కళింగదేశాన్ని కటకం రాజధానిగా పాలించి, ప్రజా హితాన్ని కోరి, త్రికాండ శేషహారావళి ఏకాక్షర కోశమూ వ్రాసినట్లు ఉన్నది. జగన్నాథస్వామి ఆలయంలోని తాళపత్ర లేఖనాలు (మద్లపంజి) కామార్ణవుడు అనే (క్రీ.శ. 1142-1156) ఉత్కలరాజు నిత్యమూ గీతగోవిందాన్ని వినకుండా భోజనం చేసేవాడు కాడని ఉంది. ఈ కామార్ణవుడు జయదేవుని శిష్యుడూ, సమకాలికుడూ, జయదేవుని గీతగోవిందాన్ని నిత్యమూ జగన్నాథాలయంలో చదవటానికి ఆజ్ఞాపించినవాడు. క్రీ.శ.1180-1190 మధ్యన రాజ్యపాలనం చేసిన రెండవ రాజరాజుకు పురుషోత్తమ దేవుడనే నామం ఉన్నట్లుపై లేఖనాలవల్ల తెలుస్తున్నది. అభినవ గీతగోవింద రచనజేసి ఈరాజు జయదేవ గీతగోవిందానికి బదులుగా తన కావ్యాన్ని జగన్నాథస్వామికి వినిపించవలెనని ఆజ్ఞాపించినాడనీ, అందువల్ల ఆనాటి ఉత్కల వైష్ణవలోకం పట్టుపట్టటంవల్ల తిరిగి రాజు జగన్నాథస్వామి కోరిక కారణంగా సంధికి వచ్చి మరల గీతగోవింద పఠనాన్నే ఆదేశించి, గీతగోవిందంలో ప్రతిసర్గాంతము లోనూ తన అభినవగీతగోవిందంలోని శ్లోకం ఒకటిఉండేటట్లు చేసుకున్నాడనీ రామదాసు దార్ఢ్యభక్తి రసామృతము వల్ల వ్యక్తమౌతున్నది.[5] ఈ పరిస్థితి నన్నిటినీ

5. మహాపతి భక్త విజయంలో సాత్యకి పరంగా కల్పించిన కథకు ఆధారం లేక పోదన్న మాట. గీతగోవిందాన్ని తీసి భక్తులను తన గోవిందకావ్యాన్ని చదవమని నిర్భంధించిన పురుషోత్తమదేవుని వల్లనే అటువంటి అంశం భక్తవిజయంలో ప్రవేశించి ఉంటుంది. అభినవ గీత గోవింద శ్లోకం ఒకటి గీతగోవిందంలో ప్రతి సర్గాంతంలోనూ చేర్చి చదివినారనటం కూడా అభూత కల్పన ఐఉండదు. నిర్ణయసాగర ముద్రాక్షర శాలవారి గీతగోవింద కావ్యం చివరన ద్వాదశసర్గంలో కనిపిస్తున్న.

సమన్వయించి శ్రీ కరుణాకర కార్ మహాశయులు మహాకవి జయదేవుడు క్రీ.శ. 12వ శతాబ్ది వాడని నిశ్చయించినారు.

## జయదేవుని ఇతర రచనలు

జయదేవ మహాకవి ఇతర రచనలను గురించి శ్రీ రాజావెంకటాద్రి అప్పారావు బహద్దురు వారి ఆంధ్రాష్టపది పీఠికలో ఇలా ఉన్నది "ఈ కవి యొక్క చంద్రాలోకము, రతిమంజరి, కారక వాదము, తత్వచింతామణి అను గ్రంథములు వీరి అసమాన పాండిత్యమును తెల్పును. శృంగార మాధవీయ చంపు, కృష్ణదాసబిరుద నామముతో రచించిన వా రీకవియే కావచ్చును" ఇందులో ఉట్టకితమైన విషయాలను చరిత్రజ్ఞు లంగీకరించటంలేదు. చంద్రాలోకంలో సమాప్తి వాక్యం ఇలా కనిపిస్తున్నది. "ఇతి శ్రీపీయూషవర్ష పండిత శ్రీ జయదేవ విరచితే చంద్రాలోకాలం కారే అభిదా స్వరూపాభిధానో నామ దశయో మయూఖః" ఇతడు వంగదేశవాసి. సుమిత్రా మహాదేవుల తనయుడు, ప్రసన్నరాఘవకర్త. చంద్రాలోకకర్త మహాదేవ తనయుడనటానికి –

"పీయూష వర్ష ప్రభవం, చంద్రాలోక మనోహరమ్
సుధా నిధాన మాసాద్య, శ్రయధ్వం విబుధా ముదమ్
జయంతి యాయక శ్రీమాన్మహాదేవాంగ జన్మనః
సూక్తం పీయూష వర్షస్య జయదేవ కవేర్గిరః"–

అన్న వాక్యాలలో ప్రమాణం లభిస్తున్నది. జయదేవ మహాకవి భోజదేవ పుత్రుడు.

'గీతగోవిందం' జయదేవ మహాకవి రచన లన్నిటిలో ఉత్తమోత్తమమైనది. కవి దీనిని ప్రబంధమని వ్యవహరించాడు. ఆద్యంతాలు పరిశీలిస్తే గీతగోవిందంలో ఏకవాక్యత గోచరిస్తుంది. ఆలంకారిక లక్షణాలను అనుసరించి మహాకావ్యమని

---

"ఇత్థం కేలితతో విహృత్య యమునా కూ లేసమం రాధయా,
తద్రోమావళిమౌక్తి కావళియుగే వేణీభ్రమం బిభ్రతి
తత్రాహ్లాది కుచప్రయాగ ఫలయో లిప్సావతో హస్తయోః
వ్యాపారాః పురుషోత్తమస్య దదతు స్ఫీతాం ముదం సంపదమ్" ద్వా.సర్గ

అన్న శ్లోకం అందువల్లనే ప్రవేశించి ఉంటుందని పండితాభిప్రాయం.

అనిపించుకోక పోవచ్చును. అయినా ఇది రసవత్తర మహాకావ్యమని అనటానికి ఎటువంటి సందేహమూ లేదు.

"యద్గాంధర్వ కళాసు కౌశల మనుధ్యాయంచ యద్వైష్ణవం
యచ్ఛృంగార వివేక తత్వరచనా కావ్యేషు లీలాయితమ్
తత్సర్వం జయదేవ పండిత కవేః కృష్ణైకతానాత్మనః
సానందాః పరిశోధయంతు సుధియః శ్రీ గీతగోవిందతః"

అన్న వాక్యాలలో కవి రాధాకృష్ణుల అన్యోన్య ప్రేమను గానం చేసి అందలి పరమ శృంగార భావంలో విలీనులై కేవలులు కావలసిందని రసికలోకాన్ని హెచ్చరించాడు. నవ విధభక్తి మార్గాలలో 1) పితాపుత్ర 2) రక్ష్య రక్షక 3) ఆధారాధేయ 4) శరీరాత్మ 5) జ్ఞాతజ్ఞేయ 6) భోక్తృభోగ్య 7) స్వస్వామి 8) భార్యభర్తృ 9) శేషశేషి – అష్టమమైన భార్యా భర్తృ భక్తి మార్గం గీతగోవిందంలో నిరూపిత మౌటంవల్ల దీనికి అష్టపది అనే నామం అబ్బి ఉంటుందా?

నేడు గీతగోవిందం జగద్విఖ్యాతి పొందిన మహాగ్రంథం. ఇది బహుకాలం క్రిందనే పాశ్చాత్య దృష్టి నాకర్షించింది. దీనిని సర్ విలియం జోన్సు, ఎడ్విన్ అర్నాల్డు మహాశయులు ఆంగ్లభాషలోనికీ, లాసన్ లాటిన్ భాషలోనికీ, రూకెట్ జర్మన్ భాషలోనికీ అనువదించారు. ఉత్కలరాజు గీత గోవిందాన్ని అనుకరించి అభినవ గీతాగోవిందాన్ని రచించినాడు.[6] 'సంస్కృత భాషలో గీతగోవింద ప్రభావం వల్ల అనేక 'హర–గౌరులు' 'రామ–సీత'లు జన్మించినవి. అటువంటి వానిలో క్రీ.శ. 15.16 శతాబ్దుల నాటి రాయ రామానందుని జగన్నాథ వల్లభ నాటకము, కృష్ణలీలామృతము (కర్త వనమాలి, అముద్రితము– 15వ శతాబ్దము). క్రీ.శ. 17వ శతాబ్ది నాటి యతీంద్ర రఘునాథసూరి ముకుంద విలాసము (అముద్రితము) ముఖ్యమైనవి. ఒరియాభాషలో పిండిక శ్రీచందనుని (క్రీ.శ. 17వ శతాబ్దము) సంవత్సరము, దిన కృష్ణ దాసు (క్రీ.శ. 17వ

6. ఈ అభినవ గీతగోవింద ప్రతులు నేటికీ ఉత్కలదేశంలో దొరుకుతూవున్నవి. జగన్నాథ స్వామి ఆలయంలో తిరిగి ఈ గీత గోవిందాన్ని ప్రవేశ పెడతారేమో ననే భయంతో నరసింహ, కపిలేంద్ర ప్రతాపరుద్రదేవులు "కేవలము గీతగోవిందాన్ని మాత్రమే జగన్నాథ స్వామి వినవలె నని శాసించినట్లు శాసన ప్రమాణములు కనిపిస్తున్నవట– Vaishnavism in Orissa పే 43.

శతాబ్దము) అమృత సాగరబోలి, దేవ దుర్లభదాసు (క్రీ.శ.16వ శతాబ్దము) రహస్యమంజరి మొదలైనవి. అష్టపది ప్రభావం వల్ల జన్మించిన గ్రంథాలు, గీతగోవిందానికి లభించిన అనన్య సాధారణఖ్యాతి కారణంగా ఒరియా భాషలో దానికి అనేక పద్యకృతులు ప్రభవించినవి. ఈ పద్యానువాదాలల్లో ప్రముఖమైనవి– 1.రసవారిధి – బృందావనదాసు (క్రీ.శ. 15వ శతాబ్దము) 2. గీత గోవిందము–ఉద్దవదాసు (క్రీ.శ.16వ శతాబ్దము–కమ్మరి) 3. త్రిలోచనాదాసు–గీతగోవిందము (క్రీ.శ. 17వ శతాబ్దము – అంబష్ఠకుడు) (4,5) సదానంద కవిసూర్య, ధనుర్ధర దాసుల గీతగోవిందములు (17వ శతాబ్దము). స్వల్పమైన సంస్కృత వాఖ్యానంతో గద్యానువదితమైన గీతగోవింద ప్రతి ఒకటి కనిపిస్తున్నది.[7]

గీత గోవిందం కావ్య బాహ్య స్వరూపాన్ని తిలకించి కొందరు అందులో నిరూపితమైన భక్తి మార్గాన్ని అవగతం చేసుకోలేక కేవలము శృంగార సంబంధమైన అసత్కావ్యంగా పరిగణిస్తున్నారు. అది పొరపాటు. ఒరియా దేశంలో భాగవత సమాజాలు, గీతగోవింద ప్రతి లేనిదే సంకీర్తనలు ప్రారంభించవు, కృష్ణాష్టమినాడు కళింగంలోనూ కార్తీక శు–11 నాడు పశ్చిమ భారతంలో వల్లభ శిష్యులూ, గీతగోవిందాన్ని భక్తి తన్మయతతో గానం చేస్తారు. జైన రాజు శ్రీహర్షుడు కూడా క్రమసరోవర భ్రమణ సమయంలో గీతగోవిందాన్ని పాడించడం దాని ఆధిక్యానికి మరొక నిదర్శనం. విక్రమ సేన మహారాజు సభలో సంగీత విద్వాంసులు గీత గోవిందాన్ని గానంచేసి నట్టు చరిత్రలు చెప్పుతున్నవి.

గీతగోవిందం మొదట పశ్చిమాపభ్రంశభాషలో గానీ, ప్రాచీన వంగభాషలో గానీ పుట్టి, సంస్కృత భాషలోనికి అనువదితమై ఉంటుందని కొందరు విద్వాంసులు సంశయించినారు[8] దీనికి ముఖ్యమైన కారణం అష్టపదులను బోలిన అవపుట్టములను మాత్రాఛందస్సులు ప్రాకృత పింగళములో కనిపించటము.

---

7. ఆంధ్రభాషలో గీతగోవిందానికి సంపూర్ణమైన అనువాదం శ్రీ రాజా వెంకటాద్రి అప్పారావుగారి ఆంధ్రాష్టపది. ముద్దు పళని కొన్ని అష్టపదులను అనుసరించింది. శ్రీ కోమాండూరి కృష్ణమాచార్యులవారు ఒక అష్టపదికి పద్యానువాదం చేసినారు.

8. మజుందారు గీతగోవిందము అనువాద భూమిక.

అష్టపదిలోని కవితను గురించి జయదేవ కవిచెప్పుకొనిన

'యది హరిస్మరణే సరసం మనో
యది విలాస కలాసు కుతూహలమ్
మధుర కోమల కాన్తపదావలీమ్
శృణు తదా జయదేవసరస్వతీమ్' ప్ర.సర్గ,3వ శ్లో.

అన్న వాక్యములు ఎంతో సమంజసమైనవి. భాగవతానికి ద్వాదశ స్కంధాలు వలెనే దీనికి ద్వాదశ సర్గములు. సర్గనామములు సాభిప్రాయములు–సామోద దామోదరము, అక్లేశ కేశవము, ముగ్ధమధుసూదనము ఇత్యాదులు. రసము శృంగారము పది సర్గలవరకు విప్రలంభ శృంగారము, ఏకాదశ ద్వాదశ సర్గలలోని శృంగారము సంభోగము. నాయకుడు గోవిందుడు నాయిక రాధ.

జయదేవ కవి రాధ ఇంద్రాణి యైనట్లు జయదేవ స్వామి చరిత్రలో ఇలా ఉంది. "తొల్లి ఒకప్పుడు స్వర్గరాజ్య రమయైన ఇంద్రాణి వైకుంఠ ధాముని దర్శించటానికి వెళ్ళి అతని నవమన్మథ మన్మథాకృతి దర్శించినంత మాత్రాన మోహబాణ పాతాలకు స్వామిని చూచి "ఓ దీనార్తి హరా! నన్ను నీ ఉత్సంగానికి ఆశ్రితురాలిగా చేయవే" అని ప్రార్థించింది. భగవంతుడు ఆమెను చూచి "నేను సాధుసంత్రాణ శీలుడనై కృష్ణాఖ్యతో భూమిమీద అవతరిస్తాను. నీవు రాధగా జన్మించి నీ మనోరథసిద్ధి పొందుదువు గాక" అని అనుగ్రహించినాడు.[9]

గీత గోవిందానికి అనేక వ్యాఖ్యానాలు జన్మించినవి. వాటి అన్నిటిలో కుంభరాణా కృతమైన 'రసికప్రియ' మేల్తరమైనది. ఈ వ్యాఖ్యానంలో నిరూపితాలైన రాగాలనే కర్నాటక గాయకులు ఆదరిస్తున్నారు.[10] పెనుగొండ సామ్రాజ్యాధిపతి తిరుమల రాయలకాలంలో గీత గోవిందానికి ఆంధ్రులు ఒక వ్యాఖ్యానం వ్రాసినారు. ఇందు అష్టపదులలో భావములకు నాట్య శాస్త్రమును సమన్వయించుట విశేషము. ఆ ఆభావముల కనుగుణములైన అంగన్యాస కరన్యాసాదికములు ఈ వ్యాఖ్యానమున ప్రత్యేకముగా నిరూపితములైనవి.

---

9. శ్రీ గీతగోవిందం–పీఠిక పే7 (సంపాదకుడు. శ్రీఎ.వి.నరసింహంపతులు సం. 1911)

10. జయదేవకవి–అష్టపదులు – శ్రీమాన్ వింజమూరి వరాహ నరసింహాచార్యులు. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, డిసెంబరు 1937, జనవరి 1938.

## పీయూషలహరి : జయదేవుడు

జయదేవకవి కృతమైన 'పీయూషలహరి' నూతనంగా లభించింది[11] ఇది ఒక గోష్ఠీ ప్రబంధము. సాహిత్య దర్పణంలో చెప్పిఉన్న ఈ గోష్ఠీ లక్షణాలల్లో కొన్ని మాత్రమే పీయూష లహరికి పట్టినవి.

"ప్రాకృతైర్నవభిః పుంభి ర్దశభిర్వాప్యలంకృతా
నోదాత్త వచనా గోష్ఠీ కైశికీ వృత్తి శాలినీ
హీనగర్భ విమర్శాభ్యాం పంచషట్యోషి దన్వితా
కామ శృంగార సంయుక్తా స్యా దేకాంక వినిర్మితా"–

సా.ద–షష్ఠ పరిచ్ఛేదం.

'గోష్ఠిలో 9 లేక 10 మంది ప్రాకృత పురుషులు 5 లేక 6 గురు స్త్రీలు ఉంటారు. అంకం ఒకటే. గర్భ విమర్శ సంధులుండవు. ఉదాత్త వచనం ఉండదు. వృత్తి కైశికి, కామశృంగార ప్రధానం, 'పీయూషలహరి' ఇంతకంటే విశిష్టం. గుణోత్తరం.

ప్రాచీనకాలంలో జగన్నాథస్వామి ఆలయంలో అనేకములైన ఏకాంక నాటికలను ప్రదర్శించేవారు. పీయూషలహరిని కూడా అటువంటి నాటక సమాజంతో కలిసి జయదేవుడు ప్రదర్శించినట్లు పీయూషలహరిలోని "గోష్ఠీ శ్రీ జయదేవ పండితమణేః సావర్తతే సర్తితుమ్" అన్న వాక్యం వల్ల వ్యక్తమౌతున్నది. ఇటువంటి నాటక సమాజాలు నేడు కూడా అచ్యుతానంద సంప్రదాయులైన వైష్ణవుల్లో కనిపిస్తున్నవి. వీరు రాధను ప్రధాన నాయికగా గ్రహించి జగన్నాథ స్వామి ముందు రాసక్రీడలు సలుపుతుంటారు.

పీయూషలహరికి కథావస్తువు గీతగోవింద కథావస్తువే. రాధ ప్రధాన నాయికగా శ్రీకృష్ణుడు రాసలీల నడపటము కథాంశము. అందువల్ల పీయూషలహరిని గీతగోవిందానికి భూమికగా శ్రీకార్ మహాశయుడు అభిప్రాయపడినాడు.[12] దీనిని

---

11. సంస్కృత వ్యాఖ్యానముతోను, ఆంగ్లాను వాదముతోను దీనిని శ్రీ కరుణాకర కార్ మహాశయుడు కళింగ చారిత్రక పరిశోధక మండలివారి పత్రికలో సంపాదించి ప్రకటించినారు. సం1. సంచిక 4 మార్చి 1947)

12. *"The real sportive dance of Krishna (Rasa lila) with Radha at the head of the Gopis is fully shown in Gita-Govinda. This fully confirms that Piyusha Lahari is first and Gita-Govinda is the second part of Rasa lila. Piyusha Lahari is a supplement to Gita-Govinda"*

బట్టి జయదేవకవి ఈ రెండు రచనలను పురస్కరించుకొని రాసలీలా స్వరూపాన్ని పూర్ణంగా ప్రదర్శించినాడని ఊహింపవచ్చును.

కవి స్వోత్కర్షగా చెప్పుకున్న గీతగోవిందంలో 'సాధ్వీ మాధ్వీక! చింతా నభవతిభవతః' ఇత్యాదులను పోలిన శ్లోకాలు పీయూషలహరిలోనూ కనిపిస్తున్నవి. అందుకొక ఉదాహరణ :

"ఆశ్మద్రవీకర్తు మిమౌ సమర్థౌ, చతుర్దిశా నామపి పిష్టపానామ్
అహం వచోభి ర్జయదేవ నామా, కరచ్ఛటాభిశ్చ తుషారధామా"
"పరుషాశ్మము గరగించుట, కిరువురకే యనువు గలుగు హృద్యవచో వి
స్ఫురణను నే జయదేవుడ, కరముల చలువను దుషారకరు డొక్కరుడున్"[13]

కృష్ణ భక్త్యైకతాను డైన జయదేవకవి పీయూష లహరీ ప్రారంభంలో నటరాజు నుద్దేశించి క్రింది నాందీ మంగళశ్లోకాన్ని చెప్పటం గమనింప దగ్గ విషయం.

"కింజల్క ద్యుతిపుంజ పింజర దళ త్పంకేరుహ శ్రీవహమ్
శంపా సంపతి తాంశు మాంసల శరత్కాందబినీ డంబరమ్
లాస్యోల్లాసిత చండ తాండవ కళా లీలాయితం సంతతమ్
చక్రప్రక్రమ వృత్త నృత్త హరయో నిర్వ్యాజ మవ్యాత్ జగత్"

"పరితః కేసర పుంజ పింజర దళ త్పంకేరుహాకారమై
దర శంపా రుచిరాంశు మాంసల శరత్కాదంబినీ డంబర
స్ఫురణన్ పర్వత కన్యకా మధు నట త్ఫుల్లాస్య లాస్యాంచితం
బరుదౌ శంకర చండ తాండవము నిర్వ్యాజమ్ము మిమ్మోముతన్[14].

'కోమలకాంత' పదావళులతో, కైశికీ వృత్త్యుపేతమై, లాస్యోచితమై పీయూషలహరి ప్రాచీన గోష్ఠీ ప్రబంధానికి ఒక ప్రముఖ లక్ష్యంగా ఒప్పుతున్నదనటం నిస్సంశయము.

## వైష్ణవం

జగన్నాథస్వామి ఆలయంలో పీయూషలహరిని వసంతంలో రూపించినారు. జయదేవుడు గీత గోవిందంలోనూ, పీయూషలహరిలోనూ నిరూపించిన 'రాసలీల'

---

13. డా. ఎక్కిరాల కృష్ణమాచార్యుల అనువాదము

14. డా. ఎక్కిరాల కృష్ణమాచార్యుల అనువాదము

భాగవత పురాణాన్ని అనుసరించింది కాదు. భాగవత రాసలీల శరత్తులో జరుగుతుంది. జయదేవునికి మూలం బ్రహ్మవైవర్తము. అందులో రాసోత్సవాన్ని గురించి కృష్ణ జన్మ ఖండంలో ఇలా ఉంది. "రాసోత్సవం మహద్రమ్యం సర్వేషాం హర్షవర్ధనమ్, పూర్ణచంద్రోదయే సక్తం వసంతే రాసమండలే..... ఏకదా శ్రీహరిర్నక్త వనం బృందావనం యయో, శుభేశుక్ల త్రయోదశ్యాం పూర్ణ చంద్రోదయే మఘౌ.... యూధికా మాధవీ కుంద మాలతీ పుష్పవాయునా, వాసితం కలనాదేన మధుపానం మనోహరమ్". ఈ రాసలీల మూడు దినాలు మాత్రమే. భాగవత రాసలీల వంచశరద్రాత్రులు. జయదేవుని తరువాత జన్మించిన అనేక వైష్ణవ కవులు కూడా ఈ బ్రహ్మవైవర్తరాసమే అనుసరించారు.

జయదేవుని గీతగోవిందమూ, పీయూషలహరి అర్థం కావటానికి ఒరిస్సా వైష్ణవాన్ని గురించిన విజ్ఞానం కొంత అవసరము. కళింగదేశంలో క్రీ.శ. 8 శతాబ్దములో ప్రవేశించిన మహాయాన బౌద్ధం క్రమంగా వజ్రయాన, సహజయానాలుగా రూపొందింది. క్రీ.శ.729 నాటి ఒరియారాజు ఇంద్రభూతి, చెల్లెలు లక్ష్మీంకర వల్ల సహజయానం ఆదేశంలో ప్రవేశించిదని ప్రతీతి. ఇంద్రభూతి జ్ఞానసిద్ధిలో జగన్నాథుని బుద్ధదేవునిగా స్తుతించాడు. సహజయానాన్ని ప్రచారం చేసినవారు కౌపవాదులు ఓఢ్రదేశీయులు. వజ్రయాన సహజయాన వైష్ణవాలు కలిసి ఓఢ్రదేశంలో నూతన వైష్ణవానికి దారితీసి ఉంటవి. దానికి ముఖ్యమైన ప్రవక్తలు-జయదేవుడు, రామానంద రాయలు. సహజయాన పంథేయులు జయదేవుణ్ణి ప్రథమ ప్రవక్త గానూ, నవరసికుల్లో ఒకడిని గానూ పరిగణిస్తారు. క్రీ.శ 15, 16, 17 శతాబ్దాలలో ఓఢ్ర రచయితలు సరళదాసు, బలరామదాసు, అచ్యుతానందులు, పీతాంబరుడూ మొదలైన కవులు సహజయానాన్ని అనేక గీతాలలో ప్రశంసించారు.

రామానుజ మధ్వాచార్యు లిరువురూ పూరీ జగన్నాథానికి వెళ్ళి వైష్ణవతత్వాన్ని ప్రచారం చేశారు. తరువాతి వాడైన జయదేవుడు వారి ప్రభావం వల్లనూ, అనాదినుంచీ వస్తూ ఇంద్రభూతి చెల్లెలు తెచ్చి పెట్టిన సహజయాన బౌద్ధ ప్రభావం వల్లనూ నూతన రాధాతత్వాన్ని సాధించి ప్రబోధించినాడు. దానిని స్వీకరించి క్రమంగా అద్వైతాచార్య, ఈశ్వర పూరీలకు గురువైన మహేంద్రపురి వంగదేశంలో ప్రవేశపెట్టినాడు. ఆయన శిష్యుడైన ఈశ్వరపూరీకి చైతన్యమహాప్రభువు శిష్యుడు. చైతన్య ప్రభువు జయదేవుని

భక్తి జ్యోతిని అందుకొని వంగవైష్ణవ ప్రపంచాన్ని ఉద్యోతితం చేశాడు. అందువల్ల వంగవైష్ణవానికి ప్రథమ ప్రవక్త జయదేవుడే అని నిరూపితమౌతున్నది.[15]

అట్టి వైష్ణవభక్తికి 'పీయూషలహరీ' 'గీతగోవింద'ములు ప్రాణ ప్రవాహికలుగా చెప్పగదినవి.

## కృతజ్ఞత

శ్రీ జయదేవకవి విరచిత 'పీయూషలహరి' మూలప్రతి నా కంటబడి నాలుగు దశాబ్దాలు గడిచాయి. కంటబడిందే తడవుగా దీన్ని గూర్చి భారతిలో (వికృతి–మాఘం) ఒక సుదీర్ఘ వ్యాసం వ్రాశాను. అనేక రసజ్ఞుల అభినందన లందాయి.

ఇది మహాకవి జయదేవుని రచన. ఆంధ్రులకు ఇష్టమైన అష్టపదులుగల గీతగోవిందానికి పూర్వరంగమైన గోష్ఠీరూపకం – పీయూషలహరి. తెనుగు చేసిందాకా కునుకు పట్టలేదు  తెనుగు చేశాను – ఆనందంలో ఆవేశంలో.

ఆంధ్రులకు ఆవేశమున్నంతగా ఆలోచన ఉండదని ఒక అపప్రథ ఆలోచన వుండివుంటే అప్పుడే ఈ అనువాదాన్ని అచ్చువేసి, అందరి అందు బాటులోకి తెచ్చివుండేవాణ్ణి  తేలేదు. అదీ ఒకందుకు మంచిదే అయింది.

నా దగ్గర ఈ అనువాదమూ, దీనికి మూలమూ ఉన్నాయని పసిగట్టిన మిత్రులు – సత్కవి – శ్రీ ఊట్ల కొండయ్యగారు. వారిని వెంటబెట్టుకొని, ఉభయ కవిమిత్రులు డా.వి.వి.యల్ నరసింహారావుగారు 18–6–1989న, నా దగ్గరకు వచ్చి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణగా దీన్ని ముద్రించుకొనేందుకు అనుమతికోరారు. అంతకంటే

---

15. ఈ అభిప్రాయాన్నే సుకుమార సేన్ మహాశయుడు తన ప్రజబోలీ సాహిత్య చరిత్రలో ఈ రీతిగా పలికినాడు.

*This outlook of PREMA which we find systematised already in Bhagavata Purana but which does not seem to have affected popular conception of Krishnaism in Bengal up to the 15th Century A.D. We first come across in Bengal in the life of Mahendra Puri, who was the Guru of Advaitacharaya Isvara Puri and other contemporaries of Chaitany Deva. Isvara Puri was the Guru of Chaitanya Deva, so the Spirit of Mahendri passed unto Chaitanya Deva, to be developed into a wonder of the world" - History of Braja Boli lite rature. P.12*

కావలసిందేముందని 'సరే' నన్నాను. మూలప్రతులూ, అనువాదమూ, భారతిలో ముద్రితమైన పీఠికా రూప వ్యాసమూ అందచేశాను.

కాని డా. నరసింహారావుగారితో ఒక్కమాట అనక తప్పలేదు. 'నేను పీయూషలహరి తెలుగుచేసి దాదాపు నలభైయేళ్ళయింది ఇప్పుడు నాకు డెభ్భై యేళ్ళు దాటాయి. అనువాదంలోని ఔచిత్యాలనూ, పాఠ పరి పరిష్కారాలను సరిచూడవలసిన అవసరం వుంది. ప్రస్తుతం నాకు వాటిని సరిచూచే ఓపిక లేదు. కాని మీరున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం డైరెక్టరుగా చిరకాలం బహుభాషా గ్రంథాల పరిష్కరణ ప్రచురణ బాధ్యత వహించి, పండిన అనుభవంగలవారు. ఈ పీయూషలహరికి కూడా పాఠ పరిష్కారాది సంపాద కత్వ బాధ్యతలు మీరే వహించటం సబబుగా వుంటుంది. తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ విభాగం అధికారిగా ఇది మీ విధికూడా కావచ్చునేమో!' అన్నాను.

అవును వారు తమ విధిని యథావిధిగా నిర్వర్తించారు.

దాని ఫలితమే ఈ పీయూషలహరి పరిష్కృతప్రతి.

మూలానువాదాలు రెండింటినీ ప్రచురణకు అనుమతించిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుల ఉదాత్త సంకల్పానికీ, ఉదారాశయానికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

**(సం) శ్రీ వావిలాల సోమయాజులు**

శ్రీ జయదేవ కవి విరచిత

# పీయూషలహరి

(గోష్ఠీ రూపకము)

అనువాదకుడు

**శ్రీ వావిలాల సోమయాజులు**

# ‘పీయూష లహరి’లో పాత్రలు

| | |
|---|---|
| మాధవుడు | నాయకుడు |
| రసాలకుడు | సఖుడు |
| రాధిక | నాయిక |
| నవమాలిక | సఖి |
| ప్రేమకళ | సఖి |
| వకుళమాలిక | సఖి |

# పీయూషలహరి

## నాంది

ప్రకట : కేసరపుంజ పింజర దళత్కనక
పంకేజ విలసనము శంపా మనోజ్ఞాంశు
మధు శర త్కాదంబినీ డంబరోజ్జ్వలము
పార్వతీ మృదునటోల్లాస లాస్యాంచితము
చక్రక్రమోన్నట త్సాంబశివ చండ తాం
డవము నిర్వ్యాజమ్ము క్షేమ ప్రదమ్మగుచు
సంపూర్ణ దృష్టితో జగము నేలెడు గాత! 1

క్రీడగా కంపించు చంపకమ్ములు గాలి
దేలి చుంబింపగా లీల దూలెడి నల్ల
కలువపూ సొగసు నొల్కించుచును తేలగా
రాస లీలా విలాసముల లాలసలతో
వల్లవీ పల్లవీకృత వల్గిత జ్యోతి
నిరతమ్ము మా యెదల నెలిమి శోభించుతను. 2

## నాంద్యంతము

సూత్రధారుడు : (ప్రవేశించి) ఆలస్య మెందులకు? (పరికించి) అహో! ఈ మధుమాస మెంత మధురముగా నున్నది!

పంపాసరస్సులో కంపించు నలలలో
పర్వెత్తి చల్లనై సొంపులను జల్లు మ
ల్లీ ముకురములపైన చూరాడి వింతగా
మధుపములు హల్లీ సకం బాడ అబ్జముల

---

1. ఈ నాందికి డా.ఎక్కిరాల కృష్ణమాచార్యుల పద్యానువాదము పీఠికలోని 15వ, పేజీలో కలదు.

సిగ్గువడ చుంబించుచున్ మారుతుడు లతా
బృందమున నాడెడిని మందమందమ్ముగా, 3

ఓహో : భాగవతజన శీతమయూఖుడును, నీలాచల మౌళి మండన మణియు నయిన గరుడధ్వజుని యనుగ్రహమున నాయన ప్రాసాదము నందు ప్రసన్నులై సామాజికు లెల్లరును గోష్ఠి గావించి యున్నారుగదా! మఱియు నొక విశేషము.

మించు మించిన చిత్ర పృథుచంచలత్వమ్ము
చేతశ్చమత్కార చటుల సంచారమ్ము
పీయూష రుఙ్మండలీ స్రవత్ స్వచ్ఛమ్ము
సంచలన్మృగదృశా చలదపాంగమ్ము
ఆనంద సంధాయినియునైన జయదేవ
మహనీయ పండితమణిగోష్ఠి వర్తించు
మనసార నర్తింప మోహనము రూపకము 4

(యవనికవైపు విలోకించి) అహో! నా యీ యల్పకుటుంబ విశేష పేశలత్వము నేమని విన్నవించగలను? ఉదాహృతికి.

పెన్నెరు లెన్నో ప్రియమున నొక్కతె
పెన్చుచునున్నది వంకలు వంకలు
మంజుల మకరీ శోభల నొక్కతె
కులికెడి కుచముల మలచుచునున్నది
ఎంతో యందముగా వలయానికి
ఇంకొకకాంత వహించెడి భుజముల
కన్నుల బెళ్కులు కన్పించెడి నదె
కాటుక నీటుల బోటి యొకర్తుక. 5

అందువల్ల నేను సైతము పారిపార్శ్వకుని చేత రంగమంగళమును తరంగింపచేయు దును. ఓరి వత్సా, శృంగారకా! ఇటు రమ్ము.

పారిపార్శ్వకుడు : (ప్రవేశించి) భావుకా, (బావా!) ఏమి విజ్ఞాపించు చున్నావు?

సూత్రధారుడు : విమలౌ జ్ఞానులకు విపులముగ నమలగతి
చిత్తఖంజన చర్య, రంజనోజ్జ్వలకర్మ
గావింపగా లేనిదౌ నాట్యరంగమ్ము

ఆ ప్రేమ సంయోగమైన నెద్దియు గాని
గాన గల్గెడు నట్టిదౌ ఫలమ్మది యేమి? 6

పారిపార్శ్వకుడు : అయినచో మన కిప్పుడింత భావబంధురమైన ప్రబంధమెయ్యది?

సూత్రధారుడు : ప్రణయకోపముగొన్న పడతి పల్కెడి రీతి
వింత వాక్కుల పగిది విన ముచ్చటలు గొలపు
ఉరముపైని పటాంతరమునందు క్రీడించు
నురుకుచంబుల రీతి నొప్పు కనుపండువుగ
అల గవాక్షమునుండి తిలకింప గనుపించు
నమృతాంశు సామ్యమౌ నతివవదన మ్మటుల. 7

పారిపార్శ్వకుడు : (పరీక్షణగా) అంతటి కవి యెవరు?

సూత్రధారుడు : "పదునాలుగు భువనమ్ముల
పరుషాశ్మము కరగించుట
కిరువురె కడు శక్తియుతులు
చతుర వచుడు జయదేవుడు
అమృతకరుడు శశిదేవుడు" 8

అని యనుటకు సమర్థుడు.

పారిపార్శ్వకుడు : (నేపథ్యమున కభిముఖుడై) అట్లయినచో గోష్ఠీనర్తనాభినయ కోవిదులయిన కుశీలవులు సిద్ధపడుడు.

(నేపథ్యమున) సఖీ! ఇటు, ఇటు!

సూత్రధారుడు : (వీక్షించి ఓహో! అభినేత్రులయిన యీ భరతులది యెంతటి రసావేశము! రంగమంగళము వీణాశూన్యముగానే ప్రారంభించినదే!

చంద్రకళాకాంతి కరణి
తా శంకావహ యౌగద
ఈ పంకజముఖి వచ్చిన
నింకొక సఖి యామె ప్రక్క

---

8. దీనికి డా.ఎక్కిరాల కృష్ణమాచార్యుల పద్యానువాదము పీఠిక – 14వ పేజీలో కలదు.

మోహపునడకల మెలపుల
రోహిణి గతి నున్నది గద! 9

ఇక మన ముభయులము మాధవ రసాలకుల భూమికల ననువర్తింతము

(ఉభయులు నిష్క్రమింతురు)

**ఇది ప్రస్తావన**

(ఇరువురు సఖీమణులు ప్రవేశింతురు)

ఒకతె ఓహో, ఓవామాక్షీ! ఉజ్జ్వలుడౌ మాధవుండు
వల్లవీ ప్రపంచమందుపంమమున నాలపించి
మోహపరచకుండు నెవరి మానసంబు వంచకుండు? 10

మరియొకతె : అవునే ఓ రాధికాసఖీ! నిన్ను బోలినవారి విషయము వచింప నవసరము లేదు.

వెచ్చదనంబునకు నొచ్చి నిశ్వాసములు
చెక్కిళ్ళపై జేరి చందనాకులతమెయి
కర్పూర జలధిలో గలుగునట్లుగ పొండి
మమున మగ్నంబయ్యె మృదులమౌ తనుశోభ
కార్శ్యంబు నేర్పె నిదె కౌనుదీవియకు శుష్య
చ్చంద్ర రేఖాచ్ఛవిని చారు తర సుందరీ!
నంద నందన రూప సౌందర్య సౌభాగ్య
శోభలను గ్రోలినవె, శుభ్రములు నీకనులు? 11

రాధిక : సఖీ, నవమాలికా! ఈ యూకాశ లేఖినీ వర్ణ మెందు కారంభించుచున్నావు?

నవమాలిక : నిను బోలిన సుముఖుల కెటు
లనురాగము దాగు నెదల?
ఇరుల-వల్లరుల డాగివ
విరుల సౌరభములు వీచు. 12

రాధిక : ఇక నా రెండవ ప్రాణమవయిన నీ యొద్ద దాపరిక మెందుకు? వినిపింతును.

ఏ తరిని కేశవుం డింపుగా వేణువును
మంద మృదు ధోరణుల నొంది యూదగ నెంచు
నపుడు పద్మాయతాక్షుల యాత్మలందు మద
నార్తిహేతువుగాగ నూర్చె వేడిమియూర్పు
లధరాళ మ్లానిమను నందముగ రూపించు
అంతేకాదు.

హర్ష యోగ్యమ్ము కేదారరాగమునందు
మధురముగ స్రవియించు మంజుమురళీ స్వనము
పద సరోజ స్వర్ణకటక నిర్వాణ మే
నియు నింత మోహనమ్ముగ జెలంగగ లేదు. 14

నవమాలిక : (పరీక్షగా జూచి శిరసు నించుక యూపుచు) తెరలో నుండి ఎవరో రాధికా లోచనములను మూయుచున్నారు.

రాధిక : (సీత్కారముతో)
ఓ రతి లంపట మానస,
ఓ మాధవ, ఇది యేమిటి?
కన్నుల చలియింప జేయు
కరతలముల దొలగింపము
పరమభక్తి షట్పదమై
పాదపద్మ సేవికగా
ఓ మురారి! ఇదిగో నీ
రాధిక, ఇదిగో, యిట నున్నది. 15

సఖి : (రాధికాచిబుకమును పైకెత్తి) నీ సతీవ్రత మాహాత్మ్య మిదియేనా?

రాధిక : (లజ్జచే మోము వంచి) సఖీ! భ్రమచే నిట్లంటిని.

సఖి : సఖీ! కాదు, కాదు, విభ్రమముచే నంటి ననుము.

రాధిక : పేశలము రమ్యమ్ము నాసికా భూషణమ్ము
కుండలమనోజ్ఞ మండితము గండస్థలము
నవనీలకుంతల వికుంచితము పింఛమ్ము
ముల్లోక మోహన తమాల నీలిమను, కాం

చీ పటముతో వెలయు మాధవుడు, ప్రణయపతి
ప్రాణమును మించు మాధుర్యమని యనిపించు 16

సఖి : ఎక్కువయా? అందఱకు నెక్కువయే. అయినను కులాంగనలకు నిందాపరుల పిశాచతాండవ జిహ్వను నివారించుట సముచితము సుమా!

రాధిక : సఖీ! నవమాలికా! విషమసాయక బాణపాతము వలన గలిగిన మర్మవ్యథ నీ వంటిదాని కేమి తెలియును అవసరమైన యెడ ప్రేమకళ నడుగుము.

ప్రేమకళ : గురుభీతియు, జననిందయు
ముమ్మాటికి జేరనటుల
పతిభక్తికి రక్షసేయ
ప్రతినసేయవలయు గదా!
మరచితివే, ఓ సఖియా!
మానితివే మరి నీ వది!
విభుని లేత చిబుకమ్ముల
నూటలూరు మృదు పవనము
లూదెడు వంశీస్వనములు
ధీ పాటవ విశ్లథత్వ
మిడవచ్చును మందముగా 17

రాధిక : (వంశీనాద మాలించి ప్రేమావస్థ నభినయించును)

ప్రేమకళ : పులకలను నెడనెడను పొటమరించిన చెక్కి
ళుల నిగ్గుతోడి మధుశీత్కృతావళులతో
ముఖసరోజము కాగ ముగ్ధరుచికోశమ్ము
కుచకాంచనాద్రులను స్రవియింప ముచ్చెమట
మదనహేతి విఘాత భీతవై, సకియరో,
పలుమారు దీనముగ వణకెద విదేలనే? 18

రాధిక : (నీవీ సంయమము నభినయించును)

నవమాలిక : (హాస మొనర్చుచు)
ఓహోహో పృథునితంబ, ఓహో ఓ కోమలాంగి!
నీవీ బంధన చతురిమ కేల యింత శ్రమపడెదవు?
పీతాంబరుడై మురహరి స్మిత మధుర ప్రియవీక్షణ
మొనరింపగ నిలువలేక లొంగి బద్ధవైపోవా? (19)

రాధిక : (నవమాలికను విలోకించి యానందముతో)
ఓహోహో, హరిమురళీ
సుస్వనోహ లూర్జితములు!
వరసతులకు గలిగె నవే
చికుర పాళి పులకలు చెలి !!

నవమాలిక : (లజ్జతో మోము వంచుకొని స్వగతముగ)
కాంచన మృదువసనధారి, శ్యామల తనుకాంతియుతుడు,
గోపాలుడు కనుపింపడు ఏ విభు నేత్రాంచలమ్ము
లేపుజూపు సమయమ్మున పూర్ణేందుడు మృగనయనల
పై జల్లెడు తిందుక పావకము, మృత్యువిహరణములు
మలయజగంధములు తాపకందళములు, బ్రతికె వారి
శాత్రవు, డిక కంఠమాల యమవార్తావహ యగునా !
ఆ మురహరి, మాధవుండు, ఆ సుందరగోపాలుడు
ఎయ్యెడ గనుపింపడు, మరి యీ తలిర్చు దశ లేమో! (21)

లేక, యొకవేళ

విషమాస్త్రు డిడిన యురిత్రాడు మురహరుని వం
శీ నినాద మ్మెపుడు తరుణ వనితల కమ్ర
కంఠముల నిరికెనో యపుడు పులకల గండ
పాళితో జిక్కినది సౌభాగ్య బంధనము. (22)

(నేపథ్యమున)
దేవతల పైడిమకుటాల వెలుగుల నొరసి
యెవ్వాని శ్రీపాదకంజములు కందినవొ
యాతడే మన్మథ విరాళిగొను వ్రజకాంత
లను మనుపు, రాగరసిక శ్రేష్ఠ వ్రజరాజు
గని కొలిచెదను నేను పరమ ప్రణయమ్ముతో. (23)

ప్రేమకళ : రసాలకుడు హస్తగత చిత్ర ఫలకముతో నిటె వచ్చుచున్నాడు.

రసాలకుడు : (వర్ణితు డయినట్లు ప్రవేశించి)
తారహార సుందరు ఘను
నీల నీరదోరు ధాము
పాలితువలె లీల గొలుతు,
వామనీకృతస్తనాంత
వల్లవీ నికామ కామ
నీతిరసికు ప్రేమ గొలుతు. (24)

రాధిక : ఈ రసాలకుని హస్తమునందున్న యీ చిత్ర ఫలకమే సర్వానర్థ కందళ ములకును మూలకందము.

నవమాలిక : సఖీ ! నీవే దీని నంకురింపజేసితివి. "దీనిని వకుశమాలిక చేతి కీయవల" దని నేను ముందే వంచించితిని కదా !

ప్రేమకళ : సఖీ, రాధికా! చపలత్వముచేత నది దాని నెటనో పారవైచి యుండును. దాని నిప్పు డీ వటువు గైకొనినాడు. మరి యిప్పుడు మనము దీనిని గ్రహించు టెట్లు?

రాధిక : నే నిప్పుడీ విషయమునే యోజించుచున్నాను. ఎట్లయినను సరియే కాని యిది మాత్రము గోవిందకరా రవింద మరందముచే నభిషికత్తము కారాదు.

నవమాలిక : అనుమానమేల? అట్లగుట నిశ్చయము.

రాధిక : ఫలితమును బట్టి నిర్ణయ మొనర్తము లెమ్ము.

రసాలకుడు : (ప్రవేశించి) శుభమగుగాక!
(చిత్ర ఫలకమును సమర్పించును)

అందఱును : (ఫలకమును జూచి)
చిరు చంద్రకళ వెటుల నెడబాటు నోర్చుకొని
తప్తచింతామణివిగా నిల్చితివి నీవు
మదన దారుణ తాపధాటి కెటొ మేమే చ
కోరముల భాతి చిత్తోద్వేగమున చోర

గతి జేరి నిను, దారటాడితిమి తన్విరో!
నిండుగా గల్పించు నిది యెల్ల నచ్చెరువు. 25

సఖీ : ఈ మురారి రూప శ్లోకనము నిన్ను గూర్చియే. (అందఱు "కాదు, కాదు నిన్ను గూర్చియే" అని కలహింతురు)

ప్రేమకళ : (ఆత్మగతముగ)
పాదద్వయమ్ము నూపురపూరితమ్ముగను,
కటితటిని పీతాంబరాలంబనమ్ముగను,
వక్షమున కుంకుమము, వేణుస్వనమునందు
నందనరసస్యంది, అమృతారుణోష్ఠమున
ప్రసరించు హసనమ్ము, పింఛచూడమ్ముతో
విభ్రమము వెలయు నా నీలమేఘము నొంద
నెవ రొనర్చిరొ కదా, యింత ఘనతర తపము? 26

(నేపథ్యమున)
"రాకా శీత మయూఖుని బోలెడు
సుందర వదనుడు, విస్ఫారోన్నత
వక్షఃస్థలుడును, ఖేలత్కేసరి
మధ్యముడును, మదగజరాడ్గర్వా
పహుడును మరకత సంపద్దోర్దం
బరుడౌ శ్రీపతి రమ్యాకారుం
డెవ్వరి రంజింపం డీ సృష్టిని?" 27

ప్రేమకళ : (దర్శించుట నటించి) నీలోత్పలమును మాటిమాటికి హృదయమునకు హత్తుకొనుచు వకుళ మాలిక సంబరముతో మురిసిపోవుచు నిటే వచ్చుచున్నది:

వకుళమాలిక : (వర్ణితమైనట్లు ప్రవేశించి)
ముగ్ధమోహన మంజులమ్మగు
మధుర తరళిమ సరణిలో మధు
తృప్త చుంబన కళల పోలిక
తొగరు పెదవుల నెగయు సుధలో

మురళిరవళులు తొలకరించెను
చేతనమ్ములు పులకరించెను.
అలలు తేరిన కలతదీరిన
మురళి తరళిమ సరళిలో చిఱు
తొగరు పెదవుల నెగయు సుధలో
పులకరించెను రసిక వాహిని. 28

(వీక్షించి) ఓహో, ఈ పొగడ చెట్టు వైపుననే సఖుడు. రసాలకుడు వెంటరాగా రాధిక యనురాగకళికను వికసింప జేసికొనుచున్నది. నేనును సంభావించెదను.

రాధిక : (సమీపించి) ఈ యవతంస నీలోత్పలము నింతగా సంభావింతు వేమి విశేషము?

వకుళమాలిక : (రాధికచెవి దగ్గరకు జేరి)
ఉజ్జ్వలోత్పల కోరకమ్మది
యుండ నే కాంతముగ నీతో
నవ్యతను తా నందనందన
నయన నీతి వినిర్జితమ్మై
నందసూను శ్రవఃకపోలము
విడిచి భృగుపాతమ్ము నొందెనె! 29

రాధిక : సఖీ! ఈ కర్ణావతంసముచేత బ్రతికితిని.

నవమాలిక : సఖీ! అలంకరింపబడిన కృష్ణునిచేతనా?

(ఆకాశమున)
ఓహో, మురారి మురళి! ఉరునాందీ మధుసరళి!
రాసోత్సవ నాటికలో జగముల ప్రస్తావించును
మునివర్యుల హృదయములను ముగ్ధభావవశమొనర్చు. 30

అందఱును : (ఆనందముతో) నిజము!నిజము!! (మదనావస్థ నటింతురు)

రసాలకుడు : (పులకించి, అంజలి వహించి)
ఒక్క వాక్కుకు, మనసు కొదుగంగ బోనిదియు
ఒక్క యాకారమని యొప్పుకొనబోనిదియు

వల్లవీ తరళ నేత్రాపాంగముల చేత
పల్లవీకృత వస్తు నాశ్రయించెద నేను 31

(విలోకించి) గోపీ మనోహారిణీ సూత్రధారియై,
కందర్ప బాణముల కాందిశీకునివోలె
నవ్య నందనమైన బృందావనమునందు
నందసూనుడు వేణు నాదమ్ము లొలికించె. 32

నవమాలిక : ప్రాలేయాంశుని శోభల
పరిహసించు ముఖజలజము
సతులకు నీవీ విదళన
ముల గూర్చెడి మోహవిద్య
ప్రణయమ్ములు కడు క్రువ్విన
గుల్మము చాటున మసలుచు
నిరుపముడౌ నీలకాంతి
పరిణత మధు సారణిగా
బృందావన కుహరమెల్ల
నానందోజ్జ్వలత గ్రమ్ము 33

రసాలకుడు : ఈ లతలలో పొంచియుండి రాసోత్సవమును దర్శింతును. (నిర్దేశించి రీతిని మాధువుని ప్రవేశము)

మాధవుడు : వీరందఱును నా సన్నిధిని జేరుచున్నారుగదా! నేను నిమిష మాత్రము ధైర్య మవలంబించెదను. (అందఱును సామీప్యమును జేరుదురు)

మాధవుడు : (రాధిక నుద్దేశించి)
అసితోత్పల కమ్ర కుసుమ కర్ణాలంకరణములను,
లలిత నీల వసనాంచిత రమ్య పీవరోరువులను,
చేలము ప్రక్కన సగముగ చెలగు బాహూమూలములను
నొప్పెడి యీసుముఖి సొగసు కాముమోహవిద్యగదా! 34

(అంత ప్రేమకళ నుద్దేశించి)
పంకేరుహ హసననేత్ర! స్పందించెదు నీ పరిణత

భ్రూవల్ల్యుపదేశమ్మున పుష్పబాణచాపమ్మును
ఈ చిత్తజహేళిప్రియ సింధూరపు జేరుచుక్క.
యసమాస్త్రుని కదనగుళిక యను శంకను గలిగించెడు 35

(వకుళమాల నాశ్రయించి నే నిచ్చటనే డాగి భావముల పరీక్షింతును (అట్టొనర్చును)

రాధిక : ఏమిది? మాధవుడిక్కడనే యెక్కడనో యంతరితుడై (మఱుగుపడి) యున్నాడే!

అందఱు : (పరికింతురు)

రాధిక : (బాగుగా పరికించి)
వినమితేంద్రమౌళి మకుట శేఖరత్వమును గొన్నది.
వ్రజకన్యా కుచకుంభ నిగూఢ మృగీమద పంకై
శ్వర్యముచే శ్యామలమ్ము, వార్నిధిపుత్రీ విలసిత
వర దీధితి గైకొన్నది, నీప వృక్ష మూలమ్మున
లభియించిన నాదు పురామణి కాన్పించియె, అయొయో,
మహితముగా జారిపోయె మోసగించి పారిపోయె. 36

వకుళ మాల : (ఆత్మగతముగ)
ప్రాణములు వీడగా బ్రతుకలేరే నరులు
ప్రాణాధికము విడువ బ్రతికియుంటిని వింత!
(అందరు వియోగావస్థ నభినయింతురు)
అంగుళీ వదనముల నా చెక్కిళుల నూని
శృంగారమున నర్ధచుంబనము గావించు
వ్రజనాథులీల నాస్మృతి దవిలినంతనే
ప్రతి నిమేషమునందు ప్రాణముల్ చుంబించు 38

నవమాలిక : (చంద్రుని విలోకించి)
నిరహిణులను వేచు స్మరుడు,
వ్రజయువతీ తతి జ్వలింప
అరుణ నవ్యకిరణములా
యగ్ని జ్వాలల పోలిక

ఘన ధూళీ లక్ష్మవల్లి
ఘూమమౌచు నెసగెడు నా
హోమకుండమును బోలిన
చంద్రమండలమున కొసగి 39

ప్రేమకళ : దీని నవధరించుచున్నాను.
భర్గు ఫాలనేత్రాగ్నికి నర్ధముగా దగ్ధమైన
కుసుమాయుధు దేహ మిప్పు డీ మార్గము తిలకించుచు
కృష్ణసార బిందువు మాటున చల్లందనము నొంది
శీతకిరణుడౌ శశియను నమృతతటాకపు జలతతి
పూర్ణశరీరముగా నై ప్రసవాస్త్రమ్ముల నిటు మన
పై దూసిన రీతి దోచు పరమ కళానిపుణతతో 40

రాధిక : (సవితర్కముగ)
శశిబింబము కా దయ్యది
స్వర్గాధిపు మదగజమౌ
ధృతదంతము మదమత్తము
ఆ నీలకళంకవల్లి
మదధారల చారికలే! 41

ప్రేమకళ : అంతరిక్ష మార్జించును గాసారపు క్రమశోభ
నక్షత్రము లొలయు నిదే నళినీ సుమసౌందర్యము
కిరణ మృణాళీ వల్లరి శశిబింబమ్మగు మూలము
నీలబిందు వేషమ్మున లీల ఖనన మొనరించెడి
ఇది చంద్రుని మచ్చకాదు ఎచ వచ్చినదో పోత్రి? 42

నవమాలిక : గాఢమదాలస విలాసినీ రద కాంతిచ్ఛట యన
వైహాసిక దరహాస క్షరకిరణచ్ఛవి యనగా
చలిత తరళమౌ రోహిణి మండలమ్ము పండినదన
రసవికాసమను మధువును రజనీపతి స్రవియించెడి. 43

రాధిక : (పవనస్పర్శ నభినయించి)
చింద బడెడి పెనుమంటల నాందోళన తరళన్నవ
చందనదళ వసనాంచల మదనానిలు డుమిసెడి, నౌహో

భర్గుని కోపాగ్ని శిఖిల భగ్గురనిన బంచశరుడె
మందానిలుడై యివ్విధి జిందెదునే పెనుమంటలు। 44

అందఱు : ఓ తమాలకృత మాలా హింతాల రసాలసాల
వకుళార్జున ప్రముఖలే తరుణముగ్ధ తరుచయమా!
ఎరిగినచో నవనంద కిశోరుమార్గ మెఱిగింపుడు
నేత్రాంచల కువలయముల నిష్ఠమెయిని బూజింతుము. 45

ప్రేమకళ : (వంశి నుద్దేశించి సానుక్రోశముగా)
ఏకాకినివై యెపుడును మురరిపు బింబాధరముల
ముద్దుగొనెడి యొద్దిక నీ వశమైనది యో మురళీ!
ఫలియించెను నీ తపమ్ము పరులకెపుడు దుర్లభ మిది. 46

వకుళమాల : (ఆకాశము వంకకు నిబద్ధము గావింపబడినయంజలితో)
ఆలోల సుమకుంతలమును, పింఛ
ప్రాంచ త్పింజర సౌభాగ్యమ్ము
మల్లీయుత సీమంత కళాన్విత
ఘర్మిలసుస్తోమము, శోభితమౌ
నీ హసితాననమును నొకపరి
చూపించిన చాలును త్రిదశాధీశా!
ఇంచుక చూపుము నీకారుణ్యము
ఇచ్చెద సర్వము నీకే స్వామీ! 47

ప్రేమకళ : అధిక సంతప్తలౌ హరిణాక్షు లహహా! మా
నేత్రాంతములను ప్రాణమ్ములను గనలేరె?
అలముకొను కార్పణ్యమందైన నో ప్రభూ!
నిబిడ మౌగాదె యెంతయు నీ దయారసము? 48

నవమాలిక : నిలుపవేని నాపై నీ నిర్మల కరుణా వీక్షణ
ఓసమస్త జగదీశా! ఓ దయాంబు ఘనరాశీ!
యోగనిద్ర వీడదు నీ నేత్ర ముగ్ధ జలజమ్ముల
నిపుడైనను నా పాపము లెంతగనో హేతువుగా! 49

అందరు : (అంజలి బంధముతో)
మురళీరవ తరళీకృత

విలసిత నీరజ వదనుడు,
నీలదేహ నిరుపముడును
గోపాలీ నందనుండు
మహిళా మానస హారియు,
మందహాస ముగ్ధముఖుడు
నైనయతని కన్నమేము
కన నెరుంగ మన్యు నెవని. 50

కొందరు : నిరుపమ మగు నా కులతను నీ దాసీగణము పొంద
నీక్షింపవె నాథ నీవు? ఎందుకు నీయెద క్రోధము?
హింసింతువు స్త్రీల నిటుల నేమి ఫల మ్మార్జింతువు? 51

(నేపథ్యమున)
మధుర యానమ్ముతో మధుజగత్పతి వచ్చె
అరవిందలోచనా మకరంద నవబిందు
లోచనాంచల చకోరానంద చంద్రముడు
మదమత్త దరహాస సారమంజుల ముఖుడు
పరివీత పీతాంబరము ధరించినవాడు
మధు జగత్పతి వచ్చె మధురయానమ్ముతో 52

అందరు : (స్వాగతముగ)
మందయానముతోడ గోవిందు డేతేర
ఫాలలోచనువహ్ని భగ్ను డైనట్టి యా
పంచబాణుడు నేడు పంచత్వమును వీడి
లోకోపకారియై తులకించి పులకింప
నభిరూప రూపియై యరుదెంచి స్వనియించె 53

వచ్చుచున్నాము. రండు, పోవుదము (మాధవ సామీప్యమును జేరుదురు)

రసాలకుడు : ఇక నేనును గనుపించెదను (సమీపించును)

మాధవుడు : మీ కేమి ప్రియ మొనర్తును?

అందరు : ఇంతకన్న ప్రియ మేమున్నది?
ఇంతకంటె తృప్తికరము లే మున్నవి గోవిందా!
మందపవన ఖేలాందోళన పులకిత రసికములగు
నళినపత్ర సమములు నీ నవతాయుత నయనమ్ములు,
అమృత సరళ సారాంచిత రాగఝరిని పోలెడు నీ
నిభృత మధుర నిస్వనములు, నిత్యముగ్ధ సుస్వరములు.
క్రీడాత్మక గతి నటించు నటనాఘటనములియ్యవి
కడు ఘనముగ పెంపొందించెడు నౌజ్జ్వల్యములియ్యవి. 54

అయిన నిదియును జరుగుగాక!
హరిణమ్ము లేని పీయేషకిరణుని యంద
మును జిందు కాంతిని తిరస్కరణ గావించు
వాక్ప్రౌఢి మన కవులు కడు గాంచెదరు గాక!
సజ్జన సమూహమ్ము నిత్య రసపానసం
జనితతన్మయతతో చిన్మయతతో సత్వ
ఘర్మవా స్సరణితో నంతు లెరుగగ రాని
యానందజలనిధుల కడు నొందెదరుగాక! 55

సకల జగమ్ముల నిరతము
శుభములు ప్రాప్తించుగాక!
రిపులకైన నపకారము
లెపుడు కలుగకుండుగాక!!
సర్వేశుడు జగదీశుడు
కపటదారు విగ్రహ వే
షమ్మున కరుణాకటాక్ష
వీక్షణలహరీ తరంగ
ప్రసరణలను, బహుగతులను
ప్రణయముతో పంపుగాక 56

శ్రీ జయదేవ విరచిత పీయూషలహరీ నామ
గోష్ఠీ రూపకము
సమాప్తము

శ్రీ జయదేవ కవి విరచిత

# పీయూషలహరి

(సంస్కృత మూలము)

అనువాదకుడు

**శ్రీ వావిలాల సోమయాజులు**

# శ్రీ జయదేవ కవి విరచితా
# పీయూషలహరి

## నాంది

కింజల్క ద్యుతి పుంజ పింజరదళత్ పంకేరుహ శ్రివహమ్
శంపా సంపతితాంశు మాంసల శరత్కాదంబినీ, డంబరమ్
లాస్యో[1]ల్లాసిత చండ తాండవకళా లీలాయితం సంతతమ్
చక్రప్రక్రమ వృత్త[2]నృత్త[3] హరయోర్నివ్యాజ మవ్యాం జగత్ 1

కంపమాన నవ చంపకావళీ చుంబితోత్పల[4] సహోదరోదయం
రాస[5]లాలస నవీనపల్లవీ పల్లవీకృత ముపాస్మహే మహః 2

సూత్రధార : అలమతి విస్తరేణ (విలోక్య) అర్య మతిమధురో మధుమాసః యత్రహి[6]
మరుత్పంపా కంపాకుల లహరి సంపాత శిశిరః
స్ఫురన్మల్లీవల్లీ[7] కుసుమపుట హల్లీసక నటః
నమన్నాళీర్మధుర మధుపాళీః కవలయ
న్నయం మందం మందం తరళతరుబృదం ప్రసరతి 3

అహూ భగవతో భాగవతజన శీతమయూఖస్య[8] నీలాచలమౌళి మండన మణే[9]గరుడ ధ్వజస్య ప్రసాదే ప్రసాదమిళితాః[10] సామాజికాః

(కించ)–

చిత్రం చంచల చంచలేవ చటులా చేతశ్చమత్కారిణీ
పీయూషద్యుతి మండలీవ మధురస్వచ్ఛ ప్రవాహచ్ఛటా,

---

1. రాసో 2. వృత్తి 3. నృత్య 4. కోమలోత్పల 5. లాస్య 6. అత్రహి 7. స్ఫురన్నాళీకాళీ 8. చకోరశీతమయూఖస్య 9. మండలమహానీలమణేః 10. లలితా

దృగ్భంగీవ కురంగ భంగుర దృశా మానంద సందాయినీ
గోష్ఠీ శ్రీజయదేవ పండితమణేః[1] స్తావర్తతే నర్తితుమ్ 4

(నేపథ్యాభిముఖ మవలోక్య)
అహో! విశేష[2] పేశలత్వ మస్కత్కుటుంబస్య
తథాహి–
కాచి న్నఖైః కుటిలయ త్యలకా మకాండే
కాచి త్కరోతి కుచయో ర్మకరీ విలాసమ్,
కాచి త్క రోతి కలయా వలయాన్ భుజాన్తే
కాచి ద్దృగంజన మతీవ కరోతి సూక్ష్మమ్ 5

తత్పారిపార్శ్వి కేన తరంగయామి రంగమండల[3]మితి.
వత్సశృంగారక! ఇత ఇతః (ప్రవిశ్య)

పారిపార్శ్వికః : భావ కిం విజ్ఞాపయసి[4]?

సూత్రధార : కిం తేన నాట్యరంగేణ ప్రేమసంగేన[5] వా పున,
నకృతం యేన విజ్ఞస్య చిత్తఖంజన గంజనమ్[6] 6

పారిపార్శ్వికః : కఃపునరేతాదృశో భావబంధురః ప్రబంధః?

సూత్రధార : కుప్యత్కాంతముఖీవచోలవయివ ప్రత్యర్ణకర్ణోత్సవః
ఖేలచ్చేల దరోదితస్తన ఇవ ప్రేమాస్పదం నేత్రయోః
లీలా వేశ్మ గవాక్ష లక్షిత వధూ వక్త్రేందువన్మాదకో
గోష్ఠీరూపక రూపనర్తన కళారంగాయ మున్మీలతి. 7

పారిపార్శ్వికః : (సానుబంధం)[7] కః పునరపి కవిః?

సూత్రధార : ఏసైతదుక్తం
అశ్మద్రవీకర్తు మిమౌ సమర్థౌ
చతుర్దశానామపి విష్టవానామ్,

---

1. పండితకవేః 2. వేళ. 3. రంగమంగళ, 4. కింకిం జ్ఞాపయసికి మాజ్ఞాపయసి 5. ప్రేమరంగేణ 6. చిత్తరంజన నందనమ్, చిత్తఖంజన బంధనమ్ 7. సానుసంధానమ్

అహం వచోభి ర్జయదేవనామా
కరచ్ఛటాభిశ్చ తుషారధామా[1].

పారిపార్శ్వికః : (నేపథ్యాభిముఖం) తేన సజ్జన్తా గోష్ఠీ నర్తనాభినయ కోవిందాః
కుశీలవాః (నేపథ్యే) సఖి ఇత ఇతః

సూత్ర : (విలోక్య)[2] రసావేశో భరతానాం. యత్ర అహోఖలు
వినైవ నాళికాం[3] రంగమంగళ మవతరతి. (విభావ్య)
ఇయం చంద్రకళా శంకే పంకేరుహముఖీ పురః
ఏతస్యాః పార్శ్వగా కాపి రోహిణీవ విరాజతే 9

తదావామపి[4] మాధవ రసాలయో ర్భూమికాం సంపాదయావః (ఇతి నిష్క్రాంతౌ)

ప్రస్తావనా

(తతః ప్రవిశతః సఖ్యౌ)

ప్రథమా : కస్య వా పశ్య వామాక్షి! మాధవో మధురోదయః[5]
ఉదంచ త్పంచమాలాపై ర్నమోహయతి మానసమ్ 10

అపరా : సఖి రాధికే! ఏవ మేతత్, కింతు భవాదృశీనామ్?

తథాహి –
శ్వాసాస్తాప సమాకులా ఇవ బహిర్నియాంతి గండాంతికమ్
యత్కర్పూరపయోనిధావివ[6] పరం పాండిమ్నిమగ్నా రుచిః
చ్ఛైయేషా తనువల్లరీ విజయతే లేఖైవ శేషైందవీ
తత్కిం సుందరి! నందనందన తనుచ్ఛాయా సమాయాద్దృశోః 11

రాధికా : సఖి నవమాలికే! కిమిద మాకాశ లేఖనీవర్ణన[7] మారభసే!

నవమాలికా : అనురాగః సుముఖీనాం చేతసి గుప్తోపి లక్ష్యసే సకలైః
సౌరభ మంజతి పరితోయద్యపి కుసుమం లతావృతం భవతి 12

రాధికా : కింనామ గోపనీయం భవత్యాపి ద్వితీయాత్మనః?
యావత్ యావన్మధుర మురళీపూరణార్థం మురారి

---

1. తుషారధామాచకరచ్ఛయభిః 2. విలోక్య ఇతిపాఠోనాస్తి 3. నాందికాం–నాయికాం
4. ఇదానీమపి, తదానీమపి 5. మధు రాలయం 6. వపి 7. లేఖవర్ణన.

ర్మందం మందం వదన పవనాసంగ మంగీకరోతి
తావత్ తావత్ కువలయ దృశాం మన్మథక్లేశజన్మా
నిశ్వాసో యం దశన వసనే[1] మ్లాని మానం తనోతి 13

సహ్యేస్వాత్[2] వహళీభవిష్ణు మురళీకేదారతారశ్రుతి
ర్నైతాదృగ్ చరణార విందకటక క్వాణోపి సమ్మోహనః
కిన్తుక్లాన్త కపోలకాళి వలయ ప్రస్యంది మందస్మితై
ర్గోవిందః శతథా భినత్తి హృదయం ధైర్యస్పృశాం మాదృశామ్ 14

నవమాలికా : (సునిభృతం పశ్యన్తి మూర్ధామీషద్దోలయతి) తతః
ఆకాపిదీదోషేణ రాధికాయాపలోచనే ముద్రయతి[1]

రాధికా : (ససీత్కారం)[3]
ఇయమియం తవమాధవరాధికా
చరణపంకజే సేవన[4]షట్పదీ.
బహిరుదంచయ కింతవ[5] నేత్రయోః
కరతలం రతిలంపటమానస[6] 15

సఖీ : (చిబుక మున్నమయ్య) ఈదృశం తే సతీవ్రత మాహాత్మ్యమ్?

రాధికా : (సలజ్జ మధోముఖీభూయ) సఖి! భ్రమాదుక్తమ్

నవమాలికా : నహినహిసఖి! విభ్రమాదిత్యుచ్యతామ్

రాధికా : కింబహునా–
పింఛాలాంఛితకుంతల[7] వ్యతికరస్తాపింఛగుచ్ఛచ్ఛవి[8]
ర్నాసాభూషణ పేశలీ గతివశా ద్గండోల్ల సత్కుండలః
కాంచీమండలకుంచితాంబరధరో లోకత్రయీ మోహనః
సర్వస్మాదపి జీవితాదపి మమ ప్రేమాస్పందమాధవః 16

ఇత్యధికం కింతు సర్వాసాం
తథాపి పిశునరసనాపిశాచీ ధీరతాండవ నివారణ మేవ
సమంచితం[9] కులాంగనానామ్.

---

1. రదన వసన 2. సద్భాషా 3. సచీత్కారం 4. సేవక 5. చంచల 6. రతిలంపటమానసమ్
7. కుండల 8. ద్యుతి 9. పాఠోనాస్తి

రాధికా : సఖి! నవమాలికే! నఖలు భవాదృశో జానంతి మర్మ[1] వ్యథాం
విషమ సాయక పాతస్య పరం త్వత్ర[2] ప్రేమకళా పృచ్ఛతామ్.

ప్రేమ : గురుజనభయం, పాతీవ్రత్యం జనారవతో[3] భయం
సహచరి! శపే[4] వారం వారం త్రయం పరిరక్షితుమ్
శ్లథయతి పరం మందం మందం విభోరధరస్థలీ
విగళదమృతాశంసీ[5] వంశోనినాద లవోదయః 17

రాధికా : (వంశీశ్రవణ మభినీయ ప్రేమావస్థాం నాటయతి)

ప్రేమ : ఇయం పులకమండలీ కవిలితా కపోలస్థలీ
తథా సరస శీత్కృతిః స్ఫురిత మానసాంభోరుహమ్.
అయంచ కుచకాంజనాచలజ నర్మఘర్మోదయో
ముహుః సుముఖిః! వేపసే మదనహేతి[6] భీతేవ కిమ్? 18

రాధికా : (నీవా సంయమన[7] మభినయతి)

నవమాలికా : (సహాసం)
నీవీం నవీకృత్య నితంబబింబే
కియత్పరిశ్రామ్యతి కోమలాంగి
పీతాంబరః పశ్యతి సస్మితం చే
త్తదా భవిత్రీ స్వయ మేవ బద్ధా. 19

రాధికా : (నవమాలికాం విలోక్య సానందం)
అహో మురారే ర్మురళీ నినాద
లీలాయతానాం పర మూర్జితాని.
భవాదృశాం యేన మహాసతీనాం
కపోలమూలే పులకావళీయమ్.

నవమాలికా : (సలజ్జ మధోముఖీభూయ స్వగతం)
గోపం కంచన కాంచనాంబరమయే పశ్యామిన శ్యామలమ్
యస్యాలోకవశాదృశా మృగదృశా మేషా విశేషాదభూత్

---

1. మమ 2. తత్ర 3. జనాననతో 4. మతం 5. శంసత్ 6.భీతి 7. నీవికా సంయమన
8. భారోపమః

ఇందుస్తిందుక పావకో మలయజాలేపోపి సంతాపకః
ప్రాణాయేవ నిజర్ద్విషా గురుతరో హారోపిమారోపమః 21

విషమ విశిఖ సూత్రం కృష్ణవంశీ నినాదో
యదవధి తరుణీ నాం కర్ణపీఠే లులోఠ,
అవిరళపులకాళీ కోమలా గండపాళీ
తదవధి తనుతేసౌ[1] భాగ్యబంధం నివద్యమ్ 22

(నేపథ్యే) : దేవతా ముకుటకాంతి మంజరీ పింజరీ కృతపదాంబుజద్వయం
మారకాతరిత గోపనాగరీ రాగరీతి రసికం భజేమహః 23

ప్రేమకళా : కథం చిత్రఫలక హస్తే రసాలక ఇత ఏవ ఆయాతి
(తతః ప్రవిశతి యథా నిర్దిష్టో రసాలకః)
ధామని స్ఫుటితహార దామని నీల నిరద సమానధామని!
వామనీకృత కుచాన్త[2] కామినీ కామనీతి రసికే రసామహే. 24

రాధికా : ఇద మనర్థ కందళీ[3]మూలం యత్ఖలు రసాలహస్తే చిత్రఫలకం

నవమాలికా : సఖి! త్వమేవ మంకురయసి మయా ప్రాగేవోక్తం. నేదం వకుళమాలికా హస్తే దీయతా మితి.

ప్రేమకళా : సఖిరాధికే! తయాఖలు చంచలతయా కుత్ర[4] పాతితం తత్ఖలు అనేన వటునా సమానీతం తత్ కథయ[5] కథ ముపాయైర్గృహ్యాతా మితి

రాధికా : ఇదయేవ తావత్ చింతయామి. న పునః కదాచిత్[6] గోవింద కరారవింద మకరంద రసనిష్యందాభిషిక్తం[7] భవేత్.

నవమాలికా : నిశ్చయార్థే కిమితి శంకసే?

రాధికా : ఫలేనైవ నిశ్చీయతే.

రసాలక : (ప్రవిశ్య) స్వస్తిభవతీభ్యః (ఇతి చిత్రఫలకం సమర్పయతి)

(సర్వా విలోక్య పఠంతి)

1. అసౌ 2. కుచాత్త 3. ఆనందకందళీ 4. కుత్రాపి 5. కథయ ఇతి పాఠోనాస్తి 6. కంథంచిత్ 7. ఆనందాభిభూతం

త్వం తావ త్ర్వథమేవ[1] చంద్రకళికా సంతప్త చింతామణి
ర్నవ్యాః కేపి వయం నికామతరళా శ్చౌరాశ్చకోరా ఇవ
భూయో వీర్యపరీక్షయే వితనుతే సంతాప మంతర్జని
ర్నోజానే తవ కోమలాంగి! గళితో యేనైష చిత్తజ్వరః 25

(సర్వా అన్యోన్యమ్) సఖి త్వదర్థమేవ మురారే రూప

శ్లోకితం : (ఇతి కలహాయింతే.)

ప్రేమ : (అపవాయ)
పాదౌ నూపురపూరితౌ కటితటీ పీతాంబరాలంబినీ
వక్షః కుంకుమపంకిలం కరతలం వంశీ వతంసీకృతం.
బింబోష్ఠీ[2] మదవిభ్రమ[3] స్మితపరౌ[4]కేశోపి వేశోచితో
నో విద్మో నవనీల నీరదవపుః కస్యాస్తపస్యాఫలమ్. 26

(నేపథ్యే)

రాకా శీతమయూఖ సుందరముఖో విస్తారిపక్షస్థలః
ఖేలత్కేసరి మధ్యమో మరకతశ్రీ చుంబి దోర్దంబరః
కందర్పాదపి సుందరో మదగజశ్రీ గర్వ సర్వంకషః
శేషాం నైవ మనోవినోదన కృతే రమ్యాకృతిః శ్రీపతిః. 27

ప్రేమ : (విలోక్య) కథ మేషా వకుళమాలికా హృదయే నీలో
త్పలం ముహూర్ధానా సానంద మిత ఏ వాభివర్తతే.
(తతః ప్రవిశతి యథా నిర్దిష్టా వకుళమాలికా)
రమ్యాధరః[5] స్ఫురదధోరసుధా సముద్ర
మాధుర్య చుంబన కళామివ సూచయంతీ.
చేతా మదీయ మధునా మధునాశనస్య
హా హంత హంత మురళీ తరళీకరోతి. 28

(విలోక్య) కథమేషా రాధికా సఖీభ్యాం రసాలకేన చ అను గమ్యమానా వకుళ వీథికా పరిసర ఏవ నిత్యానురాగ కళికం వికాసయతి. తదహమ పి సఖీం సంభావయామి.

---

1. ప్రథమైన 2. బింబోష్ఠే 3. మదవిభ్రమ 4. స్మితపరః 5. బింబాధర

రాధా : (అపసృత్య) సఖి! కథ మే తదవతంస నీలోత్పల మతీవ సంభావయతి.

వకుళమాలికా : రభసేన రహః పరిచ్యుతం
సనీలోత్పల కోరకం మురారేః
నయనాంచల నీతినిర్జితం
భృగుపాతం వహతీవ భూతలేస్మిన్ 29
(ఇతి రాధికాయాః కర్ణే కథయతి)

రాధికా : సఖి! జీవితాస్మి, కర్ణావతంసనైవ.

నవ : సఖి! సఖిః కృష్ణేనేతి శేషః

(ఆకాశే)

ప్రస్తావయంతీ కియద్ధభూతాని నాందీవ రాసోత్సవనాటికాయాః
మహామునీనామపి మానసాని మురారి వంశీ వివశీకరోతి. 30

(సర్వాః సానందం ఇద మిత్థమేవేతి మదనావస్థాం నాట్యంతి)

రసాలః : (సపులక మంజలిం బద్ధ్వా)

పరం బ్రహ్మం నిరాకార మవాఙ్మనసగోచరమ్,
వల్లవీ తరళాపాంగ పల్లవీకృత మాశ్రయే. 31

(విలోక్య)

గోపీ మనోహరణ నాటకసూత్రధారీ
ధారాయమాణ[1] మదనాశుగ కాందిశీకః.
కందర్ప దర్పహర మూర్తి రసౌ మురారిః
బృందావనే మురళికాం తరళీకరోతి. 32

నవమాలికా : పురఃప్రాలేయాంశు ప్రతిభరముఖీ ప్రేమవసతిః
సతీనీవీ బంధస్థితి విఘటనైక వ్యసనినీ,
సమాయాంతీ బృందావనకుహర మానందరభసా
దయే కేయం శ్యామచ్ఛవి రమృతధారా పరిణతిః 33

---

1. వ్యాధాయమాన.

రసాలక : లతాంతరితో రాసోత్సవం నిభృత మవలోకయామీతి

(తథా కుర్వన్ ఇవ స్థితః)

(తతః ప్రవిశతి యథానిర్దిష్టో మాధవః)

మాధవ : కథమేతా మందతిక మేవ సమాయాంతి! తన్నిమిష మాత్రమేవ ధైర్య మవలం బిష్యే. సర్వా మాధవాంతిక ముపసర్పంతి)

(రాధికాం నిర్వర్ణ్య)

నీలాంశుకాలంకృత[1] పీవరోరూ
ర్దరస్ఫుర న్కోమలబాహుమూలా
వతంసయంతీ సుముఖీ విభాతి
సమ్మోహ విద్యేవ మనోభవస్య. 34

(తతః ప్రేమకళా నిర్వర్ణ్య)

ఏషా ప్రసూనాశుగ[2] చాపయష్టిః స్పష్టీకృతా భ్రూలతికాపదేశాత్
సింధూరబిందు ర్గుళికేతి[3] శంకే పంకేరుహస్మేరదళాయ తాక్ష్యా[4] 35

(వకుళమాలికా మాశ్రిత్య విలోకయా మ్యాసాం భావం నిభృతమితి)
(తథా కరోతి)

రాధికా : కథ మత్రైవాంతరితో[5] మాధవః (సర్వా నిరూపయంతి)
(రాధికా నిపుణం నిరూప్య)
నమ్రీభూత సురేంద్రమౌళిముకుట ప్రాగ్భార సంభావితమ్,
గోపాలీకుచలకుంభపాళి విలసన్ కస్తూరికాశ్యామలమ్
దైవాదేవ కదంబమూల మిళితం లక్ష్మీవిలాసాస్పదం
సంప్రాప్తం క్వనుహారితం బత మయారత్నం చిరత్నంపునః 36

వకుళ : (ఆత్మానం నిర్వర్ణ్య)
ప్రాణమాత్రే[6] విగళితేన జీవంతి క్వచిజ్జనాః,
వినా ప్రాణాధిక మహం జీవామీతి కిమద్భుతమ్. 37

---

1. చీనాంశుకాలంకృత 2. ప్రసూనాయుధ 3. గుళికేవ 4. దళాయతాక్షయా 5. అంతర్హితో
6. అపిగళితే

(సర్వా వియోగావస్థాం నాటయంతి)
విభ్రతశ్చిబుక మంగుళిముఖైః[1]
కించిదంచిత వికార సీత్కృతే[2]
అర్ధచుంబనమహో మురద్విషః
ప్రాణమేవ నుదతి ప్రతిక్షణమ్. 38

నవ : (చంద్రమసం విలోక్య)
నూతనారుణమయూఖ పావకే లక్ష్మవల్లీ ఘనధూమ భూమని,
హోమకుండివ చంద్రమండలే సంజుహోతి యువతీజనం స్మరః
39

ప్రేమ : ఇద మవధారయామి
తను పూర్తికృతే మృగచ్ఛలాద్ విధుపీఝూష తడాగ పాథసి,
శశిశేఖర బాల వహ్నినా దరదగ్ధకుసుమేషు రంజతి. 40

రాధికా : (సవితర్కం)
పరిణామ ముపైతి సంధివర్జం రజనీనాథ సురాధినాథ దంతీ,
అపి తత్రకళంకవల్లీ దంఖాన్మదధారా గళితేతి తస్యశంకే. 41

ప్రేమ : గగన మిద మిదానీం యాతి కాసార శోభాం
తదను ముకుట[3] లక్ష్మీం తారకాః సంక్షిపంతి,
అపి కిరణ మృణాళీ మూలకందోయ మిందు
తదిహ స్వనతి లక్ష్మ చ్ఛద్మనాకోపి కోలః 42

నవ : మదాలస విలాసినీ దశనకాంతి సన్తానకః
స్ఫురద్దరహసచ్ఛటాద్యుతి విలాసి వైహాయసికః,
చలత్తరళ రోహిణీ రమణ మండలాడంబరః
క్షరత్కిరణ మంజరీ పరిచయోయ మున్మీలతి. 43

రాధికా : (భవన స్మర్య మభినీయ)
అందోలనోత్తరణ చందన వందనీయో
మందానిలో భవతి తాపకరః[4]కి మేతత్,
కింబాళిభర్గ నయనాజ్జ్వల వహ్నిరేఖా
సందగ్ధ పంచశరభూత వివర్తవాతః. 44

---

1. అంజలి ముఖైః 2. సీత్కృతః 3. కుసుమ 4. దాహకరః

సర్వాః : హంహో తమాల కృతమూల రసాలసాల
హింతాల తాల వకుళార్జున ముఖ్యవృక్షాః,
ఆవేదయంతు నవనంద కిశోరమార్గం
నేత్రాంజలైః కువలయైరివ పూజయామః. 45

ప్రేమ : వంశీ ముద్దిశ్య సానుక్రోశం[1]
జానే తవైవ వశ్యా మురళి తపస్యాపరం రచితా
ఏకాకినీ మురారే శ్చుంబతి బింబాధరం యస్మాత్[2], 46

వకుళ : (సకరుణ మాకాంశం లక్ష్య మంజలిం బధ్వా)
ఆలోలకుంతల[3] ముదంచిత మందహాసం
సీమంతినీ నాలకకులం నవధర్మపూరం,
దాస్వామి జీవనమపి త్రిదశాధినాథ
యద్యేకవారమపి తే వదనం విలోకే. 47

ప్రేమ : నయనాంతేన[4] జీవన్తి సంతప్తా హరిణీ దృశః,
తత్రాపి యది కార్పణ్య మహో తవ దయాళుతా. 48

నవమాలికా : కృపాకటాక్షైః కరుణాంబురాశీ
యదీక్షసే మాం జగదీశ! నైవ,
విలోచనాశ్చే త్కిము యోగనిద్రా
జహాతి నాద్యాపి మదీయ పాపైః. 49

సర్వాః : (సాంజలిబంధం)
విద్మో న పరం కించిత్ మురళీ తరళీకృత వదనాత్,
కించి దుదంచిత సితా దసితాకృతి వల్లవీ తనయాత్. 50

(కించ)

ఆకులీ కురూషే హంత కిమేవం నిజదాసికాః
అథవా నాథ! నిర్బంధః స్త్రీవధే ఫలమస్తికిమ్ 51

(నేపథ్యే)

అయమేతి మంద మరవిందలోచనా
జనలోచనాంచల చకోరచంద్రమా

---

1. సానురాగం 2. యేన 3. కుండల 4. కటాక్షేపాపి

పరివీత పీతవసనో మదాలసో
దరహాస భాసుర ముఖో జగత్పతి. 52

సర్వాః : (స్వాగతమ్)
జగతా ముపకారాయ త్రిలోచన విలోచనః
యే త్రైవ పంచబాణో పి రూపవా నభిరూపితః 53
అగచ్ఛత. గచ్ఛామః, (మాధవాంతిక ముపసర్పంతి)

రసాలకః : అహమ ప్యాత్మానం ప్రకాశయామి. (ఇతి ఉపసర్పతి)

మాధవ : కిం వః ప్రియం కరవాణి?

సర్వాః : కి మతఃపర మస్తి ప్రియమ్?
మరుత్ఖేలాందోళాయిత[1] నళిన పత్ర ప్రణయినో
సుధాధారాసార వ్యతికర సమీచీన స్వనా,
జనానా మానందం వహలయతు[2] గోవింద! భవతో
దృశో రేషా లోలా నటన ఘటనానాం పరిణతః. 54

(తథా పీద మస్తు)
కవీనా మస్మాకం గతహరిణ పీయూషకిరణ
ప్రభాస్పర్ధీ బంధాధిక మధురవాచాం పరిచితం,
సతాం భూయో భూయో వహతు బహులానందలహరీ
పరీవాహస్వేద ద్రవ జలధి కల్లో కపటాత్. 55

శుభమస్తు సర్వజగతాం నిరంతరమ్
న రిపోరసి స్ఫురతు వై పదంపదం,
జగదీశ్వర కపట దారువిగ్రహః
కరుణాకటాక్ష లహరీం విముంచతు. 56

(ఇతి శ్రీ జయదేవరచితం పీయూషలహరీనామ
గోష్ఠీరూపకమ్ సమాప్తమ్)

[Published in Nagari Script in the Journal of
The Kalinga Historical Research Society]
[Vol - I, part4]
[Reprinted with due acknowledgment of courtesy]

---

1. విలోచనమ్ 2. విరచయతు

# గేయ నాటికలు

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ధర్మ ఘంటిక | 565 |
| 2. | యమ - యమి | 580 |
| 3. | ఆశాజ్యోతులు | 592 |
| 4. | సంక్రాంతి (నృత్య నాటిక) | 596 |
| 5. | సుమ ప్రియ (గీతి నాట్యము) | 605 |
| 6. | నిర్ణేత | 609 |
| 7. | వధూసర | 624 |
| 8. | సౌగంధిక | 638 |

# ధర్మ ఘంటిక

## 1

**(కాంచీ నగరము – అర్ధరాత్రము – రాజసౌధము)**

**మనునీతి**

అవిగో ఆకాశంబున అపసూచన లెన్నెన్నో!
రూపరిపోవుచు నున్నవి రూఢిలేక ఋక్షంబులు!
పడిపోవుచు నున్న వవే పలురిక్కలు నిముసములో!
రాకాయామిని వేళల రానేలా యంధతమము!
వేచెడు నా మానస మీ విధికృత్యము లీరోజున
ఈయపదర్శసములు నా కేమపకీర్తిం దెచ్చునొ!
ఏవిలయము రానున్నదొ ఈ చోళధరాలతలమున!
కాశబ్దం బేమి యగునొ! అంబాకృప యెట్లున్నదొ!

**సౌవిదల్లుడు**

న్యాయమును కాంక్షించి నరనాథ! ఎడతెగక
అర్ధరాత్రమునందు అచలములు మార్మ్రోగ
ధర్మఘంటిక నెవరొ తట్టుచున్నా రచట.

**మనునీతి**

కర్ణంబులు చిల్లులువడ కలకల మాకర్ణించియు
తలపోయగ లేనైతిని ధర్మఘంటికా రవముగ!
నాకనులకు కనుపించిన నానా యశుభంబులు నా
మతి యంతయు కళవళించి మార్పేమియొ చేకూర్చెను!
ఈ నిశీధి నీవిధమున నెంత ప్రబలకారణంబ
ఆగ్రహణం బనరింపగ నతని, కేమిచేటయ్యెనొ!

కనుల నేమొ చీకట్లిట కప్పివేయు చున్నవకట!
సౌవిదల్ల! పాలకునకు సౌఖ్యము మృగ్యమ్ము కదా!

**సౌవిదల్లుడు**

ఆయాసము జెందనేల అకాండమ్ముగా దేవర,
అనుమానము పోద్రోలుం డాధిపాలు కాబోకుడు!

**మనునీతి**

అయ్యో! ఇది యేమి వింత అపరాధిగ నా మ్రోలను
కనుపించును కన్నుగవకు కన్నకుమారుని మూర్తియె!

**సౌవిదల్లుడు**

స్వామీ! అనుమానంబులు చాలమిమ్ము బాధించెడు
తడవుచేయ నేల ప్రభూ! ధర్మఘంటిక గడ కేగగ?

**మనునీతి**

స్వానుభవం బంతయు నను చలియింపగ చేయుచున్న
దేమి వినగ నున్నాడనో! ఏమి విధింపగ వలెనో!
అనెడు భీతి నామనమును అలముకొనగ నేనిప్పుడు
కాలంబును కొంతయైన గడప దలచి యారీతిగ
ధర్మఘంటి కడ కేగక తట్టాడుచు నున్నవాడ!

**సౌవిదల్లుడు**

ధర్మమూర్తులౌ మీరలు తారాడిన నేమి ఫలము
తప్పదుగా దేవ, మీకు ధర్మఘంటి కడ కేగగ.
చోళులపై ప్రేమయె మిము స్రుక్కించుచు నున్న దిట్లు
సదయ హృదయు లౌ ప్రభువుల సౌజన్యం బే రెరుగరు?
అపరాధిని శిక్షించుట ఆర్యా, మీ విధి కాదే!
వెడలుదమా అచ్చోటికి వేళ చాల అయ్యె ప్రభూ!
శాస్త్రకారు లే విధిమిము శాసింతురో ఆవిధినే

ధర్మ ప్రతిపాలనకై దేవసాక్షిగా మీరలు
భగవ న్మనునీతిరీతి పాలింపగ పంతముగద!
కాలహరణ మేల స్వామి! కలత పడక విచ్చేయుడు.

**మనునీతి**

ఏ విధినో నా మన మిపు డిచ్చగింపకున్న దార్య!
తమరే యా తప్పిదమును ధర్మామాత్యుల తోడను
విని శిక్షింపంగ దగును విధి పూర్వక మపరాధిని.

**సౌవిదల్లుడు**

ఆచారము విడువకయే అపరాధిని శిక్షించుట,
నయమటంచు నే ననియెద న్యాయమూర్తు లౌ మీరలె.

**మనునీతి**

ఎన్ని మహాపాపంబులు ఏను పూర్వజన్మంబున
చేసితినో పుట్టినాడ జీవహర్తగా భూస్థలి!

**సౌవిదల్లుడు**

ఎంతమాట! మహారాజ! ఈ విధాన ధర్మమూర్తు
లౌట యెన్ని జన్మలలో నాచరించు పుణ్యమ్మున.

**మనునీతి**

పూర్వపుణ్యసంచితంబ పూర్వపాపకర్మఫలమొ,
వేలారహితం బగుచును వెఱ్ఱియెత్తు చున్నది మది.
కనులు తిరిగి పడిపోదునొ కాచియుండు డధ్వమ్మున
బయలుదేరు డింక ఆర్య! వరదరాజనుతి తోడను.

**సౌవిదల్లుడు**

జయ, జయ, మనునీతిచోళ, జయ, జయ, మనుధర్మపాల!
జయ, జయ, శ్రీన్యాయమూర్తి, జయ, జయ, హృతప్రజార్తి!

## 2

## (ధర్మఘంటికా ప్రాంగణమున)

**మనునీతి**

న్యాయము నాకాంక్షించుచు నా ఘంటిక మ్రోయించిన
యాతని నన్వేషింపుం డచిరముగా సౌవిదల్ల!

**సౌవిదల్లుడు**

ఈ పున్నమి వెన్నెలలో ఎటనుండెనొ కానరాడు
ఏడీ ప్రభు! వాడెటనో ఇరులలోన నుండి యుండు.
కాన్పించును వెదకినచో కంచుకాగడాలతోడ.
(ప్రక్కకు దృష్టి మరల్చి)
ఓ బోయీ! ఇటు రమ్మా ఉన్నాడో చూడవలయు
మర్రిచెట్టు క్రీ నీడల మాటుననే ఉన్నాడో!

(బోయీతో సౌవిదల్లుడు నిష్క్రమించును)

**మనునీతి**

చిత్తక్షోభ మ్మింతట చిన్నమైన తరుగలేదు.
ఏను ప్రజాపాలనంబు నెంతొ ధర్మరీతితోడ
సల్పుచున్నవాడ నన్న సంతసంబు క్షీణించెను.
జీవితాస్త మయమునందు చెడు సంప్రాప్త మ్మగునో
నిలువ లేకయున్నాడను నే నీ ప్రాంగణమునందు.
దేశంబున ధర్మజ్యోతి దీపించుట కే తలచితి.

నాయౌవన కాలంబున నాటుకొనెం జిత్తములో
హర్మ్యోపరిభాగంబున నిర్మింపగ ధర్మఘంటి.
వర్ధిల్లెను నా కోర్కెయు వరియించగ రాజ్యలక్ష్మి
శాసించితి నంతటనే స్థాపింపగ ధర్మఘంటి.

నడచెను నా దేశంబున నాల్గు పాదముల ధర్మము,
ఈ యుద్ధమరేయివేళ యెట్టి తీర్పు చెప్పవలెనొ!
వరదరాజదేవకరుణ వర్ధిల్లుత నా మీదను!
(క్షణమాగి)

చాలసేపు గడచినదే సౌవిదల్లు డేలరాడు.
ఎంతకాల మీరీతిగ నిచట నిలువ వలెనోగద!

(ప్రవేశము సౌవిదల్లుడు, గోపకుడు)

**సౌవిదల్లుడు**

ఇతడు దక్క నీ భూమిని ఎవడు కానరాడు నాకు,
ధర్మకాంక్ష క్ష్మాచంద్రుని దర్శన మర్థించు వార
లెవ్వరంచు మే మడిగిన నేద్వ సాగె నెందులకో!
అంత అడిగినార మతని అరుదేరగ మాతోడను.
అధిపా, ఈనాటి కథన మాశ్చర్యము కొల్పు గదా!

**మనునీతి**

ఘంటాస్వన మొనరించుచు కార్యదీక్ష నున్నయట్టి
వాడెవ్వడొ తెలియు నేని వచియింపుము గోపాలా!

**గోపకుడు**

మడిసి కాదు మాబాబూ, మా బల్లావయ్య పెబూ!
వాయించిన దయ్యు సామి, వరసంగా శానసేపు.

**మనునీతి**

కారణ మద్దాని కేమొ కనిపెట్టితె గోపాలక!
నీ వెరింగి నంత వట్టు నిర్భీతిగ జెప్పవచ్చు.

**గోపకుడు**

ఏమొ సామి, ఏమొ సామి, ఏమి యెరక నాకు పెబూ!
కల్లయెంట నీరు కార్చి కదలిరాదు మా రాజా!

కాని చోబ సూసి పెబూ! దండా లెడుతాను పెబూ!
కాళ్లు కదల లేదు దొరా! కదలలేక కూకుంటిని!

(తరువాత చెప్పుటకు జంకును)

**మనునీతి**

వెరచె దేల ఈ రీతిగ వెర్రివాడ, నా మ్రోలను
విప్పి చెప్పు మే మైనదొ విందుము సంపూర్ణమ్ముగ!

**సౌవిదల్లుడు**

స్వామికి చెప్పక జంకెద వేలా,
ఏమిది గోపక, ఇంతటి జాలము
చేయక సర్వము చెప్పుము తెలిసిన.

**గోపకుడు**

గుండెలు దడదడ కొట్టు కొంటాయి!
రచ్చించుము సామీ! రాజు కొడుకు సామీ!

**మనునీతి**

ఏమి చేసెరా ఓరీ! ఎందుకింత ఆలస్యము?

**గోపకుడు**

దయ యుంచుం డోసామీ! దడ దడ మంటవి గుండెలు
ఎందు కయ్య పో నియ్యం దేదో మా పెబువులయ్య!

**మనునీతి**

(విసుగు కొనుచు)
ఏమి చేసెరా ఓరీ! ఎందుకింత ఆలస్యము
నీ విప్పుడు చెప్పవలయు నిజము దాచి పెట్ట వలదు.

**గోపకుడు**

సెప్పమంటె సెపుతుంటిని సిత్తగించ వలెను దొరా,
సిన్న బాబు గారు విన్న సందెయేళ
రాజయీదిలోన రదము మీదపోగ
రాజా, నా బల్లావుది రంగైనది సిన్న పెయ్య
రాలి పోయె నండి పెబూ! రచ్చించం డయ్యో పెబూ!

**సౌవిదల్లుడు**

ఇంత కేన నీవింతగ నెంతో ప్రభు కాలంబును
చెప్పి సోదె, వృథా చేసినావు గోపాలక!

**మనునీతి**

గోపాలక నీ వింతట గోవుతోడ బమ్మింటికి
చేసి న్యాయ విచారణలు శిక్షయేమొ విధియింతును.

(గోపకుని నిష్క్రమణ)

సౌవిదల్ల, స్వానుభవము సర్వంబును దెలిసెగదా!
ఇంతకుమును మన మిచ్చటి కేగుదెంచుటకును మున్నె
కనుపించెగదా కంటికి కన్న కుమారుని మూర్తియె!
శిక్షార్హుడు నా సూనుడు చేసినట్టి తప్పునకై.

**సౌవిదల్లుడు**

శిక్షయేమి నృపాల, చిన్న ఆ బెయ్య కై
శిక్షింపగా తగునె శ్రీకుమార ప్రభుని!

**మనునీతి**

శిక్ష్మాస్మృతి యందరకును శిరసావహనీయ మగును
ప్రభుపుత్రుడె యైన గాని పాటింపరు ధర్మజ్ఞులు

జీవహంత యౌంట చేత శిక్షార్హుడె మత్సుతుండు,
(క్షణమాగి)
వెడలుదమా నగళులకును వేళ చాలె అయ్యో నార్య!

**సౌవిదల్లుడు**

జయ, జయ, మనునీతి చోళ, జయ, జయ ఓ ధర్మపాల!
జయ, జయ, శ్రీన్యాయమూర్తి, జయ, జయ, హృతప్రజార్తి!

## 3

## (యువరాజ సౌధము – ఉదయము)

**మాధవాంబ**

గాఢ నిద్రను మీరు కనుమూసి నంతటను
నిశ్చలంబైన నిశి నే నాలపించితిని
కృతిలోన క్రొంగొత్త కీర్తనాదులను.

**యువరాజు**

కాంతా, నే విన కౌతూహలమున
ఉన్నాడను నీ యూహో గీతిక.

**మాధవాంబ**

చిత్తగింపుడోనాథా! చేసిన మత్కావ్యంబును
కాంత కళాభిజ్ఞ యౌచు కాంతుని నాహ్వానించును
ఏతత్సమయోచితంబు లేనన్నవి గీతంబులు.
"దివిజకన్యక నౌచు దేవ, యాలాపింతు,
నవ మోహనమ్ముగా నటియింపగా రమ్ము.
"రచియించి యుంచితిని రమ్యరూపచ్ఛాయ,
చేయగా రావయ్య శిల్పనిర్మాణమ్ము.
"కృతికి నర్హమ్ములౌ గీతముల నెత్తితిని

పూరింప వేడెదను పూతమౌ భావముల.
“ఎదలోన చిరుతనౌ సొదపెట్టు భావంబు:
రూపంబు కల్పించి తాపంబు బాపరా!”

**యువరాజు**

కవి కర్ణ రసాయనములు కాంతా నీ కావ్యంబులు,
అంతటితో నాపితేల అసమాప్తిగ నీకృతిని.

**మాధవాంబ**

అడుగ వలదు హృదయేశా, అటు పిమ్మటి కథనంబును.

**యువరాజు**

వెఱ్రిపిల్ల, నీకేలా వేదన నే నుండగనే
నిన్నటి నీ యనుభూతిని నేను వినగ వలతు మధూ!
పాలింతువు నా యాజ్ఞను పడతీ, నీ వెల్లపుడును.

**మాధవాంబ**

అటు చేసితి రేల నాథ, అజ్ఞాబద్ధనుగా నను
వచియింపగ మొదలిడునెడ వణకెడు నా దేహవల్లి!

**యువరాజు**

రాజసంబు వీడె దేల రాకుమారి వయ్యు నీవు?

**మాధవాంబ**

(శరీరము బిగించి)
దైవముపై శ్రద్ధనిల్పి ధైర్యమ్మిదె తెచ్చుకొంటి!

**యువరాజు**

కానిమ్మిక మాధూ! నీ కథనమ్మును వివరింపుము.

**మాధవాంబ**

మీ ప్రక్కన తల్పంబున మేను వాల్చి రచన చేయు
కాలంబున కలత నిదుర కాంచినాను హృదయేశా!
(చెప్పలేక ఆపివేయును)

**యువరాజు**

ఇంత బేల వంచు మధూ! ఎరుక లేదు పూర్వమందు.

**మాధవాంబ**

స్వామీ! నా మానసంబు చర్విత్తమై భీతి జెందు.

**యువరాజు**

రాకుమారివి నీ వయ్యును రాజసంబు వీడెదేల?

**మాధవాంబ**

(ధైర్యము తెచ్చుకొని – పొరలివచ్చు దుఃఖముతో)
ప్రేమమయా, మీపై నే పీడకలను గాంచినాను.
శివ! శివ! మీ కేవిధిగా చెప్పనోరు తెరుపువడును!

**యువరాజు**

కానున్నది తప్పదుగద కలతజెంద నేల ప్రియా!
భావింపకు మెన్నడైన భావికాల కష్టమ్ముల.
(ప్రవేశము సౌవిదల్లుడు)

**సౌవిదల్లుడు**

జయ, జయ, జయ, యువరాజా!
జయ, జయ, జయ, మాధవాంబ!
జయ, జయ, మనునీతిపుత్ర!
వెంట మిమ్ము గొనిరమ్మని విధియించిరి ప్రభువువారు.
దయ యుంచుడు నా మీదను దయచేయగ వలయు వేగ.

**యువరాజు**

తడవు చేయగరాదు తండ్రియానతి యైన.

**మాధవాంబ**

నన్ను విడచి మీరెన్నడు నాల్గడుగులు నడువలేదు
పోయెదరా, నాథా, పోయెదరా, నాథా!

**యువరాజు**

(శిరము ముద్దిడి)
అరుదెంతును శీఘ్రముగా అధైర్య మెందులకు దేవి!
తండ్రి యానతి యైన తడవు చేయగరాదు.

**మాధవాంబ**

(కష్టముగా)
పోయిరండు నాథా! పోయిరండు నాథా!

**యువరాజు**

(సౌవిదల్ల వైపు తన ముఖము త్రిప్పి)
వెడలుదమా ఆర్యా! వేళచాలనయ్యె
వేచి యుందురేమొ, వెడలుదమా ఆర్యా!

## 4

## (రాజసభ – కాంచీనగరము – ధర్మామాత్యుడు – మనునీతి – సౌవిదల్లుడు, ఇతర భృత్యులు)

**మనునీతి**

తప్పిదంబు వింటిరిగద ధర్మవేత్తలగు మీరలు
శిక్షాస్మృతి యేవిధిగా చెప్పునొ వినిపింపవలయు.

**ధర్మామాత్యుడు**

గురుపత్నితో తుల్య గోవు ధర్మమనందు
వత్స హత్యకుగూడ వధయె సముచిత శిక్ష.
స్వామి, తమహస్తముల శాతఖడ్గమ్మునకు
బలి యీయగా వలయు పాపి నా హంతకుని

**మనునీతి**

సౌవిదల్ల, నా మారుగ శాసింపుము శిక్షావిధి.

**సౌవిదల్లుడు**

స్వామి, నా ప్రాణములు చల్లబడి పోయినవి!
విని నంతనే శిక్ష వెర్రినై పోయితిని!
న్యాయమా నియమింప నన్నిట్టి కృత్యమున!

**మనునీతి**

ఏమైనను మీరుదక్క ఎరుగ రతని నన్యు లెవ్వ
రిది మీరే చేయవలయు, ఇంగితజ్ఞ, మీరెరుగరె
ఎట్లుండునొ తండ్రి హృదయ మీ యాపత్కాలమందు?

**సౌవిదల్లుడు**

ఎరుగుదును మీ మనము ఎరుగుదును మీ ప్రేమ,
అపరాధిని కారణంబు అడుగనగును మహారాజ!
అటుపిమ్మట నేమైనను ఆచరింప నే వేడెద.

**మనునీతి**

నైరాశ్యము చెందవలదు నా యానతి యైన వెనుక.

**సౌవిదల్లుడు**

ధర్మమాత్యా, తమ తీర్పునకై
ఉత్కర్ణులమై ఉన్నామార్య!

**ధర్మామాత్యుడు**

ఏలిక యాజ్ఞప్తిని మే మిచ్చగించి నారమార్య!

**సౌవిదల్లుడు**

(రుద్ధ కంఠముతో)
ఎరుగుదువా, యువరాజా! ఈవెయిట్టి యపచారివి.

**యువరాజు**

(నిశ్చలముగా)
ఇచ్ఛా పూర్వకముగా నే నెన్నడిట్టి గోహత్యను
చేసినట్లు యించుకైన చిత్తంబున లే దార్యా!

**ధర్మామాత్యుడు**

శిక్ష యొక్కటే స్మృతిలో నున్నది
స్మృతి గలవారికి స్మృతి విహీనులకు.

**యువరాజు**

శిరసావహనీయ మగును శిక్ష్మాస్మృతి యెవరి కైన

**సౌవిదల్లుడు**

జయ, జయ, మనునీతి పుత్ర!
జయ, జయ, శ్రీధర్మ గాత్ర!

**యువరాజు**

ఏ నెన్నడు చేసి నానొ ఎరిగింతురె సౌవిదల్ల!

**సౌవిదల్లుడు**

రాజవీధిలో రథ వాహ్యాళిని.

**యువరాజు**

ఆచరించి నానేమో అజ్ఞాతముగా గోవధ
తలదాల్చెద తాతపాద ధర్మార్థము దండనమ్ము,

**సౌవిదల్లుడు**

సంతసంబు రాకుమార, సంతోషము ధర్మపాల!

**మనునీతి**

(కంపించి)
సాత్వికుడౌ నా సూనుని చంపజాల హస్తమ్ముల,
దయయుంచుడు నామీదను తామొనర్పు డా శిక్షను.

**సౌవిదల్లుడు**

చిత్తగింప వలయుదేవ, చేయజాల నీకార్యము!
అదరిపోవు హస్తమ్ములు ఆడినంత మీ రీగతి!

**మనునీతి**

ఏగుచు నున్నా నేమైనను సరె,
ఖడ్గమ్మిదిగో, కానిం డాపని!

**సౌవిదల్లుడు**

అధిపా, వధ నిక్కువంబు ఆజ్ఞాపించినచో నను.

**మనునీతి**

సాగిపోదును నేను సౌవిదల్లా, యింక.
(నిష్క్రమణ – మనునీతి, ధర్మామాత్యుడు)

**సౌవిదల్లుడు**

ఖడ్గమ్మా, ఈ కంఠము నరకుము!

**యువరాజు**

ఇదిగో, నా కంఠము ఎత్తుడు మీ ఖడ్గమ్మును.

**సౌవిదల్లుడు**

ఎత్తితి నే ఖడ్గమ్మును ఇదిగో వధ అయిపోవును!

(పొడుచుకొని మృతిజెందును)

**యువరాజు**

(సౌవిదల్లుని కళేబరము యొద్దకు పోయి)
శాంతిరస్తు సౌవిదల్ల, శాంతిరస్తు పురుషవర!
ఆలస్యము చేసినచో నధిపు దరుగుదెంచు నేమొ,
కంఠమ్మా, నీ వింకను కౌగిలించు ఖడ్గమ్మును!

ధర్మపాలనంబునకై తడవుచేతు వేల నీవు,
వడక నేల హృదయంబా, వరియింపుము మృత్యుకన్య!
మంగళం బగు గాత మనునీతి జనపతికి!
చోళ మండలమునకు శుభము సమకూరుతన్!

**(కత్తిని నిలువబెట్టి దాని పైబడి ప్రాణముల విడుచును)**

***ఆర్య వాచకం, సుందర రామ అండ్ కో.***

# యమ - యమి

## (ప్రస్తావన)
## కథాకథనం

**నటీనట స్వరమేళ**
**స్త్రీ పురుషులు ఉభయులు**

సృష్టి చేసినాడు బ్రహ్మ
సృజన కళాకుశలతతో
నారాయణ శుభనాభీ
నవసరోజ సంజాతుడు
స్వీయాస్తిత్వుడు సృష్టిని
సృజయించెను స్రష్ట, బ్రహ్మ.
...సృష్టి చేసి..

ఆదియందు అణుమాత్రము
ఆ శూన్యమె లేనపుడు
అది అఖిలం గాఢమైన
అంధకారమైనప్పుడు
...సృష్టి చేసి...

అమృతత్వం, ఆమరణం
అదిగానీ, ఇది గానీ
ఏ ఒక్కటి లేదప్పుడు,
ఎవరు లేరు దర్శింపగ
...సృష్టి చేసి...

పంచభూత కోటి, జగ
త్ప్రాణిలోక సముదాయము
విపులౌషధి వనచయముల
విశ్వకర్త నిర్మించెను
...సృష్టి చేసి...

దివ్యశక్తి శోభితులను
దేవతలను ఋషివరులను
జనియింపగ జేసి చూచె
జనితుల ఘనహర్షముతో
...సృష్టి చేసి...

అవనిపైన నగ్నిదేవు,
పనవవీథి వాయువును,
రవివరు–శుభతేజస్విని –
గ్రహతారలలోన నిలిపె
...సృష్టి చేసి...

**స్త్రీలు**

అందాలకు పుట్టినిల్లు
అమరశిల్పి, విశ్వకర్మ
సర్వాలంకరణ స్రష్ట
సంజ్ఞాసుకుమారి తండ్రి

**పురుషులు**

శుభశోభావతి సంజ్ఞను
సూర్యుడు పరిణయమాడెను –
విశ్వసర్వ సౌందర్యను
విశ్వకర్మ పుత్రికను

**ఒక స్త్రీ**

సూర్యుని సంయోగమ్మున
సుదతికి సంజ్ఞాదేవికి
ఒక్కమారె జనియించిరి
బాలుడొకడు, బాలి కొకతె.

**ఒక పురుషుడు**

ఆ బాలుడు యముడు, యమి
ఆ బాలిక – అతి సుందరి
పెరిగి రొకట కలిసి మెలసి
ఇరువురు – యమి,
ఆ యముడును.

**ఒక స్త్రీ, ఒక పురుషుడు**

ఆ బాలుడు, ఆ బాలిక –
యముడును, యమి ఏనాడును
తాబుట్టిన లోకమ్మును
దాటియెఱుగ రేలోకము.

వారి తండ్రి దివ్యకాంతి
నీరమ్మున స్నానమాడి
కాళిందీశైలోత్సం
గములలోన చరించారు.

**స్త్రీలు, పురుషులు**

ఆడారు యముడు ఆ యమియు
అలసటల నెఱుగకే –
ఆనంద పథములలో
ఆడారు యమియు,
ఆ యముడు.

ప్రతి తరంగము మీద
పరువెత్తు నవ్వులతో,
గిరిశిఖరి మెలిదిరుగు
చిరునదుల దూకులతో.
॥ఆడారు॥

చారుతర మృదుశిలా
శయ్యలను మదముతో
రమ్యాతి రమ్యస్వ
రాల జల్పాలతో.. ॥ఆడారు॥

స్వాదు మృదుభంగిమల
వన తరుస్కంధాల,
శాఖలతో, ఛాయలతో
శబలతతో మెలి తిరుగుచు.
॥ఆడారు॥

హసనమ్ముల సొగసులతో
హ్రా హ్రీం హ్రూం నినాదాల,
ప్రతిశబ్ద స్వనసంతతి
ప్రీతితోడ శ్రవణించుచు
॥ఆడారు॥

**స్త్రీ పురుషులిరువురు**

ఉన్నవారు కొంత పెరిగి
మిన్నలైన సౌఖ్యాలతో
పుష్పగుల్మ గహనమ్మున
ఫుల్ల కుసుమ సముదయములు
సీతాకోకల శోభలు
చెలగి వెలుగు కలుపు కడను
॥ఉన్న॥

శాఖల ప్రసరించి విరియు
చారు తరుల క్రింద వారు
పండి వ్రాలు పండ్ల నేరి
పక్షులచే తినిపించుచు ॥ఉన్న॥

చంద్రకాంతి శోభలతో
చారు రమ్య స్వచ్ఛతలతో,
గంధర్వ మహానగరుల
కనుచు ప్రీతి చరియించుచు
॥ఉన్న॥

వన్యౌషధి పరిమళాలు
వలపులతో చెలరేగుచు
మధు వసంత ఋతువేళల
మంజుగతుల మెలగుచోట...
॥ఉన్న॥

**ఒక స్త్రీ**

తేజ : పతి – రవి పుత్రిక
తేజస్విని – పరిధానము
దోహదముగ, సుఖదముగా
తొలి యుషస్సువలె తోచును

**ఒక పురుషుడు**

విశ్వశిల్పి దౌహిత్రికి
వెలయగ నవి లోపమేమి?
ఆ యమి – ఆభరణమ్ములు
అద్భుతములు, రమ్యమ్ములు.

**మరొక స్త్రీ**

యముని దేహవర్ణమ్మది
హరిత ముగ్ధ మోహనమ్ము
అతని వసన సౌభాగ్యము
అరుణారుణ రమణీయము.

**మరొక పురుషుడు**

యముడును యమియును
అడవుల తిరుగుతు
ఆటలు ఆడే
టప్పుడు తమియమి –

యమ సోదరు – యెడ
హస్తము నిల్పును,
కరతలమున 'కర
కమలము నిల్పును.

**మరొక స్త్రీ**

వెంటనె ముందుకు
విరియుచు వచ్చును
ఉపగూహనమును
నొనరించును తమి

ముద్దిడ పెదవుల
మోహన వైఖరి

కమ్రకపోలము
కడమెడ జేర్చును

విరవిరలాడెడి
తిరుగుడు లొాదవగ
చిరునవ్వును సు
స్మితముగ మార్చును.

**స్త్రీలు, పురుషులు**

ఆటలెన్నో నేర్చి
ఆ పిల్లలాడారు,
ఆటలల్లో వయసు
అధిగమించింది.

అట్టి సమయాలలో
ఆయముని మనసులో
వింత భావాలెన్నో
విచ్చేసి మురిసినవి...॥ఆటలెన్నో॥

అతడు వెనువెంటనే
అవమాన భరితుడై
దూరముగ యమిని తా
త్రోసిపుచ్చెడు వాడు...
॥ఆటలెన్నో॥

వదనాన వైవర్ణ్య
వర్తనము గని యముడు
నవ్వగా నా యమియు
నవ్వెడిది కలతపడి ॥ఆటలెన్నో॥

అనురాగ భావ మెద
పెనవేసినది యిపుడు
ఉల్లసిత ప్రణయరస
మొనరి ఏపారినది. ॥ఆటలెన్నో॥

**ఒక స్త్రీ, ఒక పురుషుడు**

ఈ అవస్థను పితరు
లెరుగుదురొా, ఎరుగరో
వారేమి ఒనరించు
వారుగా కనబడరు.

పురుషత్వ విస్ఫూర్తి
పొల్పారె యమునిలో
పుష్పవతియైన యమి
పొలిచె నొక ఉవితగా.

ప్రణయ, మున్మత్తమ్ము
పరిపూర్తి కాశపడె
సమయ మేతెంచినది
చలియించె శోణితము.

**అంతర్దృశ్యము = యమి**

ఉజ్వల ప్రణయినిని
ఓ సఖా! ఓ సఖా!!
ఉత్తమ ప్రేయసిని
ఓ ప్రియా! ఓ ప్రియా!!

**యముడు**

ఇటు పిలిచెదవు నీవు
ఇది ఏమి పిలుపె'యమి'?
ఇనుని పుత్రివి నీవు
ఇనుని పుత్రుడ నేను

**యమి**

ఉజ్వలరస కాంక్ష కలిగి
ఉల్లసించుచున్నదాన!

అరుణోదయ మొందె మనసు,
మరుజలనిధి దాటినాను
రాగసార మభిలషించి
రమ్మనుచున్నాను సఖుని...
॥ఉజ్వల॥

నాదు గర్భధారణాన
'నాన్న' అంటు నిన్ను పిలుచు
సుందరుండు, నందనుండు
శుభయుతుఁడు కలుగవలెను...
॥ఉజ్వల॥

సఖుడా! మనపుత్రునకౌ
సర్వశక్తులబ్బుగాక!
సకల సంపదలు అతనికి
సంప్రాప్తం ఔనుగాత! ॥ఉజ్వల॥

**యముడు**

ఏలనో నవఫణితి
ఇటు పల్కుచున్నావు
ఎద తోచుచున్నయది
ఇది ఏదో వింతగా

**యమి**

తెలుపనా ఈనాటి
పలుకులకు హేతువేదో!
కడు రమ్య ముజ్వలము
కాంక్షయే కారణము... ॥ఉజ్వల॥

**యముడు**

ఈ కోర్కె, ఈ చెలిమి
ఇచ్ఛయించుట తగదు
ఇరువురకు మూలమ్మొ
ఏకమ్మొ - సోదరివి ॥ఉజ్వల॥

దేవర్షులును సురలు
తిలకించుచున్నారు
ఒప్పరవ్వారు మన
తప్పిదపు నేస్తాన్ని

ఏదొ దూరమునుండి
ఈక్షింపగా నేమి?
వారు నీ ప్రక్కనే
వరలుదురు నా వలెనె.

**యమి**

త్రిదశులా! వారు నను
తిలకించుచుందురని,
చక్కగా విందురని
సంతోష పడుచుంటి ॥ఉజ్వల॥

మన సఖ్యమును బోలు
మధురైక్యతను మెచ్చి,
ఆసక్తి వహియింతు
రనుట లెపుడెంతగనొ ॥ఉజ్వల॥

బ్రహ్మ, సుత భారతితో
పరమ స్నేహము చేసి
సంయోగమొంచి తా
సంతతిని వడయడే? ॥ఉజ్వల॥

ఏ నివారణ మనల
ఏల ఆపగవలెను?
రావోయి, రావోయి,
రంజిలగ నోసఖా! ॥ఉజ్వల॥

నీ మనసు నివ్వేళ
నా మనసుతో గలుపు
నా శరీరము నొంది (వలన)
నాక భోగము గొనుము ॥ఉజ్వల॥

**యముడు**

అమృతత్వమును గొన్న
ఆ నాకజనగతిని
ఎటుల వర్తింపగల
మీ భువిని ఓ యమీ!

స్మరియింపు మనగోత్ర
సంబంధమును యమీ!
స్మరియింపు మాదిత్యు
మన పితరు – భాస్కరుని.

**యమి**

బహురూప జనకుండు
భవ్యుండు, దివ్యుండు
త్వష్ట నెఱుగుదు వీవు
పుష్టిగల రసశిల్పి.
మనకు జన్మమ్మిడిన
మహిత గర్భమునందు
మలచెనారస శిల్పి
మనల పతిపత్నులుగ.

అతడు గావించినది
ఆపలే దెవ్వండు
మనసఖ్యమైకమ్ము
కనియె భూదివములకు.

ఆసక్తి విషయాన
ఆశ నెఱుగనిదాన
ఈరటి ఏడ్పింప
ఇచ్చగించెద వేల?

**యముడు**

ఆపుమింక దాని చెల్లి!
ఆ అపేక్ష కాశపడకు
కామమాంధ్య మొనరజేయు
కలతపరచు బుద్ధిగరిమ

నన్ను క్రూరుడంచు మదిని
ఎన్నుకొందువేమొ నీవు
గాఢరీతి యోజసేయ
కనుగొందువు సత్యమెదో.

ఆ నిరుద్ధ ఫలము వలచి
నట్టి దుష్టరాలవంచు
నిన్ను తెలుసుకొందు వీవె
మిన్నవై చరింతు వంత.

సోదరుండు కానివాని
చూచుకోని పతిగ, తరుణి!
వలచునట్టి కాలమింక
వచ్చు సోదరీమణిరో!

కాన భిన్ను నొకని నీవు
కనుము సఖుని, కాంతియతుని
నిర్మలోపధానముగా
నీ బుజమ్ము నిమ్మతనికి

**యమి**

అన్నకు సతి నీయలేని
అతివ తగిన సోదరియా?
వరు నొసగక సోదరికై
వరలునతడు సోదరుడా!

**యముడు**

పుట్టుక నొసగిన గర్భము నందే
పుట్టితిమా మరి పతిగా పత్నిగ?
అందున బీజము పొందింపబడు
ఆ క్షణ మెట్టిదొ ఎవ్వరి కెఱుక?
అస్తిత్వము ప్రభవించిన వేళను
ఆది దినోషస్విని కాలమ్మున
అస్తిత్వము నస్తిత్వము కలిసిన
ఆ క్షణమెట్టిదొ ఎవ్వడెఱుంగును?

ఎవ్వడు దానిని చూచిన యాతడు?
ఎవ్వడు వెల్లడి చేసిన యాతడు?
రాత్రింబవళుల ఆవిష్కరణలు
ధాత్రిని సాగుననంతగణమ్ముగ!

ఊహాకల్పిత భ్రాంతికి లోనై
ఉల్లాసంతో బడలెఱుగక యిటు
ఓసి విలాసిని, నీచుల పోలిక
ఊరక సత్యము పలికెదవేలా?

**యమి**

చిక్కబట్టుకొనంగ
చెల్లు నిను నీవు సఖ!
ఏమిటిది కోపింతు
వేల ఓ నా సఖా!

స్నిగ్ధమ్ము, స్వచ్ఛోష్ణ
శీలమ్ము, మోహనము
యమశక్తిని విచ్చేసె
యమినైన నా కడకు.

భార్య నిజదేహమును
భర్త కర్పించునటు
నా తనువు నీకిచ్చి
నాతి నౌదును సఖా.

రాగైక్యమును పొంద
రథచక్రముల జంట
అవుదాము మనమిపుడె
అర్థింతు ఓ యమా!

**యముడు**

సిగ్గు, సిగ్గు, విధ్వంసిని!
జిజ్ఞాసాశూన్య వీవు
దేవచారు లెవ్వేళల
తిరుగుచుంద్రు లోకాలలో
వెదకి కొనుము వేగముగా
వేరొక్కని చేరుమతని
రథ చక్రద్వయము పోల్కి
రాగైక్యత నొందవమ్మ

**యమి**

ఎంత క్రూరుడవోయి యముడా!
దేవుడవె, కాని నీ
వెంత క్రూరుడవోయి యముడా!!
రాత్రింబవళ్లు నీ
గోత్రనామాలతో

అర్పింత్రుగాక ఉప
హారాలు పూజకులు ॥ఎంత...॥

సూర్యదేవుని కనులు
సొగసుల - ప్రభాసాల
నీపైన నెవ్వేళ
నిలచి ఉండెదు గాక! ॥ఎంత...॥

**యముడు**

నాతో సంగమించటమ్ము
నమ్ముచుంటి వుచితమ్మని
భ్రాంతితోడ వర్తిస్తూ.

**యమి**

అప్పుడే మరచితివి యముడా!
ఎంతొగా, వింతగా
అప్పుడే మరచితివి యముడా...

అడుగులో అడుగేస్తు,
చేతిలో చెయిగలిపి,
ఆటలాడాము మన
మా వనచ్ఛాయలలో ॥అప్పుడే...॥

ప్రసవకర్తన కేళి,
ఫలసమార్జన హేళి
బహు కళిందా నితం
బాళిలో తిరిగితిమి ॥అప్పుడే...॥

ఉరువేగముగ నీవు
మరచితివి సర్వమ్ము !
యముడి వర్తన నెల్ల
యమియె భరియింపవలె...
॥అప్పుడే...॥

మరల నే శోకింప
పరికింపదలచితివె?
ఎన్నియో రీతులుగ
ఏ నిదే రోదింతు ॥అప్పుడే...॥

**యముడు**

ఏమి, ఏమి ఓసి యమీ!
ఏమి చేసినాను నేను
ఈవు ఏడ్వ నేనిప్పుడు
ఏమి చేసినాను యమీ!

తండ్రి కోరినయపుడు
తల్లి సంజ్ఞాదేవి
ప్రజ్వలన తేజాన్ని
భరియింపగా లేక
దాసి ఛాయను పంపి
తపమునకు తావెడలె.

**యమి**

సావర్ణి, తపతి, శని
ఛాయసంతతి యైరి
అధిక తత్పరత ఆ
అతివ తన సంతతితిని.

పెంచుటను కోపించి
పిలిచి తన్నితి వీవు
గాయపడి బాధపడ
ఛాయ శపియించె నిను

ఆ వేదనకు నీవు
అలసి శోకించావు
సాయపడినది ఎవరు?
కాయసే వెవ్వరిది?

ఎవరు పూసిరోలేహ్యా,
మెవరిచ్చిరో మందు
ఎవరు నీ కొఱకపుడు
ఏడ్చిరో మరచితివి.

కామాక్రమణమ్ము వలన
కలుగదెట్టి శక్తి నాకు
నమ్రతతో నర్థించెద
నా కోర్కెను తీర్చుమయ్య.

సంపన్నుడ వీవుయమా!
సర్వమిత్తు వన్యులకును
నా కవోష్ణరక్తమునను
నా పతికడ కిదె నడిపెను.

నా నిచోళ మిదె సడలెను,
నా మేఖల మొల నిలువదు
నా శరీరమును యముడా!
నీ శరీరమున గలుపుము.

**యముడు**

నా దేహమును నేను
నీ దేహమున జేర్ప!
ద్రోహమిది దౌష్ట్యమిది
ఊహ చేయవె యమీ!

**యమి**

వేగిరపడకోయి సఖుడ!
ఆగవోయి నా సఖుడా!!
కోపపడకు మయ్యా, నా
తాపము గమనింపవయ్య!

ఇరువురి యెద లేకమై
పరుగు పరుగులతో కదులుతు
మన ముదయించిన కడుపున
బనరగ స్పందించె కలిసి!

ఇరువురి చెవి జతలు కలిసి
ఏ స్వనమైనను వినినవి!
కలిసె చెక్కిలిని చెక్కిలి
కరము నగ్నకరము చేరె.

పత్నినిగా నేను నీకు
పతి రీతిగ నీవు నాకు
మన బాల్యమ్మెల్ల నిటులె
ఘనతరముగ సాగినది.

**యముడు**

అర్థించెద సోదరి, నిను
ఆపు మాపు మీ కథనము
కాముకుడై సోదరితో
కలియువాడు మహాపాపి!

అన్యునితో పొందుమునీ
వానందము - దైహికమ్ము
సోదరుడను, పొందనట్టి
సుఖమును నే పరిశుద్ధుడ!

**యమి**

అంత శక్తిరహితుడవా।
అయ్యో! ఓ దుర్బల, యమ ॥

అయినను నీ కన్నులలో
అదిగో మృదు మధులాహిరి!

కదలుచున్నయవి నిరతము
కరములు కోమలవైఖరి...

॥అంతా॥

నేను కాని తరుణిపైన
నిలచి ముగ్ధమధు మత్తత,
ప్రణయభావ నీ హృదయము
భ్రమియిస్తూ ఉన్నదిపుడు.

॥అంతా॥

మావిగుల్మమును వారువు,
తీవియ తరుకాండము వలె
ఆ యౌవని వలచి నిన్ను
ఆలింగన మొనరించును

**యముడు**

వేగముగా సఖునొక్కని
వెదకికొనుము నీవు చెల్లి!
అతని ప్రణయమును పొందుము!
అతడు పొందు నీ ప్రణయము.

ఆతని, నో యమి, ప్రేమతో
ఆలింగన మొనరింపుము
మావి గుల్మమును వారువు,
ప్రాకాండములతను వోలె.

**యమి**

ఏల ఇటుల పలికెదీవు?
జాలి యింత శూన్యమ్మా!

**యముడు**

చెందుత మీ ఐక్యతచే
శ్రేయము సర్వమ్ము మీకు!
పలుకజాల నెయ్యది ఇక!
వాచంయమి నైపోయెద!!

**యమి**

ఈవు నేత్రజలమ, రమ్ము
ఎదలోతులక్షరమొందితి
భంజనకై వ్యథ నొందుతు
పలు తెఱగుల రోదింపుము.

పక్షమ్ములు మాయక మీ
లక్షణాల విడవక ఓ
చక్షువులారా! కనుండు,
జాగృతి వహియింపు డెపుడు.

ప్రణయమ్మను తుదకు యముడు
పాదత లాహతమొనర్చె
హసియింపదు, ప్రణయమ్మిక!
హసియింపదు యమియు నింక !!

**కథోపసంహారం నటీనట స్వరమేళ**

**స్త్రీ పురుషులు**

ఆ శరణాగత రీతిని
అర్థభంగిమను నిలిచెను –
చలన మించుకయు నొందక
స్థబ్ధత వహియించె నామె

"హసియింపదు ప్రణయమ్మిక
హసియింపదు యమియు నింక"
అన్న ఆమె రోదనమది
అంతటట ధ్వనియించినది.

**అన్య స్త్రీ పురుషులు**

ఆ శోకము క్రమక్రమముగ
అఖిలమ్మును మందగించె
నైరాశ్యముతో నది మర
ణమ్ము నొందె దారిలేక

రెండగు వడగండ్ల వోలె
నిండి, నేత్రజలము, కరిగి
ఆమె చెక్కిళుల జారిన
అతివేతముగా నప్పుడు

**తొలి స్త్రీ పురుషులు**

ఆమ్లానము లైన శిలల
యట్టులయ్యె ఆమె కనులు
చేరి ఒకటి వెనుక నొకటి
జృంభించెను జలబిందుయు.

కనురెప్పల కొక కంపన
కలిగి అంతకన్నీరది
సాగి మహోమృదు మృదువుగ
స్రవియించెను కడు స్వేచ్ఛగ.

**ఒక స్త్రీ**

శైలమ్ముల, తరువులపై
శాద్వలాల గుల్మమ్ముల
ఉంచబడిన దామె ముందు
ఒక తుషార పృథుయవనిక!

**ఒక పురుషుడు**

ప్రారంభమునందున్నటు
అర్థమ్మును రూపమ్మును
అణుమాత్ర మ్మెరుక పడని
అంతా ఒక మాలిన్యము.

**ఒక స్త్రీ**

మలచిన ఒక ప్రతిమ వోలె
మరియింకా మోకాళుల –
మరివినదెది, మరి వినదెది
మలగి ఉండి ఉండెనామె!
ఒక పురుషుడు
చిన్ననాడు వారాడిన
సీమలోని ఔదుంబర
వనతరువైనను అడ్డెను
కనగ దాని ఆకారము

**ఒక స్త్రీ**

యము ప్రియ విస్ఫురణమ్ములు
అరుగువేళ నిస్వనములు
అతడి రెండు రేచులపుడు
అతి జడములు భయదమ్ములు.

**ఒక పురుషుడు**

నిలచి యున్నయది ఆయమ
చలన రహిత ప్రతిమరీతి
స్రవియించిన వొకటొకటే
శారీరక లక్షణాలు.

**ఒక స్త్రీ**

అస్తికలును, రక్తమాంస,
మాయె – తుములనయనవారి
కలిసి –నిత్య స్థిరతనొందె
కదలిన వొక సెలయేరై.

**ఒక పురుషుడు**

అనుపమ జలరజ్జు వొకటి
ఆ కళిందనుండి సాగె
అది స్రవంతి, స్రోతస్విని
అయి నదించె సమతలాన.

**స్త్రీలు, పురుషులు**

యమి పరివర్తనమొందెను
యమునా నది అయిపోయెను.

ఆదిత్యుడు కిరణమ్ముల
నాపివైచె రానీయక
సత్వరమే జనియించెను
సమ్మోహన మృదుల శోభ.

అతిశయశోకాకులితయు,
అధికాధిక రమణీయయు,
నైన శక్తి కదలించెను
అమిత శప్త నీరమ్ముల.

యమి పరివర్తన మొందెను
యమునానది అయిపోయెను.

"యమ యమి సంవాదం" ఋగ్వేద సంహిత దశమ సూక్తం. షష్ఠ అధ్యాయంలో షష్ఠ, సప్తమ అష్టమ వర్గాలల్లో ద్యోతకమవుతున్నది అని చెప్పి స్వతంత్ర పత్రికలో (సెప్టెంబరు 1948) శ్రీమతి మంజేరీ.యస్. ఈశ్వరన్ ఇచ్చిన వైదిక కథాకథనం ఆధారంగా జులై 1950లో వా.సో రచించిన "యమ–యమి" అనే వైదిక కథాగేయ శ్రవ్య దృశ్య నాటిక.

***1950లో ముద్రితం***

# ఆశాజ్యోతులు

**స్త్రీలు:**

పదవే, పద పదవే!
ప్రజాస్వామ్య నౌకా!!
భారత జనగణ గమ్యము
మణిహర్మ్యం చేరుదాక పదవే..

**పురుషులు:**

చేరునె ఈ చిరుత నౌక
చెదరక మన మేడదాక!!
ముమ్మరముగ చీకటులివె
మూగిక్రమ్ము చున్నవి గన!! చేరునె

**స్త్రీ:**

కల్లోలిత జలధులలో
కలత పడకు, కుతిలపడకు!
కనుల కింపునింపు సడల
కలహంసగ పయనింపుము పదవే

**పురుషుడు:**

విన్నారా ప్రతిపక్షపు
విలయ ఘనాఘన గర్జలు!
కన్నారా దుర్జనచటె
కాలభయద తాండవాలు చేరునె

**ఇరువు స్త్రీలు:**

కడలు లెన్ని ఉప్పొంగిన
పిడుగులెన్ని పై బడినా
ప్రజానౌక పయనించును
ప్రగతి నికేతనము దాక... పదవే..

**కథకుడు:**

ధనిక వాదులు ఫాసిస్టు ధర్మరతులు
సంఘధూర్తులు ప్రతిపక్ష సభ్య సమితి
కోరి సృజియించు దేశ సంక్షోభములకు
బ్రతుకునె ప్రజా ప్రభుత్వ మన్వయముల్

పడని స్వాతంత్ర్య మఖిల ప్రపంచ మం
వరలు చును దొడ్డదౌ ప్రజాస్వామికమ
మన ప్రభుత్వంపు కీర్తి సామర్థ్య మనుట
ఎన్న జరుపుకున్నాము ఐదెన్ని కలను

అఖిల పౌరజనులకు న్యాయమ్ము సర్వ
రంగముల నిచ్చి సమత, నార్జనము
టాశయమని పాలకుల కాదేశ మొస
లెరిగి రాజ్యాంగ నిర్మాత లెపుడొ మున్నె
ఎల్లరును మెచ్చ, నిర్వదైదేండ్ల నుండి
భారతీయ ప్రభుత్వమ్ము బహు సమస్య
లెదురుకొనుచు గాఢముగ నహీనకృషిన్
చేయచుండె ప్రజాశయసిద్ధి కొరకు

**పురుషుడు:**

వస్తోంది, వస్తోంది
సమతాయుగం
వస్తోంది, వస్తోంది
నవతాయుగం
వస్తోంది, వస్తోంది
జనతాయుగం
వస్తోంది వస్తోంది
యువతాయుగం ......వస్తోంది.

**స్త్రీ:**

వస్తోంది, వస్తోంది
సమతాయుగం
తన రాకమెచ్చంగ
పీడిత మహాజనము వస్తోంది.

**పురుషుడు:**

స్వార్థపరులకు బ్రతుకు
సన్నగిలిస్తంభింప
బలము సామర్థ్యమ్ము
ప్రజకు పంచీయగా వస్తోంది..

**స్త్రీ:**

ధనిక జన ఘన దౌష్ట్య
దర్పవల్లు త్రుంప
సామ్యవాదుల నిండు
కలలెల్ల పండింప వస్తోంది..

**పురుషుడు:**

కులతత్వ, మతతత్వ
హింసానురక్తులకు
మీ ఆట సాగదని
చాటి చెప్పుట కొరకు వస్తోంది..

**స్త్రీ:**

జాతి విద్రోహులను,
నీతి విద్వేషులను
కనువిప్ప కలిగించి
కలిపి నడిపింపగా వస్తోంది..

**పురుషుడు:**

సర్వజన సహకార
సంక్షేమ మార్గాల
నవజీవనమ్మొసగు
జవము చేకూర్పగా వస్తోంది..

**కథకుడు:**

ఇట్టి ప్రోత్సాహభరము పూరించి
సామ్యవాద సమాజమ్ము సత్వరము
కల్పనము చేసి ప్రజకు సౌఖ్యమ్మొసంగ
నిందిరాగాంధి వేవేగ నేగదలచె
వచ్చె చీలిక కాంగ్రెసు పక్షమందు
సంతసించిరి ప్రతిపక్ష సభ్యులపుడు
ఎన్నికలలోన నావె నోడింతు మనుచు
ఇందిరయె గెల్చె ప్రజలు హర్షించినా

**స్త్రీ:**

ఎన్నెన్నొ కలలు గన్నారు
ఇందిరా శత్రువులు
ఎన్నెన్నో కలలు గన్నారు
ఎన్నికల గెలువదని
ఎన్నెన్నొ కలలు గన్నారు.

**పురుషుడు:**

ఎన్నికల ఫలితాలు
అన్నియును వమ్మయ్యె,
ఎన్నికలలో మన్ను
తిన్నారు శత్రువులు ఎన్నెన్నొ..

**స్త్రీ:**

తరతరమ్ములనాటి
తమపెత్తనామె సాగు
ఏ ప్రభుత్వమ్మయిన
ఏలికల మౌదుమని ఎన్నెన్నొ..

**పురుషుడు:**

గూండాలు, మరి లంచ
గొండ్లు, దేశపురిపులు
అండగా నిలుతురని
దండిరాజుల మనుచు ఎన్నెన్నొ..

**స్త్రీ:**

పేదతనమును మాపు
టే తన నినాదముగ,
జనుల కోరెను ఓయి,
జయము తథ్యముగదా ఎన్నెన్నొ..

**పురుషుడు:**

ఎట్లో ఇందిరనాపు
టే ఆశయమ్ముగా
ప్రజల వ్యతిరేకింప
పడయరే అపజయము ఎన్నెన్నొ

**కథకుడు:**

క్షామములు, అనావృష్టి, బంగ్లా సమస్య
అతశరణార్థులును, యుద్ధ మాదిగా
ఎన్ని వచ్చిన ప్రభుత సాధించె ప్రగతి
రక్తి శాస్త్ర విద్యాకృషి రంగములను.

పెక్కు ప్రాంతాలలో అనావృష్టి వలన
దేశమందలి ఉత్పత్తి దెబ్బతినియె
ధరలు పెరిగెను ధాన్య సేకరణ సేయ
కడగి అడ్డిరి కొన్ని వర్గముల వారు

వ్యయము పెరిగినదంచు విద్యార్థులందు
బయలుదేరె నసంతృప్తి – స్వర్థపరులు
కక్ష సాధింపగా ప్రతిపక్ష తతికి
కలిగె నాందోళనల కవకాశమపుడు

**స్త్రీ:**

ఆందోళనలు లేవదీశారు
బందులెన్నో నిర్వహించారు
గుజరాత్ రాష్ట్రాన
ప్రతిపక్ష వర్గాలు
బందులెన్నింటినో
ప్రౌఢమెయిం నడిపారు ఆందోళన

**పురుషుడు:**

అందులో విద్యార్థి
బృందాలు చేరినవి
కార్చిచ్చు వోలెనవి
కలయగా ప్రాకినవి ఆందోళన..

**స్త్రీ:**

అభివృద్ధి లేదంటు
అపవాదు వేశారు
ముందు చూపేలేని
మందకొడి ప్రభుతయని    ఆందోళన..

ఉత్పత్తి పెంచాలె,
ధరలు తగ్గించాలె
అసమర్థ పాలనము
అంతమొందాలె అని    ఆందోళన

**పురుషుడు:**

వంచకులు, దుర్నీతి
పరులు, హింసావ్రతులు

***ఆకాశవాణి, విజయవాడ 27-6-76***

# సంక్రాంతి (నృత్య నాటిక)

**కథకుడు:**

తంధాన తాన తంధాన
భాయి భళానోయ్ – భాయి భళానోయ్
తంధాన తాన తంధాన
పంటల కథ విన రారండయ్యా
రండయ్యా మీరు రైతుల్లారా!
వేసగి యెండల పెనుగాడ్పులకు
విర విర పోతుందండీ లోకం
గుండెలదాకా బీటావారి
ఎండీపోతుందండీ నేల
అడవులు కార్చిచ్చుల కయ్యయ్యో
ఆహుతియై పోతాయండీ
ఏరువాక పున్నమి కోసం
ఎదురులు చూస్తుంటారండి మీరు
తంధాన...

**పురుషులు:**

పున్నమివచ్చిందీ – ఏరువాక
పున్నమి వచ్చిందీ!!
ఉన్న ఊరంతాను ఒకటై
కన్నె నేలలు దున్నమంటూ
పున్నమి వచ్చిందీ...
కొరముట్లన్నిటి సరిచేయించాం
ఆనందంతో అరకలు కడదాం
అన్నల్లారా చెల్లెళ్ళారా
అంతా ఒకటై పొలాలకెడదాం
పున్నమి వచ్చిందీ...

**స్త్రీలు:**

ఎద్దుల కడిగీ పసుపులు దిద్దీ
నిద్దాతకుకుల కుంకుమ లద్దీ
మెళ్ళో మువ్వల పట్టెడ కట్టీ
కాళ్ళకు గజ్జెల పట్టా కట్టీ
ఆనందంతో అరకలు కడదాం
అంతా ఒకటై పొలాని కెడదాం

**పురుషులు:**

పెందలకడనే లేవండీ
ముందూ వెనకల చూడండీ
గుళ్ళో గంటలు మొరయిస్తాం
గుడి ముందందరు చేరాలండి
పున్నమి వచ్చింది...

**స్త్రీలు:**

ఆడోళ్ళంతా దుత్తల నిండా
ఆరని పొంగుల పాలను తెచ్చి
తీయని కోర్కెల పాయస మొండి

తీపి తినిపించాలి ముందుగ
పున్నమి వచ్చింది...

**కథకుడు:**

వచ్చిన పున్నమి పొలముల దున్నిన
వానలు కురియవు వడసుడి తరుగదు
తంధాన...
ఊరు విడిచి వెళ్ళాలంటూ
ఒకటే పోరౌతుందింటింటా
కులదేవతలకు కొలువులు చేసీ
వానా దేవుని భక్తితో కొలిచి
తంధాన...

**ఒక రైతు భార్య:**

ఉత్తర జూశాం కామా... మన...
మెత్తాలి గంపిక మామా!!
ఇంకా ఎక్కడి వాన – నీ
తెలివంతా ఇది ఏనా
ఉన్నవి పెట్టుకొ తిన్నాం
ఊళ్ళో అప్పులు సున్న
పుస్తెల నమ్ముకున్న ఇక
పస్తులు తప్పవు మామా
ఉత్తర జూశాం...
రేపే బస్తికి పోదాం
రేవుల మూటలు మోద్దాం
కూలో నాలో చేద్దాం
ఈలో వానలు చూద్దాం
ఉత్తర జూశాం.
ఇక్కడె ఉందా మంటావ్ నీ
రెక్కల్లో సత్తువ ఏదోయ్
చిక్కదు కమికెడు కూడు – నా
డొక్కలు చూడోయ్ మామా
ఉత్తరజూశాం...
చెపుదామంటే సిగ్గు
చిట్టికి గుక్కెడు లేవు
ఇట్టే కూకున్నావా
చిట్టిక దక్కదు మామోయి
ఉత్తర జూశాం...

**ఒక రైతు:**

కంటనీరు పెట్టుకోకె
గుండె కలత పెట్టబోకె
ఊరు విడిచి రాలేనే
ఓర్చుకోవే పిల్లదానా
కంటనీరు...

తాతతండ్రులున్న ఊరు
దానధర్మం ఉన్న ఊరు
కష్టాలెన్నో వస్తు ఉంటయ్
కంటనీరు....

ఉన్నవాళ్ళ బాగోగులు
ఊరి పెద్ద చూస్తాడోసి
దేవుడిదయ లేదనకే
తిరుగుతుంది రేపో మాపో
కంటనీరు...

కొలుపుల కని ఊరంతా
గుడిముందుకు చేరుతోంది
వాన కురిసే వాగులొస్తే

వరిచేలన్నీ పండుతాయి
కంటనీరు...

లే లే లే పిల్లదాన!
మేలౌ నీ కన్నులాన!!
చిట్టిదానిని చంకేసుకో
ఇట్టగే గుడి కెడదాము
కంటనీరు...

**స్త్రీలు - పురుషులు:**

చక్కనైన సామి నీవు వానదేవుడా!
చల్లనైన సామి నీవు వానదేవుడా!

**స్త్రీలు:**

మ్రొక్కుకొందుమయ్య నీకు
మోకరిల్లినాము నీకు
కోపమింక మానవయ్య వానదేవుడా!
కురియవయ్య కుండపోత వానదేవుడా!

**పురుషులు:**

వానలు కురిసి వరదలొచ్చి వానదేవుడా!
పంటలు పండి ఇంటికొస్తే వానదేవుడా!
పప్పు పాయసాలు నీకు వానదేవుడా!
గొప్పుత్సవాలు నీకు వానదేవుడా!

**స్త్రీలు:**

పిల్లజెల్ల సల్లంగుంటె వానదేవుడా!
పిండివంటలు చేసి తెచ్చి వానదేవుడా!
గొండ్లిపాట పాడుతాం
గొబ్బి ఆట ఆడుతాం

**పురుషులు:**

కాటకాన్ని దాటయేస్తె వానదేవుడా!
మాట కాదు ఒట్టు సామి వానదేవుడా!
పేట పేరు నీ పేరె వానదేవుడా!
పెద్ద పేరు నీ పేరె వానదేవుడా!

**కథకుడు:**

తంధాన తాన తంధాన
భాయి భళానోయ్ తంధాన..
కారు మొయిళ్ళు కనిపిస్తాయి
కర్షకలోకం హర్షిస్తుంది
వర్షాదేవికి స్వాగతమిచ్చి
ఆశాజ్యోతులు వెలిగిస్తారు
తంధాన...

**స్త్రీలు - పురుషులు:**

అవిగో, అవిగో, అల్లవిగో
నల్లని చల్లని మేఘాలు
సంద్రాలెన్నో చక్కగ త్రాగీ
చిక్కని కడుపుల త్రేణుస్తూ అమె అవిగో..

**పురుషులు:**

ఉరుముల గర్జతో మెరుపుల విండ్లతో
ధారాశర సంపాతముతో
వర్షదేవతా సైన్యంలాగా
గ్రీష్మవిరోధి జయింపగ నవిగో
అవిగో...

**స్త్రీలు:**

తొలి చినుకుల పడ తోచిన తావికి
పరువులు తీస్తున్నయ్ లేళ్ళు,
గిరి శిఖరమ్ముల కురిసిన వానకు
జలజల వస్తున్నయ్ సెలయేళ్ళు
అవిగో...

**స్త్రీలు:**

ఆశాదీపిక లెద వెలిగింపుడు
అబ్బెడి నూతన జీవిత మిలకిక
అవె వినరయ్యా ఎద లుప్పొంగెడి
ఆటకు నిలిచిన నెమిళ్ళ కేక
అవిగో...

**వనితలు:**

ఎటకో పోయినవని తలపోసితి
మిటెచేరెను మన ప్రాణాలు
బొరియల నిద్దురు మేల్కొని నిలవక
చరచర విహరించెడి నాగాలు అవిగో...

**స్త్రీలు – పురుషులు:**

చిటపట చిన్కుల చిందులు ద్రొక్కుచు
సురలోకమ్ముల సిరిసంపదలతో
వర్షాలక్ష్మీ వచ్చావా, హర్షమ్మిల కిదె తెచ్చావా!
స్వాగతమమ్మా స్వాగతము
స్వాగతమిదె సుస్వాగతము

**పురుషులు:**

నిర్ఝరణీఘన మంజీరోజ్వల
నినదమ్ములె నీవంది జనమ్ముగ
వర్షాలక్ష్మీ వచ్చావా హర్షమ్మిల
కిదె తెచ్చావా!
స్వాగతమమ్మా! స్వాగతము స్వాగతమిదె
సుస్వాగతము!!

**స్త్రీలు:**

వనముల నందన వనముల జేయగ
నదులన్నిటి సురనదులను జేయగ
వర్షాలక్ష్మీ వచ్చావా, హర్షమ్మిల
కిదె తెచ్చావా!
స్వాగతమమ్మా! స్వాగతము, స్వాగతమిదె
సుస్వాగతము

**పురుషులు:**

మా మొర వినగా, మనసుల నిలుపగ
వరుణుని యొడివిడి పరుగున తల్లీ
వర్షాలక్ష్మీ వచ్చావా! హర్షమ్మిల కిదె
తెచ్చావా!
స్వాగతమమ్మా స్వాగతము
స్వాగతమిదె సుస్వాగతము!!

**స్త్రీలు:**

ఆనందం మాకానందం..
అభిలావని కిక ఆనందం
వర్షాలక్ష్మీ వచ్చావా! హర్షమ్మిల
కిదె దెచ్చావా!
స్వాగతమమ్మా స్వాగతము, స్వాగతమిదె
సుస్వాగతము!!

**స్త్రీలు – పురుషులు:**

లేవండోయ్, మరి, మేల్కొండోయ్
పోవాలండోయ్ మీమీ పనులకు

**పురుషులు:**

సందుల త్రోవల సన్నని బాటల
కొండలకోనల నిండిన నడకల
గొడ్డలి పట్టీ కొమ్మలు కొట్టీ
దొడ్డా వీపుల తేవాలోయ్
లేవండోయ్...

**స్త్రీలు:**

కుడితీ పట్టీ వీపుల తట్టీ
అదుపున పెట్టీ పొదుగులు పట్టీ
దూడల చేపగ త్రావా నిచ్చీ
దుత్తల పాలను పిదకాలోయ్
లేవండోయ్...

**పురుషులు:**

పలుగులు పారలు పట్టుకొనీ
కలుగులు బాళ్ళూ నీళ్ళజాళ్ళూ
గట్టుల మిట్టల సరిజేయాలోయ్
గడ్డల తిరగావేయాలోయ్.
లేవండోయ్...

**స్త్రీలు:**

చిన్నవి కడవలు చంకాసెట్టి
పెద్దా బానాల నెత్తీకెత్తి
మామిడి తోపులో కొలనుల కెళ్ళి
మంచినీళ్ళను తేవాలోయ్
లేవండోయ్...

**కథకుడు:**

కడుపులు నిండా నీళ్ళను తాగి
కళకళ లాడుతాయి చేలు,
నవ్వుతు పాలేళ్ళూల్లో మంచి
నాట్లు కూలికి వస్తుంటారు
తంధాన...
మురిపెపు పాటల నాట్లల్లోను
మునిగుంటారు రైతులూ
తంధాన...

**స్త్రీలు – పురుషులు:**

నారు పీకి ఓలో ఓలి
నాటుదాము ఓలో ఓలి
అన్నలారా ఓలో ఓలి
తమ్ముళ్ళారా ఓలో ఓలి

**పురుషులు:**

మళ్ళన్నిటినీ ఓలో ఓలి
మంచిగ దున్నీ ఓలో ఓలి
వదులుగ మట్టిని ఓలో ఓలి
పదునులు, చేశాం ఓలో ఓలి
నారు పీకి...

**స్త్రీలు:**

చక్కని విత్తుల ఓలో ఓలి
చల్లినాము ఓలో ఓలి

ముచ్చటగా నా రోలో ఓలి
మొలిచున్నాది ఓలో ఓలి
నారు పీకి...

**పురుషులు:**

పైరులు నాటగ ఓలో ఓలి
పంట పొలాలను ఓలో ఓలి
కమ్మని నీళ్ళతో ఓలో ఓలి
దమ్ములు చేశా మోలో ఓలి
నారు పీకి...

**స్త్రీలు:**

పశువుల యెరువుల నోలో ఓలి
పచ్చని యెరువుల నోలో ఓలి
బాగుగ చల్లి ఓలో ఓలి
మాగేశాము ఓలో ఓలి
నారు పీకి...

**పురుషులు:**

తిన్నని వరుసల నోలో ఓలి
తెరపిగ నాటం డోలో ఓలి
మొక్కకు మొక్కకు ఓలో ఓలి
మ్రొక్కుతు నాటం డోలో ఓలి
నారు పీకి...

**స్త్రీలు:**

కుదరొాక్కంటికి ఓలో ఓలి
తెరపిగ నాటం డోలా ఓలి
మొక్కకు మొక్కకు ఓలో ఓలి
మ్రొక్కుతు నాటం డోలో ఓలి
నారుపీకి...

**స్త్రీలు:**

కుదరొాక్కంటికి ఓలో ఓలి
కుంచెడు ధాన్యం ఓలో ఓలి
కొలవగ పండా లోలో ఓలి
కోర్కెలు తీరా లోలో ఓలి
నారుపీకి...

**కథకుడు:**

తంధాన తాన తంధాన
భాయి భళానోయ్, భాయి భళానోయి
తంధాన...
కళకళ లాడుతు పంటలు పెరిగే
కన్నుల పండువగా చేలుంటే
మంచెపై భార్యతో రైతు బాబయ్య
మహదానందంతో సరసాలాడు
తంధాన...

**ఒక రైతు:**

మొలకెత్తి నది పత్తి ఓ భామా!
తల చూడవే ఓ భామా!!

**రైతు భార్య:**

కనవిచ్చి చూడకోయ్ ఓ మామా!
కలుగునేమో దిష్టి ఓ మామా!!

**ఒక రైతు:**

దబ్బాటు వానలకు ఓ భామా!
దెబ్బతిన కుండాలి ఓ భామా!!

**రైతు భార్య:**

దిగులు పడకోయ్ నీవు ఓ మామ!
దేవుడే కాస్తాడు ఓ మామా!!

**ఒక రైతు:**

బుడతడంతై పెరిగి ఓ భామా!
పొలము గుబురేస్తుంది ఓ భామా!

**రైతు భార్య:**

పూలేస్తే వస్తాయి ఓ మామా!
పోకిరీ తుమ్మెదలు ఓ మామా!

**ఒక రైతు:**

గడలు పాతిస్తాను ఓ భామా!
గంట లెత్తిస్తాను ఓ భామా!!

**రైతు భార్య:**

క్రొత్త సంచులు కుట్టి ఓ మామా!
కొడి కొడికి తొడుగుతా ఓ మామా!!

**ఒక రైతు:**

కంచె పాతిస్తాను ఓ భామా!
మంచె వేయిస్తాను ఓ భామా!

**రైతుభార్య:**

మంచెపై వడిసెలతో ఓ మామా!
నుంచోని కాస్తాను ఓ మామా!

**ఒక రైతు:**

నక్క కూతలు వింటె ఓ భామా!
అక్కడే ఉంటావ ఓ భామా!

**రైతు భార్య:**

ఒక్క కేకెడతాను ఓ మామా!
ఉలుకుతూ వస్తావు ఓ మామా!

**కథకుడు:**

కోతల్రోజు లొచ్చే తల్కి తంధాన!
కొత్త జీవితమ్ము వచ్చు తంధాన!!
చిన్న పెద్దలంతా వెళ్ళి తంథాన!!
చేల కోతలు కొస్తారు తంధాన!!

**కొందరు:**

ఏలే మాలి, జంబైలోలె
జోతులంగురు ఏలెమాలి!

**స్త్రీలు – పురుషులు:**

కోద్దాము కోద్దాము వరిపంట
గంపలన్నిటి కెత్తి గాదెల్లో పోద్దాము
కోద్దాము...

**పురుషులు:**

కొండలను మించేటి
కుప్పలు వేయగా
కోరికలు తీరగా
కొడవళ చేపట్టి
కోద్దాము...

**పురుషులు:**

ఏలే మాలి జంబైలోలె
జోతులందరు ఏలె మాలె!

**స్త్రీలు:**

అన్న వస్త్రాలకు
అన్ని వస్తువులకూ
ఆధారమైంది ఈ
అమృతాల పంటా
కోద్దాము...

**కొందరు:**

ఏలే మాలి జంబై లోలె
జోతులంగరు ఏలెమాలి

**పురుషులు:**

కొద్దిరైతుల కైన
పెద్ద రైతులకైన
మంచి రోజులు తెచ్చు
మహ తల్లి యీ పంట
కోద్దాము...

**కొందరు:**

ఏలే మాలి జంబై లోలె
జోతులంగరు ఏలేమాలి

**కథకుడు:**

వస్తుంది సంక్రాంతి లచ్చి సంక్రాంతి
తెస్తుంది ఊరికి దివ్య సౌఖ్యాలు
తంధాన...
అంటు తల పోస్తును ఊరివారంతా
ఆనందంతో కుప్పలంనూర్చి
తంధాన...
బళ్ళామీద ఇళ్ళకు చేర్చి
పడవల మీద పంపిస్తారు
తంధాన...

**స్త్రీలు – పురుషులు:**

మనకు వచ్చు సంక్రాంతి సిరిసిరిమువ్వ
మంచి తెచ్చు సంక్రాంతి సిరిసిరిమువ్వ
పంటల్ల పండుగ సిరిసిరిమువ్వ
భాగ్యాల పండుగ సిరిసిరిమువ్వ

**పురుషులు:**

దూరవూళ్ళ నుంచి వచ్చి సిరిసిరిమువ్వ
బేరగాళ్ళు పంటకొంటె సిరిసిరిమువ్వ
ముంతలనిండా డబ్బేను సిరిసిరిమువ్వ
సంతలనిండా డబ్బేను సిరిసిరిమువ్వ

**స్త్రీలు:**

రంగవల్లి తీర్చిదిద్ది సిరిసిరిమువ్వ
సింగార మొలికించి సిరిసిరిమువ్వ
గొబ్బి పాట పాడుతాము సిరిసిరిమువ్వ
కోలాట మేస్తాము  సిరిసిరిమువ్వ

**పురుషులు:**

హరీలో రంగంటు  సిరిసిరిమువ్వ
హరిదాసు లొస్తారు సిరిసిరిమువ్వ
దూడూడ బసవన్నింటికి సిరిసిరిమువ్వ
ఏడాదికొస్తాడు సిరిసిరిమువ్వ

**స్త్రీలు:**

పుట్టింటి పడుచులకు సిరిసిరిమువ్వ
పుట్టింది సంక్రాంతి సిరిసిరిమువ్వ

వియ్యాలోరి విందుల కోసం
సిరిసిరిమువ్వ
వెయ్యాలి సువ్వి హా సువ్వి సిరిసిరిమువ్వ

**ఒక రైతు:**

నిరా నిరా బండి రా
నివ్వరోరి బండి – నిరా నిరా
చర చర రావాలి బండి
పరుగుల రావాలి బండి,
గిత్తలపొగ రణిగేట్టుగ
కొత్త ధాన్య మెత్తుకోని – చరచర

మువ్వల మ్రోతలు వింటె
దవ్వుల నిలవాలి జనం
ఎవ్వరి దని జనమంటే
మాదే నందాము మనం–చర చర

చెదరి చెదరి వస్తున్నయ్
చిలిపి చిలిపి మబ్బులవే
ధాన్యానికి తడుపు తగిలి
ధర పడిపోతుంది రోరి–చరచర

డొంకబాట చెడిపోతే
వంకలన్ని తిరిగేవ్ రోయ్
అడ్డదారి కొట్టుకొరా
గడ్డి కప్పి తట్టుకొరా చరచర
నిరా నిరా బండి రా
నివ్వరోరి బండి

**స్త్రీలు – పురుషులు:**

హైలేసా, హవ్వరి హవ్వ
లాగరోరి లంగరు తాడు

**పురుషులు:**

మేముంటేనే పంటుంటుంది
పంటుంటేను ప్రజలుంటారు హైలేసా

**స్త్రీలు:**

ప్రజలుంటేను రాజ్యం ఉంది
రాజ్యం ఉంటే మనముంటాము
హైలేసా

**పురుషులు:**

మనముంటేనే బెస్తుంటాడు
బెస్తుంటేనే పడ వుంటుంది హైలేసా

**స్త్రీలు:**

పడవుంటేనే సరుకులుంటాయి
సరుకులుంటేనే సౌఖ్యాలుంటాయి
హైలేసా

**స్త్రీలు పురుషులు:**

హైలేసా హవ్వరి హవ్వ
లాగరోరి లంగరు తాడు

*–ప్రజావాణి, ఆదివారం, సెప్టెంబర్ 30, 1962*

# సుమ ప్రియ (గీతి నాట్యము)

**వసంతుడు**

ఉజ్వల రస పరమేశ్వరి
ఓహోహో అమృతమయీ!

జ్యోత్స్నా నభ సరసీమధు
కుముదవనీ గృహరమణీ ॥ఉజ్వలరస॥

క్రేంకారిత తుహినయవని
కాభ్యంతర దివ్యవాణి ॥ఉజ్వలరస॥

బాలాతప వికసితనవ
సితసరోజ దరహాసిని ॥ఉజ్వలరస॥

శ్ర వదాశా శుభతుందిల
శుచి శోభారాగధునీ ॥ఉజ్వలరస॥

లాస్య రచిత చరణాంబుజ
మణి మంజుల రవకింకణి॥ఉజ్వలరస॥

తమసావృత హృదయకుహర
రుచి మండిత బహుళ ఘ్రుణీ॥
ఉజ్వలరస॥

**పుష్ప కన్యలు**

(ప్రవేశించి)

ఒక పూవు
స్నిగ్ధ కాంతి వాసంతిక
దుగ్ధహస శామంతిక
కోకనదా కుసుమరాజ్ఞి
మందారమ మధుర రోచి

రారె రారె సఖులారా
సాగిరారె సఖులారా
నవవసంతు డరుదెంచును
నతులీయగ రారేలా

విరహతమము విరియును లే
ఎరసంజులు దరియుము లే
తావిదెసల క్రమ్మునులే –
రారె రారె సఖులారా

**పుష్ప కన్యలు**

(వసంతుని చుట్టూ మూగుతూ)
ఋతు నేతా వసంతా
నవశోభా లతాలతా
వచ్చినాడు వసంతుడు
నవశోభాలతాంతుడు.

నీ రాకకై నిఖిల జగము
నిలుపు బ్రతుకు కనుతుదలను
వలగొనియెడు కోరికతో
వలపు గ్రుక్కిళులు త్రావుచు
ఋతునేతా...

నందనవన సుందరి నిను
అందగాని రానిచ్చెనె

శోభా నవ తరుణిమ మా
శుష్క జీవ వనముల కిక
ఋతునేతా...

**షట్పదరాజు**

చిరుగాలి కెరటాల
పరువు బరువుల మ్రోయు
ఏ పూవు చూచినా
ఎడద కనుతాపమ్మె

వాసనల బలమూని
వాతెరల మధువాని
బానిసలగా జేయు
పవనుడెంతటివాడు

బ్రతుకు టెలతోటలకు
ప్రసవప్రణయమె శిశిర
వమృత కుసుమాప్సరల
కకట బాని బ్రతుకె చిరుగాలి...

**సుమప్రియ**

నెమ్మదికి రావె యీ తుమ్మెదకు ఓ పూవ
అమ్ముకోబోకె నీ నెమ్మనము
ఓ పూవ

పొలతి బేలవె నీవు
ప్రౌడతన మెరుగకా
ననకులమ్మున కెంత
నగుబాటె! నగుబాటె! ॥నెమ్మదికి॥

ఈ కోన నీకంటె
తావిగల పూవేది
ఆతురత ఏకాని
ఆతడెరుగడె సొగసు ॥నెమ్మదికి॥

**షట్పదరాజు**

ఏకోన పూవువౌ నీవు
నీతావి పూవులకు రాదు
హిమ వాలుకా స్వచ్ఛ
మెంత చల్లని చూపు
హిమ బంధు బంధురం
బెంత చక్కని రూపు ॥ఏ కోవ॥

ఏ చిరంతన పుణ్య
మోనాక ఫలమువో
ఏ మధువ్రత మూర్తి
హృదయాధి దేవతవొ ॥ఏ కోవ॥

**సుమప్రియ**

తుమ్మెదవా! తుమ్మెదవా
నమ్మరాని తుమ్మెదవా!
మనసిచ్చిన పాటలతో
మరలు కొల్పి యీ కన్నియ
మధువానిన వెనుక నీవు
మరల మోము చూపింపవు
తుమ్మెదవా

వలపింపకు లే యెడదల
విలపించెడు వేదనతో
విరహ బాధ మెరుగకయీ
విరుల మనసు దొరుకదు పో
తుమ్మెదవా

**షట్పదరాజు**

రాణివిలే సుమ రాణివిలే
ప్రాణ వీణ పలికించే
ప్రణయ నావ నడిపించే
రాణివిలే సుమ రాణివివే
జీవ మధువు క్రోవించే
జీవధనము పాలించే
రాణివిలే సుమ రాణివిలే
అచ్చరలను పొదలించే
అమరత్వము నొదవించే
రాణివి లే సుమరాణివి లే

**సుమప్రియ:**

జుం జుం జుమ జుమ జుం జూ జుమ్
మంజుల కుసుమ కుమారికనూ
మధుకరలోక మనోజుడవూ
జుం జుం జుమ జుమ, జుం జుం జుమ్

**షడ్పద రాజు:**

జుం జుం జుమ జుమ జుం జుం జుమ్
సదమల సౌందర్యాకృతి వీ
ప్రవిమల ప్రణయ రసాకృతినీ
జుం జుం జుమ జుమ జుం జుం జుమ్

**పుష్ప కన్యలు:**

ఋతునేతా వసంతా
నవ శోభాల లతాంతా

★ ★ ★

జై ఆంధ్ర ధ్వజ జై జై
జయ అమరధ్వజ జై జై

తాతలు తండ్రులు
త్యాగ సంయోధులు
తనువుల నొసగిన
తల్లీ – జై
జై ఆంధ్ర ధ్వజ జై జై
జై అమరధ్వజ జై జై
శాత్రవరుధిర
సయోధుల నీదగ
శక్తి నొసంగుదము
తల్లీ – జై

జై ఆంధ్ర ధ్వజ జై జై
జయ అమరధ్వజ జై జై
శాత్రవరుధిర
సయోధుల నొదగ
శక్తి నొసంగుము
తల్లీ – జై
జై ఆంధ్రధ్వజడు జై జై
జయ అమరధ్వజ జై జై
అమరజయార్మల
మర్ధింతుము ని
న్నాశిష మమ్మో
తల్లీ – జై

జై ఆంధ్రధ్వజ జై జై
జయ అమరధ్వజ జై జై

భరత ప్రజా
ప్రజా హృదయరాజ్ఞి
భవ్యజనని భరతావని
రత్నాకర సరసీరుహ
సింహళమ్ముద్ర పదపీఠా
శిశిరోఖ్యల శుభిజ్యోత్స్నా

హిమవన్నగ సితమకుటా
హిందూ ప్రజా
చుంబిత నభ కాళిందీ
కువలయ రుచి కచభారా
కరమృదంగ
మృదు మంజుల మంజీరా

– హిందూ ప్రజా..

మధుతుందిల ఋతుమండల
సకల వనీశుక పికగళ
సంధ్యాదుతి కిమ్మీరిత
వింధ్యాచల నవమేఘాల

– హిందు ప్రజా....

***ఆకాశవాణి, మద్రాస్, 8-12-46***

# నిర్ణేత

**స్వరమేళ**

పడతుల నిరువుర నెవ్వరు
పరిణయమాడగ రాదని
నారీజన గౌరవమున
నరపతి శాసించె గదా!

అచ్చరలను తలదన్నిన
మచ్చెకంటి యొకతె వచ్చి
విచ్చిన తన పతి మెచ్చక
తెచ్చెను నే డభియోగం

న్యాయసభా నిర్ణయ మీ
నాడు జరుగు వినరండీ!
నిశిత బుద్ధి కుశలత గల
నిర్ణేతను గనరండీ!

అదిగో, ఆలయ ఘంటిక
పది దిక్కుల మా(ర్మోగెను,
సర్వేశ్వరు సన్నిధి ఇది
సభ మొదలిడ సమయమయ్యె!

పరిషజ్జన వరులారా!
పరమ న్యాయవిదులారా!!
కోవిదు లౌ మీ రెల్లరు
కోప మడిగి వినుఁడయ్యా!!
ఆశా భయ భావములతో యుగళి
అరుదెంచిరి వీరిచటికి

వాది, ప్రతివాది – వీరి
వాదములం దెది సత్యమొ!

అవినీతికి తావీయక
అంతరంగ సుపరీక్షల
రవిచంద్రులె సాక్షులుగా
లలితమతులఁ బరికింపుఁడు

రాగద్వేషముల విడిచి
రాజశాసనోచితముగ
న్యాయ నిర్ణయమ్మె మీ
ధ్యేయముగా మెలగుడయ్యా। (వలయు)

రాగద్వేషముల విడిచి
రాజశాసనమును వలచి
నిర్ణయమును చేసి మీరు
నీతి నిలను నిలుపవలయు

**దేవారికుడు**

గద్గద కంఠమునతో నీ
కాంత – వాది – ఎటు పలికిన (ఎది)
కాదని ఈ మొప్పెవాడు
కఠినోక్తుల బెదరించునొ

**ప్రతివాది**

న్యాయ నిర్ణయము చేసే చేసెడి
ఆయతన మ్మిదియేనా?

**అందరు**

ఇదియే ఆ ఆయతనము
అదె నిర్ణేతల పరిషత్తు

**ప్రతివాది**

(స్వగతము)
పొడుచుకొని తిని బ్రతికిన ఓ
పోట్లమారి కుక్కుటమా!
అహము విడిచి మెలగుము నీ
గ్రహబలమ్ము మారెనులే (మారిపోయె)

**అందరు**

ఎవరవు నీ వికటి కిప్పు
డేమి కోరి వచ్చితివి!

**ప్రతివాది**

పడయగ నే న్యాయ మ్మిట
ప్రతివాదిని వచ్చినాను

**పరిషత్స్వర మేళ**

పరిషత్తున కీ వెవర.వో
పరిచయమై పోయెనులే

**బుద్ధి**

దుష్టాత్ముడు నీ వంచును
తోచె మున్నె మా కెల్లరకును

ఓరి ఓరి పాపిష్ఠీ!
ఉవిదను శ్రమపెట్టితివా?

క్రూరశిక్ష తప్పదు మా
కోపాగ్నికి బెగ్గడిలుము

**ప్రతివాది**

చిత్రముగా నన్న దపుడె
చేసితిరా నిర్ణయమును
సావధాన చిత్తముతో
సర్వము విని సెలవీయుడు

ఇందలి ప్రతివాదమ్మెదొ
ఎరుగరు మీ రందరు మాత్రము
ఏకపక్ష వాదము విని
ఏల నిర్ణయించెద రిటు

**పరిషత్స్వర మేళ**

నిజము! నిజము!! ప్రతివాదీ!
నీ వాదము వినియెద మిదె
వివరముగా వినిపింపుము
విని చేతుము నిర్ణయమును

**ప్రతివాది**

జయ మదనా! యువజన మన
ఘన సదనా!! జయ మదనా!!

నా పూర్వ ప్రేయసి ఈ
నళినలోచనను చూచితి
దివితారక నాకొరకై
దిగివచ్చిన దనుకొంటిని

ఉపమీపగ నీ జగాన
నోపెడునది కననైతిని

కడువిరాళి వివశుడనై
కామార్తికి లోనైతిని

ప్రణయరుజా జుర్జరితుడ
పద సరోజముల వ్రాలితి
సర్వసంపదలు కాన్కగ
చరణాంతికమున నిలిపితి.

నవవసంత శోభలతో
నడిచె కొంత జీవితమ్ము
నెచ్చెలితో బ్రతుకు నాకు
అచ్చపు వెన్నెల యైనది

నిత్యసౌఖ్య మొదవిన నది
నిస్సారమ్మగును గదా!
ఏ మార్పును లేని వలపు
ఎడద కరుచి నొసగు కదా!

ప్రకృతి నేర్పె పాఠము – నా
ప్రణయబంధ మెటూ సడలెను
తొలుతటి యీ నా ప్రణయిని
తోచసాగె పెను పీడగ

జిగి మెరపుల నిగనిగలతో
చెలియ యొకతె చేరి నవ్వె!
వెలిగెదు నా యెద (మది) లో నొక మరి
జిలుగు వెలుగు వలపు దివ్వె!!

తొలుత తొలుత కళవళ పడి
మ్రొగ్గకి నే సిగ్గిలి తిని
కాము డెంత ధూర్తుడొ – నను
కరుణ వీడి వేధించెను

నిశిత కుసుమ శర పీడకు
నిలువలేక దిగజారితి
తుద కే నొక యదయమ్మున
తొయ్యలి కౌగిలి నొదిగితి!

అపుడీయమ నా ప్రణయిని
ఇపు డాయమ నా ప్రేయసి
ఎవరి తలపు గైకొందును!
ఎవరి వలపు కాదందును!!

–జయమదనా!

**పరిషజ్జన స్వరమేళ**

(ఒక పారిషదుడు)
యువకుడనై యున్నవేళ
ఉన్నవాడ నే నిటులే!
ప్రతిదినమును నవ యువతీ
ప్రసవరసము సేవించితి

కామాంధ్యము గ్రమ్మిన యా
కాల మెపుడొ గడచిపోయె
ఇపుడు నేను సుచరిత్రుడ!
ఎల్లరకును 'పూజార్హుడ'!!

కరుణ యించుకయు నా మది
కలుగదు ప్రతివాది మీద
భయభావముతో నాతఁడు
పరికింపగ వలయు మమ్ము!!

ఒయ్యారపు నడకలతో
నోలగమున పాడెదేల?
న్యాయమ్మే మా ధ్యేయము
న్యాయమె మా నిర్ణయమ్ము!

**దేవాదికుడు**

న్యాయసభా మర్యాదల
నయమున పాటింపవలయు
నిశ్శబ్దము! నిశ్శబ్దము!!
నిర్ణేతకు నతు లిందు!!

(సభా నిర్ణేత వచ్చువేళ నందురును
గౌరవముతో లేచెదరు)

**స్వరమేళ**

జై నిర్ణేతా!
ధర్మ త్రాతా!!
ఈర్ష్యా ద్వేషము
లెరుగము నీపై
సత్యరథానికి
సారధి వీవు
నిను స్తుతియింపగ
వెనక యెరుంగము!!
శాస్త్రము లెరిగిన
చదువరి వయ్యా!
ఆచారమున నీ
హస్తామలకము!!

**నిర్ణేత**

(ప్రవేశిస్తూ)
విజ్ఞుడనో, అజ్ఞుడనో
నిలిపెను విధి నిర్ణేతగ
ఆశీస్సులు గాగ వీని
నార్యులార గ్రహియించెద!

వైవాహిక విషయమ్మున
వాగ్దానము చేసి యొకడు
భయము గావించినాడు
పరికింపగ వలయు మనము!

కాని తొలుత మీరెల్లరు
కాలహరణ మనని యెడల
ఎటు నిర్ణేత నైతినొ
ఎరిగించెద తొలుత సుంత!

ఉద్దీనము నందు చదివి
యువకుడనై యున్నపుడే
నరపతి నగరమున నేను
న్యాయవాది గా వచ్చితి

ధనహీనుడ నగుట చేత
ధరియింపగ జాలనైతి
కలవారలు నను జేరగ
పలు వన్నెల జిగివలువలున

తారహార. దీప్తులతో
తనుపదు నా వెడద యురము
మణికంకణ కింకిణి కురరు
కరరు లెరుగదు నా కరము!

తలపాగకు చుట్టనైతి
నెలవంకల చిరుబేరులు
ఎంత చదువు కొన్న నేమి?
ఇటులె నడచె నా తీరులు!

నాలుగేండ్లు సభ కేగిన
న న్నెవ్వరు చేరరారు
నా వలెనే యువకులచట
నలిగిపోవుచున్నారు.

చేరక చేరక యొక పరి
చేరినాడు సెట్టి యొకడు
అభియోగ మ్మతని కెంతో
అనుకూలముగా నున్నది

మరల నొక్క యవకాశము
దొరుకునా లే దోయని నే
నేరము తప్పించుటకై
వీరవిహారము చేసితి.

న్యాయభలో దశదిశలను
నా కంఠమె మార్మోగెను
కోవిదు లాశ్చర్యమొదవ
గొప్పగ నను పొగడినారు!

ఐన నేమి ఫలమున్నది
అభియోగము వీగినది
మ్రగ్గి మ్రగ్గి సిగ్గిలితిని
మరణమె మేలను కొంటిని!

నాల్గు నాళ్లు గడచిన యెడ
నాకును నీ లోకమునకు
తీరిపోయెడిదొ యేమో
మారిపోయినాను నేను.

పెండ్లి కాక తండ్రి యింట
పెరుగుచున్న దా కురూపి
నా కన్నను వయసున పదు
నాలుగేడు లైన మిన్న.

రాజవాది నందన కడు
రసిక ప్రియ యని వింటిని
కలిసి – కనులు కలిపి చూచి
"కంజాక్షివి నీ" వంటిని.

పల్లకి బోయీల కేక
పడినది చెవి మరునాడు
చేరనీని ఆమె తండ్రి
దారి వెదకి వచ్చి అనియె

"అల్లుడ వై నంతనె నీ
వగుదువోయి ధనికుడవు!
ఆమె రూపమూ అది నీ
కలవాడై పోవును లే!

పెద్ద యనెడి సంశయమును
వద్దు నీకు మానసమున
పదునారేడుల కన్నియ
పగిది తోచు మునిమాపున.

ఆశ నన్ను నడిపించెను
అంగీకారము తెలిపితి
ఆమెకు నాకును పరిణయ
మతివైభమున జరిగెను.

అన్నమాట నిలువ బెట్టి
నధికముగా రాజవాది
ఏ మొనర్చినాడో మరి
ఎరిగినవా డా దైవమె.
అభియోగము లిచ్చుకొరకు
అందరు నా కడ మూగిరి
నను మించిన న్యాయవాది
నగరమ్మున లేడాయెను.

అన్నివేళలందుననా
ఆరభటీ ముక్తకంఠ
నినదమ్ముల ప్రతిరుతులే
నిండె న్యాయ మందిరాన.

బందిపోటు దొంగలకును
బహువిధ నరహంతకులకు
కాంతాజన మానహరణ
ఘనధూర్తుల కైతి ప్రాపు

ఓపి నాకు శుల్క మొసగ
ఉరిశిక్షలు కరవైనవి
కారాగృహ బంధనములు
దూరములై పోయినవి.

కొలది కాలమునకు నేను
కోటికి పడగెత్తి నాను
భోగభాగ్యముల పురమున
పోలరైరి నన్నెవ్వరు.

నా పాండితి చెవి కెక్కిన
నరనాథుడు మెచ్చి నన్ను
నిఖిల రాజ్య న్యాయసభకు
నిర్ణేతగ నియమించెను.

ఆ కురూపి, పెద్దదాని
అవల కెటులో గెంటివైచి
స్వర్గసౌఖ్య మబ్బినటుల
సంతసించినాను నేను.

అపకీర్తిని గల్పింపగ
అపుడు రాజువాది యెన్ను
పన్నెను నరామీద కాని
ఫలము శూన్యమై పోయెను

అభియోగము నే డెదొ మీ
కందరకును తెలిసినదే!
పరిణయ వాగ్దానమునకు
భంగపాటు జరిగినది

వైవాహిక బంధమునకు
భంగము కల్పించితి గద!
నిర్ణేతగ నే తగుదున?
నిశ్చయింతు శిక్షయెదో!

పరిషత్సభ్యులు
తగుదు నీవె నిర్ణేతవు!
తగ తీర్పును ఈ వ్యాజ్యము!!
నీవె నీవె నిర్ణేతవు
నీ వుత్తమ నిర్ణేతవు!!

**నిర్ణేత**

ఏనే నిర్ణేతనైన
ఎక్కెద నీ గద్దియపై

**స్వరమేళ**

అగుదు నీవె నిర్ణేతవు
అత్యుత్తమ నిర్ణేతవున
న్యాయమ్మేదో నిర్ణయింప
నా గద్దియపై నెక్కుము!

**నిర్ణేత**

వంచనయే నా న్యాయము – ఐన
వ దలను నే నీపదవిని
నిర్ణేతగ జీవించెద!
నిర్ణేతగా మరణించెద

**వాది వాది**

(పరిషత్తులో)
విబుధావర్యులారా! ఏది
వినిపింపుడు మీ శపథము

**దేవారికుడు**

అధమాధిక వర్గంబుల (అధికాధమ)
కభియోగము లొదవు నిచట!
ధనవంతులు, ధనపిశాచులు
మనను న్యాయ మడిగెదరు.

జంకకయ యెదలోన దుడుక
సంకోచము వీడి మీరు పక్షపాత
రహితముగా
పలుకవలయు న్యాయమేదో!

**పరిషత్తు**

ఎవరిదైన నభియోగము
రవిచంద్రులె సాక్షులుగా
తీర్పు నిచ్చి దుఃఖమ్ములను
తీర్చెద మిది మా శపథము!

**వాదివాది**

వాది యెచట! వనితగదా!!
వచ్చినదా న్యాయసభకు

**దేవారికుడు**

జలజనయన! జలజ నయన!!
సభలోనికి రావమ్మా!

**వాది చెలికత్తెలు**

భాసురసుమవల్లి యీమె
బహువంచన పాలైనది
జలజ నయన రావమ్మా!
సభలోనికి రావమ్మా!!

చిరుత గాలివాన యైన
చెదర మేఘ గర్జలతో
అపరూపము నీ యందము
అయిన వీని గైకొనుము
(పూలగుత్తు లందింతురు)
హసనమ్ముల భ్రమలు గొలుపు
ప్రసవ వల్లికల గెలవుము – జలజనయన

వాడి వత్త లగువరకును
వల్లి! వీనిధరియింపుము
జీవితమ్ము సుఖమయముగ
చెలగుగాత నీకు చెలీ!

**వాది**

కాలమనెడి రాజ రాజు
కడు గడుసరి క్రూరాత్ముడు
ఏ ఋతు సామంతునైన
ఇల నిలువగ నీడు సదా!

అవకుంఠన పాలు సేసి
అవధులు దాటించి తరుము
అతని కట్టి దొాక లీల!
ఆతనితో మనకేలా!

నితరమ్మును ఆతపమే
నిత్యమగుటయునుమేలా?
ప్రసవంతతుల కయ్యది
పరమదుఃఖ హేతువు కద!!

వెలుగునీడ లొకటొకటిగ
వెనువెనుకల వచ్చినపుడె
ప్రసవవల్లులకు జగమున
పరమసుఖద జీవనము

శీతల హృదయుండైనను
శిశిరుడు కడు నందగాడు
అతని యంద చందములవి
అనవరత మ్మాతనివే

ఛాయా తప కలితముగా
సాగు బ్రతుకె సుఖమయము!
జీవితమిటు మారెననుచు
చింతలేదు ఆవంతయు!!

కాలమనెడి రాజరాజు
కడు గడుసరి, క్రూరాత్ముడు!
ఏ ఋతు సామంతుడైన
నిల నిలువగ నీడు సదా!

**పరిషత్సభ్యుడు**

ఇంత అందమౌ మోమును
ఏ నెన్నడు చూడలేదు

**పరిషత్తు**

చూడలేదు మున్నెన్నడున
సుందరి నిటువంటిదాని
ఓరి ఓరి మొప్పెవాడ
ఉవిద నీమె విడిచెదవా?

**నిర్ణీత**

(పరిషత్తులో)
బలవంతముగా నైనను
పరిణయమాడగ నీమెను
ఆ విధాత తీర్చిదిద్ది
అవని జనుల కొసగ లేదె?

**పరిషత్తు**

ఏకగ్రీవముగ దీని
కెల్లరమును నొప్పుకొందు
వెల్లరమును జితులమైతి
మీ చేడియ యందమునకు

**వాది**

జాలికి లోనై మీరలు
చాలదూర మేగినారు

**పరిషత్తు**

నీ మీదను జాలి (కరుణ) మాకు
నిండియున్న దీ యెడదల
వాది చెలికత్తెలు

(పరిషత్తులో)
ఎత్తులపై నెత్తు లేయు
జిత్తుల నక్కలు వీరలు

**వాది వాది**

శపథమ్ములను త్రోసిపుచ్చి
చాలగ నెద తను నమ్మిన
నాతి మోసగించుటలో
నరుడింతటి నీచజనుడె!
ఎరుగక నే మున్నియ్యది
ఏదో యుద్వేగమ్మున
ఆర్యులార! వాదింపగ
నభియోగము చేపట్టితి!!

**అందరు**

వాగ్దానము త్రోసిపుచ్చి
శపథమ్మును త్రోసిపుచ్చి
వనిత నితడు మోసగించె
సతి నీతడు మోసగించె!

**వాది వాది**

(వాది వాది వాది యెదపై దుఃఖించుచు వాలును)
కనుడు వాది నార్యులార!
కన్నీ రిదె మున్నీరగు
ఎద యెరుగని క్రౌర్యమునకు
ఎంతగ బలి యై పోయెనొ!
త్రోసి పుచ్చి వాగ్దానము
ద్రోహి, అదే ప్రతివాదెట
చేదునవ్వు భయ మెఋగక
చిలుకుచున్నాడు కనుడు

సిగ్గు దొంతరల తెరలతో
చెలి యాతని పిలిచె తొలుత
మందహాస మకరందము
లందించిన దామెతలుగ

**అందరు**

సిగ్గు దొంతరల తెరలతో
చెలి యాతని వలచె తొలుత
మందహాస మకరందము
లందించిన దామెతలున

**వాది వాది**

మాట నిలుపజాలని యీ
మగవానితో మా వాదికి
మకరంద క్షణము లెన్నో
మహిత వేగముగ గడిచెను

పూరిళ్ళే పొదరిళ్ళుగ,
పురతరులే నందనముగ,
వేసగి మధ్యాహ్నమ్ములు
విరివెన్నెల వెలుగులుగా
శపథమ్ములను చెల్లింపని
జను డీతనితో వాదికి
మకరంద క్షణము లెన్నొ
స్మరసేవనలో గడిచెను.

**అందరు**

పథితరులే నందనముగ
పర్ణకుటులె సౌధములుగ
మకరంద క్షణము లిటులె
మాకెల్లరకును గలుగుత

**వాది వాది**

గాంధర్వమ్మున నీమెను
గాంధర్మమ్మున నితడీ
కడగి పెండ్లి యాడినాడు
కనకాంగిని పొందినాడు
పలుమారులు వలపు తెలిపి
పడతీ! పతి ననినాడు!

పదిమందికి నెఋక పరుప
పరిణయదిన మెదొ తెలుపగ

పట్టుపట్టి వాది యడిగె
పరమదీన హృదయముతో
భావింపుదు ప్రతివా దెవొ
పలుకుచు చిరు
సాకులు కడు
దూర దూరముగ కాలము
త్రోసిపుచ్చి మోసగించె
దోషమ్మది ప్రబలమయ్యె-
వసనమును విలిచి, ఎల్ల
వారి కెరుక పరిచినంత
కనబనదుటే మాని అన్య
వనిత నొకతె గైకొనియెను.

**అందరు**

పెండ్లి చెరచినాడా ఇది
పెద్ద దోష మౌను గదా!

**వాది వాది**

(దుఃఖించుచున్న వాదితో)
ఉత్సాహము వీడకు మో
ఉజ్వలరుస సుమసుందరి!

**పరిషత్తు**

ఎల్లర.కును నీపై వల
పేర్పడియెను -శోకమేల?

(వాది వాది వాదిని ప్రశ్నా స్థానము కడకు నడిపించుచు గొనిపోయి నిలిపి సెలవుగైకొని తన స్థానమునకు వచ్చి నిలుచును. వాది వ్రాలిపోవుచుండును).

**నిర్ణేత**

కళవళ పడి వ్రాలిపోవు
గతితో చెడి నీ నెలంత!

**వేత్ర హస్తుడు**

నా యెదపై నాను మదే
నాతి! శాంతి నీ కొదువును
(వేత్ర హస్తుని ఎదపై వ్రాలి కొంత తేరుకొని)

**వాది**

ఒంటరిగా నను విడిచిన
ఊరకనే లేరు కొందు

**అందరు**

(పిడికిళ్ళు చూపుచు ప్రతివాదితో)
దోషినైన ఓ ప్రియుడా!
త్రోవ యేదో తెలుపుమోయి!
(తెలియు మీవు)

**వేత్రహస్తుడు**

పితరునివలె లాలించెద
భీతిగొన్న ఈ వనితను
(ఓదార్చుచున్నట్లు మోముపై
ముద్దిడుకొనును)

**నిర్ణేత**

(ముందుకు వచ్చి)
ఇచ్చగొన్న ఓ సుదతి
ఇట వ్రాలుము శాంతి కొఱకు (వక్షమును జూపు)

**వాది**

(నిర్ణేత ప్రక్కకు చేరి ఆతని యెదపై వాలును)

**వాది వాది**

నీరమ్మును గొన రండిదె నీరము గొని రండీయెడ
నిలుపగ నీయమ ప్రాణము

**అందరు**

(ప్రతివాదితో)
భయద హత్య చేసినావు
పశ్చాత్తాపము నొందుము

**పరిషత్తు**

(ప్రతివాదికి పిడికిళ్ళు చూపించుచు)
ఉగ్రకోప మొదవెను మా
కో రాక్షస! ఓ రాక్షస!!
నిర్ణేతయతం డిచ్చట
నిలిచినాము పారిషదులము!!

శిక్ష నీకు ఘనమైనది
సిద్ధపడుము చేకొనగా
ఉగ్రకోప మొదలెను మా
కో రాక్షస! ఓ రాక్షస!

**దౌవారికుడు**

(నిశ్శబ్దమును కోరు ఘంటిక మ్రోయించి)
నిశ్శబ్దము! నిశ్శబ్దము!!
నిర్ణయమిక వెలువడును

**ప్రతివాది**

వినుడు వినుడు ఎల్లరు నా
విన్నపమును శాంతముతో
మారెను నా మానస మీ
మగువపైన – ఒప్పుకొందు –
ప్రకృతి సేయు శాసనములు
పరమరక్తి ననుసరింతు – వినుడు, వినుడు
ప్రకృతి నిత్యమును మారును
పరిపరిరీతుల నెల్లెడ
శుక్ల కృష్ణ పక్షమ్ములు
చూడ శశికె కలవు గదా! వినుడు వినుడు–

ఏ ఋతువును నిలకడగా
ఇల నిలువదు చిరకాలము
పండుగ లిల నెయ్యవియును
ప్రక్కప్రక్కగా నుండవు.
ఇటులే ఈ మగువపైన
ఎద నిలచెను నేటివఱకు
రేపటివేళను మరియొక
రేరాణిని వలచె తలచి.

ధర్మమెదో గమనింపుడు
దయచేయుడు నిర్ణయమును
యువకు నొకని దుఃఖోదధి
యోజింపక త్రోయకుడు.

**వాది చెలికత్తెలు**

(ముందుకు వచ్చి పరిషత్తుకు నమస్కరించి)

ధర్మమేదో గమనింపుడు
దయసేయుడు నిర్ణయమును
యువతి నొకతె శోకజలధి
యో జింపక త్రోయకుడు

**ప్రతివాది**

పర్యుషితము తృప్తి నీయ (నొసగు)
బలము కలది యా నిరతము
అది రుచింప కున్న యతడు
అడుగును గద ఉష్ణాన్నము!!

తిండిపో తటంచు వాని
తిండిపోతు వాడటంచు
తీర్పు చెప్పన్యాయమ్మా
ఐనను నే నొక సంధికి
అంగీకారము తెలిపెద! (నొసగద!)

పరిణయ మాడెద నీ
పడతిని నే నీదినమున
రేపు మీర లొప్పిన నా
రేరాణిని పెండ్లాడెద

**వాది చెలికత్తెలు**

(వెటకారముగ)
పరిణయ మాడును తమి నీ
పడతి నీత డీ దినమునన
రేపు మీర లొప్పిన తన
రేరాణిని స్వీకరించు

పెండ్లి యాడు, పాప, మీ్మ
పడతి నీత డీ దినమున
రేపు మీర లొప్పిన తన
రేరాణిని పెండ్లాడును!

**నిర్ణేత**

మంచి సూచనగ నియ్యది
మాకు తోచుచున్నది – మరి
ఇందుకు మీ వాది యిప్పు
డేమి చెప్పఁ దలచినదో!

**వాది వాది**

వినయముతో నే నీయది
విన్నవింతు నిర్ణేతా!
ఇరువుర పరిణయ మాడుట
ఈ దేశమ్మున చెల్లదు
(ధర్మ శాస్త్ర గ్రంథమును తెరచి చూపును)

**అందరు**

కోవిదుడవు వాది వాది
కోవిదుడవు న్యాయవాది!!

**నిర్ణేత**

చిత్త శక్తి పట్టి చూచు
చిక్కు మనకు ప్రాపించెను

**వాది వాది**

ఇట్టి పరిస్థితిలో నిది
ఎటుల తీరు మీవలన

**ప్రతివాది**

(ప్రశ్నా స్థానమునుండి)
ఎద నిలువని ఇంతిని నే
నిటుల పెండ్లి యాడినచో
భంగపాటు తప్ప దనుచు
భయపడు చున్నాడ నిపుడు.

**వాది**

ఇరువుర పరిణయ మాడిన
ఇతడు 'చోరు' డౌను గదా! (సుమా!)

**అందరు**

చిత్తశక్తి చూడ జాలు
చిక్కె మనకు ప్రాప్తించెను.

**వాది ప్రతివాది**

(ప్రతివాదిని ఒకరినొకరు గట్టిగా
పట్టుకుని)
ఇతనినె నే పూజించెద!
వలచినాను!
ఇతనినె నే సేవించెద!!
కొలచెదను!!
ఎద దోచిన ఈతని నే
నెంత వలచితినొ కనుడు

ఈ తరుణుడు విడిపోయిన
ఎంతటి వ్యథ నాకగునో
ప్రణయ లాలనల ప్రౌఢుడు
ప్రసవ శరాసన సముడు!

విన్నపమును విని మీరలు
ఎన్ని రూప్యముల దండుగ
ఇతనికి విధియింతు మనుచు
ఎంచుచున్నవారు మీరు

ఇతనిని నే ప్రేమించితి
ఇతనినె నే సేవించెద
ఇతడు కాక యన్యుడైన
ఎంతగ కోల్పోవుదునో

**ప్రతివాది**

(వాదిని త్రోసివైచుచు)
మొప్పెవాడను, త్రారనగుబోతును
తిట్టెదను కొట్టెదను నిను
తప్పత్రాగిన వేళలందున
తన్ని పంపగ వెనుక చూడను

(పరిషత్తులో)
చెడ్డవాడను, గడ్డువాడను,
చిత్తమందున నిలుపవలయును,
క్షణము కాపుర మీమె సేయగ
జాలునా ఈ మొరటువానితొ
దండుగెంతగ నీయవలెనో
దాని నిర్ణయ మీ రొనర్చెడి
తరుణమున నెద నిల్పుడియ్యది
తప్పు నిచ్చుట కొప్పుకొందును
(గాఢముగ కౌగలించిన దానిని
బలవంతముగ త్రోసిపుచ్చును)

**పరిషత్తు**

క్రమ నిర్ణయమును చేసెడి
కాలమందు మాకియ్యకది
కలిగినదే - ఎటు గనినను
తొలగని దే చీకాకిది

**నిర్ణేత**

మొరటువాడు నని పలుకుచు
మోసగింపదలచు నితని
మాట యెంత నిజమో మరి
మనము చూడ వలయు గదా!

త్రాగియున్న వేళయందు
తన్నెద నని పలుకు టెంత
సత్యమ్మో మన మీయెడ
సయిపవలయు సుపరీక్షను
తెప్పింతము మైరేయము
ఇప్పింతము వీని, వెటల (ఇతని)
మత్తుగొన్న సమయమ్మున
మసలు నొ మరి పరికింతము!

**వాది వాది**

ఇందుకు నే నొప్పుకొనను
ఇది సముదాచారమ్మా?

**వాది**

ఇది సముదాచారము కా
దిందుకు నే నొప్పుకొనను

**ప్రతివాది**

ఉన్న సత్యక మెరుక పడును
ఒప్పుకొందు నిందుకేను
సర్వ మెఱుక పడును గాన
సలుప వలయు మీ పరీక్ష

**అందరు**

సముదాచారము కానిది
సలుపగా దీ పరీక్ష

**నిర్ణేత**

శాస్త్రాచారముల భయము
సకలము మిమ్మావరించె
బహుకాలము గడచె మాకు (మేము)
బయలుదేరి పోవలయును

శివపూజా సమయమ్మును
చేరికయ్యె నెల్లరకును
వెడలగ మీ మీ ఇండ్లకు
కడగుడు మధ్యాహ్నమయ్యె

దేవారిక! గ్రంథమ్ముల
తట్టి అరలలో నిలుపుము
సభ చాలింపగ సర్వము
సంసిద్ధము సేయవోయి!

ఇదిగో మా నిర్ణయమును
ఎల్లరు విన పలుకుచుంటి
ఎల్లరు కన వనితను
ఏనె వివాహమ్మాడెద
(ఆసనము నుండి దిగి వాదిని
చేరదీయును)

**వాది**

అమితానందయ్యోదవెను
అఖిల సంపదలు కలిగెను
దుఃఖతిమిరములు తొలగెను
తోచెను నవ్యోదయము –

**వాది వాది**

వలపు తలపు మిక్కుటముగ
కలికీ నిను గైకొనియెను
సర్వ సంపదలు సుఖములు
సరగున నిను జేరినవి

కనక సౌధ సీమలలో
కాముసేవ లభియించును
నీ మమ్మున నేజన్మ నొ
నీవు శివుని గొల్చితివి

**ప్రతివాది**

సతి పతులుగ నీ యిరువురు
సలుపుదురే జీవయాత్ర, పగలరె
మది సంశయ మొదవెను నా
కది తీరదు – ఇది సాగదు

**దేవారికుడు**

నెలత నీమె చూచినతరి
నిర్ణేతను తలచిన మరి
ఇతడు దొడ్డ నిర్ణేతని
ఇదె తోచెను నా మదిలో

**నిర్ణేత**

నిర్ణేతను నిర్ణేతను
నిర్ణేతను

**అందరు**

నిర్ణేతవు నిర్ణేతవు
నీవుత్తమ నిర్ణేతవు

**నిర్ణేత**

నిర్ణేతను నిర్ణేతను
నిఖిలరాజ్య నిర్ణేతను.

**అందరు**

నిర్ణేతవు నిర్ణేతవు
నీవు దొడ్డ నిర్ణేతవు

**నిర్ణేత**

నా న్యాయము మోసమ్మని
నలుదెసలలో మార్మోగగ
తిరిగి యిండ్ల కేగునపుడు వేళ
తెలుపు డార్యులార మీరు
అయిన నేమి నిర్ణేతును
అత్యుత్తమ నిర్ణేతను
అందమునకు ఫలమేదో
అరసి తెలుపు నిర్ణేతును

**అందరు**

నిర్ణేతవు, నిర్ణేతవు
నీవు దొడ్డ నిర్ణేతువు!
అందమునకు ఫలమేదో
అరసి తెలుపు నిర్ణేతవు.

(1-1-1968)

**అముద్రితం**

# వధూసర

## 1

(భృగ్వాశ్రమము - ప్రాతఃకాలము)

### భృగుడు

అభిషేచనార్థమ్ము అరుగుచున్నా నిదే
గర్భవతివౌ నీవు కదలరా దెచ్చటికి.

### పులోమ

ఇది యేమి నానాథ! ఈవింత వచనమ్ము
చిన్న దానికివోలె చెప్పిపోతున్నారు!

### భృగుడు

మనసులో నేదియో మథనగా నున్నయది
కారణము మాత్రంబు కనుపింప దిప్పటికి!!

### పులోమ

పతి మీరు లేకున్న పడతినౌ నాకేల
ఇలు వీడి వెడలుటకు ఇచ్ఛ కలుగును నాథ!

### భృగుడు

నా మనసులోనున్న నలత నంటినిగాని
నీమీద అనుమాన మేమి యుండియు కాదు.

### పులోమ

ఎంత వింతగ తలచి ఎంత వింతగ నంటి
రెంతగా మీ మనము చింత పెడితిని నాథ!

**భృగుడు**

చింత పెట్టుట కీవు చేసినది యేమిటే?
పూజ్యవౌ నీ కేను బుద్ధి గరపుట లేల!

**పులోమ**

క్షణములో నిది యేమి క్షమియింప వేడెదను
వక్రవాక్కులటంచు భయము జనియించెడిని
జవ్వన మదంబులో జపతపంబుల కేను
తప్పు లేమైనాను తలపెట్టితినె నాథ!
సంవాహ వృత్తిలో సరసతను వీడి నే
నొప్పించితిన నాథ! నొసల ప్రాదంబులను.

**భృగుడు**

నీ మనసు నే విధిని నొప్పించితినె దేవి
కారణము లేనట్టి కలత కల్పించినపుడు
వక్రవాక్కుల నెపుడు వచియించితినె దేవి!
అప్రయత్నంబుగా నటుల పలికితినిగాని

**పులోమ**

స్వామి నాపై మీకు స్వాంతమునగల యూహ
తెలియజెప్పితిరేని తిరముగా చరియింతు

**భృగుడు**

దేవి! నీవలననే తేజరిల్లెడు నగ్ని
పరమ పూతుండయ్యె పతియైన భృగుమౌని

**పులోమ**

మీపాద దాసినన్ మీరింత పొగడుటల్
కనికరముచేగాని కలదె నాలో ప్రజ్ఞ

**భృగుడు**

అభిషేచనమ్మునకు నాలస్య మయ్యెడిని
పోయి వచ్చెద నిదే పొలతి! నిముషములోన

**పులోమ**

తడవు నిలిపిన నన్ను దయతోడ మీ రిపుడు
మన్నింపవేడెదను మహిత ప్రభావాఢ్య!

**భృగుడు**

(వేదిమీద ఉన్న తామ్రకమండలము చూపిస్తూ)

దయయుంచి నాకిమ్ము తామ్రపాత్రను చేతి
అరిగి వచ్చెదను నే నగ్నులను విహరింపు

(భాగీరథీనదికి స్నానానికిపోతాడు.)

## 2

**పులోముడు**

(జైత్రయాత్రామార్గమధ్యంలో ఉన్న భృగ్వాశ్రమానికి వచ్చి!

అతిథినై వచ్చితిని ఆశ్రమంబున కేను
కనుపించ రెవ్వరును కారణం బేమియో!

**పులోమ**

(లోపలినుంచి వచ్చి)

అతిథులై తామిపుడు అరుదెంచితిరయేని
వేవేగ లోపలకు విచ్చేయ రండయ్య.

**పులోముడు**

భృగ్వాశ్రమముగాదె పూతచరితా! ఇద్ది
ఆ మహాఋషికేమి అగుదువమ్మా నీవు?

**పులోమ**

ఆ మహామహుడు నా కౌనిటుల యం చేమి
అన్నియు న్నతడెగా అనుసరించెద నతని.

(వేదికను చూపించి)

విశ్రమింపుడు మీరు వేదిపై కాసేపు.

(లోపలికి పోతుంది.)

**పులోముడు**

ఎంత చక్కని నాతి! ఎంత చక్కని చుక్క!
ఈ సుందరాంగి నే నిదివరకె చూచితిన!
చూచినట్లే నాకు తోచుచున్నది యెడద
అట్టి సుఖసమయంబు అరిగినది యేనాడొ!
ఎప్పుడరిగినవేమి? ఇపుడు కాంచితి మరల
నీ సుందరీ రమణీ నీ యిందిరాదేవి
అతని కే మౌదువని అడిగినంతనె తన్వి
అన్ని అతడే యంచు నరిగె యర్థంబేమొ!
వింతగా నా మనసు వెలితి పాలైపోవు
ఈ భామ విడిచితిన ఇలలోన మృతి యేను.

(ఇంతలో చుళుకంలోని అగ్నిజ్వాల పైకెగసి మళ్ళీ క్రుంగి పోతుంది.
కలిగిన క్రీనీడ అంతరిస్తుంది. అది చూచి)

అక్క డెవరోయుండి నక్కినట్లున్నారు
అరిగి యడిగెదగాక నాతన్వి చరింతబు.

(లేచి అగ్ని ఉన్న గదిలోపలికి పోబోతాడు)

**అగ్ని**

రాక్షసాధము డితడు రానె వచ్చెను విధీ!

**పులోముడు**

(మానవమూర్తి కనుపించదు... చుళుకంలోని అగ్నిని చూచి)

ఓ హవ్యహవానా! ఒడలు బలిసినదేమి?
పలుకకున్నా వేల పాపాత్మ నీవిపుడు?

**అగ్ని**

(రూపం ధరించి)

జయ జయ దితిసుతా! జయ సురపతినుతా!
ఎపుడు వేం చేశారు ఎటనుండి వచ్చారు?

**పులోముడు**

మా రాకతో నిపుడు మా పోకతో నిపుడు
కాలమ్ము వ్యర్థముగ గడపజూడకు మోయి
ఈ యాశ్రమములోని ఇంతి ఎవ్వరొ నాకు
తెలియ జెప్పితివేని దిక్కు లేలెదవోయి.

**అగ్ని**

(నెమ్మదిగా)

భృగుపత్ని యంటినా భృగుడు శాపం దిచ్చు
కాదన్న పక్షాన కలుగు నన్ృతపు దోష
మెటులైన నామెడకె ఏ విధిని తప్పదిది
మునిశాప మంటేను మోదమే కాని
అన్ృత దోష ఫలంబు అనుభవింపగలేను.

**పులోముడు**

ఇంత తడవేలోయి?

**అగ్ని**

ఇంతి భృగుపత్నియే

(రూపం సంహరించుకొంటాడు)

### పులోముడు

ఏను వలచిన కన్య నీముని ప్రవరుండు
పరిణయంబాడి తా పడయు సుఖముల నిపుడు
కాంత నెత్తుకొ పోయి కామించి పరిణయము
చేసుకొని సుఖముగా జీవింతు నిపుడైన.

(తిరిగి వచ్చి కొంతసేపు వేదిమీద కూర్చుంటాడు)

## 3

### పులోముడు

(లోపలికి పోయి కుశాస్తరణం మీద గర్భభారంతో బాధ పడుతూ ఉన్న పులోమను చూచి)

గర్భభారము దాల్చి కడు బాధ పడుచున్న
కరణి నున్నది కాంత  కాన నేవిధిని నే
నీమె నిటనుం డిపుడు ఎత్తుకొనిపోగలను
భ్రూణహత్యాదోషమునకు పాలౌదునో!
తడవు చేసితినేని తపసి విచ్చేయునో!
విచ్చేసి శాపమే ఇచ్చునో క్రోధాన!

(పులోమను చేతులలోకి తీసుకుంటాడు.)

### పులోమ

(బాధలో కళ్ళు మూసుకున్నామె కళ్ళు తెరచి)

అతిథివై విచ్చేసి అపమార్గమును త్రొక్కి
ఆచరింపగనౌనె అనుచితం బీసరణి.

### పులోముడు

(మందస్మితము చేసి)

కాంత నీపై ప్రేమ నింతగా తలపెడితి
నన్ను చేపట్టితే నెన్నో సుఖాలబ్బు.

**పులోమ**

అతిథివని యంటేను అడుగుపెట్టగ నిస్తి
ఇటువంటి దుర్మార్గ మీవు తలపెట్టితివ
పతికంటె నాకెందు పరమాత్మ లేడు రా
పతిమ్రోలనే నేను బ్రతికియుంటానురా
అన్యపురుషుడ నీవు అడుగగా తగునయ్య
సౌఖ్యముల మునిసతులు సంతసించెడువారె?

**పులోముడు**

ఏమి కాంక్షించినను ఇత్తునే నీకిపుడు
సుందరీ నన్నింక సుఖములన్ తేల్చినన్
పతివి కమ్మందువా పరిణయం బయ్యెదను.

**పులోమ**

చాలు నాపుముర వాచాలతను నీవు నా
పతి వచ్చువేళయ్యె ప్రాణములు పోవురా.

**పులోముడు**

తపసి చేసెడిదేమి తల దీసివేయునా?
భయపెట్ట జూచెదవు భర్త గొప్పల జెప్పి.

**పులోమ**

దయగలాడవటందు తలపోసితిని ముందు.

**పులోముడు**

ఇపుడు కాకుంటినా?

**పులోమ**

ఐన పాతివ్రత్య
మపహరింపకుమయ్య అదయుండ వీవౌచు.

**పులోముడు**

పతిని నేనై నీకు సతివి నీవైనపుడు
రక్షింతు నేను నీ రమణి పాతివ్రత్య
మంత దాకను నీదు నాశయము నెరవేర్ప

(చేతులలో ఉన్న పులోమతో పర్వతోపల ప్రాంతానికి పరుగెత్తుతాడు)

**4**

(శిలాతలాల్లో పులోముడు పరుగెత్తుకుంటాడు. పులోమ గర్భంలో ఉన్న)

**అజాత శిశువు**

మహితాత్మయౌసాధ్వి మానంబు జెరుపగా
తలచి పారెదవేర దానవాధమ నీవు?

**పులోముడు**

(వెరగుపడి నాల్గు దిక్కులూ చూచి)

కనుచూపు మేరలో కానుపించ డెవండు
కర్ణగోచరమైన కంఠ మెవ్వానిదో!

(ఆలోచించి)

వెనుదిరుగ నను చూచి వెరగుపడి నక్కెనా
పాషాణమయమైన ప్రాంతమందెచటైన!

**అజాత శిశువు**

వెరగుపడి వెడలుటకు వెలితివాడను గాను
ఈ పాటి బలమునకె ఇంత గర్వంబేల?

**పులోముడు**

ఎందుండి నీవిట్లు ఎరుగకే నా బలిమి
పలుకుచున్నావురా పాపాత్మ చాటుగా.

**అజాత శిశువు**

కనుల ముందరయున్న గర్భగోళమునుండి.

**పులోముడు**

ఆకాశవాణియా!
అజాత శిశువు
ఆమె కాదుర నేను.

**పులోముడు**

(పులోమ గర్భంవైపు చూచి)

ఇందుండి ఎవడైన నిటు పలుకుచున్నాడ!

**అజాత శిశువు**

కొంచెమాగుర గర్భకుహరంబు వెలివడెద

**పులోముడు**

వింతగా నున్న దిది వేగిరమ ఇటనుండి
చేరుకొనియెదగాక జీవితేశ్వరితోడ
సర్వభద్రంబైన సదనమ్మునకు వేగ.

(త్వరగా భయంతో పరుగెత్తుతాడు. పులోమకు గర్భచ్యుతమై శిశోదయం అవుతుంది. పులోమ మైకంలో ఉంటుంది – శిశువు మృతి జెందాడని.

(క్రిందపడ్డ శిశువు లేచిపోతూ వున్న పులోముడితో)

**జాత శిశువు**

చాలురా నిలు రాక్షసాధమ సాధనము
నీ చేతకా దెటుల నిలిచి పోరాదేవు?

**పులోముడు**

(వెనుదిరిగి చూచి)

ఎవ్వడవురా నీవు ఎటనుండి ఒచ్చావు?

**జాత శిశువు**

ఇపుడె ఈ లోకమున నెత్తినాడను జన్మ
నిన్ను రణమున జంప నిలచియున్నా నిదే.

**పులోముడు**

తడవేల యట్లైన తాకి చంపెదగాక!

**జాత శిశువు**

తేలు నిపుడే నీదు తేజంబు శౌర్యంబు

**పులోముడు**

అడుగు ముందుకు రమ్ము అడుగు ముందుకు వత్తు
అపుడు పోరాడితే అంద మగుపించురా.

**జాత శిశువు**

ఇదుగొ వేసితి నడుగు ఏమి చేయుదువురా?

**పులోముడు**

అడుగు ముందుకు వేయ నాదిత్య తేజుడై
దహియించుచున్నాడు దానవునె నన్నిట్లు

**జాత శిశువు**

ఒక అడుగు నే వేయనొక యడుగు వెనుకకే
వేయుచున్నావేల వెలితిపడి దానవా!

**పులోముడు**

(మాటాడడు)

**జాత శిశువు**

విడువగా దగదు నిన్ విగతజీవుడవైన
ఇదుగొ వచ్చానురా ఇంక నడుగులు నాల్గు

### పులోముడు

శిశువె యయ్యును వీడు శీర్ష మొగ్గించురా!
బ్రతుకుపై నాకిపుడు పాలుపోవుట లేదు.

(వెనక్కు నడుస్తుంటాడు)

### జాత శిశువు

పర్వతాగ్రమ్మునకు పరిగిడెద వేలరా
ప్రస్థమ్ము పైనుండి ప్రత్యంతములమీద
పడిపోయి వడిలోన ప్రాణముల విడిచెదవు.

### పులోముడు

దుర్బుద్ధి నౌనాకు దురితముల బాపుకొన
నింతకంటే వేరు నిరవు కనబడదురా
ఆ ఋషికి నే జేయు నపచారమున కిపుడె
తగిన శాస్తియె నాకు దయచేసె దైవంబు
అర్భకుని చేతిలో హతమౌటకంటేను
ఆత్మహత్యను నేను ఆచరించెద నిపుడు

(శైలాగ్రంనుంచీ క్రిందపడిపోతాడు. శిరస్సు భిన్నమౌతుంది. జాతశిశువు
తల్లిదగ్గిరకు పోయి)

### జాత శిశువు

ఏను మృతి నొందుదని ఏడ్చినన్ కన్నీరు
కాల్వగా నిటుమారి కలసినది నదిలోన
భాగీరథీనది పాయగా ప్రవహించి

(తల్లి దగ్గరకు వచ్చి)

అంతకుని గృహమునకు అంపియున్నా నతని
అమ్మ లే లేవమ్మ ఆశ్రమంబున కేగ.

**పులోమ**

కుక్షిచ్యుతుండవై రాక్షసుని సమయించి
వరహాలనాబిడ్డ వచ్చితివ నా తండ్రి!

(అని ఎత్తుకొని ముద్దాడి)

అభిషేచనార్థమ్ము అరిగియుండిన నాన్న
ఆశ్రమ ప్రాంతమున కరుగొ వస్తున్నారు.

(బిడ్డ నెత్తుకొని ఆశ్రమానికి పోయింది.)

**5**

(ఆశ్రమోపాంతము – భృగుడు, పులోమ)

**భృగుడు**

(కంటి కన్నీటి కాల్వను చూచి)

ఈ ప్రవాహమ్మిచటి కెటనుండి వచ్చినది?
బాలార్కుబోలిన ఈ బాలు డెవడే తన్వి?

**పులోమ**

కాలకోవిదులు మీ కేల నే వచియింప?
దోషజ్ఞ! నన్నిపుడు త్రోసివేయకుడయ్య.

**భృగుడు**

(నిమీలిత లోచనుడై సర్వం గ్రహించి, చూళుక అగ్నిని చూచి)

సర్వభక్షకుడవై జగతి చరియింపు మిక

**అగ్ని**

(ప్రత్యక్షమై)

తా నెరింగినయర్థ మే నెరుగనని చెప్ప
పాపపంకమునందు పడుట నిక్కంబౌట
అపసత్య దోషంబు అనుభూత మౌనంచు

వెరచి నే చెప్పితిని వెలది నీ తన్వియని.
బ్రాహ్మణుడ నీవౌట ప్రతిశాప ముడిగితిని
అమరులకు నర్పించు హవ్యకవ్యంబులున్
నా ముఖంబునగదా నాకలోకము జేరు
న్యాయమా శపియింప నన్ను భట్టారకున్?

**భృగుడు**

(పశ్చాత్తప్తుడై)

అగ్ని భట్టారకా! ఆచరించిన కార్య
మపసవ్య మొనరింప తపము నోచగలేదు
విధికృత మ్మిదిగాన వేడెదను నే నిదే
కనికరము నామీద కలిగియుండుము దేవ!

**బ్రహ్మ**

(సాక్షాత్కరించి)

విశ్వంబులో నెవరు వెనుద్రిప్పగా లేరు
ముని శాప మెంతయు నమోఘంబు గావునన్
ముల్లోకముల కిపుడు ముప్పు వాటిల్లినది.

(అగ్నితో)

శుచులతో నత్యంత శుచివి నీవై అగ్ని
సర్వభక్షుండవై చరియింపు భువనముల.

(భృగునితో – పులోమను చూపిస్తూ)

ఈ మహాదేవితో నెనయైన పతివ్రతల్
దృష్టిగోచరమైరె సృష్టిలో నెపుడైన!
కంటి కన్నీరిట్లు కాల్వగా మారినది
నామకరణము జేతునా? వధూసరయంచు.

**భృగుడు**

(నమస్కరించి – జాత శిశువును చూపిస్తూ)

చిరుతవానికి కూడ చెప్పిపోవలె పేరు.

**బ్రహ్మ**

చ్యవనుండు. నీకులము పావనంబయ్యె ఋషి!

**భృగుడు, పులోమ**

(నమస్కరిస్తారు)

**బ్రహ్మ**

(అంతర్హితుడౌతాడు)

**భృగుడు**

అగ్ని కార్యమ్మునకు ఆలస్యమైనయది
అందుకై మన మిపుడు ఆయుత్తపడ వలయు.

**పులోమ**

సామి! మీ యాజ్ఞానుసారముగ వర్తింతు

(లోపలికి పోతారు).

*–ఆంధ్రపత్రిక – ప్రమాది సంవత్సరాది సంచిక*

# సౌగంధిక

### ఒక గంధర్వుడు

ఓహోహో యక్షులార!
ఓ గంధర్వులార
కనినారా.. కనినారా
కనవేలోజ్వల కాంతుల్      ఓహోహో...

### రెండవ గంధర్వుడు

అరుణ కిరణ రథవీథుల
భ్రాజిత నవ శరణ కాంతి,
గాఢరాగ చలిత హృదయ
కమలాలయ మెది నవ్వెనొ ఓహోహో...

### ఒక కిన్నరుడు

ఉదయ సంధ్యా ప్రణయ నృత్యో
న్మత్త మందన వేళగంధ
ర్వాంగనల లాక్షాసుఖాజన
మొలికి పోయినదా ఒలికిపోయినదా!

### మరొక కిన్నరుడు

నందనావని మందారముల
నిందిందిర శ్రీ చాలనలచే
గగనమును స్వర్గము రక్తా
శోక శబలితమా!

### గంధర్వుడు

శాపభ్రష్ట త్రిదశాంగన
జనియించెనె మానవియై
జలదప్రియ కోపనయై
సరసిని సుమ మైనదొకో
ఈ నభంబు సర్వ
మ్మేమిటి? ఏమిటి?
జరరామణ సంధ్యా
ద్యుతి ద్యోతితమె.

### మరొక గంధర్వుడు

కుబేర కాసా
రమ్మున నవిగో
కులికెడి కనక
ప్రసూనములూ – కులికెడి కనక
ప్రసూనములూ

### వసంతుడు

జగమంతా ఒక మదనోద్యానం
జన్మంబున ఘన మధు సమయం
అక్షత, మన్మథ శస్త్ర ప్రాణం
అరగ నీభువ నమ్ముల కానం

**మన్మథుడు**

ప్రకృతి నేతవు నీవు ఓహో వసంతా!
ప్రణయ దూతవు నీవు ఓహో వసంతా!
కని కనక మున్నె ఈ
కాననము వాదంత
కానంద డోలికల
నోల లాడించెదవు ప్రకృతి నేతవు

**వసంతుడు**

జయ జయ మధు మయ మదనా
జయ జయ నవయువ మదనా!
ఓ జైవాతృక
శుచిసాంయాత్రిక
సుషమా సుందర
మానస మందిర
జయ జయ మధు మయ మదనా!
జయ జయ నవ యువ మదనా!

**గంధర్వుడు**

అదిగో, అదిగో
చిలుకల తేరు
చెలికానితొ వలరాజా

**మన్మథుడు**

మరల మరల ఓహో ఈ
మధు వసంత మరుదెంచె
యౌవ్వన సుఖమనుభవింప
కేలబేల లయ్యెదవో – మరల మరల
పూలతావి తరిగినదా
పూల బ్రతుకె తొలగినదా
నాకమైన అనునిముషము
నరకముగా మరునొకో –మరల మరల

**గంధర్వుడు**

కనవాజ్ఞంబుల
కాంతుల లొకో
గగనాంగమున
క్రమ్మినవీ –
ఈ నవ శోభల
నెన్నడెరుగము
ఎందుల కేగతి–
విరిసినవీ –

**షట్పదము**

నటనమ్ముల పటు రయమున్
ఎటకేగెదె భ్రమరీ
ఝం... ఝం
చటులా మోదమ్మపుడే
కటువయ్యెనె భ్రమరీ
ఝం... ఝం
గంధర్వుల సౌగంధిక
కాసారము భ్రమరీ
ఝం... ఝం
రక్తాంబుజ శాబకముల
ప్రసవించెనె భ్రమరీ
ఝం... ఝం
మధు కోశమ్మొకటే
హృదయాన నబును
మనసారగ మధుసేవను

మత్తిలుదము భ్రమరీ
జుం... జుం

**భ్రమరి**

మనసు కలిపి అరుగుదమా?
మధు సేవకు తరలుదమా?

**షట్పదము**

అనుమానమ్మేలా
ఆలస్యమ్మేలా ఇక?
భ్రమరి
సౌగంధిక హాసములో
తరగలమై వరలుదమా!
సరసిజ గర్జమ్ములతో
సఖ్యగీతి పాడుదమా!

**షట్పదము**

పదవే ప్రియ పదవే
పదవే ప్రియ పదవే
ఆగుదునే ఆడుదుమా
తడబడెదవు బడలెదవే...పదవే
పద పదవే

**స్వరమేళ**

కలుష కానన వాదమున క్లే
శాత జీవన భరముతో పవ
మాన సూనుడు నవసిపోవగ
మారుత ప్రభువూ –
కౌంతీద్వితీయుని భీమసేనుని
గంధమాధన కాననాంతర
సీమలకు కొని వచ్చి చేర్చెను
స్వాగతమ్మొసగీ –

**మన్మథుడు**

నిదుర మేల్కొమ్మో అశోకమా!
అదుగో ఆ దంపతుల కనుమా!
అంత తెరచాటైన మూకత
పలుక నేర రవంత!
కుసుమ దన్వీ ప్రసవమానీ
అసమశక్తికి సమయ మియ్యంది:
ఎటుల మెలగెదవోసుమా – ఓ
ప్రసవరాజమ్మా!

**భీముడు**

ప్రసవ చషకములయిన
కుసుమాసవము ప్రియుమే
అందించు షట్పదమా
హ్లాదమే హ్లాదమ్ము – ప్రియురాలా

**ద్రౌపది**

ఆకరేణువు కోర్కె
నాశ్రితరుమూలనము
హస్తాగ్రము సాబు
అతని బ్రతుకే బ్రతుకు – ప్రియుడా!

**భీముడు**

విరహ బాధా భయమె
విపిన తరులతిక లవె
గాఢ విశేషాన
కామదేవుని యాన –ప్రియురాలా

**ద్రౌపది**

ఆహారిణ దంపతుల
అనురాగ వాహినన
కనులకింపై పోలు
కర్ణికారపు జాలు – ప్రియుడా

**స్వరమేళ**

శైలరమ్య సానువులన్
శైనితీ పులిసార ములన్
నవని కుంజ వాటికలన్
పృధుల పుష్ప వేదికలన్
విహరించెను పవనసుతుడు
విసుగక వేసారకయే
తరుగని తను కాంతులతో
తీరని తమి కోరికలతో–

**గంధర్వులు**

రండో రండో కిన్నెములారా!
రండో రండో దేవతలారా!
పూజాసూనము లియ్యవియే
పొలచెను నూతన కాంతులతో
రండో, రండో
ఈ సుమజాతిని ఎవ్వతె వలచిన
ఏలుటయే యగు నిర్ణయమా,
ఈ సుమజాతిని ఎవ్వని కొలచిన
ఈప్సితసిద్ధులు నిశ్చయమా
రండో, రండో

**స్వరమేళ**

పవన వశ పరిచలిత
తాలనవహింత్రాల ఈ
రంబోరు పరివాజ్య
కాసార నీరములందు
కందళిత హృదయార
విందుడై, ఆనంద
వీచికా డోలికల
లోలుడై కేళియై
భీముడు
ఆషాఢాంబుద మతియై
అదెతమాల తరుకాంతికి,
హ్రీంకారవ గీతుల శఖీ
క్రీడించెడి శైలూషిక!

**ద్రౌపది**

పరవశయై పోవ ప్రకృతి
పరమానందలనల్లన
వేణుగళమ్ముల పాడెడి
విమల ప్రణయ గీతావళి

**గంధర్వుడు**

తావుల వెల్లువ
లేమి ఇవీ?
కొలనున పుట్టిన
పూవులవీ?

**మలయ మారుతము**

ఓ సరోజ నిలయమ్మా
ఓపరాని భారమ్మిది!

మూపున నిడ కేతావిని
మోయలేను, మోయలేను

### స్వరమేళ

నవ వికచ కుసుమ సుమ
మార కోరక నికర
భరిత వకుళా శితోక
సహకార పున్నాగ
శీత సికతాతలిన్
పున్నాగ నాగుడై
బహు భావనా మధుర
భారావ కలిత ది
వ్యామోహ పవమాను
చలిత కలకంఠకుల
కంఠయుత కాకలీ
స్వన మధుర గీతికా
కవితుడై, లలితుడై

### భీముడు

ఎచటికో ఎచటికో
ఈ వలపు శైవలిని
గమకాల గానాల
కన్నె లేఁబ్రాయాన ప్రియురాలా!

### ద్రౌపది:

కదలికేగిలి లోన
వెడ ఎడద విహరింప
జలధి హృదయమున కలచి
పయనించి శయనింప ప్రియుడా!

### మలయమారుతము

అమరాంగనా తుంగ
సంగ నిమోన్నత వక్ష
ఘనసార కాశ్మీర
చర్యానిలమ్ములకు – సొలసీ
వెఱ్ఱినైనాను నేనూ
విశ్వచాలన ఇక చేయలేనూ.
ఖేచరీ ముఖసక
ర్పూర తాంబూలాది
వాసనా నిశ్వాస
పవన చాలనమ్ – భ్రమసీ
వెఱ్ఱినైనాను నేనూ
విశ్వచాలన ఇక చేయలేనూ
కేళీసరోవీధి
నాళీకవాటా
ధూళీ ఝురీరాజా తేలీ
తన్వీముపరబోగ
ఖాళీ జుత్‌జటూ
నాళీ సుగంధాళి గ్రోలీ
లోలీభవత్ప్వష్ప ధూళచరద్భ్వంగ
పాళీల సన్నగ తాళి సోలీ!
వెఱ్ఱినైనాను నేనూ
విశ్వచాలన ఇక చేయలేనూ

### గంధర్వుడు

ఓహోహో యక్షులార!
ఓహో గంధర్వులార!
ఓహో కిన్నెరులారా!
ఓహో దేవతలారా!

యక్షేశ్వరు ఆజ్ఞ ఆజ్ఞ
అర్థేశ్వరు ఆజ్ఞ ఆజ్ఞ
కలలోనెనా రాజరాజు!
కలతపడెను రాజరాజు!!
స్వప్నవీధి సౌగంధిక
సరసిని గంధద్విపమ్ము
పలు పోకల పరఖనదట!
కలచినదట! చెరచినదట!

**భీముడు**

నీవెవ్వర వో ప్రియా!
నేనెవ్వరనో ప్రియా!
ఈ వాలసింపకే
ఈ తనువు శాశ్వతమె –
ఓ సఖీ ఓ సఖీ
ఓపలేనే సఖీ!

**ద్రౌపది**

నీవె నేనో నో ప్రియా!
నేనె నీవోయీ ప్రియా!
కదలి వాకల వొంచె
కలిసి పోదామోయీ
ఓ ప్రభూ ఓ ప్రభూ
ఓపలేనో ప్రభూ

**భీముడు**

ప్రాణమహో
వీణ వహోగీ
ర్వాణ మృణా
పాణి వహో!

**ద్రౌపది**

ఘసృణ కిసలయా
మసృణ శోభా
కరభాగంబున
కరణంబవె నిను – ప్రియుడా!

**భీముడు**

శైవలినీ
చల దూర్మికవే – మ
త్తాళి మనో స్ఫురన్నవ
నీలకచా!

**ద్రౌపది**

జలద ప్రియవలె
ముఖ మండలమును
పెన్నెణఠి కరణిని
విహిత మొనర్పనె ప్రియుడా

**స్వరమేళ**

గీర్వాణ మిథున సేవ్యమాన
క్రీడోన్నత శైలములన్
క్రీడాభయ రహితులుగా మధు
లేపమాన నవ ప్రణయములన్
విహరింపగ విహరింపగ
అపహరించి డెందం బానందముతో
విహరింపగ పవన సుతుడు
ప్రణయినితో, నవమోహినితో–

ఉల్లిలన్మకరంద బిందు చ్యుతులతో
నవసౌరభ శ్రీ గయిలతో వా

తావ ధూతమ్మొక జలేజము
వచ్చి పడెనచటన్

**భీముడు**

ఏ అచ్చరవె నీవు పూవా?
ఏ విష్ణుమపి పూవా?
కిన్నెర ప్రణయినివొ
గంధర్వ గాయనివొ
కులకకే వలచెదవు
పాడకే పాడెదవు. – ఏ అచ్చరవె

కాలువలు కట్టనీ
కన్నీటి ధారలా?
హర్షాశ్రుధోరణులొ
దుఃఖాశ్రు ధోరణులొ – ఏ అచ్చరకై

**ద్రౌపది**

ఏ అచ్చరయు కాదు నాథా!
ఏ వియిచ్చర కాదు నాథా!!
తొలిజన్మ నానోమె
ఒలికినది ఈ పూవు
సిగపై సువాసింప
వొగిన వెలిగెద నింక – ఏ అచ్చరయు

వాడదిది పొడిమియు
వీడదేని వెన్నాడు
న్నాడు నీ పూతావి
నీడగా, తోడుగా– –ఏ అచ్చరయు

**భీముడు**

ఈ అపూర్వాబ్జమ్ము ప్రియురాలా!
నీ పూర్వ పుణ్యమున నేలా?
ఏ నోము నోచెనో
అతివ నీ అలివేణి
అందాల నొలుక ఈ
అంభోజ సుమరాణి – ఈ అపుర్వాబ్జమ్ము

జగదేక సుందరీ
ఆనంద మందిరా
ఇందింది రశ్రీల
క్రొందళుల్ వాకయో – ఈ అపుర్వాబ్జమ్ము

అభ్రవేణీ దీని
అవతంసముగ నిల్పి
శృంగార జలధి సాం
మాంత్రికుడనౌదనే – ఈ అపుర్వాబ్జమ్ము

**ద్రౌపది**

కేకినై ఆడనా
ఓ ప్రణయ మోహనా!
మేఘ గంభీర గ
ర్జాఘన స్వనకంఠ! – కేకినై

తడబడెడి నా యెడద
బడలెరుంగని దాన
ఉజ్జ్వలోజ్వల మూర్తి
శమిత సకలార్తీ! –కేకినై

**భీముడు**

ఇంత దైన్యమ్మేల బాలా?
ఇంత బేలై పోతి వేలా?
నెలవంక సిగపైన
నిలుప కొనిరానా?
వలపు మెరపులతీవ
కలుపుకొని రానా?
జలధి గర్జాంతరో
జ్వల శుక్తి ముక్తాళి
కలతార హార పం
క్తుల కాన్కవెట్టనా –ఇంత దైన్యమ్మేల

ఎగురనా నీ తోడ
ఏ పతత్రిగ న్వి
ఈ విహాయస వీధి
గంధర్వనన కొలను –ఇంత దైన్యమ్మేల

**ద్రౌపది**

తళుకుల ఈ క్రొందామర
ఎలిపిన నెలవంక ఏల?
మెరపుతీవ గమి కాదా
ఒరసెడి నీ కనుచూపులు
– అవి ఏల నాకోయి ప్రియుడా
అలసిందుక మోయి ప్రియుడా!
తారహార పంక్తులపై
తరలడిగిపో నా హృదయము,
గగనాంగణ సౌభాగ్యము
కాంక్షింపగ మాతకినీ
–అవి ఏల నాకోయి ప్రియుడా
ఆలసింపకు మోయి ప్రియుడా!!

ఈ పుష్పాస్తృత శయ్యను
హేలానవ మదన కేళి
లోలురమై ఏక మౌట
ఈ ప్రియ ప్రియ కాంక్షితమా
అవి ఏల నాకోయి ప్రియుడా!
ఆలసింపకమోయి ప్రియుడా!!

**భీముడు**

దీన వైనా విందు కేనా?
నిము సాన ఏనుకొని రావా!
ఏడు యీ ఏడులోకాలలో ఎట నున్న
నీ యాన ఏనుకొనిరానా
లోకాధిపతు లడ్డమైనా
ఏ కదనమది దొడ్డదైనా
కొలతు కొల నెల్ల కొని వత్తూ
కొలనునీ కాన్కగా నిత్తూ

సాగిపోనా దివ్యబాలా!
ఏగిరానా నవ్యహేలా?
నీ తలపునకు వెనుదీయలేదే
నీ వలపు నా వలపు కాదా?
సాగిపోనా దివ్యబాలా

**ద్రౌపది**

ఓహోహో ప్రియసాహస
ఓహో మధురోల్లాస
నా ప్రణయమే పాథేయము
నవనవాధ్వముల ప్రియుడా
ఓహోహో ప్రియసాహస!
ఓహో మథురోల్లాసా!

**మన్మథుడు**

జాణ నా బాణ మోయీా వసంతా!
జాయమయ్యె నేడు నా కోయీా వసంతా!
స్వామి కార్యార్థమై అరుదెంచినాను,
సౌగంధికకు భాము నడిపించినాడు,
పురోహతుని రూపమై భువి వెలింగడి యీా
పురువంశ దీపకుడు ప్రౌఢవహియించు
– జాణ నా బాణ –
గంధర్వ కిన్నెరుల గర్వమడ గించు
కనకాబ్జముల తెచ్చి ప్రేయసికి నిచ్చు
రసికావతంసుడై రాణ వహియించు
రమణి ముల్లోకాల రాజ్ఞి యనిపించు
జాణ నా బాణ మోయీా వసంతా!
జయము నయ్యె నేడు నా కోయీా వసంతా!

**వసంతుడు**

జయ జయ మధుమయ మదనా
జయ జయ నవదూత మధనా!
త్రిభువన పావన
నవనవ జీవన
ప్రణత సురాధిప
ప్రణయ రసాధిప
జయ జయ మధు మధు మదనా
జయ నవయువ మదనా!:

**స్వరమేళ**

లోలీభవత్తృష్ణ ధరణీ
చరద్భృంగ పాళీల

సన్నవ్య గీతాళీ
నడిపింపవన్ –

ఫల్గుణాగ్రజుడేనె ప్రియకై
ప్రణయోద్వహుడు భీమ బలుడూ
ప్లవమాన సుమపొంతములపై
పవమాన ఘన వీచికలపై

త్వరితగతి ననిల సుతు డంత గిరివీధిన్
దరుల పెను ఝురుల ఘన తుంగ తటకోటిన్
లతలద్రుమ తతుల పృధు చాలనల వీవన్
గడచిమ్మృత సమజతుల విక్రమము తోడన్
గెలచి, అతి మధుర ఫలహారముల గ్రోవీ,
చనుచు పిక కృతుల కలకూజితము లాశన్
కుసుమ సురుచార మధుర గంధములు త్రోవన్
తెలుపచనె ప్రియ హృదయ కాంక్షనటు తీర్పన్

**గంధర్వులు:**

సాహసమిది సాహసమూ
సౌగంధిక కాపాడుడు,
చునుదెంచెను మానవుడొక
డనిముషులై కాపాడుడు

*ఆకాశవాణి, విజయవాడ 26-4-1949*